నార్ల వెంకటేశ్వరరావు సమగ్ర సాహిత్యం

(డిసెంబర్ 1, 1908 – 16 ఫిబ్రవరి

భాగం – 1



1. నేటి రష్యా
2. స్వదేశ సంస్థానాలు
3. ఆస్ట్రియా ఆక్రమణ
4. జెక్ రాజ్య విచ్ఛేదం
5. పాలస్తీనా

మనవి

ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి దిన పత్రికలలో ఎడిటర్‌గా సుదీర్ఘకాలం పనిచేసి జర్నలిజంలో ఉన్నత విలువలతో ఆ పత్రికలను అగ్రశ్రేణిలో నిలిపిన ఘనత నార్ల వెంకటేశ్వరరావుగారిదే.

ఈ సంపుటంలోని ఐదు గ్రంథాలు అనగా - నేటి రష్యా, స్వదేశ సంస్థానాలు, ఆస్ట్రియా ఆక్రమణ, జెక్ రాజ్య విచ్ఛేదం, పాలస్తీనా 1934-1939 మధ్య రాసినవి ఉన్నాయి. వారు విద్యార్థిగా, నిరుద్యోగిగా, పత్రికలలో చిరుద్యోగిగా ఉన్నప్పుడు రాసినవి. క్రమంగా వారి భాషలో, భావంలో, ఆలోచనా ధోరణిలో మార్పులు వచ్చిన విషయం మీకు తెలుసు. ఈ గ్రంథాలలో ఎలాంటి మార్పులు, చేర్పులు లేకుండా యథాతథంగా ముద్రిస్తున్నాం. నార్ల కృషి, స్మృతి, ఛాయాచిత్ర చయనిక ఈ సంపుట అనుబంధాలలో చేర్చాం.

నార్లవారి గ్రంథాలు చిరకాలంగా ముద్రణలో లేవు. వీటిని నార్ల అభిమానులు తరచు కోరుతున్నారు. పైగా మరో ఐదు సంవత్సరాలలో నార్ల శత జయంతి వేడుకలు జరుగనున్నవి. ఈ సందర్భంలో ఆంధ్రాంగ్ల భాషలలో నార్ల రచనలలో అధిక భాగాన్ని పన్నెండు సంపుటాలుగా డాక్టర్ మీనాక్షి నార్ల, డాక్టర్ శరత్ బెల్లప్రవలు వారి కుటుంబ సభ్యుల సాయంతో వెలువరిస్తున్నాం.

ఈ సంపుటాల ప్రచురణ విశేష శ్రమకోర్చి, అందంగా తీర్చి దిద్దేందుకు సహకరించిన నార్లవారి మిత్రులు డాక్టర్ వెలగా వెంకటప్పయ్యగారికి మా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. ఈ సంపుటాన్ని పరిచయం చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఇనగంటి వెంకట్రావ్ గారికి కృతజ్ఞతలు. అలభ్యంగా ఉన్న రెండు పుస్తకాలను అందించి, పలు రీతుల సహకరించిన లంకా సూర్యనారాయణగారికి, ముద్రణలో సహకరించిన అయినాల మల్లేశ్వరరావు గారికి మా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

ఈ సంపుటాన్ని పాఠక లోకం సమాదరిస్తుందని మా విశ్వాసం.


గుంటూరు
1 డిశంబరు, 2003

డాక్టర్ కొల్లి శారద
ఛైర్ పర్సన్ - విజయవాడ, గుంటూరు, మంగళగిరి, తెనాలి పట్టణాల అభివృద్ధి సంస్థ

విషయ సూచిక

నేటి రష్యా

సమర్పితము :



వ్యయ ప్ర యాసలను పాటింపక
ప్రేమతో వాత్సల్యముతో
మా అన్నదమ్ములకు చదువు చెప్పించుచున్న
శ్రీ వెంకటరామన్న పెదనాయనగారి
పాదపద్మ సన్నిధిని

ప్రవేశిక

నాడు, యుద్ధము వలదనిరి రష్యను ప్రజలు. నేడు, వారే యుద్ధ మొనర్చుచున్నారు. ఇది యసంబద్ధముగ గాన్పింప వచ్చును. కాని, పరిస్థితులతో బాటు చిత్తవృత్తి సైతము మార్పునొందును గదా!

నాడు - ఐరోపా మహాసంగ్రామమున - రష్యను ప్రజలు పడిన కష్టము లిన్నన్ని కావు. ఇన్ని కష్టములను ఏ యుద్ధమందును, ఏ దేశస్థులును పొందియెరుగరనియే చెప్పనగును! - సైనికులకు అందునూ రణరంగము నందలి సైనికులకు తినుటక, తిండి దొరకదు; కట్టుకొనుటకా, గుడ్డలు లభింపవు. ఒక వైపున ఆకలిమంటచే కడుపు కాలుచున్నప్పుడు, వేరొకవైపున చలిబాధచే శరీరము కొయ్యబారుచున్నప్పుడు యుద్ధముచేయు టెట్లు? పోనీ, ఈ కష్టముల నెట్లయిన భరింతమన్నను యుద్ధపరికరములు సరఫరా కావు. ఉదాహరణముగ : తుపాకులున్నచో, తోటాలు దొరకవు; తోటాలున్నచో తుపాకులు లభింపవు. ఒకవేళ రెండును, దొరికినచో నొకదాని కొకటి తగి యుండదు. ఈ విపరీత పరిస్థితులందు రష్యను సైనికులు లక్షలాదిగ మడిసిరి. యుద్ధము ప్రారంభమైన పది మాసములలోనే ముప్పదియెనిమిది లక్షలమంది నష్టమైరి. వీరిలో నెందరు క్షుద్బాధతో కృశించి - కృశించి, ప్రాణములను వీడిరో! ఇంకెందరు చలి తీవ్రతచే కంపించి - కంపించి, అసువులను బాసిరో మఱెందరు నిస్సహాయులుగ - శస్త్రవిహీనులుగ వైరివిక్రమమునకు బలియై పోయిరో! ఎట్లైననేమి, ప్రారంభమున సమరస్థలి కేగిన వారిలో సగటున నూటికి ఇద్దరైనను తుదకు ఇంటికి తిరిగి రాలేదు!! (H.G. Wells, H.R. Knickerbocker, Sir John Russel, and others :The New Russia)

ఇక, ప్రజాబాహుళ్యపు స్థితినిగూర్చి చెప్పనక్కరయే లేదు. యుద్ధకారణముగ, వ్యవసాయము క్షీణించెను. పరిశ్రమలు శిథిలము లాయెను. వర్తకవ్యాపారములు స్తంభించెను. ఎగుమతి, దిగుమతులు కట్టువడిపోయెను. ఎల్లెడల తీవ్రక్షామము ప్రబలి, జీవనవ్యాపారమే దుర్ఘటమయ్యెను. ఎటు గాంచినను ఘోరవ్యాధులు, దారుణ మరణములు, గర్భనిర్భేద హాహారావములు...

యుద్ధమువలన రష్యాలో నిట్టి విపరీతపరిస్థితులుప్పతిల్లుటలో నాశ్చర్యమేమియును లేదు. కేవలము బాహు బలముచేగాని, ధైర్యసాహసములతోగాని, యుద్ధ విద్యా నైపుణ్యమువలనగాని రణస్థలిని విజయమును బడయగల దినములు పూర్వ మెన్నడో గతించినవి. ఇప్పుడు యుద్ధము చేయునది మానవులు కాదు, మారణయంత్రములు. ఘన శతఘ్నులు, ప్రచండ జలాంతర్గాములు, భీకర యుద్ధవిమానములు, దారుణ విషవాయువులు మున్నగు ఘోర మారణసాధనము లెవరి కధికముగా గలవో, వారినే నేడు విజయలక్ష్మి వరించుచున్నది. వీనిలో నేవియును రష్యనులకు తగినంతగ లేకుండెను. ఐనను, దూరదృష్టిలేని వాడగుటచే జారుప్రభువు - రష్యను చక్రవర్తి - మహాసంగ్రామమున జేరెను. దానితో నతడు తనగోతిని తానే తవ్వుకొని నట్లయ్యెను.

చక్రవర్తి పన్నులను దారుణముగ విధించినను, వ్యక్తి స్వాతంత్ర్యమును పరిపూర్ణముగ హరించినను, కఠిన శాసనములను విపరీతముగ అమలుపరచినను, దేశభక్తినే మహాపరాధముగా పరిగణించినను, నిరపరాధులను ఘోరముగ జంపించినను - ఒక్కమాటలో - రాక్షసముగ పరిపాలించినను, రష్యను ప్రజలు సహించిరి.
కాని, జర్మను యుద్ధమున జేరుట వలన సంఘటించిన విపత్తులు వారి చిరానుగత సహనమును సైతము మించిపోయెను. అందుచే - హతాశులై - వారు 1917వ సం.ము మార్చి నెలలో విప్లవమొనర్చిరి. ఈ విప్లవ ఫలితముగ జారుచక్రవర్తి ప్రభుత్వము తొలగి, కెరన్స్కి ప్రభృతులకు – మెన్షవికు పక్షము వారికి - రాజ్యాధికారము చేజిక్కెను. కాని, వీరైనను ప్రజాభీష్టమును సరిగ గ్రహింపరైరి. ఒకవేళ గ్రహించిరే యనుకొన్నను, యుద్ధమునుండి వెంటనే తప్పుకొని, దేశమున

తిరిగి శాంతిని నెలకొల్పుటకు తగిన ధైర్యసాహసములు వారికి లేకపోయెను. అందుచే కెరన్స్కీ ప్రభృతుల పరిపాలన మన్న ప్రజలకు గలిగెను : చెప్పగారాని అయిష్టము, అసంతృప్తి, అసహ్యము... కలుగదా, మరి? 'శాంతి, శాంతి' అని ప్రజలు పలువరించిరి. ఆ శాంతి సంస్థాపనకే విప్లవ మొనర్చిరి. ఐనను, కెరన్స్కీ ప్రభృతులు - అదూరదృష్టివలననో, అసమర్థతవలననో ప్రజాభీష్టమును సిద్ధింపజేయక, యుద్ధము యధా ప్రకారముగ సాగవలె ననిరి! దానితో పదికోట్లమంది ప్రజల ఆశ నిరాశయయ్యెను,ఆకాంక్ష గగనకుసుమ మయ్యెను, ఆక్రందనము అరణ్యరోదన మయ్యెను!

ఇట్టితరి రాజనీతిజ్ఞునికుండు మహాదూరదృష్టిని, మతప్రబోధకునికుండు గాఢవిశ్వాసమును, పరిపాలకుని కుండు విపుల కార్య నిర్వహణదక్షతను, మాంత్రికునికుండు ప్రబలవశీకరణ శక్తిని, వీరవరునికుండు అశేష ధైర్యస్థైర్యములను ఏకసమయమున గలిగిన పురుషపుంగవుడొకడు రష్యాలో లేకపోలేదు. అతడే లెనిన్!

లెనిన్, కారల్ మార్క్స శిష్యుడు. సామ్యవాది. బహుసంఖ్యాకులు రేయింబవలు లెక్కలు విరుచుకొనియు, కూడు గుడ్డలకు గతిగానక అన్యాయము పాలగుచుండ, ఎవరో నలుగురు పరులందరి కష్టార్జితమును స్వీయభోగోపసిద్ధికి వెచ్చించుకొన వీలుకలుగజేయు ఈ క్రూర కుటిల కఠోర సంఘమును రూపుమాపి, ఉచ్చ - నీచ, శ్రీమంత - నిరుపేద మొదలుగాగల కృత్రిమభేదముల కెడమీని, నూత్న విశ్వవ్యాప్త మానవసంఘమును నిర్మించుటకై చేయబడు ప్రయత్నమే సామ్యవాదము. ఈ ప్రయత్నమునకే లెనిన్ జీవించెను; దీనికొరకే పెక్కు క్లేశములనుభవించెను; తుదకు దీనిలోనే మరణించెను!(Rene Fulop - Miller : Lenin and Gandhi)

అన్నట్లు చెప్పవచ్చిన దేమన జారుచక్రవర్తుల ప్రభుత్వము పడిపోయినపిదపనే ప్రవాసమునుండి తిరిగి వచ్చినను, లెనిన్ క్షణములో ప్రజలచిత్తవృత్తిని గ్రహించెను. ఇట్లు గ్రహించి, ఏవో కొన్ని (Capitalist) ప్రభుత్వములు కేవలము స్వార్థసిద్ధికై చేయుచున్న యుద్ధమున జేరి, ఆత్మవినాశన మొనర్చుకొనుట రష్యాకు తగదనియు, అట్టి యుద్ధమునుండి తప్పుకొనక, కెరన్స్కీ ప్రభృతులు మహా ద్రోహమొనర్చుచున్నారనియు అతడు ప్రకటించెను.

గాఢాంధకారమున దారిగానకయున్న వానికి లభించు దివ్వెవలె, తీవ్రప్రవాహమున గొట్టుకొని పోవుచున్న వానికి దొరకు తెప్పవలె, ఈ ప్రకటన నిరాశాపూరితులై, నిరుత్సాహులైయున్న రష్యనుప్రజలకు క్రొత్త ఆశను, నూతనోత్సాహమును గల్గించెను. అందుచే వేలకొలదిగ, లక్షలకొలదిగ, కోట్లకొలదిగ ప్రజలు వచ్చి లెనిన్ పక్షమున చేరదొడగిరి. (జమిందారుల స్వాధీనమై యున్న భూమిని నిరాధారులైన రైతులకు పంచిపెట్టెద మనియు ఘోర నిరంకుశాధికారమునకు లోనై యున్న సైనిక నావికాదళములకు స్వపరిపాలనా సౌకర్యములను కల్పింతుమనియు ప్రకటించుటవలన కూడ పెక్కుమంది లెనిన్ పక్షమునకు వచ్చిరి.)

1917వ సం॥ము మార్చి నెలలో లెనిన్ - బోల్షివికు పక్షము - మైనారిటిలో నుండెను. కాని, యుద్ధము కూడదనుచు కెరన్స్కీ ప్రభృతులను ప్రతిఘటించుటవలన నాలుగైదు మాసములలోనే అతడు బోల్షివికు పక్షము మెజారిటీ లోనికి వచ్చెను. ఈ ఘనప్రాబల్యమును పురస్కరించుకొనియే లెనిన్ ఆ అక్టోబరునెలలో విప్లవమొనర్చి, రాజ్యాధికారమును కడుసులభముగనే చేజిక్కించుకొనెను! ఇంతే కాదు. సామ్యవాదియైన తాను రాజ్యాధికారమును చేజిక్కించు కొన్నందుకు కోపగించుకొని, ఫ్రాన్సు, ఇంగ్లాండు, ఇటలీ, అమెరికా, జపాను, గ్రీసు, రుమీనియా, సెర్బియా, పోలెండు, ఎస్టోనియా, జెకోస్లోవాకియా దేశములనుండి తనపై కట్టగట్టుకొని వచ్చిన సైనిక, నావికాదళములను సునాయాసముగ నోడించెను. తనపై తిరుగబడిన రష్యను సైన్యాధ్యక్షులను సైతము సుకరముగనే పరాజితుల నొనర్చెను. (John Reed: Ten days that shook the World. H.G. Wells: A Short History of the World.)

ఇంత తేలికగ లెనిన్ విజయమును బడయగల్గుట ఆశ్చర్యమే! కాని, నాడు రష్యను ప్రజలకు యుద్ధమనిన కలిగిన వైముఖ్య మట్టిది! కాని, నేడో?
నేడు ఆ రష్యనుప్రజలే యుద్ధమొనర్చుచున్నారు. ఈ యుద్ధము జరుగుచున్నది రణావనిని కాదు, జీవిత క్షేత్రమున! దీని ధ్యేయము శత్రుజనవిధ్వంసనము కాదు, నూత్న మానవసంఘ ప్రతిష్ఠాపనము!! ఈ యపూర్వయుద్ధములో సామ్యవాదపక్షీయులే నాయకులు! పదునారు కోట్ల రష్యను ప్రజలే సైనికులు!!

ఇందుకు తగినట్లే యుద్ధకాల పరిస్థితులు నేడు రష్యాలోనున్నవి. ఆహారపానీయములు మున్నగు దైనందిన జీవితావశ్యకములే ప్రజలకు సరిగ లభించుటలేదు. ఐనను, పూర్వేతిహాసములో నెచ్చటను గానరాని యొక మహత్కార్యమును సాధించుటకు తామే మున్ముందుగ ప్రయత్నించుచున్నా మన్న గర్వముతో, నేడుగాకున్న తేపైనను విజయలక్ష్మి తమ్ము వరింపకపోదన్న ధైర్యముతో, భావికాలమునకు నాయకులము గావలె నన్న దీక్షతో సర్వకష్టములను వారు సంతోషముగ సహించుచున్నారు.

ఈ యుద్ధములో రష్యను ప్రజల కిప్పటికే కొంత విజయము సంప్రాప్తమైన దనుట నిర్వివాదము. ఏలనన: నిన్న మొన్నటి వరకును పెక్కు దేశములవారు సోవియటు ప్రభుత్వమన్న కంటగించుకొను చుండెడివారు. దానిని గూర్చి అసత్యములను, అభూత కల్పనలను, అవిశ్వసనీయగాధలను ప్రకటించు చుండెడివారు. కాని, నేడు వీరి చిత్తవృత్తి చాలవరకు మారినది. ఇటీవలనే ఎన్నో ప్రభుత్వములు సోవియటు రష్యాతో వివిధములైన యొడంబడికలను గావించుకొనినవి. దీనిని మించిన విశేషమేమన పూర్వము రష్యాపై కాలుదువ్విన కొన్ని దేశములవారు రష్యను పద్ధతులలో కొన్నిటిని ప్రస్తుతము తామే అనుకరించుచున్నారు!

కాని, వారు ఎదుర్కొనవలసిన సమస్యలు, అతిక్రమింప వలసిన కష్టములు, సాధింపవలసిన కార్యములు ఎన్నో కలవు. కారల్ మార్క్సు సిద్ధాంతముల ప్రకారమే ఫ్యాక్టరీలు, రైల్వేలు, బ్యాంకులు మున్నగు ఆధునిక పారిశ్రామిక జీవన సంస్థలన్నియును పరిపూర్ణముగ నభివృద్ధినందిన దేశముననేగాని సామ్యవాదము జయప్రదము కాజాలదు. ఇట్టి సంస్థలు కేవలము నామమాత్రముగ నున్నప్పుడే సాటిలేని పరిస్థితులనుబట్టి-రష్యను ప్రజలు సామ్యవాదమును స్వీకరించుట తటస్థించినది. తత్కారణముగ వారు విజయమును బడయగల్గుట మహాకష్టము.

పైగా, ఇంగ్లండు, ఫ్రాన్సు, జర్మనీ, ఇటలీ మున్నగువాని వలె రష్యా చిన్న దేశముకాదు. అది భూభాగములో ఆరవవంతును ఆక్రమించుకొనియున్నది. అట రెండువందల ప్రత్యేక జాతులు కాపురమున్నవి. అరువది విభిన్నభాషలు ప్రచారములో నున్నవి. ఇంత విస్తృత దేశమున, ఇన్ని ప్రత్యేకజాతుల మధ్య, ఎన్నో విభిన్న భాషలు ప్రచారములో నున్నప్పుడు - సామ్యవాద సిద్ధాంతములమాట నటుంచి - ఏ కార్యమునైనను సాధించుట సామాన్యమా?

ఈ కష్టములన్నియు రష్యను ప్రజలకు తెలియనివికావు. వీని నతిక్రమించుటకై వారు మహోత్సాహులై కృషి సలుపు చున్నారు. వారి కృషినిగూర్చి సర్వమును తెలిసికొనుట మన విధి. ఏలనన, నేడు ప్రపంచములో రెండే యుద్యమములున్నవి : అవి సామ్య, పూంజీ వాదములు. ఇద్దరే నాయకులున్నారు. వారు లెనిన్, ముస్సోలినీలు. ఈ రెండు యుద్యమములలో దేనినో యొక దానిని, ఈ యిద్దరు నాయకులలో నెవరినో యొకరని - జహ్వారిలాల్ పండితుడు నుడివినట్లు - మన మనుసరించి తీరవలెను. లేనిచో కాలసాగర గర్భమున లీనమై పోగలవు: ఇప్పటికే సగము చచ్చియున్న మనదేశమును, మనజాతియు, మన సభ్యతయు!

సామ్యవాది

శిక్షింపబడినది, మేనమామ. శిక్షించినది, తాను. శిక్షను తప్పించుమన్నది, కన్నతల్లి. ఇక, శిక్షయో మరణ దండనము! తెలిసియో, తెలియకనో మామ సామ్యవాదమునెడ విద్రోహ మొనర్చినమాట నిజము. కాని, తల్లి బ్రతిమాలుచున్నది. జల జల కన్నీరు రాల్చుచున్నది. 'ఎత్తుకొని, ముద్దులాడుచు, జిలిబిలి పలుకులను నేర్పిన మేనమామను తుపాకిగుండుతో ప్రేల్పించుట నీకు తగునా?' యనుచున్నది. 'నవమాసములు మోసి, కని, అల్లారుముద్దుగ పెంచినందులకైనను నా ప్రార్థన మన్నింపవా?' యనుచున్నది. ఇది విషమ సమస్య! ఇటు తల్లిని కాదనుటా? అటు ధర్మచ్యుతి నందుటా? తనకు, పలుకుబడికి, లోటులేదు. అధికారమునకు కొదువలేదు; కోరినచో, శిక్షను తప్పించుట చేతిలోని పని. కాని, మేనమామగదా యని జాలినందియో, కన్న తల్లి కంట తడి పెట్టుకొను చున్నదిగదా యని వివశత నొందియో, సామ్యవాదముపట్ల విద్రోహమొనర్చిన వానిని కాపాడుటా? కూడదు; ముమ్మాటికిని కూడదు.

ఈ కొడుకును చూచి, తల్లి ఏ మనుకొనును? 'నేను కని పెంచినది ఈతని నేనా!' యని. కాదు; అతనిని కాదు. ఆమె కని పెంచిన కొడుకు మరణించినాడు. మరణింపలేక, మరణింపలేక, మరణించినాడు. ఇట్లు మరణించి, సామ్యవాదిగ పునర్జన్మనెత్తినాడు. ఇప్పుడతనికి తల్లి లేదు; తండ్రి లేదు; బంధుమిత్రులు లేరు. తనవలె యాతనా పూర్వకముగ మరణించి, సామ్యవాదులుగ పునర్జన్మనెత్తినవారే ఆప్తులు. తక్కిన వారెల్లరు పరాయివారు. కేవలము పరాయివారు మాత్రమే కాదు, భీకర శాత్రవులు. వారిని నిస్సంకోచముగ రూపుమాపవలసినదే! నిస్సందేహముగ విధ్వంస మొనర్పవలసినదే!

ఒక్కటే తాను వాంఛింప దగినది. ఒక్కటే తాను సాధింపవలసినది. అది, సామ్యవాద విజయము. ఈ విజయ సంప్రాప్తికేదియును ప్రతిబంధకము కారాదు, తుదకు ప్రళయము కూడ! ఇక, మేనమామయే శిక్షితుడైన నేమి? కన్నతల్లియే కన్నీరు కురియించిన నేమి?

ఇట్లని, అతని హృదయమున కారుణ్యము కరుడు గట్టినదా? లేదు! అది కట్లను త్రెంచుకొనినది. రేయింబవలు కష్టించియు, పట్టెడు మెతుకులను తెచ్చుకొన నేరక, మలమల మాడిపోవుచున్న కోటానుకోట్ల ప్రజల దశకు ప్రచండగతిని ప్రవహించుచున్నది! అతనిలో మానవప్రేమ విలుప్తమైనదా? లేదు! అది రక్తబాంధవ్యము నతిక్రమించినది. దిక్కుదిక్కునకును, దేశ దేశాంతరమునకును - ఒక్క మాటలో - ఈ సువిశాల విశ్వమందు అంతటను వ్యాప్తిగాంచుచున్నది! అందుచేతనే అతని కారుణ్య మెంతటి ప్రబలమో, కాఠిన్యమంతటి భయంకరము! ప్రేమ యెంతటి విస్తృతమో, విద్వేషమంతటి ప్రచండము!

కాని, అతని కాఠిన్యము వ్యక్తులపైగాదు; విద్వేషమునూ, వ్యక్తులపైగాదు. సామ్యవాదమునకు విరుద్ధముగ వారికి గల నమ్మకములమీద మాత్రమే! తత్కారణముననే మేనమామను మృత్యుముఖమునకు బంపుచు, ఆతడిటులన గలిగెను: 'మామా! కోపము వలదు! సామ్యవాద విజయసిద్ధికి, నీ మరణమవసరము!... ధైర్యము తెచ్చుకొనుము!'
కోపము వలదట. మరణదండన మవసరమట. ధైర్యము తెచ్చుకొనవలెనట. పైగా, ఈ పలుకులు మేనమామ నుద్దేశించి యట. ఎంతటి యపూర్వుడు, ఈ రష్యను సామ్యవాది!(Maurice Hindus: Humanity Uprooted')

ఔను, అపూర్వుడే! అతడు కొరడాదెబ్బలను భరించినాడు. కారాగారముల మ్రగ్గినాడు. ప్రవాస క్లేశముల ననుభవించినాడు. ఉరికంబముల నెక్కినాడు. ఇంతేనా? కాదు! విప్లవమొనర్చినాడు. ప్రతికక్షులను పరాభూత

మొనర్చినాడు. నూత్న మానవసంఘ నిర్మాణమునకు పునాదిని వేసినాడు. మొదటి ఆ యగ్నిపరీక్ష కతడు భయవిహ్వలుడు కాలేదు. తదుపరి, ఈ విజయలబ్ధికతడు గర్వీభూతుడును కాలేదు. సర్వకాల సర్వావస్థలందును అతడు అచ్యుతుడే! అవ్యయుడే! అజేయుడే!

ఆత్మవిశ్వాసి కూడను, ఈ రష్యను సామ్యవాది. ఎందరైనను అతని ధ్యేయములను నిరసింతురు గాక! అతని పద్ధతులను విమర్శింతురు గాక! అతనికి వినాశనము తప్పదని జ్యోతిషము చెప్పుదురేగాక! అతడు జంకడు. ఒక్క అడుగైనను వెనుకకు వేయడు. ఇంతే కాదు. ఎప్పటికైనను విజయము తనదేయనును. శంకాన్వితులు తన త్యాగవహ్నిచే పునీతులగుటయో, కోపాగ్నికి భస్మీభూతు లగుటయో తప్పదనును. ఇట్లని, అత దహంకారియా? కాదు! ఒక లక్ష్యమునకు, ఒక పరమావధికి, ఒక చరమసిద్ధికి ఆత్మార్పణ మొనర్చినవాడు అహంకారి కాగలడా?

రష్యను సామ్యవాది కేవల మిట్లు నిరుపమానుడు. ఇక, సామ్యవాద సంఘమో? ఆతని తల దన్నిన దది!

ఏ సామ్యవాదియైనను, అతడు మహోన్నత పదవిలో నున్నవాడే యగుగాక! నెలకు రెండు వందల పాతిక రూబుల్సును (రూబులు విలువ రమారమి రూ 1.9.3) మించి, వేతనమును పరిగ్రహింప రాదు. మించి పరిగ్రహించిన, సామ్యవాద సంఘము సహింపదు. పూర్వము లెనిన్ పుచ్చుకొన్న వేతన మిదియే! ఇప్పుడు స్టాలిన్ పుచ్చుకొనుచున్నది కూడ, ఈ వేతనమునే! మొన్న మొన్ననే కొందరి విషయమున ఈ కఠిన నియమ మించుక సడలింపబడినది. ఇంజనీయర్లు నెలకు నాలుగు వందల రుబుల్సు వరకు జీతమును గైకొనవచ్చును. నేర్పుమెయి పనిచేయగల కార్మికులు యింజనీయర్లను మించి కూడ వేతనమును బడయవచ్చును. ఇక గ్రంథకారులు తమ రచనలను బట్టి ఎంతైనను సంపాదించుకొనవచ్చును. కాని -

ఆదాయ మెంతైనను, దానిలో నధిక భాగమును సామ్యవాద సంఘమే నిర్దాక్షిణ్యముగ చుండును. ప్రతి సామ్యవాదియు తన సంపాదనను బట్టి దానిలో కొంత భాగమును ఏ నెల కా నెల సంఘ నిధికి చెల్లించుకొను చుండవలెను.

ఇంతే కాదు. ఒకచోట లెనిన్ స్మారక చిహ్నముగ ఏ శిలా విగ్రహమో ప్రతిష్ఠింపబడు చుండవచ్చును. మఱొకతావున ఏ యనాథ శరణాలయ నిర్మాణమో జరుగుచుండవచ్చును. ఇంకొక స్థలమున వైద్య సహాయమునకై ఏర్పాట్లు చేయబడుచుండ వచ్చును. వేఱొక ప్రదేశమున విద్యావ్యాప్తికి తోడ్పడుట ఆవశ్యకము గావచ్చును. లేదా, అటు న్యూయార్కులోనో, ఇటు టోకియోలోనో సమ్మె చేయుచున్న కార్మిక సోదరులు ధనసహాయ మపేక్షింపవచ్చును. వీని కన్నిటికిని శక్తివంచన లేకుండ ప్రతి సామ్యవాదియు విరాళముల నొసగి తీరవలసినదే! లేనిచో, నలుగురిలో తలవంపులు తప్పవు.

ఈ కారణముగ నొక్కొక్కప్పుడు సంఘ సభ్యత్వము ఊడి పోవుటయు కద్దు. ఇట్లు సభ్యత్వమే పోయిన, మిగిలిన జీవిత మంతయు దుర్భరమై పోవును తీరని వెతతో, మోయనలవిగాని భారముతో, అనుక్షణమును సంఘటిల్లెడి.....

అబ్బ! సామ్యవాద సంఘము ప్రతియొక సభ్యుని చేయుమని నియమించు పనులకు లెక్కయుండదు గదా! ఎట్టి ప్రతిఫలమును కాంక్షింపకుండగనే, ఎన్నో పనుల కతడు పరుగెత్త వలెను. పాల్గొనవలసిన సభలకు లెక్కలేదు. హాజరు గావలసిన సమావేశములకు అంతులేదు. నేడు ఈ నగరములో నున్న, రేపు ఆ నగరములో, నేడు స్వదేశములో నున్న, రేపు విదేశములో. నేడు ఆజ్ఞాపించగలుగు పదవిలోనున్న, రేపు ఆజ్ఞాపితుడు గావలసిన స్థితిలో. తెల్లవారిన, ఎక్కడి కేగ వలసి వచ్చునో తెలియదు; ఏమి చేయవలసి వచ్చునో ఊహింప శక్యము గాదు. అనుక్షణమును పనియే! అదు

గడుగునకును పనియే! ఊపిరి పీల్చుకొనుటకైనను వ్యవధి దొరుకదు! ఇట్లని, ఆరోగ్యము సరిగ లేదని వంక పెట్టుటకు వీలుండదు. తలకు మించిన పని యని సాకు చెప్పుటకు వలనుపడదు. ఆరోగ్యము చెడిపోయినను, కార్యభారము క్రింద క్రుంగిపోయినను, తుదకు ప్రాణమేపోవు పరిస్థితి వచ్చినను కిక్కురు మనరాదు. ఎంతమందియో చక్రాహతులు గానిదే, సామ్యవాద మహాస్యందనము విజయోపేతముగ గమ్యమును చేరుకొనగలదా? కనుక, ప్రతి సభ్యుడును బలియగుటకు సంసిద్ధుడై యుండవలెను. ఇందుకు వెనుకాడినచో? ఏమున్నది? సంఘము నుండి తక్షణమే బహిష్కరణము! మరణమే మేలనిపించు తుచ్ఛజీవనము!!

దైనిక జీవితములో సభ్యుని నడతను సామ్యవాద సంఘము వేయి కండ్లతో కనిపెట్టి చూచు చుండును. పొరపాటున నైనను అతడు తప్పు చేయరాదు. ఎట్టి భోగవిలాసములను దరిచేర నీయరాదు. అవి పాపభూయిష్ఠములని కాదు. కాని, సామ్యవాద విజయసిద్ధికి నిరంతర త్యాగదీక్షను జూపవలసిన దినములలో భోగవిలాసములకై ప్రాకులాడుట కూడునా? జూదపు శాలల ప్రాంతమున కైనను పోరాదు. నృత్యగీతాదులపై మోజుపడరాదు. వలసినచో, అప్పుడప్పుడు కొలదిగ 'వోడ్కా'ను(ఇది మన కల్లు వంటిది) త్రాగవచ్చును. కాని, మితము దప్పుట పాడిగాదు.

ఇది మన కల్లు వంటిది. అందువలన శరీర స్వస్థతకు భంగము వాటిల్లవచ్చును. మానసిక శక్తికి లోపమావహిల్ల వచ్చును. అసలు, సామ్యవాద సంఘ ప్రతిష్ఠకే న్యూనత సంక్రమింప వచ్చును. కనుక, ఏ సభ్యుడైనను తప్పద్రాగుట కలవాటుపడినచో, శిక్షితుడుగాక తప్పదు. మత విశ్వాసములు, మతాచారములు, మతవిషయిక సంస్థలు మున్నగువానికి దూరముగా నుండవలెను. తల్లియైనను, తండ్రియైనను, సోదర సోదరీమణులైనను, గాక, కుటుంబములో మరెవ్వరైనను సామ్యవాద సిద్ధాంత విరోధులైనచో, వారితో సంబంధ బాంధవ్యములను తెగగొట్టుకొనవలెను. ఇట్టియెడ, తన పూర్వనామధేయమునే పూర్తిగా మార్చుకొనుట ప్రశస్తము. సన్నిహిత రక్తబాంధవ్యమునే కాదనుచున్నప్పుడు, పూర్వ నామముతో మాత్రము పని ఏమున్నది? ఈ రీతిగ ప్రతి సామ్యవాదియు పెక్కు నియమములను, నిషేధములను జాగరూకుడై పాలింపవలెను. లేనిచో.....

ప్రలోభమునకు లోనై, ఏ సామ్యవాదియైనను తన పదవినిగాని, పలుకుబడినిగాని దుర్వినియోగ మొనర్చిన యెడల, ఆతనికి మూడిన దన్న మాటయే! ముందు సంఘము నుండి బహిష్కరణము! పిమ్మట ప్రభుత్వముచే శిక్ష! ఈ శిక్షయైనను సామాన్యపు శిక్ష కాదు. దయాదాక్షిణ్యములకు తావులేని శిక్ష! అదే నేరమును చేసిన సంఘసభ్యేతరులకు విధింపబడు దానికి రెట్టింపు శిక్ష!

ప్రభుత్వోద్యోగములో నున్న సామ్యవాద సంఘసభ్యేతరు డొకడు లంచమును పుచ్చుకొనే ననుకొనుడు. ఏ పది సంవత్సరముల కారాగారవాస శిక్షతోనో అతడు బయటపడును. ఈ నేరమునే ప్రభుత్వోద్యోగములో నున్న సామ్యవాది చేసిన? తిరుగులేని మరణదండనమే!(A.D. Monize: New Russia.)

ఇట్టి కఠిన నిబంధనలను, తీవ్ర నిషేధములను గావించుట దేనికందురా? 'ప్రవేశిక'లో నుల్లేఖించితిని గదా, రష్యాలో నపూర్వమైన యుద్ధ మొకటి జరుగుచున్న దనియు, దానికి సామ్యవాదులే నాయకులనియు. సామాన్య యుద్ధములలోనే కఠిన నిబంధనలను, తీవ్ర నిషేధములను పెక్కింటిని గావింపక తప్పదు. వీని నుల్లంఘించిన వారిని ప్రత్యేక చట్టము క్రింద, ప్రత్యేక న్యాయస్థానములలో విచారించి, నిర్దాక్షిణ్యముగ శిక్షించుటకూడ తప్పదు. ఇట్టి యెడ, కని విని యెరుగనట్టి యుద్ధము నొక దానిని తన యాధ్వర్యము క్రింద జరుపుచున్న సామ్యవాద సంఘము నియమములు, నిషేధములు మున్నగువానిని గావించుటలో కాఠిన్యమును వహించుట సహజమే గదా!

'కీడెంచి, మేలెంచ' వలె నన్న సిద్ధాంతముపై ఈ జాగ్రతల బడవలసి వచ్చుచున్నదేగాని, చాల వరకు వీనితో నగత్యము లేదనియే చెప్పవచ్చును. ఏలనన: రష్యను సామ్యవాదిని నేడొక మహాశక్తి ఆవహించి యున్నది. ఆ శక్తిముందు చిరాను గతములైన విశ్వాసములే నిలువలేక పోయినవి; వేరుదన్నిన సంస్థలే తాళలేక పోయినవి. ఇక, దుర్బల ప్రలోభముల...

కార్మికుడు

విప్లవమునకు పూర్వము బహు నీచస్థితిలో నుండెడివాడు రష్యను కార్మికుడు! అతనికి చదువు సంధ్యలు లేకుండెడివి. పరువు, మర్యాదలు తెలిసెడివికావు. ఇక, మానాభిమానములు కేవలము పూజ్యము.

ఒకచో స్థిరనివాసమైనను అతని కుండెడిది కాదు. ఆసులోని గొట్టమువలె పల్లెనుండి పట్టణమునకును, పట్టణమునుండి పల్లెకును అతడు తిరుగుచుండెడివాడు. ఇటు సాగును చేయుచుండెడివాడు. అటు కూలికి పరుగెత్తు చుండెడివాడు. తుదకు 'రెంటికి చెడ్డరేవడి' యయ్యెడివాడు.

త్రాగుడులో నతనిది అందెవేసిన చేయి! గడించిన స్వల్పమును త్రాగుడుకే సరిపోయెడిది కాదు. చిల్లిగవ్వయేనియు చేతబడెనేని, దానిని 'వోడ్కాషాపు'లో సమర్పించు వరకతనికి నిద్రపట్టెడిది కాదు. నోరువిప్పిన బూతు, ఇల్లు గదలిన కయ్యము అతనికి వచ్చుచుండెడివి. కయ్యము మొగిసినప్పుడతడు కాట్లకుక్కయే! గిల్లియు, రక్కియు, కొరికియు, రక్తము కండ్లజూచు చుండెడివాడు. చావదన్నులు తిని క్రిందబడినను, తనదే పైచేయి యనుచుండెడివాడు.

తాను హైన్యస్థితిలో నున్నానను జ్ఞానమే అతని కుండెడిది కాదు. ఒక ఆశగాని, ఒక ఆకాంక్షగాని, ఒక ఆదర్శముగాని లేక, ద్విపాదపశువువలె అతడు జీవించుచుండెడివాడు!

ఇట్టి కార్మికుడే నేడు రష్యాకు నాథుడైనాడు! రాజ్యాధికారము సామ్యవాద సంఘమునకే చెందియున్నదనుట నిజము. కాని, తత్సంఘ సభ్యులలో సగమునకు పైగా కార్మికులే! అందుచే పలుకుబడి యంతయు కార్మికునిది; పదవులన్నియు కార్మికునివి; అసలు, ప్రభుత్వమే కార్మికునిది! అతడు 'ఔ' నన్నదే శాసనము! 'కా' దన్న దెల్ల నిషిద్ధము!!

నిరక్షరకుక్షి, జ్ఞానశూన్యుడు, పైగా, దురభ్యాసి. ఇట్టి కార్మికునికి ప్రాధాన్య మేల? సమంజసమైనదే, ఈ ప్రశ్న. ఇందుకు సమాధాన మిది:

అతనికి ఆస్తిపాస్తులు లేవు. వానిని గడింపవలెననెడి కోర్కెయైనను లేదు. కనుక, 'ఆస్తి యున్నవాడే దేవుడు; అదిలేనివాడు చచ్చు పెద్దన్న' అని పలికెడి ప్రస్తుతసంఘము నశించిన, అతనికి లేశమైనను నష్టము రాదు. పైపెచ్చు, ఎంతో లాభము! అందుచే దాని వినాశనమునకై విప్లవమొనర్చుట కత డెల్లప్పుడును సంసిద్ధుడు!

అతడు స్వభావసిద్ధముగనే భౌతికవాది. అనుక్షణమును భౌతిక ప్రపంచముతో నతనికి సంబంధ భౌతిక ప్రపంచములోనే అసలతడు జీవించును. ఆ ప్రపంచ మతనికి మాయామాత్రము కాదు. అది నిత్యమైనది; నిర్వికల్పమైనది. అందుచే సామ్యవాదమునకు ప్రాణప్రదమైన భౌతిక తత్వము(Nikolai Bukharin : Historical Materialism) నత డతి సులభముగ గ్రహింప నేర్చును.

సమస్త భాగ్యమును (all wealth) అతని కాయకష్టపు ఫలితమే! అందుచే దాని ననుభవించుట కతడే యర్హుడు. ఏ సంఘమునం దైనను –

> పెట్లో పెట్టి తాళం వేసిన - పైకం అంతా గాదిని పోసి
> పూడ్చి పెట్టిన ధాన్యం అంతా నేనే చేసిన
> రెక్కల కష్టం ఫలితం కాదా!
> నేనే రాల్చిన రక్తపు బొట్టుల ఫలితం కాదా!
> ఖాళీ యింటితో నేనుంటే అతని పెట్టి నిండింది!
> ఖాళీ పొట్టతో నేనుంటే అతనీ గాది నిండింది!

అనుచు కార్మికుడు విలపింప వలసివచ్చెనేని, ఆ సంఘము ధర్మవంచితమైన దనియే చెప్పనగును! కూలిడబ్బులే అతనికి ఏకైక జీవనాధారము! అవి పోయినను, లేక, తగ్గినను ఆట కట్టినట్లే! కనుక, సంఘీభావము నతడు పెంపొందించు కొనక తప్పదు; సమ్మెకు సంసిద్ధముగ నుండకయు తప్పదు. అతనికి గల ఈ యవసరములను పురస్కరించుకొని, కార్మిక సంఘములను స్థాపింపవచ్చును. ఆ సంఘముల ప్రబల శక్తితో పెట్టుబడిదారుల (capitalists) ను ఢీకొనవచ్చును.

ఈ వివిధ కారణములవలన నూత్న సమష్టి మానవసంఘ నిర్మాణమునకు అతడే తగును; భావియుగమునకు నాయకుడగుట అతనికే చెల్లును. మొదటిలో నతనికి చదువు రాక పోవచ్చును; అనుభవము లేకపోవచ్చును; నడవడి తెలియకపోవచ్చును. కాని, తగిన యవకాశములు కల్పింపబడినంతనే సర్వము నతడు నేర్వగలడు. నేర్చి, నూత్నవ్యక్తిగ పరివర్తన మొందగలడు.

'నిరక్షరకుక్షి, జ్ఞానశూన్యుడు, పైగా దురభ్యాసి! ఇట్టి కార్మికునికి ప్రాధాన్య మేల?' అను ప్రశ్నకిక తావులేదుగదా! రష్యాకు నాథుడై నందువలన కార్మికు డెన్నో సౌకర్యములను పొందగలిగినాడు. వానిలో ముఖ్యములైన వివి:

ఏడు గంటలకు మించి ఏనాడును అతడు పనిచేయనక్కరలేదు. గనులలో గాని, ప్రాణాపాయమున కెడమిచ్చు అన్య ప్రదేశములలో గాని పనిచేయవలసి వచ్చిన, ఆరు గంటలే చాలును. మామూలుగ వచ్చు సెలవు లట్లుండ, ప్రతి ఆరు మాసములకును రెండు వారముల సెలవు నతడు పుచ్చుకొనవచ్చును. జబ్బుచేయుట వలన పనిలోనికి పోలేని నీరసస్థితి వచ్చెనేని రెండు నెలల విశ్రాంతి నతడు కోరవచ్చును. ఈ రెండు నెలలును కర్మాగారములో నతని స్థానము ఖాళీగా నుంచబడును. ఇంతేకాదు. ఈ రెండు నెలలకును అతనికి పూర్తికూలి చెల్లింపబడును కూడ!

కాలు చేయి విరిగినను, ముసలితనము వచ్చినను, ప్రాణ మోసము గలిగినను తానుగాని, తన కుటుంబముగాని బ్రతుకు దెరవులేక చిక్కుబడవలసి వచ్చునేమో యనుచు అతడు భయమొంద బనిలేదు. ఇట్టి చిక్కురాకుండ ఉచిత బీమా పద్ధతి అతనిని కాపాడుచుండును.

చదువుకొనవలెననెడి కోర్కెయే యుండవలెనుగాని, అతనికి లేని సౌకర్యములేదు! ఏ విద్యాలయము లోనికైనను ప్రవేశమా, అతనికి బహు సులభము! అచ్చట ఆతని విద్యనుగూర్చి వహింపబడు శ్రద్ధయా, అపారము! ఇక, ధనము కొల్లలే! వీలునుబట్టి కేంద్ర ప్రభుత్వమే తగిన ధనసహాయమున కేర్పాటు గావించును. ఒక వేళ, కేంద్ర ప్రభుత్వము సహాయము చేయలేకపోయిన, స్థానిక కార్మిక సంఘమే అందుకు పూనుకొనును.(Robert W. Dunn : Soviet Trade Unions.) విద్యముగిసిన పిమ్మట ఉద్యోగమునకై అతడు దేవులాడు కొనవలసి యుండదు. ఏదో యొక ప్రభుత్వ

సంస్థలో వెంటనే అతనిని చేర్చుకొందురు. ఇట్లు చేర్చుకొని, ఏ మాత్రము తెలివితేటలను చూపినను, అతనిని ఉన్నత పదవుల కెగబ్రాకింతురు.

వైద్యసహాయము ముందతనికి, పిమ్మటనే తక్కినవారి కందరికిని! ఏ మందు కావలసినను, అతని కుచితముగనే ఇచ్చుచుందురు. ఎక్సురే పరీక్ష మున్నగువానిని కూడ నుచితముగనే జరుపుచుందురు. అవసరమైనచో, ఆరోగ్యాశ్రమములకు సయితము పంపుచుందురు. ఎన్నో వైద్యశాలలును, ఆరోగ్యాశ్రమములును అతని కొరకు ప్రత్యేకింపబడియున్నవి!

వినోద యాత్రల కతడు పోదలచిన, కార్మిక సంఘమే అందుకు తగిన యేర్పాట్లను గావించుచుండును! నివసించుటకు తగిన గృహమతనికిలేకపోయిన, ప్రభుత్వమే దానిని కట్టించి ఇచ్చుచుండును!

ఇంత రాజ్యాధికారమును, ఇన్ని సౌకర్యములను బడయుటకు రష్యను కార్మికుడే ప్రథముడు. కనుక, సామ్యవాద భవితవ్యము అతని చేతులలో నున్నది. బాధ్యతను గ్రహింప గలవాడేని, అతడు సామ్యవాదమును విజయవంతమొనర్చి, సర్వ ప్రపంచమునకు - సర్వ ప్రపంచమునకే కాదు, - సమస్త కాలమునకుకూడ మార్గదర్శకుడు కాగలడు! లేనిచో, ఏ హిట్లరో, ఏ ముస్సోలినీయో తలయెత్తుట కవకాశమిచ్చి, ఆత్మ వినాశనమును తెచ్చుకొనగలడు!!

మత విధ్వంసనము

మహాపుణ్యక్షేత్రము - బహు పురాతన మైనది - వైభవమునకు, విలాసమునకు, విజ్ఞానమునకు వన్నెకెక్కినది, - కైవ్ నగరము.

రష్యాలో ఈ నగరరాజమునుగూర్చి విననివాడెవ్వడు? ఇక్కడనే గదా, వాడిమిర్ ప్రభువు తన ప్రజలకు క్రైస్తవ మత మిప్పించినది! ఇక్కడనే గదా, మొట్టమొదటి రష్యను చర్చిని నిర్మించినది! ఇక్కడనే గదా, ప్రప్రథమమున విద్యాలయమును, ముద్రాలయమును, గ్రంథాలయమును స్థాపించినది! ఇక్కడనే గదా, ఋషిసత్తముల పవిత్ర సమాధులను పెక్కింటిని వెలయించినది!

పూర్వము - ఎంతో పూర్వమా? పది, పదిహేను సంవత్సరముల క్రితము వరకును - సంతానప్రాప్తికనియో, దీర్ఘవ్యాధి నివారణకనియో, భూతపిశాచాదిగ్రహ బాధానివృత్తికనియో పెక్కు మంది ఈ పుణ్యక్షేత్రమును సేవించుచుండెడివారు. ఏటేటను, రష్యా మారు మూలల నుండి కూడ స్త్రీలు - పురుషులు, బాలురు - వృద్ధులు, శ్రీమంతులు - నిరుపేదలు - వీరు వారన నేల? - సర్వజనులును తండోప తండములుగ ఈ తీర్థస్థలమునకు యాత్రగావించు చుండెడి వారు.

కైవ్ నగరము, పేదలకు పెన్నిధానము! భక్తులకు బృందావనము! కష్టజీవులకు కల్పవృక్షము! నేటికిని కైవ్ నగరపు ఆ వైభవోన్నతి తగ్గలేదు; ఆ విలాసగరిమ వసివాడలేదు; ఆ విజ్ఞాన వికాసము లోపింపలేదు. కాని, దాని మతవిషయిక ప్రాముఖ్యత మాత్రము పూర్తిగ నశించిపోయినది! అచ్చటి దేవాలయము లన్నియు పాడుపడినవి; మఠములన్నియు నిర్మానుష్యమైనవి. ఒక్కడైనను నేడచ్చటికి యాత్ర గావించుట లేదు.

ఇట్టి విచిత్రపరివర్తన కైవ్ నగరములోనే కలిగినప్పుడు, తదితర స్థలములనుగూర్చి వేరుగ జెప్పనేల? ఎల్లెడలను మత విశ్వాసము నశించినది. దేవమందిరములు శిథిలమైనవి. మతాచార్యులు మాయమైరి. నిరీశ్వరవాదము ప్రబలినది.
ఈ మార్పునకు కారణమేమి? సోవియటు ప్రభుత్వపు తీవ్ర మతవిద్వేషమే!

సామ్యవాదులు అసలు ఆస్తికత్వమునే విశ్వసింపరు. ప్రార్థనల నాలకించువాడు - అభీష్టసిద్ధి నొనగూర్చువాడు - దుష్టశిక్షణ, శిష్టరక్షణ గావించువాడు - సువిశాల విశ్వమును మహిమాతిరేకముచే పాలించువాడు - సంకల్పముచే సృష్టిని, వికల్ప మాత్రమున లయమును నెరపువాడు : ఒక దెవడో యున్నాడను నమ్మకమును వారు పరిహసింతురు. సభ్యతా భానోదయము గాని కారణమున అజ్ఞానాంధకారము పరీవృతమై యున్నప్పుడు, పిడుగుల ఫెళఫెళార్భటులు, మెరపుల జాజ్వల్యమాన ప్రభలు, ఝంఝూమారుతముల బహు ప్రచండ తీవ్రత, అగ్ని పర్వతముల మహా ప్రళయకాలోగ్రత మున్నగు భీభత్స ప్రకృతి వైచిత్రములను -గాంచి, మానవుడు భయ విభ్రాంతచిత్తుడై, వీని కన్నిటికిని కారకుడైన వాడొకడు గల దని భ్రమించి, అతనిని సంతుష్టిపరచు నుద్దేశముతో మద్యమాంసాదులను నివేదింప సాగెననియు, ఇదియే ఆస్తికత్వమునకు మూలకంద మనియు వారు నిదర్శన పూర్వకముగ జెప్పుదురు. ఇట్లు కేవలము భయవిభ్రాంతి జనితమైన ఆస్తిక్య భావము కాలక్రమమున రూప, రూపాంతరములనంది ద్వైతము, అద్వైతము, విశిష్టాద్వైతము మొదలగు పెక్కు సిద్ధాంత రాద్ధాంతముల క్రింద పరిణమించెనని వారు చక్కగ నిరూపింతురు కూడ!(John Strachey: The Coming Struggle for Power)వారి వాదము సత్య సమ్మత మైనట్లే గాన్పించును. కానిచో –

సర్వసము డయ్యే సర్వేశుడుంటే
కొందరు కోట్లతో కులుకగనేలా?
ఎందరొ కూటికి కుందగ నేలా?

కరుణానిధియౌపరమేశుడుంటే
క్రౌర్యము జగతిని ఏలగనేల?
శాంతము ధూళిని దొర్లగనేలా?

రక్తపుటేరులు పారగనేలా?
ప్రేమమూర్తియౌ ప్రభుడొకడుంటే
ద్వేషాలెన్నో పెరుగగనేలా?
రక్తపుటేరులు పారగనేలా?

దీనరక్షకుడు దేవుడె వుంటే
దిక్కు దిక్కునా దైన్యం బేలా?
తల్లిబిడ్డలకె ఎడబాటేలా?

సామ్యవాదుల కిట్లు ఆస్తికత్వములోనే నమ్మకము లేకపోయినను, వ్యక్తిగతముగ నట్టి నమ్మకము గలవారిని వారు బాధింపరు. ఏలనన : ఏ వ్యక్తి కావ్యక్తి ఆస్తికుడైనను మానవ కల్యాణమునకు ప్రతిబంధకము వాటిల్లదు. కాని, ఆస్తికులు కొందరు గలసి, ఏదైన కూటమును స్థాపించినంతనే ప్రమాదము సంఘటిల్లును. ఇందుకు వివిధ మతముల చరిత్రయే నిదర్శనము. ఈ దిక్కు మాలిన మతముల మూలమున, ఎన్ని తీవ్ర వైషమ్యములు పెరుగలేదు! ఎన్ని మహా సంగ్రామములు జరుగలేదు! ఎన్ని దారుణ హత్యలు గావింపబడలేదు! ఎన్ని భీకర రక్త వాహినులు ప్రవహింపలేదు! ఎన్ని దేశములు రోదనధ్వనులతో మారుమ్రోగి పోలేదు! (Bertrand Russel: Roads to Freedom.)

పూర్వకాలముననే కాదు. ఇప్పటికిని మతముల కారణముగ నిట్టి ఘోరములు జరుగుచునే యున్నవి. మతజనిత విద్వేషముల వలననేగదా, మన దేశమున హిందూ, మహమ్మదీయ కలహములు పొసగుట! ఇతర పశువులను చంపి

నప్పుడు రాని పాపము, ఒక్క ఆవును చంపినప్పుడు మాత్రమే చుట్టుకొనునా? ఇతర స్థలములలో వాద్యము చేసినప్పుడు వాటిల్లని దోషము, కేవలము మసీదుల ముందు చేసినప్పుడే ఊడిపడునా? ఐనను, ఈ మూఢవిశ్వాసముల పేరిటనే నెత్తురు కాల్వలు గట్టుట లేదా?

మతముల మూలమున - ఇది, అది యను భేదము లేక, అన్నిటి వలనను - మానవాభ్యున్నతికి భంగము వాటిల్లుచున్నది, ఇట్లే మరెన్నో రీతుల! వానిలో ప్రధానము లైనవి ఇవి:

మత సంస్థాపకులు, వెనుకటికాలపువారు. మత గ్రంథములు వెనుకటి కాలము నాటివి. మతసంబంధ గాథలు, వెనుకటి కాలమును స్తుతించునవి. అందుచే మతముల దృష్టి యంతయును వెనుకకే! శ్రీకృష్ణుడు గోపికాగణముతో బృందావనమున విహరించిన దినములను స్మరించి, హిందువులు ముగ్ధు లగుదురు. గౌతమబుద్ధుడు కుంటుచున్న మేకపిల్ల నెత్తుకొని, మంద వెంట నడచిన నాటి దృశ్యమును చిత్రించుకొని, బౌద్ధులు తన్మయు లగుదురు. క్రైస్తు, పర్వత శిఖరాగ్రము నుండి ప్రేమ సందేశమును చాటి నప్పటి రూపమును భావించుకొని, క్రైస్తవులు పరవశులగుదురు. మహమ్మదు స్వీయ మత వ్యాప్తికై చేసిన వీరకృత్యములను మననము చేసి, మహమ్మదీయు లుప్పొంగిపోదురు. ఇట్లే యూదులు, ఇట్లే కన్ఫ్యూషియనులు. మొత్తం మీద అందరి దృష్టియును వెనుకకే! వెనుకటి కాలమును మించిన కాలము లేదు! వెనుకటి ప్రవక్తలను మించిన ప్రవక్తలు లేరు! వెనుకటి సిద్ధాంతములను మించిన సిద్ధాంతములు లేవు! ప్రాక్తన మంతయును వీరికి తేజోమయము! ఆధునిక మంతయును దరిద్రాతి దరిద్రము! భవితవ్య మంతయును ఘోరాంధకార బంధురము! నిన్నటి కన్న నేడు, నేటికన్న రేపు, రేపటి కన్న ఆ పై దినమును మానవజాతిని మటొక యడుగు ముందునకు వేయించవలె నని వారు లక్షింపలేరు. ఈ లక్ష్యమే లేనప్పుడు, అందుకు తగిన ప్రయత్న మెట నుండి వచ్చును? మానవదృష్టిని వెనుకకు మరల్చి మతము లొనర్చుచున్న ఈ మహాపకారము కన్న నష్టదాయకమైనది వేరుండ గలదా?(C.D. Burns : The Principles of Revolution.)

బీదల కన్యాయ మొనర్చి, భాగ్యవంతుల పక్షమునే మతము లెల్లప్పుడు వహించునుకూడ! ఇందుకు నెపోలియన్ చక్రవర్తియే సాక్ష్యము. ఒకనా డత డిట్లు ప్రశ్నించెను 'ఎందరో తిన కూడులేక మాడి చచ్చుచుండ, నాకు పంచభక్ష్య పరమాన్నములు కలవు. ఎందరో కట్ట గుడ్డలేక పరితపించుచుండ, నాకు చీనిచీనాంబరములు కలవు. ఎందరో తల దాచుకొనచోటులేక అల్లాడుచుండ, నాకు సువిశాల ప్రాసాదములు కలవు. ఐనను, నన్ను గాంచి వారు మండిపడరు. నాపై విప్లవ మొనర్పరు. ఇందుకు కారణమేమి?' దీని కతడు స్వయముగనే ప్రత్యుత్తర మిచ్చె నీ రీతి: 'ఇహలోకమున కష్ట మనుభవించిన, స్వర్గ ధామమున అనంత సుఖమును బడయ వచ్చునని మతము కొన్ని యెడల ప్రబోధించు చున్నది. వెనుకటి జన్మమున పాపము చేసి యుండుట వలననే ఈ జన్మములో కూడుగుడ్డలు దూరమైనవి గాని, ఇందుకు నేటి సాంఘిక రీతులు, వ్యవస్థలు మున్నగున వేవియు కారణములు గావని మరికొన్ని యెడల ప్రచార మొనర్చు చున్నది! అసలు భోగభాగ్యములే వర్జనీయములని సిద్ధాంతీకరించి, నా సుఖానుభూతికి లోపము రాకుండ కాపాడుచున్నది. మత మిట్లు సైనిక బలములు నౌకాదళములును కలసి కూడ చేయలేని సేవను నా కొనర్చుచున్నది. అందుచే మతముపట్ల కృతజ్ఞత జూపవలసినదే! దాని పోషణప్రచారములకు విరివిగ విరాళముల నొసగి తీరవలసినదే!' ముందు ప్రశ్నను వేసిన దెవరు? పిమ్మట దానికి ప్రత్యుత్తరమిచ్చిన దెవరు? బాధ్యత నెరుగని అనామక వ్యక్తియా? కాదు. సాక్షాత్తుగ నెపోలియన్ చక్రవర్తి! వేటేమి సాక్ష్యము కావలెను, మతములను ఖండించుటకు?

పరిపాలనాధికారముగల వ్యక్తికిగాని, సంస్థకుగాని, బానిసలై మతములు ప్రజా సముదాయమును పీడించుటకూడ కద్దు. ఇందుకు రష్యా చరిత్ర నుండియే నిదర్శనమును జూపవచ్చును. జారు చక్రవర్తుల ఘోర నిరంకుశాధి కారమును కాపాడు నిమిత్తము నగరములలో గూఢచారదళము పౌరులను హింసించి నట్లే, గ్రామములలో 'చర్చి' హింస పెట్టు చుండెడిది.

ఏ వ్యక్తియైనను స్వాతంత్ర్య ప్రేమను గన్పరచినచో, వెంటనే చర్చి అతనిని కారాగారమున బడవేయించు చుండెడిది. మించి వచ్చిన, కొరడా వేటులను వేయించుటకుగాని, ఉరి స్తంభము నెక్కింపజేయుటకుగాని వెనుకాడెడిది కాదు! (Alexander Wicksteed: Life under the Soviets)

ఈ వివిధ కారణములను పురస్కరించుకొనియే సామ్యవాదులు మతములను తీవ్రముగ విద్వేషింతురు. కేవలము విద్వేషించుటయే గాదు, ఏ మాత్రమవకాశము లభించినను, వాని విధ్వంసమునకు గడంగుదురు. యవకాశము వారికి రష్యాలో దొరకినది. దానిని పూర్తిగ వినియోగించుకొని, వారనతికాలములోనే కృతకృత్యులైరి కూడ!

చేతిలో రాజ్యాధికారము కలదు గదా యని మతవిధ్వంసమునకు రష్యనుసామ్యవాదులు దౌర్జన్యము నుపయోగించిరా? లేదు. అట్లొనర్చియుండినచో, వారు కృతకృత్యులయ్యెడి వారే కాదు. అలంగీరుషా పాదుషా హిందూమతమును రూపుమాప సమకట్టి దౌర్జన్యము నుపయోగించుట వలన గలిగిన ఫలిత మేమి? మహారాష్ట్రములో ఛత్రపతి శివాజీ తలయెత్తుట! రాజపుత్రస్థానమున ఠాకూర్, దుర్గాదాసు తిరుగబడుట! ఏ హిందూమతమును చెండాడ బూనుకొనెనో, దానికే నవశక్తియు, నూత్నజీవమును లభించుట! దౌర్జన్య ప్రయోగము వలన మతములు చావకపోగా, వానికి, లేని ప్రాబల్యము వచ్చునని నిరూపించుట కిట్లే ప్రపంచ చరిత్ర నుండి మరి పెక్కు నిదర్శనములను జూపవచ్చును. ఇవన్నియు తెలియనివారుగాకపోవుటచే సామ్యవాదులు సాధ్యమైనంత వరకు దౌర్జన్యరహిత విధానములనే యవలంబించిరి. (J.F. Hicker : Religion under the Soviets)

ఆ విధానము లెట్టివి? వ్యాసములు, కరపత్రములు, ఉపన్యాసములు మున్నగువాని వలన మతముల నిజ స్వరూపమును వెల్లడించుట. ఇందుకు సినిమా, రేడియోలనుకూడ హెచ్చుగ నుపయోగించుట. సృష్టి జరిగిన రీతినిగూర్చి వ్యాప్తిలోనున్న మూఢవిశ్వాసములను పోద్రోలుటకై పరిణామవాదమును ప్రచారమొనర్చుట. ఈ వాదమును బలపరచు నిమిత్తము వైజ్ఞానికవస్తుప్రదర్శనాలయముల నేర్పాటుజేయుట. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయములు మున్నగు సంస్థలలో మతబోధ కూడదనుట. మతప్రబోధకులకును, మతాచార్యులకును, మతముతో సంబంధమున్న తదితరులకును ఎన్నికహక్కు నివ్వకుండుట. మత సంస్థలు కష్టజీవుల మేని- యుష్ణ రక్తముబీల్చు ధనికుల నుండి బిచ్చముదెచ్చి, దానితో నొనర్చుచుండునట్టి వైద్యసహాయము, విద్యాప్రచారము మున్నగువానిని నిషేధించుట. ఈ సంస్థలే కరకుకత్తుల దాల్చు నరహంతకుల నుండి పుచ్చుకొన్న మడిమాన్యములను జప్తుచేయుట. అవలంభింపబడిన పద్ధతులలో నివి కొన్ని మాత్రమే! మిగిలిన పెక్కులు సయితము దాదాపుగ నిట్టివే! పద్దతులేవైననేమి? రష్యాలో నేడు మతమునకు తావు లేకుండ పోయినది! ఇట్టి మహాసౌభాగ్యము ఈ దౌర్భాగ్య భారతవర్షమున కెప్పుడు...

స్త్రీ స్వాతంత్ర్యము

భారతనారీమణి ఋగ్వేదకాలమున పురుషునితో సర్వవిధముల సమానప్రతిపత్తి ననుభవించుచు, విద్యావతియై, విజ్ఞానదీపికయై వెలయలేదా? ఆమెయే కాలక్రమమున అధఃపతనమందలేదా? ఇట్లే రష్యాలో సయితము జరిగినది. ఒకప్పుడు రష్యను స్త్రీ గృహమునకు లక్ష్మియై, సంఘమునకు అలంకారమై భాసిల్లుచుండెడిది. పిమ్మట క్రమముగ నామె పరిణమించినది: కేవలము గృహకృత్యములను దిద్దు దాసిగ, సంభోగేచ్ఛను దీర్చు సాధనముగ...
స్త్రీ-శక్తి స్వరూపిణి యగు స్త్రీ - శోచనీయ మగు నిట్టి స్థితిలో నున్నంత వరకును ఏ దేశమును అభ్యున్నత పథముల మెట్టలేదని గ్రహించి, ప్రప్రథమమున పీటర్ చక్రవర్తి (Peter, the Great) రష్యను స్త్రీల స్థితిని చక్కబరుప యత్నించెను. అతని ప్రయత్నమువలననే పరదా పద్ధతి తొలగుటయు, స్త్రీలకు కొలదిపాటి స్వాతంత్ర్యము లభించుటయు

జరిగెను. అటుపిమ్మటి పరిపాలకులు సయితము పీటర్ చక్రవర్తి చూపిన మార్గమునే అనుసరించిరి. తత్కారణమున స్త్రీలకు మరికొంచెము స్వేచ్ఛ లభించుటయే గాక, వారిలో విద్యయు, విజ్ఞానమును వ్యాప్తి గాదొడగెను.

ఇట్లుండ, నికొలస్ చక్రవర్తి పరిపాలనా కాలమున సైన్యాధ్యక్షులలో గొందరతనిపై తిరుగబడిరి. ఈ విప్లవకారులలో పెక్కుమంది ఉరితీయబడిరి. మిగిలినవారిలో తొంబదిమంది సైబీరియా చెరసాలలలో బంధింపబడిరి. ఇట్లు బంధింపబడిన వారిలో వాల్కాన్స్కి సేనాని యొకడు. ఇతని ధర్మపత్ని మేరియా, ఆమెకు భర్త బంధింపబడిన నాటికి - ఇరువది వత్సరములైనను నిండలేదు. పైగా, అప్పుడే పురుడు. ఆరోగ్యముకూడ చెడియుండెను. ఐనను, తన స్థితిని లేశమైనను సరకుగొనక ఆ సాధ్వీమణి భర్తను చేరుకొనుటకై సైబీరియాకు పయనమయ్యెను. ఆమె తలపెట్టినది మహా సాహస కార్యము! సైబీరియా, హిమానీ ప్రదేశము. ఘోరారణ్య మయము. వ్యాధులకు పుట్టినిల్లు, బందీలకు యమసదన తుల్యము. ఈ విషయము లన్నియు మేరియాకు తెలియనివి కావు. పైగా బంధుమిత్రులు వలదని వారించిరి. నికొలస్ చక్రవర్తియే 'సైబీరియాకు వెళ్ళుట, మృత్యువు నాలింగన మొనర్చుట సుమా!' యని పరముఖమున హెచ్చరించెను. కాని, మేరియా జంకలేదు. నిజమునకు, ఏ సాధ్వీమణి మృత్యు భయముచే ధర్మపరాధీనమైనది!

దారి పొడుగునను చాల కష్టములబడి, ఎట్టులో తుదకు మేరియా గమ్యస్థానమును చేరెను. చేరుటయే తడవుగ భర్తను సందర్శింప నేగి, పొంగి పొరలి వచ్చుచున్న దుఃఖము నెట్లో ఆపుకొని, అతని కాలిసంకెళ్లను ముద్దు పెట్టుకొనెను!(Nekrasov: Russian Woman)

మేరియా చరిత్ర రష్యను స్త్రీ స్వాతంత్ర్యోద్యమమున కడు ప్రధానమైన ఘట్టము! ఏలనన సైబీరియాకు పయనమైన నాటి నుండియు, ఆమెయే రష్యను స్త్రీలకు ధ్యేయ మయ్యెను. అప్పటి నుండియు ఆమెవలె తాము కూడ విద్య నార్జింపవలెననియు, వ్యక్తిత్వమును పెంపొందించుకొన వలెననియు, వీరకృత్యముల నొనర్పవలెననియు పెక్కుమంది స్త్రీలు ఆసింపదొడగిరి. మహదాశయములకు పురుషులు సయితము సంతోషముగ దోహద మొసగ నారంభించిరి.స్త్రీలు ఉన్నతవిద్య నభ్యసింపగోరినప్పుడు, పురుషులు వారిని ప్రోత్సహించిరి. స్త్రీలు పరిపూర్ణ స్వాతంత్ర్యమును బడయ నభిలషించినప్పుడు, పురుషులు హర్షించిరి.

స్త్రీలు సంఘనిబంధనలను బాహాటముగ ధిక్కరించినప్పుడు, పురుషులు వారికి సహాయులైరి. ఇట్లే పెక్కు విధముల స్త్రీ స్వాతంత్ర్య సిద్ధికి - అన్యదేశములలో వలెగాక - పురుషులు మిక్కుటముగ తోడ్పడిరి. తుదకు రష్యాలో విప్లవోద్యమము తలయెత్తినప్పుడు, పురుషులతో సరిసమానముగ స్త్రీలను కూడ దానిలో జేర్చుకొనిరి. ఇందుకు తగినట్లు స్త్రీలు సయితము తమ యందుంపబడిన విశ్వాసమును రిక్తమొనర్పలేదు. ఎక్కడ, ఏ కార్యమును చేయ నియమించినను వారు సంసిద్ధులైరి. అపాయకరమైనను భయములేదు, అవినీతికరమైనను లక్ష్యములేదు. తాము ఈషణ్మాత్రముగ నైనను దాస్యశృంఖలా విచ్ఛేదనమునకు తోడ్పడగలిగిరేని, అదియే పదివేలు. ఇట్లు కార్యరంగమునకు దుమికినది, ఒకరా? ఇద్దరా? వందలు, వేలు! వారు గౌరవమును కోరలేదు; కీర్తిని కాంక్షింప లేదు. అన్నిటికిని వారు సంసిద్ధలే, - తుదకు మరణమునకు సైతము! వారు పురుషులతో కలసి కుట్రలను పన్నిరి; కలసి చెరసాలలకు పోయిరి; కలసి ప్రవాసము ననుభవించిరి; కలసి ఉరికంబముల నెక్కిరి. ఏ దేశమందును, ఏ యుద్యమమునందును - ఇంత అన్యోన్యముగ, ఇంత దీక్షాబద్ధులుగ, ఇంత స్వార్థరహితులుగ - స్త్రీ పురుషులు కలసి కృషిచేసియుండలేదని ఘంటాపదముగ చెప్పవచ్చును!

అన్యదేశము లందువలె రష్యాలో స్త్రీలు కేవలము ఎన్నిక హక్కు కొరకో, ఆర్థిక స్వాతంత్ర్యము నిమిత్తమో ప్రయత్నింపలేదు. అట్టి సంకుచిత విషయము లెన్నడును వారి దృష్టి నాకర్షింపనే లేదు. స్త్రీ పురుషులు సర్వహక్కులను సమముగా

ననుభవించుటకుగాను, ప్రజాసముదాయమును నిరంకుశ పరిపాలనమునుండి తప్పించుటకే వారు ప్రయత్నించిరి. ఈ ప్రయత్నములో వారు పురుషులతోబాటు సమముగనే కృషిచేసి, సమముగనే కష్టముల నెదుర్కొనిరి.

ఇట్లు కష్టములను చెరిసగము పంచుకొని నప్పుడు, సుఖమును సయితం మిట్లే విభాగించుకొనుట సహజమేగదా! అందుచేతనే - విప్లవము జయప్రదమై, సోవియటు ప్రభుత్వము ప్రతిష్ఠింపబడినంతనే, స్త్రీలకు సర్వవిధముల పురుషునితో సమాన ప్రతిపత్తి యొసగబడెను!(Women in the Soviet Union(Vanguard Press) రాజ్యాంగ విషయములందు రష్యాలో నేడు స్త్రీ పురుషులకు గల ప్రతిపత్తిలో భేదమే లేదు. ఏ వనితయైనను - మైనారిటీ వెళ్లిన చాలును - వోటుచేయవచ్చును. ఏ రమణియైనను అధిక సంఖ్యాకులు ఎన్నుకొనిన చాలును గౌరవ పదవుల నలంకరింప వచ్చును. ఏ మహిళయైనను - తగిన సామర్థ్యమున్న చాలును - ఉద్యోగముల బ్రవేశింప వచ్చును. ఈ రాజకీయ స్వత్వము లన్నియు లభించినను, వారు మొట్టమొదటిలో వానిని విరివిగ నుపయోగించుకొనలేదు. దాస్యము శల్యగతమగుటయే దీనికి కారణము. వత్సరముల తరబడి పంజరనిబద్ధమైయున్న కీరము స్వేచ్ఛ లభించినప్పుడు సయితము రెక్కలను విప్పుకొని, విశాల వినీల వినిర్మలాకాశపథమున కెగసిపోవ వెరచును గదా! ఇట్లే రష్యను స్త్రీ జనబాహుళ్యమును స్వాతంత్ర్యము లభించిన క్రొత్తలో కొంత వరకు వర్తించెను. కాని, త్వరితగతినే పరిస్థితులు చక్కవడెను. సోవియటు యూనియన్ కాంగ్రెస్ - ఇదియే రష్యాలో ప్రధాన రాజ్యాంగ సంస్థ - సభ్యులలో నేడు నూటికి ఎనిమిది వంతులు స్త్రీలే! స్థానిక సోవియటు సంఘముల అధ్యక్షులలో నేడు పెక్కుమంది స్త్రీలే! ఇట్లే యుద్యోగములలో కూడ. ఒక రాజ్యభాగమున - పూర్వము గ్రేట్ రష్యా అనబడుచున్న దానియందు - 1926వ సం॥మున 146 మంది స్త్రీలు న్యాయాధ్యక్ష పీఠము నలంకరించి యుండిరి. అక్కడనే - ఆ సంవత్సరమే 20 మంది స్త్రీలు పబ్లికు ప్రాసిక్యూటర్లుగా పనిచేయుచుండిరి. ఇంతేకాదు. ఒక స్త్రీ విదేశమునకు రాయబారి (Ambassador) గ సయితము వెళ్లెను! ఇట్టి పదవిని గైకొనుటకు రష్యను వనితయే మహిళాలోకమున ప్రప్రథమ!

ఇతర దేశములలోనైనను - ముఖ్యముగ పాశ్చాత్య భూములలో - స్త్రీలకిట్టి హక్కులు కొలదిగనో, గొప్పగనో లేకపోలేదు. కాని, గృహకృత్యనిర్వహణముతో ప్రొద్దు పుచ్చక, స్త్రీలు రాచకీయ స్వత్వములను కోరుటకు వారి చపలచిత్తమే కారణమను దురభిప్రాయము ఈ దేశములలో నిప్పటికిని వ్యాప్తియందున్నది. స్త్రీలచే పరిపాలింపబడుట గౌరవభంగకర మను దురభిమానము సయితము నిలిచియున్నది. ఇందుకు నిదర్శనము కావలెనా? అమెరికా (U.S.A.) లో స్త్రీలను జ్యూరర్లుగా నియమింపరాదని శాసించుటకును, ఆ రాజ్యములోనే కొన్ని కొన్ని రాష్ట్రములందు స్త్రీలను గవర్నర్లుగా నెన్నుకొనుటకు వీలులేదని తీర్మానించుటకును ఈ దురభిప్రాయమే, ఈ దురభిమానమే కారణము! ఇట్టి సంకుచిత మనః ప్రవృత్తి రష్యాలో లేశమేనియు గానరాదు. అదియే దాని ప్రత్యేకత! ప్రత్యేకతయే కాదు, - ప్రతిభ!!

ఇక, శాసనరీత్యా స్త్రీ పురుషులకు గల ప్రతిపత్తి సర్వవిధముల సమానమే! తాను పరిణయమయిన స్త్రీ తనయింటి పేరునే పెట్టుకొనవలె ననుటకు పురుషునికి అధికారము లేదు! తాను కాపురమున్నచోటనే ఆమె కూడ నుండవలె ననుటకు సయితము అతనికి హక్కులేదు! ఈ విషయములలో తమ యిచ్చవచ్చిన రీతి వర్తించుటకు స్త్రీలకు సంపూర్ణ స్వాతంత్ర్యమున్నది. ఆస్తిహక్కు పురుషులకెంతో, స్త్రీలకు సయితమంతే! అన్నట్లు, స్త్రీలు అబల లనుచు రష్యను చట్టము దానికి ప్రత్యేకరక్షణ నేమియు కల్పింపదు కూడ! ఎవడైనను పాణిగ్రహణ మొనర్తునని మాటతప్పినచో, స్త్రీ - తదితర పశ్చిమ దేశములలోవలె - అతనిపై వ్యాజ్యమును తేలేదు. తన భర్తవలపును హరించి రనుచు, స్త్రీ తక్కిన పాశ్చాత్య రాజ్యములలోవలె - అన్యకాంతలనుండి నష్టపరిహారమును బడయలేదు. దేశద్రోహమొనర్చిన స్త్రీకి - ఆమె గర్భవతి యైనచో దప్ప - పురుషునికి విధించు కఠిన శిక్షనే మారుమాటాడక విధింతురు. ఆ శిక్ష ఏదియా? తుపాకి కాల్పు!

సాంఘిక విషయములో సయితము వారికి సమాన ప్రతిపత్తియే! రష్యాలో నేడు స్త్రీలకు ప్రవేశములేని పాఠశాలలు గాని, కళాశాలలుగాని లేవు. వారికి ప్రవేశములేని క్లబ్బులు కూడ లేవు. కార్మిక సంఘములో నేమి, సామ్యవాద సంఘములోనేమి, తదితర సంస్థలలో నేమి, పురుషులవలె స్త్రీలు సయితము నిరభ్యంతరముగ సభ్యులు గావచ్చును. ఆ సంస్థల కార్యక్రమమును నిర్ణయించుటకును, వాని పరిపాలనా భారమును వహించుటకును పురుషులకుగల సర్వహక్కులు స్త్రీలకు గూడ నున్నవి.

వీధులలో, నాటకశాలలలో, రైలుబండ్లలో - ఇన్ని మాటలేల? పురుషులతో సమానముగ నెచ్చటైనను స్త్రీలు సయితము సిగరెట్లను కాల్చవచ్చును. అట్లు వారు కాల్చుచున్నారుకూడ! సిగరెట్లను కాల్చుట అనారోగ్య హేతువే యగుగాక! అది వట్టి దురభ్యాసమే యగుగాక! కాని, పురుషులు సిగరెట్లను కాల్చుటలో లేని యసహ్యత, స్త్రీలు కాల్చుటలోనే కలదను మూఢ విశ్వాసమునకు రష్యాలో తావులేదు. ఇట్లే తదితర సాంఘిక విషయములందైనను. పురుషులకు లేని నిబంధనలు ప్రత్యేకముగ స్త్రీలపై నేవియును లేవు. ఒంటరిగనే వారు - పురుషులకుగల సంపూర్ణ స్వాతంత్ర్యముతో - ఎచ్చటికైనను వెళ్లవచ్చును. ఆ రీతిగ వెళ్లువారి నడతను గూర్చి శంకింపరు, - ఎవ్వరును, ఏ విధముగను, ఏ సందర్భమునందును.

ఆర్థిక విషయములలో సైతమిట్లే స్త్రీలకు సమాన ప్రతిపత్తి కలదని వేరుగ జెప్పనగత్యము లేదు. ఏలనన : స్త్రీలు సర్వవిధముల నబల లగుటకు వారి కార్థికముగ స్వాతంత్ర్యము లేక పోవుటయే కారణమని ప్రతి సామ్యవాది యొక్కయు గట్టి నమ్మకము. ఈ నమ్మకమునకు తగిన ఆధారములు లేకపోలేదు. పురుషుడు వ్యభిచరించినచో, సంఘము - మన దేశములో నేమి, అన్యదేశములలో నేమి - అంతగా తప్పుపట్టదు. అదే పనిని స్త్రీ చేసినచో... ఇందుకు కారణమేమి? ఆర్థిక స్వాతంత్ర్యము పురుషులకే యుండి స్త్రీలకు లేకపోవుటయే! తాము నడచిన దుర్నడత వలన సుఖసంకటము లంటినచో, పురుషులు తమ డబ్బుతో వానిని బాగు జేయించుకొనగలరు. ఇట్లే సంతానము గలిగినచో, దానిని తమ డబ్బు తోనే పోషింపగలరు. స్త్రీ లిట్లు గావింపలేరుగదా! అన్యపురుషుని సాంగత్యము వలన తన భార్యకు సుఖసంకటములు సంక్రమించినచో, వానిని బాగు జేయించుటకు గాని, సంతానము గలిగిన యెడల, దానిని పోషించుటకు గాని ఏ భర్త యియ్యకొనును? అందు కతడియ్యకొనుట వేఁొకని సౌఖ్యమునకై - కేవలము వేఁొకని సౌఖ్యమునకే కాదు : తనకు తలవంపులను కొనితెచ్చుకొనుటకు కూడ - పైకమును వెచ్చించుటయే యగును గదా! ఈ కారణము వలననే 'ఎట్టైన మగవాడు . మగవాడే' యనియు, 'ఆడుదాని కిది తగునా!' యనియు విపరీత భావములు ప్రబలినవి.' (CEM Joad: The Future of Morals)

పురుషుల కొక నీతియు, స్త్రీలకు వేటొకటియును ఏర్పడుటకు; పురుషులకు ఆధిక్యతయు, స్త్రీలకు తద్భిన్నమును ఆపాదింపబడుటకు; పురుష సంతానము కలిగిన నవ్వు, స్త్రీ సంతానము కలిగిన ఏడ్పు వచ్చుటకు: స్త్రీ పురుషులలో నొకరికి గల ఆర్థిక స్వాతంత్ర్యమును, వేరొక రనుభవించుచున్న ఆర్థిక పారతంత్రమును కారణములు. ఇదియే సామ్యవాదుల నమ్మకము. ఇదియే సత్యము కూడ!

ఇట్టి సత్య సమ్మతమైన నమ్మకముగలవా రగుటచేతనే సామ్యవాదులు తమకు అధికారము చేజిక్కుటయే తడవుగ - చట్టమును చేసి, స్త్రీల కొక్కుమ్మడిగ సంపూర్ణమైన ఆర్థిక స్వాతంత్ర్యము నొసగిరి. ఈ రోజున రష్యాలో మగవాని కొక కూలియు, ఆడుదానికి వేరకటియు నిచ్చుటకు వీలులేదు. ఇద్దరును ఒకే పని చేసినప్పుడు, ఇద్దరికిని సమమైన కూలినే యియ్యవలెను. 'ఈ పనిని చేయుటకే స్త్రీలు తగుదురు; ఆ పనిని చేయుటకు తగరు' అనుటకు వీలులేదు. వివాహిత యనియో, గర్భవతి యనియో సాకు చెప్పి ఆడుదానికి పని నీయ నిరాకరించుటకు కూడ వీలులేదు. ఇట్టి యేర్పాట్ల వలన స్త్రీల సంపాదన 'ఏదో వేడినీళ్లకు చన్నీళ్ళుతోడు' అన్నట్లుగాక, వారి జీవితాశ్యకములకు పూర్తిగ సరిపోవుచున్నది. దాని మూలమున వారికి జీవన నిర్వహణమునకై పురుషులపై నాధారపడి యుండవలసిన గతి తప్పుచున్నది కూడ!

ఇక, సాంసారిక... అన్నట్లు, సాంసారిక జీవనమును గూర్చి కొద్దిలో ముగించుటకు వీలులేదు. దానికి ప్రత్యేకముగ నొక ప్రకరణమును వినియోగింప వలసినదే!

సాంసారిక జీవనము

సగము వయస్సు చెల్లినది. ఇద్దరు, ముగ్గురు బిడ్డలు కూడ కలిగిరి. అప్పుడు భార్య - అర్ధాంగి - పోయినది. నష్టమేమి? ఆమె చితియైనను చల్లారక మునుపే తిరిగి 'పెండ్లి'. క్రొత్తమామగారితో వీసమంత మాట పట్టింపు వచ్చినది. సంకోచమేల? ద్వితీయ కళత్రమును విడిచిపుచ్చి, తృతీయము. ఈ మూడవ భార్య ఇంటికి రాకమునుపే తాను మంటిలో గలిసెను. తప్పింప గలిగినదేమున్నది? ముక్కు పచ్చలారని ఆ బాలకు ఆజన్మ నిర్బంధ వైధవ్యము. ఇవి హిందూ సంఘములోని పరిస్థితులు! వీని ఫలిత మేమి? మగవానికి ఒకటికి పారజాపినను - పెండ్లిమీద పెండ్లి. ఇక, ఆడుదానికో? ధవుడుండియు వైధవ్యము; సంసార సుఖమును చవిజూడకమునుపే దాని పరిత్యాగము; లేదా, వయస్సు తిరిగినవానితో - వలపులేని, ముచ్చట తీరని, గత్యంతరము గానరాని - కాపురము!

ఒకరి హృదయమును ఇంకొకరు సరిగ గ్రహింపలేరు. ఒకరి స్వభావమును ఇంకొకరు పూర్తిగ నవగాహమొనర్చుకొనలేరు. ఏదో ప్రణయప్రథమోద్వేగములో పరిణయమందిరి. యుద్వేగము చల్లారినంతనే అన్యోన్య హృదయములకు గల సంఘర్షణమును, ఉభయ స్వభావములలో గల విభిన్నతను గ్రహించిరి. తప్పిదమే జరిగినది. ఇక, దీని నుండి తప్పుకొనుట కొకే మార్గమున్నది. అది డివోర్సు. కాని డివోర్సు వచ్చుటట్లు? భార్యాభర్తలలో నెవరో యొకరు వ్యభిచరించిరని ఋజువుచేసినగాని, దాని నీయరుగదా! భార్య వ్యభిచరించెనన్నచో, ఆమె జీవితమిక వ్యర్థమే! అందుచే తన ప్రతిష్ఠకు భంగము వాటిల్లునని తెలిసియు, పాటింపక, భర్తయే నాలుగునాళ్లు ఏ 'హోటల్ గరల్' తోనో విలాసముగ తిరిగెను. ఇట్లు తిరుగుచున్నప్పుడు కండ్లార జూచితిమని సాక్ష్యమిచ్చుటకు కొందరిని - తగిన లంచమిచ్చి - యేర్పాటు గావించెను. అంతట, భర్త నటించిన వ్యభిచార జీవితమును సాకుగా జెప్పి, భార్య డివోర్సునకు దావా చేసెను. కాని, సాక్ష్యమును నమ్మజాల మని దావాను కొట్టివేసిరి. ఇక, దీనికి తిరుగులేదు! ఇవి పాశ్చాత్య సంఘములోని పరిస్థితులు! వీని ఫలితమేమి? ఇష్టము లేకపోయినను, కాపురము; గార్హస్యము పేరిట వ్యభిచారము; లేదా, ఎవనితోనైన రహస్యముగ లేచిపోయి, వైవాహిక బంధమును బలవంతముగ ద్రెంచివైచుట!

సాంసారిక జీవనమున పురుషునికి ఈ తగని ఆధిక్య మేల? స్త్రీల యెడ ఈ విపరీతపు అన్యాయమేల? ఒకరు పెండ్లిపై పెండ్లి చేసికొన్నను, తప్పుపట్టక పోవుటేల? ఇంకొకరు ప్రకృతినే చంపుకొని, ఆజన్మ నిర్బంధ వైధవ్య మనుభవింపవలెనని శాసించుటేల? భార్యాభర్త లిర్వురును కావలెనన్నప్పుడు కూడ విడాకుల నిచ్చుటకు వీలులేదను టేల? పైగా, ఈ ఘోరములను నీతిపేరిట, ధర్మము పేరిట చేయుటేల?

→ SERENTES PA.

ఇదియంతయు వట్టి మౌఢ్యము పచ్చి అన్యాయము - సభ్యతావికాసములేని పూర్వకాలమునుండి మనకు సంక్రమించిన దరిద్రపు వారసత్వము. ఇట్టి దీనికి నేటి రష్యాలో తావు లేదు. ఔను. ఎట్లుండగలదు? వివాహమునకు అంధప్రాయములైన పారమార్థిక భావముల నారోపించుటకు మతమా, లేదు. సాంసారిక జీవనమును తీరని యాతనామయ మొనర్చుటకు పురాతన సాంఘిక సంస్థలా, సున్న. గార్హస్యము పేరిట ఘోరాన్యాయములను జేయుటకు ప్రత్యేకముగ పురుషులచే వ్రాయబడిన ధర్మశాస్త్రములా, మృగ్యము. పైగా, దురాగతమని నిరూపింపబడిన దానిని ప్రతిఘటించుటకు వలయు

ధైర్యసాహసోత్సాహములకు లోటులేదు. ఈ ప్రతిఘటనము లోనే పొరబాటు జరిగెనేని, దాని నొప్పుకొని, అన్యమార్గముల నన్వేషించుటకు జంకులేదు. ఇక తావేది, లోపము లుండుటకు?
నేటి రష్యాలోని నిరుపమ సాంసారిక జీవన పద్ధతుల సంగ్రహ వివరణ మిది!

ఒక - రావును, మరొక - దేవియు పరిణయమాడదలచి రనుకొనుడు. అప్పుడు వారిద్దరును కలసి రిజిస్ట్రేషన్ ఆఫీసునకు వెళ్ళుదురు. అక్కడ నున్న యుద్యోగి - ఈ పదవిలో స్త్రీలుండుట కూడ కద్దు - కొలదిపాటి రుసుమును పుచ్చుకొని, ఎట్టి యాడంబరము లేకుండగనే వారి వివాహమును రిజిష్టరు చేయును. ఈ సందర్భమున సాక్షులతో పనిలేదు. వధూవరులెట్టి ప్రమాణముల గావింపవలసిన యగత్యముకూడ లేదు. *(రష్యాలో నన్ని యెడల ప్రమాణములను గావింపవలసిన పద్ధతినే పూర్తిగా తొలగించిరి.)* ఇట్లని బొత్తుగ నిబంధనలు లేవని కాదు. సౌఖ్యవంతమగు సాంసారిక జీవనమునకు ముఖ్యావసరమైనవి కొన్ని యున్నవి. వధూవరులిద్దరును కనీసము పదునెనిమిది వత్సరముల వయస్సుగలవారై యుండవలెను. ఉభయులకు మనస్ఫూర్తిగ సమ్మతించిననే గాని, పరిణయము జరుగుటకు వీలులేదు. దగ్గర బాంధవ్యము గలవారి వివాహమును రిజిష్టరు చేయుటకు వలనుపడదు. పిచ్చివారికి పెండ్లి కూడదు. ఇది వరకే పాణిగ్రహణమొనర్చియున్న వ్యక్తి - అనగా, అంతకుపూర్వమే వివాహమాడి విడాకులు పుచ్చుకొనినట్టి వ్యక్తి తిరిగి పరిణయమొనర్చుకొనుటకు చట్టమొప్పదు. ఈ నియమముల నుల్లంఘించినవారి కొక సంవత్సరము కారాగారవాస శిక్షనుగాని, వేయి రుబుల్సు జరిమానాను గాని విధింప వచ్చును. దంపతులలో నెవరైనను, రెండవవారికి సుఖసంకటముల నంటించిరేని, అట్లొనర్చినవారికొక సంవత్సరమునకు మించని జైలుశిక్షను వేయవచ్చును. ఇంతకు వినావేరు నిబంధనలు లేవు. వీనికి విరుద్ధము లేనియెడ రిజిస్ట్రేషను చిటికలపై జరిగిపోవును.

వివాహమువలె విడాకులుకూడ చిటికిలపై జరుగు పని. మనము ఉదాహరణముగా గైకొన్న - రావును, దేవియు రిజిస్ట్రేషన్ ఆఫీసు ప్రాకారమునైనను వీడక మునుపే కలహించి రనుకొనుడు. వెంటనే వెనుదిరిగి వెళ్ళి, వారు విడాకులను కోరవచ్చును. రిజిస్ట్రేషన్ ఆఫీసరు దీనిని కాదనుటకు వీలులేదు. డివోర్సు ప్రశస్తమైన పనికాదని అతడు చెప్పిన, చెప్పవచ్చును. పది రోజులపాటు ఓపిక పట్టిన, వివాదములు సమసి, సామరస్యము కుదరవచ్చునని సలహానిచ్చిన, ఇయ్యవచ్చును. అంతే! తన హితబోధను త్రోసిపుచ్చి, డివోర్సు కావలెననిన, దానినిచ్చి తీరవలసిందే! దీనికి సాక్షులతో పనిలేదు. లాయర్లతో నిమిత్తము లేదు. తుదకు ఏయే కారణములకుగాను డివోర్సు కోరుచున్న సంగతినైనను చెప్పబనిలేదు. మన రావును, దేవియు కలసి వెళ్ళి అడిగిననేగాని, విడాకుల నిచ్చుటకు వీలులేదను నియమము సయితము లేదు. అవసరము కలిగినచో, దేవి యొకర్తయే వెళ్ళి విడాకులను కోరవచ్చును. రిజిస్ట్రేషన్ ఆఫీసరు మారుమాటాడకయే ఆమె కోర్కెను మన్నించి, 'నీ భార్య నిన్ను డివోర్సు చేసినది' అని రావునకు తెలియజేయును. ఇట్లే రావు కూడ ఒంటరిగనే వెళ్ళి, విడాకులను పుచ్చుకొనవచ్చును.

'ఇంత సునాయాసముగ విడాకుల నిత్తురా' యని అబ్బురపడనక్కరలేదు. నేటి రష్యాలో వివాహమాడుటకన్న, విడాకులను పుచ్చుకొనుటయే సులభము. ఇది చాల చక్కని పద్ధతికూడ! *(Bernard G. Shown : Getting Married.)* దంపతులలో ఏ యొక్కరికైనను గిట్టనప్పుడు, వారిని కాపురము జేయుడని నిర్బంధించుట శుద్ధ మౌఢ్యము. అసలట్టి దంపతుల జీవితము గార్హస్యమే కాదు, - చట్టసమ్మతమైన వ్యభిచారము!

ఇట్లంటినని కొందరు పెద్దలకు కష్టము కలుగవచ్చును. కాని, సత్యము వజ్రముకంటెను కఠినమైనది. ప్రళయాగ్ని కంటెను తీక్షమైనది; నిశితకరవాలము కంటెను వాడియైనది; మహాపురుషుని భవిష్యద్వాణికంటెను అమోఘమైనది. ఇట్టియెడ, కొందరికి ,వారు పెద్దలే కావచ్చును, కష్టము గలుగునను నెపమున సత్యమును నుడువుటకు వెనుకాడ నేల?

అడుగుటయే తడవుగ రష్యాలో నేడు డివోర్సు నిచ్చుచున్నమాట నిజమే! కాని, ప్రత్యేక సందర్భములందు భార్యాభర్త లొండొరుల యెడ నిర్వర్తింపవలసిన బాధ్యతలు కొన్ని లేకపోలేదు. డివోర్సు నిచ్చినప్పుడు భార్య రుగ్మత వలనగాని, మతేదైన కారణము వలనగాని జీవనోపాధిని తెచ్చుకొనలేని స్థితిలోనున్న యెడల, సంవత్సరమునకు మించని కాలమువరకు భర్త తన సంపాదనలో మూడవ వంతును ఆమె కిచ్చుచుండవలెను. ఒకవేళ, భర్తయే పొట్టపోసుకొనలేని స్థితిలో నున్నచో, భార్య తన ఆర్జనలో మూడవవంతును అతనికి చెల్లించు చుండవలెను. ఇట్లు చెల్లింపవలసినది - పై సందర్భమునందు వలెనే - డివోర్సు పుచ్చుకొనిన నాటినుండి సంవత్సము వరకు మాత్రమే! ఈ బాధ్యత నుండి భార్యాభర్తలలో నెవ్వరును తప్పించుకొనుటకు వీలులేదు. మర్యాదగ తామే భృతినిచెల్లించు చుండిన సరియే. లేనిచో, ప్రభుత్వము చర్యగైకొనును.

డివోర్సు పుచ్చుకొనుచున్న దంపతులకు బిడ్డలున్నచో, వారిని గూర్చి ప్రత్యేక శ్రద్ధ వహింపబడును. బిడ్డల సంరక్షణాధికారము తప్పనిసరిగ తల్లికే యొసగబడును. ఏ తండ్రి యైనను - అతడెంతటి ప్రేమవాత్సల్యములుగల వాడైనను - తల్లివలె బిడ్డలను పోషింపనేరడని రష్యను న్యాయస్థానముల నమ్మకము. అందుచే, తల్లికి త్రాగుడు మున్నగు దురభ్యాసము లేవైన గలవని నిరూపింప బడినప్పుడు మాత్రమే బిడ్డల సంరక్షణాధికారమును తండ్రి కిత్తురు. ఇక, వారి పోషణార్థము తల్లిదండ్రులిద్దరును తమ తమ శక్తికి తగినట్లు చెల్లించుకొను చుండవలెను. అన్నట్లు, ఏ సందర్భమునందును, ఎవరి సంపాదననుండియైనను సగమునకు మించి మనువృత్తి క్రింద నిప్పింప వీలుపడదు.
ఇంత సునాయాసముగ వివాహమాడుటకును, విడాకులు పుచ్చుకొనుటకును వీలున్నప్పుడు చపలచిత్తముగలవారు - వారు స్త్రీలైనను, పురుషులేయైనను - 'పండుగనాడు కూడ పాతమగడేనా!' యన్నట్లు వర్తింపరాయని సంశయము గలుగవచ్చును. కాని, సాంసారిక జీవనమునందు చపలచిత్తతను ప్రదర్శించువారిని రష్యాలో జూచుచుందురు: కడుహేయముగ, అతినీచముగ, మహానికృష్టముగ... ఒక్కొక్కప్పుడు వారిని సంఘమునుండి బహిష్కరించుట కూడ కద్దు. అందుచే, హద్దుమీర సాహసింప రెవ్వరును!

అసలు, వివాహముతోగాని, విడాకులతోగాని పనిలేదు, నేటి రష్యాలో! ఎట్టి తంతు లేకుండగనే పరస్పర ప్రేమానురాగ బద్ధులైనవారు సుఖముగ కాపుర మొనర్పవచ్చును. ఇట్లు కాపురమొనర్చు వారిని చట్టము బాధింపదు; సంఘము కాదనదు; ఇరుగు పొరుగు చులకనగ జూడదు. వారి బిడ్డలకు సంకర సంతానమను కళంకమైనను ఆపాదింపబడదు. ఈనాటి రష్యనుచట్టములో సంకర మను పదమునకు తావే లేదు. చట్టసమ్మతముగ వివాహమైనప్పుడు గలుగు సంతానమునకున్న హక్కులన్నియును, అది లేనప్పుడు గలుగు సంతానమునకు సైతమున్నవి. అందుచే, పెక్కుమంది యువతీ యువకులు - పరస్పరప్రేమ విశ్వాసములే హృదయముల నైక్యమొనర్చు చుండ, వివాహపు తంతుతో నగత్యమేమని భావించునట్టివారు లేకుండగనే కాపురము చేయుచున్నారు. *(Maurice Hindus: The Great Offensive)*

మన - దేవియును, రావును వివాహము లేకుండగనే కొంతకాలము కాపురము చేసి రనుకొనుడు. అప్పుడు వారికొకరిద్దరు బిడ్డలు గలిగిరని కూడ భావింపుడు. ఇంత జరిగిన పిమ్మట, వారిద్దరికిని తీరని తగవు వచ్చినచో, గత్యంతరమేమి? కోర్టునకు వెళ్ళుటయే! మన దేవి నిస్సంకోచముగ కోర్టునకు వెళ్ళి, ఫలానా రావువలన తనకా బిడ్డలు గలిగిరనియు, వారి పోషణార్థము ఆ రావు తగిన భృతిని చెల్లింపవలెననియు చెప్పుకొనవచ్చును. అప్పుడు కోర్టు వారు ఫిర్యాదు స్వభావమును రావునకు తెలియజేసి, పదిహేను రోజులలో హాజరై తగిన సమాధానము చెప్పుకొనవలసిన దనుచు అతనికి నోటీసు పంపుదురు. ఈ నోటీసును చూచుకొనియు అతడు హాజరుగాకపోయిన, తప్పని సరిగ నతనిపై డిక్రీనిత్తురు. ఒకవేళ, రావు హాజరైనచో, దేవికి కలిగిన సంతానమునకు తాను బాధ్యుడను గానని ఋజువు చేసికొనవలసి యుండును. ఈ ఋజువు భారము పూర్తిగ నతనిదే! ఏ మాత్రముగనైనను ఋజువులో లోపము గాన్పించెనేని, డిక్రీ

తప్పదు. అట్లుగాక, తనతో బాటి తరులకుగూడ దేవితో సంబంధ ముండెడిదని అతడు నిరూపింపగలిగెనేని, పెద్దచిక్కు వచ్చును. నాలుగైదు వత్సరముల క్రితమువరకిట్టి సందర్భమున దేవితో సంబంధమున్నవా రందరిపైనను ఆమె బిడ్డల పోషణ బాధ్యతను వేయుచుండెడివారు. కాని, ఏ బిడ్డకైనను బహు పితృత్వము (multiple fatherhood) నెత్తి జుట్టుట అస్వాభావిక మని యెంచి, ఏ యొక్కని పైననో నేడా బాధ్యతను వేయుచున్నారు. ఈ యొక్క దెవ్వడో నిర్ణయించుట ఎట్లందురా? బిడ్డ రూపు రేఖవిలాసములతో నేమైన పోలికయున్నదా, లేదా? యని చూతురు. బిడ్డ రక్తముతో నేమాత్రమైన సంబంధము గలదా, లేదా? యని పరీక్షింతురు. ఈ పరిశోధనల వలన సర్వసాధారణముగ న్యాయమే జరుగుచుండును.

ఏ యొకనాటి సంపర్కము వలననో సంతానము గలిగెనేని, అప్పుడు కూడ నిట్లే న్యాయనిర్ణయ మొనర్చుచుందురు. ఈ వాక్యమును చదివినంతనే 'ఏదో యొకనాటి సంపర్కము కూడనా!' యని పెక్కుమంది పాఠకులు ఆశ్చర్యచకితులుగావచ్చును. ఔను, రష్యాలో దీని నంతగ తప్పు పట్టించుకొనరు. అబద్ధము లాడుట తప్పు. దొంగతనము చేయుట తప్పు. లంచముల నిచ్చుట, పుచ్చుకొనుట తప్పు. పరుల కపకార మొనర్చుట తప్పు. అంతేగాని, దీనిలో తప్పేమున్నది? దీని వలన నితరులకుగాని, సంఘమునకుగాని ప్రమాదము రాదే! ప్రమాదము వచ్చునంతటి విచ్చలవిడిగ వర్తించిన, ముమ్మాటికిని తప్పే! కాని, ప్రమాదము లేనప్పుడు కూడ... పైగా, ఆహార నిద్రలకు లేని తప్పు, ప్రత్యేకముగ దీని కేల? ఎన్ని దుర్గుణములున్నను, ఈ యొక్క విషయములో నిగ్రహముగల వ్యక్తిని నెత్తినెక్కించుకొన నేల? తదన్యుని పడదిట్టనేల? ఇది కేవలము మూర్ఖత్వము కాదా? అని రష్యనులు వాదింతురు.

ఇట్లని - పూర్వమే చెప్పినట్లు - వట్టి చపలత్వమును సహింపరు. ఇక, బలాత్కారము గావించినచో? తుపాకి గుండు కాల్పే!

సాంసారిక జీవనములో నిట్లే మజెన్నో క్రొత్త పద్ధతులను త్రొక్కిరి. వానిలో ప్రధానములైనవి: సంతాన నిరోధమును, గర్భస్రావమును. ఈ రెండింటిని గూర్చిన వివరములివి :
బిడ్డలను కని, పెంచుట కిష్టములేని దంపతులు సంతాన నిరోధమును గావింపవచ్చును. దీనిని గావించుటకు తగిన పద్ధతులు, వలసిన సాధనలు మున్నగు వానిని గూర్చిన వివరములను డాక్టర్ల నడిగి, నిరాఘాటముగ తెలుసుకొనవచ్చును. ఇటీవల, వివాహములను రిజిష్టరుచేయు ప్రతి కార్యాలయము నందును నూత్నదంపతులకు సుఖ సాంసారిక జీవనమును గూర్చి సలహా నొసగు నిమిత్తమొక డాక్టరును నియమించుచున్నారు. ఈ డాక్టరు సంతాన నిరోధన పద్ధతులను కూడ వలసినవారికి విడమర్చి చెప్పును. సంతాన నిరోధ మొనర్పుడని ప్రభుత్వము జపానులోవలె - ప్రోత్సహింపదు. అది కూడదని - అమెరికా సంయుక్త రాష్ట్రములలోవలె - నిషేధింపదు. ఈ విషయములో దంపతులు తమ ఇష్టానుసారము వర్తింపవచ్చును.

ఇక, గర్భస్రావమును గూర్చి అన్ని సందర్భములలో గాక పోయినను, కొన్ని యెడల గర్భవిచ్ఛిత్తిని గావించు కొనవచ్చును. ఆ కొన్ని సందర్భములివి : అదివరకే ఏ నలుగురైదుగురో సంతాన మున్నప్పుడు, తిరిగి ప్రసవించిన శరీర స్వస్థత పరిపూర్ణముగ భగ్నమౌనని వైద్యులు చెప్పినప్పుడు, లేదా, మరొక బిడ్డను పోషింపనేరని ఆర్థిక పరిస్థితులలో నున్నప్పుడు. ఇట్టి సందర్భములలో నైనను, ప్రభుత్వ నియుక్తులైన డాక్టర్ల చేతనేగాని, గర్భము విచ్ఛిన్నము గావించుకొనుటకు వీలులేదు. ఇందుకు భిన్నముగ వర్తించినవారికి శిక్ష తప్పదు.

ఇదియే నేటి రష్యాలోని సాంసారిక జీవనము. ఇక్కడ సగము సగము సంస్కరణములకు చోటులేదు. తాత్కాలికోపశాంతులకు తావులేదు. భయముతో నొక్కొక్క యడుగునే ముందునకు వేయుటకు వీలులేదు. స్త్రీ పురుషులను భేదము లేక, ఉభయులకును సాంసారిక జీవనమును సంపూర్ణ స్వాతంత్ర్యమొసగ వలసినదే! ఉభయుల

సుఖాభిలబ్ధికి ఆధునిక శాస్త్ర పరిశోధనల వలన లభించిన జ్ఞానసర్వస్వమును వినియోగింపవలసినదే! ఇట్లని, ప్రజల ఆరోగ్యాభివృద్ధులకే భంగము వాటిల్లినగాని, రసజ్ఞత (aesthetic appreciation) లోపించినగాని, సంఘశ్రేయమునకు ప్రమాదము సంఘటించినగాని, సహించుటకు వీలులేదు.

'రష్యను సంసారిక జీవనము నీతి విరుద్ధముగాదా?' యని కొందరు ప్రశ్నింపవచ్చును. వీరికి సమాధానమిది: ఏది నీతియో, ఏది కాదో నిర్ణయించుటెట్లు? ఒక కాలమున నీతియని సర్వజను లంగీకరించినదే, మఱొక కాలమునాటికి అవినీతిగ పరిణమింపదా? ఒక దేశమున నీతియని భావింపబడునదే, మఱొక దేశమున తద్భిన్నము కాదా? ఇట్లే నీతి విషయమున మతమునకును భేదములు లేవా? మనకు, మహాభారత జాతికిని, మతము కాలమున ధర్మసంతానమును బడయుట నీతి విరుద్ధముగాదు. ఆ కాలముననే బహుపతీత్వము (Polyandry) అవినీతికరము గాదు. కాని, నేడో? అతిధికి భార్య నప్పగించుట అదేదో ఆఫ్రికన్ జాతి వారికి నీతి. కాని, మనకో? కనుక దేశ కాలపాత్రములనుబట్టి నీతి మార్పునందుచుండుననుట స్పష్టము.*(E.Carpenter: Civilization: Its Cause and Cure)* ఇట్టి యెడ రష్యను సాంసారిక జీవనము నీతి విదూర మనుటకు వీలేది?

పడుపు వృత్తి

జారు చక్రవర్తుల ప్రభుత్వకాలమున రష్యను నగరములు పడుపువృత్తికి పెట్టినది పేరు. ఏ నగరమును జూచినను గణికాంగనలు వేలసంఖ్యమీదనే! సైనిక శిబిర పరిసరములలో వీరే! విశ్వవిద్యాలయ ప్రాంతములలో వీరే! వర్తక వ్యాపార కేంద్రములలో వీరే! వీధి, వీధికిని వీరే! అతి బహిరంగముగనే ఈ నీచ వ్యాపారము విరివిగ సాగిపోవుచుండెడిది.

బహిరంగముగ గాకేమి? ప్రభుత్వము దీని నామోదించుచుండెడిది. వట్టి ఆమోదమే కాదు. చాలవరకు ప్రోత్సహించుచుండెడిది కూడ! ఎవతో యొకతె పడుపు వృత్తిని స్వీకరింపనెంచె ననుకొనుడు. అప్పుడు చేయదగినదేమి? పోలీసు ఠాణాకు వెళ్ళుట; ఒక 'యల్లోటికెట్టు'ను సంపాదించుట. అంతే! ఇక వ్యాపారమును సాగించుట కభ్యంతరము లేవియు నుండవు సరిగదా, అది వరకు లేని కొన్ని ప్రత్యేక హక్కులు సయితము లభించును. 'ప్రత్యేక హక్కులు సయితమా? యను సందేహమునకు తావు లేదు. ఇందుకు నిదర్శన మిది: పూర్వకాలమున యూదు జాతివారికి నిర్దేశప్రాంతముల వెలుపల నివసించుటకు హక్కు లేకుండెడిది. కాని, ఏ యూదు జాతి బాలికయైనను 'యల్లో టిక్కెట్టు'ను సంపాదించెనేని, ఆమె కా హక్కు సిద్ధించుచుండెడిది. ఇట్లే తదితరులకును ఏవో కొన్ని ప్రత్యేక హక్కులు లభించుచుండెడివి. ఇట్లే వారును పతిత జీవితమునకు గడంగుచుండెడివారు.

ఒక్క నగరములోనే కాదు, చిన్న చిన్న పట్టణములలో సయితము ఈ నీచవృత్తి వ్యాప్తియందుండెడిది. అక్కడకూడ ప్రభుత్వము దీనిని యధాప్రకారముగ ప్రోత్సహించుచుండెడిది. జాతిని వీర్యవంతమొనర్చుటకు ప్రయత్నము సున్న. సంఘ శ్రేయమునకు దోహదమొసగుటకు చతురత శూన్యము. దేశాభ్యున్నతికి పూనుకొనుటకు దీక్ష మృగ్యము. పైగా, జాతికిని, సంఘమునకును, దేశమునకును తీరని కళంకమును తీరని కళంకము కాదు; వినాశనమునుకూడ - తెచ్చిపెట్టు పడుపువృత్తిని ప్రోత్సహించుట! ఇంతకన్న ఘోరము, రాక్షస... జారు చక్రవర్తుల ప్రభుత్వము పోవుటయు, రాజ్యాధికారము సామ్యవాదుల చేజిక్కుటయు జరుగుటయే తడవుగ, పడుపువృత్తి చట్టవిరుద్ధమని ప్రకటింపబడెను. ఈ వృత్తిని వ్యాపారసరళిని సాగించుచున్న పెక్కుమందిపై చర్యగైకొనబడెను. అవసరమునుబట్టి వారిలో గొందరికి బహు కఠిన శిక్షలు విధింపబడెను. కాని, గణింపదగిన ఫలితమేమియును సిద్ధింపదయ్యెను. దీనిలో వైపరీత్యములేదు. ఉద్యోగముగాని, వరుమానముగాని, జీవనోపాధిని తెచ్చుకొనుటకు అన్యమార్గముగాని లేని స్త్రీలు వేనకువేలుగ

దేశములోనున్నప్పుడు, నిషేధనశాసనమును - తీవ్రముగనే కానిండు - ప్రయోగించినంత మాత్రమున పడుపువృత్తి తగ్గదుగదా! ఎప్పటి కప్పుడు వేశ్యలను అరెస్టుచేయుట; కొన్ని రోజులో, వారములో, నెలలో కారాగారమున బంధించుట; గత్యంతరము లేక, పిమ్మట వదలివేయుట; విడుదలగాంచిన వారెల్లరు పూర్వవృత్తి కెప్పటియట్ల గడంగుట, ఈ నాటక మవిచ్ఛన్నముగ కొన్ని వత్సరములపాటు జరిగెను. కాని

1928వ సంవత్సరముతో పరిస్థితులు మారిపోయెను. ఈ మార్పునకు పంచవర్ష ప్రణాళిక*(ఈ ప్రణాళిక వేరొక చోట వివరముగా చర్చించబడినది.)* కారణము. వ్యావసాయికముగ, పారిశ్రామికముగ, విద్యావిషయికముగ - ఒక్క మాటలో సర్వతోముఖముగ దేశము నభివృద్ధి పరచుటయే ప్రణాళిక యొక్క యుద్దేశము. ఈ యుద్దేశ సాఫల్యతకై వందల కొలదిగ యంత్రాలయములను నిర్మింపవలసి వచ్చెను; వేల సంఖ్యను విద్యాలయములను స్థాపింపవలసి వచ్చెను; నాటకశాలలు, కళామందిరములు, విశ్రాంతి గృహములు మొదలుగా గల ప్రజోపయోగకరమైన భవనములను పెక్కింటిని కట్టవలసి వచ్చెను. ఇన్ని పనులు నొకే సమయమున గావింపవలసి వచ్చినప్పుడు, లక్షలాదిగా పనివాండ్రు కావలసివత్తురు గదా! ప్రణాళికను ప్రవేశపెట్టిన మూడేండ్లకే మగకూలీలు కరవైరి. అంతట ఆడు కూలీలకు గిరాకీ తగిలెను. ఒక్కుమ్మడి ముప్పది లక్షల మంది ఆడువాండ్రు కూలికి పోసాగిరి.

పొట్టపోసుకొనుటకు వేరేదియు దారిగానక పడుపు వృత్తికి దిగిన వారందరును కూలినాలి చేసి నాలుగు రాళ్ళను తెచ్చుకొనుటకు వీలు దొరికినంతనే, దాని నుండి తప్పుకొనిరి. గౌరవప్రద జీవన నిర్వహణమునకు మార్గమేర్పడుటచే శరీరమును, దానితోబాటు మానాభిమానములను విక్రయించుకొన క్రొత్తగా సంసిద్ధపడువారు కూడా లేకపోయిరి. ఇక, పడుపువృత్తి రూపుమాయ కెట్లుండగలదు?

కాని, సోమరితనము బలియుట వలననో, సుఖవ్యాధులు జీర్ణించుట వలననో, విలాసపూర్ణ జీవితమున కలవాటు పడుట వలననో, ఈ కారణము లన్నియు సమకూడుట వలననో పడుపు వృత్తిని వీడలేని దౌర్భాగ్యురాండ్రు కొందరు - దేశ మొత్తమున పాతిక, ముప్పది వేలమంది - మిగులక పోలేదు. వీరిని వృత్తి నుండి తప్పించుట మహాకష్టము. ఇట్లని, సోవియటు ప్రభుత్వం వారు చూచియు చూడనట్లుగ నుండరైరి. సమర్థత లేనివారు కారుగదా, అట్లుండుటకు! ఎదుర్కొన్న సమస్య కఠినమైనదని గ్రహించిరి. పరిష్కారమునకై తీవ్ర యోచనలను సల్పిరి. సల్పిన యోచనలను వేశ్యా సంస్కరణాలయముల (prehaustorium's) రూపమున ఫలింప జేసిరి.

ఈ సంస్కరణాలయముల నిర్వహణ పద్ధతులు, వాని వలన సిద్ధించిన సత్ప్రయోజనములు మున్నగువానిని గూర్చిన సంగ్రహ - కాని, సమగ్ర - వివరణ మిది:

కాన్పించిన పణ్యాంగనల నందరిని బంధించి సంస్కరణాలయమునకు దెత్తురు. తెచ్చిన ప్రతి యొకర్తెకును తడయకయే వైద్య పరీక్ష జరుపుదురు. ఈ పరీక్ష వలన సుఖసంకటములున్నట్లు నిర్ధారణయైనచో, తగిన యౌషధముల నిచ్చియు, వలసిన విశ్రాంతి నొసగియు చికిత్స చేయుదురు. చేయుచున్న చికిత్సా ఫలితముగా ఆరోగ్యము కొంచెము కుదుట బడినంతనే, ఓపికకు మించని పనిని దేనినైనా కల్పింతురు. ఈ పనినైనను రోజునకు ఏడెనిమిది గంటలు మాత్రమే చేయింతురు. నిర్ణీత కాలము పనిచేసిన పిదప విద్యార్జన మొనర్చుడనియు, నృత్య గానాదుల నభ్యసింపుడనియు, సాంఘిక సేవా పద్ధతుల నలవరచుకొను డనియు, రాజకీయ పరిజ్ఞానమును సంపాదించుకొనుడనియు ప్రోత్సహింతురు. ఊరక ప్రోత్సహించుటయే గాక, సకల విద్యలలో ప్రావీణ్యము గడించుటకు వలయు సౌకర్యములను సమకూర్తురు. ఏ రెండు, మూడేండ్లో సంస్కరణాలయములో నిట్లుంచిన పిదప విడిచి వేయుదురు.

సామాన్యములైనవే, ఈ పద్ధతులు. కాని, వీని నాచరణలో బెట్టు విధము మాత్రము నిరుపమానము!ఉంచునది నిర్బంధములోనే యైనను, ఏ వేశ్యయు దీనిని గ్రహింపలేదు. ఇందుకు కారణములు పెక్కులు. సంస్కరణాలయము దివ్యహర్మ్యమువలె నుండునే గాని, సూర్యరశ్మిని ప్రవేశములేని కారాగృహమువలె నుండదు..

పరిపాలనను కొనసాగించుటకు విద్యాధికుడగు యుద్యోగి యొక్కడు మాత్రమే యుండునుగాని, యమకింకరులను మరపించు వార్డరులుండరు. బయట నుత్సవాదులు జరుగుచున్నప్పుడు వానిలో నిరాటంకముగ పాల్గొనుటకు వీలుండునేగాని, బాహ్య ప్రపంచమును విస్మరింపవలసిన యగత్యము గలుగదు.

రోజునకు ఏడెనిమిది గంటలు ఏదోయొక పనిని విధిగా నెరవేర్పవలసి యున్నను, ఈ నియమము బాధాకరముగా నుండదు. వెట్టిచాకిరి చేయుమనిన గదా, బాధాకరముగ నుండుట! చేసిన కష్టమునకు గాను ప్రతి వేశ్యకును తగిన ప్రతిఫలము నొసగుదురు. ఈ ప్రతిఫలము సగటున నెలకు డెబ్బది రుబుల్సునకు తగ్గదు. దీనినుండి వసతి, భోజనము మున్నగువాని కగు ఖర్చుల క్రింద నలుబది రుబుల్సును మాత్రమే చెల్లించుకొనవలెను. ఎట్లు వెచ్చించినను, ఎందుకు వెచ్చించినను కాదను వారుండరు.

పతితయను కారణముననే సంస్కరణాలయమునకు గొనివచ్చి నప్పటికిని, ఏ గణికను నీచముగ జూడరు. పతితను నీచముగ జూచిన మరింత పతనమందునే గాని, పునీత కానేరదు గదా! వేశ్యల యెదుట వారి పూర్వజీవితమును గూర్చి సంస్కరణాలయోద్యోగు లెవ్వరును పొరపాటున నైన ప్రసంగింపరు. బయటి వారెవరైన ఆ విషయమును గూర్చి ప్రసంగించిరేని, వారవశ్యము శిక్షాపాత్రులగుదురు.

నిరుపమానములై ఈ సంస్కరణాలయ నిర్వహణ పద్ధతుల వలన ఆశీతీతములైన ఫలితములు గలిగినవి. 1928లో మాస్కో నగరమున ఐదు వేశ్యా సంస్కరణాలయము లుండెడివి. వీనిలో మొత్తము నాలుగు వేల మంది వేశ్య లుండెడివారు. 1933 నాటికి ఈ వేశ్యల సంఖ్యను పన్నెండు వందలకు తగ్గింపవలెనని సంకల్పింపబడెను. నిజమునకు, వారి సంఖ్య ఆరు వందలలోపు వరకు తగ్గిపోయెను! మొదటి ఐదింటిలో నాలుగు సంస్కరణాలయములను అవసరము గాన్పింపక పోవుటచే - మూసివేయవలసి వచ్చెను కూడ! మాస్కో నగరమునందు వలెనే తదితరములందును! ఎల్లెడల వేశ్యలు మాయమైరి! పడుపువృత్తి నశించినది! చిరకాలము వెన్నంటి యున్న కళంకము తొలగిపోయినది!

కుటుంబ విచ్ఛిన్నము

1928లో : అదేదో పరిశ్రమను భగ్న మొనర్ప కుట్రపన్నిరని కొందరు ఇంజనీయర్లపై కేసు. ముద్దాయిలలో నొకని కొడుకు తన తండ్రి మరణ శిక్షార్హుడనుచు పత్రికలలో ప్రకటన!

ఇటీవలనే ఒక గ్రామ సోవియటు సంఘాధ్యక్షుని దుర్నడతను గూర్చి విచారణ. ఆ సంఘాధ్యక్షుని కొడుకు లిద్దరును తండ్రికి విరుద్ధముగా సాక్ష్యము! వారి సాక్ష్యముపై అతనికి ప్రవాస శిక్ష! అటు పిమ్మట కొన్ని రోజులకే ఆ బిడ్డ లిద్దరి చిత్రవధ!

ఈ రీతిగ తండ్రి బిడ్డల ప్రేమానుబంధము పూర్తిగా సడలిపోవుటకు కారణమేమి?

సోవియటు ప్రభుత్వం బాలబాలికల విషయమై వహించుచున్న శ్రద్ధ అపారము! కేవలము అపారమేకాదు, అపూర్వముకూడ!! అది ఉచితముగనే వారికి విద్యను గరపుచున్నది. ఉచితముగనే వైద్య సహాయమును గావించుచున్నది. అవసరమైనచో, ఉచితముగనే భోజన సదుపాయములను సయిత మొనర్చుచున్నది. ఇంతేకాదు. వారి నిమిత్తము ప్రత్యేకముగా నాటకములను ఆడించుచున్నది; ఫిల్ములను తయారు చేయించు చున్నది; పార్కులను వేయించు చున్నది; ఎన్నో వినోద యాత్రలను ఏర్పాటు గావించుచున్నది!

కొన్ని చట్ట నిబంధనలను గావించి, అది వారి హక్కులను కాపాడుచున్నది కూడ! బిడ్డలను హింసించిన తల్లిదండ్రులకు శిక్ష! బెత్తము నుపయోగించిన ఉపాధ్యాయునికి శిక్ష ఏ బాలుడైనను, బాలికయైనను పదు నాలుగు వత్సరముల ప్రాయము వచ్చినంతనే కోరినచో - తన పేరును మార్చుకొనవచ్చును. ఒక్క పేరునే కాదు, మతమును సయితము!

సోవియటు ప్రభుత్వం బాలబాలికలను చులకనగ చూడక, వారిచే చిన్న చిన్న పనులను పెక్కింటిని చేయించుచున్నది. వారిచ్చు సలహాలను శ్రద్ధగా వినుచున్నది. ఆ సలహాలు సరియైనవైన, వానిని పాటించుచున్నది. ఇందువలన బాలబాలికలెల్లరును సామ్యవాద విజయసిద్ధికి తాముకూడ వహింప వలసిన బాధ్యత గలదని గ్రహించి, అందుకు తగినట్లే వర్తించుచున్నారు.

తల్లి, తండ్రి, మిత్రుడు, బాంధవుడు అను విచక్షణ లేశమైనను చేయక, అందరిని కాదని, బాల బాలికలు సామ్యవాద విజయమే తన ఏకైక లక్ష్యమని భావించుటకు సోవియటు ప్రభుత్వం వారియెడ జూపుచున్న ఈ శ్రద్ధాభక్తులే కారణములు. కాని, కొంతవరకు మాత్రమే! రష్యను సామ్యవాద విప్లవములో ఏదో మహత్తరమైన ఆకర్షణశక్తి యున్నది. ఆ శక్తి బాలబాలికల హృదయములను చూరగొనినది. అందుచేతనే తల్లిదండ్రులకు బిడ్డలు కాకుండ పోవుచున్నారు! అందుచేతనే కుటుంబము విచ్ఛిన్నమగుచున్నది!

రష్యను కుటుంబము విచ్ఛిన్నమగుటకు మరొక కారణము సయిత మున్నది. 'స్త్రీ స్వాతంత్ర్యము', 'సాంసారిక జీవనము' అను ప్రకరణములలో పేర్కొనబడిన రీతి, నేటి రష్యాలో స్త్రీ పురుషునికి దాస్యము గావింపవలసిన యగత్యము లేదు. ఆర్థికముగనేమి, సాంఘికముగనేమి, రాజకీయముగనేమి, తదితర విధములనేమి ఆమెకు పురుషునితోబాటు సంపూర్ణ స్వాతంత్ర్య మున్నది. ఇది నామమాత్రపు స్వాతంత్ర్యము కూడా కాదు.

ఇందుకు నిదర్శన మిది: నిండు గర్భవతియై యున్నప్పుడును, బాలింతగా నున్నప్పుడును స్త్రీ పనిపాటలకు పోలేదు గదా! ఇట్టి సందర్భములలో ఆమె పోషణను గూర్చి తగిన శ్రద్ధ వహింపబడకున్న, ఆమెకు గల ఆర్థిక స్వాతంత్ర్యము కొంతవరకు నిరర్థకమే! ఉన్న స్వాతంత్ర్య మిట్లు నిరర్థకము కాగూడదనియే సోవియటు ప్రభుత్వం క్రింది నియమములను గావించినది:*(H.N.Brailsford: How the Soviet Work.)*

కార్మికురాలికి నీళ్ళాడుటకు ముందు రెండు నెలలును, నీళ్ళాడిన తర్వాత రెండు నెలలును సెలవు నివ్వవలెను.
ఈ నాలుగు నెలలకును పూర్తి కూలిని చెల్లించుటయే గాక, పురుడు పోసికొనినంతనే ఆమెకు కొంత మొత్తమును అదనముగా నివ్వవలెను. ఇది ఆయా కార్మికురాలి నెల కూలిలో సగమై యుండవలెను.

సెలవు పూర్తియైన వెంటనే, తిరిగి పనిలో ప్రవేశించు కార్మికురాలి బిడ్డను పనివేళలో లాలన పాలన చేయుటకు ప్రతి పరిశ్రమాగారమును స్వంత ఖర్చుతో శిశు సంరక్షణాలయమును ఏర్పాటు చేయవలెను. బిడ్డకు పాలిచ్చు నిమిత్తము ఉదయము అరగంటయు, సాయంత్రము అరగంటయు ఆమెకు అవకాశ మియ్యవలెను.

బిడ్డకు ఆరు నెలలు నిండువరకు మామూలు కూలిలో ఎనిమిదవ వంతును ఆమెకు అదనముగా నిచ్చుచుండవలెను.

ఇంతటి సంపూర్ణ స్వాతంత్ర్యము స్త్రీ కున్నప్పుడు కుటుంబ విచ్ఛిన్నము జరిగి తీరునుగదా! పైగా, ప్రజలందరును ఇంటి వద్ద వంట ప్రయత్నమును పెట్టుకొనక హోటల్సులోనే భోజనము చేయుటకును, తామే బిడ్డలను పెంచక, వారిని శిశు సంరక్షణాలయముల కొప్పగించుటకును క్రమక్రమముగ నలవడుచున్నారు. ఈ వివిధ కారణముల వలన రష్యను కుటుంబము విచ్ఛిన్నమై పోవుచున్నది.

ఇట్లు కుటుంబము విచ్ఛిన్నమై పోవుట సామ్యవాద విజయసిద్ధికి పెద్ద ప్రతిబంధకము తొలగుటయే! ఏలనన: కుటుంబము సుస్థిరముగ నున్నంతవరకు మానవుడు స్వంతమునకు ఆస్తిని గడించుకొన ప్రయత్నింపక మానడు! *(Bertrand Russel : Marriage and Morals.)* ఇట్టి ప్రయత్న మున్నంతవరకు సామ్యవాద విజయము గగన కుసుమముగాక మానదు!

ప్రణాళిక



పొలమును దున్నినంతనే పైరు ఇంటికి రాదు. ఎరువును కట్టవలెను. విత్తనములను జల్లవలెను. నీటిని పెట్టవలెను. కలుపును తీయవలెను. మరెంతో శ్రమపడవలెను. అప్పుడుగాని దున్నినచేను పండదు; చేసిన కష్టము ఫలింపదు. ఇట్లే విప్లవమును జరిపి రాజ్యాధికారమును బడసినంతనే సామ్యవాద విజయము సిద్ధింపదు. తగిన పరిస్థితులున్న విప్లవము సులభమే! ఆ తరువాతిదే కష్టమంతయును!

మాటలతో సిద్ధించునది కాదు, సామ్యవాద విజయము! పూర్వ విశ్వాసములను పోద్రోలవలెను. పురాతన సాంఘిక వ్యవస్థలను రూపుమాపవలెను. అసలు వెనుకటి మానవ ప్రకృతినే నశింప జేయవలెను. ఇంతటితో సరిపోదు. వ్యవసాయమును వృద్ధి పరుపవలెను. పరిశ్రమలను పెంపొందింపవలెను. విద్యను వ్యాప్తి గావింపవలెను. విజ్ఞానమును వెదజల్లవలెను. సహకార... వేయేల? నూత్న మానవ సంఘమును ప్రతిష్ఠింపవలెను. ఈ సంఘమున పంటను పండించు వాడొకడును, పండిన పంటను అనుభవించువాడు వేరొకడును కారాదు. వస్తువుల నుత్పత్తి గావించు వాడొకడును, ఉత్పత్తియైన వస్తువుల వలన వచ్చు లాభమును తినువాడు మరొకడును కాగూడదు. కష్టము చేయువానికే కూడు - వానికే గుడ్డ - వానికే చదువు - వానికే ఓటు - వానికే రాజ్యము - సమస్తమును వానికే! ఇక, కష్టమును చేయనొల్లని వానికో? అట్టి వాడెవ్వడు మిగులడు గనుక, ఆ ప్రశ్నయే రాదు!

సామ్యవాద విజయసిద్ధికై నిర్వర్తింపవలసిన ఈ బహుళ కార్యకలాపముల పట్టున 'గుడ్డెద్దు చేనులో పడి' నట్లుండ వీలుపడదు. ఒక పద్ధతిని - ఒక ప్రణాళికను జాగ్రత్తగ నిర్ణయించ కొనవలెను. దానిని తు.చ. యైనను తప్పకయే

అనుసరింపవలెను. వహింపవలసిన భారము గురుతరము గాన, ఒక్కసారియే సర్వమును నిర్ణయించి వేయుట కూడ భావ్యము కాదు.

ఏ నాలుగైదు వత్సరములకనియో ముందు ప్రణాళికను సిద్ధము చేయవలెను. ఆచరణలోనికి దెచ్చుటలో లభించిన యనుభవమును పురస్కరించుకొని తిరిగి క్రొత్త ప్రణాళికలను సిద్ధపరచు చుండవలెను. ఇట్లొక నిర్ణీత పద్ధతిపై నడువని యెడల అభీష్టసిద్ధి ముమ్మాటి కొనగూడదు. ***(Karl Marx: Capital, Vol.1.)***

ఈ సంగతి నెరిగియే సోవియటు ప్రభుత్వం వారు 1928వ సంవత్సరంలో ప్రణాళిక నొకదానిని ప్రవేశపెట్టిరి. దాని నైదు వత్సరములలో ముగింపవలెనని వారు సంకల్పించిరి. అందుచేతనే దానికి 'పంచవర్ష ప్రణాళిక' యని పేరు వచ్చినది.
పంచవర్ష ప్రణాళికను ప్రవేశపెట్టినప్పుడు రష్యను విదేశాంగ వ్యవహారము లతి భీభత్సముగ నుండెను. ఇంగ్లండు అలిగి బిగదీసెను. అమెరికా పెట్టిన పెడమొగము నట్లేయుంచెను. ఫ్రాన్సు సణుగుడు మానదయ్యెను. పోలెండు కుప్పిగంతులను వేయుచునే యుండెను. చైనా పిలిచి కయ్యమును పెట్టుకొనెను. టర్కీ, జర్మనీలకు దక్క మరే దేశములకును రష్యా యనిన సానుభూతి లేకుండెను. ఈ రెండు దేశములైనను అంతంత మాత్రపు సానుభూతినే గాని, గాఢాభిమానమును జూపకుండెను.

ఇక, దేశాంతర్గత వ్యవహారములింతకన్న నధ్వాన్నముగ నుండెను. ట్రాట్స్కీని పారిశ్రామిక దేశములన్నిటిలో విప్లవములు చెలరేగి, సోవియటు ప్రభుత్వములు స్థిరపడక ముందు, ఒక్క రష్యాయే పంచవర్ష ప్రణాళికను ప్రవేశపెట్టి, దానిని నెగ్గింప నెంచుట కేవలము వెర్రియని శరించిన ట్రాట్స్కని - సామ్యవాద సంఘము నుండి బహిష్కరింపవలసి వచ్చెను. అతని యనుచరులలో వందలమందిని చెరసాలలో బంధింపవలసి వచ్చెను.(Leon Trotsky: Real Situation in Russia, Joseph Stalin, Leninism.) ఇక్కారణమున దేశములో నుదయించిన మహాసంచలనమును, తీవ్ర సంక్షోభమును, ఘోర.....

బయటనో, సానుభూతి లేకుండెను. లోపలనో, అశాంతి తరంగములు మిన్ను ముట్టి యుండెను. బహు క్లిష్టములైన ఈ పరిస్థితులను నిర్లక్ష్య మొనర్చుట సాధ్యమే యనుకొన్నను, ఎన్నదగిన ధనముగాని, పరికరములుగాని, కార్యచతురత గాని లేకుండెను. ఇకనున్నదేమి? సామ్యవాద విజయ మమోఘమను విశ్వాసము మాత్రమే! ఏది యున్నను, ఏది లేకపోయినను ముఖ్యముగ గావలసినది కూడ ఈ విశ్వాసమే! ఇది యున్నచో, సాధ్యముగాని కార్యములేదు; ఇది లేని యెడల, సాధ్యమగునదియు లేదు. విశ్వాసము వలన శక్తివచ్చును; సాహసము గలుగును! ఇది లేకపోయెనేని నీరసము, పందతనము మిగులును!!

ప్రతిబంధకము లెన్నియున్నను, విజయము తమదే యనుచు సోవియటు ప్రభుత్వము వారు కార్యాచరణకు గడంగిరి. అనినట్లే వారికి విజయము సిద్ధించెను కూడ! ఐదు వత్సరములకని సిద్ధపరచిన ప్రణాళిక నాలుగేండ్లలోనే పరిసమాప్తి యయ్యెను!

పంచవర్ష ప్రణాళికను ప్రవేశపెట్టి, పరిశ్రమలకు సంబంధించినంత వరకు సోవియటు ప్రభుత్వం వారు సాధింప గలిగిన ఫలితము లివి :

1933లో - ప్రణాళికను ముగింపవలసిన వత్సరములో - 12,600 రైలు పెట్టెలను తయారుచేయ గలిగి యుండవలెనని అసలు సంకల్పము. కాని, 1931లోనే - ప్రణాళికను ప్రవేశపెట్టిన మూడవ వత్సరములోనే - 20,000 పెట్టెలు

తయారయ్యెను. ఇట్లే 1933లో 825 రైల్వే ఇంజన్లును నిర్మింపగలిగి యుండవలెనని మొదటి యుద్దేశము. ఐనను, 1931లోనే 812 ఇంజన్లు నిర్మింపబడెను. 1928లో మోటారుకారు ఒక్కటైనను రష్యాలో తయారయ్యేడిది కాదు. కాని, 1932లోనే 26,700 మోటార్లు తయారయ్యెను. 1913లో రష్యా మొత్తమున కుట్టబడిన చెప్పుల జతలు 1 కోటి 70 లక్షలే. ఈ సంఖ్య 1931లో 6 కోట్ల 70 లక్షలకు వృద్ధినందెను. 1913లో నుత్పత్తియైన సబ్బు 94,000 టన్నులు మాత్రమే. ఈ యుత్పత్తి 1931లో 1,89,000 టన్నులకు పెరిగెను. ఇట్లే తదితర పరిశ్రమలందును ఎంతో వృద్ధి గాన్పించెను. అంతకు పూర్వము పెట్రోలు పరిశ్రమలో చాల వెనుకబడియున్నను, 1931కే ద్వితీయ స్థానము లభించెను. ఇక, వ్యావసాయిక పరికరములు పరిశ్రమలో దాదాపుగా నగ్రస్థానమే! *(G.Y. Grinko: Five Year Plan of the Soviet Union.)*

ప్రణాళిక కారణముగ రష్యా పారిశ్రామికముగ బడసిన లాభము క్రింద యంకెల వలన మరింత స్పష్టపడగలదు:

ఉత్పత్తిలో వృద్ధి క్షయములు -1928లో సరిపోల్చినప్పుడు

	1924	1928	1932
జర్మనీ	69	100	61
ఫ్రాన్సు	89	100	76
బెల్జియం	77	100	68
ఇంగ్లండు	95	100	88
జెకొస్లొవాకియా	74	100	59
పోలెండు	73	100	54
అమెరికా సంయుక్త రాష్ట్రములు	86	100	58
సోవియటు రష్యా	30	100	200

ఉత్పత్తియైన వస్తువుల విలువ (రుబుల్సులో)

1926	770 కోట్లు
1931	3080 కోట్లు *GDH & MI Cole: Europe Today*

ఇక, వ్యవసాయమునకు సంబంధించినంత వరకు చేకూరిన ఫలితము లివి :

1928లో ఏ రైతున కారైతు స్వంతముగ సేద్యము చేయుచున్న మొత్తము భూమిలో 1/5 వంతును 1933 నాటికి సమష్టి వ్యవసాయపద్ధతి (collective cultivation) క్రిందకు తేవలెనని అసలు సంకల్పింపబడెను. సాధింప సంకల్పింపబడిన ఈ కార్యము సామాన్యమైనది కాదు. ఐనను గడువునకు ముందే మూడంతల పని జరిగెను! 1932 నాటికి 2 లక్షల సమష్టి వ్యవసాయ సంఘములు (collectives) స్థాపింపబడెను; 5 వేల ప్రభుత్వ వ్యవసాయ కేంద్రములు (State Farms) నెలకొల్పబడెను; 5 కోట్ల 20 లక్షల ఎకరముల భూమి కొత్తగా సాగుబడిలోనికి తేబడెను. ఇందుమూలమున మొత్తము పంట భూమిలో 3/5 వంతు సమష్టి వ్యవసాయ పద్ధతి క్రిందకు వచ్చెను; 1/5 వంతు ప్రభుత్వ వ్యవసాయ కేంద్రముల స్వాధీనమాయెను. ఇకపోగా మిగిలిన 1/5 వంతు మాత్రమే తమంతట సేద్యము సాగించుచున్న రైతుల చేతులలో నిలిచెను!

ప్రణాళిక కారణముగ సహకారోద్యమ మిట్లు వ్యాప్తినందెను:

సహకార వస్తునిలయముల సభ్యుల సంఖ్య	1928	1932
వీని ద్వారా జరిగిన వ్యాపారము	2 కోట్లు	7.5 కోట్లు
	75 కోట్లు	175 కోట్లు

ఇది దేశపు మొత్తము వ్యాపారములో నూటికి ఎన్నోవంతు= 50 పౌనులు→ 70 పౌనులు

మరిపెక్కు వివరములతో పాఠకులను విసిగించుటకు బదులు, పంచవర్ష ప్రణాళిక వలన రష్యాకు ఆర్థికముగ సిద్ధించిన లాభమును క్లుప్తముగ నిట్లు పేర్కొనవచ్చును. 1928లో కంటె జాతీయాదాయము నూటికి 85 వంతులును, కార్మికుని రాబడి 67 వంతులును, ఉచితభీమా నిధి (Social Insurance Fund) 292 వంతులును వృద్ధినందుట!'(Joseph Stalin: State of the Soviet Union) అతి ఘనమైనదే ఈ లాభము! కాని

తదితరవిధముల సిద్ధించిన లాభము దీనికెన్నో రెట్లు హెచ్చు! పంచవర్ష ప్రణాళికను ప్రవేశపెట్టక మునుపు యంత్రసామగ్రి, వ్యవసాయ పరికరములు, యుద్ధసాధనములు మున్నగువానిని పెక్కింటిని విదేశములనుండి దిగుమతి గావించుకొనవలసి యుండెడిది. ఇందువలన ధనరూపమున నష్టపడవలసి వచ్చుటయే గాక, విదేశములకు పారిశ్రామికముగ దాస్యము గావింపవలసి వచ్చెడిది! గత జర్మనీ యుద్ధ కాలమునందును, ఆ పిమ్మటను కూడ జరిగిన రీతి, ఏ కారణము చేతనైనను ఎగుమతులు నిలిచి పోయినచో, నిస్సహాయ స్థితికి దిగజారవలసి వచ్చెడిది. ఈ చిక్కులన్నిటిని పంచవర్ష ప్రణాళిక తప్పించినది. ఈనాడు పారిశ్రామిక దేశములన్నియు ఒక్కమాటకు వచ్చి, ఎగుమతులను చేయుట మానివేసినను, రష్యా తనకు కావలసిన వస్తుజాలము నంతటిని తానే యుత్పత్తి గావించుకొనగలదు!

రష్యను భూములు కడు సారవంతమైనవే! ఐనను పూర్వదినములలో పంట చాల చచ్చుగ నుండెడిది. ఇందుకు నిదర్శన మిది: 1914లో రష్యా దేశమున ఒక ఎకరమునకు పండిన పంట కంటె ఫ్రాన్సు, ఆస్ట్రియాలలో ఆ ఎకరమునకే 2 రెట్లును, ఇంగ్లండు జర్మనీలలో 3 రెట్లును, డెన్మార్కులో 4 రెట్లును పంట రాలెను! జర్మనీ యుద్ధమునకు పూర్వము అమెరికాలో సగటున ఎకరమునకు రూ.600 లు సాలీనా ఆదాయము వచ్చెడిది. కాని, రష్యాలో రూ.60 లకు మించెడిది కాదు.(Scott Nearing and Jack Hardy: The Economic Organization of the Soviet Union) భూమి సారవంతమైనదే యైనను, పంట ససిగ నుండకుండుటకు ఆనాటి రష్యను కర్షకుని చిత్తవృత్తియే కారణము! అతడు కష్టపడి పనిచేయ నిచ్చగించెడువాడు కాదు. మూడు నెలలు పొలములో పనిచేసిన, ఆరు నెలలు ఇంట గూర్చుండెడివాడు. తనకున్న కుంటనో, ఎకరమునో తాతలనాటి పద్ధతుల ప్రకారము తానే సేద్యము చేయుచుండెడి వాడుగాని, క్రొత్త వ్యవసాయ పద్ధతుల నవలంభించుటకును, నలుగురితో సహకార మొనర్చుటకును అంగీకరించెడువాడు కాదు. అదునులో వర్షము పడి, నాలుగు గింజలు పండిన తినుచుండెడివాడు. లేనిచో 'నొసట వ్రాసిన వ్రాలును తప్పింప నెవరి తరము!' అను శుష్క వేదాంతముతో సంతృప్తి పడుచుండెడివాడు. *(EJ Dillion: Tussi an Traits)*

కర్షకుని ఈ చిత్తవృత్తిని పంచవర్ష ప్రణాళిక పూర్తిగా మార్చివైచినది. నే డతడు సమష్టి వ్యవసాయ సంఘములలో జేరుటకును, క్రొత్త వ్యవసాయ పద్ధతుల నవలంభించుటకును, రేయింబవలు కష్టించి పనిచేయుటకును ముందడుగు వేయుచున్నాడు. నేటి రష్యను కర్షకుడు విధి చేతిలోని కీలుబొమ్మ కాదు! ఆశతో, జీవముతో నొప్పారుచున్న పురోగామి!

స్వలాభమునకై వ్యక్తిపరముగ జరుపబడు వ్యాపారము (private trade)ను చంపియు, నిరుద్యోగ సమస్యను పరిష్కరించియు, సైనిక బలమును కూర్చియు ప్రణాళిక చేసిన లాభము కూడ సామాన్యమైనది కాదు!

సిద్ధించిన ఈ లాభముల నన్నిటిని గాంచి, ద్విగుణీకృతోత్సాహులై, సోవియటు ప్రభుత్వము వారు 1932లో క్రొత్త ప్రణాళికను మరొక దానిని ప్రవేశ పెట్టిరి. ఈ ప్రణాళిక సయితము ఐదు వత్సరములకనియే సిద్ధపరుప బడినది గనుకను, ప్రణాళికలలో నిది రెండవది గనుకను, దీనికి 'ద్వితీయ పంచవర్ష ప్రణాళిక' యను పేరు వచ్చినది.

ఈ ద్వితీయ పంచవర్ష ప్రణాళిక 1934 లో సాంతము కావలెను. ఆనాటికి యంత్రములు, యంత్రసామగ్రి మున్నగు వాని (producers goods) సాలీనా యుత్పత్తిని 2 1/2 రెట్లును, దైనందిన జీవితావశ్యకములైన వస్తువుల (consumable goods) సాలీనా యుత్పత్తిని 3 రెట్లును వృద్ధిగావింప సంకల్పింపబడినది. ప్రస్తుతము దైనందిన జీవితాశ్యకములైన వస్తువుల యుత్పత్తి తగినంతగ లేకుండుట వలన, ప్రజలు చాల చిక్కుపడుచున్నారు. ఈ చిక్కు 1937 నాటికి తొలగిపోగలదనియే ఆశింపబడుచున్నది.*(Molotov:The Second Five Year Plan)*

ప్రథమ పంచవర్ష ప్రణాళిక వలె, ద్వితీయ ప్రణాళిక కూడ జయప్రదముగ నిర్వహింపబడెనేని, సకల కృత్రిమ భేద విరహితమైన సమష్టి మానవ సంఘము (classless society) స్థాపితము కాగలదు.

విద్యా వ్యాప్తి



విద్య విశేషముగ వ్యాప్తమైయున్న దేశమున నిరంకుశ ప్రభుత్వము నిలువలేదు. విద్య వలన రాజకీయ పరిజ్ఞానము గలుగును; స్వాతంత్ర్య ప్రేమ జనించును. అందుచేతనే నిరంకుశ ప్రభువులు విద్యను వ్యాప్తము గానీయరు. జారు ప్రభువులు నిరంకుశులే! కనుకనే వారికి విద్యా వ్యాపక మనిన కంటకముగ నుండెడిది. ఈ సంగతిని వారు కప్పిపుచ్చెడు వారు కాదు కూడ! మొదటి అలెగ్జాండరు చక్రవర్తి పరిపాలనా కాలమున అతని విద్యామంత్రి 'ప్రజా బాహుళ్యమునకు విద్య నేర్పుట వలన వచ్చు లాభము కంటే నష్టమే హెచ్చు!' అని పలికెను. మూడవ అలెగ్జాండరు చక్రవర్తి 'సాధ్యమైనచో, విద్యను పూర్తిగ రద్దు చేయదగు' ననుచు, అదేదో సందర్భమున స్పష్టముగ వ్రాసెను!

ఆ దినములలో ప్రభుత్వకోశాగారము నుండి బహు స్వల్ప మొత్తమే విద్య నిమిత్తము వెచ్చింపబడు చుండెడిది. ఆ స్వల్పములో గూడ నధికాంశమును విశ్వవిద్యాలయములే కబళించు చుండెడివి. అందువలన జనసామాన్యమునకు అందుబాటులో నుండు ప్రాథమిక, మధ్యమ, ఉన్నత పాఠశాలలు చాల తక్కువగ నుండెడివి.

ఉన్న నాలుగు పాఠశాలలోనైనను స్వాతంత్ర్యము బొత్తుగ నుండెడిదికాదు. ప్రత్యల్ప విషయమునకును బాలుడు ఉపాధ్యాయుని యనుజ్ఞను బడయవలసి వచ్చుచుండెడిది. సభలకు పోదలచిన, అనుజ్ఞ! సమావేశాలలో పాల్గొనదలచిన, అనుజ్ఞ! నాటక ప్రదర్శనములను చూడగోరిన, అనుజ్ఞ! తుదకు గ్రంథాలయముల నుపయోగించు కొనుటకు సయితము

అనుజ్ఞయే! మాతృభాష ఏదైనను, ఒక్క రష్యను భాషలోనే బోధనయంతయు గావింపబడు చుండెడిది. ఇక, పరీక్షలు కసాయికోతలే! నూటికి రమారమి డెబ్బదిమంది పరీక్షలలో తప్పింపబడు చుండెడివారు! ఉపాధ్యాయులు విద్యా ప్రచారమను పేరున రాజభక్తిని పెంపొందించు చుండెడి వారు. 'జారు చక్రవర్తి యెడ నీవు భక్తి విశ్వాసములను చూపవలెను. ఆయనకు నిరంతరము సేవ చేయవలెను. శిస్తులను సక్రమముగ చెల్లించు చుండవలెను. లేనిచో, నీకు నరకమే!' అని బాలుర పాఠ్య గ్రంథములలో వ్రాయబడి యుండెడిది!*(Lucy :LW Wilson: New Schools in New Russia)*

జారు చక్రవర్తులు విద్య యెడ జూపిన ఈ సవతి తల్లి ప్రేమ వలననే వారి పరిపాలనా కాలమున నగర వాసులలో నూటికి 40.6 వంతుల చొప్పునను, గ్రామ ప్రజలలో నూటికి 72.2 వంతుల చొప్పునను నిరక్షరకుక్షు లుండెడివారు. వారి, 'హయాము'లో రష్యా విద్యావిషయమున ఎట్టి శోచనీయ స్థితియందుండెడిదో క్రింది పట్టిక వలన తెలియగలదు.

దేశ ప్రజలలో చదువుకొనుచున్న వారు (1904లో నూటికి)

అమెరికా (USA)	23
జర్మనీ	19
ఫ్రాన్సు	16
ఇంగ్లండు	16
రష్యా	3 (!!)

తమ నిరంకుశాధికారమునకు చేటు దెత్తురను భయమున జారు చక్రవర్తులు శతాబ్దముల తరబడి ఈ రీతిగ నిరక్షరకుక్షులుగా నుంచిన పదునైదు కోట్ల మంది ప్రజలకు విద్య గరపవలసిన భారము సోవియటు ప్రభుత్వము వారిపై బడెను. పైబడిన ఈ భారము సామాన్యమైనది కాదు. ఐనను, వారు లేశమైనను సంకోచింపక, విద్యా ప్రచార ప్రయత్నములకు గడంగి -

అనతి కాలములోనే అపూర్వములైన ఫలితములను సాధింపగలిగిరి. ఇందుకు క్రింది అంకెలే నిదర్శనములు :

విద్యార్థులు	1914	1932
ప్రాథమిక	70.00	190.00
మధ్యమ	5.00	45.50
విశ్వవిద్యాలయ	1.25	11.00(లక్షల్లో)
పారిశ్రామిక	2.67	8.5
తదితర	- -	11

1920 లో చదువు రానివారు మగవారిలో నూటికి 60 వంతులు; ఆడువారిలో నూటికి 70 వంతులు, మొత్తము ప్రజలో నూటికి 68 వంతులు. 1932లో చదువు రానివారు మొత్తము ప్రజలో నూటికి 9 వంతులు మాత్రమే!
సోవియటు ప్రభుత్వమువా రిట్లు విద్యను విశేషముగ వ్యాపింపజేయుటయే గాక, విద్యా మార్పులను కూడ తెచ్చిరి. ఈ మార్పులలో ప్రధానములైన వివి:

విధానమున పెక్కు పూర్వదినములలో ప్రతి విద్యాలయము నందును మత బోధ గావింపబడు చుండెడిది. కేవలము మత బోధకే ఉద్దేశింపబడిన విద్యాలయములు కూడ పెక్కులుండెడివి. నేడు ఏ విద్యాలయము నందున పిన్న వయస్కులకు మతమును బోధింపరాదు. ఇక, ప్రభుత్వ విద్యాలయములలో మతబోధ అసలే కూడదు.

పూర్వ దినములలో ఒక్క రష్యను భాషలోనే బోధన యంతయు గావింపబడు చుండెడిది. అందువలన ఆ భాష రానివారికి విద్య నభ్యసించుట కష్ట మనిపించెడిది. నేడు వివిధ జాతుల వారికి వారి వారి జాతీయ భాషలలోనే విద్యాలయములు నడిపింపబడుచున్నవి. మొత్తము డెబ్బది భాషలలో ప్రస్తుతము బోధన గావింపబడుచున్నది. మొన్న మొన్నటి వరకు ఈ భాషలలో కొన్నింటికి లిపియేనియు లేకుండెడిది. ఇట్టివానికి లిపి ఏర్పరుపబడినది. లిపిలో గ్రంథములు, వ్యాకరణములు, శబ్దార్థ చంద్రికలు మున్నగునవి అసంఖ్యాకములుగ ముద్రింపబడినవి.

పూర్వ దినములలో విద్యార్థులకు లేశమైనను స్వాతంత్ర్య ముండెడిది కాదు. నేడు వారికి గల స్వాతంత్ర్యము అపారము! వారు బోధనా పద్ధతులను విమర్శింపవచ్చును. జాతీయ జీవనమున హృదయపూర్వకముగా పాల్గొనవచ్చును.

పూర్వ విద్యా విధానములో మార్పులను దెచ్చుటతోనే సంతృప్తి నొందక, సోవియటు ప్రభుత్వం వారు పెక్కు క్రొత్త దారులను కూడ త్రొక్కిరి. రష్యాలో నేడు 'కిండర్ గార్టెన్సు' (kindergartens) వేల సంఖ్యపై నున్నవి. 1932లో కోటిమంది పసిబిడ్డలు వానిలో శిక్షణ బడసిరి. 1937 నాటికి - ద్వితీయ పంచవర్ష ప్రణాళిక సాంతమగు నాటికి - ప్రతి పసిబిడ్డకును 'కిండర్ గార్డెన్' శిక్షణ లభింపజేయవలె ననెడి మహత్తర సంకల్పముతో ప్రస్తుతం ప్రయత్నములు జరుపబడుచున్నవి.(Maurice Dobb: Russia Today and Tomorrow)

కార్మికులకును, కర్షకులకును, సైనికులకును, నావికులకును - ఒక్కమాటలో - వయోజను లందరికిని విద్య గరపు నిమిత్తము ప్రత్యేక పాఠశాలలు స్థాపింపబడినవి. ఇవి పరిశ్రమా గారములు, కార్మిక సంఘములు మున్నగు సంస్థలిచ్చు విరాళములతో పోషింపబడు చున్నవి. సాంఘిక సేవాతత్పరులైన విద్యార్థులును, తదితర యువజనులును ఈ పాఠశాలలను నడుపు చున్నారు. వీనిద్వారా జరుగుచున్న పనిని క్రింది అంకెల వలన కొంతవరకు గ్రహింపవచ్చును.

ప్రత్యేక పాఠశాలలలోని విద్యార్థుల సంఖ్య

1921-22	4,56,000
1926-29	15,54,000
1931-32	1,36,31,000

కేవలం పాఠశాలలే గాక, వార్తా పత్రికలు, సంచార గ్రంథాలయములు, చిత్ర వస్తు ప్రదర్శనాలయములు, నాటక రంగములు, సినిమా ప్రదర్శనములు, రేడియో ఉపన్యాసములు మొదలగు పెక్కు సాధనలు కూడ విద్యా ప్రచారమునకు వినియోగింపబడు చున్నవి.

విద్యాశాఖకై ఎంత వెచ్చింపవలసి వచ్చినను సోవియటు ప్రభుత్వం వారు వెనుదీయుట లేదు. జారు చక్రవర్తులు సగటున ఒక్కొక్క విద్యార్థి నిమిత్తము 10 రుబుల్సు మాత్రమే ఖర్చు పెట్టు చుండెడివారు. ఇక, సోవియటు ప్రభుత్వం వారు 1928లో సగటున ఒక్కొక్క విద్యార్థికి 43 రుబుల్సు చొప్పునను, 1929లో 52 రుబుల్సు చొప్పునను, 1930లో 63 రుబుల్సు చొప్పునను వెచ్చించిరి!

మరి నాలుగేండ్లకు చదువురానివాడు ఒక్కడైనను రష్యాలో మిగులబోడని సోవియటు ప్రభుత్వం వారు చెప్పుచున్నారు. జరిగిన విద్యా వ్యాప్తిని బట్టియు, జరుగుచున్న దానిని బట్టియు మనము 'ఔ' ననవలెను గదా!



జైళ్ళు

నేరస్థుని శిక్షింప వలసినది దేనికి? కేవలం కసి తీర్చుకొనుటకా? లేక, మరెవ్వరును అట్టి నేరమునే చేయకుండు నట్లు ప్రజా బాహుళ్యమును బెదరించుటకా? ఇదియును గాక పోయినచో, వాని యభ్యుదయమునే కాంక్షించి, ఎట్లయిన వానిని దుర్మార్గము నుండి తప్పించు నిమిత్తమా? ఈ ప్రశ్నలకు సరిగ సమాధాన మొసగవలెనన్న, ఏ యే కారణములు నేరమునకు పురికొల్పు చుండునో పరిశీలింపవలెను.

జన్మసిద్ధి ప్రవృత్తి కారణముగ నేర మొనర్చు వారి సంఖ్య అత్యల్పము. ఇక, పరిసరముల ప్రభావము వలననో, పరిస్థితులు తప్పి వచ్చుట వలననో, తాత్కాలికోద్రేకము కన్నుగప్పుట వలననో, హెచ్చుమంది నేర మొనర్చు చుందురు. ఇట్టి యెడ, నేరస్థునిపై కసి దీర్చుకొన నెంచుటయు, వానిని కఠినముగ శిక్షించి, అట్టి నేరమునే చేయకుండునట్లు ప్రజా బాహుళ్యమును బెదరింప దలచుటయు, అర్థ విహీనములు. పోగా, నేరస్థుని సంస్కరించి, సన్మార్గమున బెట్ట సంకల్పించుటయే ధర్మము. అదియే సంఘ శ్రేయోదాయకము కూడ!

కాని, ఒక్క రష్యాలో దప్ప మరెచ్చటను ఈ సత్సంకల్పమునకు తావులేదు. ఉండుట కవకాశము సయితము లేదు. ఇది - పూర్తిగ గాకున్నను, కొంతవరకైనను - అత్యుక్తియని భావింతురేమో? ముమ్మాటికిని కాదు.

ఎవడో యొకడు హత్యానేరము నొనర్చె ననుకొనుడు. సర్వసాధారణముగ వానికేమి శిక్ష విధింపబడును? మరణ దండనమేగదా! నూరింట తొంబది తొమ్మిది హత్యలు కన్నుమిన్ను గానని తాత్కాలికోద్రేకములో జరిగిపోవును. కనుక, నూటికి తొంబది తొమ్మిది మంది హంతకులను సంస్కరించి, సచ్చరిత్రులుగా నొనర్చుట, సాధ్యముగాని పనికాదు. సాధ్యాసాధ్యముల ప్రశ్నతో నిమిత్తము లేకుండగనే నూటికి నూరు మందికిని మరణశిక్ష విధింపబడుచున్నది! 'నీ వొకని చేతిని న రికితివి గాన, మేము నీ చేతిని నరుకుదుము; నీ వొకని కంటిని పొడిచితివి గాన, మేము నీ కంటిని పొడుచుదుము' అను యనాగరక జాతుల కాని, శిక్షాస్మృతి కిది తీసిపోదు. 'మరణ దండనమే లేకపోయిన, హత్యల సంఖ్య పెచ్చు పెరుగదా?' యని ప్రశ్నించువా రుండకపోరు. కాని, మరణ శిక్ష విధింపబడు నన్న సంగతి తెలియకనేనా, నేడు హత్యలు జరుగుట! ఆ పిచ్చి యుద్రేకము గలిగినప్పుడు, ఎవ్వడును మరణశిక్షను, గిరణ శిక్షను పరిగణింపడు. అది కలుగనప్పుడు, వినోదమునకై హత్యల నొనర్పడు కూడ! ఇట్టి యెడ, మరణ శిక్షాభయమున హత్యల సంఖ్య తగ్గుట కాస్కార మేది? పైగా ప్రాణముల దీయుట సులభమే గాని, వానిని పోయుట ఎవ్వని తరమును కాదు. ఇది తెలిసియుండియు, పోయిన ప్రాణమునకు జత మరొక ప్రాణమును తీయుట తప్పుకాదా? కాని, ఎన్ని దేశములలో హత్యా నేరమునకు మరణ దండనమును రద్దు చేసిరి? ఒక్క సోవియటు రష్యాలోనే!

ఇట్లని, సోవియటు రష్యాలో మరణశిక్ష లేనే లేదని కాదు. ప్రభుత్వమును కూలద్రోయుటకు కుట్ర పన్నిన వారికిని, స్త్రీల మానమును హరించిన వారికిని మరణశిక్ష విధింపబడుచునే యున్నది: స్వదేశ, విదేశములలో సోవియటు ప్రభుత్వమునకు శత్రువు లెందరో యున్నారు. వీరందరును సామ్యవాద మనిన గిట్టనివారు; దాని నెట్లయిన నామరూపములు లేకుండ హతమార్చవలె నని బద్ధకంకణులైనవారు. వీరికి ధనమునకు లోటులేదు; సాధన సంపత్తికి కొదువలేదు. అందుచే సోవియటు ప్రభుత్వము తనపై కుట్ర పన్నినవారి యెడ నిర్దాక్షిణ్యముగ నుండక తప్పదు. ఇక, స్త్రీల మానమును హరించిన వారికి మరణశిక్ష దేని కందురా? 'సాంసారిక జీవన' మను ప్రకరణమును జూచినచో నిది పూర్తిగ సమర్థనీయ మని మీకే తెలియగలదు.

పై రెండు నేరముల నొనర్చిన వారికైనను మరణదండనము విధించుట తప్పే యనుకొన్నాను, సోవియటు ప్రభుత్వము తక్కిన వానికన్న ఎన్నో రెట్లు మెరుగని యొప్పుకొనక తప్పదు. నేరస్థుని సంస్కరించి, సచ్చరిత్రునిగా నొనర్చుటకు ఒక్క సోవియటు రష్యాలోనే ప్రయత్నింపబడు చున్నదని నుడువుటలో నతిశయోక్తి లేశమైనను లేదనుట కిది నా మొదటి కారణము.

ఎత్తయిన గోడలు - ఇనుప తలుపులు- పహరా జవానులు - చీకటికొట్లు - 'కాన్విక్టువార్డర్లు' కోతిటోపీలు - 'దేవతా పులుసు' - 'సర్కార్ సలాములు' - అడ్డ బేడీలు - నిలువు బేడీలు - కొరడా దెబ్బలు - లాఠీ ప్రయోగములు: ఇదియేగదా, జైలు పేరు చెప్పినంతనే మన మనోవీధిని దోచు చిత్రము. నేరస్థుని సంస్కరణము మాట యెట్లున్నను, కనీసము మానవత్వమునకైన స్థానమిట గలదా?

ప్రపంచముతో సంబంధము లేని ఆ గోడల మధ్య - పట్టపగలే చీకటి కాపురము చేయు ఆ కొట్లలో - కుక్కలైనను ముట్టనొల్లని ఆ పులుసు ముద్ద తప్ప మరేదియు దొరకని పరిస్థితిలో - వంగి, సలాములు చేయుట కేమరిన యెడల తన్నులో, బేడీలో, కొరడా వ్రేటులో తప్పని ఆ భూలోక నరకమున మానవత్వ మెట్లుండగలదు? -.
ఇతర దేశాలలోని జైళ్ళుకూడ దాదాపుగ నిట్టివే! ఇక, ఆదర్శప్రాయమైనవి కేవల మొక సోవియటు రష్యాలోనే కలవు.

రష్యాలో జైళ్ల చుట్టును పేరున కింత ముళ్లతీగయే గాని, కోటగోడవలె ప్రాకార ముండదు. ఇట్లు ప్రకారమే లేనప్పుడు, లోహద్వారములు మొదలే యుండవనియు, కత్తి కఠారులతో పహరా నిచ్చువారు అసలే కాన్పింపరనియు వే రు గ పేర్కొననేల? మన జైలును చూచినంతనే శత్రుభయము గల దుర్గము స్ఫురణకు వచ్చును. ఇక, రష్యను జైలును చూచిననో? పంటభూములు, పరిశ్రమాగారములు, పాఠశాలలు, గ్రంథాలయములు మున్నగువానితో విలసిల్లు చక్కని 'కాలనీ' జ్ఞప్తికి వచ్చును. ఎవరో యొకరు తెలిపిననేగాని, అది జైలని క్రొత్తవా రూహింపనైన లేరు.

అపూర్వమైన ఈ బాహ్యాకృతికి తగినట్లే పరిపాలన సైతముండును. ఖైదీలను చీటికి, మాటికి తన్నుటకును, ఐనదానికిని, కానిదానికిని వారికి బేడీలను వేయుటకును వీలులేదు సరిగదా, పన్నెత్తు మాటనుకూడ అనరాదు. వంగి, సలాములు చేయుడని నిర్బంధింపరాదు. ఇట్లు నిర్బంధించినచో - ఎంతటి జైలు అధికారికైనను - శిక్ష తప్పదు. ఇంత మాత్రము నిబంధనలు లేకపోయిన, ఖైదీలలో నాత్మగౌరవ మెట్లు పెంపొందగలదు? ఆత్మగౌరవమే పెంపొందకపోయిన, వారిలోనిక గలుగు సంస్కరణ మేమి?

తన కిష్టమైన పనిని దేనినో యొకదానిని పొలములోగాని, పరిశ్రమాలయములోగాని ప్రతి ఖైదీ తప్పక చేయుచుండవలెను. ఇట్లు చేయవలసినది వారము పొడుగునను కాదు. ప్రతి ఆరురోజులలో నొకటి విశ్రాంతి దినము. ఈ విశ్రాంతి దినమును ఖైదీ తన ఇచ్చవచ్చినట్లే గడుపవచ్చును. ఆడిన, ఆడవచ్చును. పాడిన, పాడవచ్చును. లేదా, దగ్గరి

గ్రామములలో బంధు మిత్రులెవరైన నున్నయెడల, వారితో గడుపవచ్చును. ఎక్కడనున్నను, ఏమిచేసినను కాదను వారుండరు. కాని నిద్రవేళకు ముందే జైలులో హాజరుగావలెను.

చేయుచున్న పనిని బట్టి, ఖైదీకి కూలి నేర్పాటు చేయుదురు. ఈ కూలిలో మూడే రేట్లు. చాకచక్యపు పనికి పెద్ద రేటు. బండపనికి చిన్న రేటు. అటు నిటుగాని దానికి మధ్యరకపు రేటు. ఆ యా ఖైదీ సంపాదించుకొన్న కూలిలో సగభాగమును అతని భోజనపానాదుల ఖర్చుక్రింద జమ కట్టుకొందురు. మిగిలిన సగమును అతనికే ఇచ్చివేయుదురు. దాని నతడు నిల్వచేసికొనవచ్చును. లేదా, భార్యా బిడ్డలకు పంపుకొనవచ్చును. ఇదియును గాకపోయిన, చిత్తమువచ్చినట్లు ఖర్చు పెట్టుకొనవచ్చును. 'దీనికే ఖర్చు పెట్టుకొనవలెను, దానికి కూడదు' అను నియమము సయితము లేదు. ఇష్టానిష్టములను బట్టి సిగరెట్లనుగాని, చాక్లెట్లనుగాని, జైలు స్టోర్సులో లభించు మతే వస్తువులనైనగాని కొనవచ్చును; కొనినవాని నుపయోగించకొనవచ్చును.

వేసవిలో రోజుకు పదిగంటల చొప్పునను, శీతకాలమున యెనిమిది గంటలచొప్పునను ఖైదీలు పనిచేయవలసియుండును. ఈ నిర్ణీతకాలము పనిచేసి ముగించినంతనే, వారికి స్వేచ్ఛ. కావలసినచో చదువుకొనవచ్చును. ఇందుకు పాఠశాలయు, గ్రంథాలయమును, పఠనమందిరమును, మతెన్నో సౌకర్యములును జైలు ఆవరణములోనే యుండును. ముచ్చటపడినచో, సంగీతమును నేర్చుకొనవచ్చును. ఇందుకు సంగీత పాఠశాలలకును, సంగీత సభలకును వెళ్ళదలచిన, ఆటంకములేదు. అభిరుచియున్నచో, నటవిద్య నభ్యసింప వచ్చును. ఇందుకు పదిమంది ఖైదీలు కలసి నాటకసమాజము నొకదానిని స్థాపింపగోరిన, అభ్యంతరముండదు. ఇవేవియును గిట్టకపోయినచో, లోకాభిరామాయణముతోనే ప్రొద్దు పుచ్చవచ్చును కూడ!

ఖైదీలకు గల సౌకర్యము లివియే గాదు. వారమునకొకసారి వారి నిమిత్తము సెనిమా ప్రదర్శనము నేర్పాటు గావింతురు. కావలసినన్ని యుత్తరప్రత్యుత్తరములను జరుపుకొననిత్తురు. కోరినన్ని చుట్టలను, సిగరెట్లను కాల్చుకొన నిత్తురు. సవ్యముగ ప్రవర్తించిన ప్రతి ఖైదీకిని సంవత్సరమున కొకసారి వారము దినముల సెలవును సయిత మొసగుదురు. ఈ సెలవును పై యధికారులకు విన్నపము పంపుకొన్నచో, నెలవరకు పొడిగించుటకూడ కద్దు. సెలవు మీద నున్నప్పుడు ఖైదీపై కాపుదల బెట్టరు. అతడు ఏ రోజు కారోజు తన యునికిని రిపోర్టు చేయవలె ననియైనను కోరరు. సాధారణ పౌరునికి గల సర్వస్వాతంత్ర్యముతో నతనిని మసలనిత్తురు. తనపై నుంచిన ఈ విశ్వాసమును, తనకై కల్పించిన ఈ సౌకర్యమును దుర్వినియోగమొనర్పక, సెలవు పూర్తియైన వెంటనే తిరిగి వచ్చిన సరియే. లేనిచో, ఎక్కడనున్నను గాలించి పట్టుకొందురు. అటు పిమ్మట కొంతకాలము వరకును తిరిగి సెలవు నిచ్చుటకును, జైలును దాటి పోనిచ్చుటకును, సంపాదించుకొన్న కూలిని స్వంతమునకు ఖర్చు పెట్టుకొన నిచ్చుటకును పూర్తిగ నిరాకరింతురు. ఈ నిరాకరణమే అతనికి విధింపబడు శిక్ష. ఇంతకు మించి, కఠినముగ శిక్షించుటకు వీలుకూడ లేదు.

నిజమున కింతవరకు పేర్కొనిన సౌకర్యములు సౌకర్యములును గావు; సంస్కరణములు సంస్కరణములును గావు. వీనినన్నిటిని మించినది వేరొకటి కలదు. ఖైదీల సాంసారిక జీవనము (sex-life) నకు సంబంధించినదది.

వయస్సును, ఆరోగ్యమును గలిగియున్న ప్రతి వ్యక్తికిని కామేచ్ఛ యుండును. ఇది ప్రకృతిసిద్ధ న్యాయము. దీని నెవ్వరును కాదనరు; కాదనుటకు వీలుకూడ లేదు. ఈ కామేచ్ఛనుప్రతి వ్యక్తియు తీర్చుకొనవలెను; లేదా, నిరోధింపవలెను; లేదా, నిగ్రహింప వలెను. నిరోధించిన, ఆరోగ్యము తప్పక చెడిపోవును. అప్పుడప్పుడు పిచ్చి ఎక్కుట కూడ కద్దు. పోగా, దానిని తీర్చుకొనుటయు, నిగ్రహించుటయు మిగిలినవి. నిగ్రహించుట అనగా, కామేచ్ఛను జయించుట సాధారణ మానవులకు

సాధ్యముగాని పని. కనుక, ఆరోగ్యాభివృద్ధులకు- భంగము వాటిల్లకుండ నుండవలె నన్న, దానిని తీర్చుకొని తీరవలసినదే!

కాని, బందీలోనున్న స్త్రీ పురుషులపై నన్యోన్యుల నీడయైన పడదే! ఇక, కామేచ్ఛను దీర్చుకొనుటెట్లు? ఏమున్నది? ప్రకృతి విరుద్ధ పద్ధతులకు గడంగుట! మన జైళ్ళలో నుండు సామాన్యపు ఖైదీలు - ముఖ్యముగ ఏళ్లకొలది శిక్షలను పడివచ్చినవారు సాధారణముగ నిట్టి ప్రకృతి విరుద్ధపద్ధతులకే గడంగుదురు. దానితో వారిలో మిగిలియున్న మానవత్వము కొంచెమును విలుప్తమైపోవును! ఇట్టివారికి బాహ్యప్రపంచము భయంకరముగ గన్పట్టును. అందుచే శిక్షపూర్తియై విడుదల గాంచినంతనే, వారు క్రొత్త నేరమును దేనినైన గావించి, తిరిగి జైలునకు పోదురు. ఎప్పటికప్పుడు పెద్ద శిక్షలను వేయుడని - ఆ మధ్య వంగరాష్ట్రములో నొకడు చేసినట్లు - వారు ప్రార్థించుటకూడ కద్దు.

ఈ కారణముల నన్నిటిని పరిగణించి, సోవియటు ప్రభుత్వమువారు బందీల సాంసారిక జీవనావశ్యకతను గూర్చి - మరే ప్రభుత్వమును గైకొననట్టి శ్రద్ధను పుచ్చుకొనిరి.(Micoley: Twelve Studies in Soviet Russia) ఇట్లని వారు వ్యభిచారమున కనుమతింతురని కాదు. విచ్చల విడిగ వర్తించుటకు సమ్మతింతురనియు కాదు. కాని, ఏ ఖైదీయైనను కామేచ్ఛను దీర్చుకొనుటలో నీతిబాహ్యము గాకుండునట్లు నటించెనేని, వారతనికి కేవలము ప్రతిబంధకములను కల్పింపకుండుటయేగాక తగినంతగ సహాయపడుదురు. మగఖైదీ యొకడెవ్వడేని మటొక ఆడుఖైదీని గాని, సమీప గ్రామములోని ఏ పడతినైనగాని ప్రేమించిన ఆ ప్రేమ పెంపొంది, పరిణయముక్రింద పరిఢవిల్లుటకు తగిన సౌకర్యముల నొడగూర్తురు. విశ్రాంతి సమయములందు వారిద్దరు యథేచ్ఛగ విహరించుటకును, సరససల్లాపము లాడుటకును అభ్యంతరము జెప్పరు. ఇంతే కాదు. ఏ మగఖైదీయైనను వివాహితుడే యగుచో, విశ్రాంతి దినములందతడు భార్యతో కాపురము చేయుటకు వీలుకల్పింతురు. ఆడుఖైదీల విషయంలో గూడనింతే! రష్యను జైళ్ల పరిపాలన మిట్లు కేవల మాదర్శప్రాయముగ కొనసాగింపబడుచున్నది. నేరస్థుని సంస్కరించి, సచ్చరిత్రునిగా నొనర్చుటకు, ఒక్క సోవియటు రష్యాలోనే ప్రయత్నింపబడుచున్నదని నుడువుటలో నత్యుక్తి లేశమైనను లేదనుటకిది నా రెండవ కారణము.
ఈ రెండవ కారణమే, నా తుదికారణముకూడ!

పరిశిష్టము

ఒక నాటకములోని కడపటి రంగము యుద్ధభూమి. 27 మంది రష్యను వీరు లోక వైపు. పెద్ద శత్రుసైన్యము ఎదిరివైపు. ఒకడు, ఇద్దరు, ముగ్గురు.... 26 మంది కూలిపోదురు; ఒక్కడు మాత్రమే మిగులును. మిగిలిన ఆ యొక రష్యనువీరుడు జంకిపోడు, - మరింత విజృంభించును! కాని, పెద్ద సైన్యము ముందు ఒక్కడు నిలువగలడా? చివరకు అతడుకూడ బలముగ గాయపడి, కొనయూపిరితో పడిపోవును. కాలుచేతులు పట్లు తప్పును; కండ్లకు చీకట్లు క్రమ్మును. అట్టి స్థితిలోగూడ నతడు సమీపములోనున్న రాతిపలక దగ్గరి కెట్లో ప్రాకి, దానిపై సుద్దముక్కతో క్రింది లెక్కను వేయును:

1,60,00,000 × 27 =1,59,99,973

పిమ్మట, అతడిట్లు పలుకును : '27 మంది హతులైన ఒక లెక్కా? విజయము రష్యాదే!' ఈ మాటలను పలికియు పలుకకముందే, అతని ప్రాణము పోవును... అంతట, తెర వెనుక నుండి ఒక వ్యక్తి గంభీరముగ వచ్చి, ఆత్మత్యాగ మొనర్చిన ఆ రష్యను వీరులమధ్య నిలిచి, '27 మంది హతులైన ఒక లెక్కా? విజయము రష్యాదే!!' అని దిక్కులు ప్రతిధ్వనించునట్లు గర్జించును. ఇట్లు గర్జించి, ప్రేక్షకులవైపునకు తిరిగి, 'సైనికులారా! లెం' దనును. సోవియటు ప్రభుత్వ సైనికులు లేచి నిలుచుందురు. 'సామ్యవాదులారా! లెండు!!' సామ్యవాద సంఘసభ్యులు లేచి నిలుచుందురు. 'యువజనులారా! లెండు!!' వారుకూడ లేచి నిలుచుందురు... తెర. నేటి రష్యాను చిత్రించుటకు ఈ కథయే చాలును! నేటి రష్యాను మాత్రమే కాదు, - రేపటి రష్యాను కూడ!

అనుబంధము

రాజ్యాంగ విధానము

సోవియటు రష్యాలో ఏడు స్వతంత్ర రాష్ట్రములున్నవి

రష్యను సోషియలిస్టు ఫెడ్రల్ సోవియటు రిపబ్లిక్, వైట్ రష్యన్ సోషియలిస్టు సోవియటు రిపబ్లిక్,

యూక్రేనియన్ సోషియలిస్టు సోవియటు రిపబ్లిక్, యూజ్ బెక్ సోషియలిస్టు సోవియటు రిపబ్లిక్,

ట్రాన్సుకాకేషియన్ సోషియలిస్టు ఫెడ్రల్ రిపబ్లిక్ టర్కోనియన్ సోషియలిస్టు సోవియటు రిపబ్లిక్,
టాజిక్ సోషియలిస్టు సోవియటు రిపబ్లిక్

ఈ ఏడు స్వతంత్ర రాష్ట్రములలోను తిరిగి అంతర్భాగములున్నవి. ట్రాన్సుకాకేషియన్ సోషియలిస్టు ఫెడ్రల్ సోవియటు రిపబ్లిక్లో మూడు స్వతంత్ర భాగములున్నవి. రష్యన్ సోషియలిస్టు సోవియటు ఫెడ్రల్ రిపబ్లిక్ పదకొండు స్వతంత్ర భాగములు కలవు. ఇట్లే తదితరములలోకూడ.

ఏడు స్వతంత్ర రాష్ట్రముల సమాఖ్యయే సోవియటు రష్యా. సమాఖ్యలో ఏ రాష్ట్రమైనను ఇచ్చానుసారముగ జేరవచ్చును. లేదా, దానినుండి విడిపోవచ్చును.*(ఇది గమనార్హమైన విషయము. బ్రిటిషువారు మనకు త్వరలో ప్రసాదించనున్న రాజ్యాంగవిధానము ప్రకారము సమాఖ్యలో నొకసారి చేరినచో , తిరిగి ఎప్పటికిని విడిపోవుటకు వీలులేదు. సమాఖ్యలో చేరకుండునట్లు బర్మాను బెదిరించు నిమిత్తమే ఈ కఠిన నిబంధన గావింపబడినదని పెక్కుమంది రాజనీతిజ్ఞులు అభిప్రాయపడిరి.)* జాతి, మత, వర్ణాదుల విచక్షణ లేకుండ మైనారిటీదాటిన ప్రతివానికిని సోవియటు రష్యాలో ఎన్నిక హక్కు కలదు. ఎన్నిక హక్కు గల ప్రతివాడును అభ్యర్థిగ నుండుటకు సయితము హక్కు కలదు. వర్తకులకును, సన్యాసులకును, పూజారులకును, పిచ్చివారికిని, పరులకష్టార్జితముపై జీవించువారికిని మాత్రము ఎన్నికహక్కు లేదు. సోవియటు ప్రభుత్వమునకు కొంత వరకు గ్రామమే పునాది. గ్రామములోని ఎన్నికదారులందరును కలసి, నూర్గురి కొక ప్రతినిధి చొప్పున గ్రామసోవియటు సంఘము (Village Soviet) నకు సభ్యుల నెన్నుకొందురు. ఈ గ్రామ సంఘములన్నియు కలసి, 300 మంది ఎన్నికదారుల కొక ప్రతినిధి చొప్పున తాలూకా సోవియటు సంఘము (Cantonal Soviets) లకు ప్రతినిధుల నెన్నుకొనును. అయితే, తాలూకా సోవియటు సంఘములలో ఏ సందర్భమునందును 50 మందికి మించి సభ్యులుండరాదు. తిరిగి, ఈ తాలూకా సంఘములు జిల్లా సోవియటు సంఘము (District Soviets) లకు సభ్యుల నెన్నుకొనును.

గ్రామములలో సోవియటు సంఘము లున్నట్లే పట్టణములలో సయితము కలవు. పట్టణ సోవియటుసంఘము (town soviets) లకు సాధారణముగ కార్మికులే ఎన్నికదారులు. పట్టణ జనసంఖ్య 10 వేలకు మించనప్పుడు ప్రతి 150 మంది ఎన్నికదారుల కొక ప్రతినిధి చొప్పున నుండును. ఈ జన సంఖ్య 10 వేలకు మించినప్పుడు 400 మంది ఎన్నికదారులకుగాని, ఒక ప్రతినిధి యుండడు. జిల్లా సంఘములలో, తాలూకా సంఘముల ప్రతినిధులును, పట్టణ సంఘముల ప్రతినిధులును కలసి యుందురు. తాలూకా సంఘములు 1000 మంది ఎన్నికదారుల కొకని చొప్పునను, పట్టణ సంఘములు 200 మంది కొకని చొప్పునను ప్రతినిధులను జిల్లా సంఘములకు ఎన్నుకొనవచ్చును. గ్రామములకన్న పట్టణములకును, కర్షకులకన్న కార్మికులకును ప్రాధాన్యమొసగుట సోవియటు ప్రభుత్వపు నీతి. ఇది పై ఎన్నిక పద్ధతిలో స్పష్టముగనే గోచరించుచున్నది.

జిల్లా సంఘములు, రాష్ట్రీయ సోవియటు సంఘము (Provincial Soviets) లకు ప్రతినిధుల నెన్నుకొనును. ఈ రాష్ట్రీయ సంఘములలో జిల్లా సంఘముల ప్రతి నిధులేగాక, పట్టణ సంఘముల ప్రతినిధులు సయిత ముందురు. జిల్లా సంఘములు ప్రతి పది వేల ఎన్నికదారుల కొక ప్రతినిధి చొప్పునను, పట్టణ సంఘములు ప్రతి రెండు వేలమంది కొకని

చొప్పునను రాష్ట్రీయ సంఘమునకు పంపుచుండును. ఇక్కడ కూడ పట్టణముల కొసగబడిన ప్రాధాన్యము తేట తెల్లమే! కొంతమంది ప్రతినిధులను సరాసరి ఎన్నిక (direct election) వలనను, మరికొంతమందిని జిల్లాసంఘముల నుండియు (indirect election) పట్టణములు రాష్ట్రీయ సంఘములకు పంపవచ్చును. గ్రామముల కిట్టి సౌకర్యము లేదు.

రాష్ట్రీయ సంఘములు, సోవియటు యూనియన్ కాంగ్రెస్ (Soviet Union Congress) నకు ప్రతినిధుల నెన్నుకొనును. ఈ కాంగ్రెసులో 1,500 మంది సభ్యులుందురు! సర్వాధికారముగల సంస్థ యిది. సోవియటు రాజ్యాంగ విధానములో మార్పులను చేయుటకు దీనికి మాత్రమే అధికారమున్నది. శాసనములను చేయుటకు కూడ దీనికి అధికారమున్నది గాని, ఆ పనిని తానే పెట్టుకొనక, ప్రభుత్వ మవలంబింపవలసిన ఆర్థిక, సాంఘిక, రాజకీయ నీతిని మాత్రము నిర్ణయించు చుండును. ఈ కాంగ్రెసు - మన కాంగ్రెసువలె - సంవత్సరమునకు కేవల మొకసారియే సమావేశమగుచుండును. శాసనములను చేయుట, చేసిన వానిని అమలులో పెట్టుట మున్నగు కార్యకలాపములను సోవియటు యూనియన్ కాంగ్రెసు నియమించునట్టి కేంద్ర కార్యనిర్వాహక వర్గము (Central Executive Committee) నిర్వహించుచుండును. ఈ కేంద్ర కార్యనిర్వాహక వర్గము రెండు భాగములు (Chambers)గా నుండును. మొదటిదాని (First Chamber)లో 371 మంది ప్రతినిధు లుందురు. రెండవదాని (Second Chamber) లో 30 మంది ప్రతినిధులు - ఒక్కొక్క రాష్ట్రమునకు 5 గురు చొప్పున ఉందురు. రెండు భాగములలో మొదటి దానికే అధికారము హెచ్చు.

కేంద్ర కార్యనిర్వాహక వర్గమైనను - సుమారు 400 మంది సభ్యులతో కూడియుండుటచే అన్నప్పుడెల్ల సమావేశము కానేరదు. అందుచే సమావేశముల మధ్యస్థకాలములో రాజ్య భారమును వహించుటకుగాను, అది యొక కార్యనిర్వాహక సంఘము (Presidium of the Executive Committee) ను, మ రియొక ప్రజాప్రతినిధి సభ (Council of the People's Commissions) ను ఎన్నుకొనును. మొదటి దానిలో 21 మంది సభ్యులుందురు. రెండవదానిలో అధ్యక్షుడును, ఉపాధ్యక్షుడును, పదిమంది సభ్యులును - మొత్తము 12 మంది - ఉందురు. కార్యనిర్వాహక సంఘము శాసనములను చేయుచుండును. వలసినచో- ప్రధాన న్యాయస్థానముగ నిదియే వర్తించుచుండును కూడ. వివిధ రాష్ట్రములకును 'అప్పీలు కోర్టు' ఈ కార్యనిర్వాహక సంఘమే. ఇక ప్రజాప్రతినిధి సభ - అగత్యమున్నచో - శాసనముల నొనర్చుటయే గాక, పరిపాలనను కొనసాగించుచుండును. ప్రతి ప్రజాప్రతినిధి (Commissar) కిని సహాయ మొనర్చుటక సలహా సంఘము లుండును. ఈ ప్రజాప్రతినిధులే విదేశాంగశాఖ, సైనికశాఖ, పారిశ్రామికశాఖ, వర్తక వ్యాపారశాఖ మున్నగు ప్రధాన ప్రభుత్వ విభాగముల నన్నటిని పరిపాలించు చుందురు.

సామ్యవాద సంఘము సోవియటు ప్రభుత్వములో నొక భాగము కాదు. ఐనను, దానికి ప్రభుత్వముపై ప్రబలమగు అధికారము గలదు. సోవియటు ప్రభుత్వము కేవల మొక యంత్రము. సామ్యవాద సంఘము ఆ యంత్రమును నడుపు ఆవిరి! రష్యను రాజ్యాంగ విధానములో చక్కని విషయములు కొన్ని కన్పట్టును. సమాఖ్యలో జేరిన వివిధ రాష్ట్రములకు ఆంతరంగిక పరిపాలనములో సంపూర్ణ స్వాతంత్ర్య మున్నది. రాష్ట్ర విభజన కేవలము పరిపాలనా సౌకర్యములనుబట్టిగాక, ఆర్థిక, నైసర్గిక, ఐతిహాసిక స్థితిగతుల ననుసరించి యున్నది. ఏ సభ్యునినైనను - ఆతడు ప్రజా విశ్వాసమును గోల్పోయినచో సభ్యత్వము నుండి వెంటనే తొలగించుటకు వీలున్నది. మైనారిటీల హక్కుల సంరక్షణార్థము ప్రత్యేక శ్రద్ధ వహింపబడినది.

సామ్యవాదము విజయవంతము గావలెనన్న దేశము పారిశ్రామికముగ వృద్ధినందవలెను. అందుచే కార్మికులకు ప్రాధాన్యమొసగక తప్పదు.

స్వదేశ సంస్థానాలు



సమర్పితము

అమ్మకూ, నాయనకూ

సమర్పితము
అమ్మకూ, నాయనకూ

ముందుమాట

సంస్థానాలు : ఫెడరేషన్

1

ఇది అద్భుతమైన యుగం. నూరు సంవత్సరాలలో జరగదగిన అభివృద్ధి, పదేళ్ళలో జరుగుతున్నది. పదేళ్ళలో జరగదగింది, రెండు మూడు సంవత్సరాలలో ఇమిడిపోతున్నది. కాకపోతే, రాష్ట్రాలను, సంస్థానాలను ఒకే రాజ్యాంగంలోకి తేవడానికి గాను ఎప్పటికో ఒకప్పటికి భారతదేశంలో తప్పనిసరిగా ఏర్పడవలసిన ఫెడరేషన్ విధానంలో సంస్థాన ప్రజలకు ఉండవలసిన హక్కుల్ని గురించి జరిగిన అత్యాశ్చర్యకరమైన అభివృద్ధికి అర్థమే కనబడదు. రెండు సంవత్సరాల క్రితం అఖిల భారత సంస్థాన ప్రజాసభ కరాచీలో సమావేశమై, సంస్థాన ప్రజలకు వోటింగు హక్కు ఉండాలనీ, ఫెడ్రల్ శాసన సభలలో వారికి సరాసరి ప్రాతినిధ్యం ఉండాలనీ, వాక్స్వాతంత్ర్యం, పత్రికా స్వాతంత్ర్యం, సమావేశ స్వాతంత్ర్యం మొదలైన హక్కులు ఉండాలనీ, ఈ హక్కుల్ని కాపాడుకోడానికి అవసరమైతే ఇండియన్ ఫెడ్రల్ కోర్టుకు వెళ్ళడానికి వీలుండాలనీ, తీర్మానించి, వీటిని సాధించడానికి ఒక కార్యక్రమం నిర్ణయించినపుడు లోకులుగాని, అసలు కరాచీ సమావేశ కర్తలు గాని, రెండు సంవత్సరాల లోపుగా అప్పటిలో విపరీతంగా కనబడిన ఈ కోర్కెలు బ్రిటీష్ ప్రభువుల మన్నన పొందుతాయని అనుకోలేదు. 1936 ఏప్రిల్లో పైన చెప్పిన విషయాల్ని భారత జాతీయ మహాసభ లక్నో సమావేశంలో ప్రతిపాదించి, చర్చ జరపడానికి యత్నించినపుడు ఈ కొత్త భావాలపట్ల విశేషమైన ప్రాతికూల్యాన్ని చూపించారు. కరాచీ సమావేశం అయిన తర్వాత మేము దక్షిణ మహారాష్ట్రానికి చెందిన ఇరవై రెండు సంస్థానాలలోను కథియవారు చెందిన పదిహేను సంస్థానాలలోను, తిరువాన్కూరు, కొచ్చిన్, మైసూర్ సంస్థానాలలోను పర్యటన చేశాము. ఇలా పర్యటన చేసిన తర్వాత నవసారీలో సంస్థాన ప్రజా సంఘాల కన్వెన్షన్ జరిపేసరికి, రెండు సంవత్సరాలలో ఇంత ప్రబోధం ఎలా జరిగిందా అనే ఆశ్చర్యం కలిగింది. ఒరిస్సా రాష్ట్రంలోని సంస్థానాలు - అసలు ఆ రాష్ట్రమే ఏమంత అభివృద్ధి చెందింది కాకపోయినప్పటికీ - రాష్ట్రీయ సమావేశాన్ని జరిపాయి. పంజాబ్ సంస్థానాలు కూడా ఇలాగే ఒక సమావేశాన్ని జరిపాయి. ఇక, దక్షిణ మహారాష్ట్ర సంస్థానాలు రెండు సమావేశాల్ని జరిపాయి. మొదటి దానికి నారిమన్ అధ్యక్షుడు. రెండోది మొన్న మొన్ననే - 1938 మే 22వ తేదీ నాడు - వల్లభాయ్ పటేల్ అధ్యక్షత కింద జరిగింది. కాంగ్రెసు, సంస్థానాలు అనే భిన్న వర్గాల్ని ఏకం చెయ్యడానికి నవసారీలో ప్రారంభమై, హరిపురంలో ఫలప్రదమైన ఉద్యమ వ్యాప్తికి సర్దార్ వల్లభాయ్ పటేల్ దక్షిణ మహారాష్ట్ర సంస్థాన ప్రజాసభకు అధ్యక్షత వహించడం ఎంతైనా తోడ్పడింది. ఇప్పుడు కాంగ్రెసుకు, సంస్థానాలకు మధ్య విరోధ భావం లేదు; అవి పరస్పరం విమర్శించుకోవడం లేదు. ఈ సంఘటనల తర్వాత జరిగిన మైసూరు ఉదంతం వల్ల రెండు విషయాలు నిరూపితమౌ తున్నాయి. వీటిలో మొదటిది ఏమంటే, సంస్థాన ప్రజల భవిష్యత్తు చాలవరకు వారి స్వయంకృషి మీదనే ఆధారపడి ఉంది. ఇక రెండవ విషయం ఏమంటే, - తమ సంస్థానానికి సంబంధించిన వ్యవహారాల్ని పరిష్కరించుకోడానికి అదును కనిపెట్టి సంస్థాన ప్రజలు కాంగ్రెసు పేరు ప్రతిష్టల్ని వినియోగించుకోవచ్చును.

2

ముఖ్యమైన రెండు ఫలితాల్ని మేము సాధించగలిగాము. వీటిలో మొదటిది ఇది: సంస్థాన సమస్యలంటే ఇప్పటిలా కాకుండా ఎక్కువగాను, వెంట నేను శ్రద్ధ చూపించాలనే విషయాన్ని కాంగ్రెసుకు నచ్చజెప్పాము.

కాంగ్రెసు అధినాథుడు, కాంగ్రెసుకు మార్గదర్శి అయిన మహాత్ముడు సంస్థానాల సమస్యా ప్రాధాన్యాన్ని గుర్తించిన నాడు, ఇక జరగవలసిన పని అతి సులభమైనదే! భారతదేశ పరిస్థితుల్ని స్వయంగా తెలుసుకోడానికి లోథియన్ ప్రభువు వచ్చాడు. ఇక్కడికి వచ్చిన తర్వాత రాజ్యాంగ విషయాల్ని గురించి తనకు గల అపార పరిజ్ఞానం వల్ల ఫెడ్రల్ శాసన సభలో సంస్థాన ప్రజలకు సరాసరి ప్రాతినిధ్యం లేకపోతే ఫెడరేషన్ హాస్యాస్పదంగా పరిణమిస్తుందనే విషయాన్ని గ్రహించడానికి ఆయనకు ఎంతో కాలం పట్టలేదు. భారత రాజకీయ వేత్తల కోర్కెల్ని సంతృప్తి పరచడానికిగాను బ్రిటీషు పార్లమెంటు ఇండియా చట్టాన్ని మార్చడానికి సముఖంగా లేదని చెబుతో, సంస్థాన ప్రజల కోర్కెల్ని సంతృప్తి పరచడానికి ఏదో ఒక ప్రయత్నాన్ని చేయక తప్పదని ఆయన అంగీకరించక తప్పిందికాదు. లోథియన్ ప్రభువు తర్వాత సామ్యూల్ ప్రభువు ఇక్కడికి వచ్చాడు. ఈయన కూడా లోథియన్ చూపినంతటి శ్రద్ధతో - లోథియన్ కంటే ఎక్కువ తీరుబడిగా కూడా భారత సమస్యల్ని పరిశీలించి, కేంద్ర శాసన సభలో సంస్థాన ప్రజలకు (సంస్థానాధిపతుల ద్వారా కాకుండా) సరాసరి ప్రాతినిధ్యం ఉండాలనే నిర్ణయానికి వచ్చాడు. 1938 మే నెల 28వ తేదీ నాడు ఇండియా సెక్రటరీ జెట్లండ్ ప్రభువు ఉపన్యసించాడు. ఆ ఉపన్యాసంలో అసంతృప్తికరమైన విషయాలు ఏమి ఉన్నప్పటికీ, సంస్థాన ప్రజల కోర్కెల్ని ఇండియా చట్టాన్ని మించి పోకుండానే సంతృప్తి పరచడానికి అవకాశాలు లేకపోలేదనే ఆశను ఆయన ప్రకటించాడు. దాని అర్థం ఏమంటే, సంస్థానాలు ఫెడరేషన్లో చేరడానికి ముందు మన్నించవలసిన షరతులలో (Instrument of Association)లోనే సంస్థానాధిపతులు ఫెడ్రల్ శాసన సభలకు ప్రతినిధుల్ని పంపించడంలో తమకు గల అధికారాల్ని తమ ప్రజలకు కూడా పంచిపెట్టాలనే నియమం ఉంటుంది. దీన్నే ఇంకొక విధంగా కూడా చెప్పవచ్చు. బహుశా ఫెడ్రల్ అసెంబ్లీ (Lower House) ప్రతినిధుల్ని సంస్థాన ప్రజలు ఎన్నుకోవాలనీ, ఫెడ్రల్ కౌన్సిల్ (Upper House) ప్రతినిధుల్ని సంస్థానాధిపతులు నామినేట్ చెయ్యవచ్చుననీ, నియమం చేస్తారు. ఈ విధంగా రెండు సంవత్సరాల లోపుగా సంస్థానాలలో ఎంతో అధికంగా ప్రచారం సాగించడం వల్లనూ, కాంగ్రెసు సంస్థకు ఎడతెగకుండా వొత్తిడి పెట్టడం వల్లనూ, ఈ పని చేసింది విరోధ భావంలో కాదు; స్నేహపాత్రంగానే - భారత రాజకీయాలలో సంస్థాన ప్రజల సమస్యకు ప్రాధాన్యాన్ని తేవడమే కాకుండా, వీరి కోర్కెలకు ఆమోదాన్ని సంపాయించడం కూడా సాధ్యమైంది.

3

బాధ్యతాయుత పరిపాలన కోసం మైసూరులో జరిగిన ఆందోళనను గురించి ఇంతకుముందు పేర్కొన్నాము. ఈ ఆందోళన సందర్భంలో జరిగిన సంఘటనలను గురించి ఆ సంస్థాన ప్రజలు సిగ్గుపడవలసింది ఏమీ లేదు; ఆ సంస్థానం వారు గర్వపడదగిందీ లేదు. ఏది జరిగితేనేమి గాని, చివరికి వొడంబడిక కుదిరింది. రానున్న ఒకటి రెండు సంవత్సరాలలో మైసూరులో జరిగే అభివృద్ధి తక్కిన సంస్థానాధిపతులకు తాము అవలంభించ వలసిన మార్గాన్ని తెలపడమే కాకుండా, "వార్నింగ్"గా కూడా ఉపకరించవచ్చు.

తిరువాన్కూరు సంస్థానం మైసూరును కలుపుకోడానికి సిద్ధంగా ఉంది. నిజానికి మైసూరు రాజ్యాంగ విధానం కంటే తిరువాన్కూరు రాజ్యాంగ విధానమే ఉత్తమమైంది. అంచేత మైసూరు కంటే తిరువాన్కూరు ముందు అడుగు వేస్తుందని ఆశించాము గాని, అది వెనకబడింది. అక్కడ జాతీయత ఇంకా పరిపక్వం కావలసివుంది కాబోలు!

కొచ్చిన్ సంస్థాన ప్రజలలో కూడా ఇంతటి కాంగ్రెసు భక్తి ఉన్నది. ఆ సంస్థానపు దివాను ముందుగానే మేలుకొని, కొంతవరకు బాధ్యతాయుత పరిపాలనను ప్రవేశపెట్టడమే కాకుండా, చేసిన వాగ్దానాలు చెల్లుబడికే ప్రజలు ఎన్నుకున్న మంత్రిని కూడా నియమించాడు.

రాజ్యాంగ సంస్కరణలను గురించి విచారించడానికి పాటియాలా సంస్థానం ఒక కమీషన్ను ఏర్పాటు చేసింది. కవుర్థలలో కూడా ఇదే ఏర్పాటు జరిగింది. ఒకప్పుడు బరోడా అభివృద్ధికి మార్గదర్శిని అంటుందిగాని, ఇప్పుడది వెనకబడిపోయింది. మంచి పేరును సంపాయించుకున్న భోపాల్ చకచక చెడ్డపేరు తెచ్చుకుంటున్నది. ప్రజోద్యమాలను, ప్రజాస్వామిక సిద్ధాంతాలను ప్రోత్సహించినందులకుగాను అక్కడ పత్రికలపై ఆంక్షల్ని వేస్తున్నారు; నిర్బంధ శాసనాలను అమలు పరుస్తున్నారు. స్థానికపు ప్రసిద్ధ పత్రికలు ఈ నీతికి బలి అయిపోయినాయి. ఎప్పటికప్పుడు అడుగుతూన్న హెచ్చు సెక్యూరిటీ మొత్తాలను కట్టలేక పోయినందువల్ల గడచిన మూడు సంవత్సరాలలోపుననే అనేక ముద్రణ యంత్రాలయాలను కట్టివెయ్యవలసి వచ్చింది. అభివృద్ధికి దోహదమిచ్చే సారస్వతాన్ని స్థానికంగా ముద్రించుకోడానికిగాని, బయట నుంచి తెప్పించుకోడానికి గాని ప్రజలకు వీలులేకుండా పోయింది. సంస్థానంలోని ప్రతి పోస్టు జవాను కూడా సి.ఐ.డి. వారి చెప్పుచేతలలోని వాడేనట. ఏ కొంచెం అనుమానం తోచినప్పటికీ ఉత్తరాన్నిగాని, బుక్ పోస్టుగాని, పార్శిల్గా గాని జప్తు అయిపోతుంది. ప్రజల్ని భీతావహుల్ని చెయ్యడానికీ, వారిని పౌరుషహీనుల్ని చెయ్యడానికీ భోపాల్ సంస్థానం యత్నిస్తున్నది. దేవాలయానికిగాని, మసీదుకు గాని నాలుగు మైళ్ళ దూరంలోనైనా సరే - ముందుగా సిటీ మేజస్ట్రేట్ దగ్గర నుంచి లిఖిత పూర్వకమైన అనుజ్ఞను పొందనిదే - సభను జరపడానికి వీలులేదు. ఇక ఈ సభ రాజకీయ సంబంధమైనదైతే, అనుజ్ఞ రావడం బ్రహ్మప్రళయం. ప్రజోద్యమాలను ప్రోత్సహించే సంస్థానేతరులు ఎవరైనా సంస్థానానికి రావాలని అనుకుంటే, వారి రాకను నిషేధిస్తున్నారు. డజనుల కొలది వార్తాపత్రికలు ప్రస్తుతం బహిష్కరణ పట్టికలో ఉన్నాయి. వీటిలో ముఖ్యంగా వినదగింది 'మదీనా' అనే ద్వైవార పత్రిక. దీనికి విశేష ప్రచారం ఉన్నది.

4

ఇక హైదరాబాదు సంగతి చెప్పనఖరలేదు. ఇక్కడ ఒక గస్తీ అమలులో ఉంది దీని ప్రకారం సంస్థానంలో ఎక్కడ సభ జరపదలచినా, పదిహేను రోజులు ముందుగా నోటీసు ఇవ్వాలి. ఈ నోటీసులో కేవలం సభ జరిగే స్థలాన్ని, కాలాన్ని నిర్దేశిస్తే చాలదు. దానిలో జరిగే ఉపన్యాసాలను, దానిలో చర్చించే తీర్మానాలను ముందుగా తెలుపుకోవాలి.

ఇక్కడ హిందూ - మహమ్మదీయ వైషమ్యాలు విపరీతమౌతున్నవి కూడా! జనాభాలో నూటికి పదిమంది చొప్పున మాత్రమేవున్న మహమ్మదీయులకు, నూటికి యాభై వంతుల ప్రాతినిధ్యాన్ని ఇవ్వడానికి హిందువులు అంగీకరిస్తున్నారు. అయినప్పటికీ, జనాభాలో నూటికి తొంభై వంతుల చొప్పున ఉన్న హిందువులకు సంస్థానోద్యోగాలలో నూటికి యాభై వంతుల్ని ఇవ్వడానికి మహమ్మదీయులు సమ్మతించడం లేదు. ఇలా అన్ని విధాల ఒక సంఘానికే లాభం జరగాలనడం తగదు. స్వమతం అంటే గాఢాభిమానం గల పరిపాలకుడు నైజాం. అయినా, దీనివల్ల బాధ లేదు. అసలు చిక్కు వరసపెట్టి ఇస్లాం మతం ఇప్పించడంలోనే వస్తున్నది. హైదరాబాదులో రోషాలు పెరుగుతున్నవి. మైసూరులో మాదిరిగా ఇక్కడకూడా పెద్ద తుపాను రేగితే, మనం ఆశ్చర్యపడనక్కరలేదు (ఇప్పుడిప్పుడే రేగుతుంది). హైదరాబాదులో రాజకీయ పరిస్థితులు మత, సాంఘిక సమస్యల వల్ల మరింత క్లిష్టం కావడం సంతాపకరమైన విషయం. ప్రజలు ఈ మత, సాంఘిక సమస్యలను వీలైనంతవరకు తోసిపుచ్చుతారనే హృదయపూర్వకంగా ఆశిస్తున్నాము.

5

నరేంద్ర మండలి అధ్యక్ష పదవిని అలంకరించిన పాటియాలా మహారాజు కాలధర్మాన్ని పొందాడు. కొత్త మహారాజు సింహాసనాన్ని ఎక్కడంతో పాటు ప్రజల పౌరసత్వపు హక్కులు ఆమోదాన్ని పొందగలవని కూడా ఆశపడుతున్నాము. తన సంస్థాన ప్రజలలో ఎంతటి హీనస్థితిలోనివాడైనా సరే తన కష్ట సుఖాలను నివేదించు కోడానికి నిరభ్యంతరంగా సరాసరి తన వద్దకు రావచ్చునని కొత్త మహారాజు అన్నాడట. ఇది సంతోషకరమైన విషయం.

ఇటీవల కాశ్మీరులో పెద్ద తుపాను రేగింది. హైదరాబాదులో పరిస్థితికి కాశ్మీర్ పరిస్థితి సరిగా తలకిందులు. ఇక్కడ మనం ముఖ్యంగా ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. ప్రజా ప్రభుత్వాన్ని సంస్థాపించడానికి బ్రిటీష్ ఇండియాగాని, ముందంజ వేసే సంస్థానాలుగాని పడిన పాట్లను ప్రతి ఒక్క సంస్థానం పడవలసిన అవసరం లేదు. బ్రిటీష్ ఇండియాలో యాభై సంవత్సరాల ఆందోళన తర్వాత సహాయ నిరాకరణంతో ప్రారంభమై, సత్యాగ్రహంతోనూ, శిస్తుల్ని చెల్లించక పోవడంతోనూ పూర్తయిన ఒక కొత్త విధానాన్ని మనం కనిపెట్టినాము. ప్రజాందోళనలో బ్రిటీష్ ఇండియా ప్రజలు ఎక్కడికి వచ్చి ఆగిపోయినారో, సరిగా అక్కడ నుంచి మైసూరు సంస్థానం వారేమి, మైసూరు ప్రజలేమి ముందుకు సాగిపోయారు. ఇది జరిగిన కథ తిరిగి జరగడం కాదు. కథ ఒక్కొక్క ఘట్టం చొప్పున ముందుకు నడవడం!

మైసూరు, తిరువాన్కూరు, కొచ్చిన్, బరోడా: ఇవి ఇంకా ముందంజలోనే ఉన్నవి. పాటియాలా వీటిని అనుకరిస్తుంది. హైదరాబాదు, నాభా, కపుర్థల, గ్వాలియర్, ఇందూర్ మొదలైన పెద్ద సంస్థానాలు తమ ప్రజలకు పౌరసత్వపు హక్కుల్ని ఇచ్చి, బాధ్యతాయుత పరిపాలనను ప్రవేశ పెడతవి. ప్రజాభీష్టానికి లోనై ఉండే నిజమైన ఫెడరేషన్, ఏర్పాటు కావాలంటే, ఇది జరగడం అవసరం!

6

మహారాణా యాజమాన్యం క్రింద బాధ్యతాయుత ప్రజా పరిపాలనను ప్రవేశ పెట్టించాలనే ఉద్దేశంతో బయల్దేరిన మేవాడ్ ప్రజా మండలిని ఉదయపూర్ సంస్థానంలో నిషేధించినట్టు ఉత్తర హిందూస్థానపు పత్రికల ద్వారా ఇటీవలనే తెలియవచ్చింది. ప్రజా మండలి కార్యదర్శిని సంస్థానం నుంచి వెళ్ళి పొమ్మన్నారు.

ఈ నిరంకుశ చర్య ప్రజలలో చాల అశాంతిని కలగజేసిందని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఉదయపూర్ దర్బార్ వారి ఉత్తరువును భారతదేశంలోని ప్రతి నాగరిక వ్యక్తియు అసహ్యించుకొనవలసి నటువంటిది. తక్కిన సంస్థానాలలో బాధ్యతాయుత పరిపాలన కాకపోయినప్పటికీ కనీసం ప్రజా ప్రాతినిధ్యం గల శాసన సభల నిర్మాణానికి కృషిజరుగుతూ ఉండగా, ఉదయపూర్ లాంటి సంస్థానం ఈ కుమార్గాన్ని తొక్కడం శోచనీయం.

7

తమదైన హైదరాబాదు సంస్థానంలో గల లోపాలు పూర్తిగా తెలియని వారు ఆంధ్ర దేశంలో లేరనే చెప్ప వచ్చును. నైజాం ప్రస్తుత పరిపాలన విధానంలో కొన్ని మంచి విషయాలు లేకపోలేదు కాని, ఈ విధానం ప్రజల పౌరసత్వపు హక్కుల్ని, ఇతర ప్రాథమిక హక్కుల్ని హరిస్తున్నది. హైదరాబాదు స్వాతంత్ర్యాన్ని సంపాయించుకుంటే, ఆ మరు క్షణంలో మిగిలిన భారతదేశం స్వాతంత్ర్యాన్ని పొందినట్టే!

అంచేత భారత సంస్థానాలు అన్నిటిలోనూ పెద్దదైన ఈ సంస్థానంలో అధిక సంఖ్యాకులుగా ఉన్న మన తెలుగువారికి రాజకీయ పరిజ్ఞానాన్ని కలిగించడం మన విధి. ఈ కారణాన ఈ పుస్తక ప్రచురణం ఎంతైనా సమంజసంగాను, సమయోచితంగాను ఉన్నది. కేవలం వివిధ రాష్ట్రాలనే కాకుండా, సంస్థానాలను, సంస్థాన ప్రజలను దరిజేరదీయగల ఫెడరేషన్ వైపుకు ఈ పుస్తకము ప్రజల ఆలోచనలను మరల్చగలదని ఆశిస్తున్నాను. ముఖ్యంగా హైదరాబాదు సంస్థానంలోని తెలుగువారిలో ఈ పుస్తకాన్ని ప్రచారంలోకి తేవాలని చెబుతూ; సర్వత్రా ఇది ప్రజామోదాన్ని పొందగలదని నమ్ముతున్నాను.

డాక్టర్ భోగరాజు పట్టాభిసీతారామయ్య
(అధ్యక్షులు - అఖిల భారత సంస్థాన ప్రజా మండలి)

ఉపక్రమణిక

భారతవర్ష చరిత్రలో ఇది కడు సందిగ్ధావస్థ. ఆర్థిక, సాంఘిక, రాజకీయాది సమస్యలెన్నో నేడు మనల నెదుర్కొనుచున్నవి. వీని నెల్ల మనము సక్రమముగా పరిష్కరింప గలిగినచో, భారత భూమి అభ్యున్నత పథముల మెట్టుచు, సర్వ ప్రపంచమునకు ఆదర్శ ప్రాయమై వెలయగలదు. లేనిచో, ఇప్పటివలెనే పడియుండును - నిర్వీర్యముగ, నిస్తేజముగ, నిర్జీవముగ...

ఇట్టి సమస్యలలో స్వదేశ సంస్థానములను గూర్చిన దొకటి. ఐనను దీనిని గూర్చి తగిన శ్రద్ధ లేకుండుట సంతాపకరము! కేవలము సంతాపకరమే కాదు; - ఆత్మహత్యా సదృశము కూడ!

అఖిల భారతవర్ష విస్తీర్ణములో మూడవ వంతు స్వదేశ సంస్థానములు! యావద్భారత సంతతిలో ఐదవవంతు సంస్థాన ప్రజలు! ఇట్టి యెడ స్వదేశ సంస్థాన సమస్య ప్రాధాన్యమును ఎవరు కాదనగలరు? హైదరాబాదు సంస్థానము వైశాల్యమున ఇటలీదేశముతో సరిపోలును. మైసూరు ఐర్లెండునకు కుడియెడమగ నుండును. బికనీరు గ్రీసు దరిదాపులకు వచ్చును. జైపూరు స్విట్జర్లాండునకు తీసిపోదు. రీవా బెల్జియం కన్న పెద్దది.

కాని, ఇట్టి విషయములను గమనించు వారెవరు? భారత జాతీయాశయములకు ప్రతిరూప మనదగు కాంగ్రెసు మహా సంస్థయే స్వదేశ సంస్థాన సమస్యను గూర్చి తగిన శ్రద్ధ వహించుట లేదు.

పూర్వ మొకప్పుడు హిందూ మహమ్మదీయులు పరస్పర విద్వేషముల విస్మరించి స్వాతంత్ర్య ప్రాప్తికై కృషిసల్ప, మతావేశమున కన్నుగానక శిక్కులు తత్సిద్ధికి అడ్డుపడిరి. తదుపరి మహమ్మదీయులే స్వార్థచింతాతత్పరులై స్వరాజ్య లబ్ధికి ప్రతి బంధకులైరి. భారత భావి భాగ్యోదయమున కిక ముందు స్వదేశ సంస్థానములు అడ్డుతగుల వలసియున్నవి కాబోలును. కానిచో, స్వదేశ సంస్థాన సమస్యా పరిష్కారమును గూర్చి ఇంత అశ్రద్ధ యుండెడిదా? ఏడు కోట్ల స్వదేశ సంస్థాన సంతతి ఘోరదుర్దశ పట్ల ఇట్టి మూకీభావ ముండెడిదా? స్వదేశ సంస్థానాధీశుల విపరీత విశృంఖల వర్తనల యెడ ఇట్టి తాటస్థ్య ముండెడిదా?

దీని నంతయు చూచినప్పుడు భారత భూమి కష్టము లింతటితో దీరవని హృదయము పరితపించు చుండును. కాని, ఆశాలేశము లేకపోలేదు. సంస్థాన ప్రజలే నేడు సంఘీభావమును పెంపొందించు కొనుచు, స్వీయ స్వాతంత్ర్య సిద్ధికై కృషి

సలుపుచున్నారు. నిర్బంధము లెన్ని యున్నను అనేక సంస్థానములలో ప్రజా సంస్థలు ఏర్పడు చుండుటయే ఇందుకు నిదర్శనము.

సంస్థాన ప్రజల ఆందోళనములో మనము పాల్గొన లేకపోయిన, పోవచ్చును. కాని, వారి ఆకాంక్షల యెడ సానుభూతిని వెల్లడించుట సంస్థానేతర భారతీయుల మగు మన సామాన్య ధర్మము. దీనిని గూడ నిర్వర్తింప లేకపోయినచో మనము స్వరాజ్యమునకు అనర్హులమని చెప్పక తప్పదు.ఈ సామాన్య ధర్మనిర్వహణ ప్రబోధమునకే నేనీ గ్రంథరచనకు పూనుకొంటిని. దీనిని చదివి ఒక్క సంస్థానేతర భారతీయుడైనను “మన పొరుగుననే సోదరదేశీయులు ఇన్ని ఇడుముల గుడుచుచున్నారా?" అని పరితాపతప్త హృదయుడగు నేని నేను కృతకృత్యుడనైతిననియే భావింతును.

ఇక, సంస్థాన ప్రజలలో ఒక్కడేని దీనిని గాంచి "మన దుర్భరావస్థల యెడ సానుభూతి గలవారు లేకపోలే" దాని గుండె దిటవు పరచుకొనినచో, నా సంతోషాతిశయమునకు, నా ఆనందాతి రేకమునకు, నా...

మహారాజులు

పరిపాలకుని జీవన క్రమమును అనుసరించియే అతని పరిపాలనా విధాన ముండును. ఇందుచే స్వదేశ సంస్థానముల పరిపాలనా పద్ధతిని పర్యాలోచించుపట్టున తత్పాలకుల జీవిత విధానములను వర్ణించుట అసందర్భము కానేరదు.

సంస్థానాధీశుని లేబ్రాయమంతయు పరిపూర్ణముగ అంతఃపురములలోనే గడచును. అతనికి సర్వసామాన్యముగ పెక్కుమంది సవతి తల్లులుందురు. వారి ఈర్ష్యానలమునకు ఆత డెక్కడ ఆహుతి యగునో యను భయముచే అతనిని కంటిని రెప్పవోలె గాచుచుందురు. ఈ భయము నిరాధారమైనది కాదుకూడ! పట్టమహిషీ గర్భమున బుట్టినారను వ్యాజమున అప్పుడప్పుడు కొందరు రాకుమారులు సవతి తల్లులచే దారుణముగా హత్య గావింపబడిరి; కావింపబడు చున్నారు. కాని, సరియగు నిదర్శనము లేకుండుటచే ఇట్టి విషయములు బయల్పడవు. సంస్థానాధీశుల జీవన నవనవోదయ వికాసావసరములందే ఇట్టి విషవాతావరణము ఆవరించు చున్నప్పుడు వారికెట్లు లభింపగలదు - సచ్చరిత్రమును, సన్మార్గ వర్తనమును?

కాలు వచ్చిన పిదప గూడ అతనిని గడప దాటనీయరు. ఎల్లప్పుడును తల్లియే యతనిని చంక నెత్తుకొని తిరుగుచుండును; లేదా పరమ విశ్వాస పాత్రురాలగు దాసి చేతికిచ్చును. ఆ దాసియు అతనిని “తండ్రీ" అనియు, “ప్రభూ" అనియు, “దేవా” అనియు సంబోధించుచు, విపరీతమగు భయభక్తులను ప్రదర్శించు చుండును. ఈ పదముల అర్థజ్ఞాన ముదయించినప్పుడు వాని వలన అతనికి గలుగు భావోన్మేషణ మేమి? తాను అపర దైవతము ననియే కాదా! అతని ఆటపాటలకు గూడ దాసదాసీ జనుల బిడ్డలనే సమకూర్తురు. అతడు తిట్టినను, కొట్టినను, పడదన్నినను వారు పొరపాటుననైన నోరెత్తరు. నోరెత్తి, వారు బ్రదుకగలరా? ఇక, అతనికి బాల్యముననే నిరంకుశాధికార ప్రేమయు, మానవ సమభావ శూన్యతయు అబ్బుటలో ఆశ్చర్యమేమి?

ఏడవ యేట అతనిని పాఠశాలలో ప్రవేశ పెట్టుదురు. సాధారణ పాఠశాలలో అని భ్రమింతురేమో! కాదు!! అనస్తంగత సూర్యసామ్రాజ్యమునకు భావి కాలమునందు అధిపతి యగు వాడే బ్రిటీష్ పౌరులతో బాటు ఆక్స్ఫర్డులోనో, కేంబ్రిడ్జిలోనో చదువుకొనును. కాని, మనవారి కిది తగదు! వేల్సు యువరాజు పద్ధతినే అనుకరించినచో, మరి వీరి ప్రత్యేకత యేమి?

పొరపాటు! - - ఇట్టి ప్రత్యేక పాఠశాలలు కళాశాలలు నాలుగు కలవు. ఇక్కడ అన్ని విషయములను నేర్పుదురు, - ఉపయోగమైనవి వినా! ఎన్నడును పరీక్ష లుండవు. కాని, పట్టములు మాత్రము తప్పక లభించును! ఆటపాటలలో పోటీలు జరుగును. తుదకు గెలిచిన వారికి, ఓడిన వారికి కూడ సువర్ణ పతకములు సమముగ ముట్టును!!
రాకుమారులు కళాశాలావరణమును దాటి పైకి పోరాదు. ఇతరులు కూడ అనుజ్ఞ లేనిదే వారిని దర్శింపరాదు. ఇక వారు కాలమంతయు వెళ్ళబుచ్చ వలసినది ఒండొరులతోనో,సేవకులతోనో, అధ్యాపకులతోనో! "బైరాగియు, బైరాగియు రాచుకొనిన ఏదియో రాలినట్లు" వారొండొరులతో కాలము గడపుట ఆత్మాభివృద్ధికి రవ్వంతయు తోడ్పడదు. ఇక, సేవకుల మాట చెప్పనక్కరనే లేదు. పోగా మిగిలినది అధ్యాపకులు. వీరైనను విధ్యుక్త ధర్మమును సక్రమముగా నిర్వర్తించిన అది గ్రుడ్డిలో మెల్ల. కాని, అదియును లేదు.

తమ విద్యార్థులు ముందెప్పుడో రాజ్యారూఢు లైనప్పుడు తమకు త్రవ్వి నెత్తిపై పెట్టెద రన్న దురాశతో ఇంద్రులనుచు, చంద్రులనుచు అధ్యాపకులలో అధిక సంఖ్యాకులు వారిని పొగడుచుందురు. దాసదాసీజనులు ఒకప్పుడు తెలివి తక్కువగా జేసిన ముఖస్తుతిని, వీరిప్పుడు చాకచక్యముతో నిర్వర్తింతురు. ఇది సామాన్య విషయమా!!

ఈ ప్రత్యేక విద్యాలయముల వలన రాకుమారులకు లాభము లేకపోగా నష్ట మధికముగ గలుగుచున్నది. పెక్కుమంది సంస్థానాధీశులు మున్ముందుగ వీనిలోనే త్రాగుడును నేర్చుకొందురు. స్వదేశ సంస్థాన సమస్యను సంపూర్ణముగ నె రిగిన చూడర్ వీనిని గూర్చి యిట్లు వ్రాసెను.

"ఈ రాకుమార కళాశాలలు సాధారణముగ దురాచారమునకును, దుర్మదతకును మూలకందములు!"
ఇవి ఇట్లు నిరుపయోగములేగాక హానికరములైనను, ఖర్చునకు మాత్రము కొదువ లేదు. ఒక్కొక్క కళాశాలకు సాలీనా నాలుగు లక్షల రూప్యములకుపైగా వ్యయమగును. పైగా, ఒక్కొక్క దానిలో విద్యార్థులసంఖ్య యేబది మాత్రమే!

ఇటీవల రాకుమారులను విద్యాభ్యాసమునకై పాశ్చాత్య దేశములకు అందు ముఖ్యముగ ఇంగ్లండునకు - పంపుట పరిపాటియైనది. దీని వలన మరింత నష్టము గలుగుచున్నది. ఈ మధ్యనే ఒక రాకుమారుడు విద్యా సముపార్జనమునకై ఇంగ్లండు వెళ్ళెను. అక్కడ వరుసగ మూడువత్సరములు పరీక్షలన్నిటిలో దప్పెను సరిగదా, త్రాగుడును కూడ నేర్చుకొనెను. అంతదూరము శ్రమపడి వెళ్ళినందులకు కనీసము త్రాగుడు విద్యయైన నేర్చుకొనకపోవుట తప్పుగా అతడు భావించి యుండనోపు! తుదకు ఆ బాలుని స్వదేశమునకు తీసికొనివచ్చుటకై భారతదేశము నుండి ప్రత్యేకముగ నొకరు ప్రయాణము కట్టవలసి వచ్చెను. మరొక రాకుమారుడు ఇట్లే విద్య నిమిత్తము విదేశముల కేగెను. అతనికి విద్య అబ్బలేదు గాని, సుఖసంకటము లంటెను. వానితో బాధపడుచు అతడొక హోటలులో మరణించెను. "అయ్యో! పాపము!!" అను దిక్కు కూడ అచట లేకపోయెను!

ఇట్లు విద్య (అవిద్య) ముగిసిన పిమ్మట రాకుమారుని యౌవ రాజ్యపట్టాభిషిక్తుని గావింతురు. అటు పిమ్మట వివాహ...
కొద్దిలో వివాహమును గూర్చి ముగించుటకు వీలులేదు. దానికి ప్రత్యేకముగ ఒక ప్రకరణము కావలసినదే!

వివాహము

ఈ ప్రకరణమునకు "వివాహము" అను శీర్షిక నుంచితిని. ఇది పొరపాటు; "వివాహములు" అనుట యెక్కుడు సమంజసము, సత్యముకూడ! హేతువు: సంస్థానాధీశులలో అధిక సంఖ్యాకులకు కనీసము నాలుగైదు పెండ్లిండ్లు అగుటయే! దీనిని గూర్చి మున్ముందు సవిస్తరముగ తెలియజేతును.

పరిణయమహోత్సవమునకు కొన్ని మాసముల పూర్వము నుండియు ప్రయత్నములు ప్రారంభమగును. కార్మికులు, కృషికులు, వణిజులు, వేయేల! ఆబాలగోపాలమును ఈ ప్రయత్నములలో పాల్గొన వలసినదే! లేనిచో దూషణ, దండన, కారాగారవాసము...

పెండ్లి ప్రయత్నములలో పాల్గొనినందులకు ప్రతిఫల మేమి? పనిచేసి నన్ని రోజులను పొట్ట కింత కూడు! ఇంతటితో సరిపోయిన నదియే పదివేలు! కాని, "సుబ్బిపెండ్లి, వెంకిచావునకు వచ్చిన" దన్నట్లు ఇంతటితో సరిపోదు. ప్రజలు స్వయముగ కాయకష్ట మొనర్చుటయేగాక, తమబండ్లను, ఎడ్లను సంస్థానోపయోగార్థ మీయవలెను. ఒక్కొక్కప్పుడు చెంబును, చేత్రాడును కూడ ఇచ్చివేయవలెను. పైగా, ఏడుకొండల వాని ముడుపువలె వివాహసుంకమును సయితము సమర్పించుకొనవలెను.

ఈ ప్రయత్నములు ఆరంభమైనప్పుడే న్యాయస్థానములు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయములు మొదలుగా గలవన్నియు కట్టివేయుదురు. దివాను మొదలు, బిళ్ళ బంట్రోతు వరకు సంస్థానోద్యోగు లందరును పెండ్లి పనులలోనే మునిగిపోదురు.

బ్రహ్మాండముగ నిట్లు ప్రయత్నములు ముగిసినపిదప వివాహము జరుగును. వివాహములలో రెండు విధములు కలవు. మొదటిది : రాకుమారుడు స్వయముగ తరలివెళ్ళి పరిణయమందుట. రెండవది : తన బదులు తన కత్తిని పంపుట - "ఈ కత్తితోనే మున్ముందు నీగొంతు కోసెదను" అనుటకిది సాంకేతికము కాబోలు!

వివాహ సందర్భమున జరుగు వైభవమును వర్ణింప బ్రహ్మకైనను తరము కాదు. ఆ మేళ తాళములు, ఆ వారాంగనా నృత్యగీతాది వినోదములు, ఆ బాణసంచా ప్రదర్శనములు, ఆ విందులు, ఆ వేడుకలు...

ప్రజల రక్తమాంసములను పిండితెచ్చిన ధన మున్నదిగదా తగులవేయుటకు! ఇక వైభవముల కేమి కొరత?
పరిణయమైన పదియవనాటికే రాకుమారునికి ప్రథమకళత్రము పాత యగును. అప్పుడు తిరిగి బ్రహ్మాండములగు వివాహ ప్రయత్నములు - తిరిగి నిరుపమాన వైభవోజ్వలత - తిరిగి దారుణ దుర్వ్యయము...

నూతన వధువు ఆగమనముతో మొదటి భార్య జీవితము దుర్భరమైపోవును. ఆమె దిక్కు మ్రొక్కులను అరయువారుండరు. జీవచ్ఛవమువలె ఆమె రాజాంతఃపురములో ఒకమూల బడియుండును. ఆమె కష్టములిక దీరునది మృత్యుదేవత ప్రసన్నమైననాడే! పిమ్మట ద్వితీయ కళత్రపు ప్రాప్తియు నింతే! ఇట్లే తృతీయ, చతుర్ధ, పంచమ...
ఇట్టి దుస్సహజీవనముతో విసిగి ఒకప్పుడొక మహారాణి 'బొంబాయి క్రానికల్' పత్రికకు లేఖను వ్రాసినది. కఠిన కర్కశ హృదయమునైనను ద్రవింపజేయగలదా లేఖ! దానిలో ప్రతియక్షరమును వేదనాభరమున మూల్గుచున్నట్లుండును. ఎంత

యత్నించినను అనువాదము అనువాదమే! ఈ మహారాణి లేఖనుగూర్చి ఇక వేరుగ జెప్పనక్కరనే లేదు! ఐనను సాహసించి ఆమె లేఖ నుండి కొన్ని భాగములను అనువదింప నేనిట యత్నింతును:

“నా తండ్రి శ్రీమంతుడు కాడు; మరి సామాన్యుడును కాదు. నా సోదరులతో బాటు నాకు గూడ విద్యాబుద్ధులు గరపిరి. నవనాగరకుల మని నా తండ్రి గర్వపడుచుండెడివాడు. వివాహ సమయమున నా భర్తకు మంచి కట్నమునే ఇచ్చిరి. బహుశ : దానిని నా పోషణ నిమిత్తము ఉద్దేశించి యుందురు. కాని, దాని నుండి నాకొక రాగిదమ్మిడి యైనను ముట్టలేదు. దినములలో నాకు వివాహ మన సరిగ అర్థము కాలేదు. ఆనందదాయక మగు మాతృగృహ పెక్కుమంది ఉంపుడుగత్తెలు గలరనియు నా చెవినిబడెను. అప్పుడు సిగ్గుతో నేను క్రుంగిపోతిని. తలయెత్తి నా దాసీజనమునైనను జూడ సాహసింపలేకపోతిని. రాకుమారుడు నాయొద్దకు వచ్చినప్పుడు కడుజాగ్రత్తగ అతనితో ఈ విషయమై ముచ్చటించితిని. కాని, అతడు చెవిని బెట్టనేలేదు. పైపెచ్చు విశ్వాసాతీతమైన విషయముల నెన్నిటినో నా కతడు చెప్పెను. మానవుడింతటి పశుప్రాయుడు కాగలడని నే నెన్నడును భావింపలేదు.

“ఏదో వంకబెట్టి నా పుట్టింటికి పోతిని. అక్కడ ఏడ్చితిని; మొత్తుకొంటిని. మా మేనత్త నేను విన్న వానికన్న ఘోరమైన గాథలను నా కప్పుడు చెప్పెను. తిరిగి నే నెట్లో భర్త వద్ద కేగితిని. సద్వంశమున జన్మించితినను గర్వము, పవిత్ర గార్హస్య జీవనమును గడుపుచుంటినను ఆనందము నాలో విలుప్తమయ్యెను. పవిత్రత ఈ రాకుమారులకై యుద్దేశింపబడలేదు. దానికి వా రతీతులు! భర్తృకృపా కటాక్షమే నా జీవన సర్వస్వము. నేడు నేను గొప్పదానిని కావచ్చును. రేపే నేను భిక్షుకురాలిని కావచ్చును. ఖజానా నా అందుబాటులోనే యున్నది. కాని, దానిలో చిల్లిగవ్వైనను నాది కాదు. ఇట్లే దుస్తులు మోటార్లు, గుర్రములు, నౌకర్లును, కావలయునని నన్నెన్నో విధముల అవమానించుచున్నారు. ఆత్మగౌరవమునకు రాణ్మందిరాంతర్భాగమున తావు లేదట. అన్ని అవమానములను నేను సణుగుచునో, గొణుగుచునో భరించుచున్నాను. నన్ను కేవల మొక బందీగా జూచుచున్నారు. కష్టసుఖములను జెప్పుకొందమన్నను నాకు దిక్కు లేదు.

"మన రాకుమారుల కేమి దుర్బుద్ధి పుట్టినదో భగవంతునికే యెరుక! వీరిలో ఇంతమంది కనుబడిన దానివెంట నెల్ల పడుచున్నా రేల? తమ పేరు ప్రతిష్ఠలను వీరంత నిర్లక్ష్య మొనర్చుచున్నా రేల? దేశమంతయు ఉన్నత భావప్రేరితమై స్వీయాభివృద్ధికి కృషిసల్పుచుండ వీరధోగతిపాలగుచున్నారేల? వీరిలో నింతమందికి విపరీత విషయకాంక్ష యున్నదేల? సంస్థానాధీశులలో కొంతమంది విశృంఖలముగ వ్యభిచరించు నిమిత్తమే యూరపు ఖండమున కేగుచున్నా రనుట సువిదితమే! వీరు రాచకార్యములను నిర్లక్ష్య మొనర్చు చున్నారు. ప్రజలకిది కోపకారణముగ నున్నది. కాని, వీరికిది యొక లెక్కా? బ్రిటీషు ప్రభుత్వం జోక్యమే కల్గించుకొనుట లేదు. బహుశః ఆత్మవినాశన మొనర్చుకొను నిమిత్తమే వీరి కిట్టి స్వాతంత్ర్య మొసగుచున్నారు.

“సంస్థాన ప్రజలలో సంచలనము గలిగినది. వారు తమ కష్టములను మొరపెట్టుకొనుచున్నారు. వైస్రాయి వారి మొర ఆలకించునేమో! కాని, మాగతి యేమి? మేము బానిసలుగ నుండవలసినదేనా? మహారాణికి, ఉంపుడుకత్తెకు భేదమే లేదా? మాకు హక్కులు మృగ్యములేనా? బిచ్చగాండ్రకన్న మా స్థితి అధమము. కేవలము భర్తృచంచల వాంఛలను సంతృప్తిపరచుటయే మాధర్మ మనుచున్నారు. మా ఆత్మాభిమానము నెల్ల హరించుచున్నారు. మేము గూడ మానవులమే అని వాదించినచో, మమ్ములను దండించుచున్నారు.

“మా జీవితములు శూన్యములు. మే మెట్టి విషయములోను శ్రద్ధ వహించుటకు వీలులేదు. మేము మా యేలికచేతిలోని ఆట వస్తువులము. అతడు మమ్ము శృంగారింపవచ్చును, లేదా వివస్త్రల గావింపవచ్చును. మా స్థితి నిన్న మొన్నటి వరకు రష్యాలో నున్న బానిసలకన్న హీనముగ నున్నది.

"నేను గోరంతలను కొండంతలుగ చేయుచున్నానని మీరనవచ్చును. రష్యా,కాంగో మొదలగు ప్రదేశములలోని బానిసలను గూర్చి పూర్వము కొందరిట్లే అనలేదా? మీరు దక్షిణాఫ్రికాలో నున్న భారతీయుల దుస్థితికై వగచు చున్నారు. కాని మీరు మీ అభాగ్య సోదరీమణుల కరుణా క్రందనమును వినరా?"

ఎట్లున్నదో చూచితిరా, మహారాణుల స్థితి? ఎన్ని ఇక్కట్టుల నిట్లు పడుచున్నను, వారిలో ఎవరో యొకరు సాహసించి పత్రికలకు వ్రాసిననే గాని మనకు నిజస్థితి తెలియరాదు. ఇటీవలనే సెంట్రల్ ఇండియా రాణులలో నొకర్తుక - భర్త తనను బెట్టుచున్న అంపపుకోతను గూర్చి యొక లేఖను వ్రాసినది. ఆమె కతడు వలసిన ఖర్చు లన్నిటి క్రిందను నెలకు అయిదు రూప్యములను మాత్రమే ఇచ్చుచున్నాడట! ఆమెను వదలిపెట్టి కిశోరసింగు అను రాజపుత్రుని భార్యతో కాపురము చేయుచున్నాడట!

దీనినంతయు భరింపలేక మహారాణులలో కొందరు ఆత్మహత్య గావించుకొను చుందురు కూడ! అతిశయోక్తి దీనిలో లేశమైనను లేదు. ఆ మధ్యనే ఆళ్వారుగారి రాణ్మండలములో నొకర్తుక కష్టములను - వీనిని మించిన యవమానములను - పడలేక జీవితమును చేతులారా తుదముట్టించుకొనెను!

మహారాజుల వైవాహిక జీవితమును గూర్చి చూడ్గర్ అభిప్రాయమిది: "పెక్కుమంది సామాన్య మానవులను వివాహము సద్వర్తనావలంబనమునకును, సన్మార్గ గమనమునకును ప్రోత్సహించును. కాని, విధి వశముచే అది సంస్థానాధీశుని వక్రజీవన వాహినిని మరింత వక్రగతిని బ్రవర్తింపజేయును".

విలాస లీల

స్వదేశ సంస్థానాధీశులు బహుపత్నీకులే కాదు, - ఘోర వ్యభిచారాసక్తులు కూడ! ఇట్లని ప్రతి సంస్థానాధి పతియు వ్యభిచారియే యని నా యుద్దేశము కాదు. వారిలో పలువురు సచ్చరితులును, సుగుణోపేతులును లేకపోలేదు. అట్టివారు మనకు అత్యంత వందనీయులు. ఇక పోగా, మిగిలినవారి విషయము :

ఒకప్పుడు 'చాంద్' (హిందీ మాసపత్రిక) కొందరు సంస్థానపతులు భోగలాలసతను గూర్చి పెక్కు గాథలను ప్రకటించినది. వానిలో కొన్ని ఉదాహరణ రీత్యా :

“ఉన్నాడొక మహారాజు. నపుంసకు డాతడు. కాని, లోకమును మోసపుచ్చుటకై ఏడాది కొక పెండ్లిని చేసికొను చుండును. దైవ దుర్విపాకముచే అతని పాలబడిన స్త్రీల జీవితమంతయు ఘోర నరకయాతనయే! కేవలము నరకయాతనయే కాదు, - కడుంగడు లజ్జాకరము కూడ. సాధారణముగ ఆ మహారాజు మధుపానము గావించి మత్తిల్లును. తన యిష్టమిత్రులనుగూడ మత్తిల్లజేయును. అందరును మధుపానమత్తతచే కన్నులు గానక యున్నప్పుడు, మహారాణులలో ఒకరిద్దరిని రావించి, మిత్రుల కామలిప్సను సంతృప్తి పరుప వారి కాజ్ఞాపించును. అమానుషలీలను ఉన్నతాసనాధివసితుడై ఆశాపూరిత నేత్రములతో దిలకించుచు, అతడు ఆనంద పరవశుడగుచుండును. ఇటీవలనే ఒక మహారాణి ఇట్టి నీచ నికృష్ట జీవితమును భరింపలేక, విలాసభవనమును ప్రవేశింపగనే తనను కౌగిట జేర్పవచ్చిన సంస్థానోద్యోగిని చేతనున్న పిస్తోలుతో కాల్చివైచెను. పిమ్మట పిస్తోలును మహారాజునకు గురిచూపి ఆ మానవతి ఇట్లనెను : “ఇప్పుడు నీ ప్రాణము నా చేతులలో నున్నది. తలచుకొనినచో నిన్నిక లేకుండజేసి భూభారమును తగ్గింపగలను. కాని, నీ అదృష్టవశమున నేను హిందూ వనితనైపోతిని. సత్సంప్రదాయము నన్నిట్టి కార్యమును చేయనిచ్చుట లేదు. నేను

మాత్రము నా దౌర్భాగ్యజీవితమును అంత మొందించుకొన నిశ్చయించుకొంటిని." ఈ మాటలను ముగించుటయే తడవుగ ఆమె గుండెపై కాల్చుకొని, ఆ విలాస భవనములోనే జీవనలీలను ముగించెను. విషయసుఖైక లాలసతతో అచట సమావేశమైన ఆ పశుప్రాయులందరును మంత్రముగ్ధులు వోలెనుండిరి. నోరెత్త వారిలో సాహస మెవనికి?

హృదయగమనము ఆకస్మికముగ నాగిపోవుటచే మహారాణి మరణించెననుచు ఆ మరునాడు ప్రకటించిరి!!!
ఇది మరియొక మహారాజు విషయము : అతడు బహువినోద ప్రియుడు. అతనికి అత్యంత ప్రియమగు వినోదములలో ఇది యొకటి :
అతడు సారాయము త్రాగును. తన మిత్రులచే త్రాగించును. పిదప నేదైన నెపముతో వారి కులస్త్రీలను విలాసభవనములోనికి రప్పించును. ఉపస్థితులైయున్న స్త్రీ పురుషుల నేత్రములను నల్లని వసనములతో బంధించి, భోగింప ననుజ్ఞాపించును. ఇట్లు కళంకితుల గావించిన వెనుక నేత్రావరోధములను తొలగింపజేయును. కండ్లు విప్పి చూచుసరికి సోదరి సోదరుని వద్ద, తల్లి కుమారునివద్ద, మామ కోడలివద్ద, తండ్రి కుమార్తె వద్ద పడియుండుట కద్దు!!!

వీరిద్దరి తలదన్నిన మహారాజు మరొకడు రాజపుత్ర స్థానములో నుండెడివాడు. క్షణభంగురమైన జీవితమును చాలించినను, అతడు మరణించి కూడ చాల కాలము కాలేదు. (యప) కీర్తి నేటికిని నిలిచియున్నది. ఆ మహారాజు నపుంసకుడు. కాని, అతడు సమస్త సంసార సుఖముల ననుభవింప గోరుచుండెను. తన కోర్కె సిద్ధించుటకు అతడొక సాధనమును కనిపెట్టెను.దాని పేరు ఆమోదచక్రము (Joy-wheel). ఆ చక్రనిర్మాణ మిది: విలాసభవనము. దానిలో వలయాకారముగ నిరువది హంసతూలికా తల్పములు. వానిమధ్య రత్న ఖచిత సింహాసనము. ప్రతితల్పము మీదను వివిధ వర్ణ విద్యుద్దీపములు. అన్ని దీపముల 'స్విచ్చి' సింహాసనము వద్ద. ఆ యామోదచక్రము నుపయోగించు విధాన మిది: కామేచ్ఛ కలిగినప్పుడు మహారాజు సేవకునకు సూచన గావించును. వెంటనే నలుబదిమంది స్త్రీ,పురుషులు - ఇరువది జంటలు - విలాస భవనములో బ్రవేశింతురు. మొదటి గంట కొట్టగానే ఒక్కొక్క జంట ఆమోద చక్రములోని ఒక్కొక్క తల్పమును జేరును. రెండవ గంట కొట్టగానే అందరును భోగనిమగ్నులగుదురు. రత్న ఖచిత సింహాసనముపై సుఖాసీనుడైయున్న మహారాజు విద్యుద్దీపములను మధ్యమధ్య ఆర్పుచు, తిరిగి వెలిగించుచు ఈ రాక్షస దృశ్యమంతయు గాంచుచుండును. పిమ్మట ఆవేశముతో గ్రిందికి దిగి, తదేకదృష్టిగ సంభోగక్రియను నిరీక్షించును. తుదకు కామపిపాస పరిపూర్ణముగ విజృంభించి నప్పుడతడు ఏ పురుషునినైన ప్రక్కకు తొలగించి, తానే...

సుప్రసిద్ధ గ్రంథరచయితయైన కన్హయలాల్ గౌబా సయితము 'చాంద్' పత్రికవలెనే కొందరు స్వదేశ సంస్థానాధీశుల పతిత జీవితమును గూర్చి పెక్కు ఘోరవిషయములను వెల్లడించెను.

ఆయన వ్రాసినవాని నెల్ల నిట బేర్కొని పాఠకుల హృదయములను కలతపరచుట పాడిగాదు. మచ్చున కొక విషయమును మాత్ర ముల్లేఖింతును. ఎవడో యొక మహారాజు ఏటేటను వేసవికాలమున ముస్సోరీ కొండల మీదికి వాయునిషేవణార్థ మేగుచుండునట! అట పుంస్త్వపు పోటీపరీక్ష (virility contest)ను జరుపుచుండునట! దానిలో గెలుపొందినవానికి బహుమానము లొసగుచుండునట!!

వారును, వీరును వ్రాసిన గాథ లేల? ఉత్తర హిందూస్థాన సంచారములో కొందరు సంస్థానాధిపతుల పతిత జీవితమును గూర్చి నేనే స్వయముగా బెక్కు విషయములను వింటిని. ఆ విన్నవానిలో ఇది యొకటి; ఏ కార్యదర్శిగానో, తోటమాలిగానో పనిచేయుటకు ఆటపాటలలో ఆరితేరిన యువకులు కావలయు ననుచు ఒక మహారాజు వార్తాపత్రికలలో ఎల్లప్పుడును ప్రకటించు చుండునట! ఉద్యోగ కాంక్షగలవారు వినతి పత్రముతో తమ ఛాయా చిత్రములను సయితము పంపవలె ననుచు నిబంధన నేర్పరుచునట! పిమ్మట దరఖాస్తు చేసినవారి చిత్రముల నెల్ల గాంచి,

వారిలో తనకు నచ్చి వారికి వెంటనే రావలసినదనుచు ప్రయాణపు ఖర్చులను పంపించు చుండునట! ఇట్లు వచ్చినవారిలో తమ మానాభిమానములను అమ్ముకొనుటకు సంసిద్ధపడిన వారికి - ఉద్యోగమును కల్పించియైనను - ఇచ్చుచుండునట!!! వార్తాపత్రికలలోని ప్రకటనను గాంచి మోసపోయిన ఒక యువకుడే నాకీ విషయమును దెలిపెను.

ఊరు పేరులు లేకుండ సంస్థానాధీశులను గూర్చి నేను కాకమ్మ కథలను చెప్పుచున్నానని పాఠకులు శంకించినను, శంకింపవచ్చును. ఇట్లు వారు శంకాన్వితులగుట సహజము. కాదా మరి? మానవుడు - అందును పెక్కుమంది ప్రాణమాన ధనములను సంరక్షింపవలసిన బాధ్యత గలవాడు - ఇట్టి నీచాతినీచ కార్యములకు ఒడిగట్టగలడా యని ఎవరికైనను సందేహము కలుగకపోదు.

అందుచే - కడు ప్రసిద్ధమైన గాథ లగుటచే ప్రత్యేకముగ నుల్లేఖించుట కొంతవర కనవసరమైనను కొందరు మహారాజుల వ్యభిచార లీలలను వేరొక ప్రకరణమున సంగ్రహముగ వర్ణింతును.

వ్యభిచారము

పదచ్యుతులైన తుకోజీరావు హోల్కారుగారిది మొదటి గాథ

జె.డబ్లియు. బ్లేకుగారు లండన్ "వీక్లీ డిస్పాచ్"లో నిట్లు వ్రాసిరి :

"ఒక బీద మహమ్మదీయ కుటుంబంలోనిది, ముంతాజ్ బీగం. కాని, చక్కనిది. మంచి విలాస ప్రవర్తనము గలది. అందుచే మహారాజు మోహితుడై ఆమెకు తన రాణివాసములో ప్రథమ స్థాన మొసగెను.

"ఆమె కేమి కావలసినను సరియే దాని ఖరీదుతో లెక్కలేదు - తెచ్చి యిచ్చెడువాడు. కాశీ, కాశ్మీరము, మహా బలేశ్వరము మొదలగు ప్రదేశముల నుండి తెప్పించిన అమూల్యములైన పట్టుచీర లొక బీరువానిండ పెట్టి ఆమె కొసంగిరి. ఆమె ధరించు నగలో! అమూల్యములైనవే! అందు కొన్ని ఇందూరు సంస్థానపు జవాహిరీలోనివి; కొన్ని పారిస్ వర్తకుల నుండి ప్రత్యేకముగా కొని తెచ్చినవి. ఎల్లప్పుడును ఆమె వెంట అనేక దాసీజను లుండెడివారు. మహారాజావారి ప్రత్యేకపు రైలుబండిలో ఆమెకు విడిగా నొక పెట్టె యమర్చబడి యుండెడిది. 'రోల్సురాయి' మోటారుకారు ఎప్పుడు ఆమె యధీనమునం దుండెడిది. కాని, ఆమెకు స్వేచ్ఛ లేదు; రాజకుమారికల కుండు ఉపజ్ఞగూడ లేదు; దిన దిన మామె పిట్టవలె నిట్టి బంగరు పంజరములో కొట్టుకొనుచుండెడిది.

"ఆ రాణివాసములు అసూయల కాకరములు అందుచే మహారాజావారి సాదరభామ మంతాజికి కొన్ని వేళల కీడుగా పరిణమించెడునటుల కాన్పించుచుండెడిది. నిరుడు మహారాజావారి పుత్రునికి - యువరాజునకు - వివాహము జరిగినది. ఆ వివాహములో ఖర్చులకు అంచనా యేబది లక్షలకు వేసిరి. ఇందు సగము కేవలము దుబారాగా పాడైనది. ఆ పెండ్లియైన తరువాత హిమాలయములలోని ముస్సోరీకి ప్రయాణము గట్టిరి. అప్పుడు మంతాజ్ పంజరము నుండి యెగిరిపోయినది."

మంతాజ్ భోగభాగ్యముల నెల్ల కాలదన్ని పారిపోవుటకు తగిన కారణము లేకపోలేదు. 1925వ సం॥రము జనవరి 24 వ తేదీ 'కృష్ణాపత్రిక' నుండి ఈ క్రింది విషయము ఉద్ధృతములు : "1921వ సం॥ము ఏప్రిల్ నెలలో మహారాజుగారు ఇంగ్లండునకు బోవుచు ముంతాజును గూడ వెంట నిడుకొనిపోయి, కమలాబాయి యను మారు పేరున వ్యవహరింపజేసిరి. మగతాజ్ ఇంగ్లాండునకు పోయివచ్చిన యొక సంవత్సరమునకు గర్భము దాల్చెను. అప్పుడామె

యెంతయో ప్రార్థింపగా ఆమె తల్లియగు వజీరుబిగమును, మరికొందరు బంధువులును ఆమెతో నుండుటకు అనుమతినిచ్చిరి.

“తరువాత ఆమె యొక యాడపిల్లను గనెను. పుట్టినపుడు పిల్ల బ్రతికియే యున్నది. కాని, కొంతసేపటికి దాదులు ఆ శిశువు చనిపోయెనని తెలిపిరి. ఇందుచేత మంతాజ్ బేగమునకు మనసు విరిగిపోయి, అంతటితో మహారాజును పరిత్యజింప నిశ్చయించుకొనెను”.

ఎట్లో తప్పించుకొని పోయిన మంతాజ్ బేగం అష్ట కష్టములబడి బొంబాయి చేరుకొనెను. అక్కడకు చేరిన కొంత కాలమునకు అబ్దుల్ ఖాదిర్ బావలా యను నతడు ఆమెను దగ్గరకు దీసెను. ఈతడు బొంబాయి కార్పొరేషను సభ్యుడు. కోటీశ్వరుడు. మంతాజ్, బావలా గృహమునం దుండగా ఆమెను పరిత్యజింప వలసిన దనియు, పరిత్యజించినచో కోరినంత ధనము నిచ్చెదమనియు, లేనిచో హతమార్చెద మనియు బావలాకు ఎక్కడ నుండియో ఉత్తరములు వచ్చుచుండెడివి. కాని, బావలా మంతాజ్ను పరిత్యజింప నిచ్చగింపలేదు. మంతాజ్కు గూడ ఇట్టి యుత్తరములు వచ్చెడివి. కాని, ఆమె బావలా సంరక్షణమున వీరిని లెక్క జేయకుండెను.

ఆ తదుపరి వృత్తాంతము 1925వ సంవత్సరం జనవరి 17వ తేదీ నాటి కృష్ణాపత్రికలో నిట్లున్నది: “ఈ నెల 12వ తేదీనాడు సాయంత్రం 5 గంటల వరకును కార్పొరేషను సమావేశమున పాల్గొన్న తర్వాత బావలా మోటారుబండి నెక్కి షికారునకు బయలుదేరెను. ఈతనితో మంతాజ్ బేగం కూడ నుండెను. చౌపాత్ సముద్ర తీరమునకు వచ్చుసరికి అక్కడ మరొక కారులో బావలా కార్యదర్శి కె.ఇ. మాథ్యూ షికారేగుచుండుట గాంచి, అతనిని గూడ తమ కారులో నెక్కించుకొని బయలుదేరెను. అక్కడి నుండియు ఒక మోటారుబండి, వీరిని వెంటాడసాగెను. మొదట వీరు దానిని గమనింపలేదు. వీరి మోటారు మలబారుకొండల మీద 'హాంగింగ్ గార్డెన్స్' దగ్గరకు వచ్చునప్పటికి రోడ్డు వంకర తిరుగ వలసి వచ్చినది. ఆ వంకర త్రిప్పుచుండగా వెంబడించుచున్న మోటారుకారు వచ్చి వీరి బండికి కొట్టుకొనెను. బావలా షాఫర్ మహమ్మదీయుడు, వెనుక బండి తగులుటచే దాని షాఫర్ త్రాగియున్నా డని యెంచి, తన మోటారును కొంచెము ఆపెను. తోడనే ఆ మోటారు నుండి ఐదుగురు దుండగీడులు దుమికి, వీరిపై వచ్చిపడిరి. వారు మొదట ఈ షాఫర్ను కొట్టిరి. అతడు స్మృతి తప్పి పడిపోయెను. అప్పుడే చీకటి పడినది. ఆ చీకటిలో ఆ దుండగీడులు పఠానుజాతి వారివలె గన్పట్టిరి. తరువాత కారులోని వారిపై బడిరి. తుపాకుల మ్రోత వినబడెను. లోని ముగ్గురును సహాయమునకై బొబ్బలిడిరి. ఒక చివర గూర్చుండి యున్న మాథ్యూ ఎటులనో కుడిచేతిని తన కడ్డము పెట్టుకొని, బయటకు దూకెను. మధ్య గూర్చుండియున్న బావలా లేచుటకు గూడ అవకాశము లేకపోయెను. దుండగీడులు అతని చుట్టుముట్టి తుపాకుల ప్రేల్చిరి. రెండు దెబ్బలు పొట్ట మీదను, ఒక దెబ్బ ఎదురు రొమ్మునందును తగిలెను. వారిలో ఒకడు మంతాజ్ను కత్తితో చాల చోటుల పొడిచి వైచెను. కాని, ఆమె లొంగక పెనగులాడుచుండెను. ఇంతలో దైవ సంకల్ప వశముననో యన్నటుల ఆ దారినే యాదృచ్ఛికముగా ఆంగ్లేయ సైనికోద్యోగులు నలుగురొక కారులో వచ్చుచుండిరి. అందు రాయల్ ఇంజనీర్లకు జెందిన లెఫ్టినెంటు సీగార్ట్ దూరము నుండియే ఈ బీభత్స దృశ్యమును గాంచి, అప్పటి కా యువతిపై బడి పొడుచుచున్న వానితో దలపడెను. వాడును ఊరకుండలేదు. జేబులోనున్న రివాల్వరును దీసి, సీగార్టై ప్రేల్చెను. వెనుకనుండి తక్కినవారు కత్తుల విసరిరి. రెండు, మూడు తుపాకి దెబ్బలు తగిలినవి. కాని, సీగార్ట్ తాబట్టుకొనిన వానిని మాత్రము విడువలేదు. ఇంతలో ఈ కోలాహల మంతయు విని చుట్టుప్రక్కల వారందరును వచ్చిరి. సీగార్ట్ పట్టుకొనినవాడు తప్ప తక్కిన వారందరు మరి నిలిచిన లాభము లేదని యెంచి, మోటారులోనికి దుమికి, తమ్ము ఎవ్వరు అడ్డగింపకుండ నలువంకల తుపాకులను బ్రేల్చుచు, పలాయితులైరి. ఒక్కడు మాత్రము చిక్కెను. ఆస్పత్రికి పోవునప్పటికి 9 గంటలయ్యెను. రాత్రి 12 గంటల వరకు బావలా వ్యక్తతతోనే యుండెను. అతడు తన యాస్తినంతయు, తల్లికిచ్చి ఏబదివేల రూపాయలను మాత్రము మంతాజ్ బేగం పేర వ్రాసెను. ఆపరేషను చేయగనే, రాత్రి 1 గంటకు అతడు పరలోకగతు డయ్యెను”.

తదుపరి ఇందూరు సంస్థానోద్యోగులను తొమ్మిది మందిని అరెస్టు చేసి, బొంబాయి హైకోర్టులో విచారించిరి. వారిలో ఇద్దరను వదలివేసిరి. తక్కిన వారిలో కొందరికి ఉరిశిక్షయు, మరి కొందరికి ద్వీపాంతర వాసమును విధించిరి.

ఆ పిమ్మట బావలా హత్యతో తుకోజీరావు హోల్కారుగారికి సంబంధము గలదో, లేదో నిర్ణయించుట కొక ప్రత్యేక విచారణ సంఘమును నియమించుటకు భారత ప్రభుత్వం వారు నిశ్చయించిరి. ఈ సంఘము నెదుర్కొనుటకు సాహసము లేక తుకోజీరావుగారు రాజ్యాధికారమును త్యజించి మనశ్శాంతికై(?) విదేశముల కేగిరి.
విదేశముల కేగిరన్న మాటయేగాని వారికి మనశ్శాంతి లభింపనే లేదు, - తిరిగి ప్రణయలీల ప్రారంభ మగువరకు, వారు ముందుగ స్విట్జర్లాండు వెళ్ళిరి. అచ్చటి నుండి ఫ్రాన్సుకు పయనమైరి.

కాని యెక్కడను కోరిన చిత్తశాంతి దొరకనే లేదు. తుదకు తుకోజీరావుగారు కాలిఫోర్నియా (అమెరికా) చేరిరి. అక్కడ వారికి మిల్లరు కన్యతో పరిచయము కలిగెను. పరిచయము తొందరలో ప్రణయముగాను, ప్రణయము పరిణయముగాను మారెను. మిల్లరుకన్యకు హిందూ మతము నిప్పించి, తుకోజీరావుగారు ఆమెను వైభవముగ వివాహమాడిరి. ఈ వివాహమును గూర్చి "చాంద్" పత్రిక ఇట్లు వ్రాసినది. "కొందరు జో హుకుములు, మహారాజుగారికి మిల్లరుకన్యతో ధర్మశాస్త్ర బద్ధముగ వివాహము జరిగినదని వాదింపవచ్చును. కాని, దీనిని మేము సమర్థింపజాలము. శారదా పీఠ శంకరాచార్య స్వాములవారు ఈ పాపాచారముపై ధర్మముద్రను వైచిరి. ఏ ధర్మమైనను ఇద్దరు భార్యలు జీవించియుండ మూడవ వివాహము గావించుకొనుటకు అంగీకరించినచో అది ధర్మము కాదు, కానేరదు. ఇదియే ధర్మమైనచో, ఇట్టి ధర్మసాంప్రదాయములను కూలద్రోయ వలసిన సమయమాసన్నమైనది".

రెండవ కథ 'మిష్టరు ఏ' ది 'మిష్టరు ఏ' 1925వ సంవత్సర ప్రాంతమున విదేశ పర్యటనమున కేగెను. అప్పుడు పారిస్ నగరములో నుండగా వారికి రాబిన్సను సతితో పరిచయము గలిగెను. ఈమె అంతకు ముందు నుండియే భర్తతో కాపురము చేయుట మాని, మాతా పితరుల నుండి సంక్రమించిన ఆస్తితో విలాసముగ లండన్, పారిస్ నగరముల విహరించుచుండెను. ఈ స్వేచ్ఛా సంచారములో ఆమెకు న్యూటన్ అనువానితో కొంత సంబంధ మేర్పడెను. న్యూటన్ గజదొంగ. ఆవులించిన ప్రేవులు లెక్కపెట్టగలవాడు. అతడు రాబిన్సనుసతి - 'మిష్టరు ఏ'ల పరిచయము త్వరిత గతిని ప్రణయములోనికి మారుట కనిపెట్టెను. వెంటనే రాబిన్సన్ వద్ద కేగి "నీ భార్య ఒక నిగ్గర్తో పోవుచున్నది. ఆమెను డివోర్సు చేయు" మని హెచ్చరించెను.

రాబిన్సన్ అమాయకుడు. తన భార్య శీలమును గూర్చి అంతవరకత డెన్నడును శంకించియైన యెరుగడు. న్యూటన్ చెప్పిన మాట వినుసరికి అతనికి కోపము వచ్చెను. మారుమాటాడక డివోర్సు పుచ్చుకొనుటకు అతడు అంగీకరించెను.

న్యూటన్- రాబిన్సన్లు, హాబ్స్ అను సొలిసిటరు గుమాస్తా వద్దకు వెళ్లిరి. ఈ హాబ్స్ తానే సొలిసిటరుగా నటించి వలసిన కాగితములను సిద్ధపరచెను. అమాయకుడగు రాబిన్సన్ తాను చేయవలసిన సంతకములను చేసి ఇంటికి పోయెను.

పిమ్మట హాబ్స్ - న్యూటన్లు "డైవోర్సుకుగాను దావా చేయుచున్నాము గాన, జాగ్రత్త!" యని 'మిష్టర్ ఏ'ను బెదిరించి, మిడ్లండ్ బ్యాంకుపై 1 1/2 లక్షల పౌండ్లకు 'చెక్కు' పుచ్చుకొనిరి. ఈ 'చెక్కు'పై రాబిన్సన్ సంతకమును 'ఫోర్జరీ' చేసి, మొత్తము నంతటిని తామే పుచ్చుకొని 21 వేల పౌండ్లను మాత్రము రాబిన్సనుకు చెల్లించిరి. 'మిష్టర్ ఏ' మొత్తము 25 వేల పౌండ్లనే ఇచ్చెననియు, దానిలో 4 వేల పౌండ్లు హాబ్స్ ఫీజు క్రింద చెల్లిపోయెననియు చెప్పిరి.

హాబ్స్ - న్యూటన్లు చేసిన మోసము కొంతకాలము గడచిన పిదప గాని రాబిన్సనుకు తెలియదు. అప్పుడతడు 'చెక్కు' మొత్తమంతయు తనకు రావలసియున్న దని మిడ్లండు బ్యాంకుపై వ్యాజ్యము తెచ్చి, గెలిచెను.
ప్రస్తుతపు కాష్మీర మహారాజుగారే ఈ కథలోని 'మిష్టరు ఏ'!!! రాంపూరు నవాబుగారిది మూడవ గాథ:
1933 సెప్టెంబరు 17వ తేదీని వెలువడిన 'ప్రిన్సిలీ యిండియా' పత్రికలో ఇట్లున్నది :

"ఇటీవలనే రాంపూరు నవాబు తన తల్లిని, సోదరిని ఎట్లు సత్కరించెనో చూడుడు! రాజమాతను కుమార్తెతో సహా రాంపూరు పురాతన దుర్గములో బంధించెను. తన యేకైక పుత్రిక పక్షము వహించినందులకై రాజమాతను కొట్టినంత పని చేయించెను.

"ప్రజలను బాధపెట్టిన ప్రభువుల సంగతి నే వినియున్నాను. కాని, కన్నతల్లిని, తోడబుట్టువును రాంపూరు నవాబువలె సత్కరించిన భూపాలుని అన్యునిగూర్చి నే నింతదనుక కని, విని యెరుగను. వారి నిట్లు బాధించుటకు గల కారణమేమి? వా రేదైనా తప్పు చేసిరా? లేదు. అతని ఘోరపశువాంఛలే దీనికి కారణము.

"రాంపూరు నవాబును చూచిన నాకు జాలి కలుగుచున్నది. కామోద్వేగమును, నిరంకుశాధికారమును అతని కన్ను గప్పినవి. ఇందుచే అతనికి వావివరుసలుకూడా తెలియుట లేదు. ఇట్లు బాధింపబడుటకు రాజమాతయు, ఆమె పుత్రియు చేసిన పాపములెవ్వి? పదుచుదనములోనున్న నవాబు తన మేనల్లుండ్ర నిద్దరిని వారి భార్యలను 'డివోర్సు' చేయుడని కోరెను. మేనల్లుండ్రు భార్యల సౌందర్యము అతని చిత్తము నాకర్షించింది. ఇదియే గొడవ కంతకును కారణము.

"నవాబు తాను కోరినంతమందిని వివాహమాడవచ్చును. వలసినంత మందిని ఉంచుకొన వచ్చును. జగదేక సుందరీమణులను చేరదీయవచ్చును. అందులకు తగిన శక్తి సంపన్నత యెద అతడు నిరపరాధులును, నిస్సహాయులు నగు తన మేనల్లుండ్ర భార్యలపై కన్ను వేయనేల? వారిని కన్న కుమార్తెల వలె చూచుకొనుటకు బదులు, భార్యలుగా నొనర్చుకొనుటకు యత్నింపనేల? ఇదెట్టి వాంఛ? బహుశః చికిత్సా విధానమునకు లొంగని యొక విపరీత రోగ మిది.

"అవినీతికరమును, అమానుషమును నయిన ఈ పరిణయేచ్ఛ నంగీకరింప లేదను కారణమున రాంపూరు నవాబు తన తల్లిని, సోదరిని, మేనల్లుండ్రను దినముల తరబడి కారాగారమున బంధించెను. చిన్న మేనల్లుని నిర్బంధించి, అతనిచే భార్యను డివోర్సు చేయించెను. ఈ చిన్న మేనల్లుని మామ మాలేర్ కోట నవాబు.

"మాలేర్ కోట నవాబు జోక్యము కల్గించుకొని, తన అల్లుని సమర్థింప వలసియున్నది. కాని అత డింతవరకు అల్లుని విషయమై పట్టించుకొనినట్లే లేదు. మాలేర్కోట నవాబు రాంపూరు సంస్థానాధీశునే అల్లునిగా బడయజూచు చున్నాడు కాబోలు! ఇదెంత చక్కని ఆలోచన!!

"మాలేర్కోట నవాబు కుమార్తెను 'డివోర్సు' చేయుమని నిర్బంధించినపుడు రాంపూరు నవాబు తన మేనల్లునికి తిరిగి పెండ్లి చేసెద ననెను. రాంపూరు నవాబునకు ఏడాది కూతురు గలదు. ఈ యేడాది పసికూననే 19 సంవత్సరములు నిండిన తన మేనల్లుని వివాహమాడ మనుచున్నాడు".

ఈ నవాబుగారిని గూర్చి 'ప్రిన్సిలీ ఇండియా' ఇట్లే మరి పెక్కు విషయములను ప్రకటించినది; ప్రకటించు చున్నది. వాని నన్నిటిని ఇట బేర్కొనుట అనవసరము.

ఇక జాభ్వా సంస్థానాధిపతి రాజా ఉదయసింగ్ కథ ఇది :

ఇతడు 1934 ఏప్రిల్ నాటికి మొత్తం తొమ్మిది వివాహాలు చేసుకొనెను ఆ తొమ్మిది మంది పత్నుల పేర్లు ఇవి:

1. దిమొఘర్ రాణి
2. ధరంపురి రాణి
3. ఖెరోట్ రాణి
4. మొపూర్ రాణి (గౌరాణీజీ)
5. ధరియావాడ్ రాణి
6. సంత్రంపూర్ రాణి
7. కురవాడ్ రాణి
8. రాడ్ రాణి
9. పల్లీ రాణి

ఈ తొమ్మిది పత్నులు చాలక పస్వానులు అనే వారిని ఇరవై ఆరుమదిని ఇతడు చేరదీసినాడు.

కాముకదృష్టి పడిన తర్వాత ఆమె ఎంతటి మహిళామణి అయినప్పటికిని అతడికి లొంగిపోనైనా పోవలెను; లేదా తనకు, తన వారికి ప్రాణమోసమును తెచ్చుకోనైనా తెచ్చుకొనవలెను. ఈ జాభ్వారాజు పస్వానులను గురించిన వివరములు ఇవి:

సంఖ్య/ పస్వాన్ పేరు	భర్త ఉంటే అతడి పేరు	ఇతరభోగట్టా	
1. భగీరథీబాయి	కిషన్(రట్లాం)		
2. నవరతన్బాయి	జగన్నాథ్		
3. చంద్రాబాయి	సువ	కన్వేరి	
4.నాబీబాయి(జూనియర్)	చెయిన్ సింగ్	మీనా	
5.మోతి		చనిపోయినది	
6. గామిరా	నారాయణ్	చనిపోయినది	
7.కన్వేరి	రామ	రామ	
8.గులి	మదన్		
9.కాశీబాయి	జగన్నాధ్		
10.కోది	ఫట్టా(నం.11మీనా తల్లి)		
11.మీనా	నం.10 కోది కూతురు)		
12.రామజ్యోతి	మదన్ నాబి తల్లి		
13.సుందరి			
14.మెతాబ్	మోహన్	చనిపోయినది	
15.పార్వతి			
16.లలిత (ధియోగర్)		జాని చెల్లెలు	
17.నాబి(సీనియర్)			
18.ఘేషీ	కన్హయలాల్		
19.రామస్వరూపి	రామ		

20.మోతి	బాబా జాన్		
21.దేవ్ ధబయాన్			
22.సామద్	జగ్గు	చనిపోయినది	
23.సూర్జి	ఖిమ		
24.జూభీబాయి	భర్త ఎవరో తెలియదు		
25.వసంతి	ప్రతాప్(మహారాజు ఈ బాలిక కన్యాదాత)		
26.లలిత	కిశోర్ సింగ్(మహారాజు ఈ బాలికకు కూడా కన్యాదాత)		

పోనీ, ఇంతటితో ఇతడి కామతృష్ణ తీరినదా? అబ్బే! లేదు! వీరికి తోడుగా ఇతడు ఫీజ్, మఖియా, శాంతకుమారి అను ముగ్గురు భోగపు స్త్రీలను ఉంచుకున్నాడు కూడా!! ఇట్లున్నవి కొందరు సంస్థానాధిపతుల విషయవాంఛా పూరణోపాయములును, వ్యభిచారాసక్తియు ఇట్టి కామ ప్రవృత్తి గల మహారాజులు చేయు ఘోరదురంతములను గౌబా యిటులు విశదీకరించు చున్నాడు :

“సంస్థానాధిపతి అంతఃపురమున జరుగు విషయములు నెల్ల తెలిసికొనుట దుస్సాధ్యము. అప్పుడప్పుడు మాత్రము సత్యము చూచాయగ తెలియవచ్చు చుండును. కొలది వత్సరములు క్రితమే పదచ్యుతుడు గావింపబడిన ఒక సంస్థానాధీశుని అంతఃపురమున భూస్థాపితమై పెక్కుమంది స్త్రీల అస్థులు కాన్పించెను. సంస్థానాధిపతి గాఢ పరిష్వంగమును నిరాకరించినందులకే వీరి కీగతిపట్టెను. ఈ భోగలాలసులను 'కా' దనుటకు గొప్ప ఆత్మ శక్తి కావలెను. ‘కా'దనిన స్త్రీ తనను పెట్టిన హింసలను ఇతరులతో సాధారణముగ జెప్పుకొనదు. ఆ ఘోర దురంతములను భరించికూడ బ్రదికియుండిన గదా, ఇతరులతో జెప్పుకొనుట! మహారాజును ధిక్కరించిన స్త్రీకి సాధారణముగ విధింపబడు శిక్ష - ఒక పెద్ద సంస్థానములో పెక్కు వత్సరములు మంత్రి పదవిలో నున్న ప్రముఖు డొకడు చెప్పినట్లు సంస్థానోద్యోగులచే మానభంగము. కాని, కొన్ని కొన్ని సందర్భములలో నూత్న వినూత్న శిక్షాపద్ధతులను కూడా వినియోగింతురు. ఎర్రగ కాల్చిన కర్రను మర్మస్థానమున నుంచుట, స్తనములను కోసి వేయుట, ముక్కును తప్పించి ముఖమును వికృత మొనర్చుట - ఇవి ఇట్టి శిక్షా పద్ధతులలో ముఖ్యమైనవి. బిడ్డలు గల తల్లి యైనచో ఆమె సమక్షముననే బిడ్డను హింసింపవచ్చును. లేదా, 'కొకైన్' విషముతో ఆమెను కృశింపజేసి, కృశింపజేసి చంపవచ్చును". -

ఎవరిని గూర్చి గౌబా వ్రాయుచున్నా డిట్లు? మానవులను గూర్చియేనా? లేక... లేక...

స్వంత ఖర్చు

వేళ్ళమీద లెక్కపెట్టవచ్చునేమో సక్రమముగ పరిపాలింపబడుచున్న సంస్థానములను! వీనిలో ప్రధానములుగా ఎన్నదగినవి మైసూరు, బరోడా, తిరువాన్కూరులు. ఈ సంస్థానాధీశులు సయితము స్వంత ఖర్చు (Privy Purse) క్రింద బొక్కసము నుండి అనవసరముగ (అక్రమముగ?) హెచ్చు మొత్తమును గైకొనుచున్నారు.

మైసూరు మహారాజుగారు 1931-32 సంవత్సరములో స్వంత ఖర్చు క్రింద 21 లక్షల రూప్యములను గైకొనిరి. ఆ సంవత్సరములోనే తిరువాన్కూరు మహారాజుగారు 14 లక్షల 56 వేల రూప్యములను తీసికొనిరి. సంస్థానాదాయములో

నూటికి సుమారు 5 వంతుల చొప్పున మహారాజుగారును 7 వంతుల చొప్పున తిరువాన్కూరు మహారాజుగారును స్వంత ఖర్చు క్రింద వాడుకొనిరని దీని యర్థము.

ఈ ఖర్చుల విషయములో మైసూరు, తిరువాన్కూరు మహారాజులను ఇటలీ దేశాధీశునితో పోల్చి చూతము గాక! ఇటలీ స్వతంత్ర దేశము. ఇంగ్లండు, ఫ్రాన్సు, జర్మనీ మున్నగు దేశములతో దానికి సమానమగు ప్రతిపత్తి కలదు. కోరినచో అది ప్రపంచ శాంతిని కాపాడగలదు, లేదా, భగ్న మొనర్ప గలదు. ఇట్టి దేశాధీశుని కన్న మైసూరు మహారాజుగారు స్వంత ఖర్చుల క్రింద 1 2 రెట్లు హెచ్చు మొత్తమును స్వీకరించుచున్నారు! తిరువాన్కూరు మహారాజుగారు దాదాపు సరిసమానమగు మొత్తమును పుచ్చుకొనుచున్నారు!!

ఇట్లని మైసూరు వార్షికాదాయము ఇటలీ యాదాయము కన్న హెచ్చుగ నున్నదనిగాని, తిరువాన్కూరు సాలీనా రాబడి ఇటలీ రాబడికి కుడి యెడమగ నున్నదనిగాని భావింతురేమో! కాదు! ఇటలీ దేశపు ఆదాయము దాదాపు 20 కోట్ల పౌండ్లు. మైసూరునకు వచ్చునది దానిలో 1 / 70 వంతు మాత్రమే! ఇక, తిరువాన్కూరు రాబడి షుమారు 17 / 2 లక్షల పౌండ్లే!! తదితర సంస్థానాధీశులకు ఆదర్శ ప్రాయులని చెప్పదగు మైసూరు తిరువాన్కూరు మహారాజులే స్వంత ఖర్చులకై అధికముగ నిట్లు గైకొనుచున్నప్పుడు తక్కినవారి సంగతి వేరుగ చెప్పనక్కరయే లేదు. ఐనను స్థితిగతు లెంత ఘోరముగ నున్నవో తెలుపుటకు ఒక రిద్దరు సంస్థానాధిపులను గూర్చి ఉదాహరణముగనైనను వ్రాయకుండుట సమంజసము కాదు.

ప్రపంచ విస్తృత సామ్రాజ్యాధిపతి యగు బ్రిటీష్ చక్రవర్తి స్వంతఖర్చు 4,70,000 పౌండ్లు. అంత విస్తృత సామ్రాజ్యాధిపతి కాకపోయినను, ఆ ఫాయకే చెందిన జపాను చక్రవర్తి ఖర్చు 4,50,000 పౌండ్లు. నజరానాలు మున్నగు వానిని కలుపుకొనినచో నైజాము స్వంతరాబడి బ్రిటీషు, జపాను చక్రవర్తుల రాబడికి దాదాపు సరిసమానమే! ఇంతకంటే విపరీత ముండగలదా!! ఇక, వార్షికాదాయమును చూతమన్న బ్రిటీషు, జపాను ప్రభుత్వముల రాబడిలో హైదరాబాదునకు వచ్చునది 1 / 300 వంతు కూడా లేదు!!!

"సర్వ ప్రపంచంలో కెల్ల కడు ప్రియమగు ఒక విదేశీయ ప్రభుత్వమును కొనసాగించుటకే పైన పేర్కొనబడిన అన్యాయము లన్నియు జరుపబడుచున్నవి. ఉదాహరణముగ మీ వేతనమునే గైకొనుడు. అన్యమార్గముల సంక్రమించు మొత్తములు గాక మీకు మాసమునకు రూ.21,000లు చెల్లింప బడుచున్నవి. బ్రిటీషు ప్రధానామాత్యుని మాసిక వేతనము షుమారు రూ.5,400లు మాత్రమే! భారతదేశపు సగటు ఆదాయము దినమునకు రెండణాలైనను లేదు. కాని, మీరు దినమునకు 700 రూప్యములకు పైగా గైకొనుచున్నారు. గ్రేటు బ్రిటను సగటు ఆదాయము రోజునకు దాదాపు 2 రూపాయలు ఐనను, బ్రిటీషు ప్రధానామాత్యుడు రోజుకు 180 రూపాయలు మాత్రమే పుచ్చుకొనుచున్నాడు. భారతదేశపు సగటు ఆదాయము కన్న 5 వేల రెట్లకు పైగా మీకు ముట్టుచున్నది. బ్రిటీషు ప్రధానామాత్యునికి బ్రిటీషు సగటు ఆదాయము కంటే కేవలం 90 రెట్లే!" అనుచు ఉప్పు సత్యాగ్రహమును ప్రారంభించుటకు ముందు వైస్రాయిగారికి వ్రాసెను 1.

భారతీయుని సగటు ఆదాయముకన్న 5 వేల రెట్లను రాజప్రతినిధి పుచ్చుకొనుటయే అన్యాయ మైనచో నైజాము చేయుచున్న పనిని ఏమనవలెనో పాఠక మహాశయులే నిర్ణయింపవలెను. నైజాము స్వంత రాబడి, భారతీయుని సగటు ఆదాయము కంటే ఏ లక్ష రెట్లో, రెండు లక్షల రెట్లో!!

ఒక్క సంవత్సరములో నైజామునకు వచ్చు స్వంత రాబడిని నెలకు నూటికి 12 అణాల వడ్డీ చొప్పున బ్యాంకులో వేసినచో, వట్టి వడ్డీ డబ్బులతో గవర్నరు జనరల్కును, ఆయన కార్య నిర్వాహక వర్గ సభ్యు లందరికిని శాశ్వతముగ వేతనములను చెల్లింపవచ్చును!!

విదేశములతో సరిపోల్చి చూచినప్పుడు మన సంస్థానముల పరిస్థితులు ఎంత వ్యత్యస్తముగ నున్నదియు క్రింది పట్టికను బట్టి గురుతింపనగును :

అధిపతి స్వంతఖర్చు ప్రభుత్వాదాయములో

ఇంగ్లండు	1 / 1600 వంతు
బెల్జియం	1 / 1000 వంతు
ఇటలీ	1 / 500 వంతు
డెన్మార్కు	1 / 300 వంతు
జపాను	1 / 400
నార్వే	1 / 700
స్పెయిను(రిపబ్లిక్ పూర్వం)	1 / 500 వంతు
తిరువాన్కూరు	1 / 17 వంతు
మైసూరు	1 / 14 వంతు
నైజాము	1 / 13 వంతు
బరోడా	1 / 13 వంతు
కాశ్మీరు	1 / 5 వంతు
బికనీరు	1 / 5 వంతు

ఈ ప్రకరణారంభమున పేర్కొనిన సంస్థానాధిపతులే నిజమునకు చాల మెరుగు. వీరికన్న ఘనులు మరికొందరు వచ్చిన ఆదాయములో సగమునకు పైగా తామే దిగమ్రింగుదురు!

అనవసరముగ సైనికశాఖకై విపరీతముగ వెచ్చింపబడుచున్నదను విమర్శనుండి కొంతవరకైనను తప్పించుకొనవచ్చుననెడి ఉద్దేశముతో భారత ప్రభుత్వము కొంత సైనిక వ్యయమును రైల్వే శాఖ, ఆర్థిక శాఖ మున్నగు వానిపై రుద్దుచుండును. కొందరు సంస్థానాధీశులు కూడా ఇట్లే గావించుచున్నారు. రాజమందిరమును బాగు చేయించుటకగు ఖర్చులను వారు పబ్లిక్ వర్క్సు శాఖపై వేయుచున్నారు. వేటకగు పైకమును ఫారెస్టు డిపార్టుమెంటు పేర ఖర్చు వ్రాయుచున్నారు.

వేశ్యలకగు ఖర్చును (గౌబా చలోక్తిగ నన్నట్లు) హోం డిపార్టుమెంటు లెక్కలలో జేర్చుచున్నారు! ఇందుల కుదాహరణముగ ఇందూరును గైకొనుడు. ఈ సంస్థానమునకు 1926 వ సంవత్సరమున 1,28,10,887 రూపాయలు ఆదాయము వచ్చెను. ఆ సంవత్సరపు బడ్జెటులో సంస్థానాధీశుని స్వంతఖర్చు నిమిత్తము 23,22,924 రూపాయలను ప్రత్యేకించిరి. మొత్తము వార్షికాదాయములో నూటికి 18 వంతులు చొప్పున సంస్థానాధీశుని స్వంత ఖర్చు క్రింద చెల్లిపోయెనని దీని యర్థము. కాని, నిజమునకు అంతకన్న అధికముగనే స్వంతఖర్చుకై వ్యయపడెను. ఆ సంవత్సరములో లాలాబాగ్ రాజమందిరమును నిర్మించుటకై 6 లక్షల రూప్యములు వెచ్చింపబడెను. ఈ మొత్తము స్వంతఖర్చులోనికి రావలసి యున్నను వానిని పబ్లిక్ వర్క్సు శాఖ లెక్కలలో జేర్చిరి. కొన్ని రాజమందిరములను బాగుజేయించుటకైన మరి 6,000 రూపాయలను కూడ పబ్లికు వర్క్సు శాఖపై రుద్దిరి. వేటకై ఖర్చు పెట్టిన 12,000 రూపాయలను సయిత మిట్లే

అటవీ శాఖపై త్రోసిరి. ఈ మొత్తములను, ఇట్టివే యగు మరి కొన్నిటిని కలిపి లెక్కకట్టినచో మొత్తము రాబడిలో సంస్థానాధీశుని స్వంతఖర్చు నూటికి 18 వంతు లగుటకు బదులు, 22 వంతుల వరకు ప్రాకును!!

దాదాపుగా అన్ని సంస్థానములలోను లెక్కకట్టు పద్ధతి ఇంచుమించుగ నింతే! ఇదేటి న్యాయమో, ధర్మమో...
అమృతలాల్ ఠక్కర్ "సర్వెంట్సు ఆఫ్ ఇండియా సొసైటీ" సభ్యుడు. అఖిల భారత హరిజన సేవాసంఘ కార్యదర్శి. అతడు అతివాది యనుటకు ఎవ్వడును సాహసింపలేడుగదా! అట్టి ఠక్కర్, సంస్థానాధీశుల స్వంతఖర్చు విషయమై వ్రాసెనిట్లు: "తాము చేయు ఖర్చుల విషయమై ఎవరికిని బాధ్యులు కాని కారణమున మహారాజులు ప్రస్తుతం సంస్థానపు బొక్కసమును తమ సొంతములైగాను, సంస్థానమును ప్రయివేటు ఎస్టేటుగాను పరిగణించు చున్నారు. పెక్కు సందర్భములలో సంస్థానాదాయములో సగమునకు పైగా మహారాజుగారి క్రిందను, వారి కుటుంబము క్రిందను చెల్లిపోవుచున్నది".

కాలవైపరీత్యము వచ్చినప్పుడు కంచెయే చేనును మేయును గదా!

దుర్వ్యయము

"ఆకలి మంటచే మాడిపోవుచున్న బిడ్డల స్థితిని చూడలేక తల్లులు చేతులార వారి కుత్తుకల నుత్తరించుచు, మాతృత్వమును మంటగలుపుచున్నా రొక దిక్కున. శ్వేత ప్రభువరేణ్యుల నాహ్వానించుటకును, వారికి విందుల నొసగుటకును లక్షలకొలది రూప్యములు తగులవేయబడు చున్నవి మరొక దిక్కున. సంరక్షణాలయములు సున్న యగుటచే వేనకువేలుగ స్త్రీలును, శిశువులును మృత్యుముఖమున బడుచున్నా రొకవైపున. కుక్కలను కొని పెంచుటకై లక్షల లెక్కను ఖర్చు పెట్టబడుచున్నది వేరొక వైపున. విద్యాలయములు లేని కారణమున కోట్ల కొలది బాల బాలికలు విద్యా సముపార్జనమను జన్మహక్కును గోల్పోవుచున్నా రొకవంక. ప్రజారక్త రంజిత ధనరాశులు వేశ్యాచరణకమలసన్నిధిని సమర్పింప బడుచున్న వింకొక వంక" అనుచు 'చాంద్' పత్రిక వ్రాసె నొకప్పుడు సంస్థానాధీశులను గూర్చి.

ప్రజాదృష్టిని ఆకర్షించుటకై కోసిన కోతలు కావివి. ఈ వాక్యములలో ప్రత్యక్షరమును సత్యసమ్మతమైనదని నిదర్శన పూర్వకముగ నిరూపింప వచ్చును, పాఠక మహాశయులు కొంచెమోపిక పట్టినచో.

కీర్తిశేషులైన, నవానగరు జాం సాహెబుగారు - వీరికే బ్రిటీషు ప్రజలు 'రామ్' అను ముద్దు పేరిడిరి. వీరు క్రికెటు ఆటలో బహునిపుణులు. సంవత్సరమునకు తొమ్మిది నెలలు విదేశములలోనే కాపుర ముండెడివారు. పరమపదించుటకు ముందు 'స్వదేశీయుద్యమము'ను ప్రతిఘటించుటకై హైంద వాంగ్లేయ వాణిజ్య సంస్థను నెలకొల్పుటకు వీరు భగీరథయత్నము లొనర్చిరి. ఇంతకును చెప్పవచ్చిన దేమన, కీర్తిశేషులైన జాం సాహెబుగారు, వివిధ ప్రభుత్వోన్నతోద్యోగులకు స్వాగత సత్కారములను చేయుటకై క్రింద తెలుపబడిన విధమున ప్రజావిత్తమును వెచ్చించిరి :

	రూపాయలు (లక్షలలో)
సిడెన్ హామ్ ప్రభువు	7
వెల్లింగ్టన్ ప్రభువు	10
లాయడ్ ప్రభువు	5
రీడింగు ప్రభువు	5

ఇర్విన ప్రభువు	25 (!!)

తుదిని - జీవితములో తుది నని కాదు : పట్టికలో తుదిని - వెచ్చించిన 25 లక్షల రూప్యములును చెల్లిపోయిన విధము క్రింద చూడనగును.

	రూపాయలు(వేల సంఖ్యలో)
కొత్త మోటార్లు	400
మోటారు బోట్లు	580
నౌకర్ల దుస్తులు	65
అలంకారములు	200
పుష్పమాలికలు	15
కర్పూరహారములు	5
కొత్త ఎలక్ట్రిక్ సామానులు	150
డేరాలు	50
పెట్రోలు	25
వేట	100
విందు	100
ఫర్నిచరు	100
ఫొటోలు	35
తివాచీలు	30
బాణసంచా	20
చెప్పగారాని కార్యములకు	300
తదితరములకు	315
మొత్తము	2500

ఈ లెక్కలను జూచినప్పుడు పెండ్లము మెడలోని పుస్తె నమ్మి, శిస్తును చెల్లించు రైతు పడు చిత్తక్షోభ, హృదయావేదన...

ఇక, పాటియాలా మహారాజు *(ఈయన ఇటీవలనే చనిపోయినాడు)* గారికి కుక్కలపై గల ప్రేమ జగద్విదితమే. లండన్ నగరమునకు పోయినప్పు డెల్ల కుక్కలను కొనుటకై వీరు లక్షలాదిగా రూప్యములను వెచ్చింతురు. దీనిని గాంచి, కుక్కలన్న పడిచచ్చు ఆంగ్లేయులే అచ్చెరు వందుదురు. మొదటి రౌండు టేబులు సభా సమావేశ సందర్భమున లండన్ వెళ్ళినప్పుడు వీ రెన్ని కుక్కలను కొనిరో నాకు సరిగ తెలియదుగాని, పందెపు పావురములు మున్నగువానిని మాత్రము విరివిగ ఖరీదు చేసిరి. అప్పుడే వీరు 50 వేల రూప్యములను వెచ్చించి, బనియనులు - డ్రాయర్లు (under-ware) కొనినట్లు నా కెక్కడనో చదివిన జ్ఞాపకము.

కుక్కలను ప్రేమించునది ఒక్క పాటియాలా మహారాజుగారే యని భావింతురేమో! కాదు. సంస్థానాధిపతులలో మరి పెక్కుమందికి కూడ కుక్కలపై ప్రేమయే! ఇట్టివారిలో ఝిండ్ సంస్థానాధిపతి యొకడు. ఇతని వద్ద కొన్ని వేల పౌండ్ల ఖరీదు చేయు కుక్క లున్నవి.

సంస్థానాధీశ్వరు లిక వేటకై వెచ్చించున దింతింత యని చెప్పనలవి కాదు. పదచ్యుతులై పరమపదించిన ఆళ్వారు(*ఈయన కూడా మొన్నమొన్ననే కాలధర్మము చెందినాడు*) మహారాజుగారి మృగయావినోద ప్రియాళుత్వమును గూర్చి లండను 'డెయిలీ హెరాల్డు' పత్రిక యొకప్పు డిట్లు వ్రాసెను:

"మహారాజుగారు ప్రస్తుతము ఆజాబ్ గర్డ్ వద్ద ఒక ఆనకట్ట (dam) కట్టించుచున్నారు. దీనివలన చక్కని నీటివసతి యేర్పడును. పంటభూములకు కాదు - ఈ వసతి! మహారాజుగారు వేట కేగు అడవులకు మాత్రమే! ఆనకట్ట వద్ద మూడు వేల మంది కూలీలను బలవంత పెట్టి పని చేయించుచున్నారు. వీరికి కూలి నిచ్చుట లేదు. కేవలమింత కూడు మాత్రము వేయుచున్నారు."మృగయా వినోదములోనేగాక, యూరపియనులకు బ్రహ్మాండముగ ఆతిథ్య మొసగుటలో గూడ మహారాజుగారికి ప్రఖ్యాతి కలదు.

"1925వ సం.లో ఆళ్వారు సంస్థానమునకు మొత్తము 3,37,500 పౌండ్లు ఆదాయము వచ్చెను. దానిలో 52,000 పౌండ్లను యూరపియనులకు ఆతిథ్య మొసగుటకై వారు వెచ్చించిరి. మోటారు డ్రైవర్ల జీతభత్యముల నొసగుటకును, పెట్రోలు మున్నగువానిని కొనుటకును, గుర్రములను పోషించుటకును, మొత్తము 65,000 పౌండ్లను ఖర్చు చేసిరి. సువారమునకై 11,500 పౌండ్లను వ్యయ మొనర్చిరి. ఇన్నీ పోగా బడ్జెట్టులో విద్యకై ప్రత్యేకించిన మొత్తము 7,500 పౌండ్లే!" పై వాక్యములు 'చాంద్' పత్రికలోనివి కావు. వీనిని వ్రాసినది, లండను 'డెయిలీ హెరాల్డ్'.

సంస్థానాధిపతుల మృగయావినోద ప్రియత్వ కారణముగా సంస్థాన ప్రజలు పడవలసిన కడగండ్లు ఇన్నన్ని కావు. ఇందుకు నిదర్శనముగా "యాన్ ఇన్ సైడ్ వ్యూ ఆఫ్ నవానగర్" అను కరపత్రము నుండి కొన్ని భాగములను ఉదహరించు చున్నాను:

"నవానగరు సంస్థానములో వేటాడుటకు గల సౌకర్యములు చాల ఖ్యాతిని బడిసినవి. ఈ ఖ్యాతికి కారణము సంస్థానములో గల వన్యమృగములు కావు; వేటకై అరుదెంచు ప్రముఖులను సంతోష పరచుటకు విశేష ధనమును వెచ్చించి సంస్థానమువారు విపిన మధ్యమున చేయు ఏర్పాట్లు మాత్రమే! నవానగరు సంస్థానము ఏర్పాటు చేయు వేట శిబిరములు స్వర్గతుల్యముగా నుండునని అనేకులు మెచ్చుకొనిరి. కాని, ఈ ఏర్పాటులను చేయుటకుగాను ప్రజల రక్తమును పిండవలసి వచ్చునను విషయము మాత్రము వారికి తెలియదు. వేటలను ఏర్పాటు చేయు సందర్భములో ప్రజలు మూడు విధములైన కష్టములను భరించవలసి వచ్చును. అవి ఏవన : వన్యమృగముల సంరక్షణకు సంబంధించిన కఠిన నియమములు; వేట శిబిరముల ఏర్పాటు విషయమై కఠిన నియమములు; ప్రజావిత్త దుర్వ్యయము.

"వేటకు తగు పక్షులను, మృగములను సంరక్షించు నిమిత్తము సంస్థానము గెజెట్లో ఎప్పటికప్పుడు క్రొత్త క్రొత్త నిబంధనలను ప్రకటించు చుందురు. అట్టివానిలో కొన్నిటిని ఉదాహరణ పూర్వకముగ క్రింద పేర్కొనుచున్నాను:
"1909 ఆగష్టు 13వ తేదీ నాటి 22వ నవంబరు హెచ్.ఇ.సి.ఎఫ్. నుండి :

"...ఈ నిబంధనలకు విరుద్ధముగా ఎవరైనను వర్తించినట్లు మేజిస్ట్రేట్ సమక్షమున నిరూపితమైనచో, అట్టి వారికి ఆరు మాసముల శిక్షనుగాని, నూరు రూపాయల జరిమానాను గాని, లేక రెంటినిగాని విధించ వచ్చును..."

"1923 నవంబరు 1వ తేదీనాడు వెలువడిన స్టేట్ గెజెట్ నందు ముద్రితమైన 22వ నవంబరు సర్క్యులర్ నుండి :
"పోలీసు, రెవిన్యూ అధికారులును, గ్రామోద్యోగులును వన్యమృగ సంరక్షణ విషయమై సంస్థానము చేయు నిబంధనల సక్రమ పరిపాలనమునకు తగు కట్టుదిట్టములను చేయవలెను.

నిబంధనల అతిక్రమణము జరిగినట్లు తెలిసినచో మహారాజు ప్రత్యేకోద్యోగిని నియమించి, ఆ విషయమై విచారణ జరిపించవచ్చును. అట్టి సందర్భములలో ప్రత్యేకోద్యోగి తీర్పు పైన తిరిగి అప్పీలుకు అవకాశము లేదు.

"1919 ఏప్రిల్ 24వ తేదీ నాటి సర్క్యులర్ నుండి :
"ఒక క్రొత్తజాతి లేడి సంస్థానములో తిరుగుచున్నది. ఈ లేళ్ళను బాధ పెట్టినను, లేక గాయపరిచినను, అట్టివారికి అయిదు సంవత్సరముల కఠిన శిక్షయు, 1000 రూపాయల జరిమానాయు విధింతుము.

"చిరుతపులులు, లేళ్ళు, మరి ఇతర జంతువులు, అనేక రకముల పక్షులు ఇవి అన్నియు వేట కనువగువానిగా ప్రకటింతురు. ఇట్లు ప్రకటన జరిగిన తర్వాత వానికి ఆత్మ రక్షణకు అవసరమై - ఇబ్బంది కలిగించినను, దానిని మహాపరాధముగా పరిగణింతురు. ఇట్టి అపరాధములు జరుగకుండ కనిపెట్టి చూచుటకు అనేకమంది తాబేదారులు గ్రామముల వెంట తిరుగుచుందురు. ఈ తాబేదారులు ఏ గ్రామనిస్థునిపై నైనను పగ సాధింపదలచిన, అతడు వేట నిబంధనలను అతిక్రమించినట్లు ప్రత్యేకోద్యోగికి ఒక అర్జీని పెట్టిన చాలును. మారు మాటాడక ప్రత్యేకోద్యోగి తమ తాబేదారుల సాక్ష్యము మీదనే ఆ గ్రామస్థునికి జరిమానా శిక్షనో, జైలుశిక్షనో విధించును.

వన్యమృగము పంటలను పాడు చేసినను, మనుష్యులనే చంపుచున్నను దానిని బెదరగొట్టుటకు గాని చంపుటకుగాని వీలు లేదు. రెండు కథలు ఈ విషయమును నిరూపింపగలవు :

1 నాగజా గ్రామమునకు చెందిన ఏడుగురు వర్తకుల మీద కౌజుపిట్టలను బెదరగొట్టిరను నేరమును మోపిరి. వారిని రెండు రోజులపాటు జైలులో నుంచి, ఒక్కొక్కరు నూరు రూపాయల జరిమానాను చెల్లించిన మీదట వదలిపెట్టిరి.

2 ఒక గ్రామపు పటేల్ మీద చిరుతపులిని చంపిన నేరమును మోపి, అతనిని ఉద్యోగము నుండి తప్పించుటయేగాక, 1000 రూపాయల జరిమానాను కూడ వసూలు చేసిరి.

3 బాల్సాన్ గ్రామములో ఒక మాల ముసలమ్మను చిరుతపులి చంపివేసెను. ముసలిదానిపై పులి పడుట చూచియు తమ కొంపలు మునిగిపోవునను భయమున ఎవ్వడును ఆ అమ్మి సహాయమునకు పోలేదు.

4 సుమేరి గ్రామములో చిరుతపులి గొల్లపిల్లవాని నొకనిని గాయపరిచెను. కాని, ఎవ్వరును వారి రక్షణకు పోలేదు.

5 రాలీయా గ్రామములో ముగ్గురు అన్నదమ్ము లున్నారు. వారి ముగ్గురికిని వారసుడు ఒక్క కుర్రవాడే! వాడు పొలములలో ఆడుకొనుచుండగా, పులి వచ్చి పైబడెను. ఎవ్వరును ఆ బాలుని సహాయమునకు పోలేకపోయిరి.

6 ఉప్లేటా గ్రామములో ఒక వితంతువు ఏకైక పుత్రుడు, ఇదే విధముగా పులివాతబడెను.

ఈ బాధ లిట్లుండ మహారాజుగాని, ఆయన అతిథులుగాని వేటకు బయలుదేరినప్పుడు శిబిర నిర్మాణము మున్నగు కార్యకలాపములకు వందలకొలది గ్రామస్థులను పిలిపింతురు.

ప్రతి గ్రామమును వంతుల ప్రకారం వెట్టి చేయుటకు గాను జట్లు జట్లుగా మనుష్యులను పంపవలెను. ఒక్కొక్క జట్టులో 10 మంది మొదలు 100 మంది వరకు ఉండుట కద్దు.

ఇక, వేట నిమిత్తము అగు ఖర్చును చూచిన సభ్యతా ప్రపంచం నివ్వెరపడి పోవలసినదే! ఏ సామన దగ్గరనో రెండు రోజుల భాగ్యమునకు శిబిరమును వేసినచో అగు ఖర్చు లక్షల సంఖ్యలోనేగాని, వేల సంఖ్యలో నుండదు. ఈ శిబిరములను చూచినవారు "జాం సాహెబ్ ఘోరారణ్యములో అలకాపురిని సృష్టించును" అని అందురు.

సందర్భము వచ్చినది గనుక కచ్ సంస్థానాధిపతి మృగయా వినోద ప్రియత్వమును గురించి లండన్ "న్యూ లీడర్" పత్రిక ఇటీవలనే వ్రాసిన వ్యాఖ్యను ఇక్కడ ఉదహరింతును: "భారతదేశపు ప్రముఖ సంస్థానాధిపతులలో కచ్ మహారాజు ఒకడు. ఇతడనిన బ్రిటీష్ ప్రభుత్వం వారికి చాల అభిమానము; నరేంద్ర మండలిలో ఇతనికి పెద్ద హోదా సయిత మున్నది. చిరుతపులులను, అడవి పందులను వేటాడుట ఇతనికి సరదా. ఆఫ్రికా నుండి చిరుత పులులను తెప్పించి, వాని నితడు తన సంస్థానపు అడవులలో వదలి పెట్టించినాడు.

"ఆత్మరక్షణ చేసుకొనుటకైనను సరియే కచ్ సంస్థానప్రజలు చిరుతపులులను గాని, అడవి పందులను గాని ఎదిరించుటకు వీలులేదు. చిరుతపులులు స్త్రీ పురుషులనేమి, బిడ్డలనేమి, మొత్తము 22 మందిని చంపినవి. అడవి పందులు ఇద్దరిని పొట్టను పెట్టుకొనినవి. ఇంతేగాక చిరుతపులులు 42 మందిని, అడవి పందులు 33 మందిని గాయపరచినవి. అయినను మహారాజుగారి దృష్టిలో తన ప్రజల ప్రాణము కంటే ఈ క్రూర మృగముల ప్రాణములకే హెచ్చు విలువ యున్నట్లున్నది!

"అడవి జంతువుల వాతబడిన వారిని గురించిన వివరములు తెలుపు పట్టిక నొకదానిని అఖిల భారత సంస్థాన ప్రజా సంఘము వారు ప్రకటించిరి. ఈ పట్టికలోని విషాద గాథలలో ఇది యొకటి:.

35 సంవత్సరముల ప్రాయముగల వ్యక్తి నొకనిని అడవిపంది గాయపరచినది. కేవలము ఆత్మరక్షణ కొరకు అతడు దానిని చంపెను. ఈ ఘోరాపరాధమునకు వేటాడెనను నెపము క్రింద అతనిని అరెస్టు చేసి, రెండు సంవత్సరముల పాటు ఖైదులో నుంచిరి. ఇటులనే 40 సంవత్సరముల ఈడుగల ఇంకొక వ్యక్తిని కూడ అరెస్టు చేసి, చావమోదిరి. అతని భార్యను, కుమారుని కూడ ఖైదు చేసిరి.

"భారత కార్మిక కర్షకులు బ్రిటన్ నుండి వచ్చిన నిరంకుశ ప్రభువుల బారి నుండి మాత్రమే గాక, స్వదేశీయులైన నిరంకుశ ప్రభువుల బారి నుండి కూడ తప్పించుకొనవలసి యున్నది. కాని, కచ్ సంస్థానములో క్రూర మృగముల వాత బడినవారిని గురించి సంస్థాన ప్రజా సంఘము వారు ప్రకటించిన పట్టికతో జతపరిచి యున్న మెమొరాండంలో చెప్పబడిన రీతిని 'దుష్పరిపాలనను, దౌర్జన్య ప్రయోగమును ప్రతిఘటించుటకు గాను ప్రజల కున్న జన్మహక్కును బ్రిటీష్ పశుబలము హరించుచున్నది. ఒకరితో ఒకరికి అవసరమున్నది గనుక, బ్రిటీష్ సామ్రాజ్యవాదులును భారత సంస్థానాధీశులును "యునైటెడ్ ఫ్రంట్" ఏర్పాటు చేసుకొనిరి". "న్యూ లీడర్" చేసిన ఈ వ్యాఖ్య - అహో! - ఎంత నిర్భీకముగ నున్నది! ఎంత సత్యముగ ...నున్నది!! ఎంత...

సిమ్లా శీతల శైలముల కేగినప్పుడు మహారాజులు గంగ కలుపు డబ్బును చూచిన ఎవరికైనను కండ్లు తిరగవలసినదే! ఆ మధ్యనొక సంస్థానాధిపతి సరిగ నాలుగురోజుల మురిపెమునకు సిమ్లా వెళ్ళెను. అప్పుడతని కైన ఖర్చు లివి :

23 మోటారు కార్లను సంస్థానము నుండి కల్కా వరకు తీసుకొని వెళ్ళుటకు	రూ.4,300
తిరిగి తెచ్చుటకు	4,300

స్పెషల్ సెలూన్	1,050
అనుచరుల రైలు ఖర్చులు	1,370
18 సీట్లు గల రైలు మోటారునకు	
ఖర్చులు (రాను-పోను)	720
హోటల్	4,500
సాదరు	7,000
మొత్తము	23,240

ఒకప్పుడు భారత ప్రభుత్వపు అనుజ్ఞ లేనిదే సంస్థానాధిపతులు తమ సరిహద్దును దాటుటకు వీలుండెడిది కాదు. కాని, జర్మనీ యుద్ధానంతరము పరిస్థితులు మారిపోయినవి. ఇప్పుడు సంస్థానాధిపతులు శీతకాలమును కలకత్తాలోను, వేసవిని విదేశములలోను గడపుచున్నారు. వారి చిత్తముల నాకర్షించుటకున్నవి గదా, కలకత్తాలో గుర్రపు పందెములును, విదేశములలో...లును!

ఆరోగ్య సంరక్షణార్థమై విదేశముల కేగుచుంటి మని సంస్థానాధిపతులు సాధారణముగ తెలుపుచుందురు. విదేశములలో విశృంఖలముగ విలాసలీలల దేలియాడుట ఆరోగ్య సంరక్షణ కొక మార్గమేమో, ఎవరి కెరుక!!

మితవాద శిఖామణియైన శ్రీనివాసశాస్త్రిగారి సంశయాస్పదములు కాని పలుకులివి: "సంస్థానాధిపతులలో అధిక సంఖ్యాకులు వారి రాణ్మందిరములలో గాన్పింపరు. ప్రజా విత్తముతో భోగముల ననుభవింప వీలగు ప్రదేశములలో నెల్ల వారు పొడగట్టుదురు. లండను, పారిస్, - వేయేల? - విలాస కేంద్రమైన ప్రతి నగరములోను యూరపియనులను దిగ్భ్రామ నొందించుచు, దగ్గర చేరినవారిని కళంకపరచుచు ఎవడైన నొక సంస్థానాధిపతి తప్పక కాన్పించును".

విదేశములలో నున్నప్పుడు వీరు రూపాయలను చిల్ల పెంకులవలె వాడుదురు. ఒక సంస్థానాధిపతి - అందును సామాన్య సంస్థానాధిపతి - లండనులో ముచ్చటగ మూడు వారము లుండి కేవలం కాంతల కొరకు 6 వేల పౌండ్లను వెచ్చించుట గౌబాగారు స్వయముగా ఎరుగుదురట!

కొలనల్ పొవెల్ వ్రాసిన విషయము లివి: "సెయింట్ జర్మన్ వద్ద నొక భారత సంస్థానాధిపతి నివసించు చుండును. ఇతని పొరుగుననే పురాతన ఫ్రెంచి రాజవంశమునకు చెందినవారు కొందరు కాపురమున్నారు. ఇతని వైభవము ముందు వారు గంజికి గతిలేనివారి వలె కాన్పింతురు. పారిస్ నగరమున కేగినప్పు డితడిచ్చు విందులు ఆ ఫ్రెంచి రాజధాని నగరమునే చకితమొనర్చును. మరియొక సంస్థానాధీశునికి ఒక్క ఫ్రాన్సులోనే ఆరు పందెపు గుర్రముల శాలలును, స్కాట్లాండులో వేట కేగినప్పుడు విడిది దిగుట కొక భవనమును, పారిస్ లో ఒక విశాల రాజమందిరమును కలవు. ఇంకొక మహారాజు మాంటాకార్లోలో నున్న 'ఇంటర్ నేషనల్ స్పోర్టింగ్ క్లబ్' లో జూదమాడుచు, ఒక్క రోజులో పది లక్షల ఫ్రాంకులను ఓడిపోయెను! (ఫ్రాంకు=10 అణాలు).

ఇట్లే మరి పెక్కు గాథలను పేర్కొనవచ్చును. కాని, విషయ మిప్పటికే విస్తరించుట వలన సంస్థానాధిపతుల దుర్వ్యయమును గూర్చి కొందరు ప్రముఖు లొసగిన అభిప్రాయములను మాత్రము పేర్కొని, ఈ ప్రకరణము నింతటితో ముగింతును. ఒక సంస్థానాధీశుని దివ్య హర్మ్యములో సుఖాసీనుడై మాంటేగ్యూ: 'సిగరెట్టు కేసులు మోటారు కార్లు - వాయు విమానములు మున్నగువాని ఆకారములతో అన్ని యెడల నున్నవి. కొన్ని కేసులకు సిగరెట్టులను పైకి తీసియిచ్చు కొంగలు కూడ అమర్చబడి యున్నవి. డైనింగ్ టేబులు మీద విద్యుచ్ఛక్తిచే నడుపబడు జలయంత్రము (Fountain)

కలదు. పాశ్చాత్య నగర వీధులలో ఇట్టి విలాస వస్తువులను గాంచి నప్పుడు, వీని నన్నిటి నెవరు కొందురా యని తరచుగ నాశ్చర్యము గలుగు చుండెడిది. తుద కివియన్నియు సంస్థానాధీశులను జేరునని యిప్పు డనుకొనవలసి వచ్చుచున్నది".

విఖ్యాత గ్రంథ రచయిత గౌబా; "ఎంతో మంది సంస్థానాధిపతుల వద్ద డజనుల కొలది 'రోల్సు రాయిస్' కార్లు కలవు. ఈ కారు ఒక్కొక్కటియు 50 వేల రూప్యములకు పైగా విలువ చేయును. డెర్బీ పందెములలో గెలుపొందిన గుఱ్ఱములను కొనుటలో భారత సంస్థానాధీశ్వరులదే ముందడుగు. ఇట్టి గుఱ్ఱములలో ఒకదానిని లక్ష పౌండ్లకు ఒక మహారాజు బేరమాడిన సంగతి ప్రఖ్యాత విషయమే గదా! ఎందరో తమకు నచ్చిన లండను, పారిస్ నగరముల గాయకురాండ్ర సాహచర్యముతో చలిబాధను బాపుకొనుచుందురు. (మాతృకలోని వాక్యమిది Not a few have their beds warmed by their pick of the music halls of London and Paris) విదేశములలో వలెనే స్వదేశమును కూడ! కోర్కెలకు మితమే లేదు. పదకొండు "హెడ్ లైట్సు" గల కార్లు; వెండి బంగారు రేకుల కార్లు; గంటకు నూరు మైళ్ళు పరుగెత్తు కార్లు; స్త్రీలతో కోరిన సరసము లాడుటకు తగిన కార్లు; ఇక స్త్రీలా? సృష్టిలో కెల్ల సుందరాంగులే! - నీలి నేత్రములు గల పొడగరి ఉత్తరాది కోమలాంగులు; సుగంధముల ప్రసరించు కుంతలములు గల దక్షిణాది లతాంగులు; సువర్ణ శరీరచ్ఛాయలతో సమ్మోహన మొనరించు ' కులు' యువతీమణులు, మధురాధరులను, నల్లత్రాచులను బోలు వేణీ బంధమును గల కాశ్మీరదేశపు స్త్రీలు! వీరందరును రాణులు కానక్కరలేదు. కాని, వీరు మహారాజు జీవితములో అంతర్భాగము లగుదురు. జీవితము నానందమయ మొనర్తురు, వీరు!"

సిమ్లాలో జరిగిన పంజాబు సంస్థాన ప్రజాసభా అధ్యక్షోపన్యాసములో థక్కర్ : "సంస్థాన ధనము భోగాతి శయములకు, మృగయా వినోదమునకు, యూరపియనుల విందులకు వెచ్చింప బడుటయేగాక భోగకన్యలకు, యూరపు - అమెరికా ఖండముల పర్యటనములకు తగుల వేయబడుచున్నదని సంస్థాన ప్రజలు గోలపెట్టు చున్నారు. పెక్కు సందర్భములలో సంస్థానాదాయములో సగమునకు పైగా మహారాజుగారి క్రిందను, వారి కుటుంబము క్రిందను చెల్లిపోవుచున్నది. ఇందుచే జాతీయాభివృద్ధికి దోహద మొనర్చు విద్యాశాఖ, ఆరోగ్యశాఖ, శౌచశాఖ మున్నగువానికి ధనము స్వల్పముగా మాత్రమే మిగులుచున్నది. ప్రజల నుండి శిస్తుల రూపముగ గైకొని డబ్బు ఏదో యొక రూపమున వారికి తిరిగి చేరుటకు బదులు స్తుతి పరాయణులు, హోటల్ కీపర్లు, లండను - పారిస్ నగరముల ఫర్నీచరు వర్తకులు మున్నగువారి జేబులలో పడుచున్నది.

"సంస్థానాధిపతుల సొంత ఖర్చును ఏ మాయమంత్రము చేతనైన సంస్థానపు రాబడిలో నూటికి పది పాళ్ళకే నియమించి, దానికి తగిన పరిశీలనమును, ఆడిటును ఏర్పాటు చేసినచో దుష్పరిపాలనము సగము తగ్గిపోగలదు. దుర్వ్యయము కూడచాలవరకు ఆగిపోగలదు. ఇటీవలనే పాటియాలా సంస్థానము వారు మూడుకోట్ల రూపాయలు ఋణము చేసినట్లు తెలియుచున్నది. ఇట్టి ఋణమును తీర్చుటకు పూర్వోక్తమైన పంథా తప్ప వేరు మార్గము లేదు.
కాని, ఏది ఆ మాయ మంత్రము !

శాసన సభలు

రామనారాయణ చౌదరిగారు రాజపుత్ర సంస్థానములను గూర్చి చక్కని వ్యాసము నొక దానిని వ్రాసిరి. దానిని 1928వ సంవత్సరం డిసెంబరు నెల 'మోడరన్ రివ్యూ' సంచికలో రామానంద ఛటర్జీగారు ప్రకటించిరి. వ్యాస రచయితయు, ప్రచురణ కర్తయు సుప్రసిద్ధులే! వ్యాసములోనివే, ఈ క్రింది వాక్యములు :

"రాజపుత్ర స్థానములోని 21 సంస్థానము లందున ప్రవర్తిల్లుచున్న పరిపాలనా విధానము పారంపర్యముగా వచ్చుచున్న నిరంకుశత్వమే. ఒక్క బికనీరులో దక్క మరి యే ఇతర సంస్థానము నందును శాసన సభ లేదు. తక్కిన సంస్థానము లన్నిటి యందును ప్రజల యనుమతిని శాసనము లొనర్చు పద్ధతి నటనకైనను లేదు. సంస్థానపతి మాటయే శాసనము. కార్యనిర్వాహకుల యుత్తరువులకును, 'లా' కును భేద మే మాత్రమును లేదు. చకాపికిగా నుత్తరువులను జారీ చేయుచుందురు. వాని నప్పుడప్పుడు స్టేటు గెజెట్టులో ప్రచురించు చుందురు. అదియును 'గెజెట్టు' ఉన్న చోట్ల మాత్రమే! ఏదోయొక కార్యమును నేరముగా బరగణించి మహారాజావారి సంతకముతో తాఖీదు వచ్చును. దానికి తగిన శిక్ష అందే విధింపబడి యుండును. ఎవడో యొక యుద్యోగికి ఆ యాజ్ఞను నిర్వహించుటకు అధికార మొసగబడును. సివిలు, క్రిమినలు కోర్టులకు కొన్ని అధికారములను తగ్గించి, వానిని కార్య నిర్వాహకోద్యోగుల కిచ్చుచు ఉత్తరువులు జారీ చేయబడుచుండును కూడ. విచారణ లేకుండా ప్రజలను దేశము నుండి వెడల గొట్టుట, వార్తాపత్రికలను ఆపిచేయుట, ఆస్తిని స్వాధీనము చేసికొనుట, ఇట్టివి సామాన్యముగ జరుగుచునే యుండును.

రాజపుత్ర సంస్థానముల వలెనే తక్కినవియు! భారత వర్షమున మొత్తము 563 సంస్థానము లున్నవి. వీనిలో 108 ప్రథమ శ్రేణిలోనివి. బట్లరు కమిటీ నివేదిక (15వ పేరా) వలన పై 108 సంస్థానములలో కేవలం 30 మాత్రము శాసనసభలను ఏర్పరచినట్లు తెలియవచ్చు చున్నది. ఈ శాసన సభలైనను వట్టి సంప్రదింపు కొరకేనట! రాజకీయ పరిభాషలో 'ప్రదర్శనము' అను పదమునకు 'సంప్రదింపు' అను దానిని ఉపయోగించుట పరిపాటి కాబోలు!

అసలు, ఉన్న శాసన సభలే తక్కువ. ఆ తక్కువలోను చాల భాగము బూటకములు. ఉదాహరణముగ బికనీరు శాసనసభనే కైకొనుడు.

ఈ శాసనసభలో మొత్తము 45 మంది సభ్యులున్నారు. వీరిలో 27 మంది క్రింది విధంగా నామినేట్ అయినవారు:

19	మంది అధికారులు
8	మంది అనధికారులు
27	

పోగా మిగిలిన 18 మంది సభ్యులును క్రింద చూపిన రీతిని ఎన్నిక అయినవారు :

12	మంది పురపాలక సంఘముల ప్రతినిధులు
3	గురు సర్దారులు
3	గురు జమీందారులు
18	

సంస్థానములో మొత్తము 15 పురపాలక సంఘము లున్నవి. వీనిలో 10 సంఘము లందు సభ్యులందరును నామినేట్ అయిన వారే! మిగిలిన అయిదింటిలో నైనను ఎన్నిక మీద వచ్చిన సభ్యుల కంటే నామినేషన్ వలన వచ్చిన వారే అధిక సంఖ్యాకులు. ఇందువలన పురపాలక సంఘముల తరఫున సంస్థాన శాసనసభకు ప్రతినిధులుగా వచ్చువారిని ఎన్నిక పొందిన సభ్యులనుటకంటే, నామినేటెడ్ జోహుకుము లనుట సమంజసము.

సర్దారుల ప్రతినిధుల విషయంలో నేమి, జమీందారుల ప్రతినిధుల విషయంలోనేమి, సరిగా ఇదే తంతు జరుగుచున్నది. ఈ ఉభయ వర్గముల వారికి సంస్థానము పూర్తి నామినేషన్ పద్ధతి మీద వేర్వేరుగా సంఘముల నేర్పరచినది. ఆ సంఘములు పంపునట్టి ప్రతినిధులు నామినేటెడ్ జోహుకుములు కారా? ఈ విధముగ బికనీరు శాసనసభ పూర్తిగా నామినేటెడ్ సంస్థ ఎన్నిక అయిన సభ్యులు నామినేషన్ పొందిన సభ్యులు అని దానిలో పైకి కనబడు విభేదము కేవలము బూటకము. ఇట్టి ఘోర పరిస్థితిలో ప్రజాభిప్రాయ ప్రకటనమునకు అవకాశమెక్కడ? ప్రజాభీష్టసిద్ధికి తరణోపాయమేది?

ఈ బికనీరు శాసనసభ 1929వ సంవత్సరం ఏప్రిల్ 15, 16 తేదీలలో ఒకసారి సమావేశ మయ్యెను.

ఆ రెండు రోజులలోనే బడ్జెట్టును చర్చించుట, దానిని 'ప్యాస్' చేయుట, సభ్యుల ప్రశ్నలన్నిటికిని ప్రత్యుత్తర మొసగుట, పెక్కు చట్టములను, తీర్మానములను ఆమోదించుట - వేయేల? వార్షిక కార్యకలాప మంతయు పూర్తియయ్యెను. శాసన సభా కార్యకలాప నిర్వహణములో ఇది 'వరల్డ్ రికార్డు!' భూజలా కాశతలముల శరవేగమున ప్రయాణ మొనర్చుటలో 'వరల్డు రికార్డు!' తమవే యని బ్రిటీషువారు గర్వింతురు. మనకును మూడు 'వరల్డు రికార్డు' లేకపోలేదు. మల్ల యుద్ధమున సర్వ ప్రపంచమును గెలిచిన గామా మనవాడే! హాకీ ఆటలో సమస్త దేశముల నోడించిన జట్టు మనదే! ఇక రెండు రోజులలో యావద్వత్సర కార్యకలాపమును బహు సులభముగ ముగించిన శాసన సభయు మన దేశములోనిదే!

ఈ రెండు రోజులలో బికనీరు శాసన సభ చేసినపని ఇది :
మొత్తము వార్షికాదాయములో నూటికి షుమారు 3 1/2 పాళ్ళను ప్రజోపయోగ శాఖల కొసగుట! మహారాజుగారి స్వంత ఖర్చులకు షుమారు 22 1/2 పాళ్ళ నిచ్చుట!! ప్రజాశ్రేయమన్న ఎంత అభిమానమో చూచితిరా!!!

ఇంతకంటే విపరీతమైనది నవానగరు శాసనసభ. 1919లో ఆళ్వారు మహారాజు ఈ సంస్థానమునకు అతిథిగా వచ్చెను. ఆ సందర్భములో అప్పటి జాం సాహెబ్ సలహా సంఘము నొకదానిని యేర్పాటు చేయవలసినదిగా ఉత్తరువు చేసి, ఆ సంఘ సభ్యులుగా కొందరు పెద్దలను నామినేట్ చేసెను. వెనువెంటనే ఆ సలహా సంఘ సభ జరిగెను. జాం సాహెబ్ సభను ప్రారంభించుచు ఉపన్యసించెను;
ఆళ్వారు మహారాజు కూడ దానిలో తన వాక్చాతుర్యములు ప్రదర్శించెను. అంతే! తిరిగి ఆ సంఘము ఎన్నడును కూడలేదు. తిరిగి దాని ఊసు ఎత్తిన వారే లేరు. అయినను తమ సంస్థానములో ఏదో ఒక శాసన సభ యున్నట్లే నవానగరు జాంసాహెబ్ నటించు చుండును!

తదితర సంస్థానములలో గూడ ఇదే నటన! మైసూరు, తిరువాన్కూరు, కొచ్చిన్ సంస్థానములలో గాక, మరి ఏ రెండింటిలోనో, మూడింటిలోనో ప్రజాభిప్రాయ ప్రకటనకు వీలైన శాసనసభ లున్నవని. మిగిలిన వన్నియు ప్రపంచమును మోసపుచ్చుటకు ఏర్పరచబడినవే!

అన్నట్లు వీని వలన ఒక లాభము లేకపోలేదు. మహారాజులు ప్రపంచ పరిస్థితులను గూర్చియు, బ్రిటీషు ఇండియా రాజకీయ వ్యవహారములను గూర్చియు గంభీరోపన్యాసము లొసగుటకు - ఆ యుపన్యాసములను వా రితరులచే వ్రాయించుకొందురనుట పొరపాటు! - ఈ శాసనసభా రంగములు చక్కగ ఉపయోగించును!

పెక్కు సంస్థానములలో శాసన సభలే లేవుగాని, శాసనములకు మాత్రము కొరత లేదు. వాక్స్వాతంత్ర్యమును హరించు శాసనములు, సభలను నిషేధించు శాసనములు, పత్రికలను నిర్బంధించు శాసనములు, ఆస్తిని వశపరచుకొను శాసనములు, ఫిర్యాదు విచారణలు లేకుండా కారాగారమున బడవేయు శాసనములు, - ఇట్లే పెక్కు లున్నవి. దీనిలో అత్యుక్తి లేదు, అణు మాత్రమైన!

“రాజు తలచిన దెబ్బలకు కొదువా?” అను సామెతను ఉబుసుపోక చెప్పిరా మరి?

సంస్థానోద్యోగులు

సంస్థానాధిపతి తరువాత అంతటివాడు దివాను. కనుక అధిపతి యెట్టివాడైనను, దివాను మంచివా డైనచో అంత ఇబ్బంది లేదు. కాని, మన సంస్థానాధీశులకు - అదేమి పాపకర్మమో గాని - వారికన్న రెండాకు లెక్కువ చదివిన దివానులే దొరకుచున్నారు!

దొరకుచున్నా రంటినా? ఇది పొరపాటే! కావలె ననియే సంస్థానాధిపతులు ఇట్టి దివానులను నియమించుకొను చున్నారు. కానిచో, వారు ఆడిన దెల్ల ఆటగాను, పాడిన దెల్ల పాటగాను సాగు టెట్లు!
ఈ దివానుల నియామకమును గూర్చి చూడర్ ఇట్లు వ్రాసెను :

"విద్యనుగాని, సామర్థ్యమును గాని, అనుభవమును గాని పూర్తిగ విచారింపకయే దివానును సాధారణముగా సిఫార్సుల మీద నియమించు చుందురు. అతనికి అసలు విద్యా వైదగ్యముగాని, పరిపాలనానుభవముగాని ముఖ్యావసర మనియే యెంచరు".

ఈ రీతిగ నియమితుడైన దివాను తదనుగుణముగనే వర్తించు చుండును. అతని వర్తనను గూర్చి చూడ్గర్ ఇట్లు వ్రాసెను:
"దీపముండగనే ఇంటిని జక్క బెట్టుకొనుట యందు దివాను నిమగ్నుడై యుండును. విలాసములకును, డాంబికమునకును సంస్థానపతిని విచ్చలవిడిగ వెచ్చింప నీయుటయే గాక, అతనిని విశృంఖల వ్యభిచార పథము నుండి తప్పించుటకైనను సాధారణముగ యత్నింపడు".

ఒకవేళ ప్రజాక్షేమమునే ప్రధానముగా నెంచు సత్పురుషుడెవడైన - పొరపాటుననో, గ్రహపాటుననో దివానుగా నియమింపబడినను, అతడు పట్టుమని పది రోజులు పని చేయక మునుపే రాజీనామా నియ్యవలసి వచ్చును. నా ఊహాగానము'కా దిది. క్రింది విషయములే నా పలుకులకు నిదర్శనములు :బొంబాయి హైకోర్టు జడ్జిగా కొంతకాలము పనిచేసిన సర్ యన్.జి. చాంద్వారా కార్ గారు (ఉపకార వేతనమును పొందినంతనే) ఇందూరు సంస్థానమునకు దివానుగా నియమితులైరి.

కాని, తుకోజీరావు హోల్కారుగారి విలాస విభ్రమములు దుర్భర మగుటచే వీరు సంవత్సరమైనను నిండకమునుపే తమ పదవిని త్యజించిరి.

రాజ ప్రతినిధి కార్యనిర్వాహక వర్గములో సభ్యులుగా నుండి, పేరు ప్రతిష్ఠల నందిన సర్ ఆలీ ఇమాంగారు హైదరాబాదు సంస్థానములో దివానుగా పని చేయుటకు అంగీకరించిరి. కాని, వారు చాల కాలము తమ పదవిలో నిలువలేదు.

సర్ ఆల్ బియన్ బెనర్జిగారు మొదట మైసూరు సంస్థానమునకు దివానుగా పనిచేసి, ఫించను పుచ్చుకొనిరి. పిదప వారు కాశ్మీరులో దివానుగా ప్రవేశించిరి. కాని 18 మాసములు తిరుగు సరికే సెలవు పుచ్చుకొనిరి.

దీని తాత్పర్య మేమి? శక్తి సామర్థ్యములు గలవాడును, ప్రజా క్షేమమును కాంక్షించు వాడును దివానుగా పని చేయుట కష్టమనియే గదా! ఇక పని చేయగలవా డెవడు? స్తుతి పరాయణుడు, స్వార్థపరుడు, పాపభయ విరహితుడు...
దివానులే ఇట్లుండ, తదితర సంస్థానోద్యోగుల సంగతి వేరుగ జెప్పవలెనా?

కొన్ని సంస్థానములలో ఉద్యోగము కోరినను, ప్రమోషన్ ఆ పేక్షించినను సంస్థానోద్యోగులు తమ భార్యలను మహారాజునకు గాని, దివానునకు గాని తార్చవలసి యుండునని గౌబా వ్రాయుచున్నాడు. నిరాధారముగ నత డిట్లు

వ్రాయలేదు. ఇందులకు నిదర్శనము వలయునేని 'ప్రిన్సిలీ ఇండియా' పత్రికలో (1929-1-15వ తేదీని) సంస్థానోద్యోగి యొకడు స్వకీయానుభవమును దెలుపుచు ప్రకటించిన క్రింది వాక్యములను చిత్తగింపుడు :

“మహారాజునకు స్త్రీలను తార్చుటలోనే సంస్థానోద్యోగులందరును నిమగ్నులై యుందురు. నేను కొంతకాల మాతనివద్ద కొలువుంటిని. నా తోడి యుద్యోగుల వలె నేను కూడ చేయవలసి వచ్చినప్పుడు అసహ్యముతో నేను రాజీనామా నియ్యవలసి వచ్చెను. ‘‘మహారాజు స్వయముగ దివానుపేర వ్రాసిన ఈ లేఖను ప్రకటించ వలసినదిగ 'ప్రిన్సిలీ ఇండియా' సంపాదకుని కోరుచున్నాను. దీనివలన పూర్వోక్తములైన నా పలుకులు సత్యము లని తెలియగలదు.

రాణ్మందిరము
28-9-1928

ప్రియమైన..... గారికి,

మీరు వ్రాసిన లేఖయు, సెలవు దరఖాస్తును చేరినవి. మీరు కోరిన సెలవు నిచ్చితిని. కాని మీరు సాధ్యమై నంత త్వరలో తిరిగి రావలెను. మీ లేఖలో ఉల్లేఖించిన ఇద్దరిని తేవలెను. వారు చాల అందముగా నుండవలెను. నాకు నచ్చినవారిని తేగలిగినచో మీరు నా విశ్వాస పాత్రులైన సేవకులని భావింతును.

విశ్వాస పాత్రుడు,
(సం) రాజా సాహెబు

స్థితిగతులు ఎంత ఘోరముగ నున్నవో చూచితిరా? తనకు నచ్చిన వారిని తార్చిన విశ్వాస పాత్రుడైన సేవకుడగునట! లేనిచో కాడట!! తుదకు తార్పుడు విశ్వాసా విశ్వాసములను నిర్ణయించు కొలబద్దయైనది!!! ఇందువలననే గౌబా "పెక్కు సంస్థానములలో పైకి వచ్చుటకు గాను మహారాజునకు ఎవతెనైన తార్చుటయే తిరుగులేని మార్గము. కన్యయైన ఉత్తమము. కాని, అందగత్తెయైన ఏ స్త్రీయైనను చాలును” అని వ్రాయ సాహసించెను.

ఈ తార్పుడు వ్యాపారములో సంస్థానోద్యోగులు ఎట్టి ఘాతుక కృత్యములకైన సమకట్టుదురు. అ దేదో సంస్థానాధిపతి సాధారణ సైనికు నొకనిని సర్దారుపదవి కొక్క సారిగా లేవనెత్తెనట. చెడి బ్రతికిన వీనికి అధికార ప్రాబల్యము చిక్కినంతనే స్త్రీలు తమ మానాభిమానములను కాపాడు కొనుటయే దుర్ఘట మయ్యెనట. ఒకనాడు మహారాజు దృష్టి ఒక గృహిణి పై బడెనట. క్రొత్త సర్దా రామెను మహారాజునకు సమకూర్చుటకై వెంటనే బయలుదేరెనట. చీకటి మరుగున ఆమె భర్తను అతడు వధించెనట. సమీపముననే ఆయత్తమైయున్న మోటారు కారులో నామెను రాజప్రాసాదమునకు యెత్తుకొనిపోయెనట. ఆ సాధ్వీలలామ మహారాజు కోర్కెను ధిక్కరించెనట.

అందుచే మొదట పదిమంది ఆమెను మానభంగ మొనర్చిరట. పిదప ఆమె కుత్తుకనే యుత్తరించిరట. ఇది తగని పని యని మందలించిన యొక మంత్రి తన యుద్యోగమునకు నీళ్ళు వదలుకొనవలసిన వచ్చెనట! ఇది వట్టి పుక్కిటి పురాణము కాదు. గౌబా వ్రాసి, ప్రకటించిన విషయము!!

ఇట్లే యున్నవి మరియెన్నో దుష్కృత్యములు! కాని, వానిని పేర్కొనుటకు నా కసహ్యము కలుగుచున్నది!! అబ్బ! అవి యెంత అశ్లీలములు, అసభ్యములు, అమానుషములు...

న్యాయ విచారణ

ఇందూరు సంస్థానములో న్యాయవిచారణః శంకర ప్రసాద దూబే ఇందూరు నగరములోని బండ్ల కార్ఖానా ఖామందు. ఇతడు 16 సంవత్సరములు లాభసాటిగ వ్యాపారము చేసెను. ఇతని కార్యానాలోనే సంస్థానపు బండ్లు కూడ చాల చేయించబడెను. ఇట్లుండ హఠాత్తుగ 1920వ సంవత్సరము అక్టోబరు 8వ తేదీని పోలీసు సూపరింటెండెంటు కొందరు భటులతో బాటు దూబే ఇంటికి వచ్చి, మహారాజుగారి ఆజ్ఞ ప్రకారము దూబే కుటుంబపు స్థిరాస్థియంతయు జప్తు చేసితిననియు, రెండు గంటలలో అతడు ఆస్తిని స్వాధీనము గావింప వలెననియు మూజువాణీగా చెప్పెను. పిమ్మట నెల దినములకు ఎప్పుడో శంకర ప్రసాద దూబే సోదరు లిద్దరు సంస్థానమునెడ ద్రోహముగ వర్తించిరనియు, వారిని సన్మార్గమున బెట్టుటకు చేసిన ప్రయత్నములు విఫల మయ్యెననియు, అందుచే దూబే కుటుంబపు ఆస్తి యంతయు జప్తు గావింపబడె ననియు 'గెజెట్టు'లో ప్రకటించిరి. శంకర ప్రసాదదూబే స్వయముగ ద్రోహకరముగ వర్తించెనని గెజెట్టు'లో పేర్కొనలేదు. ఐనను అతని సోదరులిద్దరు తనకు ద్రోహచింత నొనర్చిరని యూహించి, మహారాజు కుటుంబ మొత్తము ఆస్తిని పూర్తిగ జప్తు చేసెను! ఈ విషయమై దూబే కుటుంబీకులు భారత ప్రభుత్వము వారికి విజ్ఞప్తిని పంపుకొనిరి. కాని, అది బుట్టదాఖలై పోయెను!

ఈ సంస్థానములోని న్యాయపరిపాలనకే మరొక ఉదాహరణము : ఇందూరు సంస్థానమునకు పారంపర్యముగ వచ్చుచున్న దివానులు కొంద రున్నారు. ఈ దివానులలో ఒకడు సుందరాబాయి అను బాలికను వివాహమాడెను. వానికి మూర్ఛ కలదు. ఏ మూర్ఛ రోగియు వివాహమాడుట తగదట. అందుచే మహారాజు గారు ఆతని పెండ్లిని రద్దు చేసిరి. పోనీ, రద్దు చేసిన వారంతటితో ఊరుకొనిరా? లేదు! తిరిగి అతనికి వెంటనే వేరొక వివాహమును చేయించుటయేగాక, 20 సంవత్సరములు ప్రాయము గల బాలునొకనిని దత్తత ఇప్పించిరి. దీనిని గాంచి పాప మా సుందరాబాయి భారత ప్రభుత్వము వారికి న్యాయము దయ చేయుడనుచు విజ్ఞప్తిని పంపుకొనెను. కాని, ఆమె ప్రార్ధన వృథాయయ్యెను. ప్రజలును, పత్రికలును ఆమె యెడ సానుభూతిని ప్రకటించినవి. కాని, లాభ మేమి? ఆ బాలిక రాజప్రతినిధికి పంపిన విజ్ఞప్తిలోని క్రింది వాక్యములు గమనార్హములు : "మహారాజుగారు నాకు చేసిన అన్యాయమును బ్రిటీషు సామ్రాజ్యములో మరెవ్వరును చేయజాలరు. బ్రిటీషు సైన్యమే గదా మహారాజు గారిని సింహాసనముపై కూర్చుండబెట్టు చున్నది. ఈ రక్షణను తొలగించినచో, ఇందూరు ప్రజలు వారము దినములలో న్యాయాన్యాయములను తేల్చుకొనగలరు''

బికనీరు సంస్థానములోని న్యాయపాలనము : జయంతి ప్రసాద షానే దాన్ గారిని అరెస్టు చేసి, విచారణ లేకుండగనే రెండేండ్లు కారాగారములో నుంచిరి. మహారాజుగారికి అంగరక్షకుడుగా పనిచేయ నిరాకరించినందులకు నారాయణ సింగును దేశభ్రష్టుని గావించిరి."అనుజ్ఞ లేకుండగనే సభను జరిపి" రను కుట్ర నేరము పై గంగాప్రసాదుగారిని సంస్థానము నుండి బహిష్కరించిరి. బికనీరు రైల్వే ఆడిట్ డిపార్టుమెంటు పనిచేయుచున్న రాధాకృష్ణ టోస్నివాల్ గారిని అయిదు గంటలలో సంస్థానం నుండి వెడిలి పొమ్మనిరి. అకారణముగ జమ్నాలాల్ బజాజుగారిని, వారి అనుచరులను పట్టుకొని బికనీరు సరిహద్దు వెలుపల వదలిపెట్టిరి. 1866-67 సంవత్సరములో రైతులకు విక్రయించిన భూములలో పిక్కింటిని ఇటీవలనే లాగి కొనిరి. జర్మన్ యుద్ధ సమయమున సమకూర్చిన సైనికులకు ఈనాముగా నిచ్చిన పొలములను, తర్వాత జప్తుచేసిరి. రతన్ బాచార్ జీ దేవాలయపు గ్రామములను బలవంతముగ స్వాధీనపరచుకొనిరి. ఇట్లే మరియెన్నో విషయములు మొన్న మొన్ననే భారత సంస్థాన ప్రజా సమితి వారిచే ప్రకటింపబడిన (An Inside View of the State of Bikaner) గ్రంథములో పేర్కొనబడినవి. వాని నన్నిటిని ఇట ఏకరవు బెట్ట నేల?

జాంనగరు సంస్థానములోని న్యాయదక్షత : మానసింహఝూగారిని అరెస్టు చేసి, విచారణ లేకుండగనే అయిదు సంవత్సరములు చెరసాలలో నుంచిరి. లాల్ పూరు నివాసులైన మాల్జీనాగ్జీ గారిని అరెస్టు చేసి, ఫిర్యాదు, విచారణలు లేకుండగనే మూడు సంవత్సరములు బందిఖానాలో నుంచిరి. వారి రక్షణ నిమిత్తమై వెళ్ళిన సోదరుని కూడా కారాగారమున పడవేసిరి. అరుణ జాగీరుదారుని సేవకులలో సుమారు 50 మందిని ఒక్కసారిగా అరెస్టు చేసి,

సంవత్సరముపాటు చెరసాలలో నుంచి, నానా హింసలను పెట్టిరి. అగ్గిపెట్టెలు, కిరసనాయిలు మున్నగు దైనందిన జీవితావశ్యకములను ఇజారా పాడకూడదని విజ్ఞప్తిని పంపిన లవణ ప్రసాదుగారిని వెంటనే పట్టుకొని, 45 దినములు నిర్బంధములో నుంచిరి. ఈ 45 దినముల పిదప నైనను న్యాయ మనిగాక, కేవలము "దయ తలచియే" మహారాజుగారు వదలిపెట్టిరట!

ఇట్లే ఆళ్వారు, పాటియాలా, కాశ్మీరు, రాంపూరు...

ఇంతకన్న న్యాయవిచారణను గూర్చి వ్రాయవలసినదియు, వ్రాయదగినదియు లేదు. ఇక పేర్కొనిన, చూడ్గర్, సంస్థానములలోని పోలీసు శాఖను గూర్చి వ్రాసిన వాక్యములనే పేర్కొనవలసి యున్నది. ఆ వాక్యము లివి :"దాదాపు నూటికి 50 నేరములకు ఆచూకీయే దొరకదు. చోరీ సొత్తులో నూటికి 30 వంతులైనను పట్టుకొన బడదు. హత్యానేరములలో నిజమైన నేరస్థుడు కనీసము ఒక్కడైనను శిక్షింపబడడు. పాపపుణ్యము లెరుగనివారు తప్పుడు సాక్ష్యముపై శిక్షింపబడుదురు. పెక్కు సందర్భములలో పోలీసువారే నేరములను పురికొల్పుదురు. పేరెన్నికగన్న నేరగాండ్రను దొంగతనములు గావింప నియమించి చోరీ సొత్తులో వారు భాగము పంచుకొనుచుందురు.గ్రామములలో రూపవతులైన మహిళామణుల మానరక్షణ జరుగుట దుస్సాధ్యము!!" *(సంస్థానములలో పోలీసుశాఖ ఏ స్థితిలో నుండునో తెలుపుటకు క్రింది కథ చక్కగ ఉపకరించును: రాజపుత్ర స్థానములోని ఒక సంస్థానములో మహారాణి పూజావిగ్రహము వీధి వెంట పోవుచుండగా దర్జీవాడొకడు పరధ్యానముగా లేచి నిలబడలేదు.వెంటనే అతనిని మహారాణీ సేవకులు అరెస్టు చేసి, తీసుకువెళ్లిరి. తర్వాత రెండురోజులు గడచినను, అతడి గతి ఏమయ్యెనో తెలియలేదు. అంతట అతడి బంధువులు పోలీసు శాఖాధికారి దగ్గరకు వెళ్లి మొరపెట్టుకొనగా, ''మహారాణీగారి సేవకులు నా పోలీసులనే అరెస్టు చేయుదురు. ఇది ఒక లెక్కయా?'' అనెను.)*

పన్నులు

ఈ ప్రకరణమును చూడ్గర్ వ్రాసిన వాక్యములతో ప్రారంభించుట మంచిది: "సంస్థాన పరిపాలనా వశ్యకత ననుసరించి పన్ను లుండవు. సంస్థానము కల్పించు సౌకర్యములకు గాను ప్రజలు చెల్లింపవలసిన మొత్తములుగా కూడ వానిని పరిగణింప వీలులేదు. పన్నుల ప్రాతిపదికను విశద మొనర్చుటకుగాని, సమర్థించుటకుగాని వలను పడదు. అసలట్లు గావింప వలసిన తాను విధించు పన్నులను విశదమొనర్ప వలసినట్టియు, సమర్థింప వలసి నట్టియు బాధ్యత సంస్థానాధీశునికే లేదు. అతడు నిరంకుశాధికారి. తదితర విషయములలో వలె పన్నులను విధించుటలో గూడ అతడు తన చిత్తము వచ్చినట్లు చేయగలడు. సంస్థానాధిపతికి చిత్తము వచ్చినట్లు పన్నులను విధించు అధికార మున్నప్పుడు తక్కిన పరిస్థితులు ఊహ్యములే యనుకొనుటకు వీలులేదు. కొన్ని సంస్థానములలో ఊహాతీతమైన స్థితి యందున్నవి, పరిస్థితులు. ఉదాహరణముగ నవానగరు సంస్థానమును గైకొనుడు.

ఆ సంస్థానము విధించుచున్న పన్ను లివి :

వ్యవసాయదారులు చెల్లింపవలసినవి :

భూమి శిస్తు	పాడిపశువుల పన్ను
ఆస్తిహక్కు పన్ను(భూమిశిస్తు మొత్తంలో25 శాతం)	పశువిక్రయము పన్ను
	పశుగ్రాసము పన్ను
కరవుపన్ను (భూమిశిస్తు మొత్తములో 25 శాతం)	నేతి పన్ను
	ప్రత్తి పన్ను
కరవు భీమాపన్ను	ధాన్యాదుల విక్రయ పన్ను

కూరగాయల పన్ను
బెల్లము పన్ను
పంచదార పన్ను
బాలికా వివాహము పన్ను
పెండ్లి పెద్దల పన్ను
పునర్వివాహముల పన్ను
ఫలవృక్షముల పన్ను
తపాలా పన్ను

ఇట్లు కృషీవలుని ఆదాయములో నూటికి 60 వంతులకు పైగా పన్నుల క్రిందనే చెల్లిపోవును.
ఇక, నగరవాసులు చెల్లింపవలసిన పన్ను లివి :
నగరములోనికి దిగుమతియైన వస్తువు లన్నిటి పైనను సుంకము

ఇంటి పన్ను
బండి పన్ను
యుద్ధఋణపు పన్ను
పశుగ్రాసపు పన్ను
నేతి యుత్పత్తి పన్ను
నేతి దిగుమతి పన్ను
వ్యవసాయదారులు కాని గ్రామస్థులు చెల్లింపవలసినవి :

వడ్డీ వ్యాపారి, చిల్లర దుకాణదారుడు వగైరా తలకు	4.00
వడ్రంగి, దర్జీ వగైరా	3.5
కమ్మరి	3.00
ఊడ్పుకూలీలు, కోతకూలీలు వగైరా	3.00
దూదేకువాడు, సాలీ వగైరా	3.00
పై వృత్తులకు చెందని తదితరులు	2.00
గొల్లలు వగైరా	1.00

బిచ్చగాండ్రు (బ్రాహ్మణులు, ఫకీరులు, సాధువులు) 1.00
ఇవి కాక :
నేతి పన్ను,పశుగ్రాసము పన్ను,ప్రత్తిపన్ను ,ఉప్పుపన్ను , కరవు పన్ను

ఈ పన్నులన్నియు ఇట్లుండ నవానగరు సంస్థానములో ఒక విచిత్రమైన పద్ధతి యున్నది. బ్రిటీష్ ఇండియాలో కల్లు, సారాయి, గంజాయి, నల్లమందు మున్నగు మత్తు పదార్థములలో స్వేచ్ఛగా వ్యాపారము సల్పుటకు వీలులేదు. దొరతనము వారు పెట్టిన పాటలో హెచ్చుగ పాడినవానికే వానిని అమ్ముకొను అధికార మిత్తురు. ఇట్లే నవానగరు సంస్థానము నందు పొగాకు, కిరసనాయిలు, పెట్రోలు, అగ్గిపెట్టెలు వగైరాలను ఇజారా పాడినవారే అమ్ముకొనవలెను!!

పైన పేర్కొనిన వస్తువులకు ఒక్కొక్క దానికిని రూ. 75,000లు మొదలు రూ.1,50,000 వరకు ఇజారా మొత్తము క్రింద గైకొనుచున్నారు. దైనందిన జీవితావశక్యముల వ్యాపారము నిట్లు నిరోధించు ఘోరము, సభ్య ప్రపంచంలో మరెచ్చటను కానరాదు.

సంస్థానము అవలంబించు ఈ విపరీత విధానము వలన ప్రజలకు కలుగు నష్టములకును, వారు పడ వలసిన బాధలకును, అంతు లేదు. ఇందుకు నిదర్శనముగా "యామ్ ఇన్ సైడ్ వ్యూ ఆఫ్ నవానగర్" అను కరపత్రము నుండి పుగాకు ఇజారాకు సంబంధించిన భాగములను క్రింద పేర్కొనుచున్నాను :"పుగాకు ఇజారాను అమలు జరుపుట కష్టమైన

పని. కాని, దానిని అమలు జరపి తీరవలెను. అందుచేత ఆ పని కొరకు సంస్థానము 179 విభిన్నమైనట్టి సర్క్యులర్సును జారీ చేసినది.

"అందరు సంస్థానోద్యోగులును - న్యాయశాఖ, పోలీసుశాఖ, రెవిన్యూశాఖ : ఇట్లు అన్ని శాఖల వారును ఇజారాదారునకు అతని వ్యాపార నిర్వహణములో తోడ్పడవలెనని చాల సర్క్యులర్సు వెళ్ళినవి.

"1933 మే 1వ తేదీ నాటి స్టేట్' గెజెట్లో 300 పేజీలో క్రింది సర్క్యులర్ ను అచ్చు వేసిరి : "పుగాకును వాడువారు తాము ఇజారాదారు దగ్గర ఖరీదు చేసిన పుగాకును మాత్రమే వాడుచున్నట్లు ఇజారాదారునకు సంతృ రముగా ఋజువు పరచవలెను. ట్లు చేయనిచో వారు బయట నుండి వచ్చిన పుగాకును వాడుచున్నట్లుగా ఎంచి, 1921 జులై 30వ తేదీనాటి.8వ సర్క్యులర్ 60వ రూల్ ప్రకారము వారికి శిక్ష విధింపవలసి వచ్చును. పుగాకు వాడువారు తాము సంస్థానము పుగాకును మాత్రమే వాడుచున్నట్టును, బయటి పుగాకును వాడుట లేదనియు నిరూపించుకొనవలెను. ఇట్లు చేయనివారికి శిక్షపడును.

20 ఏప్రిల్, 1923.
(సం.) జి.బి. దేశాయి,
రెవిన్యూ సెక్రటరీ.

''జాంసాహెబ్ పాదపద్మ సన్నిధిని'' అను గ్రంథము నుండి క్రింద విషయమును ఉదహరించు చున్నాము:

"పదధారి మామ్లత్ దార్ ఇజారాదారు సంబంధితు నౌకనిని వెంటబెట్టుకొని విశామన్ అను గ్రామమునకు వెళ్ళెను. వారిద్దరు గ్రామస్థుల నందరిని ఒక చోటికి చేర్చి, పుగాకును తక్కువగా వాడుచున్నందులకు వారిని మందలించిరి. చాటుమాటుగా సంస్థానము వెలుపలి నుండి పుగాకును తెచ్చుచుండుట చేతనే ఆ గ్రామములో దాని ఖర్చు తగ్గియుండునని మామ్లత్ దార్ నిర్ణయించి, గ్రామస్థు లందరికిని జరిమానా వేసెను. తర్వాత అతడు ప్రతి గ్రామస్థుడును కనీసము అరవీసె పుగాకును కొనవలెననియు, పుగాకుతో పనిలేకపోయినచో, దాని ఖరీదు నైనను చెల్లించుకొనవలెననియు హుకుం జారీ చేసెను. ఇందుకు అంగీకరించని గ్రామస్థుల దగ్గరి నుండి అతడు తన ఆజ్ఞాపాలనమునకు అవసరమగు దస్తావేజులను వ్రాయించి పుచ్చుకొనెను.

"బయటి నుండి వచ్చువారు పుగాకును గాని, చుట్టలు మొదలైన వానిని గాని సంస్థానములోనికి తెచ్చెదరెమో నను అనుమానముతో సంస్థానము సరిహద్దుల దగ్గర అందరిని సోదా చూచుచుందురు. ఈ సోదాలో ఎవరి దగ్గిరనైనను 25 సిగరెట్ల కంటే ఎక్కువ కనబడినట్లయిన అతనికి వాటిపై చెల్లించవలసిన సుంకమునకు పదిరెట్లు జరిమానాను వేయుదురు.

"ఇంతేగాక ఇజారాదారుకు తన బాకీలను రెవిన్యూ బాకీల పద్ధతిని వసూలు చేసుకొనుటకు అధికారమిచ్చిరి. లోకు లివ్వవలసిన బాకీల వసూలు విషయములో అతడు కోర్టుకు వెళ్ళవలసిన పనిలేదు.

"ఈ రీతిగా నవానగరు సంస్థానములో పొగ త్రాగవలసినదిగా ప్రజల మీద కొంతవరకు నిర్బంధములను పెట్టుచున్నారు!"

పుగాకు వ్యాపారము వలె ప్రతిమరలు గూడ ఈ సంస్థానమున ఇజారాలో నున్నవి. దీనిని గురించి పైన పేర్కొనిన కరపత్రములో ఇట్లున్నది :

“ప్రత్తిమరల మీద ఇజారా హక్కు 1925 జులై 26వ తేదీ నాటి హుజూర్ ఆర్డర్ ప్రకారం 15 సంవత్సరాల గడువు మీద సేర్ లాల్జీకి సంక్రమించినది. ఆ ఆర్డర్ లోని ఒక భాగమిది:. సంస్థానములో పండు ప్రత్తిని ఇక్కడి మరలలోనే పట్టించుకొనవలెను గాని, సరిహద్దు వెలుపలికి తీసుకొని పోరాదు... ఇక్కడి మరలలో పట్టించక ఎవరైనను ప్రత్తిని బయటికి ఎగుమతి చేసినచో, వారికి మణుగు ఒకటికి అయిదు రూపాయల చొప్పున జరిమానా విధింతుము”.
ఈ నిబంధనల వలన క్రింది విపరీతము జరుగుచున్నది:

“సంస్థానములో ఆటకోట, భద్రా అను రెండు జిల్లాలలోను ప్రత్తి పండుచున్నది. ఈ జిల్లాలకును, రాజకోట పట్టణమునకును 16 మైళ్ళ దూరమే. ఇక సంస్థానము వారి ప్రత్తి మర యున్న నవానగర్ పట్టణము వీనికి 66 మైళ్ళ దూరములో నున్నది. రాజకోటలో ఒక బేలు ప్రత్తిని పట్టుటకు 4 1 / 2 రూపాయలు మొదలు 5 1 / 2 రూపాయల వరకు చార్జి చేయుదురు. ఇక నవానగర్ లో బేలుకు 7 రూపాయల చొప్పున చార్జి పుచ్చుకొందురు.

“ఇందువల్ల ఇప్పుడు జరుగుచున్న దేమన, - ఈ రెండు జిల్లాల వారు 50 మైళ్ళ దూరము అదనముగా తమ ప్రత్తిని తీసుకువెళ్ళి, దానిని పట్టించుకొనుటకు బేలు ఒకటికి రెండు రూపాయలు అదనముగా చార్జిని చెల్లించుకొనవలసి వచ్చుచున్నది!" ఇక్కడికి ఈ ఘోరము లన్నియు చాలనట్లు నవానగరు సంస్థానము స్వయముగా ఉప్పు వ్యాపారమును సాగించి ప్రజల రక్త మాంసములను పిండుచున్నది. ఈ వ్యాపార సందర్భములో సంస్థానము చేసిన ఈ ఉత్తరువు ఎంతటి కఠోరముగ నున్నదో చూడుడు :

“సంస్థాన ప్రజలు తమ సంఖ్యాబలమునకు తగినట్లుగా ఉప్పును వాడకము చేయుటలేదు. అందువలన క్రింది ఏర్పాటులను చేయుచున్నాము :
“ప్రతి గ్రామమును, పట్టణమును తప్పనిసరిగా వాడవలసిన ఉప్పును గురించి నిర్ణయము చేయుచు సుంకముల శాఖవారు పట్టికలను తయారు చేయుదురు. ఈ పట్టికలను మామ్లత్ దారుల ద్వారా రెవెన్యూ గుమాస్తాలకు పంపుదురు. పట్టికలలో నిర్ణయింపబడిన రీతిని ప్రతి కుటుంబము ఉప్పును కొనవలసి యుండును.

“రెవెన్యూ గుమాస్తాలు తమ సర్కిలులోని గ్రామములలో పర్యటనము చేయునప్పుడు ప్రతి గృహస్థు పట్టికలలో నిర్ణయించిన రీతిని ఉప్పును వాడుచున్నారో, లేదో, ప్రత్యేక శ్రద్ధ వహించి కనుగొనవలెను. ఎక్కడెక్కడ లేదో, అక్కడ సరియైన వాడకము జరుగునట్లు వారు ఏర్పాటు చేయవలెను... ఈ పని నిమిత్తము అవసరమైనచో వారు పోలీసు సహాయమునకు వ్రాసుకొన వచ్చును.

“గ్రామములో మకాం చేసినప్పుడు తాలూకా మామ్లత్ దార్లును, పోలీసు ఇన్ స్పెక్టర్లును, పోలీసు సబ్ ఇన్ స్పెక్టర్లును కూడ ఈ విషయములను గురించి జాగ్రత్త పుచ్చుకొనవలెను.

5-1-1924 (సం.) మహెర్ వాన్జీ పెస్టన్జీ,
నవానగర్ సంస్థానపు దివాను’’

పై ఉత్తరవు పేర్కొనుచున్న పట్టికలలోని ఏర్పాటు ఏమనిన, సాలుకు తలకొకటికి అరమణుగు తలకొకటికి చొప్పున సంస్థాన ప్రజలందరును తప్పనిసరిగ ఉప్పును వాడి తీరవలెను. అరమణుగు ఉప్పుతో పనియున్నను, లేక పోయినను తాలూకా ఆఫీసునకు వెళ్ళి, దాని ఖరీదును ముదుపుగా చెల్లించుకొని తీరవలసినదే! ఇందులో ఇంకొక విపరీత మేమనగా, సుంకముల శాఖవారు తయారుచేయు పట్టికలలో అప్పుడప్పుడు ఏ నాడో చనిపోయిన వారి పేర్లుండుట కూడ

కద్దు. అట్టి సందర్భములలో వారి కుటుంబముల వారు ఆ చనిపోయిన వారి క్రింద కూడ తలకు అర్థమణుగు చొప్పున ఉప్పును కొనవలెను. లేదా, దాని ఖరీదును చెల్లించవలెను! దీనిని మించిన ఘోరమును ఊహించ శక్యమా?

సభ్యతా ప్రపంచంలో కనివిని యెరుగని రీతిగా "ఇజారా"ను అమలు పరచుటలో నవానగరు సంస్థానమును కూడ మించినది, గోండల్. ఈ సంస్థానము అమలు జరుపుచున్న "ఇజారాలు" ఇవి : పంచదార, బెల్లము, కలప, మంచుగడ్డ, కిరసనాయిల్, పెట్రోలు, సబ్బు, రాయి, సున్నము, తోళ్ళు, నూనె గానుగలు, ఎరువు, కూరగాయ దుకాణములు, బండ్లు, గడ్డిమోపులు, కట్టెమోపులు, మోటారు లారీ సర్వీస్, సినిమాలు, పచ్చిక బయళ్ళు, కల్లు-సారాయములు, నల్లమందు, భంగ్ గంజాయిలు.

వీలుపడదు గాని, లేకపోయిన గాలిని కూడ ఇజారా పాడేవాడు, ఈ సంస్థానాధిపతి!
ఇక ఆళ్వారు సంగతి. ఆ సంస్థానపు జనసంఖ్య క్రింది విధముగా తగ్గుచు వచ్చినది :

1901	8,28,489
1911	7,31,668
1921	7,01,154

భారతదేశ మొత్తమున 1901-1921 సంవత్సరముల మధ్య జనాభా హెచ్చినదిగాని, తగ్గలేదు. ఇట్టి యెడ ఆళ్వారు సంస్థానములో ప్రత్యేకముగా జనసంఖ్య తగ్గుటకు గల కారణమేమి? క్షామమో, వ్యాధుల ప్రబలతయో, వలసయో దీనికి కారణమై యుండవలెను గదా! కారణ మేమియైనను ఆళ్వారు సుభిక్షముగ లేదనుట సువిదితమే! ఐనను సంస్థానాదాయము క్రింది విధముగ వృద్ధినందెను :

	పౌండ్లు
1911	2,00,000
1921	3,50,000
1927	4,00,000

కేవలం 16 సంవత్సరములలో - అందును జనసంఖ్య యావద్భారత స్థితికి విరుద్ధముగ లక్షకు పైగా తగ్గినపుడు - సంస్థానాదాయము రెట్టింపయ్యెను. అక్రమముగా శిస్తులు అధికముగ విధింపబడుచున్న వనుట కింతకన్న వేరేమి కావలెను?

ఇంతకును నవానగరులో విధింపబడుచున్నవని పూర్వము ఉదాహరణముగా పేర్కొనిన వన్నియు సాధారణమైన పన్నులే. ఇవిగాక అసాధారణమైనవి మరికొన్ని యున్నవి. గవర్నర్లుగాని, వైస్రాయిగాని, తదితర ప్రభుత్వోన్నతో ద్యోగులు గాని సంస్థానమును సందర్శింపవచ్చినప్పుడు వారి విందులకు, వినోదములకు, ఆటలకు, పాటలకు చెల్లిపోవు లక్షలాది ధనమును సామాన్యముగ ప్రజలే భరింపవలెను. సంస్థానాధీశుని వివాహ వ్యయమును కూడ వారే కొంతవరకు పెట్టుకొనవలెను. ఒక్క సంస్థానాధిపతి వివాహ సందర్భముననే కాదు, - అతని కుటుంబములో ఎవరి పెండ్లి యైనను ప్రజలు ముడుపును చెల్లించుకొన వలసినదే! ఇట్లే మరియెన్నో పన్ను లున్నవి, కుప్ప తిప్పలుగ!!

నైజాములో పన్నుల మూలముగా ప్రజలు పడుచున్న బాధలను "నవశక్తి" (బెజవాడ) ప్రకటించిన క్రింది వార్త వలన తెలియగలదు :

"నైజాంలో శాయిరీ వసూళ్ళు మిక్కిలి ఘోరంగా ఉన్నాయి. ఏదైనా బస్తీలో సరుకులు కొన్న గ్రామస్థుడు ఆ దుకాణదారు వద్ద సరుకుల పట్టీ తీసుకొని కరణం వద్దకు పోవాలి. అక్కడ మామూలు 0-4-0 ముడుపు చెల్లిస్తే కరణం పట్టీపై సంతకం పెట్టి, శాయిరీ ఆఫీసుకు పంపుతాడు. అక్కడకు పోయి మళ్ళీ అక్కడ ముడుపు చెల్లించుకొని ప్యాసు తీసుకొని నాకాకు వెళ్ళాలి. 415 గ్రామాలకు కలిపి ఈ నాకా ఉంటుంది. ఆ గ్రామస్థుడు తన గ్రామాని కెంత దూరంలో ఉన్నా ఆ నాకాకు వెళ్ళి ప్యాసు చూపించి, మళ్ళీ ముడుపు చెల్లించుకొని, అప్పుడు స్వంత గ్రామం తీసుకొనిపోవాలి. ఈ బాధలేక సాధారణంగా శాయిరీ ఉద్యోగస్థులకు లంచాలిచ్చి సరాసరి తమ గ్రామాలకే పోతూవుంటారు ప్రజలు.

నైజాంలో, ఎక్కువ చలామణీ అయ్యేది బండి రూపాయలు. హాళీ రూపాయల చలామణీ చాలా గ్రామాలలో తక్కువ. కాబట్టి ప్రభుత్వానికి శిస్తులు చెల్లించవలసి వచ్చినా, బస్తీలలో సరుకులు కొనుక్కొన వలసినా బండీలను హాళీలలోకి మార్చుకొనునప్పుడు మారకం రూపాయికి 0-0-3, 0-0-6 చొప్పున ఇవ్వవలసి వస్తున్నది. ఈ విధంగా కొన్ని సార్లు మారకం జరిగేటప్పటికి రూపాయి మాయమైపోతుంది. దీనివల్ల షరాబులు దోచు కుంటున్నారు; రైతులు మిక్కిలి నష్టపడుతున్నారు".

పన్నుల వలన వచ్చు ఆదాయములో అధిక భాగము భూమి శిస్తు నుండియే వచ్చును. ఈ భూమి శిస్తును కొన్ని సందర్భములలో ధన రూపమునను, మరికొన్నిటి యందు ధాన్యరూపమునను పరిగ్రహింతురు. శిస్తును ధాన్య రూపముగ వసూలు చేయుట వలన చాల ఇబ్బంది లున్నవి. ముందుగా భూమి మంచిదో, కాదో నిర్ణయించవలెను. పిదప మెట్ట పైరో, పల్లపు పైరో తేల్చవలెను. పండిన పంటలో ఎంత భాగము సంస్థానమునకు పోవలెనో నిర్ణయించిన వెనుక కూడ, సంస్థానోద్యోగులు వచ్చి తమ వంతును కొలుచుకొని పోవు వరకు రాశిని కళ్ళములో నుంచవలెను. ఈ లోపుగ వర్షము పడిన ఏటి కేడాది పొడుగున పడిన కష్టమంతయు గంగ గలిసిపోవును!

కొన్ని సంస్థానములలో పన్నుల నెట్లు హెచ్చింతురో 'ప్రిన్స్లీ ఇండియా' పత్రికలో (26-7-1926) ప్రకటితమైన క్రింది వాక్యముల వలన విశదము కాగలదు :

"ఆదాయము చకచక పెరిగిపోవుచుండును. 1921-22 సంవత్సరము నాటి భూమి శిస్తు నివేదికలో క్రింది విధముగ నున్నది : సంస్థానమున గల పది తాలూకాలలో నాల్గింటియందు రీసెటిల్ మెంటు జరిగినది. ఇందువలన పూర్వపు శిస్తు రూ.3,32,476లు హెచ్చి, మొత్తము 25,86,352 రూపాయ లయ్యెను'. కాని, రీసెటిల్మెంటు వలన వచ్చిన అధికాదాయము కూడ సంస్థాన వ్యయమునకు సరిపోలేదు. అందుచేత బీద జనులపై మరింత పన్నుల భారము వేయుటయే మార్గమయ్యెను. ప్రత్యేకమైన కొన్ని రోడ్లను ఉపయోగించు బండ్లవారి మీదను, పాదచారుల పైనను వేసిన పన్నును హెచ్చించుటకు వీలు కాన్పించెను. 1922 నవంబరు నెలలో ప్రకటితమైన 'ఎక్స్ట్రా ఆర్డినరీ గెజెట్'లో ఇట్లుండెను : కేవలం వేట కొరకై వేయబడిన రోడ్డుపై ట్రాఫిక్ తగ్గించుటకే ఫలానా టోల్ గేటు రేట్లు సదా ఉద్దేశింపబడినవి గాన..."మహారాజుగారు రేట్లను మార్చిరి. ప్రజలు వర్తక వ్యాపారములకై తగని రీతిని రోడ్డును ఉపయోగించుచుండ మహారాజుగారు మొదట దానిని నిర్మించిన ఉద్దేశమును విస్మరింపలేరు'. తదుపరి క్రొత్తరేట్లను పేర్కొనిరి. ఎడ్ల బండ్ల పైనను, ఒంటెల పైనను 5 నుండి 10 రూప్యములకు పన్నును హెచ్చించిరి. గుర్రముల పైనను, కంచర గాడిదల పైనను 1 నుండి 5 రూప్యముల వరకు హెచ్చుచేసిరి. పాదచారులపై 1 నుండి 2 రూప్యముల దనుక వృద్ధి చేసిరి. ఇట్లే తదితరములు. మొత్తము మీద పన్ను 2 రెట్లు మొదలు 5 రెట్ల వరకు హెచ్చింపబడెను".

ఈ పన్నులను చెల్లింపలేక ప్రజాసామాన్యము పడు పాట్లు, కడగండ్లు...

జాబ్వా సంస్థానములో ప్రజలు పడుచున్న ఇక్కట్లులను గమనింపుడు : 1933, జులై 16వ తేదీ నాటికి 'ప్రిల్ ఇండియా' పత్రికలో ఇట్లున్నది : "జాబ్వా సంస్థానమునందు గల రైతులలో హెచ్చు మంది బిల్లులు; పంటలు పండక పోవుటచే గత వత్సరమును, ఈ యేడును వారు శిస్తును చెల్లింపనేరరైరి. కాని, నిర్దయు డగు ప్రభువు బాధ పెట్టుటచే వారు బకాయిని చెల్లించుటకు తమ బిడ్డలను అమ్ముకొనిరి. మూలుగుచున్న నక్కపై తాటిపండు పడినట్లు వారిచే కూలి నాలి లేని వెట్టిచాకిరి చేయించిరి. దీనితో పరిపూర్ణ నిస్సహాయ స్థితికి దిగజారి, రైతులు ఇండ్లను వాకిళ్ళను వదలిపెట్టి పోవలసి వచ్చెను. ""పొట్టపోసి కొనుటకై దోహద్ వెళ్ళిన భిల్లు డొకడు కన్నబిడ్డలతో సయితము నూతిలోబడి ఆత్మహత్య గావించుకొనవలసి వచ్చినట్లు ఇటీవలనే తెలియవచ్చినది". ఇట్టి ఆత్మహత్యలను గూర్చి మరికొన్ని హృదయ నిర్భేదక వివరములు గలవు, పై పత్రికలోనే!!

కరాచీ నగరంలో 1936 జులైలో జరిగిన అయిదవ అఖిల భారత సంస్థాన ప్రజా సంఘ సమావేశములో అధ్యక్షులు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య పంతులుగారు భూమి. శిస్తు వసూలు సందర్భములో కొందరు సంస్థానపతులు చేయు ఘోర దురంతములను క్రింది విధముగా వర్ణించిరి :

''లోహోర్, పంజాబ్ లోని ఒక చిన్న సంస్థానము. దానికి ఉత్తర దిశలో హిస్సాన్ జిల్లా యున్నది. తక్కిన మూడు దిక్కులలో జింద్, జయపూరు, బికనీరు సంస్థానము లున్నవి. దాని విస్తీర్ణము 222 చదరపు మైళ్ళు. జనసంఖ్య 23,338. జనాభాలో 6 / 7 వంతుల మంది హిందువులు (వారిలో సగము మంది జాట్ జాతివారు); పోగా మిగిలిన 1 / 7 వంతు మంది మహమ్మదీయులు. సంస్థానములో 70 గ్రామములును, ఒకే ఒక పట్టణములోనైనను జనాభా మూడువేలకు మించదు. సంస్థాన ప్రజలు మాయమర్మముల నెరుగనివారు; ధైర్యసాహసములు గలవారు : కష్టించి పని చేయువారు.

సంస్థానమునకు భూమి శిస్తు వలన 1908 వరకు 48,000 రూపాయల ఆదాయము వచ్చెడిది. 1909 నాటి సెటిల్మెంటులో దీనిని 73,000 రూపాయలకు హెచ్చించిరి.ఇంత - 25,000 రూపాయల హెచ్చుదల చేయుటకు కారణము నవాబుగారి ఋణగ్రస్తత. 24 సంవత్సరములకు గాను ఏర్పాటైనది ఈ సెటిల్మెంట్,

ఇది నిర్ణయించిన భూమిశిస్తు ఇరుగు పొరుగు సంస్థానములలోని శిస్తుకు దాదాపు మూడురెట్లు, ఇంత హెచ్చుగానున్న ఈ శిస్తులో లేశమైనను ప్రజలకు ఏదైన ఒక సౌకర్య రూపములో తిరిగి చెందదని వేరుగ జెప్పవలసిన పనిలేదు. ఏలనన, సంస్థానములో రైలు అసలు లేదు; పోస్టాఫీసు ఒక్కటి మాత్రమే ఉన్నది; లోహోరు పట్టణములోని ఒక్క చిన్న పాఠశాలను, వైద్యశాలను మినహాయించిన సంస్థాన గ్రామములలో మచ్చునకైన ఇట్టి ప్రజాహిత సంస్థలు లేవు. తమకు విద్య, వైద్య సహాయము మొదలగు సౌకర్యములు కావలయునని ప్రజలు ఆందోళన చేసినచో, సంస్థానము వారికి కలుగు ఆగ్రహము ఇంతంత కాదని కూడ చెప్పుదురు.

ఇవి ఘోరమైన విషయములే! కాని, వీనిని మించినది మరొకటి కూడ గలదు. 1909 నాటి సెటిల్ మెంట్ కు పూర్వం రైతులకు పట్టాలను ఇచ్చి యుండలేదు. కాని, ఆ సంవత్సరములో జరిగిన సెటిల్మెంట్ సందర్భములో శాశ్వతమైన పట్టాలను జారీ చేసిరి. తర్వాత 1923లో ఇంకొక సెటిల్ మెంట్ ను చేసి, భూమి శిస్తును 94,000 రూప్యములకు పెంచుచు, పూర్వము జారీ చేసిన పట్టాలలో నవాబు మార్పులు చేయించెను. ఇంతే కాదు, అతడు వారసత్వపు హక్కుల విషయంలో జోక్యము కలిగించుకొనెను. 1857కు పూర్వము విరివిగా అమలులో నున్న జప్తు అధికారాన్ని వినియోగించి, వారసులు లేకుండా చనిపోయినవారి భూములనే గాక, తాత్కాలికముగా సేవ్యమును మానివేసిన వారి భూములను కూడ స్వాధీనపరచుకొనెను. ఇంతటితోనైనను సరిపుచ్చక అతడు క్రొత్త క్రొత్త పన్నులను కనిపెట్టెను. ఈ పన్నులకు ఉదాహరణ లివి : సంస్థానము వెలుపల అమ్మకము చేయు ఎద్దులపై పన్ను; మేకల పైన, గొర్రెల పైన పన్ను; సంస్థానము సప్లయి

చేయుట ఆపివేసినను తూకపురాళ్ళపై పన్ను. ఈ క్రొత్త పన్నులకు తోడు అంతకు పూర్వము అప్పుడప్పుడు చెల్లించవలసిన సిపాయి పన్నును వార్షికముగా చెల్లించవలసి యుండునని అతడు ఉత్తరువు చేసెను.

నవాబ్ సాహెబ్ పెండ్లి ఖర్చులకు గాను 1931 నుండి 1933 వరకు మూడు సంవత్సరముల పాటు ప్రజలు విడిగా మరొక పన్నును చెల్లించవలసి వచ్చెను. పైన చెప్పిన పన్ను లన్నియు గాక వితంతు వివాహము పన్ను మొదలైనవి ఎన్నో విపరీతములైన పన్నులు కూడా నున్నవట. ఈ పన్నుల బాధను పడలేక ప్రజలు నవాబుకును, అతనిపై అధికారులకును విజ్ఞప్తులను పంపుకొనిరి. కొన్ని సంవత్సరములలో ఈ విజ్ఞప్తుల వలన కొంత లాభము చేకూరెను కూడ. కాని, ఇంతలో 1935 ఆగష్టు 6-8 తేదీల నాటి దుర్ఘటనలు వచ్చిపడినవి. వానిని గురించి లోహోరు ప్రజలు చెప్పిన వృత్తాంతమును క్రింద పేర్కొనుచున్నాను :"1935 జులై 15వ తేదినాడు గవర్నర్ జనరల్ ఏజెంట్ (ఇతనిని ఎ.జి.జి. అని అందురు) లోహోరు సంస్థానమునకు వచ్చెను. ఆయన రాకకు నవాబు ఆహ్వానమే కారణమై యుండవచ్చును. ఎ.జి.జి., నవాబు - వా రుభయులును సంస్థానములోని ప్రముఖులను వా పిలిపించి, వారితో మాట్లాడిరి.

1923 నాటి సెటిల్ మెంట్ కు అంగీకరించినచో, ఒంటెల పన్ను వినా తక్కిన పన్ను లన్నిటిని తగ్గించెదనని ఆనాటి మాటల సందర్భములో నవాబు వాగ్దానము చేసెను. పరిస్థితు లేమియు బాగుండ నందున 1909 నాటి సెటిల్ మెంటును అమలు జరుపవలసినదిగా ప్రజాప్రముఖులు నవాబుతో మొరపెట్టుకొనిరి.

పదునైదు రోజుల తర్వాత - అనగా జులై 30వ తేదినాడు ఒంటెల పన్నును వసూలు చేసుకొని రావలసినదిగా నవాబు కొంతమంది తాబేదారులను చెహర్ కాలన్ అను గ్రామమునకు పంపించెను. ఆ గ్రామ ప్రజలు పన్నును చెల్లింప నిరాకరించిరని చెప్పుచు తాబేదారులు తిరిగివచ్చిరి. ఈ వార్తను విని సైనిక సహాయమును పంపవలసినదిగా నవాబు బ్రిటీష్ ప్రభుత్వము వారిని కోరెను.

అతని ఉద్దేశ మేమో ఎవ్వరికిని తెలియదుగాని, 1935 ఆగష్టు 6వ తేదినాడు ఎ.జి.జి. తిరిగి సంస్థానమునకు వచ్చుననియు, ప్రజలు తమ సాధక బాధకములను ఆ ఉద్యోగికి తెలుపుకొన వచ్చుననియు నవాబు ఒక వదంతి పుట్టించెను.

ఆగష్టు 5వ తేదీ సాయంకాలమునాడు చెహర్ కాలన్ గ్రామములో సంస్థానోద్యోగులు కొన్ని గుడారములను కూడ వేయుటను చూచి, ప్రజలు ఈ వదంతి నిజమే అని నమ్మిరి. ఇక్కడనే సంస్థానము వారి కథనమును, ప్రజల కథనమును భేదించు చున్నవి. తిరుగుబాటు చేయు తలంపుతో ప్రజలు గుమిగూడిరని నవాబు చెప్పుచున్నాడు; ఇట్లు కల్పించి చెప్పవచ్చును గదా అని దురాలోచన చేసి, ఎ.జి.జి.కి మహజరు పెట్టుకొనుడను మిషతో నవాబే తమను గుంపుగా చేర్పించెనని ప్రజలనుచున్నారు. ఆగష్టు 6వ తేదీనాడు ఆ గ్రామములోని ఇండ్లను సోదా చూడగా ఎన్నో లాఠీలు కనబడినవి గాన, తిరుగుబాటు ప్రయత్నమునకు ఇది నిదర్శనమని.

ఈ సందర్భములో సంస్థానమువారు వాదించుచున్నారు; ఇందుకు ప్రజలు చెప్పు సమాధాన మిది : 'మా ఇండ్లలో నున్నవి లాఠీలు కావు; ప్రతి రైతు నిత్యజీవనములో ఉపయోగించు చేతికర్రలు. ఎ.జి.జి. దొరవారి దర్శనమునకు వెళ్ళుచు, చేతికర్రలను పట్టుకొనిపోవుట మర్యాద కాదని వానిని ఇండ్లలోనే విడిచి పెట్టితిమి.

ఎ.జి.జి. రాకకై ప్రజలు రోడ్డు ఇరు ప్రక్కల వేచియుండగా, వారికి నవాబు మోటారుకారు కనిపించినది. ముందు నవాబుకారు వచ్చినది గనుక, దాని వెనుకనే ఇక ఎ.జి.జి. గారు కూడ తప్పక వత్తురనియు, తమకు ఆయన దర్శన

మిచ్చుననియు ప్రజలాశపడిరి. కాని, ఎ.జి.జి.గారు వారి దగ్గర ఆగక సరాసరి అతివేగముగా వెళ్ళిపోయెను. అంతకు పూర్వము ప్రజ లందరును కూర్చుండియుండిరి. కాని, ఎ.జి.జి. కారు వచ్చినంతనే వారు లేచి నిలబడిరి. ఇట్లు చేయుట కేవలము ఎ.జి.జి. పట్ల తమకు గల గౌరవమును ప్రకటించుటకే! కాని, సంస్థానోద్యోగులు దీనిని చూపి, 'ఎంతటి పొగరుబోతులో గమనించితిరా?" అని అనిరట!

అటు తర్వాత జరిగిన సంఘటనలు అతి ఘోరమైనవి. గ్రామ ప్రముఖులలో కొందరిని పిలిపించి, ఖైదు చేసిరి. తర్వాత నవాబే స్వయముగా లాఠీచార్జి చేయుమని ఆజ్ఞాపించెను. దానికి తాళలేక అనేకమంది గ్రామస్థులు ప్రక్కనున్న అడవిలోనికి పారిపోయిరి. నవాబు తాబేదారులు సోదా అను మిషతో గ్రామము పైబడి దోపిడిని సాగించిరి. కేవలము దోపిడితోనే సంతృప్తిపడక ఎన్నో ఇండ్లకు నిప్పుకూడ పెట్టిరి. ఇంతేకాదు, గ్రామాలయమును అపవిత్రము చేసిరి : భర్తలు భయభ్రాంతులై పలాయనమైనందున యథేచ్ఛగా భార్యలను చెరబట్టి మానభంగము చేసిరి. ఇంతటి ఘనవిజయమును పొందినందులకు ఆ రాత్రి ఆటలతోను, పాటలతోను వారు పెద్ద పండుగను చేసుకొనిరికూడ!

ఆ మరునాడు అనగా ఆగష్టు 7వ తేదీనాడు నవాబు తాబేదారులు మడోలీ, కాస్ని, గోకుల్ పూర్ గ్రామములపై దండెత్తి వెళ్ళిరి. ఇట్లే వారు తిరిగి 8వ తేదీనాడు సింఘానీ గ్రామము పై బడి, ఒంటె పన్నును తే తెమ్మనిరి. పన్నును చెల్లించుటకు గడువు దయచేయవలసినదిగా గ్రామస్థులు వేడుకొనిరి. గ్రామస్థులు గడువు కోరిన మాట అబద్ధమనియు, వారు పన్ను నివ్వ నిరాకరించి, దౌర్జన్యము చేయ సమకట్టిరనియు నవాబు అనుచున్నాడు. ఒకవేళ గ్రామస్థులు నిజముగా పన్నును చెల్లింప నిరాకరించినను, వారిపై తుపాకులను పేల్చవలసిన అవసరం లేదు.' ఏలనన వారివద్ద నుండి పన్నును వసూలు చేయుటకు మరెన్నియో సాధనము లున్నవి. అయినను నవాబు ప్రజలపై తుపాకులను పేల్పించెను. ఆత్మ రక్షణ కొరకు తుపాకులను పేల్చుట అవసర మైనదని నవాబు పక్షమున ఇంకొక ఆర్గ్యుమెంటు కూడ చెప్పుచున్నారు. దీనిని నిజమని అంగీకరించినచో, వెంటనే ఇంకొక ప్రశ్నను అడుగవలసి వచ్చును. నవాబు పక్షము వారిలో ఎవరైనను గాయపడిరా? కాని, సత్య మేమనిన ఎవ్వరును గాయపడలేదు. ఇట్టిచో ఆత్మరక్షణ నిమిత్తము తుపాకులను -.కాల్చవలసి వచ్చి నను మాటను ఆమోదించు టెట్లు? పైగా, కేవలము ఆత్మరక్షణకే తుపాకులను కాల్చి స్త్రీలు, పురుషులు, పశుగణము అర్థము లేకుండ చనిపోవుట ఎట్లు సంభవించును? 6వ తేదీనాటి సంఘటనల తర్వాతకూడ ఈ గ్రామముపై విరుచుకుపడుచు నవాబు తాబేదారులు బ్రిటీషు ఫౌజును వెంటనే పెట్టుకొనక పోవుటను బట్టియు, గ్రామస్థుల పైన తుపాకులను పేల్చిన పిదప చనిపోయిన వారిని, గాయపడినవారిన వారి గతికి వారిని వదలి పెట్టి బందిపోటు దొంగలవలె పారిపోవుటను బట్టియు, తుపాకులను పేల్చుట నిజముగా అనవసరమనియు, క్రౌర్యకృత్యమనియు నిస్సంకోచముగ చెప్పవచ్చును. జననష్టము విషయమై ముగ్గురు మాత్రమే మరణించిరనియు, 35 మంది గాయపడిరనియు నవాబు అనుచున్నాడు. కాని, పది శవములను ఒంటిపై కట్టి భవానీ ఆస్పత్రికి తెచ్చినట్టు అధికార రీత్యా ఋజువు పరచవచ్చును. భవానీ ఆస్పత్రికి చేరిన ఆ పది శవములు గాక, మరి ఎన్నియో సింఘానీ గ్రామమున మిగిలిపోయినవి".

ఈ విధముగా లోహోర్ లో జరిగిన వానికంటే ఎంతో ఘోరమైన కృత్యములు సీకార్ సంస్థానములో జరిగినట్లు పట్టాభి సీతారామయ్య పంతులుగారే తమ అధ్యక్షోపన్యాసములో చెప్పిరి. అక్కడ దారిద్ర్య బాధ వలన మహా దుస్థితిలో నున్న ప్రజల వద్ద నుండి అంతుపంతులేని భూమిశిస్తును వసూలు చేయు ప్రయత్నములో సంస్థానమువారు క్రింది రాక్షస కృత్యములను నెరపిరట : 1 జరిమానాలు, సైనికపు ఖర్చులు అను వంకతో డబ్బును వసూలు చేయుట. 8 స్త్రీలను మానభంగ మొనర్చుట; వారి ఆభరణములను హరించుట.

1 హత్యలు
2 తుపాకి కాల్పులు
3 లాఠీ చార్జీలు
4 పాఠశాలలను పడగొట్టుట, మూసివేయుట.
5 ఇండ్లను పైబడి దోచుకొనుట; ఆస్తిని నష్టపరచుట.

6 చెల్లించవలసిన దానికంటే అధికముగా శిస్తును, తీరువాలను రాబట్టుట.
7 జరిమానాలు, సైనికపు ఖర్చులు అను వంకతో డబ్బును వసూలు చేయుట.
8 స్త్రీలను మానభంగ మొనర్చుట; వారి ఆభరణములను హరించుట.
9 జాట్ జాతివారికి (సంస్థాన ప్రజలలో అధిక సంఖ్యాకులు వారే. కష్టము చేయునది వారు; కష్టములకు లోనుగావలసినది వారు) సహాయము చేసిన ప్రజలను సంస్థానము నుండి వెడలగొట్టుట.
10 జాట్ జాతివారిని హింసపెట్టు రాజపుత్రులకు ప్రోత్సాహమిచ్చుట; జాట్ జాతివారు గుర్రమునుగాని, ఒంటెను గాని ఎక్కరాదనియు, వారు దేవదర్శనమునకు రాగూడదనియు అభ్యంతరములను పెట్టుట.
11 జాట్ జాతివారు పంపు అర్జీలను పుచ్చుకొనవలదని పోలీసు వారికిని, కోర్టు వారికిని ఉత్తరువు చేయుట.

ఈ అత్యాచారములపై పట్టాభి సీతారామయ్య పంతులుగారి వ్యాఖ్యాన మిది : 'ఈ ఇరువదవ శతాబ్దపు నాగరక ప్రపంచములో ఇంతటి ఘోరములు మరెచ్చటను కానరావు'.
ఈ "ఘోరముల" పట్టికకు మరికొన్నింటిని గూడ కలుపవచ్చును. రాజపుత్ర స్థానంలోని ధరంగధర సంస్థానములో భూమిశిస్తు బకాయికి పెండ్లికాని ఆడపిల్లలను జప్తు చెయ్యవచ్చును! ఇక్కడనే మరికొన్ని సంస్థానములలో శిస్తు చెల్లించని వారిని (అనగా చెల్లించకలేకపోయిన వారిని) దండించుటకు మేకులు తాపడం చేసిన చెప్పును ఉపయోగించుదురు.

ఇట్లు విపరీతముగ బాధపెట్టి పన్నులను వసూలు చేసినను, తుదకు ప్రజలకు చేయు సౌకర్యములు సున్నయే! కొన్ని రాజపుత్ర స్థాన సంస్థానములలో కనీసము మంచినీటి సౌకర్యమైనను లేదట! అక్కడ మందు వేసవిలో స్త్రీలు నెత్తిపై బిందె పెట్టుకొని నాలుగైదు మైళ్ళు వెళ్ళవలసి వచ్చునట! వసూలైన డబ్బు మహారాజుల స్వంతఖర్చులకు అసలు సరిపోయిన గదా, ప్రజాసౌకర్యముల మాట!
వచ్చిన ఆదాయ మంతయు ప్రజా సౌకర్యముల కొరకు గాక, సంస్థానాధీశుని విదేశ సంచారమునకును, విలాసయుత జీవితమునకును వెచ్చింపబడుచున్న విషయము క్రింది పట్టిక వలన విదితము కాగలదు.

సంస్థానము	సగటున తలకు పన్ను	సంస్థానాధిపతి స్వంత ఖర్చు నూటికి	విద్యావ్యయము, తలకు	వైద్యసహాయం తలకు రూపాయిలలో	విద్యనేర్చినవారి సంఖ్య. నూటికి
కాశ్మీరు	6	20	6/16	3/16	2
బికనీరు	16.5	20	5/16	¼	3
ఇందూరు	13.5	17	7/16	1/8	3
ఆళ్వారు	11.25	50	3/16	1/16	2
పాటియాలా	11.25	25	3/16	1/8	2
నవానగరు	22.5	45	6/16	¼	3
కపుర్థల	11.25	25	7/16	3/16	3
కచ్చి	22.5	25	2/16	1/16	1

చూడ్గర్ వాక్యములతో ఆరంభించిన ఈ ప్రకరణము ఇక గౌబా పలుకులతో ముగింతును: "రెండు సిద్ధాంతముల ననుసరించి పన్నులను విధింతురు. సంస్థానాధీశుని కెంత కావలసి యున్నది? ప్రజ లెంత చెల్లింపగలరు?- వీనిలో రెండవదానికి అంతగ ప్రాముఖ్యము లేదు. కొన్ని పన్నులు ధన రూపమునను, మరికొన్ని ధాన్య రూపమునను వసూలు

చేయుదురు. ఆదాయములో అధిక భాగము భూమిశిస్తు వలన వచ్చును. భూమిశిస్తు గాక వృత్తిపన్ను, పశువుల పన్ను, ఎగుమతి దిగుమతుల పన్ను, మున్నగునవి మరికొన్ని కలవు. కొన్ని.

సంస్థానాధీశ్వరులు సంస్థానములలో జనన మరణములు కూడ ఆదాయ సంధాయకములే. ఈ వివాహానందమును ప్రజలకు పంచి పెట్టుదురు. మహారాజుగారి కుటుంబమున పరిణయ మహోత్సవము జరిగినప్పుడెల్ల బొక్కసము నిండవలసినదే! రైతుల ఆదాయములో సగమునకు తక్కువగా సంస్థానము పుచ్చుకొనదు. మిగిలిన సగములోనే ముందు పైరునకు, విత్తనములు, కూడుగుడ్డలు, శుభాశుభములు రాణాదారు లంచములు మున్నగువాని నెల్ల సరిపుచ్చుకొనవలెను. ఖజానాకుపోవు సగమును చెల్లిపోవును : ఢిల్లీ నరేంద్రమం డలికి, నీస్ నందలి నూత్న హర్మ్యమునకు, ఫ్రెంచి విలాస వస్తుతతికి, పొలిటికల్ ఏజెంటు మృగయా వినోదమునకు, ఇటలీ పర్యటనమునకు, లండను విందులకు, స్పెయిను భోగకన్యలకు."

బేగారి

''కొన్ని సంస్థానములలో 'బేగారి' పద్ధతి యొకటి కలదు. ఇది ఇంచుమించుగా బానిసతనమును బోలియుండును. ప్రాచీన కాలము నుండియు ముఖ్యముగా నిమ్నజాతుల వారి కిది తప్పని విధిగా వచ్చుచున్నది. అంతేకాదు, జనాభాలో నూటికి 80 లేక 90 పాళ్ళుండు వ్యవసాయకు లెల్లరు దీనికి లోనుకావలసి వచ్చుచున్నది. పోనీ, వారు చేసిన కష్టమునకు తగిన ప్రతిఫలము ముట్టునా? లేదు. ఏదో పేరునకు ఉన్న కూలియే అసలు తక్కువ. దానినైనను సాధారణముగా చెల్లింపరు. పాటియాలా సంస్థానములో మహారాజుగారు షికారీ పార్టీలకు వెళ్లుచు, జనముచే ఇట్లు నిర్బంధముగా కూలి చేయింతురు. కాలువలను బాగుచేయుట, సంస్థానము వారి తోటలను పెంచుట మున్నగు పనులను కూడ ఇట్లే చేయింతురు. సంస్థానమువారి ఉపయోగమునకై ప్రజల యొంటెలను ఉచితముగా దీసికొందురు. వారి ఎడ్లను, బండ్లను తోలుకొని పోవుచుందురు. ప్రజలు ఊరక పాలు, పెరుగు, నేయి తెచ్చి ఈయవలసి యుండును. సంస్థానాధిపతిగాని, సంస్థానోద్యోగిగాని, సంస్థాన సైనిక దళముగాని పర్యటనము గావించుచున్నప్పు డిట్టి సంభవములు నిత్యములు. నిర్బంధపు కూలిపాటును నిర్మూలించుటకై . ప్రయత్నించుచున్న నానాజాతి సమితి సమావేశములకు మహారాజులు ప్రతినిధులుగా వెళ్ళుదురు. కాని, ఆ ప్రతినిధులే తమ సంస్థానములందు నిర్బంధపు కూలిని చేయించుచున్నారు".
ఈ పలుకులు బాధ్యతలేని అనామక వ్యక్తివి కావు : థక్కర్ గారివి.

చాకలి, మంగలి, కుమ్మరి, వడ్రంగి, దర్జీ వీరు వారననేల? సమస్త జనులును సంస్థానమునకును, సంస్థానోద్యోగులకును ప్రతిఫల మపేక్షింపకయే సేవ చేయవలెను. చివరకు స్త్రీలకు సయితము - వారు యువతు లైనను, వృద్ధులైనను, సధవలైనను, విధవలైనను - దీని నుండి విముక్తి లేదు. సర్వజనులును, సర్వావస్థలందును సేవ చేసి తీరవలసినదే! కిక్కురు మన్నచో కొరడా ప్రేటులను గాని, కారాగార వాసమును గాని కొని తెచ్చుకొన్నట్లే! జరాభారమున పనిచేయబాలుని మొర పెటుకోనందులకు ఒక అరువదేండ్ల ముసలిదానిని బహిరంగముగ వీధి యందు లాఠీలతో మోదుట తా నెరుగుదునని చూడ్గర్ వ్రాసెను.

మహారాజు వేట కేగునప్పుడు కంటకయుత మగు ఘోరారణ్యములలోను, గ్రీష్మాతపతప్త సైకత స్థలము లందును, నిశిత శిలాభరితము లగు పర్వత శ్రేణుల పైనను పరవతోల ప్రజలను నిర్బంధింతురు. బ్రిటీషు ప్రభుత్వోన్నతోద్యోగులు సంస్థానముల దర్శింప నేగినప్పుడు రైలు మార్గమున కిరుప్రక్కల మండుటెండలోను, వుందువంటి చలిలోను కాపలా కాయు కొరకు ప్రజలను నియమింతురు.

బుందీ సంస్థానము, నిర్బంధ సేవను గూర్చి 1922వ సంవత్సరములో ప్రకటించిన క్రింది రెగ్యులేషను వలన ప్రజల కిది ఎంత బాధాకరమో హృద్గతము కాగలదు :

1 మంగళ్ళు యథా ప్రకారము క్రింద చూపిన సేవను చేయవలెను.
(ఎ) సంస్థాన కార్యాలయములందు దీపములను వెలిగించుట.
(బి) ఆ కార్యాలయములకు సున్నము కొట్టుట, వానిని అలుకుట.
2 తెలికలవాండ్రు, సంస్థానావసరములకు త్రాళ్ళను పేనవలెను. దీనికి ప్రతిఫలముగ వారికి తిండి పెట్టబడును.
7 ఈడిగవాండ్రు వంటచెరుకు సప్లయి చేయవలెను; త్రాళ్ళను కూడ పేనవలెను. వారికిని తెలికల వాండ్ర కిచ్చు ప్రతిఫలమే ముట్టును.
8 తమలపాకు బేరగాండ్రు తెరలు, తడికలు సప్లయి చేయవలెను.
9 కసాయివాండ్రు దేవస్థానముల నగారాలకు ఉచితముగా తోళ్ళను సప్లయి చేయవలెను.
10 బిల్లులు, వార్తావహులుగ పనిచేయవలెను; గస్తీ తిరుగవలెను. ప్రతిఫలముగ వారికి భోజనము పెట్టబడును.
12 రైతులు, సంస్థాన కార్యాలయములలోని వంటశాలలకు పైకము పుచ్చుకొనకుండ పిడకలు సప్లయి చేయవలెను.
16 సత్రములలో గాని, బహిరంగ ప్రదేశములలో గాని రాత్రిపూట మకాము చేయువారు యథా ప్రకారము సుంకము చెల్లించుకొనవలెను.
21 సంస్థానమునకై చేసిన సేవకు ప్రతిఫలముగా తిండి పెట్టబడును. సంస్థానోద్యోగులకు చేసిన సేవకు ప్రతిఫలముగా కూలి యొసగబడును. ఈ సేవ నంతయు తరతరములుగ దానిని గావించుచున్నవారే చేయవలెను. వీరు సేవను చేయ నిరాకరించిన కఠిన శిక్షకు లోనగుదురు.

సంస్థాన ప్రజ లిట్లు నిర్బంధ సేవ క్రింద బాధపడుచున్నారు. వీరి కష్టములను విని, హృదయము కరిగినవాడై దీనబంధుడగు సి.యఫ్. ఆండ్రూస్ మహాశయుడు పరిస్థితులను స్వయముగ తెలిసికొనుటకై రాజపుత్ర స్థానమునకు బయలుదేరెను. కాని, రస పూత సంస్థానపతులు,.
ఆండ్రూస్ తమ రాజ్యములలో అడుగుపెట్ట వీలులే దనిరి. సత్య ప్రకటన మున్న వీరి కింత భయమేలనో!

ఔను భయమే! కాదా, మరి? సత్యము అగ్నివంటిది. అగ్ని సువర్ణమునకు క్రొంగొత్త మెరుగుల సమకూర్ప గలదు. అదియే చెత్తచెదారమును భస్మీపటల మొనర్పగలదు. సత్యము కూడ ఇంతే. అది ధర్మపరాయణులను పునీత మొనర్పగలదు; అధర్మమార్గాను వర్తనులను విధ్వంస మొనర్ప గలదు. ఇందుచేతనే దుర్మార్గులు సత్యము పేరు చెవిసోకినంతనే కంపించిపోదురు. దాని కుత్తుకను ఎట్లయిన నులిమి వేయవలెనని సర్వశక్తులను వినియోగింతురు. తన పాపకృత్యముల కెల్ల తగిన శిక్ష విధింపగలవా డొక డున్నా డని హిరణ్యకశిపునికి తెలియక పోలేదు. కాని, ఆ విషయమును ప్రకటించుట అతని కిష్టము లేదు! అందుచే అతడు ప్రహ్లాదుని అష్టకష్టముల పెట్టెను. రాజు, దైవాంశ సంభూతుడు కాడనియు; వ్యక్తముగనో, అవ్యక్తముగనో యున్న ప్రజాభీష్టమే అతని రాజ్యపాలనకు కారణమనియు పదునారవ లూయీ'కి తెలియును. కాని, ఈ సత్యమును ప్రచార మొనర్చుట అతనికి మనస్కరింపలేదు. అందుచే అతడు రూసో, వాల్టేర్ మున్నగువారిని బాధ పెట్టెను. ఇట్లే నేడు జర్మనీలో నాజీపక్షము, కొరియాలో జపాను సామ్రాజ్యము,...

కాని, సత్యమును శాశ్వతముగ మరుగు పరచుట దుస్సాధ్యము. మహాసామ్రాజ్య సాధనసంపత్తి యున్నవారే దానిని రూపుమాప యత్నించి విఫలమనోరథులైరి. ఇక సామాన్య సంస్థానాధీశులు దానిని దాచిపెట్ట గలరా?

బేగారి ఇంచుమించుగా బానిసత్వమని థక్కర్ గారి నిర్వచనము. ఈ ఇంచుమించు బానిసత్వము గాక సిసలైన బానిసత్వము కూడ సంస్థానములలో లేకపోలేదు. 1930 సం॥ములో ప్రకటింపబడిన 'టైమ్స్ ఆఫ్ ఇండియా ఇయర్ బుక్' లోని వాక్యము లివి :

“1921వ సంవత్సరపు జనాభా లెక్కల ప్రకారము రసపుత్ర స్థానము, మధ్యభారతవర్షములలో1,60,755 మంది బానిసలు కలరు. వీరిని దరోగాలు, హుజూరీలు, చేలాలు, గోలాలు మున్నగు పేర్లతో పిలుతురు. హిందువులు, మహమ్మదీయులు అను విచక్షణ లేకుండ సంస్థానాధీశు లందరి ఏలుబడిలోను వీరున్నారు. ఆజన్మాంతమును ఏలికలకు వీరు సేవచేయవలసినదే! ఏవో కొలది జీవితావశ్యములకు వలసినదానికి వినా వీరు అస్తిని సంపాదింప వీలులేదు. వీరి వివాహములను, విడాకులను నిర్ణయించునదియు ప్రభువరేణ్యులే! తదితర సంస్థానములకు వీరు పారిపోయినచో, బలవంతముగ పట్టి తేవచ్చును”.

జోధపుర సంస్థాన చట్టములోని ఈ క్రింది భాగములవలన బానిసలు స్థితిని కొంత వరకు గ్రహింపవచ్చును.

“యజమాని హోదాకును, అవసరములకును తగినట్లు దరోగాలు సేవచేయక పోయినచో అతడు చట్ట సమ్మతముగ వలసిన సేవను చేయించుకొనవచ్చును. “దరోగాల సంఖ్య యజమాని హోదాకును, అవసరములకును మించిన యెడల వలసినవారినే ఉంచుకొని తక్కిన వారిని అతడు తగ్గింపవచ్చును. ఈ విధముగ తగ్గింపబడినవారు యజమాని పిలిచినప్పుడెల్ల పనిలోనికి రావలెను. యజమాని గృహమున జరుగు వివాహాది శుభకార్యములలో వచ్చి సేవచేయవలెను. యజమాని కోరినంతకాలము పనిచేయవలెను. తనకు సేవ చేయుచున్నంతకాలమును యజమాని దరోగాలకు తిండి పెట్టవలెను.

‘‘తమ యింట పుట్టి పెరిగిన దరోగాల పుత్రికలను రాజపుత్రులు కన్యాశుల్కము క్రింద ఇయ్యవచ్చును. హోదాగల రాజపుత్రులు దరోగా కుటుంబములనుకూడ కట్నముల క్రింద ఇయ్యవచ్చును.

‘‘హోదాకును, అవసరములకును మించి రను కారణముచే ఏలిక సేవ నుండి తగ్గించుటవలన వేరొకచోట పనిచూచుకొనిన దరోగాల కుమార్తెలనుకూడ కట్నముగా ఇయ్యవచ్చును."

ఈ చట్టము ప్రస్తుతము కాగితముపై లేదు. కాని, దీనిలోని ప్రతి షరతును అమలులోనున్నది. దరోగాలు చదువు సంధ్యలు లేనివారగుటచే వారికిది రద్దుగావింపబడిన సంగతియైనను తెలియదు. ఏ ప్రజాహితాకాంక్షియైనను వారికి ఈ సంగతిని తెలిపిన వానికి మూడిన దన్నమాటయే!

ఇట్లే తక్కిన సంస్థానములందును చట్టము లున్నవి. కోరా సంస్థానములో బానిసకులము వాడెవ్వడును సంస్థానోద్యోగములలో ప్రవేశింప వీలులేదు. ఉద్యోగములన్న పెద్ద పెద్ద పదవులు కాదు; పోలీసు భటుడుగా గాని, సైనికభటుడుగా గాని ప్రవేశించుటకు సయితము వీలులేదు. అంతియేకాదు. అది వరకే సంస్థానోద్యోగ ములలోనున్న బానిసకులస్థుల నందరిని ఒక్కసారిగా తొలగింపవలసినదిగ కోతా సంస్థానము 1920 సెప్టెంబరు 20 వ తేదీన ఫర్మానా జారీచేసెను!

బికనీరు సంస్థానములో 1921వ సంవత్సరపు జనాభా లెక్కల ప్రకారము చకారు, దరోగా కులజులైన బానిసలు 10,884 మంది యుండిరి. ఐనను, బికనీరు సంస్థానాధిపుడు నానాజాతి సమితికి ప్రతినిధి: వర్సెలీసు సంధిపత్రముపై సంతకపుదారుడు!

ఈ బానిసలను పెట్టు కడగండ్లను రామనారాయణ చౌదరిగా రిట్లు వర్ణించిరి: "బహుమానముల క్రిందను, కన్యాశుల్కముల క్రిందను స్త్రీలు, పురుషులు, శిశువులు బహిరంగముగ చేతుల మార్చుచున్నారు. వారిచే కఠినమైనట్టియు, నీచమైనట్టియు పనులను చేయించుచున్నారు. తినివదలిన కూడును, తొడిగి చించిన గుడ్డలను వారికిచ్చుచున్నారు. వారి వివాహమును, విడాకులను తమ వీలునుబట్టి నిర్ణయించుచున్నారు. ఈ దౌర్భాగ్యులను దండించుట, వారి మానాభిమానములను హరించుట సాధారణ కృత్యములు. పోనీ, తప్పించుకొని పారిపోవుదమున్న అదియును సులభము కాదు.

ఈ బేగారి బానిసత్వములు అనాగరకములు, అమానుషములు. వీనిని రూపుమాపుటకు బదులు సంస్థానాంతర్గత పరిపాలనలో జోక్యము కల్గించుకొనుట సమంజసము కాదని బ్రిటిషు ప్రభుత్వమువారు సాకు చెప్పుట కడుంగడు శోచనీయము. ఏ శ్వేతముఖునైన చూడగా రడిగినట్లు - స్వదేశ సంస్థానములో నవమానపరచిన బ్రిటిషు ప్రభుత్వము వారిట్లే సరిపెట్టు కొందురా?

కాని, బ్రిటిషు ప్రభుత్వ దృష్టిలో తెలుపు నలుపులకు హస్తి మశకాంతర మున్నదిగదా!

విద్యా సౌకర్యములు

తదితర దేశములతో సరిపోల్చిచూడ బ్రిటిషు ఇండియాలోనే విద్య తక్కువ. ఇక, స్వదేశసంస్థానములలో దాదాపు మృగ్యము.
యావద్భారత దేశమున (1921వ సంవత్సరపు జనాభా లెక్కల ప్రకారము) చదువను, వ్రాయను నేర్చినవారు నూటికి 8 మంది మాత్రమే కలరు. ఇక, భారత సంస్థానములలో నూటికి కేవలము 4 గురే!

కారణము? విద్యా సౌకర్యశూన్యతయే! ఈ విషయమై చూడ్గర్ ఏ మనుచున్నారో వినుడు : "సంస్థానములలో విద్యా సౌకర్యములు దాదాపుగ సున్నకు సున్న; హళ్ళికి హళ్ళి. విద్యా విధానమంతయు కడు సంకుచితముగ నున్నది. కావలె ననియే దీని నిట్లు గావించుచున్నా రనికూడ చెప్పవచ్చును. మొత్తము 563 సంస్థానములలోను కేవలము 20 మాత్రము ఎన్నదగిన విద్యాసౌకర్యములను కల్పించుచున్నవి." ఎక్కడి 563? ఎక్కడి 20? అదేదో సముద్రములో...' శాస్త్రమువలెనున్న దిది.

పాటియాలా మహారాజుగారు నరేంద్రమండలి కధ్యక్షులు. వీరు భారత భావిరాజ్యాంగ విధానమునుగూర్చి చీటికి మాటికి ప్రకటనలు చేయుచుందురు. ఇట్టి పాటియాలా మహారాజుగారి సంస్థానమున విద్యాసౌకర్యము లెట్లున్నవో గమనింపుడు: ఆ సంస్థానములో ప్రతి 15 గ్రామములకు ఒక్క పాఠశాల మాత్రమే కలదు. మొత్తము జనసంఖ్యలో నూటికి ఒక్కొక్కడు మాత్రమే విద్య నభ్యసించుచున్నాడు.

ఇంత లక్షణముగ నున్నది, నరేంద్ర మండలాధ్యక్షుని సంస్థాన గోనే విద్యావ్యాప్తి!
రామనారాయణ చౌదరిగారు తమ 'మాడరన్ రివ్యూ' వ్యా శ్యావిషయమునుగూర్చి పేర్కొనిన అంకె లివి:

	ఎంతమంది వ్యక్తులకు?	ఎన్ని చదరపు మైళ్లకు	ఎన్ని గ్రామాలకు	సంస్థానాధిపతి స్వంతఖర్చు (నూటికి)	విద్యాశాఖకై ఖర్చు(నూటికి)
ఆళ్వారు	7,011	31	17	50 వంతులు	1 వంతు
జోధపూరు	12,166	230	27	16 వంతులు	3 వంతులు
బికనీరు	10,307	364	33	11 వంతులు	1.5 వంతులు

ముంజేతి కంకణమునకు అద్దముతో పనియును లేదు; విసుగు జెందక పై యంకెలను సరిగ జదివిన వారికి వ్యాఖ్యానముతో అగత్యమును లేదు.

విద్యా సౌకర్యము లిట్లు శూన్యమైనను కోతలకు కొరత లేదు. కీ.శే. నవానగరు జాంసాహెబుగారు ఒకప్పుడు ప్రొఫెసర్ రెయిలీతో తమ సంస్థానమునందు పాఠశాల లేని గ్రామమే లేదని చెప్పిరి. ఈ సంగతిని విని, 'మాంచెస్టర్ గార్డియన్' పత్రిక ' రాజ్'ని అభినందించెను.

అసలు సత్యమేమన, నవానగరు సంస్థానమున గల 687 గ్రామములలో కేవలము 184 గ్రామములలోనే పాఠశాలలున్నవి! ఆ పాఠశాలలైనను చాల వరకు నామమాత్ర మైనవే!!

సంస్థానములలో గల విద్యాసౌకర్యములను గూర్చి చూడ్గర్ ఇట్లు చక్కగ వ్రాసెను :

"కేవలము ప్రదర్శనము కొరకు విధిలేక మెడకు తగిలించుకొన వలసివచ్చిన బండగా సంస్థాన విద్యాశాఖను మహారాజులు పరిగణింతురు. విద్యయనిన వారికి అభిరుచియే లేదు. ఈ విద్యయేగదా పీడాకరులగు వ్యక్తులను తయారు చేయును!

''పైగా, ఎంత ఖర్చు! నిష్ప్రయోజనమైన విద్య మిత్తము మహారాజులు నూటికి రెండు పాళ్ళకన్న హెచ్చుగ వెచ్చింపగలరా? "వారికి ఎన్నో మోటార్లు కావలెను; ఎన్నో రాణ్మందిరములు కావలెను. కేవలము సంస్థానముల ముఖ్యపట్టణములలోనే గాక, సిమ్లా మొదలగు శీతపర్వతములపై గూడ దివ్య హర్మ్యములు కావలెను. ఇటీవలనే ఆళ్వారు మహారాజుగారు ఆబూపర్వతముపై ఒక రాజప్రాసాదమును నిర్మించిరి. దీనికై 3,50,000 పౌండ్లను వెచ్చించిరి. ఈ మందిరము, పొలిటికల్ ఏజెంటు నుడివినట్లు, 'అరేబియన్ నైట్సు' కథలలోని వైభవోజ్వలతను స్ఫురణకు దెచ్చుచుండును. వైస్రాయిగాని, గవర్నరుగాని, పొలిటికల్ ఏజెంటుగాని, తదితర ప్రముఖుడెవడైనగాని సంస్థానమును దర్శింప నేగినచో క్రొత్త సున్నముతోను, నూత్నాలంకారముతోను విలసిల్లుచున్న పాఠశాల నొకదానిని చూపింతురు. మఱియెన్నో పాఠశాలలు కాగితముపై క్షణములో సృష్టియగును. అతిథియు ప్రజల శ్రేయోభివృద్ధికై పాటుబడుచున్నందులకు మహారాజును విధ్యుక్తముగ భూషించును. సాదరముగ సత్కరింపబడిన పత్రికా ప్రతినిధులు ఈ భూషణ వాక్యములను దశదిశలకును తంత్రీవార్తల ద్వారా తెలియజేతురు. ఆ మ రు నాడే 'ఫలానా మహారాజుగారి విద్యాభిమానము,' 'ఫలానా సంస్థానములో విద్యావ్యాప్తి' అని నల్లని పెద్ద అక్షరముల శీర్షికలతో పత్రికలు వెలువడును.ఈ నల్లని పెద్ద అక్షరములు సత్యమును కళంకమొనర్చుచున్నవని యెవరి కెరుక? పరిస్థితులన్నియు సరిగ తెలిసినవా డెవడైనా విమర్శనకు పూనుకొనినచో, అతడు అల్లరి చిల్లరివాడని పలుకుదురు. అతనికి కారాగారవాస శిక్షను విధించుట, లేదా అతనిని దేశ భ్రష్టుని గావించుట తగునందురు.

"సంస్థానములలో ఇట్టి విమర్శన రాజద్రోహమగును. ఇక, బ్రిటిషు ఇండియాలో దీనిని పెద్దనేరము క్రింద భావించి, 5 సంవత్సరముల వరకు కారాగారవాసము విధించినను విధింపవచ్చును."విద్యావిషయమున స్వదేశ సంస్థానము లన్నియు సహారాను బోలునని చెప్పదగును. కాని, ఈ యెడారిలో కొన్ని జలాశయములు లేకపోలేదు. అవి మైసూరు, తిరువాన్కూరు, కొచ్చిన్ మొదలైనవి."

వైద్య సహాయము

వైద్య సహాయము, విద్యాసౌకర్యములకు 'డిటో' అని చెప్పిన చాలును. కాని, ఇంత మాత్రమున పాఠకులు సంతృప్తి నందుదురా? ఇతరు లెవరైన ఇట్లు ముక్తసరిగ చెప్పిన నేనే సంతృప్తి పడను. ఇట్టి యెడ పాఠకవరేణ్యులు సంతృప్తి నందగలరని నే నెట్లు భావింపగలను? ఎవరైనను నే విన్నమాట నెల్ల విశ్వసింపరాదు. ఎంత చిన్న విషయమునైనను, సత్యమని నమ్ముటకు ముందు తరచి చూడవలెను. ఈ సూత్రము ననుసరించియే నే నింతదనుక ప్రత్యల్ప విషయమును నిరూపించుటకు నిష్పాక్షికులైన ప్రముఖు లొసగిన యభిప్రాయములను పేర్కొంటిని. ఇక ముందుగూడ ఇట్లే కావింతును.

ఇక, అసలు విషయము : రామనారాయణ చౌదరిగారి 'మాడరన్ రివ్యూ' వ్యాసములోనివే క్రింది అంకెలు.

సంస్థానము	ఒక్క వైద్యాలయము			సంస్థానాధిపతి స్వంతఖర్చు (నూటికి)	వైద్య సహాయ ఖర్చు (నూటికి)
	ఎంత మంది వ్యక్తులకు?	ఎన్ని చదరపు మైళ్ళకు?	ఎన్ని గ్రామాలకు?		
ఆళ్వారు	70,115	314	177	50	3
జోథపూరు	75,000	1,400	81	16	2.25
బికనీరు	47,120	1,665	154	11	1.4

రాజపుత్రస్థానపు సంస్థానములవలెనే దాదాపుగ తక్కిన వన్నియును! సంస్థానపతి స్వంతఖర్చులో పదియవ భాగమైనను ప్రజలకు వైద్యసహాయమొనర్చుటకును, వారిని మృత్యుముఖమునుండి తప్పించుటకును వినియోగముకాదు. బడ్జెట్టులో వైద్యశాఖ కని ప్రత్యేకింపబడిన స్వల్పధనమైనను పూర్తిగా ప్రజోపయోగార్థమై వెచ్చింపబడునా? అదియును లేదు?

'ప్రిన్సిలీ ఇండియా' పత్రిక (27-8-33) లో టాభ్వాను గూర్చి ఇట్లున్నది: "సంస్థాన వైద్యాలయమున ఔషధముల ఖర్చును తగ్గించిరి. రోగులు మందులకై గోల పెట్టుదురు. కాని, వారికి రంగునీళ్ళను పోయుదురు. పూర్వము జాభ్వాకై 2 వేల రూప్యములకు పైగా ఖరీదు చేయు మందులను తెప్పించెడివారు. ఇప్పుడు 1750 రూప్యముల విలువచేయు మందులనే తెప్పించుచున్నారు. వీనిలో చి మందుల నెల్ల రాజా సాహెబుగారే తీసికొందురు. రోగుల సంఖ్య హెచ్చుచున్నది. కాని, మందులు అంతకంతకు తగ్గుచున్నవి.

'ప్రిన్సిలీ ఇండియా' పత్రికలోనే (20-8-33) కుషల్ ఘర్ సంస్థానమును గూర్చి ఇట్లున్నది: "సంస్థానములో ఒక్క వైద్యాలయము మాత్రమే కలదు. అదియును నామమాత్రమునకే! సాలినా 12 వందలో 15 వందలో రూపాయలను ఖర్చుచేసి ఔషధములను తెప్పించుచున్నారు. ఇవి ప్రజావశ్యకములకు సరిగ సరిపోవు. కాని, వీనిలోనే మంచిమందుల నన్నిటిని - మొత్తములో దాదాపుగ సగముఖరీదు చేయువానిని సంస్థానపతియు, అతని కుటుంబమువారును ఉపయోగించుకొనుచున్నారు.

ఇక మిగిలిన వానితోనే 35 వేలమంది ప్రజలు సంతృప్తి పడవలెను. వైద్యాలయపు డాక్టరును, కాంపౌండర్లను అన్నప్పుడెల్ల సంస్థానాధీశుడో, అతని కుటుంబమువారో పిలిపించుచుందురు. ఇందుచే ప్రజలు రోజంతయు పడియుండి కూడ చికిత్సను బడయనేరకయే గృహోన్ముఖులు కావలసివచ్చుచున్నది!"

ఇంతకన్న ఘోరము కొన్ని సంస్థానములలో జరుగుచున్నది. వానిలో కొన్నిటియందు సంస్థానపతి పెంపుడు కుక్కల మందు ఖర్చునంతయు పశువైద్యశాఖ లెక్కలలో జేర్చుదురు. మ రికొన్నిటి యందు కేవలము సంస్థానపతి కుక్కల నిమిత్తమే పశువైద్యశాఖను కల్పింతురు! ఎంతదారుణ మిది! ఎంత.

అన్నట్లు అనేక సంస్థానములలో వైద్యాలయములు లేకపోయినను కల్లు, సారాయి, గంజాయి, నల్లమందు మొదలైన మత్తు పదార్థముల దుకాణములు మాత్రము విరివిగా నుండును. ఇందుకు ఉదాహరణముగా నవానగరు సంస్థానమును చూపించవచ్చును. ఈ సంస్థానములోని వైద్యాలయములు 16 మాత్రమే! కాని, సారాయి దుకాణములు 29! నల్లమందు షాపులు 18!!

ఈ ప్రకరణము, క్రిందటిదానికి 'డిటో' యనుచు ప్రారంభించితిగదా! తిరిగి 'డిటో'గానే చూడ్గర్ వాక్యములతో దీనిని ముగింతును. అతడిట్లు వ్రాసెను:

''గ్రామములకు అందుబాటు దూరములో వైద్యసహాయము బొత్తుగలేదు. రోగులు జబ్బుగ నున్న రోగులు - ప్రాణాపాయకర స్థితిలో నున్న రోగులు - సరియైన రోడ్లు లేకపోవుటచే గ్రుద్దుకొనుచుండు ఎద్దు బండ్ల నెక్కి ఆసుపత్రులకు వెళ్ళవలెను. ఈ ఇబ్బందిని పడ లేక నూటికి 90 మంది గ్రామస్థులు కూరగాయ వైద్యుల సహాయమును అపేక్షింతురు. పాపభీతి నెరుగని ఈ వైద్యులును ప్రజలను మోసపుచ్చి, డబ్బు లాగుచుందురు. ఒక వేళ చికిత్సాలయము అందుబాటులో నున్నను డాక్టర్ల దర్శనము పాపము, రోగికి సాధారణముగ లభింపదు! సంస్థానపతి కుటుంబ సేవలలోనే డాక్టర్లు తరచుగ నిమగ్నులై యుందురు. "స్త్రీ-శిశు సంరక్షణాలయములు నూటికి 5 సంస్థానములలో నైన సరిగ లేవు. సుశిక్షితలైన మంత్రసానులు దొరకుట దుర్ఘటము. ఇక్కారణముననే ప్రసూతి కాలమున పెక్కుమంది స్త్రీలు మరణించుటయు, ఎందరో మృతశిశువులు జనించుటయు సంఘటించుచున్నది. ఎట్లో గండము తప్పించుకొన్న స్త్రీలకైనను ఆరోగ్యము శాశ్వతముగ భగ్నమగుచున్నది. ఈ విషయములకు సంబంధించిన అంకెలు ఘోరములు; హృదయ విదారకములు! దీనుల ఆర్తనాదములు మన సంస్థానాధీశుల చెవిని బడవు. దౌత్యసంరంభములో, నృత్యగానాదులలో చెవిని బడుటకైనను అవకాశమేది? తమ మొర, ఘోష, విలాపము, సంస్థానపతుల చెవిని బడినను పడకున్నను, వారి భోగాతి శయముల కన్నిటికిని ప్రజలు ధనరాసులను సమర్పించి తీరవలసినదే!

''గ్రామస్థులు - జనాభాలో ముప్పాతిక వరకున్న గ్రామస్థులు - సంస్థానాదాయములో నూటికి 80 పాళ్ళను సమకూర్చు గ్రామస్థులు - ఈషణ్మాత్రమైనను వైద్యసహాయమును బడయలేకున్నారు.

"ఐనను వైద్యాలయములకును, స్త్రీ-శిశుసంరక్షణాలయములకును శంకుస్థాపనమహోత్సవములు జరుపబడు చున్నట్లు మనము సాధారణముగ వినుచుందుము. కాని, శాసనసభలవలె వీని బ్రతుకును కేవలము కాగితము మీదనే! భూపతనము గాకమునుపే అసువులను గోల్పోవుచున్న వేనకువేల శిశువులకివి సంజ్ఞారూపకములు కాబోలు!"

వాక్స్వాతంత్ర్యము

మేము తమ వద్దకు గస్తీనిషాక్ 53 తా.17 దై 1339 ఫ.ని గురించి మనవి చేయుటకై వచ్చియున్నాము. ఈగస్తీ మ.ఘ.వ. నిజాము ప్రభుత్వము వారి ప్రజలకు వారి జన్మసిద్ధమగు వాక్ స్వాతంత్ర్యమును నిరాకరించుచున్నది. ఈ స్వాతంత్ర్యము ఏ దేశమందైనను సరే ప్రజల నైసర్గికములగు హక్కులలో నొకటి యని ప్రపంచములోని ప్రతి నాగరక ప్రభుత్వమును అంగీకరించియున్నది.*(ఈ గస్తీ నిషాన్ ను ఇటీవల రద్దు పరచిరి. కాని ఇది నామ మాత్రము గనే. ఇది రద్దుకాక పూర్వము కంటె పరిస్థితులు మరింత ఘోరముగ నున్నవి.)*

నిజాము ప్రభుత్వమువారు కూడ ప్రజలకీ హక్కు గలదని అంగీకరించియే యుండిరి.11 మొహరము 1340 హిజ్రా (9 ఆబాన్, 1330 ఫ.)నాటి ఫర్మాను జారీ అగువరకు రాష్ట్రపు ప్రజలు ఈ హక్కును నిరాటంకముగ అనుభవించు చునే యుండిరి. ఈ ఫర్మానైనను అన్ని విధములగు బహిరంగ సభల విషయమున నిర్బంధముల గల్పించి యుండలేదు. సాంఘిక, మత, విద్యా విషయికాది సభలతో ఆ ఫర్మానునకెట్టి జోక్యము లేకుండెను. కాని ప్రస్తుతపు గస్తీ (53) ప్రకారము బహిరంగసభ యెట్టిదైనను సరే దానికి ప్రభుత్వాంగీకారము తప్పక కావలయును. ఈ గస్తీ నైసర్గిక హక్కులలో నొకటగు వాక్స్వాతంత్ర్యమును ఈ రాష్ట్రపు ప్రజలకు ఈ లేకుండ చేసినది. ఇట్టి హక్కు ఈ దేశపు ప్రజలలోని ప్రతి వ్యక్తికి కలదని మన ప్రభువుగారి ఉన్నత న్యాయస్థానము (హైకోర్టు) వారు ఒక ప్రక్కన తీర్మానించి యుండగా (దక్కను లా రిపోర్టు: సం.21: పుట 305: ప్రభుత్వము - ఖాజీషముద్దీను అను నభియోగము), వేరొక ప్రక్కన మన ప్రభుత్వమువారే ఈ గస్తీ ద్వారా ఈ హక్కును నిరాకరించుచున్నారు.

''ఇట్టి కఠినమగు శాసనమును ఎందుచేత నిర్మింపవలసి వచ్చినదో ప్రభుత్వమువారు కారణము చూపి యుండలేదు. ఈ రాజ్యమునందు ఈ దినమువరకు ఒక రాజద్రోహపు అభియోగమైన - ఈగసీ టీవల రద్దుపరచిరి కాని, ఇది నామమాత్రముగనే! ఇది రద్దుకాక పూర్వము న్యాయస్థానములలో విచారింపబడలేదు. ఒక వ్యక్తియైన నేటి వరకు ఇట్టి నేరమునకై శిక్షింపబడి యుండలేదు. కావున ఈ రాష్ట్రపు ప్రజలు ఇట్టి కఠిన శాసనము నిర్మించుటకు ఏ మాత్రము కారకులు కాలేదని ఘంటాపథముగ చెప్పగలము. ప్రపంచములోని ఏ నాగరక ప్రభుత్వమును శాంత పరిస్థితులలో నిట్టి శాసనము చేసియుండలేదు!

మరియొక మనవి. ఇట్టి కఠిన శాసనములను నాగరక ప్రభుత్వమువారు అసాధారణ పరిస్థితులలో మాత్రమే జారీచేయుదురనియు, అదియే శాసన నిర్మాణము యొక్క ముఖ్య సూత్రమనియు విజ్ఞులు చెప్పుచున్నారు. అట్టి పరిస్థితులలోనైనను, ఈ విధమగు శాసనములను కొంతకాలము కొరకు మాత్రమే జారీచేసెదరు; శాశ్వతముగా నుంచరు. ఇట్టి శాసనముల నిర్మించునపుడు నాగరిక ప్రభుత్వములవారు వాని నిర్మాణములకు ఏ కారణములు కలిగినవో, వానిని వివరించి ఈ శాసనము ఇంత కాలము వరకు మాత్రమే యుండునని కాలనిర్ణయము చేయుట ఆచారమైయున్నది. ఇంతేకాదు. ఇట్టి కఠిన శాసనములను దేశమంతటను అమలులో పెట్టరు. ఏ దేని కొంత ప్రాంతములో (ఎచ్చట నిది అత్యవసరమని తలంపబడునో అచ్చట) మాత్రము అమలులో పెట్టెదరు. ఏ రాష్ట్రమునందును నిట్టి కఠినశాసనము సర్వ ప్రాంతములందును, సర్వకాలములందును అమలులో నుండవలయు నని ఏ నాగరక ప్రభుత్వమువారు ఆజ్ఞాపించినట్లు కని, విని యెరుగము!

కేవలము మతవిషయికములును, విద్యావిషయికములును, సాంఘికములగు సభలను ఆపిన ఉదాహరణము లెన్నియో కలవు. గ్రంథాలయముల వార్షికోత్సవములను, వర్తక సంఘముల సభలను, సంఘ సంస్కార సభలను సమావేశపరుప

ప్రభుత్వమువారు సెలవీయ నిరాకరించిరి!" అని నైజాము ప్రభుత్వపు పోలీసుశాఖా మంత్రులగు లెఫ్టినెంటు కర్నలు సర్ రిచర్డు షెన్విక్సు ట్రెంచుగారి వద్దకు 1933వ సం॥ము ఫిబ్రవరి 8వ తేదీని శ్రీయుత రామచంద్రనాయకు ఎం.ఏ., బారిష్టరుగారి అధ్యక్షత క్రింద రాయబార మేగిన సంఘమువారు మనవి చేసికొనిరి.
హైదరాబాదు వలెనే తక్కిన సంస్థానములును! దేనియందును ప్రజలకు వాక్స్వాతంత్ర్యము లేదు. ఆళ్వారులో రాజకీయములను గూర్చి ఉపన్యసించిన 5 సంవత్సరముల కఠిన శిక్షయు, రెండు వేలరూప్యముల జరిమానాయు విధింపవచ్చును. సంస్థానము నుండి బహిష్కరింపవచ్చును కూడ! ఇంచుమించుగ నిట్లే జోథపూరు, జాంనగరు, బికనీరు...

వాక్స్వాతంత్ర్యము శూన్యమగుటవలన సంస్థాన ప్రజలు తమ కష్టసుఖములను లోకమునకు వెల్లడింపలేరు. బ్రిటిషు ఇండియాలో సభలను జరుపుకొన గూడదా? అని ప్రశ్నింతురేమో! కొంతవరకిట్లే జరుగుచున్నది. క్రిందటి అఖిల భారత సంస్థాన ప్రజాసభ డాక్టర్ భోగరాజు పట్టాభిసీతారామయ్యగారి అధ్యక్షత క్రింద కరాచీలో సమావేశ మయ్యెను. నిజాంరాష్ట్ర ప్రథమ రాజకీయ సభ అకోలాలో జరిగెను. పంజాబు సంస్థాన ప్రజాసభ 1931లో థక్కర్ గారి అగ్రాసనాధిపత్యము క్రింద సిమ్లాకొండలపై సమకూడెను. కాని బ్రిటిషు ఇండియాలో నైనను రక్షణకలదా?5 సంవత్సరముల వరకు శిక్ష విధించుట కిక్కడ సంస్థానాధీశుల రక్షణ చట్టము (Prince's Protection Act) లేదా?

సంస్థానములలో వాక్స్వాతంత్ర్య మెంతో, పత్రికా స్వాతంత్ర్యము కూడా అంతే! ప్రజల కష్టసుఖములను నిస్సందేహముగ, నిర్మొగమాటముగ, నిర్భయముగ ప్రకటించు వార్తాపత్రిక సంస్థానములలో ఎక్కడను లేదనియే చెప్పవచ్చును. ఏ మాత్రము ప్రజా పక్షపాతమును చూపించినను, లేక రాజకీయములను గురించి శ్రద్ధ వహించినను పత్రికను వెంటనే కట్టివేయించుచురుగదా! ఇక, సంస్థానములలో సరియైన పత్రికలుండుటెట్లు? ఈ ప్రశ్నలో అత్యుక్తి లేదు. అత్యుక్తి నిజముగనే లేదని నిరూపించమందురా? అయినచో వినుడు: గోండల్ సంస్థానములో "ది కథియవాడ్" అని ఒకే ఒక వారపత్రిక యుండెడిది. రాజకీయములను చర్చించెనను కారణమున 1924లో దానిని సంస్థానమువారు ఆపుచేయించిరి. అంతే! తిరిగి నాటికి నేటికి ఆ సంస్థానములో మచ్చునకొక పత్రికయైనను లేదు! బికనీరులో కూడ ఇంతే! అక్కడ "పుష్కరేందు" అని ఒకే ఒక మాసపత్రిక యుండెడిది. ఆ పత్రికాధిపతి సంస్థానమువారి కఠిన నిబంధనల నన్నిటిని పాటింపలేక, పత్రికను కట్టివేసెను. ఇక, నవానగరు సంస్థానము స్థితి ఇది : ఇక్కడ "సోషియల్ సర్వెంట్" అను పేరుతో ఒక మాసపత్రిక యున్నది. పత్రికను ప్రకటించుటకు ముందు దాని ఎడిటర్ క్రింద హామీమీద సంతకము పెట్టవలసి వచ్చెను : "అర్జీదారు రాజకీయ విషయములను ఎత్తుకొనరాదు; ప్రజలమీద విద్వేషముగాని, అసహ్యతగాని కలిగించు విషయములను ప్రచురించరాదు... ఇందుకు భిన్నముగా జరిగిన అతడు మహారాజునకు అయిదు వందల రూపాయల జరిమానా చెల్లించు కొనును." ఈ హామీకి భిన్నముగా జరిగెనో లేదో నిర్ణయించునది కోర్టువారని భావింతురేమో! కాదు! మహారాజుగారి పొలిటికల్ సెక్రటరీ! అతడి తీర్పు పైన అప్పీలు చేసుకొనుటకు కూడ అవకాశములేదు. ఇంతటి కఠిన నిబంధనలకు లోనై, ఇంతటి హైన్యమున కొడబడి పత్రికలను నడుపుటెట్లు? నిరంకుశత్వము నగ్న తాండవము చేయు ఉత్తర హిందూస్థాన సంస్థానములలోనే గాక, కొంత వరకు సత్పరిపాలనమునకు వాసిగన్న మైసూరులో కూడ పత్రికల స్థితి ఇంత ఘోరముగనే యున్నది. ఇటీవలనే ఈ సంస్థానములో కాంగ్రెసు పట్ల అభిమానమును చూపు "ప్రజామత" అను కన్నడ పత్రిక డిక్లరేషన్ రద్దుచేసిరి : ఇంతే కాదు! ఆ పత్రిక కార్యస్థానాన్ని హుబ్లీకి మార్చి, ప్రచురణ సాగించగా, దాని ప్రతులను జప్తుచేసిరి.

సంస్థానములలో నిట్లు సరియగు పత్రిక లుండుటకు అవకాశములు లేవు సరిగదా బ్రిటిషు ఇండియా పత్రికలైనను సంస్థాన పరిపాలనా క్రమమును విమర్శింప దొడగినచో, దానిని కూడ వెంటనే బహిష్కరింతురు.

ఎన్నో పత్రికల నిట్లు బహిష్కరించిరి. జయపూరు సంస్థాన మొకప్పుడు 'లీడర్' 'బొంబాయి క్రానికల్', 'ప్రతాప్', 'కర్మవీర్', 'మాధురీ', 'సరస్వతి' పత్రికలను ఒకేతూరిగా బహిష్కరించినది. గోండల్ సంస్థానము లోనికి క్రింది పత్రికలలో ఏదియు రా వీలులేదు:

పత్రిక	ప్రచురణ స్థలము
1) సౌరాష్ట్ర	రామ్ పూర్
2) ఫూల్ ఛాబ్	రామ్ పూర్
3) రోషణి	రామ్ పూర్
4) జన్మభూమి	బొంబాయి
5) ప్రజాబంధు	అహమ్మదాబాదు
6) ప్రజామిత్ర	బొంబాయి
7) ప్రజామిత్ర కేసరి	బొంబాయి
8) కథియవాడ్ వొపీనియన్	రాజకోట
9) జాగృతి	రాజకోట
10) వాఫ్ దార్	నవ్ సారి
11) ఆశకార్	సూరత్
12) టాప్	సూరత్
13) బొంబేబజార్ భావ్	బొంబాయి
14) కథియవాడ్	బొంబాయి
15) పోవ్ పత్రిక	బొంబాయి

ఇటీవలనే 'బొంబాయి క్రానికల్' పత్రిక తమ సరిహద్దుల లోనికి రావీలులేదని నైజాముగారు ఫర్మానా జారీచేసిరి. నా "నేటి రష్యా"ను బహిష్కరించుచు 1938 ఫిబ్రవరిలో ఒక ఫర్మానా వెలువడినది. ఫర్మానామాట యెటున్నను, 'క్రానికల్'ను బహిష్కరించుటకు గల కారణ మేమో చూచాయగానైనా తెలుపకుండుటయే విచిత్రము.*(ఈ సంవత్సరము ఆగష్టు 15 సెప్టెంబరు 15 తేదీల మధ్య హైదరాబాదు సంస్థానములోనికి రావీలులేదని మొత్తము 23 పత్రికలను కాబోలు బహిష్కరించిరి. పత్రికల బహిష్కారము విషయములో ఈ సంస్థానము గురించి ఒక కథ చెప్పుచుందురు. ఇది నిజమో, కాదో నిర్ధారణగా చెప్పలేము కాని, ఉన్న పరిస్థితులను బట్టి దీనిలో విపరీతమేమియు లేదు. హైదరాబాదులో ఎప్పుడైనను సరే మొత్తము నూరు పత్రికల మీద బహిష్కారముండునట! నూట ఒకటవ పత్రికను బహిష్కరించినంతనే, వరసలో మొదటి పత్రిక మీద ఆంక్ష తొలగిపోవునట! ఈ విధముగా ఎప్పటికప్పుడు నూరు సంఖ్యకు భిన్నము రాకుండునట!)*
అసలు విచిత్రములకు సంస్థానములు పుట్టినిండ్లు. ప్రజలు కటిక దారిద్ర్య మనుభవించుచుండ, వారి పరిపాలకులు కుక్కలపై మోజుపడుట ఒక విచిత్రము. సకల ప్రపంచమును "స్వేచ్ఛ! స్వాతంత్ర్యము!!' అని పలవరించుచుండ, 'బేగారి' ప్రబలి యుండుట ఇంకొక విచిత్రము. నిర్బంధోచిత విద్యావిధానము సర్వజనాంగీకారము నొందుచుండ, పది -పదిహేను గ్రామములకు ఒక పాఠశాలయైన లేకుండుట మటొక విచిత్రము.

స్వేచ్ఛా వ్యాపార సూత్రము ధర్మసమ్మతమని పరిగణింపబడుచుండ, దైనందిన జీవితావశ్యకములను గూడ ఇజారా పాడుట వేటొక విచిత్రము. ఇట్టి విచిత్రముల ముందు ఈజిప్షియన్ పిరమిడ్సు, పైసా లీనింగ్ టవర్, న్యూయార్కు స్కై స్కేపర్లు ఆగ్రా తాజమహల్ మున్నగునవి ఏపాటివి?

తీర్పు

తప్పుచేసిన వానిని కోర్టు కీడ్చుట మామూలు. కాని మహారాజులను - వారెట్టి దుర్నయము లొనర్చినను - కోర్టు కీడ్చుటకు వీలులేదు. "రాజు చట్టమునకు అతీతుడు" (The King is above Law) గదా! కాని మహారాజులైనను తప్పు చేసినప్పుడు ప్రజాభిప్రాయము (Public Opinion) అను కోర్టు నుండి తప్పించు కొనలేరు. ఇప్పుడు మనము సంస్థానపతులను 'ప్రజాభిప్రాయము' అను ఈ కోర్టులోనికి రప్పించి వారిని గూర్చి కొందరు జడ్జీలు చెప్పు తీర్పులను విందుము గాక! మేయో బూతుల పుస్తకమునకు "సావెల్ జిమాండ్" అను మారుపేరుతో చక్కని జవాబును వ్రాసిన అమెరికను దేశీయుడు, మొదటి జడ్జి :

"ఏదో కొన్ని సంస్థానములు మాత్రము సలక్షణముగ పరిపాలింపబడుచున్నవి. తక్కిన పెక్కింటిలో నిరంకుశాధికారము అప్రతిహతముగ కొనసాగుచున్నది.

ఇప్పటికిని పెక్కుమంది మహారాజులు కాలానుసరణి మార్పు జెందుటకు అంగీకరించుటలేదు. వారు ఏనుగులను సింహములను వేటాడుదురు; వైభవోపేతముగ జీవింతురు; దేదీప్యమానమైన యుత్సవములను జరుపుదురు; నేత్రోత్సవకరమైన ప్రదర్శనముల నేర్పాటు గావింతురు; భోగకన్యలతో నానందింతురు; జరీ వస్త్రములను ధరింతురు, సలాములతోను, నోరు తిరుగని బిరుదములతోను పొంగిపోదురు".

"నేకెడ్ ఫకీర్" గ్రంథకర్త పార్లమెంటు సభ్యుడు అయిన రాబర్టు బెర్నీస్, రెండవ జడ్జి :

పెక్కుమంది సంస్థానాధీశులు రాబడిలో అధికభాగమును స్వీయోపభోగములకు వెచ్చింతురు. ఇంగ్లండు నేటికిని ప్రజాస్వామ్య పక్షపాతమును, స్వాతంత్ర్య ప్రేమను గోల్పోవలేదు. ఇట్టి ఇంగ్లండునకు ప్రియమైన సిద్ధాంతము లన్నిటికి పూర్తిగ విరుద్ధముగా మహారాజులకు తమ ప్రజలను ఉరితీయుటకును, నిష్కారణముగ నిర్బంధించు టకును తగిన నిరంకుశాధికారము లున్నవి".

ఈ గ్రంథకర్తయే కరాచీ నుండి ఇంగ్లండులోని ఒక మిత్రునికి ఉత్తరము వ్రాయుచు, ఇట్లు అనెను;

"ఇంగ్లండులో ఈ సంస్థానాధిపతుల ఘనతర ఆతిథ్యమును స్వీకరించువారు, వీరిని గురించిన వివరములను తెలుసుకొని యుండుట అవసరము సంస్థానాధీశుడు లండన్లో 1500 పౌనులను ఖర్చు పెట్టి ఒక విందును చేసెను. ఈ విందు ఖర్చు ఎచ్చటి నుండి వచ్చెనో చెప్పు మందువా? అతని సంస్థానములోని కర్షకుల రక్తమాంసముల నుండి! సకల భూషణ విభూషితులైన వీరి మోటారు కారులకును, రాజప్రతినిధుల నిమిత్తము వీరు ఏర్పాటు చేయు షికారీ పార్టీలకును, యూరప్ రాజధాని నగరములలో వీరిచ్చు గొప్ప గొప్ప విందులకును అగుచున్న ఖర్చు వీరి సంస్థానములలో ఆలుబిడ్డలకు కడుపునిండా కూటిని సయితము పెట్టలేకుండనున్న నిరుపేదల దగ్గరినుండి వసూలగు చున్నది!

వీరిలో కొందరు యూరప్ ఖండములో శతాబ్దముల క్రిందట రాజ్యమేలిన నిరంకుశ ప్రభువులను మరపింతురు".

మాజీ భారత శాసన సభా సభ్యుడగు రంగయ్యర్, మూడవ జడ్జి :

"ఒక్క వ్యక్తి పరిపాలన అతడు సామర్థ్యము గలవాడైనప్పుడే - సవ్యముగ నుండదు. ఆ యొక్క వ్యక్తియు ఇక స్త్రీలోలుడు, త్రాగుబోతు, విలాస ప్రియుడు అయినచో వే రు గ చెప్పనక్కరయే లేదు. సంస్థాన ప్రజల ఓటు తీసికొనినచో, వారు సంస్థానములను బ్రిటీషు ఇండియాలో కలుపుకొనుట సంతోషకర మని తెలుపుదురు. బ్రిటీషువారు దయ తలచుచుండుట చేతనే నేడు సంస్థానములు మనుచున్నవి.

భారత సంస్థానములలో నున్న సాంకర్యము, మోసము, హింస, నిరంకుశత్వము మున్నగువానిలో సహస్రాంశమైనను బ్రిటీషు ఇండియాలో నున్నచో బ్రిటీషు రాజ్యము పూర్వమెన్నడో విధ్వంసమై యుండెడిది".

'ఆర్య' గ్రంథకర్త గ్రాహం యస్. హట్చిన్సన్, నాల్గవ జడ్జి :

‘‘సంస్థాన ప్రజలు తీవ్ర నిరంకుశ కృత్యముల వలనను. దుస్సహమైన పన్నుల భారము వలనను బాధితు లగుచున్నారనుటలో సందియము లేదు. ఇట్టి పరిస్థితులను ఏ సార్వభౌమ ప్రభుత్వము - అది తన బాధ్యతను గుర్తెరిగినదైన - క్షణలేశమైనను క్షమింపదు.

“ఫెడరల్ విధానము పట్ల సంస్థానాధిపతుల ఆమోదమును పొందుటకు గాను వారి హద్దులేని నిరంకుశతను యథాతథముగా సాగనివ్వవలసి వచ్చిన, అసలు అట్టి ఆమోదముతో నిమిత్తము పెట్టుకొనకపోవుటయే ఉత్తమము. ఇట్లే భారత ప్రభుత్వ సుస్థిరత్వమునకు గాను సంస్థానాధీశుల క్రూరకృత్యములను సహింపక తప్పదని, అట్టి సుస్థిరత్వమునకు పాకులాడ కుండుటయే మేలు. “ఇదిగో దీని సంగతి ఇది అని వేలెత్తి చూపక, దాదాపుగ తక్కిన అన్ని సంస్థానములవలెనున్న ఒకానొక సంస్థానము సంగతిని ఇక్కడ పేర్కొందును. ఈ సంస్థానపు గత పరిపాలన నివేదిక - ఇది 1930-31 సంవత్సరము నాటిది ఆ సంవత్సరములో సంస్థానమునకు 49 లక్షల రూపాయల పైచిలుకు ఆదాయము వచ్చినట్లు తెలుపుచున్నది. ఈ మొత్తములో దివాణము క్రింద చెల్లిపోయిన డబ్బు దాదాపుగ 11,25,000 రూపాయలు. ఈ దివాణపు ఖర్చు విద్యాశాఖకును, వైద్య సహాయమునకును అయిన మొత్తమునకు మూడు రెట్లు. సంస్థానాధీశుని సుఖసంతృప్తుల కొరకు ఖర్చుపడిన మొత్తమును దివాణపు ఖర్చులో చేర్చక, వివిధ ప్రభుత్వ శాఖల పైన ఖర్చులలో చేర్చుట సామాన్యముగ జరుగు తంత్రము. ఇట్టి తంత్రము - సంస్థానాధిపతి ఆశ్రితులకు పెద్ద పెద్ద జీతములతో ఉద్యోగము లిచ్చుటకును, వారికి భవంతులను, మోటారుకార్లను సప్లయి చేయుటకును ఇట్టి తంత్రము చక్కగ ఉపయోగపడుచుండును - ఈ సందర్భములో జరుగలేదని అనుకొనినను సంస్థానాదాయములో దివాణము ఖర్చు నాల్గవ వంతు అని నివేదికను బట్టియే స్పష్టపడుచున్నది. బడ్జెటునందు వార్షికాదాయములో అధిక భాగము ప్రజల క్షేమము నిమిత్తము ప్రత్యేకింపబడినది" అని పైన చెప్పిన పరిపాలనా నివేదికలో నున్నది. సంస్థానములోని బాలబాలికలలో నాల్గవవంతుకే ఏదో ఒక రూపమైన విద్యా సౌకర్యములున్నవి. ఖర్చు తగ్గించుట అవసరమై సంస్థానాధిపతి పెన్షనులలో కోత పెట్టెనట. ఇదియును చాలనందున తక్కిన హోదాలోని ఉద్యోగస్థులను కొందరిని బర్తరఫ్ చేసెనట. ఇట్లు చేసిన ఈ సంవత్సరములోనే అతడు తన పందెపు గుర్రముల శాఖలో క్రొత్తగా ఇద్దరు యూరపియన్ 'జాకీ'లను నియమించెను. ఈ 'జాకీ'లలో ఒక్కొక్కని జీతము సంస్థాన ముఖ్యపట్టణములలోని విద్యాలయ ప్రధానాచార్యుని వేతనమునకు మూడు రెట్లు హెచ్చు!

సంస్థానాధీశులు వ్యక్తిగతముగా చేయు ఈ దుర్వ్యయమును భారత ప్రభుత్వమువారు చూచియు చూడనట్లు నటించెదరనుటకు ఎన్నియేని నిదర్శనము లున్నవి. ఇంతేకాదు. కొన్ని కొన్ని సందర్భములలో భారత ప్రభుత్వమువారు సంస్థానాధిపతులను అనుకరించుటకు ప్రయత్నించెదరు!!”

కల్నల్ పోవెల్, అయిదవ జడ్జి :
ఏషియా నిరంకుశ ప్రభుత్వముల స్వరూపము ప్రస్తుతము భారతదేశ సంస్థానములలోనే కాననగును. మిరుమిట్లు గొలుపు ఆ రాజ వ్యక్తులు, ఆ భూరి సంపదలు, ఆ యచింత్య వైభవములు, ఆ భోగవిలాసములు, ఆ యథేచ్ఛా వ్యయములు, ఆ విచిత్ర సాంప్రదాయములు, ఆ మూఢాచారములు, ఆ దుర్భేద్య విశాల ప్రాసాదములు, ఆ యంతఃపుర యువతీ సమూహములు, ఆ విలాస వారవనితా సందోహములు, పురుషుల యింద్రియ తృప్తికే స్త్రీలు సృజింపబడిరను ఆ మూఢ విశ్వాసములు, మానవ జీవితమునెడ ఆ నిరసన భావములు, ఆ భయంకర దండనములు, కాంచన రత్నాభరణ సంభృతము లగు ఆ ధనాగారములు,.
కవచధారులగు ఆ యాశ్వికులు, ఆ దాసదాసీజన పరివారములు, ఆ దివ్యసరోవరములు, కుసుమ వాసితోద్యానములు, ఆ పురోహిత బృందములు, ఆ విగ్రహ సముదాయములు, ఆ మత్త మాతంగములు, - ఇవన్నియు నేటికిని సంస్థానములందు ప్రత్యక్షమగుచున్నవి”. ఇంతమంది జడ్జీలు తీర్పు చెప్పిన పిదప, నేను ప్రత్యేకముగ వ్రాయదగినది వేపెద్దియు నుండదుగదా!

ఉపసంహారము

సంస్థానములలోని పరిస్థితు లింత అధ్వాన్నముగ నున్నను బ్రిటీషు ప్రభుత్వం వారు పట్టించుకొనుట లేదు. ఏ సందర్భము లందును బొత్తుగ పట్టించుకొనుట లేదని నే ననుట లేదు. పరిస్థితులు శ్రుతిమించి రాగమున బడినప్పుడు, గత్యంతరము లేనప్పుడు జోక్యము కల్గించుకొనుచునే యున్నారు. కాని, దీనివలన ఈషణ్మాత్రమైనను లాభము కలుగుటలేదు. ఈ విషయమై చూడ్డర్ ఏమి వ్రాయుచున్నాడో చూడుడు:

తుట్టతుదకు బ్రిటీషు ప్రభుత్వం వారు జోక్యము కల్గించుకొన నిశ్చయించినచో, సంస్థానపతి విచారణ సంఘ సమ్ముఖమున బడుటకు బదులు పదవిని త్యజించివైచును. అటుల చేయడా, మరి? తనపై నారోపింపబడిన నేరములను కాదనుటకు అతనికి సాధ్యమా? పైగా పదత్యాగము గావించుట అతని కొక విధమైన మేలేగాని, కీడు కాదు. ఇందుమూలమున పరిపాలనా భారము లేకుండగనే ధనము లభించును. ప్రజల యెడ గావించిన దుర్జయములకు ప్రతిఫలముగా అతనికి చక్కని భృతి ఏర్పడును. దీనితో అతడు మిగిలిన జీవితమును పారిస్ మున్నగు నగరములలో విలాసముగ గడుపుచు, తన రాజఠీవిని కాపాడినందులకు బ్రిటీషు ప్రభుత్వం వారిని భూషించు చుండును".

చూడ్డర్ వ్రాసిన వాక్యములు అక్షరశః సత్యములు. ఇందులకు నిదర్శనము తుకోజీరావు హోల్కారుగారే! బావలా హత్యతో వీరికి ఏదైన సంబంధము కలదో, లేదో నిర్ణయించుటకై విచారణ సంఘమును నియమింపవలెనని బ్రిటీషు ప్రభుత్వము వారు నిశ్చయించినంతనే, విచారణ కంగీకరింపక వీరు పదత్యాగము గావించిరి. ఇట్లు పదత్యాగము గావించుట వలన వీరికి ఏమైన నష్టము వాటిల్లినదా? లేదు. నాటినుండి నేటి వరకు సాలీనా కొన్ని లక్షల భృతి ముట్టుచున్నది. దానితో పూర్వభోగాతిశయములకు లోపము లేకుండగనే వీరు నిశ్చింతగా కాలము గడుపుచున్నారు.

అన్నట్లు చెప్పవచ్చినదేమన, సంస్థానాంతర్గత పరిపాలనలో - ఆ పరిపాలన సంపూర్తిగ దుర్భరము కానంతవరకును బ్రిటీషు ప్రభుత్వము వారేమియు జోక్యము కల్గించుకొనుట లేదు. ఇందులకు కారణ మేమి? సంస్థానాంతర్గత వ్యవహారములలో జోక్యము కల్గించుకొని సంస్థానాధిపులు ప్రజా రంజకముగ పరిపాలింప వలెననుటకు బ్రిటీషు ప్రభుత్వం వారికి అధికారము లేదా?

లే కేమి? ఉన్నది, పూర్తిగా! ఇందులకు లిట్టన్, సాలిస్బరీ, కర్జన్ ప్రభువులు భిన్న భిన్న సమయములలో జేసిన ప్రకటనలే నిదర్శనములు. పోనీ, బ్రిటీషు ప్రభుత్వము వారు వివిధ సంస్థానములతో విభిన్న సమయములలో గావించుకొన్న సంధులు మున్నగునవి అడ్డుపడునా యన్న, అదియును లేదు. అసలు ప్రతిబంధకముల మాట యెట్లున్నను యావద్భారతదేశ శ్రేయోభివృద్ధికి సర్వబాధ్యత వహించితిమని అన్నప్పుడును, కానప్పుడును చెప్పుకొనుచుండు బ్రిటీషు ప్రభుత్వం వారు ఏడు కోట్ల సంస్థాన ప్రజల దిక్కుదెసలను ఆరయకుండుట యేటి న్యాయము?

కనుక ఎటు చూచినను భారత సంస్థానములలోని దుష్పరిపాలనను అరికట్టవలసిన బాధ్యత బ్రిటీషు ప్రభుత్వం వారిపై నున్నది కాని, వారు దీనిని నిర్వర్తించుట లే దేల? ప్రొఫెసరు హెరాల్డు లాస్కీ నుడివినట్లు 'భారత సంస్థానాధీశులు బ్రిటీషు ప్రభుత్వ సమర్థకులై యుండుట'యే దీనికి కారణమా? ఐనచో నింతకన్న అక్రమము, అన్యాయము, అధర్మము...

బ్రిటీషు ప్రభుత్వం వారికి సంస్థాన ప్రజల స్థితిగతుల యెడ గల నిర్లక్ష్యమును, ఆకాంక్షల యెడ గల నిరసన భావమును నిరూపించుటకు నిదర్శనము వలయునేని రౌండు టేబులు సభా ప్రాతినిధ్య నిర్ణయమును పేర్కొనిన సరిపోవును. భారత భావి రాజ్యాంగ విధాన స్వరూప నిర్ధారణమున కనుచు జరుపబడిన మూడు రౌండుటేబులు సమావేశములలో

ఒక్కదానికేని ముచ్చటగా నైనను సంస్థాన ప్రజాప్రతినిధిని ఆహ్వానింపరైరి! కాని, సంస్థానాధిపులను మాత్రము కుప్పతిప్పలుగ పిలిచిరి!!
అసలు సంస్థాన ప్రజలను తృణీకరించుటయు, సంస్థానాధిపులను నెత్తి కెక్కించుకొనుటయు బ్రిటీషు ప్రభుత్వం వారి నేటి రాజనీతి కాదుకదా! కానిచో, సంస్థాన ప్రజలు బ్రిటీషు ఇండియాలో నైనను తమ కష్టనివృత్తికై ఆందోళన సలుపుటకు వీలు లేకుండునట్లు భారత సంస్థానాధీశుల రక్షణ చట్టము (Indian Princes Protection Act) చేయనేల?
కాని, సంస్థాన ప్రజల నిట్లు మరెంత కాలము నిర్లక్ష్య మొనర్పగలరు? వారిలో నేడు రాజకీయ పరిజ్ఞానము వికాసించు చున్నది; స్వాతంత్ర్య ప్రేమ ప్రజ్వలించు చున్నది. సంఘీభావము స్థిరపడు సూచన లున్నవి. ఇట్టి యెడ వారిని కలకాలము త్రోసి రాజనుట బ్రిటీషు ప్రభుత్వం వారికే యైనను మంచిదా? సంస్థాన ప్రజలు నేడు స్వల్ప సంస్కరణములను మాత్రమే కోరుచున్నారు. వారి కోర్కెను మన్నించినచో అశాంతి, అసంతృప్తి, ఆవేగము సమసి పోగలవు. లేనిచో గోటితో గిల్లివేయదగిన దానిని గొడ్డలితో నరుకవలసి వచ్చినట్లు జరుగవచ్చును. ఇట్టివి బ్రిటీషు ప్రభుత్వం వారికి అనుభవ వేద్యమైన విషయములే! సంస్థానేతర భారతీయులు పెక్కు వత్సరముల తరబడి కోరిన అధినివేశ స్వాతంత్ర్యమును నిరాకరించుట వలననే గదా తరుణ భారత నాయకులు నేడు బ్రిటీషు సామ్రాజ్యముతో సంబంధమును సడలించుకొనిన గాని భారతదేశము తరింపజాలదనుట.

సంస్థానాధిపులు సయితము కాలగతిని గుర్తించుట శ్రేయస్కరము. సామ్య, సాంఘిక వాదములు ప్రబలుచున్న దినము లివి. ఇట్టియెడ ప్రజాభీష్టమునకు విరుద్ధముగ - నిరంకుశముగ - పరిపాలించుట శ్రేయోదాయకమా?
సంస్థాన ప్రజలైనను, సంస్థానేతరులైనను నేడు భారతీయుల కందరికి ఒక్కటే ధ్యేయము; అది స్వపరిపాలన. ఒక్కటే పద్ధతి; అది శాంతి పద్ధతి. ఒక్కటే పరీక్ష, అది అగ్ని పరీక్ష. ఈ విషయమును బ్రిటీషు ప్రభుత్వం వారును, భారత సంస్థానపతులును సుముఖులై గుర్తింప గలిగినచో దోహద మొనర్చినవా రగుదురు. భారత జాతీయాశయ సిద్ధికినీ, భారతావని కల్యాణమునకును లేనిచో.

అనుబంధం

సంస్థానాలు: కాంగ్రెసు

అఖిలభారత సంస్థాన ప్రజామండలి అధ్యక్షులైన డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య పంతులుగారు "సంస్థానాలు : ఫెడరేషన్" అనే శీర్షిక కింద ఈ పుస్తకానికి పీఠిక వ్రాసింది 1938 జూన్ రెండవ వారంలో. ఇక, నేను "సంస్థానాలు : కాంగ్రెసు" అనే ఈ అనుబంధాన్ని కలుపుతున్నది నవంబర్ రెండవ వారంలో. ఈ ఐదు మాసాల వ్యవధిలో సంస్థానాల సమస్య అతిభయానక రూపాన్ని ధరించింది.

ఇంత స్వల్పకాలంలో ఈ సమస్య ఇంతగా విషమించడానికి గల కారణం, మైసూరును అనుసరించి తిరువాన్కూరు, హైదరాబాదు, రాజకోట, ఢెంకనాలు మొదలైన అనేక సంస్థానాలు స్థానిక కాంగ్రెసు సంస్థల మీద యుద్ధాన్ని ప్రకటించడమే! ఇలా యుద్ధాన్ని ప్రకటించి, ఇవి మైసూరు కంటె కూడా ఘోరాతిఘోరమైన దౌర్జన్యాలకు దిగినవి. మైసూరులో ఒకటి, రెండుసార్లు మాత్రమే పోలీసులు ప్రజల మీద తుపాకుల్ని కాల్చితే, తిరువాన్కూరులో ఈ దారుణ కృత్యాన్ని అయిదారుసార్లు జరిగించారు. తిరువాన్కూరు సంస్థానం ఏర్పడివున్న స్థానిక కాంగ్రెసు సంస్థను బహిష్కరిస్తే, హైదరాబాదు ఇంకా ఏర్పడనైనా ఏర్పడనట్టి కాంగ్రెసు సంస్థపై ఆంక్షను ప్రకటించింది. ఈ విధంగా ఒక సంస్థానంతో మరొక నిరంకుశ విధానంలో పోటీపడుతున్నది. ఇటీవల వివిధ సంస్థానాలలో జరిగిన రాక్షస కృత్యాలను వర్ణించాలంటే, ఒక పెద్ద గ్రంథం అవుతుంది. అంచేత ఆ పనికి పూనుకోకుండా, న్యాయపరిపాలనకు ఇంతకుపూర్వం కొంత కీర్తిని

గడించుకున్న తిరువాన్కూరు సంస్థానంలో జరిగిన విషయాలను మాత్రం సంగ్రహంగా ఉదాహరిస్తాను. వీటినిబట్టి తిరువాన్కూరు కంటే అన్ని విధాల వెనకబడివున్న ఇతర సంస్థానాలలోని పరిస్థితులు ఎంత భయానకంగా ఉన్నవో ఎవరికి వారే ఊహించుకోవచ్చును.
తిరువాన్కూరు సంస్థాన కాంగ్రెసు నాయకులలో ఒకరైన మెస్ కరీన్ కన్య తమ సంస్థానంలో జరిగిన ఘాతుక కృత్యాల్ని గురించి ఒక ప్రకటన చేసింది. ఆ ప్రకటనలోని కొన్ని భాగాలు ఇవి :

తిరువాన్కూరు మహారాజుగారి ఆధిపత్యం కింద బాధ్యతాయుత పరిపాలన కావాలని సంస్థాన కాంగ్రెసు సంఘం కోరడం వల్ల, సంస్థానం కేవలం నరకరూపంగా తయారైంది. ఇందుకు దివాను అయినట్టి సర్ సి.పి. రామస్వామి అయ్యర్ బాధ్యుడు.

త్రివేండ్రం పట్టణంలోని ప్రజల ప్రాణమాన విత్తాలకు నేడు ఎట్టి రక్షణ లేదు. ప్రజల దుస్థితి చెప్పడానికి అలవికాకుండా ఉంది. సంస్థాన కాంగ్రెసు సంయుక్త కార్యదర్శి నీలకంఠ పిళ్ళే గారిని నడివీధిలో పట్టపగలు చావమోదారు. వారికి తలమీద, మణికట్టు పైన బలమైన గాయాలు తగిలాయి; రక్తం కాల్వలు కట్టింది. ఇంతేకాదు. గౌరవనీయులైన ఇద్దరు పత్రికాధిపతుల్ని, నడివీధిలో అవమానించారు. పోలీసువారి ఎదుటనే రౌడీలు ఈ దుండగాల్ని చేశారు. వారివల్ల సంస్థాన కాంగ్రెసు వారికి ఎట్టి సభలు జరుపడానికి శక్యం కాకుండా ఉన్నది.

ఇక, పోలీసువారు స్వయంగా చేస్తున్న దౌర్జన్యాలకు మితిలేదు. నిర్దోషులైన పసికూనల మీద, నీళ్ళు చేదుకుంటూవున్న ముసలి ఆడవాళ్ళ మీద, చివరికి చెట్ల నీడలో పెట్టిన బైస్కిల్సు మీద పోలీసులు లాఠీ ప్రయోగం చేశారు. అచేతనాలైన బైస్కిల్సు మీద కూడా వారు లాఠి ప్రయోగం చేశారంటే, వారి ఉన్నమాద స్థితి ఎంతవరకు వెళ్ళిందో వేరే చెప్పాలా?

"పోలీసు వాళ్ళు ఏమి చేసినా, స్వాతంత్ర్యం మీద ఉండే ప్రేమ చేత ప్రజలు తమ ఉద్యమాన్ని విరమించడం లేదు. సంస్థాన కాంగ్రెసువారు పెద్ద పెద్ద పట్టణాలలోనే గాక, చిన్న చిన్న పల్లెలలో కూడ సభలను జరుపుతున్నారు. ఈ సభలలో వేలకు వేలు జనం పాల్గొంటున్నారు. ఈ జనం మీద పోలీసువారు కాల్పులు ప్రారంభించారు. అనేక ప్రదేశాలలో కాల్పుల వల్ల ప్రజలు నల్లులు మాడినట్టు మాడిపోయారు. నిరాయుధులు, నిర్దోషులు అయినవారు అనేకులు చనిపోయారు; ఎందరో గాయపడ్డారు.

''నెయ్యతింకారా అనే ప్రదేశంలో రాఘవన్ అనే వీరుడు పోలీసు గుండు దెబ్బలకు తన ఛాతీని అప్పగించి, మరణిస్తూ కూడా "సంస్థాన కాంగ్రెసుకు జై" అనే విజయధ్వానాన్ని చేశాడు.

ఈ కాల్పుల సందర్భంలో జరిగిన కొన్ని ఘోరాలు ఇవి : బజారు వెంట పోతూవున్న గర్భిణీ స్త్రీని కాల్చటం - ఆమెకు పుట్టబోయే బిడ్డ కూడా ఎదురు తిరుగుతాడేమో అని పోలీసు వారి భయం కాబోలు!
ఈ "చెంగనూరులో ఒక విద్యార్థి కాల్పుల వల్ల మరణిస్తూ, 'దాహం! దాహం!!అని ఆక్రోశిస్తే, పక్కనే వున్న మిలటరీ వారు తమవి గుండెలుకాదు - నల్లరాళ్ళు అని ప్రజలకు తెలియజెయ్యడానికో అన్నట్టు, ఆ బాలుడిని బూటు కాలితో మూడు తన్నులు తన్ని, ఉన్న కొనవూపిరి కాస్తా పోగొట్టారు.

"దక్షిణాఫ్రికా నుంచి వచ్చిన యన్.యస్. పిళ్ళైగారు సంస్థాన కాంగ్రెసు ఉద్యమంలో చేరారు. పోలీసువారు వారిని కూడా అరెస్టు చేశారు. అరెస్టు అయినప్పుడు డాక్టర్ గారు స్వస్థులుగానే ఉన్నారు. కాని కొన్ని గంటలలోనే వారి స్థితి ప్రమాదించింది; వారిని జనరల్ ఆసుపత్రిలో చేర్చారు. ఆసుపత్రిలో చేర్చినప్పుడు వారి ఎముకలు విరిగివున్నవి; నెత్తురు

కాల్వలు కట్టుతున్నది. దీన్నిబట్టి వారిని జైలులో కొట్టుట, తన్నుట మొదలైన అమానుష కృత్యాలను చెయ్యడమే కాకుండా తలకిందులుగా నేలకువేసి మోదారని కూడా అనుకోవలసి వచ్చింది.

"ఒకనాడు వందలకు పైబడి ప్రజలు అరెస్టు అయినారు. వారిని అందరినీ కలిపి, ఊపిరి సలపని ఒక చీకటి కొట్టులో పడవేశారు. కొందరిని దెబ్బలు కొట్టడమే కాకుండా, మండుటెండలో నిలబెట్టారు. 'సంస్థాన కాంగ్రెసు వారికి జై' అని కేకవేసిన మహా నేరానికి ఒక విద్యార్థిని కాల్చి చంపారు. ఇదే పాపానికి పదునాలుగు సంవత్సరాల ప్రాయపు పిల్లలు అనేకులు దెబ్బల శిక్షను అనుభవించవలసి వచ్చింది. ఇంతటితోనైనా సరిపెట్టక, వారిని ఆ మర్నాడు మండుటెండలో నిలబెట్టారు. పైన ఎర్రటి అగ్గి, పైగా దాహం: ఈ బాధను భరించలేక చాలమంది స్పృహ తప్పి పడిపోయారు. ఇంతటి యమయాతనలను పెట్టిన తర్వాత గాని, వారిని వదలిపెట్టలేదు.

"పాఠశాలలోని బాలికలు కొందరు శాంతియుతమైన పికెటింగ్ జరుపుతూవుంటే వాళ్ళకు పూర్వం ద్రౌపదికి సభలో జరిగిన అవమానాన్ని జరిపారు.
"వాలంటీర్లలో ప్రధానుడైన వానిని అరెస్టు చేసి, క్షయదగ్గుతో బాధపడుతూ ఉన్న రోగి దగ్గర నిలబెట్టారు. ఇది చాలక ఆనాటి రాత్రికి అతడి కొట్టు తలుపుకి కేకలు, బొబ్బలు పెడుతున్న ఒక పిచ్చివాడిని కట్టివుంచారు.

"తిరువాన్కూరు ప్రజల స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనడానికి మధుర నుండి వచ్చిన శివరాజ పాండ్య అనే వాలంటీర్ ను షెన్ కోటా అనేచోట అరెస్టు చేశారు. అరెస్టు చేసినప్పుడు అతడు ఆరోగ్యంగానే ఉన్నాడు. కాని, కోయిలోన్ చేరేసరికి అతడు మరణించాడు. పోలీసువారు అతడి మరణానికి హృద్రోగం కారణమన్నారు. కాని, అతడి మిత్రులు రాత్రంతా అతడిని ఇంకొక గదిలో చావమోదారనీ, ఆ బాధకు తాళలేక అతడు పెట్టిన వెర్రికేకలను తాము విన్నామని చెప్పారు. రామస్వామి అయ్యర్ గారు ఈ విషయమై విచారణ జరిపించనే లేదు.

"ఈ విధంగా అరెస్టు అయినవారిని పోలీసులు పెడుతున్న బాధలకు అంతులేదు!"
స్థానిక కాంగ్రెసు సంస్థలను అణిచి వెయ్యాలని వివిధ సంస్థానాలలోను జరుగుతున్న ఈ రాక్షస ప్రయత్నానికి గల కారణాన్ని విశదీకరిస్తూ ఇటీవలనే నేను ఒక పత్రికకు సంపాదకీయ వ్యాసాన్ని వ్రాశాను. ఆ వ్యాసాన్ని ఇక్కడ ఉదాహరిస్తూ, ఈ అనుబంధాన్ని ముగిస్తాను :

"ఫెడరేషన్ పనికిరాదు అని కాంగ్రెసు చేస్తున్న ఆందోళనకు ఒక ప్రధాన కారణం ఇది : ఇండియా యాక్టు నిర్ణయ ప్రకారం ఫెడరేషన్లో బ్రిటీష్ ఇండియా ప్రజలు ఐచ్ఛికంగా ఎన్నుకుని పంపించే ప్రతినిధులకు ఏ ప్రతిపత్తి ఉంటుందో అదే ప్రతిపత్తి నిరంకుశ ప్రభువులైన సంస్థానాధీశులు నామినేట్ చేసి పంపించే జోహుకుములకు కూడా ఉంటుంది. ఇది ధర్మ విరుద్ధమని, ప్రజాస్వామ్య మూలసిద్ధాంతాలకు ప్రాణాంతకమని కాంగ్రెసు వాదిస్తున్నది.

ఈ వాదనలోని సత్యాన్ని లండన్ 'టైమ్సు' వంటి మితవాద పత్రిక కూడా అంగీకరించక తప్పింది కాదు. 'టైమ్సు' పత్రిక మాత్రమే కాదు; ఇండియా సెక్రటరీ కూడా ఈ విషయాన్ని ఆమోదించవలసి వచ్చింది.

"ఫెడరేషన్లో సంస్థానాల ప్రాతినిధ్యాన్ని గురించి కాంగ్రెసు వైఖరిని బ్రిటీషు ప్రభుత్వమే అంగీకరించినప్పుడు, ఇక కర్తవ్యమేమిటి? ఫెడరేషన్ అంటూ ఏర్పడాలంటే ప్రతి సంస్థానంలోనూ బాధ్యతాయుత పరిపాలన ఏర్పడాలి. దీన్ని తిరువాన్కూర్ దివాన్ సర్ సి.పి. రామస్వామి అయ్యర్ గ్రహించాడు. గ్రహించి, 'బ్రిటతో సంస్థానాధిపతులు చేసుకున్న సంధుల ప్రకారం సంస్థానాలలో బాధ్యతాయుత పరిపాలన ప్రవేశపెట్టడానికి వీలులేదు!' అని ఒక అభ్యంతరాన్ని


చెప్పాడు. ఇందుకు ఇండియా సెక్రటరీ 'సంస్థానాధీశులు బాధ్యతాయుత పరిపాలన ప్రవేశపెట్టడం మాకు సమ్మతమే!' అని వెంటనే ప్రత్యుత్తర మిచ్చినాడు. దీనితో సంస్థానాధిపతులకు పెద్ద చిక్కు ఏర్పడింది.

"ఫెడరేషన్ ఏర్పాటు చేసి తీరాలని బ్రిటీషు ప్రభుత్వం పట్టుపట్టి కూర్చున్నది. దీన్ని కాదనడానికి తమకు గుండెలు లేవు. ఇక కాంగ్రెసు సంస్థ 'నిరంకుశత్వాన్ని నెరపే సంస్థానాలతో మాకు పొత్తు వద్దు' అని ఖండితంగా చెబుతున్నది. కాంగ్రెసు అభ్యంతరం సక్రమమైనదే కావచ్చును గాని, తమ నిరంకుశత్వాన్ని వదులుకుంటే, విదేశ పర్యటనానికి, వైభవ ప్రదర్శనానికి, గుర్రపు పందెములకు, గవర్నర్ల విందులకు, స్పెషల్ రైళ్ళకు ధనం ఎలా లభిస్తుంది? ఈ పరిస్థితిలో వారికి ఒక్కటే మార్గం తోచింది. అది ఏమంటే, - కాంగ్రెసు మీద యుద్ధాన్ని ప్రకటించి, తమ సంస్థానాలలో దాని నామరూపాలు లేకుండా చెయ్యడం.

"కాని, ఇది కేవలం శుష్కయత్నమే! సంస్థాన ప్రజలు చిరకాలానుగతమైన గాఢనిద్ర నుంచి మేల్కొన్నారు. పౌరసత్వపు హక్కుల కోసం బద్ధకంకణులైనారు. నిర్బంధ శాసనాలు వారిని బెదిరించలేవు! తుపాకి కాల్పులు వారిని కర్తవ్య విమూఢుల్ని చెయ్యలేవు! రక్తపాతం వారి హృదయంలో ప్రజ్వలిస్తున్న స్వాతంత్ర్య జ్వాలల్ని చల్లార్చలేదు. ఈ విషయాన్ని స్వదేశ సంస్థానాధీశులు ఎంత త్వరగా గ్రహిస్తే, అంత వారికి మేలు కలుగుతుంది".

ఆస్ట్రియా ఆక్రమణ





శ్రీ నార్ల (1935)

సమర్పితము:

నిరంకుశత్వాన్నీ, నాజీతత్వాన్నీ సహించలేని ప్రియమిత్రులు

ఎన్ జి ఆచార్య గారికి

1

"ఇది నా జీవితంలో అతి మహత్తరమైన దినం... నేడు నా జీవన కర్తవ్యాన్ని పరిపాలించుకున్నాను" - ఆస్ట్రియా ఆక్రమణ చేసిన వెంటనే హిట్లర్ అన్నట్టి మాటలివి. హిట్లర్ ఆస్ట్రియాలో జన్మించాడు; జర్మనీకి నాథుడయ్యాడు. పరరాజ్యం జర్మనీ తన పాదాక్రాంతం కావడమూ, జన్మభూమి ఆస్ట్రియా తన అధికారాన్ని గుర్తించకపోవడమూ అతడికి అవమానంగా తోచింది; బాధాకరం అనిపించింది. అంచేతనే అతడు ఎప్పుడు తరుణం లభిస్తుందా, ఎప్పుడు ఆస్ట్రియాను వశపరుచుకుందామా అని తహతహలాడాడు. చివరికి ఆ తరుణం లభించింది, అతడి కోర్కె ఈడేరింది. ఇక అతడు "ఇది నా జీవితంలో అతి మహత్తరమైన దినం" అనీ, "నేడు నా జీవన కర్తవ్యాన్ని పరిపాలించుకున్నాను" అని అనడంలో ఆశ్చర్యం లేదుగా!

ఆస్ట్రియాను ఆక్రమించుకో గలిగినందుకు హిట్లర్ గర్వపడుతున్నాడు. అతడిలా గర్వపడ్డంలో తప్పేమీ లేదు కూడా! కాని, తక్కిన ప్రపంచం మాత్రం ఇందుకు సిగ్గుపడాలి. ఎంచేతనంటే హిట్లర్ పొందే ప్రతి విజయమూ మానవ స్వాతంత్ర్యానికి ఒక వజ్రాఘాతం; నాగరికతా వికాసానికి ఒక తీవ్ర ప్రతిబంధకం; ధర్మదేవత హస్తాలకు ఒక నూత్న శృంఖలం.

హిట్లర్ ఆస్ట్రియాను ఆక్రమించడం తక్కిన ప్రపంచానికి లకరం మాత్రమే కాకుండా, ప్రాణోపద్రవకరం కూడా! ఎందువల్ల నంటే, - హిట్లర్ విజయం నాజీ తత్వ విజయం; నాజీతత్వ విజయమే యుద్ధదేవత విజయం. పతనమైపోయిన జర్మన్ రాజ్యాన్ని తిరిగి శక్తిమంతంగా చెయ్యడానికి, శిథిలమైపోయిన జర్మన్ సామ్రాజ్యాన్ని పునర్నిర్మాణం చెయ్యడానికి సైనికశక్తిని మించిన సాధనం లేదని హిట్లరు నమ్మకం. ఇంతే కాదు. ఏదైనా ఒక జాతి పైకి రావాలంటేనూ, ఏదైనా ఒక దేశం ప్రపంచ ప్రాధాన్యతను పొందాలంటేనూ, అసలు మానవుడు అభ్యున్నత పథాల మెట్టాలంటేనూ, యుద్ధం అవసరమని అతడి విశ్వాసం. అతడి దృష్టిలో యుద్ధం వర్జనీయం కాదు, - వాంఛనీయం. అంచేతనే అతడు జర్మన్ దేశాన్ని విపుల సైనిక శిబిరంగా మార్చాడు. ఇట్టి స్థితిలో తాను పొందే ప్రతి విజయమూ తాను ఉపాసిస్తున్న యుద్ధ దేవత అనుగ్రహ ఫలితమేనని అతడు భావిస్తాడు. ఇలా భావించి, తన ఉపాసనను మరింత యెక్కువ చేస్తాడు. దీన్ని బట్టి స్పష్టపడే విషయం ఇది: హిట్లర్ ఒక కొత్త విజయాన్ని పొందాడంటే, ప్రపంచం యుద్ధ దేవత పిడికిలిలో మరింత గట్టిగా చిక్కుకున్నదన్నమాట!

ఆస్ట్రియన్ ప్రజలదీ, జర్మన్ ప్రజలదీ ఒకటే జాతి; ఒకటే భాష; విజ్ఞానం కూడా చాలావరకు ఒకటే! అంచేత ఆస్ట్రియా జర్మనీలు ఏకం కావడంలో తప్పుఏమీ లేదు. అయితే హిట్లర్ లాంటి దురాశాపరుడూ, దుర్నీతిపరుడూ, దురహంకారీ జర్మనీకి ప్రభువై ఉండగా ఈ కలయిక జరగడం జర్మన్ జాతి వారికే కాకుండా, సర్వ ప్రపంచానికి అరిష్టదాయకం!

2

ఆస్ట్రియా స్వతంత్రంగా నైనా వుండవలసింది, లేదా, జర్మనీలో హిట్లర్ నిరంకుశ ప్రభుత్వం ఏర్పడ్డానికి పూర్వమే - అంటే జర్మనీ ప్రజాస్వామ్యంగా ఉన్నప్పుడే - దానిలో చేరైనా పోవలసింది. ఇందులో మొదటి విధంగా జరిగినట్టయితే హిట్లర్ కు నేడు ఒక విజయం సిద్ధించిందనిగాని, అందుమూలంగా అతడి దిగ్విజయ తృష్ణ అధికమౌతుందనిగాని ప్రపంచం విచారించవలసిన అగత్యం కలిగేది కాదు. ఇక రెండో విధంగా జరిగినట్టయితే, అసలు జర్మన్ ప్రజాస్వామిక ప్రభుత్వం కూలిపోవడంగాని, హిట్లర్ లాంటివాడు అధికారానికి రావడంగాని సంభవించేదికాదు. ఈ రెండు విధాలాకూడా జరగకపోవడానికి కారణం - బ్రిటన్, ఫ్రాన్సు రాజ్యాలే!

1914-18 నాటి మహాసంగ్రామం తర్వాత బ్రిటన్-ఫ్రాన్సులు యూరప్ 'మ్యాప్'ను తమకు అనుకూలంగా దిద్దుకున్నాయి. ఇలా దిద్దుకోవడంలో అవి ఆస్ట్రియాను స్వతంత్రంగా మనలేని నిస్సహాయ స్థితికి తెచ్చాయి.

1914-18 నాటి యుద్ధానికి పూర్వం ఆస్ట్రియా ఆస్ట్రోహంగరియన్ సామ్రాజ్యంలో ప్రధానభాగంగా ఉండేది. అప్పుడు దాని విస్తీర్ణం 1,16,000చదరపు మైళ్ళు; జనసంఖ్య ఇంచుమించుగా మూడు కోట్లు. ఇక ఆ యుద్ధానంతరం దాని విస్తీర్ణం 32,000 చదరపు మైళ్ళు; జనసంఖ్య 65 లక్షలు. చాలా ఘోరమైన నిస్సహాయ స్థితినే తెలియజేస్తాయి - ఈ అంకెలు. కాని, నిజస్థితి ఈ అంకెలు తెలిపేదానికంటె ఎన్నో రెట్లు ఘోరమైంది.

విస్తీర్ణం తక్కువైనా, ఎక్కువైనా, జనాభాకు తగిన పంట పండుతూ వుంటేనూ, పరిశ్రమలకు కావలసిన ముడిపదార్థాలు దొరుకుతూ ఉంటేనూ, ఎగుమతి దిగుమతులు ఒక దానితో ఒకటి తులదూగుతూ ఉంటేనూ, పల్లెలూ పట్టణాలూ ఒకదాన్ని మరొకటి మింగివేసేలా ఉండకపోతేనూ, ఏదేశమైనా సరే సుఖంగానే బతకగలదు. వీటిలో ఒక్క సౌకర్యానికైనా యుద్ధానంతరపు ఆస్ట్రియా నోచుకోలేదు.

ఇంతకు పూర్వమే ఒకసారి చెప్పినట్టు, యుద్ధానంతరం ఆస్ట్రియా విస్తీర్ణం 32,000 చదరపు మైళ్ళు. దీనిలో నూటికి 90 వంతులు కేవలం పర్వత ప్రాంతమే! ఇంతేకాదు. మొత్తం విస్తీర్ణంలో నూటికి 40 వంతులు అడవుల మయం! పోతే, ఆస్ట్రియా భూఖండంలో ఏ నాలుగోవంతో మాత్రం సేద్యయోగ్యమైంది. దీనిలో పండే పంట ఆస్ట్రియా ప్రజలకు ఏడాదిలో మూడు, నాలుగు నెలల గ్రాసానికైనా సరిగా సరిపోదు!

ఇట్టి పరిస్థితిలో జీవనోపాధికి మార్గం పరిశ్రమలే! 1914-18 నాటి యుద్ధానికి పూర్వం ఆస్ట్రియాకు విశేష ఖనిజ సంపత్తి ఉండేది. దాని ఆధారంతో అది అనేక పరిశ్రమల్ని కొనసాగిస్తూ, వాటి ద్వారా సుఖజీవనం చేస్తూ ఉండేది. అయితే, యుద్ధానంతరం ఆస్ట్రియన్ రాజ్యఖండంతోపాటు చాలా ఖనిజ సంపత్తికూడా అన్యాక్రాంతమై పోయింది. దీని ఫలితంఆస్ట్రియన్ పరిశ్రమలు అధోగతిపాలుకావడం!

పోయిన ఖనిజసంపత్తి పోగా, ఆస్ట్రియాకు చాలా ఇనుము మిగిలింది. అంచేత అది ముడి ఇనుమునూ, దానితో తయారైన వస్తువుల్నీ ఎగుమతి చెయ్యవచ్చును. ఇంతేగాక దానికి చాలా కలపకూడా ఉంది. ఈ కలపవల్లనూ, కలప ద్వారా - అంటే "వుడ్ పల్ప్" ద్వారా - తయారయ్యే కాగితాన్నీ, అది ఎగుమతి చెయ్యవచ్చును కూడా. ఈ ఎగుమతులు సవ్యంగా జరిగితే, దాని పొట్ట అది పోసుకోగలదు. కాని ఇందుకుకూడా ప్రతిబంధకాలే ఏర్పడ్డాయి. ఈ ప్రతిబంధకాలలో ముఖ్యమైనవి రెండు. వాటిలో మొదటిది, - ఆస్ట్రియా ఓడరేవులు అన్నీ కూడా అన్యాక్రాంతమై పోవడం; అది సముద్రతీరానికి అందుబాటులో లేని రాజ్యం కావడం. పోతే, రెండోది, ఇరుగుపొరుగు రాజ్యాలు అన్నీ కూడా స్వజాతీయ పరిశ్రమల సంరక్షణ కోసం పూనుకోవడం; ఆస్ట్రియన్ ఎగుమతులమీద సుంకాల్ని విధించడం.

ఈ చిక్కు లన్నిటితోపాటు ఆస్ట్రియా ఇంకొక వింత పరిస్థితిని కూడా ఎదుర్కొనవలసివచ్చింది. అది యేమంటే - మొత్తం జనాభాలో దాదాపు మూడు వంతులు రాజధాని నగరమైన వియన్నాలో కేంద్రీకృతం కావడం! ఒక్కచోట - ఒక్క నగరంలో - ఇంత జనాభా కేంద్రీకృతమైతే, సాధారణ పరిస్థితులలోనే దాని పోషణ జరగడం కష్టసాధ్యం. ఇక, ఆస్ట్రియా విపరీత పరిస్థితులలో అది కేవలం దుస్సాధ్యమే! –

ఒక వైపున సేద్యానికి అంతగా అవకాశాలు లేకపోవడం, ఇంకో వైపున పరిశ్రమలు క్షీణించిపోవడం, ఇందుకు తోడు ఎగుమతి దిగుమతులకు ప్రతిబంధకాలు ఏర్పడ్డం, ఇది చాలదన్నట్టు జనాభాలో మూడోవంతు ఒక్క నగరంలో కేంద్రీకృతం కావడం - ఇంతటి ఘోర పరిస్థితులలో ఆస్ట్రియా స్వతంత్రంగా జీవించగలగడం సాధ్యమా? కాదు, - ముమ్మాటికీ కాదు!!

3

ఆస్ట్రియా తన దైన్యస్థితిని గమనించింది; తాను స్వతంత్రంగా జీవించ లేనని గ్రహించింది. అంచేత అది కొత్తగా ఏర్పడ్డ జర్మన్ రిపబ్లిక్ లో చేరిపోవాలని అనుకుంది. అయితే, బ్రిటన్ - ఫ్రాన్సు రాజ్యాలు ఇందుకు అడ్డుపడ్డాయి!
జర్మనీతో చేరిపోవడానికి ఆస్ట్రియా చేసిన మొదటి ప్రయత్నం 1919లో, ఆ సంవత్సరంలో ఆస్ట్రియన్ నేషనల్ అసెంబ్లీ - ఇది యుద్ధానంతరం ఏర్పడ్డ ఫెడ్రల్ సంస్థ - జర్మనీతో ఐక్యతను.

ఆస్ట్రియా - అభిలషిస్తూ ఒక తీర్మానాన్ని చేసింది. ఈ తీర్మానాన్ని చెయ్యడమే తడవు - 'దీనిని మేము సహించము సుమా!' అని బ్రిటన్ - ఫ్రాన్సులు బెదిరించాయి. తర్వాత 1921లో తొమ్మిది రాష్ట్రాలలోనూ మూడు టెరొల్, సాల్ట్ బర్గ్, స్టెరియా) రాష్ట్రాలు జర్మనీతో కలసి పోవడానికి విడిగా ఒక ప్రయత్నం చేశాయి. బ్రిటన్ - ఫ్రాన్సులు ఈ ప్రయత్నాన్ని సయితం సాగనివ్వలేదు. ఆ తర్వాత 1922లో తిరిగి ఆస్ట్రియా జర్మనీతో ఐక్యాన్ని కోరడమూ, తిరిగి బ్రిటన్ - ఫ్రాన్సులు దీన్ని ప్రతిఘటించడమూ జరిగింది.

వరసగా ఇన్ని సార్లు ఈ రెండు రాజ్యాలూ ఆస్ట్రియా ఆశయాన్ని విఘాతం చెయ్యడానికి కారణాలు ఇవి:
మొదటి కారణం : ఆస్ట్రియా జర్మనీలో చేరిపోతే, జర్మనీ జనసంఖ్య దాదాపు 70 లక్షలు పెరుగుతుంది. జర్మనీ జనసంఖ్య 61/2 కోట్లు అనీ, తన జనసంఖ్య 4 కోట్లు మాత్రమేననీ, ఇందువల్ల జర్మనీకి అధిక సైనిక శక్తి ఉన్నదనీ, ఇది తనకు ఎప్పటికైనా ప్రమాదకరమనీ ఆక్రోశించే ఫ్రాన్సు, జర్మనీ జనసంఖ్య -ఆస్ట్రియా కలయికతో - ఇంకొక 70 లక్షలు పెరగడానికి సమ్మతిస్తుందా? ఇది కల్ల.

ఇక, రెండో కారణం : డాన్యూబియన్ ప్రాంతానికి • అంతటికీ సైనిక దృష్టిలో ఆయువుపట్టు వంటిది - ఆస్ట్రియా, ఆస్ట్రియా రైళ్ళను చేతిలో పెట్టుకున్న ఏ సైన్యమైనా సరే, డాన్యూబియన్ రాజ్యాలమీద అతిసులభంగా జైత్రయాత్ర చెయ్యగలదు. ఇటువంటి అవకాశాన్ని బ్రిటన్ - ఫ్రాన్సులు చూస్తూ చూస్తూ జర్మనీకి ఇవ్వగలవా?

పోతే, మూడోకారణం : బర్లిన్ నుంచి, బాగ్దాద్ కు పోవడానికి వియన్నాయే దారి. అంచేత ఆస్ట్రియా జర్మనీతో కలిసిననాడు పర్శ్యా, సిరియా, ఇరాక్ మొదలైన దేశాలలో జర్మనీకి పలుకుబడి ఏర్పడుతుంది. ఈ అవాంతరాన్ని తప్పించడానికి గత యుద్ధంలో ఒక కోటి మందిని బలి పెట్టవలసివచ్చింది. ఇంత బలి పెట్టిన తర్వాత, బర్లిన్-బాగ్దాద్ నగరాల్ని కలవనివ్వడమే!

ఇక, చివరి కారణం : ఆస్ట్రియా బ్యాంకులకు బాల్కన్ రాజ్యాలతో (రుమేనియా, బల్గేరియా, యుగోస్లావియా, గ్రీసు, అల్బేనియా) చిరకాలంనుంచీ లావాదేవీలు ఉన్నాయి. ఈ ఆస్ట్రియా బ్యాంకులు జర్మనీ వశమైతే, దానికి ఆర్థికంగా బలం ఏర్పడుతుంది. ఇది బ్రిటన్-ఫ్రాన్సులకు అనర్థకం కాదూ?

స్వతంత్రంగా బ్రతకడానికి తగిన దార్ఢ్యం లేదు. పోనీ, జర్మనీతో కలిసిపోదామా అంటే, అందుకు బ్రిటన్ - ఫ్రాన్సులు అంగీకరించవు. ఈ స్థితిలో ఏమీ తోచక ఆస్ట్రియా తన దృష్టిని ఇటలీ వైపుకు మరల్చింది. ఆస్ట్రియాకూ, ఇటలీకీ జాతిలోగాని, భాషలోగాని, విజ్ఞానంలోగాని, మరిదేనిలోగాని ఏమీ సంబంధం లేదు. కేవలం సంబంధం లేక పోవడమే కాదు, వీటి మధ్య చాలా వైరుధ్యమున్నది కూడా! అయినప్పటికీ ఆస్ట్రియాకు ఇటలీకంటె మరిదిక్కు కనబడలేదు. అంచేత అది ఇటలీతో కరెన్సీ విషయంలోనూ, సుంకాల విషయంలోనూ, ఏదైనా ఏర్పాటు చేసుకుందామని అనుకుంది. ఈ

ఏర్పాటు జరిగితే, ఆస్ట్రియా ఇటలీకి సామంత రాజ్యమైపోయినట్టే! ఇటాలియన్ సరిహద్దులు మధ్యయూరప్ వరకు పాకినట్టే! అంచేత ఫ్రాన్సు, యుగోస్లోవియా, జకొస్లోవాకియా రాజ్యాలు అడ్డుపడి, ఈ ఏర్పాటును జరగనివ్వలేదు. ఆస్ట్రియా ఒక ఘోరాపరాధాన్ని చేసింది. అది ఏమంటే, - ఐరోపా మహాసంగ్రామంలో ఓడిపోవడం. అంచేత, అది ఎన్ని కష్టాలనైనా పడాలి; ఎంతటి అవమానాలనైనా భరించాలి. పరాజిత దేశం గతి ఏనాడూ ఇంతే!

4

స్వతంత్రంగా బ్రతకలేనివాణ్ణి "నీవు ఇతరులపంచను చేరడానికి వీలు లేదు" అని శాసిస్తే, ఇక వాడిగతి పస్తు పడుకోవడమేగదా! 1919 మొదలు 1922 వరకు ఆస్ట్రియా పని ఇంతే అయింది. ఆ రోజులలో ఆస్ట్రియా ముఖ్యంగా వియన్నా - కూటికీ గుడ్డకూ గతిలేక పడిన బాధలు ఇన్నన్ని కావు. అంతకు ముందు వరకూ యూరపియన్ సభ్యతకూ, విజ్ఞానానికీ కేంద్రంగా విలసిల్లిన ఒక ప్రాచీన దేశమూ, ఒక మహా నగరమూ ఈ విధంగా మలమల మాడిపోవడాన్ని చూడలేక, అమెరికా వారు కొంత ధనసహాయాన్ని పంపించారు. దీన్ని చూచి బ్రిటిష్ పార్లమెంటుకూడా కొంత ధర్మనిధిని మంజూరు చేసింది. ఇలా బిచ్చాన్ని వెయ్యడంవల్ల బ్రిటన్, అమెరికాలకు "మేము ఎంతటి ధర్మకార్యాన్ని చేశాము!" అని తమను తామే హర్షించుకోవడానికి అవకాశం కలిగితే కలిగిందేమో గాని, ఆస్ట్రియా ఆకలి తీరనూ లేదు; దాని కష్టాలు ఈడేరనూలేదు.

పరిస్థితులు అంతకంతకు క్లిష్టం కాగా తన మనుగడకు ఋణాన్ని ఇప్పించవలసిందిగా ఆస్ట్రియా నానాజాతి సమితికి మహజర్లను పంపుకోసాగింది. మొదటిలో ఈ మహజర్లను ఎవ్వరూ ఖాతిరీ చెయ్యకపోయినా, 1922 అక్టోబరులో - ఇక తప్పదని అనుకుని కాబోలు! - బ్రిటన్, ఫ్రాన్సు, జెకొస్లోవాకియాలు తమ పూచీ మీద, తమ దేశీయుల చేత, నానాజాతి సమితి ద్వారా, 2 కోట్ల 70 లక్షల పౌనుల ఋణాన్ని ఇప్పించాయి. ఈ ఋణాన్ని ఇప్పించుతూ, అవి అంటే బ్రిటన్, ఫ్రాన్సు, జెకొస్లోవాకియాలు కోరిన షరతులు ఇవి :-

- జర్మనీతో చేరిపోవాలనే ఉద్దేశాన్ని ఆస్ట్రియా పూర్తిగా వదలిపెట్టాలి. (2) ఆస్ట్రియన్ ప్రభుత్వాదాయంలో నుంచి సాలీనా వాయిదాల మీద ఋణాన్ని తీర్చాలి. (3) వాయిదాలు సరిగా చెల్లుబడి కావడానికిగాను ఆస్ట్రియన్ ప్రభుత్వాదాయాన్ని అజమాయిషీ చెయ్యడానికి నానాజాతి సమితి ఒక కమీషనర్ జనరలను నియమించాలి. (ఈ షరతు ప్రకారం నియమితుడైన కమీషనర్ - జనరల్ పేరు డాక్టర్ జిమ్మర్మన్. ఇతడు డచ్చివాడు.) ఋణం మీద నూటికి సాలుకు 72 వడ్డీని చెల్లించాలి (ప్రభుత్వ ఋణాలకు సంబంధించినంతవరకు ఈ వడ్డీ రేటు చాలా హెచ్చు).
- కూటికి గతిలేక అప్పులకోసం దేవులాడేవాడు తన ఆతురత కొద్దీ "మూడో నాటికి నీ డబ్బు ముదుపుగా తెచ్చియిస్తా"నని మాటైతే ఇస్తాడుగాని, ఆ మాట నిలుపుకోవడం అతడి తరమా? ఆస్ట్రియా పని కూడా సరిగా ఇంతే అయింది. మొదటి ఒకటి రెండింటి తర్వాత, అది వాయిదాలను కట్టలేకపోయింది. ఆస్ట్రియా వాయిదాలను కట్టలేకపోతే, వాటిని తామే చెల్లించుకోవాలి గనక, బ్రిటన్, ఫ్రాన్సు, జెకొస్లోవాకియా ప్రభుత్వాలు పాతఋణాన్ని తీర్చడానికి గాను కొత్త ఋణాన్ని ఇచ్చాయి. ఈ తంతు ఇలానే అనేకసార్లు జరిగింది.

ఋణాన్ని అంతకంతకు అధికంగా పుచ్చుకోవడంవల్ల ఆస్ట్రియా కష్టాలు పెరిగినవేగాని, తరగలేదు. ఇందుకు నిదర్శనం క్రింది అంకెలు:

ఆస్ట్రియన్ ప్రభుత్వంవారి సాలీనా ఆదాయంలో దాదాపు మూడువంతులు విదేశపు ఋణాల వడ్డీకింద చెల్లిపోసాగింది. ఇందుకు తోడు ఆస్ట్రియా ఎగుమతులకంటె దిగుమతులు హెచ్చు కావడంవల్ల జాతీయ ఋణం సగటున సాలుకు 2 కోట్ల 40 లక్షల చొప్పున వృద్ధికావొచ్చింది. 1913లో ఆస్ట్రియాలోని లిమిటెడ్ కంపెనీలమీద ఉన్న పెట్టుబడిలో నూటికి 80 వంతులు 1930 నాటికి నష్టంకింద చెల్లిపోయింది. విదేశాలకు వడ్డీ ముడుపును చెల్లించడానికి గాను ఆస్ట్రియన్ ప్రభుత్వం తన ఉద్యోగుల జీతాలను నూటికి 30 వంతుల చొప్పున తగ్గించవలసి వచ్చింది. 1930 నాటికి ఆస్ట్రియన్ కార్మికుడి కూలి బ్రిటిష్ కార్మికుని కూలిలో సగానికి సగం వరకు తగ్గిపోయింది. ఇంత తక్కువ కూలికైనా పని దొరకడం కష్టం కాసాగింది. 1930లో ప్రతి ముగ్గురు ఆస్ట్రియన్ కార్మికులలోనూ ఒకడు నిరుద్యోగి!

తమ ఋణాలవల్ల ఆస్ట్రియాను ఇంత దైన్యస్థితికి తెచ్చినా, బ్రిటన్, ఫ్రాన్సు, జెకొస్లోవాకియా రాజ్యాలు తాము దానికి ప్రాణాన్ని పోసినట్టు గర్వపడ్డాయి. చావసిద్ధంగా ఉన్నవాడికి మందు మాకుల్ని పోసి, వాడి బాధను మరికొంత కాలంపాటు పొడిగించి 'నేను ఎంత ఘనకార్యాన్ని చేశానో, చూచావా?" అని గర్వపడ్డం ఎంత లక్షణంగా ఉంటుందో ఇది కూడ అంతే!

5

క్లిష్టమైన ఆర్థిక పరిస్థితులవల్ల అసలే కృంగి కృశీభూతమై ఉన్న ఆస్ట్రియాకు, 1930లో ప్రపంచ వ్యావృతమైన వర్తక మాంద్యం ఏర్పడ్డం "మూలుగుతున్న నక్క మీద తాటిపండు పడ్డ" చందం అప్పుడిక కష్టాల్ని సహించలేక, జర్మనీతో కనీసం సుంకాల విషయంలోనైనా ఐక్యతను (కష్టమ్సు యూనియన్) కూర్చుకోవాలని అది నిశ్చయించుకుంది.

ఇలా నిశ్చయించుకుని అది జర్మనీతో రాయబారాల్ని ప్రారంభించింది. ఆస్ట్రియా తరపున ఈ రాయబారాన్ని నడిపినవాడు, ఆస్ట్రియన్ ఛాన్సలర్ డాక్టర్ షోబర్ (ఇతడు పోలీసు కాన్ స్టేబుల్ గా జీవితాన్ని ప్రారంభించాడు; చురుకైనవాడు కాదుగాని, ఋజువర్తనానికి పేరు పొందినవాడు.) ఇక, జర్మనీ తరపున ఈ రాయబారాలలో పాల్గొన్నవాడు, జర్మన్ విదేశాంగమంత్రి కర్టిస్ (ఇతడు డాక్టర్ బ్రూనింగ్ మంత్రివర్గానికి చెందినవాడు). వీరు ఉభయులు తమతమ దేశాలకు గల సాధకబాధకాలను అన్నింటిని చర్చించిన మీదట, 1931 మార్చి నెలలో ఒక ఒడంబడికకు రాగలిగారు. కాని, ఫ్రాన్సు దీనిని అమలులోనికి రానివ్వలేదు. సుంకాల విషయంలో ఆస్ట్రియా, జర్మనీల మధ్య ముందు ఐక్యత ఏర్పడితే, ఇది కాలక్రమాన సంపూర్ణమైన ఐక్యతగా పరిణమిస్తుందని ఫ్రాన్సు భయం. ఈ భయం కొంత వరకు సకారణమైందే! అయితే, ఇంకొక విషయాన్ని కూడా ఆలోచించాలి. ఆస్ట్రియా, జర్మనీలు రెండూ కూడా ఆర్థికంగా అనేక కష్టాల్ని పడుతున్నవి. విడివిడిగా ఉన్నంతకాలం ఆ రెండింటిలో దేని స్థితి కూడా చక్కబడదు. ఇది అసంతృప్తికీ, అశాంతికీ దారితీస్తుంది. ఇక, వాటిని ఏకం కానిస్తే పరస్పర సహాయ సహకారాలవల్ల రెండూ కూడా సుఖపడతవి. సుఖంవల్ల సంతృప్తి, సంతృప్తి కారణంగా శాంతి ఏర్పడుతుంది. ఈ పరిస్థితిలో మొదటి మార్గమా, రెండవమార్గమాఏది అనుసరణీయం? జ్ఞానం కలవాడు ఎవడైనాసరే ఈ ప్రశ్నకు ఒకటే జవాబు చెబుతాడు - "మొదటి మార్గమే" అంటూ. అయితే, ఫ్రాన్సు మాత్రం రెండవ మార్గాన్ని అనుసరించింది. దీని ఫలితం అది ఏ ఐక్యతను ప్రతిఘటించ యత్నించిందో అది ఈనాడు జరగడమే కాకుండా - శాంతినికోరే సోషల్ డిమోక్రాట్ డాక్టర్ బ్రూనింగ్ ఆధ్వర్యం కింద కాకుండా , యుద్ధ దేవతను ఉపాసించే నాజీ లీడర్ హిట్లర్ హయాంలో ఈ పని జరగడం!

ఆస్ట్రియా, జర్మనీల మధ్య సుంకాల విషయంలో ఐక్యత కూడదని అనడానికి ఫ్రాన్సు చెప్పిన కారణం, అది 1914-18 నాటి యుద్ధానంతరం జరిగిన సంధికి విరుద్ధమని. నిజంగా ఈ ఐక్యత ఆ సంధికి విరుద్ధమా, కాదా అనే విషయం హేగ్

కోర్టుకు విచారణకు వెళ్ళింది. కోర్టు జడ్జీలు న్యాయ విచారణకంటె, రాజకీయోద్దేశాలకే అధిక ప్రాధాన్యాన్ని ఇచ్చి ఒక వోటు మెజారిటీతో "విరుద్ధం" అనే తీర్పు ఇచ్చారు. అసలు ఈ తీర్పు తతంగం కూడా పూర్తిగా అనవసరం. ఎంచేతనంటే హేగ్ కోర్టు తీర్పు తనకు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా, తానుమాత్రం ఆస్ట్రియా, జర్మనీల మధ్య ఏవిధమైన ఐక్యతను ఏర్పడనివ్వనని ఫ్రాన్సు ముందుగానే ప్రకటించింది!

తన పట్టుదల సాగించుకోడానికి ఫ్రాన్సు ఒక ఎత్తువేసింది. అది ఏమంటే, - ఆస్టియన్ బ్యాంకుల నుంచి తనకు రావలసిన బాకీ మొత్తాలను ఒక్కసారిగా రాబట్టడం. దీని ఫలితాలు ఇవి : క్రెడిట్ స్టాల్ట్ - ఇది ఆస్ట్రియన్ బ్యాంక్ - మధ్య యూరప్ అంతటికీ ప్రధానమైన ఆర్థిక సంస్థ ఇదే - ముందుగా దివాలా తియ్యడం; తర్వాత జర్మన్ బ్యాంకింగ్ లో విషమ పరిస్థితులు ఏర్పడ్డం; యుద్ధ ఋణాల వాయిదాల తీర్మానాన్ని తాత్కాలికంగా నిలుపు చెయ్యవలసి రావడం, మారకపు రేట్లు పడిపోవడం; యూరప్ అంతటిలోనూ బ్యాంకులు బోర్డుల్ని తిప్పివెయ్యడం; గ్రేట్ బ్రిటన్ గోల్డ్ స్టాండర్డ్ ను రద్దు చెయ్యడం...

ఆస్ట్రియా, జర్మనీల మధ్య సుంకాల విషయమై ఐక్యత ఏర్పడరాదని ఫ్రాన్సు వేసిన ఎత్తుకు కలిగిన విపరీత ఫలితాలు ఇవి! ఇంత గొడవ చేసిన మీదట ఎప్పుడూ, ఏ రూపంలోనూ జర్మనీతో ఐక్యతను అభిలషించ గూడదనే షరతుమీద ఆస్ట్రియాకు నానాజాతి సమితి ద్వారా ఫ్రాన్సు తిరిగి కొంత అప్పు పెట్టింది.
స్వార్థం నీచమైనదనీ, అంధప్రాయమైనదనీ అనడానికి ఇంతకంటె నిదర్శనం కావాలా?

6

1931 వరకు ఆస్ట్రియన్ వ్యవహారాలు ఒక ధోరణిలో నడిచాయి; ఆ తర్వాత ఇంకొక ధోరణిపట్టాయి. మొదటి ధోరణికీ తర్వాత దానికి ప్రధానమైన భేదం ఏమంటే, - మొదటిలో ఆస్ట్రియా జర్మనీతో ఎంతగా ఐక్యతను అభిలషించిందో, తర్వాత అంతగా ఆ ఐక్యతనే ప్రతిఘటించడం. ఈ పరిపూర్ణమైన మార్పుకు గల కారణాలు రెండు. వీటిలో మొదటిది - డాక్టర్ డోల్ఫుస్ ఆస్ట్రియాకు ఛాన్సలర్ కావడం. పోతే, రెండోది - హెర్ హిట్లర్ జర్మనీకి డిక్టేటర్ కావడం.

ఆస్ట్రియాలో ఒక 'కష్టమ్సు ఇన్ స్పెక్టర్' మూడో భార్య కడుపున పుట్టిన హిట్లర్ - చదువు సంధ్యల్ని ఎరగని హిట్లర్ - ఇళ్ళకు రంగులు వేసి పొట్ట పోసుకున్న హిట్లర్ - 1914-18 నాటి యుద్ధంలో ఉత్తరాల బంట్రోతుగా పనిచేసిన హిట్లర్ - 1919లో సి.ఐ.డి.గా రాజకీయాలలోకి దిగిన హిట్లర్ - చివరికి జర్మనీకి నాథుడు ఎలా కాగలిగాడో ప్రస్తుతానికి అనవసరం, కాని, డాక్టర్ డోల్ఫుస్ ఆస్ట్రియాకు ఛాన్సలర్ కాగలిగిన విధాన్ని మాత్రం తప్పక తెలుసుకోవాలి.

డాక్టర్ డోల్ఫుస్ - అన్నట్టు ఇతడి సంగతి సరిగా తెలియాలంటే, ఆస్ట్రియన్ రాజకీయాల్ని ఒకసారి సింహావలోకనం చెయ్యాలి.

7

రాజధాని నగరమైన వియన్నాకూ, తక్కిన దేశానికీ సంఘర్షణ - ఇదే ఆస్ట్రియన్ రాజకీయాల కీలకం.

తక్కిన దేశం అంతటిలోనూ రెండువంతుల జనాభా ఉంటే, ఒక్క వియన్నాలో ఒక వంతు ఉండడం; తక్కిన దేశం అంతా ఎనిమిది రాష్ట్రాల క్రింద ఉంటే, వియన్నా తనంతట తాను ప్రత్యేకంగా ఒక రాష్ట్రం కావడం;
తక్కిన దేశం సారవిహీనమైన భూముల్ని సాగుచేస్తూ, సగం ఆకలితో ఉంటూ ఉంటే, పరిశ్రమల ఆధారంతో వియన్నా పచ్చ పచ్చగా ఉండడం, ఈ విభేదాలవల్ల ఆ రెంటికి మధ్య సహజంగానే సంఘర్షణ ఏర్పడింది.

ఇలా సహజంగా ఏర్పడ్డ ఈ సంఘర్షణ ఇతర కారణాల వల్ల మరింత బలీయమైంది. ఈ ఇతర కారణాలలో ముఖ్యమైంది ఏమంటే, - వియన్నా ఒక రాజకీయ పక్షానికి కేంద్రమైతే, తక్కిన దేశం ఇందుకు సరిగా వ్యతిరేకమైన ఇంకొక రాజకీయ కక్షకు కార్యరంగం కావడం.

వియన్నాను కేంద్రంగా తీసుకున్న రాజకీయ పక్షం పేరు, - సోషల్ డిమోక్రాటిక్ పార్టీ. దీని దృక్పథం చాలా విశాలమైంది. ప్రజా సముదాయానికి - ముఖ్యంగా కార్మికులకు - హితాన్ని కూర్చడమే దీని ఆశయం. జీవితం లోని ప్రతి అంశంలోనూ, ఇది అభివృద్ధిని ఆశిస్తుంది.

పోతే, తక్కిన దేశంలో స్థావరం కుదుర్చుకున్న పక్షం పేరు, - కాథోలిక్ క్రిష్టియన్ సోషల్ పార్టీ. దీని ఆశయాల్ని వేరుగా వర్ణించడంకంటె, సోషల్ డిమోక్రాటిక్ పార్టీకి ప్రతివిషయంలోనూ ఇది భిన్నంగా వెడుతుందని చెబితే క్లుప్తంగా సరిపోతుంది!

సోషల్ డిమోక్రాటిక్ పార్టీ ఆధ్వర్యం కింద వియన్నా ప్రపంచం అంతటికీ ఆదర్శప్రాయమైన నగరమైంది. వియన్నా పురపాలక సంఘాన్ని స్వాధీనపరుచుకుని, తద్వారా అది కార్మికులకు ఎన్నో సౌకర్యాలను చేసింది. పని దొరకక అల్లాడుతూ ఉన్న కూలీలకు పింఛనులు, ఇన్సూరెన్సు మొదలైన సాధనాల ద్వారా సహాయాన్ని చెయ్యడం, కడుపుతో ఉన్న ఆడకూలీలకు నీళ్ళాడానికి ముందు కొన్ని రోజులు ఆ తర్వాత కొన్ని రోజులు సెలవు మంజూరు చెయ్యడం, వారికి మందు మాకులు కావలసివస్తే వాటిని ఉచితంగా సప్లయి చెయ్యడం కూలీల పిల్లలకు జీవితం నాతం లేకుండా చదువు చెప్పించడం, వాళ్ళు ఆడుకోడానికి ఆటస్థలాన్ని ఏర్పాటు చెయ్యడం, - సోషల్ డిమోక్రాటిక్ పార్టీ కార్మికులకు చేసిన సౌకర్యాలలో ఇవి కొన్ని. చిన్న చిన్న ఆ సౌకర్యాలను చెయ్యడంతో పాటు, కార్మికుల కోసం అది ఒక పెద్ద కార్యక్రమాన్ని జయప్రదంగా నిర్వహించింది కూడా! ఆ కార్యక్రమం ఏమంటే, - గాలికీ వెలుతురుకీ నోచుకోని కూలీల పాడు కొంపల్ని పడగొట్టించి, ఆ స్థలంలోనే వారి కోసం దివ్యభవనాలను కట్టించడం. ఇక్కడ "దివ్యభవనాలు" అనేమాట, అలంకారం కోసం అన్నది కాదు. వియన్నా కార్మిక భవనాలు నిజంగా దివ్యభవనాలే! వాటిని నిర్మించింది వేల ఖర్చుతో కాదు, - లక్షల వ్యయంతో, వాటిని నిర్మించినవారు సామాన్యులు కాదు, - ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఇంజనీయర్లు. , అందచందాలలో నేమి, సౌకర్యాలలో నేమి, రాజప్రాసాదాలు కూడా ఈ భవనాలకు ఈడు రావనే చెప్పాలి! ఇంత దేనికి? ఈ భవనాల్ని నిర్మించిన తర్వాత వియన్నాకు "మోడల్ సిటీ" అనే ఖ్యాతి వచ్చింది!

కార్మికులకు ఇన్ని సౌకర్యాలను కల్పించినప్పటికీ, వియన్నాను ఆదర్శప్రాయమైన నగరంగా చేసినప్పటికీ, ఇందుకోసం సోషల్ డిమోక్రాటిక్ పార్టీవారు - ఒక స్వల్పమైన మొత్తాన్ని మినహాయించి - ఋణాన్ని చెయ్యనూ లేదు; ఇతరమైన వాటికి వినియోగపడవలసిన రాబడిని.

దీనికిగాను ఖర్చు పెట్టనులేదు. ప్రభుత్వోద్యోగుల హెచ్చు జీతాలను విరగ గొయ్యడం, గుర్రపు పందెముల మీద నూటికి 33 1/3 వంతుల పన్ను వెయ్యడం, ఇంటి పనులకు నౌకర్లు చాకర్లు కావలసిన వారి వద్ద నుంచి (వారు పెట్టుకున్న మనుష్యుల అంకెనుబట్టి) వీలైనంత అధికంగా పన్ను రాబట్టడం, - తమ కార్యక్రమ నిర్వహణానికి కావలసిన ధనాన్ని చేకూర్చడంలో వారు అవలంభించిన మార్గాలు ఇవే!

సోషలిస్టుల హయాం కింద వియన్నా ఈ విధంగా అభివృద్ధి పొందడమూ, సౌఖ్యవంతంగా ఉండడమూ చూస్తే, తక్కిన దేశానికి కడుపుమంట పుట్టింది. ఈ కడుపుమంట కారణంగా మితవాదానికీ, మౌఢ్యానికి నిలయమైన కాథోలిక్ క్రిస్టియన్ సోషల్ పార్టీకి అక్కడ మంచి బలం ఏర్పడింది. ఈ పార్టీకి దేశం మొత్తం మీద మూడింట రెండు వంతుల మెజారిటీ ఉంది. ఈ మెజారిటీతో అది ఆస్ట్రియన్ ఫెడ్రల్ రాజ్యాంగ విధానాన్ని రూపుమాపి, పూర్వపు హాప్సుబర్గ్ రాజులకు తిరిగి పట్టంకట్టి, వియన్నా సోషలిస్టులను హతమార్చాలని ఎంతగానో అభిలషించింది. కాని, వియన్నా ఆమోదం లేనిదే రాజ్యాంగ విధానాన్ని మార్చడానికి వీలులేదు గనుక, ఈ అభిలాష తీరలేదు.

చట్టరీత్యా వియన్నా సోషలిస్టుల మీద పగ సాధించడానికి వీలులేకపోవడాన్ని చూచి, దౌర్జన్యం చెయ్యడానికి కాథోలిక్ క్రిస్టియన్ పార్టీవారు ఒక ప్రయివేటు సైన్యం ఏర్పాటుకు తోడ్పడ్డారు. ఈ సైన్యం పేరు హైమ్ వీర్. స్టార్ హెన్ బర్గ్, మేజర్ ఫే - వీ రుభయులు ఈ సైన్యానికి నాయకులు.

తమ ప్రతికక్షులు దౌర్జన్యం చెయ్యడం కోసం ఒక సైన్యాన్ని కూర్చుకుంటే, వియన్నా సోషలిస్టులు ఆత్మరక్షణ కోసం ఇంకొక సైన్యాన్ని కూర్చుకోవడం తప్పనిసరి అయింది. సోషలిస్టులు కూర్చుకున్న ఈ సైన్యం పేరు - షుక్త బండ్, షుక్త బండ్ అంటే, - “రక్షణదళం” అని అర్థం. దీన్నిబట్టే ఈ సైన్య ప్రయోజనం విదితమౌతున్నది!

ఏదైనా ఒక దేశంలో తీవ్రమైన అభిప్రాయ భేదాలు గల రెండు రాజకీయ పక్షాలు ఉంటేనే, వాటి మధ్య బహిరంగ సంఘర్షణ తప్పదు. ఇక, ఆ రెండు పక్షాలకును సమర్థించడానికి విడివిడిగా సైన్యాలు కూడా ఉంటే, ఒక చెప్పాలా? ఆస్ట్రియాలో సోషల్ డిమోక్రాటిక్ పార్టీ సైన్యానికీ, కాథోలిక్ క్రిస్టియన్ పార్టీ సైన్యానికి అనేక పర్యాయాలు చిన్నచిన్న యుద్ధాలు జరిగాయి! క్రమంగా ఈ చిన్న చిన్న యుద్ధాలే పెద్దవై, 1934లో అంతర్యుద్ధానికి ఆస్ట్రియా కేంద్రమైనది. ఈ అంతర్యుద్ధాన్ని గురించి చెప్పాలంటే, తిరిగి డాక్టర్ డోల్ఫస్ సంగతి ఎత్తుకోవాలి.

8

డాక్టర్ డోల్ఫుస్ పూర్తి పేరు, - డాక్టర్ ఎన్ జెల్ బర్ట్ డోల్ఫుస్. అతడి జననం లోయర్ ఆస్ట్రియాలోని లెక్సింగ్ అనే గ్రామంలో 1892 అక్టోబరు 4వ తేదీనాడు. అతి సామాన్య స్థితిపరులు - అతడి తల్లిదండ్రులు. అతడితో బుట్టిన వాళ్ళు ఈ నాటికి కూడా స్వగ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ కాలం గడుపుతున్నారు.

కుటుంబం అంతటిలోనూ పెద్ద చదువు చదువుకున్న వాడు ఎఙెల్ బర్టు ఒక్కడే. ముందు తమ గ్రామం సమీపంలోని బడిలో చదువుకుని, ఆ తర్వాత వియన్నా కళాపరిషత్తులో చేరి, న్యాయశాస్త్రం (లా) లో డాక్టరు పట్టాన్ని సంపాయించాడు.

1914లో యుద్ధం ప్రారంభం కాగానే అతడు ప్రయివేటుగా సైన్యంలో చేరి - అతడు చేరింది 'కెయిజర్ చుట్జెన్' అనే విఖ్యాత దళంలో - మూడు సంవత్సరాలపాటు యుద్ధంలో పాల్గొని, లెఫ్టినెంట్ హోదాను గడించుకున్నాడు. ఆస్ట్రియన్ ఇంపీరియల్ ఆర్మీలో అంటే, హాప్స్ బర్గు రాజుల సైన్యంలో - మామూలు సైనికుడొకడు లెఫ్టినెంట్ హోదాను గడించుకోవడం సామాన్య విషయం కాదు.

ముందు విద్యార్థి దశలోనూ, తర్వాత సైన్యంలోనూ చివరికి రాజకీయ రంగంలోనూ - ఒక్క మాటలో జీవితంలో డాక్టరు డోల్ఫుస్ చాలా 'పాపులరు'గా (పలుకుబడి గల వాడుగా) ఉండేవాడు. అతడి 'పాపులారిటీ' (పలుకుబడి) రహస్యం: అతడి కురచదనమే! అతడి యెత్తు నాలుగు అడుగుల పదకొండు అంగుళాలు మాత్రం. జాన్ గంథర్ చలోక్తిగా అన్నట్టు ఆరడుగుల వాడి మీద ఆగ్రహం తెచ్చుకోవచ్చునుగాని, అయిదడుగులైనాలేని ప్రధానామాత్యుణ్ణి ద్వేషించడం సాధ్యమా!

అతడి కురచదనాన్ని గురించి ప్రచారంలో ఉన్న హాస్యకథలు కుప్పలూ, తిప్పలూ! అతన్ని హత్య చెయ్యడానికి జరిగిన ప్రయత్నాన్ని ఒకనాడు పోలీసువారు కని పెట్టారట. ఆ ప్రయత్నం ఏమంటే, - అతడి పడకగదిలో ఎలుకబోనును పెట్టడం! పోస్టు బిళ్ళల మీద అతడి మొహర్ వెయ్యాలను కున్నారట, - అయితే ఈ మొహర్ మామూలుగా శిరోభాగం (బస్ట్) చిత్రం మాత్రమే కాదు, యధాతథంగా అతని రూపం అంతా (లైఫ్ సైజ్)! ఆస్ట్రియన్ వైజ్ఞానికు డొకడు పరమాణువును విభాగించి, నోబుల్ బహుమానాన్ని పొందాడట, - అతడికి ఇంతటి గౌరవాన్ని కూర్చిన పరమాణువు - డోల్ఫుస్! రాత్రిపూట సరిగా నిద్రపట్టకపోతే, అతడు గదిలో పచారు చేసేవాడట. అది కాకపోతే, కూజాలోని నీళ్ళ పైన పేరుకున్న మంచుమీద స్కేటింగ్ చేసేవాడట! ముసోలినీని సందర్శించడానికి వెళ్ళినప్పుడు అతడు రైలులో వెళ్ళలేదట, "ఎయిర్ మెయిల్" టపాలో అతన్ని పంపించారట! ఆస్ట్రియన్ సర్వసేనాపతి ఒకనాడు సైన్యాల్ని "రివ్యూ" చేస్తూ ఉండగా, వాటి శిరోభాగాన ఒక తాబేలు కనబడిందట, "తాబేలు ఇక్కడికి ఎలా వచ్చింది చెప్మా" అని అతడు పరీక్షగా చూస్తే, అది అసలు తాబేలు కాదనీ, "హెల్మెట్" (శిరోవేష్టం) పెట్టుకున్న డాక్టర్ డోల్ఫుస్ అని తేలిందట! ఒక రాత్రి నాజీలు కొందరు అతణ్ణి హత్య చెయ్యాలని గదిలో ప్రవేశించారట, - అప్పుడతడు మారు గొంతుతో "మా నాన్న , ఇంట్లో లేడు" అంటూ దుప్పటి గట్టిగా ముసుగు పెట్టుకున్నాడట. ఇలా అన్నది నిజంగా -డోల్ఫుస్ కొడుకే అని మోసపోయి, ఆ నాజీలు వెళ్ళిపోయారట! ఇలాగే ఇంకెన్నో కథలు - వీటికి అంతులేదు! తెంపులేదు!

పొట్టితనానికి తోడు పల్లెటూరి రైతు తరహా కూడా డోల్ఫుస్ పలుకుబడికి కొంత కారణమైందట. ఎంత చదువుకున్నా, ఎంతటి ఉన్నత పదవుల్ని ఆక్రమించినా, ఇంకెంత లోకానుభవాన్ని గడించినా, "పల్లెటూరి రైతు తనాన్ని" మాత్రం అతడు

కోల్పోలేదట. అంచేతనే ఎవరైనా ప్రశంసా వాక్యాలు పలికితే “అఁ! పోదురూ!” అని పదహారేళ్ళ పిల్లలా సిగ్గుపడుతూ అనేవాడట. అతని ఉపన్యాసాలలోనూ, కార్యకలాపాలలోనూ ఇలాంటి ప్రవృత్తే కనబడేదట కూడా!

ఈ విధంగా “పల్లెటూరి రైతుతనం” అతణ్ణి అమాయకుడుగానూ, అనురాగ యోగ్యుడుగానూ చేసినప్పటికీ, ఇదే అతడి సంకుచిత బుద్ధికీ, అతడి మత మౌఢ్యానికీ, అతడి అదూర దృష్టికీ కారణమైంది కూడా!
కాథోలిక్ క్రిష్టియన్ సోషల్ పార్టీ సభ్యుడిగా డోల్ఫస్ రాజకీయాలలో ప్రవేశించాడు. ప్రారంభంలో అతడు రైతు సమస్యలంటే అభిమానాన్ని చూపించి, లోయరు ఆస్ట్రియాలోని రైతుల్ని ఒక సంఘంగా ఏర్పరచి, ఆ సంఘం తోడ్పాటుతో ఆస్టియన్ ఫెడ్రల్ పార్లమెంటులో సభ్యు డయ్యాడు. డోల్ఫస్ పార్లమెంటరీ సభ్యత్వాన్ని సంపాయించుకున్న కొత్తలోనే, ఫెడ్రల్ రైల్వే కౌన్సిల్ వారికి వ్యవసాయిక సమస్యలలో ప్రత్యేక పరిజ్ఞానం గల ప్రవీణుడు కావలసి వచ్చాడు. ముందు ఈ రీతిగా ఫెడ్రల్ రైల్వే కౌన్సిల్ లో చేరి, తర్వాత 1930 అక్టోబరులో అతడు ఆ సంస్థకు అధ్యక్షుడయ్యాడు. ఆ పైన 1931 మార్చిలో అతడు - అప్పటి క్రిస్టియన్ సోషల్ ప్రభుత్వ వర్గంలో - వ్యవసాయిక మంత్రి పదవిని పొందాడు.

డోల్ఫస్ వ్యవసాయ శాఖా మంత్రి అయిన సంవత్సరానికి - అసాధ్యాలైన కొన్ని క్లిష్ట సమస్యలు ఎదుర్కొనడం వల్ల డాక్టరు బురేష్ నాయకత్వం కింద అప్పటిలో అధికారంలో ఉన్న క్రిస్టియన్ సోషల్ మంత్రివర్గం రాజీనామా పెట్టవలసి వచ్చింది. అప్పుడు డాక్టర్ డోల్ఫసను నూతన మంత్రి వర్గాన్ని ఏర్పాటు చెయ్యవలసిందిగా కోరారు. పార్లమెంటులో ఒక్క ఓటు మాత్రమే మెజారిటీ ఉండడం వల్ల - పార్టీలోని తక్కిన సభ్యులైతే ఈ ఘనతర బాధ్యతను వహించడానికి సమ్మతించేవారు కాదు - అయితే డోల్ఫస్ మాత్రం ఏమీ జంకక - కర్తవ్యాన్ని చూపవలసినదిగా రాత్రి అంతా కూడా భగవంతుణ్ణి ప్రార్థించి - ఉదయానికి (1932 మే 20) కొత్త మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసి, తాను ప్రధాని అయ్యాడు. ఒక్క ఓటు జారిటీతో డోల్ఫస్ ఎన్నో రోజులపాటు అధికారంలో ఉండడని అనుకున్నారు గాని, రెండేళ్ళ తర్వాత నాజీల చేతిలో హత్య అయ్యేవరకూ అతడు తన పదవిని సమర్థించుకో గలిగాడు.

మొండిధైర్యం, మొండి పట్టుదల - ఈ గుణాలూ; వీటితో పాటు “డ్రమెటిక్" పరిస్థితులు ఏర్పడితే, వాటిని స్వప్రయోజన సిద్ధికి వినియోగించుకోగల ప్రతిభ; - డోల్ఫస్ విజయానికి. ఆస్ట్రియా ఆక్రమణ153- కారణాలు ఇవే! పై వాక్యానికి నిదర్శనంగా రెండు సంఘటనల్ని చెప్పవచ్చు. వాటిలో మొదటిది ఇది : డోల్ఫస్ ఛాన్సలర్ పదవికి వచ్చిన కొత్తలో “లూసాన్ లోన్” అనే ఒక ఋణాన్ని “రాటి ఫై” చెయ్యవలసిన (ఆమోదించవలసిన) అవసరం కలిగింది. ఈ ఋణాన్ని "రాటి ఫై" చేస్తే, ఆస్ట్రియాకు 30 కోట్ల స్కిల్లింగ్స్ - ఇవి ఆస్ట్రియన్ నాణెములు - ధనసహాయం లభిస్తుంది. అయితే సోషలిస్టులకు గాని, నాజీ పక్షం వారికిగాని దీన్ని “రాటి ఫై" చెయ్యడం ఇష్టం లేదు.“విదేశాల నుంచి ఋణాన్ని పుచ్చుకుంటూవుంటే, మన వ్యవహారాలపైన విదేశ ప్రభుత్వాలకు అనర్థదాయకమైన అధికారం ఏర్పడుతుంది” అని సోషలిస్టు అభ్యంతరం. “బ్రిటన్, ఫ్రాన్సు, జెకోస్లోవాకియా మొదలైన దేశాలు అప్పు పెడుతూవుంటే, వాటికి ఆస్ట్రియాలో పలుకుబడి కలగడమూ, అందుమూలంగా ఆస్ట్రియా - జర్మనీల కలయిక దూరం కావడమూ, జరుగుతుం” దని నాజీల అనుమానం. ఈ రీతిగా ఈ ఉభయ పక్షాలవారు ప్రాతికూల్యాన్ని వహిస్తే, ఇక డాక్టరు డోల్ఫస్ కు పార్లమెంటులో వున్న మెజారిటీ ఒక్క ఓటు మాత్రమే! దానితోనే లూసాన్ ఋణాన్ని రాటి ఫై' చేయించాలని, అతడు ఒకనాటికి పార్లమెంటు సమావేశాన్ని నిశ్చయించాడు. తీరా ఇలా నిశ్చయించిన తర్వాత - తలవని తలంపుగా - ఆనాటి ఉదయం డాక్టరు సైపిల్ చనిపోయాడు. దానితో డాక్టరు డోల్ఫస్ కున్న ఒక్క ఓటు మెజారిటీ గంగలో కలిసిపోయింది. ఇలా జరిగిందని అతడు హతాశు డయ్యాడా? లేదు. అప్పటికప్పుడు - గతించిన సభ్యుని స్థానంలో - ఒక కొత్త సభ్యుని నియమించాడు. ఇంతటితో కూడా సంతృప్తి పడక, తన పార్టీ సభ్యులనందరిని - వారిలో కొందరు అనారోగ్యంగా ఉన్నప్పటికీ - సమావేశానికి ఈడ్చుకు వచ్చాడు. ఇక్కడ 'ఈడ్చుకు వచ్చాడు' అనే ప్రయోగంలో లేశమైనా అత్యుక్తి లేదు. ఎంచేత నంటే, - జబ్బుగా

వున్న ఒక సభ్యుణ్ణి ముగ్గురు చేతుల మీద ఎత్తుకు వచ్చారు; గాయపడివున్న ఇంకొక సభ్యుణ్ణి - కట్లతో సహా - ఆసుపత్రి నుంచి మోసుకువచ్చారు. ఇలా చేసి డోల్ఫుస్ తనదే గెలుపు అనిపించుకున్నాడు - ఒక్క ఓటుతో! పోతే, రెండో సంఘటన కూడా ఇలాంటిదే! ప్రతి పక్షానికి చెందిన మాజీ ఛాన్సలర్ డాక్టరు షోబరు రాత్రిపూట చనిపోతే, ఆ ఉదయానికి పార్లమెంటు సమావేశాన్ని జరిపి, తిరిగి ఒక్క ఓటుతో డాక్టరు డోల్ఫుస్ ఇంకొక తీర్మానాన్ని 'ప్యాస్' చేయించాడు!

ఈ విధంగా పార్లమెంటరీ తతంగాన్ని కొంతకాలం పాటు జరిపిన తర్వాత, 1933 మార్చి 4వ తేదీనాడు డాక్టరు డోల్ఫుస్ అసలు ఆ పార్లమెంటునే రద్దు చేశాడు. అంటే, - ఏ డిక్రీనో, ఆర్డినెన్సునో ప్రకటించి రద్దుచెయ్యడం కాదు. కాని తన మీద నెపం లేకుండా " డ్రమెటిక్"గా అంతపనీ చేశాడు! జీతాలు బకాయి పడిపోయా యని సమ్మె చేసిన రైల్వే కార్మికుల పట్ల ఔదార్యంగా ప్రవర్తించాలని ఆనాటి పార్లమెంటు సమావేశంలో ఒక తీర్మానం చర్చకు వచ్చింది. అప్పుడు - సరిగా ఓటింగ్ వేళకు ఒక సోషలిస్టు డిప్యూటీ (సభ్యుడు) ఏదో పనిమీద వెళ్ళడమూ, అతడి బదులు అతడి సోదర సభ్యు డొకడు ఓటు చెయ్యడమూ అతి - - జరిగింది. ఈ ఓటింగ్ సవ్యంగా జరిగితే, చిక్కే లేకపోయేది. కాని, అలా జరగలేదు, బయటికి వెళ్ళిన సభ్యుడి తరఫున ఓటు చేస్తూ, అతడి పేరు వ్రాయడానికి బదులు, పొరపాటున తన పేరునే వ్రాసి ఓటు చేశాడు. ఇలా జరిగిన తర్వాత ఆనాటి ఓటు ఫలితం: ప్రభుత్వానికి అనుకూలం 80; దానికి ప్రతికూలం 81. ఈ పరిస్థితిలో "ప్రభుత్వం ఓడిపోయింది" అని నిస్సంకోచంగా ప్రకటిస్తే ఏమి జరిగేదోగాని, ధర్మబుద్ధి కొద్దీ అలా ప్రకటించలేక, పార్లమెంటరీ స్పీకరు డాక్టరు రెన్నరు - ఇతడు సోషలిస్టు పక్షంవాడు - "ఓటింగ్ లో అక్రమం జరిగినట్టున్నది" అని నిజాన్ని బయటపెట్టాడు. అందుమీదట సభలో పెద్ద గల్లంతు బయల్దేరింది. ఈ గల్లంతును చూచి - కేవలం అనాలోచితంగానూ, అదూర దృష్టితోనూ - స్పీకరు రెన్నరు తన పదవికి అక్కడక్కడనే రాజీనామా పెట్టి, అధ్యక్ష పీఠం నుంచి లేచిపోయాడు. అతడి తర్వాత డిప్యూటీ స్పీకర్లు ఇద్దరూ కూడా తమ పదవులకు రాజీనామా ఇచ్చివేశారు. దానితో ఆనాటి సభ అంతమైంది.

ఈ గొడవను చూడగా, తనకు చక్కటి అవకాశమొకటి చేజిక్కినట్టు డాక్టరు డోల్ఫుస్ కు తోచింది. అంతే వెంటనే అతడు దాన్ని వినియోగించుకున్నాడు. ఆస్ట్రియన్ రాజ్యాంగ విధానం ప్రకారం పార్లమెంటరీ సమావేశాన్ని జరపగల అధికారం స్పీకరుకూ డిప్యూటీ స్పీకర్లకు మాత్రమే ఈ ముగ్గురు రాజీనామా ఇచ్చివేశారు. గనుక - వీరి స్థానంలో కొత్తవారిని నియమించకపోతే - పార్లమెంటు సమావేశం జరగడానికి వీలులేదు. ఈ సందు చూచుకుని, డాక్టరు డోల్ఫుస్ - తాను తప్ప మరెవ్వరు అప్పటిలో ప్రభుత్వాన్ని సాగించగల స్థితిలో లేరనే ధీమాకొద్దీ - తన ఛాన్సలరు పదవికి రాజీనామా పెట్టాడు. అనుకున్నట్టుగానే ఈ ఎత్తు పారింది; ప్రత్యేకాధికారాలతో డాక్టరు డోల్ఫుస్ కు తిరిగి ఛాన్సలర్ పదవి లభించింది. కొత్తగా ఇలా ఛాన్సలర్ పదవికి వచ్చిన మర్నాడు - అంటే 1933 మార్చి 9వ తేదీనాడు - అతడు ఎన్నో కొత్త డిక్రీలనూ, ఆర్డినెన్సులను ప్రకటించాడు. వీటిని చూడగానే ఆస్ట్రియన్ పార్లమెంటరీ విధానం బుగ్గి కలిసిపోయిందనీ, డాక్టర్ డోల్ఫుస్ డిక్టేటర్ అయ్యాడనీ తెలుసుకుని ఆస్ట్రియన్ ప్రజలు తెల్లబోయారు.

9

బుద్ధి కుశలతవల్ల కార్యసిద్ధి కలుగుతుంది. ఇందుకు సందేహం లేదు. అయితే అన్ని వేళలలోనూ ఇది కార్యకారి కాదు; కాలేదు. ఎంచేతనంటే, - విశేష బుద్ధికుశలత గల వ్యక్తి కూడా ఒక్కొక్కప్పుడు తనకు మించిన శక్తుల సుడిగుండంలో చిక్కుపడి, కొట్టుకుపోతాడు. డాక్టర్ డోల్ఫుస్ జీవితం ఇందుకు చక్కని తార్కాణం : అతడు కేవల తన కుశాగ్ర బుద్ధివల్ల డిక్టేటర్ కాగలిగాడు. అయితే, ఆ పదవిని ఎంతో కాలం అనుభవించక ముందే రెండు భీషణ శక్తుల నడుమ పడి నలిగిపోయాడు. ఈ శక్తులలో మొదటిది నాజీజం, రెండవది ఫేసిజం.

జర్మనీ, ఇటలీ : ఇవి రెండూ శక్తిమంతములైన రాజ్యాలు. హిట్లర్, ముసోలినీ : వీరిద్దరూ దురాశాపరులైన నిరంకుశ ప్రభువులు. నాజీజం, ఫేసిజం: ఇవి రెండూ దోపిడిని ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్న దౌర్జన్యయుత రాజకీయ సిద్ధాంతాలు. ఈ రెండు రాజ్యాల మధ్య, ఈ ఇద్దరు నిరంకుశ ప్రభువుల మధ్య, ఈ రెండు రాజకీయ సిద్ధాంతాల మధ్య, ఆస్ట్రియా అంతటి చిన్న దేశానికి డిక్టేటరు అయిన డాక్టర్ డోల్ఫస్ - అత డెంతటి తీక్షణ బుద్ధిగలవాడైనా - నిరపాయంగా జీవించగలడా? జీవించలేడు ముమ్మాటికీ! ఇదే విషయాన్ని తర్వాతి సంఘటనలు రూఢి చేశాయి!

హిట్లర్ జర్మనీకి డిక్టేటర్ కాక పూర్వమే ఆస్ట్రియాలో నాజీ పార్టీ ఉండేది. అయితే, అప్పటిలో దానికి ఏమీ బలం ఉండేది కాదు. తక్కిన ఎన్నో చిల్లర పార్టీలతో పాటు అది కూడా ఒక పార్టీ. అంతే! మొదటిలో ఇలా ఉన్న ఆస్ట్రియన్ నాజీ పార్టీకి హిట్లర్ జర్మన్ ప్రభుత్వాన్ని వశపరచుకున్న వెంటనే మంచిబలం ఏర్పడింది. స్వతంత్రంగా జీవించడం దుస్సహంగా ఉంది కనుక, జాతిలోనూ, భాషలోనూ, కొంత వరకు విజ్ఞానంలోనూ ఐక్యత ఉన్న జర్మనీతో కలిసిపోదామనే పాతకోర్కె ఉండనే ఉంది. ఇందుకు హిట్లర్ ఆస్ట్రియావాడుగదా అనే భావం కూడా తోడైంది. ఇందువల్ల ఆస్ట్రియా తనంతట తానుగా జర్మనీలో కలిసి పోయేదే! అయితే, రాజ్యాధికారానికి వచ్చిన వెంటనే హిట్లరు చేసిన దౌష్ట్యాలు - ముఖ్యంగా యూదుజాతివారిని అతడు పెట్టిన హింసలు - ఆస్ట్రియా మనస్సును విరిచి వేశాయి. పైగా, హిట్లరు తోడ్పాటుతో ఆస్ట్రియన్ నాజీలు దౌర్జన్యానికి పూనుకుని, ఇతర పక్షాలవారిలో "వీరిని మనం ప్రతిఘటించక పోవడం భీరుత్వం" అనే పట్టుదలను రేకెత్తించారు. దీనికి అంతటికీ పర్యవసానం ఏమంటే, - హిట్లర్ డిక్టేటర్ కాకపూర్వం ఆస్ట్రియాలో దాదాపు నూటికి 80 మంది జర్మనీతో ఐక్యతను అభిలషించారు; అతడు డిక్టేటరు అయిన తర్వాత కనీసం నూటికి 60 మంది అది కూడదనే నిశ్చయానికి వచ్చారు.

పార్లమెంటును రద్దుచేసి డాక్టరు డోల్ఫస్ ఆస్ట్రియాకు డిక్టేటరు కాకపూర్వమే ఆస్టియన్ నాజీలు దౌర్జన్యాన్నీ, దుండగాలనూ చేస్తున్నారు. ఇక అతడు డిక్టేటరు అయిన నాటికి వారు మరీ హద్దుమీరిపోయారు. లాఠీలతో మోదడం, తుపాకుల్ని కాల్చడం, బాంబుల్ని విసరడం, రైళ్లని పడగొట్టడం, బ్రిడ్జిలను సగలగొట్టడం, సభల్ని చెల్లాచెదరు చెయ్యడం - ప్రతిరోజూ, ప్రతి చోటనూ ఇలా దౌర్జన్యానికి పూనుకోవడమే! ఇలా దుండగాలను చెయ్యడమే!! దీన్ని సహించనని డాక్టరు డోల్ఫస్ దౌర్జన్యానికి ప్రతి దౌర్జన్యాన్నీ, దుండగానికి బదులు దుండగాన్నీ చెయ్యసాగాడు. ఇది క్రమంగా ఆస్ట్రియా - జర్మనీల వైరంగా పరిణమించింది. బవేరియా న్యాయశాఖామంత్రి డాక్టరు ఫ్రాంక్ నాజీ ప్రచారాన్ని చెయ్యడానికి వస్తూవుంటే, అతడు రాగూడదని ఆజ్ఞాపించాడు, డాక్టరు డోల్ఫస్. ఇందుకు ప్రతీకారంగా ఆస్ట్రియాకు విహారార్థం వెళ్ళే జర్మన్ పౌరులు 1000 మార్కుల (ఇది జర్మన్ నాణెం) జరిమానాను చెల్లించాలని ఉత్తరువు చేసి, ఆస్ట్రియన్. జాతీయాదాయానికి నష్టాన్ని కలిగించాడు, హిట్లరు.దీనికి కినిసి ఆస్ట్రియన్ నాజీ పార్టీ అక్రమ సంఘం అని ప్రకటించి దాన్ని నిషేధించాడు డాక్టరు డోల్ఫస్. నాజీ పార్టీని కేవలం నిషేధించడమే కాకుండా అతడు నాజీలను వరసపెట్టి అరెస్టు చేయించాడు కూడా. ఒక్క నెలలో - జూన్ నెలలో - డోల్ఫస్ అరెస్టు చేయించిన నాజీల సంఖ్య దాదాపు పన్నెండు వందలు, వారిలో ఏడుగురు జడ్జీలు, ముగ్గురు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, యాభై ఇద్దరు స్కూల్ మాస్టర్లు, ముప్పై యేడుగురు మిలటరీ పోలీసులు, అరవైమంది రైల్వే పనివాళ్ళు, ఎనభై మంది మేయర్లు, నూటపదకొండు మంది మునిసిపాలిటీల మెంబర్లు, ముప్పైఏడు మంది లాయర్లు. ఈ అరెస్టులతోపాటు దేశంలోని నాజీ పార్టీ ఆఫీసుల్ని అన్నింటినీ వశపర్చుకున్నాడు. విదేశీయులైన నాజీలను వెళ్ళగొట్టించి వేశాడు.

ఈ సమయంలోనే అతడు ఆస్ట్రియన్ నాజీ నాయకుడు హబీష్ట ను కూడా - ఇతడు ప్రష్యా దేశస్థుడు - అరెస్టు చేయించాడు. హబీజ్ అరెస్టు సంగతి తెలియగానే హిట్లర్ కోపం పట్టలేక, బర్లిలోని ఆస్ట్రియన్ లెగేషన్ (రాయబారి కార్యాలయం) ఉద్యోగి నొకడిని - ఇతడి పేరు డాక్టర్ ఎర్విన్ వాజరుబోక్ - లెగేషన్లోని ప్రచారక శాఖకు అధికారి ఈ ఉద్యోగిని ఇంగ్లీషులో "ప్రెస్ అటాచీ" అని అంటారు - అరెస్టు చేయించాడు. అప్పుడు డాక్టరు వాజరు బోక్ ను విడుదల

చేయించడం కోసం హబీజ్ ను వదిలి పెట్టక తప్పింది కాదు. అయితే డోల్ఫస్ హబీష్ట్ ను ఆస్ట్రియాలో ఉండనివ్వలేదు; జర్మనీకి తరిమివేశాడు. ఇందుకు జవాబుగా కాబోలు, హిట్లరు తన తరఫున ఆస్ట్రియా వ్యవహారాలను నడపడానికి హబీష్ట ను 'ఇన్ స్పెక్టరు-జనరల్'గా నియమించాడు! తర్వాత డాక్టరు డోల్ఫస్ కు విరుద్ధంగా జర్మన్ రేడియోలు తీవ్ర ప్రచారాన్ని సాగించడమూ, జర్మన్ విమానాలు ఆస్ట్రియా సరిహద్దులలోకి వెళ్ళి, నాజీ కరపత్రాల్ని విసిరి రావడమూ, చివరికి 1933 అక్టోబరు 3వ తేదీనాడు సాయంత్రం 2-15 గంటలకు ఆస్ట్రియన్ నాజీ పార్టీ వాడొకడు డాక్టరు డోల్ఫసను తుపాకితో కాల్చి చంపబోవడమూ, జరిగింది. ఈ విధంగా నాజీ దౌర్జన్యం మితిమీరడమూ, ఆస్ట్రియా జర్మనీల వైరం పెచ్చు పెరగడమూ చూచి, బ్రిటన్ - ఫ్రాన్సు - ఇటలీ రాజ్యాలు 'దీనిని ఇకముందు సహించడం కష్టం సుమా!' అని హిట్లరుకు వర్తమానం చేశాయి. దాని తర్వాత నాజీలు కొంత చల్లబడ్డారు గాని, డాక్టరు డోల్ఫస్ చిక్కులు ఇంతటితో తీరలేదు.

ఈ స్థితిలో ప్రధాన సంఘటనలు మూడు జరిగాయి. వీటిలో మొదటిది ఏమంటే, - ముస్సోలినీ డోల్ఫస్ ను -తన చంక కిందికి చేరదీసి, ఆస్ట్రియాకు కేవలం గార్డియన్ కావడం. ఇటలీ సరిహద్దులో శక్తిమంతులైన ప్రష్యనులు (జర్మనీవారు) ఉండడం కంటే, నిస్సహాయులైన ఆస్ట్రియనులు ఉండడమే ఏనాటికైనా మంచిది. పైగా, ఇటలీలోని సౌత్ టైరొల్ రాష్ట్రంలో రెండు లక్షల మంది జర్మన్ జాతివా రున్నారు. వారికి జర్మనీ ఎంత దూరంగా ఉంటే, ఇంటలీకి అంత క్షేమం. ఈ రెండు కారణాల వల్ల ఆస్ట్రియా నాజీల వశం కాగూడదని ముసోలిని నిశ్చయించాడు. ఇతర కారణాల వల్ల డోల్ఫస్ కూడా ఇలాంటి నిశ్చయానికే వచ్చాడు గనక, అతడు మూడు సార్లు రోం నగరానికి ప్రయాణం కట్టడమూ, 'నే నున్నంతవరకు నీకు భయం లేదులే!' అని ముసోలినీ అభయహస్తం ఇవ్వడమూ, జరిగింది.

ఇక, రెండో సంఘటన ఇది : హైమ్ వీర్ దళాధిపతులకు - ప్రిన్స్ ఎర్నెస్ట్ రూడిగర్ వాన్ స్టార్ హెంబర్గ్, కుజర్ ఎమిల్ ఫే అనే వారిద్దరికీ - డాక్టర్ డోల్ఫస్ అంతకంతకు అధికంగా అధికారాన్ని అప్పజెప్పవలసిన అగత్యం కలగడం. కాలం గడచిన కొద్దీ హైమ్ వీరు తోడ్పాటు లేకుండా డోల్ఫస్ తన అధికారాన్ని నిలబెట్టుకోలేని స్థితి ఏర్పడింది. దీన్ని సాకుగా పెట్టుకుని హైమ్ వీరు దళాధిపతులు తమ షరతుల్ని డిక్టేట్ చెయ్యసాగారు. వారి షరతులకు లోబడి అతడు సోషలిస్టు పార్టీ వారి షుక్త బండ్ సైనికదళాన్ని అక్రమ సంఘంగా ప్రకటించాడు; ప్రముఖులైన సోషలిస్టు నాయకుల్ని అనేక కష్టాలకు గురిచేశాడు; వియన్నా సోషలిస్టు మునిసిపాలిటీ వారి ఆర్థిక సంబంధమైన అధికారాన్ని తగ్గించి పారవేశాడు. ఇలాగే మరి ఎన్నో పాడు పనుల్ని చేశాడు. ఇలాంటి పనుల్ని చేసిన కొద్దీ, అతడి అధికారం తగ్గడమూ, అతడు అధికంగా హైమ్ వీరు దళాధిపతుల చేతిలో కీలుబొమ్మ కావడమూ జరిగింది.

పోతే, చివరి సంఘటన ఇది : ఆస్ట్రియన్ మంత్రివర్గపు తొమ్మిది శాఖలలో అయిదింటికి డాక్టరు డోల్ఫస్ స్వయంగా అధిపతి అయ్యాడు. అయినప్పటికీ అతడికి ప్రజాస్వామిక రాజ్యాంగ విధానం కంటకప్రాయంగా తోచింది. అందుచేత దాన్ని రద్దుచేసి, దాని స్థానంలో అతడు తనకు పూర్తిగా నిరంకుశాధికారాన్ని ఇచ్చే "టోటలిటేరియన్" రాజ్యాంగ విధానాన్ని ప్రకటించాడు. ఈ క్రొత్త విధానం ప్రజామోదాన్ని పొందాలనే తలంపుతో అతడు "ఫాదరులాండ్ ఫ్రంట్" అనే జాతీయోద్యమాన్ని ప్రారంభించాడు కూడా! అన్నట్టు, అతడు అ రెండు పనుల్ని చేసింది, ముసోలినీ ఆమోదం మీదనే!

ప్రధానమైన ఈ మూడు సంఘటనలు జరిగేసరికి ఆస్ట్రియన్ రాజకీయ పరిస్థితులు ఇవి : అంతకుపూర్వం దేశంలో క్రిస్టియన్ కాథొలిక్కులు, సోషలిష్టులు - వీ రుభయులు మాత్రమే రాజ్యాధికారం కోసం సంఘర్షిస్తూ ఉండేవారు. ఇప్పుడు మూడు విభిన్న పక్షాల వారి మధ్య ఈ సంఘర్షణ జరగసాగింది. సోషలిస్టులు, నాజీలు, హైమ్ వీరు తోడ్పాటుతో డాక్టరు డోల్ఫస్: వీరే ఆ మూడు విభిన్న పక్షాల వారూనూ. ఈ సంఘర్షణ భవిష్యత్తు చెప్పడం దుస్సాధ్యంగా కనబడింది. డోల్ఫస్ మధ్యలో ఉండి, ఇటు మితవాదులతోనూ అటు అతివాదులతోను పోరాడవలసి వచ్చింది. నాజీలూ, సోషలిస్టులూ ఏకమైతే, వారు డోల్ఫస్ ను కూలదోయ్య గలిగేవారే! కాని, వారు చెయ్యి కలపడం అసంభవం. ముఖ్యంగా హిట్లరు బతికి

ఉండగా ఇలాంటి ఆలోచనకైనా వీలులేదు. ఇది ఇలా ఉండగా నాజీలూ, హైమ్ వీరు సైన్యం వారూ రహస్యంగా రాయబారాల్ని జరపసాగారు.

ఈ పరిస్థితులన్నింటిని చూడగా, నాజీలతో రాజీ పడితే తన చిక్కులు తీరుతాయేమో అనే ఆశ డోల్ఫస్ కు కలిగింది. అంచేత ఆస్ట్రియా స్వాతంత్ర్యానికి భంగం రాని పక్షంలో తాను రాజీకి అంగీకరిస్తానని అతడు తెలియబరిచాడు. హిట్లరుకూడా ఇందుకు "సరే" అన్నాడు. రాజీ షరతుల్ని గురించి చర్చించడానికి హెర్ హబీ, 1934 జనవరి 8వ తేదీనాడు డాక్టరు డోల్ఫస్ ను కలుసుకోవాలని నిర్ణయం జరిగింది. ముందుగా అనుకున్న ప్రకారం సరిగా వేళకు హబీ, మూనిచ్ నుంచి విమానంలో వియన్నాకు ప్రయాణ మయ్యాడు. ఇంత జరిగిన తర్వాత తుది క్షణంలో డోల్ఫస్ రాజీ ప్రయత్నాన్ని విరమించానని ప్రకటించాడు. చేసిన వాగ్దానాలకు భిన్నంగా 7వ తేదీ రాత్రి నాజీలు దౌర్జన్యాలను చేశారు గనక, తాను తన ఉద్దేశాలను మార్చుకోవలసి వచ్చిందని డోల్ఫస్ అన్నాడు. ఈ కారణం ఎంతవరకు సత్యమైందో తెలియదు గాని, వియన్నాకు ప్రయాణమై వెడుతున్న హబీష్టుకు రేడియో సందేశాన్ని పంపి, మధ్యదారిలో నుంచి హిట్లరు వెనక్కు రప్పించవలసి వచ్చింది!

ఆ పై వారంలో ఇటాలియన్ విదేశాంగశాఖ సహాయ మంత్రి సీనార్ సూనిచ్ వియన్నాకు వెళ్ళి, డోల్ఫస్ కు ఈ విధంగా సలహా చెప్పాడు : "ఒకవైపున నాజీలు, ఇంకో వైపున సోషలిస్టులు, వీరుభయులు నిన్నూ, నీ ప్రభుత్వాన్ని ప్రతిఘటిస్తున్నారు. వీ రుభయులతోనూ నీవు ఏక నీ సమయంలో పోరాడలేవు. అంచేత ఏదో ఒక పక్షాన్ని ముందుగా హతమార్చాలి. ఇది కష్ట సాధ్యమైన పని కావచ్చు. కాని, దీన్ని సాధించి తీరాలి. ఎంచేతనంటే, ముందుగా ఇలా ఒక పక్షాన్ని హతమార్చితే, ఇక మిగిలినదాన్ని ఎదుర్కోవడం అతి సులభం".

ఈ సలహా చక్కగా వున్నట్టు క్షణంలో గ్రహించి, "అయితే ముందుగా హతమార్చవలసింది ఎవరిని?" అని డాక్టరు డోల్ఫస్ అడిగాడు. "సోషలిస్టుల్ని" అని జవాబు చెప్పాడు, సీనారు సూనిచ్.

ముసోలినీ బంటు - సీనారు సూనిచ్ - సోషలిస్టుల్ని ముందుగా హతమార్చాలని అనడానికి అనేక కారణా లున్నాయి. ముసోలినీకి నాజీలంటే కోపం లేకపోలేదు. అయితే నాజీలపై కంటే కూడా సోషలిస్టుల పైన ఎక్కువ కోపం ఉంది. ఇందుకు తోడు ముఖ్యంగా ఆస్ట్రియన్ సోషలిస్టులు అంటే, అతడికి చాలా కడుపుమంట. హంగరీలోని ఫేసిస్టులకు వియన్నా గుండా రహస్యంగా ఆయుధాల్ని సరఫరా చెయ్యాలని అతడు 1933లో కాబోలు ప్రయత్నించాడు. అప్పుడు ఆస్ట్రియన్ సోషలిస్టులు ఈ విషయాన్ని బయటపెట్టారు. ఇలా ఇంకా ఎన్నో కారణాలు... కారణాలు ఏమైతే నేమి? ముసోలినీ సలహాను డోల్ఫస్ ఆమోదించాడు. ఆమోదించి, సోషలిస్టుల మీద విరుచుకుపడ్డానికి తగిన తరుణం కోసం ఎదురు చూడసాగాడు!

10

ఎందుకైనా మంచిదని అనుకున్నాడు కాబోలు, - డాక్టరు డోల్ఫస్ హంగరియన్ ప్రభుత్వం వారి ఆహ్వానాన్ని అంగీకరించి, బుడాపెస్ట్ నగరానికి వెళ్ళాడు. ఇలా అతడు ముఖం తప్పించడమేమో, హైమ్ వీరు సైనికదళం సోషల్ డిమోక్రాటిక్ పక్షం వారి మీద దౌర్జన్యాన్ని ప్రారంభించడమేమో! డాక్టరు డోల్ఫస్ తన ప్రయాణాన్ని హైమ్ వీరు దౌర్జన్యానికి సిగ్నల్'గా ఏర్పాటు చేశాడనే నాడూ నేడూ కూడా లోకం నమ్మకం.

హైమ్ వీరు సైనిక దళం వారు 1934 జనవరి 31వ తేది మొదలు ఫిబ్రవరి 6వ తేదీ వరకు టైరోల్, అప్పర్ ఆస్ట్రియా, స్టెరియా, బర్గెన్ లాండ్ రాష్ట్రాలలో గవర్నమెంటు హౌసుల మీదికి దండెత్తి వెళ్ళి, ఆరు షరతుల్ని చెప్పి, వాటికి అంగీకరించవలసిందిగా నిర్బంధించారు. వారు చెప్పిన ఆరు షరతుల్ని అంగీకరిస్తే, దాదాపుగా మిలటరీ గవర్నమెంటును అంగీకరించినట్టే!

అక్రమమైన ఈ నడవడినీ, అన్యాయమైన ఈ షరతుల్ని చూడగానే ప్రజా సముదాయంలో -ముఖ్యంగా సోషల్ డిమోక్రాటిక్ పార్టీ వారిలో కలిగిన అలజడికి అంతులేదు. తర్వాత నాలుగు రోజుల్లోను జరిగిన సంఘటనలు ఇవి :

ఫిబ్రవరి 9 : సాల్ట్ బర్గ్ రాష్ట్రంలోని హైమ్ వీరు నాయకులు గవర్నరు వద్దకు వెళ్ళి, మిలటరీ గవర్నమెంటును ప్రకటించవలసిందిగా నిర్బంధించారు. లోయరు ఆస్ట్రియా గవర్నరు స్థానికపు హైమ్ వీరు నాయకులకు - వారి షరతులు అక్రమాలనే కారణం మీద - దర్శనం ఇవ్వడానికి నిరాకరించాడు. సోషలిస్టు పార్టీని అక్రమం సంఘంగా ప్రకటించవలసిందనీ, వియన్నా సిటీహాల్ ను ఆక్రమించుకోవలసిందనీ, హైమ్ వీరు దళాధిపతులు ప్రభుత్వాన్ని నిర్బంధిస్తున్నారని తెలిసి, అలా జరిగే పక్షంలో దేశం మొత్తం మీద సమ్మె జరిపించుతామని సోషలిస్టు ప్రధాన కార్యస్థానం వారు ప్రకటించారు. డాక్టరు డోల్ఫస్ బుడాపెస్ట్ నుంచి తిరిగి వచ్చి, హైమ్ వీరు నాయకులతో సమాలోచన జరిపాడు.

ఫిబ్రవరి 10 : వైస్ ఛాన్సలర్ - అంటే హైమ్ వీరు ప్రధాన నాయకులలో ఒకడైన మేజరు ఫే - వియన్నా మేయరుకూ, ఇతర పురపాలక సంఘాధికారులకూ ప్రజాశాంతి రక్షణ విషయంలో గల అధికారాల్ని తొలగించాడు.
ఫిబ్రవరి 11 : హైమ్ వీరు దళం వారి పేరేడ్ సందర్భంలో - ఆస్ట్రియన్ యుద్ధమంత్రి సమక్షాన - ఉపన్యసిస్తూ, మేజరు ఫే ఇలా అన్నాడు : 'హెర్ డోల్ఫస్ మన పక్షాన్నే ఉన్నట్టు గడచిన రెండు రోజులలోనూ నేను నిశ్చయంగా తెలుసుకున్నాను. రేపు మనం ఆస్ట్రియాను తుడిచిపెట్ట బోతున్నాము'.

ఎంత అన్నాడో అంతా చేసి చూపించాడు మేజరు ఫే! ఫిబ్రవరి 12వ తేదీనాడు ఆస్ట్రియా అంతటిలోనూ అంతర్యుద్ధం ప్రారంభమైంది!!

11

అంతర్యుద్ధానికి 'విఘ్నేశ్వరపూజ' జరిగింది అప్పర్ ఆస్ట్రియా రాష్ట్రానికి ముఖ్యపట్టణమైన లింజ్ లో. అక్కడి హైమ్ వీర్ సైనికులు స్థానిక సోషలిస్టు కార్యస్థానాన్ని ఆక్రమించుకోబోయారు. ఈ ప్రయత్నాన్ని సోషలిస్టులు ప్రతిఘటించారు. దానితో యుద్ధం ప్రారంభమైంది.
లింజ్ నగరము నుంచి యుద్ధవార్తలు రాగానే, వియన్నాలో కూడా సంఘర్షణ ప్రారంభమైంది.

వియన్నా తర్వాత, ఇతర రాష్ట్రాలకు కూడా ఈ అంతర్యుద్ధ జ్వాలలు అలుముకున్నాయి. ఇలా దేశాన్ని అంతటినీ చుట్టుముట్టిన ఈ జ్వాలలు అయిదారు రోజుల తర్వాత ప్రజారుధిరంలో చల్లారిపోయాయి!

హైమ్ వీరు నాయకులు (పన్నుగడ పన్ని) ప్రారంభించిన ఈ అంతర్యుద్ధ కారణంగా ఒక్క వియన్నా నగరంలోనే దాదాపు వెయ్యిమంది వీరిలో అనేకులు స్త్రీలూ, శిశువులూ! హతులైనారు. తొమ్మిదిమంది సోషలిస్టు నాయకులు - తీవ్రంగా గాయపడి, "స్ట్రెచర్" మీద ఆసుపత్రికి వెడుతున్న వ్యక్తిని కూడా కలుపుకొని తొమ్మిదిమంది ఉరికంబానికి బలి

అయిపోయారు. తుపాకి గుళ్ళ తాకిడికి కారల్ మార్క్స్ హోఫ్, గెటీహోఫ్ ఇవి రెండూ వియన్నా పురపాలక సంఘం నిర్మించిన కార్మిక భవనాలు - ముక్క చెక్కలై పోయాయి. ఇంత జరిగిన తర్వాత వియన్నాలో శాంతి ఏర్పడింది. అయితే ఇది సుభిక్షంగానూ, సుఖప్రదంగానూ ఉన్న నగరంలో ఉండే శాంతి కాదు. శ్మశాన వాటికలో ఉండే శాంతి!!

ఇక ఈ అంతర్యుద్ధం తర్వాత డాక్టరు డోల్ఫస్ కూ, హైమ్ వీర్ కూ దక్కిన లూటీ ఇంతింత కాదు. వియన్నాలో దాదాపు మూడువంతుల నివేశన స్థలం ఆ నగరంలోని సోషలిస్టు మునిసిపాలిటీ వారిది. వారికింద పనిచేస్తున్న వారి సంఖ్య - యాభై నాలుగువేలు. 1923 నుంచి 1929 వరకు కార్మికులకు గృహ వసతులు మొదలైన వాటిని కల్పించడానికి వారు దాదాపు రెండు కోట్ల ఇరవై లక్షల పౌనుల్ని వెచ్చించారు. మునిసిపల్ సేవింగ్స్ బ్యాంకులలో వారి పేర నిలవ వున్న మొత్తం, - ఒక కోటి నలభై లక్షల పౌనులు, శిస్తుల రూపంగా సగటున సాలుకు వారికి వచ్చే ఆదాయం, యాభై లక్షల పౌనులు.

ఇంతేకాదు, మునిసిపల్ గ్యాస్ వర్క్సు, పవరు హౌస్, ట్రాములు, ఆమ్ని బస్సులు, ట్యూబ్ రైళ్ళు, మాంసం మార్కెట్లు, ఒక సిమెటెరీ (శ్మశానం), ఒక బ్రూయెరీ (సారా ఫ్యాక్టరీ), ఒక బేకరీ (రొట్టెల దుకాణం), ఒక పెద్ద డిపార్టుమెంట్ స్టోరు (అన్ని వస్తువుల్ని అమ్మే షాపు) - ఇవి అన్నీ వియన్నా సోషలిస్టు మునిసిపాలిటీ వారి ఆస్తులే! ఇవి అన్నీ కూడా అంతర్యుద్ధం తర్వాత - ప్రభుత్వ వశమైపోయినవి. వేలకొలది ప్రజలు బందీలైనారు; వేలకొలది ఉద్యోగ భ్రష్టులైనారు. మొత్తంమీద అంతర్యుద్ధ కారణంగా ప్రజాస్వామ్యానికి కలిగిన కష్టనష్టాలకు మితిలేదు.

12

దేశంలో బల మున్నది. చేతినిండా ధన మున్నది. అవసరమైతే అసువుల్ని సయితం అర్పణ చేసే అనుచర వర్గమున్నది. అయితే ఈ బలానికి, ఈ ధనానికి; ఈ అనుచర వర్గానికి తగిన నాయకులే లేరు. అంచేతనే ఆస్ట్రియన్ సోషల్ డిమోక్రాటిక్ పార్టీ అంతర్యుద్ధంలో అతి సులభంగా పరాజయాన్ని పొందింది. అన్నట్టు అది కేవలం పరాజయం మాత్రమే కాదు - సర్వవినాశనం!

ఆస్ట్రియన్ సోషల్ డిమోక్రసీ నాయకులలో ఓటో బవరు అగ్రగణ్యుడు. ఆయన యూదు జాతికి చెందినవాడు. వయస్సు - అంతర్యుద్ధం నాటికి - యాభై అయిదు సంవత్సరాలు. అన్ని విధాల ఆయన పెద్దమనిషి.

ఎంత పెద్దమనిషో అంత తెలివితేటలు గలవాడు కూడా! అయితే, ఆయన తెలివితేటలు సిద్ధాంతాన్ని ప్రతిపాదించడంలోనే! ప్రతికక్షల వాదాన్ని ఖండించ వలసివస్తే, ఆయన బుద్ధి ఎంతైనా నిశితంగా ఉంటుంది. ఇక, రాజకీయ రంగంలో తలవని తలంపుగా ఏర్పడే క్లిష్ట పరిస్థితుల్ని ఎదుర్కొనవలసి వస్తే, ఏమి చెయ్యాలో ఆయనక తోచదు. అలాంటి సందర్భాలలో "ఇంతకంటే బుద్ధిహీనుడు ఉంటాడా?" అన్నట్టుగా ఆయన ప్రవర్తిస్తాడు. ఇంతేగాక; మానవ స్వభావాన్ని అర్థం చేసుకునే శక్తి కూడా ఆయనకు బొత్తిగా లేదు. 'రైష్ పోస్టు" ఎడిటరు అయిన సైపెల్ గొప్ప మేధావి అని ఓటో బవర్ అభిప్రాయం. సైపెల్ తో వివిధ సిద్ధాంతాల్ని గురించి ఖండన మండనల్ని జరపడమంటే ఆయనకు చాలా సరదా! ఇక, ఆయన దృష్టిలో డోల్ఫస్ వట్టి మూర్ఖుడు. డోల్ఫస్ మరి ఏమైనా కావచ్చునేమో గాని, మూర్ఖుడు మాత్రం కాదు. దీన్నిబట్టే ఓటో బవరు మానవ స్వభావాన్ని ఎంతగా అపార్థం చేసుకుంటాడో తెలుస్తున్నది! ఒకప్పుడు ఓటోబవరు బహిరంగ సభలో డోల్ఫును "స్కొంట్రోల్" (దొంగ) అని అన్నాడు. ఈ మాటను డోల్ఫస్ మరిచిపోనూ లేదు; దీన్ని అన్న వ్యక్తిని క్షమించనూ లేదు. ఇంకొకరైతే, ఓటోబవరును సోషల్ డిమోక్రాటిక్ పార్టీ నాయకత్వం నుంచి తొలగించడంతో

సంతృప్తి పడేవారే. కాని, ఓటోబవరుకు తన నాయకత్వం కంటే తన పార్టీయే ప్రధానమని డోల్ఫుస్ కు తెలుసు. అంచేత పార్టీని, పార్టీతో పాటు దాని నాయకుణ్ణి తన ప్రతిహింసకు బలి పెట్టాలని అతడు నిశ్చయించాడు.

నాయకత్వంలోని లోపాలకు అసలు సోషల్ డిమోక్రసీ సిద్ధాంతంలోనే ఉన్న లోపాలు కూడా తోడై, ఆ పార్టీకి పతనాన్ని తెచ్చి పెట్టినవి. ప్రపంచంలో ఒక వైపున ఫేసిజం, ఇంకో వైపున కమ్యూనిజం భీషణంగా సంఘర్షిస్తూ వుంటే, సోషల్ డిమోక్రసీ మధ్య నిలవగలదా? అవి రెండూ తీవ్రవాదాలు; ఇది మితవాదం. అవి రెండూ శక్తిమంతమైనవి; ఇది నీరసమైంది. అవి రెండూ కాలానుగుణ్యమైనవి; ఇది తన కాలాన్ని మించి బ్రతికింది. మోటార్లు, విమానాలు వచ్చిన ఈ కాలంలో గుర్రపుబళ్ళు, ఒంటెద్దు బళ్ళు ఎలా కనబడుతున్నవో, 1934లో ఆస్ట్రియన్ సోషల్ డిజాసీ కూడా అలాగే కనబడింది. సోషల్ డిమోక్రాటిక్ పార్టీవారు పనిపాటలు లేక, ఆకలి దప్పులకు లోనై, మన కష్టాలు ఈడేరాలంటే, రాజ్యాధికారాన్ని వశపరచుకోవలసిందే అని కృతనిశ్చయులైన కార్మికులూ కాదు; కార్మికులను తొక్కిపట్టి తామే పరిపాలన సాగిస్తూ ఉండాలని దౌర్జాన్యానికి దిగుతున్న క్యాపిటలిస్టులూ కాదు. ఇక వా రెవరంటే - క్యాపిటలిష్టులకు సేవ చేస్తున్నవారు. కడుపునిండా కూడు తెచ్చుకుంటున్నావారు. అంచేత వారి వైఖరిలో తీవ్రత ఉండదు; వారి హృదయంలో విప్లవాగ్ని ఉండదు. వారు కోరేది సంస్కరణం. వారికి కావలసింది సౌకర్యాలు. ఆస్ట్రియన్ సోషల్ డిమోక్రాటిక్ పార్టీవారు - ముఖ్యంగా వియన్నా నగరంలో - కొంత సంస్కరణ చెయ్యగలిగారు; కొన్ని సౌకర్యాలు పొందగలిగారు. అంచేత వారిలో ఒక విధమైన సంతృప్తి ప్రబలింది. దీనితో అంతకు పూర్వమున్న స్వల్ప విప్లవోత్సాహం కూడా చచ్చింది. ఇదే వారి పతనానికి వారి సర్వ వినాశనానికి కారణమైంది.

ఆస్ట్రియన్ సోషల్ డిమోక్రాటిక్ పార్టీవారి పతనాన్ని గురించి జాన్ గంథరు ఇలా వ్రాశాడు : 'ఆస్ట్రియాలో సోషలిజం రూపు మాసిపోవడానికి దాని సౌమ్యతే కారణం. ఆస్ట్రియన్ సోషలిస్టులకు రక్తపాతం అంటేనూ, దౌర్జన్యం అంటేనూ పరమాసహ్యం. తమ శత్రువులు కర్కశత్వం ప్రదర్శిస్తారనిగాని, నమ్మకద్రోహం చేస్తారనిగాని వారు అనుకోలేదు. తాము స్వయంగా అసత్యమూ, అన్యాయవర్తనమూ ఎరగని వారు గనుక, తమ ప్రతికక్షులు ఆడిన అబద్ధాలను పసిపాపలలా నమ్మారు'.

ఇక, ఫ్రాన్సిస్ గంథరు - ఈమె జాన్ గంథరు భార్య - ఇలా వ్రాసింది : 'ఆస్ట్రియన్ సోషలిస్టుల పతనానికి లోపభూయిష్టమైన వారి సిద్ధాంతాలే కారణం. తాము సోషలిస్టులు కావడం చేత కార్మికుల డిక్టేటరుషిప్ ను స్థాపించవలసిందేనని వారి నమ్మకం. అయితే తాము డిమోక్రాట్స్ కూడా కావడం చేత, మెజారిటీ పార్టీ పరిపాలనకు భిన్నం జరగకూడదని కూడా వారి నమ్మకం. పరస్పర విరుద్ధాలైన ఈ రెండు నమ్మకాలే వారికి వినాశనాన్ని తెచ్చాయి. భోగాల విషయం లోనేగాని, జీవితావశ్యకాల విషయమై వారు శ్రద్ధ చూపలేదు. ఆస్టియన్ పరిశ్రమలకు కీలకమైన 'ఆల్ పైన్ మాన్ గెసెల్ షాఫ్ట్'ను చేజిక్కించుకోడానికి 1919లోనే వారికి అవకాశం కనబడింది. ఈ అవకాశాన్ని వారు ఉపయోగించుకోలేదు. ఇందుకు బదులు వియన్నా నగరంలో సుందరమైన సరోవరాల్నీ ఉద్యాన వనాల్నీ సంపాయించుకోవడంతో వారు సంతృప్తి పడ్డారు... సోషలిస్టు లైనందుకు వారు ఆయుధధారులైనారు గాని, డిమోక్రాట్స్ కూడా అయినందువల్ల తమ ప్రతికక్షుల చేతులలోని ఆయుధాల్ని ఊడబెరకలేక పోయారు.

డోల్ఫుస్ తన డిక్టేటరుషిప్ ను స్థాపించిన కొత్తలో సోషల్ డిమోక్రాటిక్ పార్టీ నాయకులు దేశం మొత్తం మీద సమ్మె జరిపించినట్టయితే, అతడి పీడ వదిలిపోయేదే! అయితే, అది అవసరమనే దూరదృష్టిగాని, దాన్ని జరిపించగల సాహసంగాని వారికి లేకపోయింది. "పార్లమెంట్ స్టీరింగ్ కమిటీని రద్దు చెయ్యకుండా ఉంటే, రెండు సంవత్సరాల వరకు నిన్ను డిక్టేటరుగా ఉండనిస్తాము" అని వారు బేరానికి దిగారు. డోల్ఫుస్ ఇందుకు అంగీకరించలేదు. పోనీ, అప్పుడైనా వారు సమ్మె ప్రయత్నం చేశారా? అబ్బే, లేదు! "మా షుక్త బండ్ చేత మేము అస్త్రసన్యాసం చేయిస్తాము.

గవర్నమెంటువారు తమ హైమ్ వీర్ చేత అదేపని చేయిస్తారా? అని తిరిగి బేరాలు సాగించారు. ఈ బేరాలు జరిపింది ఒకసారీ, రెండుసార్లు కాదు, - పదిహేనుసార్లు! డోల్ఫస్ ఇందుకు "ఔ"ననీ, "కా"దనీ చెప్పకుండా చల్లగా ఊరుకున్నాడు. తర్వాత నాలుగు సందర్భాలను ఏకరువు పెట్టి, ఈ నాలుగు సందర్భాలలోను మేము సమ్మె జరపవలసి వస్తుంది అని ప్రకటించారు. ఆ సందర్భాలు ఇవి :

1) ఆస్ట్రియాలో ఫసిస్టు రాజ్యాంగ విధానాన్ని ప్రవేశ పెట్టినపుడు.
2) వియన్నా మునిసిపాలిటీకి గవర్నమెంట్ కమీషనర్‌ను నియమించినప్పుడు.
3) సోషల్ డిమోక్రాటిక్ పార్టీని నిషేధించినపుడు.
4) ట్రేడ్ యూనియన్లు (కార్మిక సంఘాలు)

చట్ట విరుద్ధమైనవని ప్రకటించినపుడు. సమ్మె జరిగే ఈ నాలుగు సందర్భాలను తెలుసుకున్నప్పుడు డోల్ఫస్ చంకలు ఎగరవేశాడు. ఎంచేతనంటే, ఈ నాలుగు సందర్భాలను ఏర్పడ నియ్యనంతవరకు అతడు కోరిన ఆటను ఆడవచ్చునుగదా!

తాము చేసిన ఈ తప్పిదాన్ని ఓటో బవర్ చివరికి స్వయంగా అంగీకరించాడు. "ఆస్ట్రియన్ డిమొసీ పతనం" (Austrian Democracy Under Fire) అనే తన గ్రంథంలో ఆయన ఇలా వ్రాశాడు :

1933 మార్చి 15వ తేదీనాడు మేము దేశం మొత్తం మీద సమ్మెను సాగించవలసింది. జయప్రదంగా సమ్మెను సాగించడానికి ఆనాడు పరిస్థితులు అనుకూలంగా ఉన్నట్టు మరెన్నడూ లేవు. సరిగా అప్పటికి పరిపక్వ స్థితికి వస్తున్న నాజీ విప్లవం ఆస్ట్రియన్ ప్రజా బాహుళ్యాన్ని ఉత్తేజితుల్ని చేసింది. ఎప్పుడు పిలుపు వస్తుందా, ఎప్పుడు రంగంలోకి దూకుదామా అని కార్మికులందరు కనిపెట్టుకుని ఉన్నారు. ఆ తర్వాత పదకొండు మాసాలకు జరిగినట్టు అప్పటికి రైల్వే కూలీలు దెబ్బతిని ఉండలేదు. 1934 ఫిబ్రవరిలో ఉన్న బలం అప్పటికి గవర్నమెంటు వారి సైనికదళానికి లేదుకూడా. అప్పటిలో అయితే మేము జయించేవార మేమో!

"కాని సంఘర్షణ అంటేనే మాకు భయం అనిపించింది. రాయబారాల వల్ల శాంతియుతంగా పరిష్కారం జరగుతుందని మేము అప్పటికి ఇంకా నమ్ముతూనే యున్నాము. త్వరలోనే మీతో రాయబారాల్ని నడుపుతానని డోల్ఫస్ మాకు వాగ్దానం చేశాడు... అప్పటి మా బుద్ధిహీనత కొద్దీ మేము డోల్ఫస్ వాగ్దానాన్ని నమ్మాము. ఘోరమైన అంతర్యుద్ధ కారణంగా దేశంలో రక్తపాతం జరగనివ్వరా దనే తలంపుతో మేము సమ్మెను వాయిదా వేశాము. కాని పదకొండు మాసాల తర్వాత అంతర్యుద్ధం రాక తప్పలేదు. పైగా, అది వచ్చిన నాటికి పరిస్థితులు మాకు ఎంతో తక్కువ అనుకూలంగా ఉన్నాయి. అది పొరపాటు మేము చేసిన అన్నింటిలోనూ అతి ఘోరమైన పొరపాటు". -

ఔను! ఇది అతి ఘోరమైన పొరపాటే! ఈ పొరపాటు ఫలితం, - ఆస్ట్రియన్ సోషల్ డిమోక్రసీ సమూల వినాశనం!

13

"ఓటోబవర్, బోల్షివిక్కుల ఏజంటు. విప్లవాన్ని చెయ్యడానికి అతడు కుట్రచేస్తున్నాడు. ఈ రహస్యాన్ని కనిపెట్టి, మేము అతడి కుట్ర ప్రయత్నాన్ని భగ్నం చేశాము' దారుణ దౌర్జన్యానికి దిగి, సోషల్ డిమోక్రాటిక్ పార్టీని రూపుమాపిన తర్వాత డోల్ఫస్ చేసిన ప్రకటన సారాంశం ఇది. డోల్ఫస్ చేసిన ప్రకటన ప్రకారం బోల్షివిక్కుల ఏజెంట్ అయిన ఓటో బవర్ తెల్లవారితే అంతర్యుద్ధం ప్రారంభమౌతుందనగా ఆ రాత్రి - ఫిబ్రవరి 11 రాత్రి - చేస్తున్న. కుట్ర ప్రయత్నం ఏమంటే, - భార్యనూ, ఇద్దరు స్నేహితుల్నీ వెంట పెట్టుకుని సినిమాకు వెళ్ళి 'గ్రాండ్ హోటల్'లో గ్రెతాగార్బోను చూద్దం! సినిమా

నుంచి ఇంటికి తిరిగి వచ్చేసరికి లింజ్ లోని షుక్త బండ్ నాయకుని వద్ద నుంచి ఆయనకు 'రేపు ఉదయం హైమ్ వీర్ దుండగళ్ళు మా కార్యాలయం మీద దండెత్తుతారని తెలుస్తున్నది. వారు నిజంగా దండెత్తితే, మేము వారిని ప్రతిఘటిస్తాము' అని కబురు వచ్చింది. ఈ కబురు తెలిసే సరికి ఓటో బవర్ చాలా ఆందోళనపడిపోయి, త్వరపడవద్దంటూ ఇలా టెలిగ్రాం పంపించాడు. “అత్తయ్య క్షేమం ఇద్దరు డాక్టర్లతోపాటు మామ ఓ టోకూడా ప్రస్తుతం ఏమీ చెయ్యకూడదని అభిప్రాయపడుతున్నారు." ఈ టెలిగ్రాం సకాలంలో అందినప్పటికీ, లింజ్ లోని షుక్త బండ్ నాయకుడు దీన్ని లక్ష్యపెట్టక మర్నాటి ఉదయం తమ కార్యాలయంమీద జరిగినదాడిని ప్రతిఘటించాడు.

లింజ్ లో పోరాటం ప్రారంభమైన సంగతి ఉదయం ఎనిమిది గంటలకు ఓటోబవరకు తెలిసింది. వెంటనే ఆయన ట్రేడ్ యూనియన్ ఎగ్జిక్యూటివ్ కమిటీనీ, సోషల్ డిమోక్రాటిక్ పార్టీని సమావేశపరిచాడు. ఈ సమావేశంలో దేశం మొత్తంమీద సమ్మె జరిపించాలనే తీర్మానం ఒక్క వోటు మెజారిటీతో నెగ్గింది. ఒక వైపున ఈ సమావేశం జరుగుతూ ఉండగానే, ఇంకోవైపున ఎలక్ట్రిక్కల్ యూనియన్ కార్మికులు - లింజ్ నుంచి వచ్చిన వార్తల్ని విని, కోపావేశులై తమంతట తాముగా సమ్మెను ప్రారంభించారు. అంచేత తీరా సమ్మె తీర్మానం జరిగిన తర్వాత, దాన్ని అచ్చు వెయ్యాలంటే ఎలక్ట్రిక్ పవర్ లేకపోయింది. ప్రెస్ పని చెయ్యలేదు. పార్టీ నుంచి ఆదేశం రాకమునుపే ఎలక్ట్రిక్ యూనియన్ కార్మికులు సమ్మె జరపడంవల్ల, సమ్మె తీర్మానాన్ని ప్రకటించడానికి వీలు లేకపోయింది! ఈ అవక తవక పనివల్ల కలిగిన నష్టం ఎంతో చెప్పడానికి వీలులేదు!!

సమ్మె సాయంత్రం అయిదుగంటలకు ప్రారంభం కావాలని తీర్మానంలో ఉన్నదట! దీని ఉద్దేశం ప్రభుత్వాన్ని బెదిరించడమట! తీర్మానం ఉద్దేశం ఏమైనా, అసలు జరిగింది ఏమంటే, ప్రభుత్వానికి తగిన జాగ్రత్తల్ని పడ్డానికి ఏడుగంటల వ్యవధి చిక్కింది. దీని తర్వాత కూడా అన్నీ అవకతవకలే! అంతా తెలివితక్కువే!

సోషలిష్టులలో ప్రముఖులైన వారందరు డోల్ఫస్ దగ్గరికి డిప్యుటేషన్ వెళ్ళారు. ఈ అవకాశాన్ని డోల్ఫస్ లాంటివాడు వృథాగా పోనిస్తాడా? అతడు వారినందరిని ఒక్కసారిగా అరెస్టు చేయించాడు. పోతే, పార్టీకి ఆర్డర్లను ఇవ్వడానికి ఒక్క ఓటోబవర్ మిగిలాడు. ఆయనకూడా డిప్యుటేషన్లో చేరవలసిందేగాని; డోల్ఫస్ అంటే తన కున్న విద్వేషం వల్ల ఆ పని జరగలేదు. కనీసం ఆయనైనా బయట మిగలడం కొంతమేలే గాని, ఒక్కడు ఏమి చేయగలడు? సరిగా సాయంత్రం అయిదు గంటలకు దేశంలోని రైళ్ళు అన్నీ కూడా ఆగిపోవలసింది. కాని, సమ్మె తీర్మానం జరిగిన సంగతి తెలియకపోవడం వల్ల రైళ్ళు అన్నీ కూడా యథాప్రకారం నడిచాయి. ఇతర ప్రాంతాలకు సమ్మె సంగతి తెలియబరచడానికి వార్తావహుల్ని పంపించారు. కాని, వారిని డోల్ఫస్ దారిలోనే అరెస్టు చేయించాడు. యుద్ధం చేస్తున్నవారికీ, యుద్ధాన్ని నడపవలసి వారికీ సంబంధాన్ని కూర్చడానికి. ఒక కమిటీని ఏర్పాటు చేశారు. అయితే, సమావేశ స్థలాన్ని గురించి పొరపాటు జరగడం వల్ల ఈ కమిటీ అసలు సమావేశం కానేలేదు!

ఇక యుద్ధాన్ని గురించి చెప్పనబర్నే లేదు. అది యుద్ధం కాదు, - ఊచకోత! “డిసిప్లిన్" పేరు చెప్పి ఓటోబవర్ పార్టీని మృతప్రాయం చేశాడు. అంచేత తిరగబడి యుద్ధానికి వెళ్ళాలని ఆతురతపడుతున్న యువకులు కూడా పైనుంచి ఆర్డర్లు రాలేదనే కారణం చేత సోమ, మంగళ వారాలు ఉత్తినే ఊరుకున్నారు. కాని, అసలు ఆర్డర్లు రానేలేదు. చివరికి మరి లాభం లేదని ఎవరికి వారు తుపాకిని చేతబట్టారు. దీని పర్యవసానం వేరే చెప్పాలా? తుపాకి పట్టిన ప్రతి యువకుడు హైమ్ వీరు దళం వారి క్రౌర్యానికి బలి అయ్యాడు. అసలు ఫిబ్రవరి 3వ తేదీనాటికే గవర్నమెంటు వారు - షుక్త బండ్ దళంలోని ద్రోహులు ఇచ్చిన భోగట్టాను బట్టి - షుక్త బండ్ నాయకులలో ముఖ్యమైన వారిని అరెస్టు చేశారు. అంచేత చాలామంది కార్మికులకు తమ పక్షంవారు ఆయుధాలను దాచిన స్థలం ఏదో కూడా తెలియలేదు. రహస్య ఆయుధగారా లున్న ప్రదేశం ఏ కొద్దిమందికి మాత్రమే తెలుసు. ఈ కొద్దిమందీ బందీలైపోయారు. అంచేత సోమ, మంగళవారాలు రెండు రోజులు

కూడా అనేకమంది కార్మికులు తమ భవనాల ఆవరణలను విపరీతంగా వెదకడం, ఎంత వెదికినా ఆయుధాలు కనబడకపోవడం జరిగింది.
షుట్ప్ బండ్ దళాలలో ఒకదానికి ఒక తుపాకి కూడా లేకపోయింది. ఇందకు కారణం ఆయుధాలు లేకపోవడమా? కాదు, మరి ఆయుధాలు ఎక్కడ వున్నవో తెలియకపోవడమా? ఇదీ కాదు. దళాధిపతి అరెస్టులో ఉన్నప్పటికీ, అతని తరువాత వాడికి ఆయుధాలున్న చోటు తెలుసు. అయితే, దళాధిపతి దగ్గరి నుంచి ఆర్డరు రానిదే ఆయుధాలున్నచోటును బయట పెట్టడానికి వీలులేదని అతడన్నాడట! ఆ మూర్ఖుడు అరెస్టులోవున్న దళాధిపతి ఆర్డరు ఎలా పంపుతాడని అనుకున్నాడో తెలియదు! తక్కిన దళాధిపతులు కూడా దాదాపు ఇంత మూర్ఖత్వాన్ని చూపారు! ఒక దళాధిపతి తా నున్న చోటి నుంచి ఒక పోలీసుదళాన్ని అతి తేలికగా "మెషిన్ గన్" చెయ్యగలిగేవాడట! కాని, సోషలిస్టు లెవ్వరు ప్రతికక్షులు ముందు తమ మీద కాల్చనిదే తాము కాల్చగూడదనే ఉత్తరువు ఉన్నందువల్ల పోలీసువారు తనమీద ఎప్పుడు కాలుస్తారా అని కనిపెట్టుకు కూర్చున్నాడట. ఈ వ్యవధిలో పోలీసువారు చక్కని మరుగు చూచుకున్నారట! ఓటోబవరు అమలులో పెట్టిన "డిసిప్లిన్" ఫలితమే ఇదంతా!

సోషల్ డిమోక్రాటిక్ పార్టీవారు ఎంత మౌఢ్యంగా ప్రవర్తించారో, డోల్ఫుస్ అంత బుద్ధి సూక్ష్మతను ప్రకటించాడు. కార్మికుల భవనాలకున్న టెలిఫోన్ తీగల్ని అతడు తెగగొట్టించాడు. అంచేత ఎవరు ఇంకా పోరాడుతున్నారో, ఎవరు శరణా గతులైనారో కార్మికులకు తెలియలేదు.

ఇందుకు తోడు గవర్నమెంటు వారు రేడియో ద్వారా అంతూపంతూ లేని అసత్య ప్రచారాన్ని సాగించారు. ఈ ప్రచార సందర్భంలో ఓటోబవర్ ట్రేడ్ యూనియన్ల డబ్బు ఎత్తుకు పారిపోయాడని ప్రకటించడానికి కూడా వారు సంకోచించలేదు!

సోషల్ డిమోక్రాటిక్ పార్టీ నాయకత్వాన్ని గురించి ఎన్ని లోపాలనైనా చూపించ వచ్చును గాని, పార్టీ సభ్యుల్ని గురించి నెపం ఎన్నడానికైనా వీలు లేదు. మెషిన్ గన్సు, ఆర్మర్డ్ కార్సు, ఫీల్డ్ ఆర్టిలరీ, ఈ ఆయుధ సంపత్తి అంతావున్న పందొమ్మిది వేల సైనికులు, వట్టి తుపాకులతోనూ అనేక సందర్భాలలో ఆ తుపాకులు సయితం లేకుండానూ పోరాడుతున్న షుమారు అయిదు వేల షుక్త బందర్సును లొంగదియ్యడానికి నాలుగు రోజులు పట్టింది! విజయం పొందగలమనే ఆశ రవ్వంతకూడా లేకపోయినా, ఆ అయిదు వేలమంది నిరుపమానమైన ధైర్య సైర్యాలను ప్రదర్శించారు.
వియన్నా కార్మికులు ఈ అంతర్యుద్ధంలో చూపిన వీరత్వాన్ని కార్మిక ప్రపంచం ఎన్నటికీ విస్మరించలేదు!

14

సోషల్ డిమోక్రాట్స్ ను చిత్రవధ చేసిన తర్వాత - వారి రక్తం చేత సిక్తమైన హస్తాలతో - డాక్టరు డోల్ఫుస్ "కార్పొరేటివ్ " రాజ్యాంగ విధానాన్ని ప్రవేశపెట్టాడు. ఈ నూతన రాజ్యాంగ విధానాన్ని చూచినవారికి పందొమ్మిదో శతాబ్దిలో మాదిరిగానే తిరిగి ఇరవయ్యో శతాబ్దిలో కూడా ఆస్ట్రియా నిరంకుశత్వానికీ, మత మౌఢ్యానికి కేంద్రం అవుతుందా అని అనుమానం తోచసాగింది. నూతన రాజ్యాంగ విధానం ప్రజా ప్రాతినిధ్యానికి తావులేకుండా చేసింది. హాప్సుబర్గ్ రాజులకు అవసరమైతే తిరిగి పట్టం కట్టడానికి సందు ఏర్పరిచింది. పాత పార్లమెంటును రద్దు చేసి 'గిల్డు' (వృత్తినిబట్టి ఏర్పడే సంఘాలు) ద్వారా ఎన్నికలు జరిగే పద్ధతిని కొత్త పార్లమెంటును సమావేశ పరిచింది.

నూతన రాజ్యాంగ విధానాన్ని ప్రవేశ పెట్టడంలో డోల్ఫస్ కుగాని, ఆస్ట్రియాకుగాని చిక్కులు తీరలేదు. సరిగదా, అవి మరింత ఎక్కువైనాయి. డోల్ఫసను తప్పించి తానే ఆస్ట్రియాకు ఛాన్సలర్ కావాలని స్టార్ హెమ్ బర్గ యత్నించసాగాడు. స్టార్ హెంబర్గ్ ను తోసివేసి, తానే హైమ్ వీర్ నాయకుడు కావాలని మేజర్ ఫే కుట్ర చెయ్యసాగాడు. వారి దురాశలు, వారి ద్వేషాలు పోనీ ఇంతటితో ఆగినవా? లేదు. హైమ్ వీర్ అంతకంతకు బలపడుతున్నదనీ, ఇందువల్ల తనకు ప్రమాదం తప్పదనీ డోల్ఫస్ ఇంకొక ప్రయివేటు సైన్యం అభివృద్ధికి సహాయపడ నారంభించాడు. ఈ సైన్యం పేరు ఫ్రమ్సు ఛారెన్. దీని నాయకుడు - న్యాయశాఖా మంత్రి డాక్టరు షూష్నిగ్. కాథోలిక్ మతాభిమానంలో షూష్నిగ్ డోల్ఫస్ కు మిన్న. పైగా ఆస్ట్రియా చిక్కులు తీరాలంటే, హార్స్బ రాజవంశ పరిపాలనను పునరుద్ధరించాలని అతడు గట్టిగా నమ్మేవాడు కూడా! షూష్నిగ్ స్థాపించిన శ్రీమ్సు ఛారెన్ సైన్యం అభివృద్ధికి డాక్టరు డోల్ఫస్ తోడ్పడాన్ని చూచి, హైమ్ వీర్ వారు నాజీలతో ఏకం కావడానికి ఎత్తులు వేయసాగారు. ప్రభుత్వ పక్షంలో పుట్టిన ఈ పుండు మీద వాలి, చీము నెత్తురుల్ని పీల్చుకుంటూ, నాజీ ఈగలు బాగా బలిసిపోసాగాయి.

సోషల్ డిమోక్రాటిక్ పార్టీని రూపుమాపడం వల్ల ప్రయోజనాన్ని పొందింది డోల్ఫస్ కాదు, నాజీ పార్టీ. 'ముందు సోషల్ డిమోక్రాట్సును హతమార్చేయ్. ఆ తర్వాత నాజీల మీద దండెత్తవచ్చు' అని ముసోలినీ సలహా చెప్పాడు. డోల్ఫస్ ఈ సలహాను అంగీకరించాడు. అయితే, సోషల్ డిమోక్రాటిక్ పార్టీ వినాశనంతో ప్రజాస్వామిక సిద్ధాంతం భగ్నమై పోయింది; ప్రజాశక్తి గంగ కలిసిపోయింది. ఇందుమూలంగా నాజీలకు కలిగిన లాభం ఇంతంత కాదు. ఆస్ట్రియాలో నాజీజం తల యెత్తాలంటే, ముందుగా సోషలిస్టు డిమోక్రాటిక్ పార్టీని హతమార్చవలసి ఉండేది. ఆ పనిని నాజీలు చెయ్యవలసిన అగత్యం లేకుండా, డోల్ఫస్ చేసి వేశాడు. అందువల్ల శ్రమ ఏమీ లేకుండా నాజీలకు కొండంత బలం వచ్చింది.

డోల్ఫస్ అవివేకం వల్ల - అతడి అదూరదృష్టి వల్ల - తమకు చేకూరిన ఈ బలాన్ని చూచుకొని, ఇక తాము పూర్తిగా విజృంభించవచ్చునని నాజీలు నిశ్చయించుకొన్నారు. ఇంతేకాదు. తాము విజృంభించడంలో ఏమాత్రం ఆలస్యం జరగగూడదని కూడా వారనుకున్నారు. త్వరలో ముసోలినీ వద్దకు ఇంకొకసారి వెళ్లి రావాలని డోల్ఫస్ అనుకుంటున్నాడు. ఈ యాత్ర తర్వాత పరిస్థితులు తమకు ప్రతికూలం కావచ్చును. పైగా, నిన్న మొన్ననే తమకు ఘోరాన్యాయం జరిగి ఉండడం వల్ల సోషలిస్టులు డోల్ఫస్ మీద కోపావేశులై ఉన్నారు. ఈ కోపం చల్లారితే, వారు - నాజీజం పట్ల తమకున్న బద్ధవైరాన్ని పురస్కరించుకొని - డోల్ఫస్ కు సహాయపడవచ్చును. అంచేత ఆలస్యం విషప్రాయ మౌతుంది. త్వరపడాలి, డోల్ఫసను హతమార్చాలి. ఈ ఆలోచనలతో ప్రేరితులై నాజీలు తిరిగి దౌర్జన్యానికీ, దుండగాలకూ పూనుకున్నారు.

నాజీలు చెలరేగడాన్ని చూచి, డోల్ఫస్ చాలా ఆందోళన పడ్డాడు. "ఈసారి దౌర్జన్యం జరిపిన వాడిని ఉరివేస్తాను" అని అనేకసార్లు బెదిరించాడుగాని, ఒక్క నాజీని కూడా ఉరితియ్యడానికి అతడు సాహసించలేక పోయాడు. ఇందుకు కారణాలు ఇవి : 1) నాజీలు ప్రతిహింసకు పూనుకుంటారేమోనని అతడు భయపడ్డాడు; 2) అతడి ఉద్యోగులే అతడికి ద్రోహం చెయ్యసాగారు; 3) నాజీ దుండగళ్ళను మరణశిక్ష ద్వారా వీరుల్ని చెయ్యడం కూడని పనిగా అతడికి తోచింది; 4) ఎప్పటికైనా సరే జర్మనీతో రాజీకి రావడానికి సందు ఉంచుకోవడం మంచిదని అతడు భావించాడు.

నాజీ దుండగీళ్ళను ఉరి తియ్యడానికి ధైర్యం చాలలేదు గనక, వారిని కొంచెం భయపెట్టడానికి ఒక సోషలిష్టును ఉరి తియ్య గూడదా అని డోల్ఫసకు తోచినట్టుంది. ఇలా అనడం ఎంచేతనంటే, పోలీసువాడి నొకడిని గాయపరిచాడనే నేరానికి జోసెఫ్ గెర్ల్ అనే సోషలిస్టు యువకుడిని అతడు 1934 జులై 24వ తేదీనాడు ఉరితీశాడు. ఇలా ఉరితీసిన ఇరవై నాలుగు గంటలలో తానే నాజీల చేతులలో హత్య అయ్యాడు!

డోల్ఫస్ ఎవడో సోషలిస్టు యువకుడిని ఉరి తియ్యడమేమిటి? ఇందుకు ప్రతీకారమా - అన్నట్టు నాజీలు డోల్ఫసను హత్య చెయ్యడమేమిటి? ఇది వింతగా కనబడవచ్చును. కాని, జరిగిన యథార్థం ఇంతే!
చాటున దాగిగాని, హఠాత్తుగా ఎదురుపడిగాని, గుంపులో నిలబడిగాని, చప్పున రివాల్వర్ తియ్యడం -గురి పెట్టడం - ఢాం అని పేల్చడం - శవం నేలమీద దొర్లడం : రాజకీయ హత్య అనగానే సాధారణంగా మనోఫలకం మీద చిత్రితమయ్యే దృశ్యం ఇదే! కాని, డోల్ఫస్ హత్య జరిగిన విధం ఇది కాదు. అసలు అది హత్య కాదు, - పెద్ద కుట్ర! పెద్ద తిరుగుబాటు!! ఈ కుట్రలో - ఈ తిరుగుబాటులో - మొత్తం నూటనలభై నాలుగు మంది పాల్గొన్నారు. వారిలో అధిక సంఖ్యాకులు ఒకప్పుడు ఆస్ట్రియన్ సైన్యానికి చెందినవారే! నాజీ ఉద్యమంలో చేరి పనిచేస్తున్నందుకు డోల్ఫస్ చాలామందిని బర్తరఫ్ చేశాడు. ఇలా బర్తరఫ్ అయినవారు నాలుగు రహస్య దళాలకింద ఏర్పడ్డారు. ఈ దళాలవారికి వియన్నా పోలీసు ఉద్యోగులలోని కొందరు ప్రముఖులు కూడా తోడయ్యారు. వీరందరు జులై 25వ తేదీనాడు పట్టపగలు డోల్ఫను హత్య చేశారు.

15

ఈ హత్యాకాండకు నాయకత్వం వహించినవాడు - డాక్టర్ ఆటొన్ రిమెలెన్. అతడి పూర్వీకులు జర్మనీలోని వెస్ట్ ఫేలియాకు చెందినవారు. అతడి తండ్రి గ్రాజ్ కళాపరిషత్తులో ప్రొఫెసర్. అక్కడనే - అంటే, రాజ్ లోనే - రిన్టెలెన్ జన్మించాడు. చదువు పూర్తిచేసుకుని డాక్టరేట్ ను సంపాయించుకున్న తర్వాత, అతడు గ్రా. కళాపరిషత్తులో తండ్రితోపాటు ప్రొఫెసర్ అయ్యాడు. తర్వాత 1918లో రియన్ రాష్ట్రీయ శాసనసభకు సభ్యుడయ్యాడు. ఆ మరుసటి సంవత్సరంలో స్టెరియన్ రాష్ట్రానికి గవర్నర్ అయ్యాడు. ఈ గవర్నర్ హోదాలో స్టెరియన్ రాజకీయ రంగంలో అతడు విశేషమైన పలుకుబడిని గడించుకున్నాడు. తర్వాత 1926లో ఆస్ట్రియాకు విద్యామంత్రి అయ్యాడు. రెండు సంవత్సరాలపాటు మంత్రిగా ఉన్న తర్వాత 1928లో తిరిగి తన గవర్నరు పదవినే స్వీకరించాడు.

రిన్‌టెలెన్ చాలా చురుకైనవాడు; విశేష శక్తిసామర్థ్యాలు గలవాడు, బొత్తిగా పాపభీతి లేనివాడు. ఆస్ట్రియన్ ఛాన్సలరు కావాలనే ఆశ అతడికి పట్టుకుంది. సోషల్ డిమోక్రాటిక్ పార్టీ సహాయంతో ఈ పదవిని పొందాలని ముందుగా అతడు యత్నించాడు. కాని, ఆ యత్నం సాగలేదు. తర్వాత అతడు నాజీలతో కుట్ర సాగించాడు. నాజీలకు రిన్టెలెన్ అంటే ఇష్టం గాని, నమ్మకంగాని లేదు. అయితే, ముందు రిమెలె తో కలిసి “కోయిలిషిన్ గవర్నమెంటు”ను ఏర్పాటు చెయ్యవచ్చుననీ, ఆ తర్వాత నెమ్మదిగా అతడిని తప్పించవచ్చుననీ వారు యోచన చేశారు. జర్మనీలో హిట్లరు ఇంతకు పూర్వం హెర్ వాన్ పాపెనను ఇలాగే ఉపయోగించుకున్నాడు. అక్కడ పారిన ఎత్తు ఇక్కడ పారదా? ఈ దిలాసాతోనే ఆస్ట్రియన్ నాజీలు నాజీకాని రిన్టెలెన్‌ను తమ నాయకుడుగా ఎన్నుకున్నారు. ఒక రాష్ట్రానికి గవర్నరుగా ఉంటూ విశేషంగా పలుకుబడిని సంపాయించుకున్న రిన్టెలెన్ నాజీ పక్షంతో కుట్ర చెయ్యడం ఆస్ట్రియాకు ఎంత నష్టమో ప్రథమంగా గ్రహించినవాడు, ముసోలినీ, అతడు డోల్ఫస్ 1933 ఆగష్టులో తనను చూడవచ్చినప్పుడు - రిటెన్ విషయమై హెచ్చరించాడట. “అతడిని నా దగ్గరికి పంపించు. నేను అదుపాజ్ఞలలో పెడతాను” అని ముసోలినీ ఆ సమావేశంలో డోల్ఫుతో అన్నాడట. ఈ మాట మీద డోల్ఫస్ 1934 ప్రారంభంలో రిన్ టెలెన్ ను రోం నగరానికి ఆస్ట్రియా రాయబారిగా పంపించాడు.

అయితే రిన్ టెలెన్‌ను దేశం నుంచి పంపించి వేసినంత మాత్రాన కుట్ర ప్రయత్నాలకు భంగం రాలేదు. జర్మనీ నుంచి రియాకు యథాప్రకారం రహస్యంగా ఆయుధాలు సరఫరా కాసాగాయి. యథాప్రకారమే స్టెరియాలో నాజీదళ నిర్మాణం సాగింది కూడా! చివరికి కుట్ర ప్రయత్నాలు అన్నీ ముగిసిన తరువాత - డోల్ఫస్ హత్యకు ఏర్పాట్లు అన్నీ జరిగిం తర్వాత - జులై 23వ తారీఖున - విశ్రాంతి కోసం అంటూ సెలవు పెట్టి రిన్ టెలెన్ రోం నగరం చేరుకున్నాడు.

డోల్ఫసను హత్య చేసినవారు ఎవరైనా, ఆ హంతకులకు నాయకత్వం వహించినవాడు ఎవడైనా, అసలు ఆ హత్య బాధ్యత అంతా హిట్లర్ దే! దౌర్జన్యానికి దిగండనీ, తిరుగుబాటు చెయ్యండనీ అతడు మ్యూనిక్ రేడియో స్టేషన్ నుంచి రాత్రింబగళ్ళు ప్రచారం చేయించాడు. జర్మనీ నుంచి చేయించిన ఈ ప్రచారం కాక, ఆస్ట్రియాలో కూడా ఇదే మాదిరి ప్రచారం జరగడానికి 1933 జనవరి, 1934 జులై మాసాల మధ్య దాదాపు 7 కోట్ల యాభై లక్షల మార్క్స్ ఖర్చు చేశాడు. ఇక, డోల్ఫస్ హత్యకు హిట్లరే బాధ్యుడని అనడంలో తప్పేమిటి? ఇంతేకాదు, జులై 25 నాటి తిరుగుబాటు సంగతి హిట్లరుకు ముందుగానే తెలుసు. ఈ విషయాన్ని నిరూపించడానికి ఉన్న ఎన్నో నిదర్శనాలలో కొన్ని ఇవి :

మొదటి నిదర్శనం : హబీష్, ఫ్రాన్ఫిల్డ్ అనే ఇద్దరు నాజీ నాయకుల్ని విద్రోహం జయప్రదమైనట్టు వార్త రాగానే వియన్నాకు పంపించాలనే ఉద్దేశంతో జులై 25వ తేదీనాటి ఉదయం తొమ్మిది గంటలకు మ్యూనిక్ నాజీ పార్టీ కేంద్ర కార్యాలయం వారు ఒక విమానాన్ని సిద్ధంగా ఉంచారు.

రెండో నిదర్శనం : జులై 21వ తేదీనాడే బర్లిన్ ఫోటోగ్రాఫ్ ఏజన్సీవా రొకరు ' రిన్టెలెన్ : ఆస్ట్రియా కొత్త ఛాన్సలర్ - త్వరలో ప్రకటించే నిమిత్తం' అంటూ పత్రికలకు అతని ఫోటో పంపించారు.

మూడో నిదర్శనం : ఎబెరెగెర్ అనే ఒక నాజీ రహస్యంగా ఆస్ట్రియా సరిహద్దులలోకి బాంబులను జేరవేస్తూ ఉండేవాడు. ఇతడిని ఆస్ట్రియన్ ఉద్యోగులు ఇన్స్బ్రు లో అరెస్టు చేశారు. తర్వాత జరిగిన విచారణలో - ఈ విచారణ ఫలితం : ఆజన్మ కారాగారవాస శిక్ష - ఇతడు మ్యూనిక్ నుంచి జులై 23వ తేదీ నాటికే మరి మూడు రోజులకు ఆస్ట్రియాలో తిరుగుబాటు జరగనున్నట్టు తనకు కబురు వచ్చిందని చెప్పాడు.

నాల్గవ నిదర్శనం : ఆస్ట్రియా నుంచి పలాయనమై వచ్చిన నాజీలను హిట్లర్ “ఆస్ట్రియన్ లీజియన్” అనే ఒక దళం కింద కూర్చాడు. ఈ దళం వారు 24వ తేదీ సాయంత్రానికి ఆస్ట్రియా సరిహద్దు వైపుకు వెళ్ళి, సరిహద్దుకు రెండు మైళ్ళ దూరంలో మకాం వేశారు.

అయిదో నిదర్శనం, ఆరో నిదర్శనం అంటూ మరి ఎన్నింటినైనా ఇలాగే ఉదాహరించ వచ్చును. కాని, ఇది అనవసరం. డోల్ఫస్ హత్యకు హిట్లరే పూర్తిగా బాధ్యుడు. ఇందుకు సందేహం లేదు. తాను అధికారానికి రావడానికి తోడ్పడినవారినే - వారితో తన కిక పని లేదని తోచినప్పుడు - హిట్లర్ స్వయంగా హత్య చేశాడు. ఇలాంటి హంతకుడు తన స్వార్థం సిద్ధించడం కోసం, తన కల నిజం కావడం కోసం, తన జన్మభూమి ఆస్ట్రియా తన పరిపాలన కిందికి రావడం కోసం డోల్ఫసను హత్య చేయించడానికి వెనుదీస్తాడా?

16

ఉదయం పదకొండు గంటలు అయ్యేసరికి కుట్రదారులు వియన్నా వీధులలో అక్కడక్కడ సమావేశమయ్యారు. వారి ఏర్పాట్లు చాలా చక్కగా జరిగాయనే చెప్పాలి. ఎంచేతనంటే, - ఏ విధమైన ఆలస్యంగాని, ఆటంకంగాని లేకుండానే వారు అనుకున్న పనులు అనుకున్నట్టు చకచక జరిగాయి. ఒక జట్టు - మనిషి మనిషి చొప్పున కోలోవాట్ రింగ్ అనేచోట చేరింది. ఈ జట్టులోని వారికి ఆ క్రితం రాత్రే ఆయుధాలు సప్లయి అయినాయి. ఆయుధాలు అందడంతోపాటు తాము ఎక్కడికి వెళ్ళవలసిందీ, ఏమి చెయ్యవలసిందీ తెలిసింది కూడా! వీరిలో కొందరికి తమ నాయకులు ఎవరైందీ తెలియనే

తెలియదు. ఇంతేకాదు, వీరు చాలావరకు పరస్పరం అపరిచితులు కూడా! అయినప్పటికీ '89' అంకెను సాంకేతికంగా పెట్టుకుని, దాని సహాయంతో ఏ పొరపాటూ రాకుండా వీరు సమావేశం కాగలిగారు.

కోలోవాట్ రింగ్ దగ్గర చేరిన ఈ జట్టులో నుంచి పద్నాలుగు మంది కాలినడకను బయల్దేరి “రవాగ్" (ఆస్ట్రియన్ రేడియో కేంద్ర కార్యాలయం) వైపుకు వెళ్ళారు.

అన్నట్టు ఈ పద్నాలుగు ఈ మంది మారువేషాలు లేకుండా మామూలుగానే వెళ్ళారు. “రవాగ్' పరిసరాలలోకి వెళ్ళేసరికి వారికి ఇద్దరు పోలీసువాళ్ళు - యూనిఫారంలో ఉన్నవాళ్ళు - ఎదురయ్యారు. వారిద్దరు కూడా కుట్రదారులలోనివారే! యూనిఫారంలో ఉన్న తాము దరిదాపులలో ఉంటే, కుట్రదారుల మీద ఎవ్వరికీ అనుమానం కలగదు గదా అనే ఉద్దేశంతో వారక్కడ వున్నారు.

రెండు నిమిషాలు తక్కువ ఒంటిగంటకు కుట్రదారులు రవాగ్ భవనాన్ని ప్రవేశించారు. వాకిటిలో కాపలావున్న పోలీసువాణి - కుట్రలో చేరనివాణ్ణి - చంపివేశారు. వాకిటికి దగ్గరిగా జోగుతున్న మరొకడిని కూడా - ఇతడు రవాగ్ డైరెక్టర్ మోటారు డ్రైవరు - కాల్చివేశారు. తర్వాత ఒక నలుగురు స్టూడియోలో ప్రవేశించారు. అక్కడ గ్రామఫోన్ రికార్డుల బ్రాడ్ కాస్ట్ జరుగుతున్నది. ఒక్క దూకు దూకి, “ఎనౌన్సరు”ను (బ్రాడ్ కాస్ట్ కార్యాక్రమాన్ని, వార్తల్ని ప్రకటించే వాడిని) పట్టుకొని, వాడి గుండెలకు పిస్తోలును గురిచేసి, వాడిచేత “డోల్ఫస్ గవర్నమెంట్ రాజీనామా ఇచ్చింది; డాక్టర్ రిమెలెన్ ప్రభుత్వాధికారాన్ని స్వీకరించాడు” అని ప్రకటింప జేశారు. ఈ ప్రకటన తిరుగుబాటు చెయ్యడానికి యావద్దేశానికి సంజ్ఞ అని అదివరకే నిర్ణయమైంది.

ఈ లోపుగా ఇంకొక పెద్ద జట్టు జీబెన్ స్టెర్నెగా సే వీధిలోని జర్మన్ ఎథిలిటిక్ క్లబ్ భవనంలో చేరింది. ఈ జట్టులో మొత్తం నూట నలభై నాలుగు మంది ఉన్నారు. వీరిలో నూట ఆరుమంది ఆస్ట్రియన్ సైన్యంలో నుంచి బర్తరఫ్ అయిన వారే! పోగా మిగిలిన వారిలో పదిమంది పోలీసు ఉద్యోగులు. వీరు బర్తరఫ్ అయినవారు కాదు, ఇంకా ఉద్యోగంలో ఉన్నవారే!

మధ్యాహ్నం ఒంటిగంటకు ఛాన్సలరీ (ఆస్ట్రియన్ ప్రభుత్వ కార్యాలయం) మీద దండెత్తి వెళ్ళడానికి కుట్రదారులు నిర్ణయించుకున్నారు. సరిగా ఒంటిగంటకే అని నిర్ణయించు కోడానికి బలమైన ఒక కారణం ఉంది. అది ఏమంటే, - ఒంటిగంటకు ఛాన్సలరీకి పహరా ఇచ్చే జట్టులో మార్పు జరుగుతుంది. ఈ మార్పు జరుగుతూ ఉండగా ఎదిరిస్తే నెగ్గడం తేలిక!

అయితే ఉదయం షుమారు పదిగంటలకు డాబ్లరు • అనే పోలీసు ఉద్యోగి - ఇతడు నాజీ కుట్రలో చేరినవాడే గాని ఎందువల్లనో తిరిగిపోయాడు షుమారు పదిగంటలకు డాబ్లరు కుట్ర రహస్యాన్ని ప్రభుత్వాధికారులకు తెలియ జేశాడు. వారు వెంటనే జాగ్రత్త పడినట్టయితే, డోల్ఫస్ కు ప్రాణమోసం తప్పేదే! కాని అంతకుపూర్వం అనేకసార్లు పుట్టిన కుట్ర వదంతుల మాదిరిగానే ఇది కూడా నిరాధారమైనదని అనుకున్నారు.

ఆ పూట డాబ్లర్ *(డాబ్లర్ కొన్ని రోజుల తర్వాత ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది ఆత్మహత్య కాదు, - హత్య అని కూడా కొందరు అంటారు)* కుట్ర సంగతిని ప్రభుత్వాధికారులకు తెలియపరచడానికి పడ్డపాట్లకు అంతులేదు. నిజాన్ని తెలియబరచాలి; కాని, నాజీలకు తనమీద అనుమానం కలగకూడదు. ఈ తాపత్రయంలో అతడు ఆనాటి ఉదయం పది, పదకొండున్నర గంటల మధ్య మొత్తం మూడుసార్లు ప్రభుత్వాధికారుల్ని కలుసుకున్నాడు. ఈ మూడుసార్లు కూడా అతడు

అధికారుల్ని కలుసుకున్నది కాఫీ హోటల్సులోనే. ఈ మూడుసార్లూ అతడు అధికారుల్ని రప్పించింది రకరకాల మధ్యవర్తుల ద్వారానే!

పదకొండు గంటల పదిహేను నిమిషాలకు ప్రజాశాంతి రక్షణ మంత్రి అయిన మేజర్ ఫే అంగరక్షకుడికి ఇతడి పేరు మేజరు రాబెల్ - కుట్ర సంగతి తెలిసింది. వెంటనే అతడు నమ్మకస్థుడైన గూఢచారి నొకడిని - మారెక్ అనే వాడిని - విచారణ చెయ్యడానికి పంపించాడు. తర్వాత అరగంటకు (పదకొండు ముప్పావుకు) మేజర్ ఫే కు కుట్ర సంగతి చూచాయగా తెలిసింది. తనకు తెలియడమే తడవుగా మేజరు ఫే ఛాన్సలరీలో సమావేశమై వున్న మంత్రి వర్గానికి ఈ సంగతిని అందజేశాడు. మొదటిలో డోల్ఫస్ అంత లక్ష్యపెట్టలేదు గాని, పదే పదే హెచ్చరికలు రావడాన్ని చూచి, పది నిమిషాలు తక్కువ ఒంటిగంటకు మంత్రివర్గ సమావేశాన్ని చాలించి, అందరి మంత్రుల్ని - మేజరు ఫేనూ, అతడి అసిస్టెంటు కార్లిన్ స్కీని తప్ప - పక్క భవనంలో ఉన్న తమ తమ కార్యాలయాలకు వెళ్ళిపొమ్మన్నాడు.

ఈ లోపుగా డిటెక్టివ్ మారెక్ (గూఢచారి) జీబెన్ స్టెర్న్ గా సే దగ్గరికి చేరుకున్నాడు. కుట్రదారుల వెంట యూనిఫారంలో వున్న పోలీసుల్ని చూచిన వెంటనే అతడు "వారు కుట్రదారులు కారేమో" అని అనుకున్నాడు. కాని, క్రమక్రమంగా అతనికి సందేహం కలుగసాగింది. అప్పుడతడు పది పన్నెండున్నర మధ్య మూడుసార్లు (ఒకసారి పబ్లిక్ ఫోన్ - స్టాండ్ లో నుంచీ, ఒకసారి కాఫీ హోటల్ లో నుంచీ, మూడోసారి ఫర్నీచర్ షాపులో నుంచీ) మేజర్ రాబెల్ కు ఫోన్ చేశాడు. రాబెల్ తనకు జీబెన్ దగ్గర నుంచి వచ్చిన రిపోర్టుల్ని ముందు ప్రజా శాంతి రక్షణ ఉద్యోగులకు, తర్వాత పోలీసు హెడ్ క్వార్టర్సుకు తెలియపరచాడు. ఈ రిపోర్టుల ఆధారంతో ప్రభుత్వంపట్ల విశ్వాసపాత్రంగా ఉన్న పోలీసువారు చర్య జరపాలని యత్నించారుగాని, నాజీలతో చేరిన పోలీసు గూఢచారులు కుట్ర సన్నాహం నగరంలో మరి ఏ మూలనో జరుగుతున్నదని చెప్పి మోసపుచ్చారు.

మారెక్ మూడోసారి ఫోన్ చేసి వచ్చేసరికి కుట్రదారులు అతడి రహస్యాన్ని కనిపెట్టి, కాళ్ళు చేతుల్ని పట్టుకుని అతడిని ఎథిలిటిక్ క్లబ్ హాలులోకి ఈడ్చుకు వెళ్ళారు. పట్టుబడిపోయి మారెక్ లోపలికి వెళ్ళేసరికి కుట్రదారులు ఆర్మీ యూనిఫారంలోకి - వియన్నా జాయిష్ మిష్టర్ దళం వారి యూనిఫారంలోకి - మారుతున్నారు. తర్వాత కాసేపటికి కుట్రదారులు మూడు ప్రయివేటు ట్రక్కులలో ఎక్కి ఛాన్సలరీకి బయలుదేరారు. మారెస్ ను ఏమి చెయ్యాలో వారికి తోచలేదు. అంచేత అతడిని తమతోపాటు తీసుకువెళ్ళారు! ఛాన్సలరీని సమీపిస్తూ ఉండగా, మారెక్ ఎలాగో తప్పించుకుని కిందికి దూకి పారిపోయాడు. పారిపోతూవున్న వాడిని కావాలంటే కుట్రదారులు కాల్చి వెయ్యగలిగేవారే! అయితే, తమ తుపాకి మోత ప్రజల దృష్టిని ఆకర్షిస్తుందేమో నని వారు చల్లగా ఊరుకున్నారు! అసలు తుపాకిమోత అవసరం లేకుండానే పట్టపగలు పెద్ద పట్టణంలో జన సమర్ధంగా ఉన్న వీధుల గుండా యూనిఫారంలో వున్న నూట నలభై నాలుగుమంది సైనికులతో మూడు ట్రక్కులు వెళ్ళడమే ప్రజాదృష్టిని ఆకర్షించవలసింది. కాని ఆ రోజులలో వియన్నా వీధులలో సైనిక దళాలు తిరగడం సామాన్యమే! పైగా ట్రక్కుల రన్నింగ్ బోర్డ్సు మీద యూనిఫారంలో ఉన్న పోలీసులు అనుమానానికి ఆస్కారం లేకుండా చేశారు.

డోల్ఫస్ మంత్రివర్గ సమావేశాన్ని చాలించిన అయిదు నిమిషాలకు ఒకటి యాభై అయిదు నిమిషాలకు - కుట్రదారులు ఛాన్సలరీలో ప్రవేశించారు.

ప్రవేశించడమే తడవుగా వారు మేజరు ఫేనూ, అతడి అసిస్టెంట్ కార్విన్ స్కీనీ, ఛాన్సలరీ ఉద్యోగులు దాదాపు నూటయాభై మందినీ, ఛాన్సలరీ పహరా వాళ్ళు అరవైమందిని అరెస్టుచేశారు. అరెస్టు చేసిన వారిలో పద్దెనిమిది మందిని - మేజరు ఫే, కార్విన్ స్కీలు కాక, మరి పదహారుమంది ఉన్నతోద్యోగుల్ని - మంత్రి వర్గ సమావేశాలు జరిగే మందిరంలో

బంధించారు. పోగా మిగిలినవారిని ఒక చిన్న పెరటిలోకి చేర్చి, వారి కాపుదలకు గట్టి బందోబస్తు చేశారు. ఈ పనులన్నీ క్షణమైనా విలంబనం లేకుండా చకచక జరిగి పోయాయి. కుట్రదారులవెంట వచ్చిన పోలీసు వారికి ఛాన్సలరీలోని ప్రతిగదీ, ప్రతిహాలూ, ప్రతిదారీ చక్కగా తెలుసు. అసలు వారిలో కొంత మంది అనేక సార్లు ఛాన్సలరీకి పహరా ఇచ్చినవారే! ఇక తడబడవలసిన అవసరం ఏముందీ? తక్కినవారు ఈ అరెస్టుల్ని జరుపుతూ ఉండగా, కొంతమంది కుట్రదారులు ఓటో ప్లానెట్టా నాయకత్వంకింద-ఇతడు ఆస్టియన్ సైన్యంలో కార్పొరల్ గా ఉంటూ ఉండేవాడు; నాజీ ఉద్యమంలో చేరినందుకుగాను బర్తరఫ్ అయ్యాడు-డోల్ఫుస్ ను హత్య చెయ్యడానికి బయలుదేరారు. వారు ఛాన్సలరీలోకి ప్రవేశించడమే తడవుగా మరి దేనిమీదికీ తమ దృష్టిని పోనివ్వకుండా, గబగబ మేడమెట్లను ఎక్కి వెళ్ళి, ప్రతి స్టేట్ డిపార్టుమెంట్ నూ డోల్ఫుస్ కోసం వెదకసాగారు. కావాలంటే డోలును కూడా అరెస్టు చెయ్యడానికి వీలున్నది. అయితే, వారి కోర్కె అతడిని అరెస్టు చెయ్యడం కాదు, - హత్య చెయ్యడం. తర్వాత జరిగిన సంఘటనలనుబట్టి చూస్తే, “డోల్ఫుసన్ను ప్రాణాలతో వదలవద్దు” అని వారు ఆజ్ఞాపితులైనట్టు తోస్తుంది కూడా!

మంత్రివర్గ సమావేశాన్ని చాలించిన వెంటనే డోల్ఫుస్ తన ప్రయివేట్ స్టడీలోకి వెళ్ళాడు (ఇది చిన్నగది. దీని గోడలకు ఊదా సిల్కు లైనింగ్ ఉంది). డోల్ఫుస్ సేవకుడు - అతడి పేరు హెడ్ విక్ - కిటికీలోనుంచి బయటికి చూచేసరికి, కుట్రదారుల ట్రక్కులు ఛాన్సలరీ ఆవరణలో ప్రవేశించడం కనబడింది. అతడు ఏదో చిక్కురొక్కురు దారి చెప్పి, దాని గుండా పారిపోవలసిందిగా డోల్ఫుస్ ను హెచ్చరించాడు. సరేనని, తానున్న ఊదాగదినుంచి చకచక బయలుదేరి, తెల్లగా ఉన్న మరొకగదిగుండా డోల్ఫుస్ 1815లో వియన్నా కాంగ్రెసు జరిగిన హాలులోకి వెళ్ళబోయాడు. తెల్లటి గదికి మూడు ద్వారాలున్నవి. ఇక వియన్నా కాంగ్రెసు హాలుకు అయిదు ద్వారాలున్నవి ఆ కాంగ్రెసులో అయిదుగురు రాజులు పాల్గొన్నారు. ఈ అయిదుగురిలో ఎవరు ముందు రావడం, ఎవరు వెనక రావడం అనే చిక్కు తీర్చడానికిగాను అయిదు ద్వారాల్ని పెట్టి, అయిదుగురు కూడా ఒకేసారి రావడానికి ఏర్పాటుచేశారు. తెల్లగది మూడు ద్వారాలలోనూ ఒకటి మేడమెట్లవైపుకున్నది; ఇంకొకటి వియన్నా కాంగ్రెసు హాలులో కున్నది. కాంగ్రెసు హాలు తలుపు తాళం వేసివుంటే దాన్ని తియ్యడానికి హెడ్ విక్ తడుముకుంటూ ఉంటే, ఈ లోపుగా మెట్లవైపు ద్వారం గుండా కుట్రదారులు గదిలో ప్రవేశించారు.

వారు లోపలికి అడుగుపెట్టేసరికి డోల్ఫుస్ - కాంగ్రెస్ హాలును తెరిచే ప్రయత్నంలో కాబోలు - తలుపుగుబ్బను (నాను) అందుకోబోతున్నాడు. చాలా కురచవాడేమో, తలుపుగుబ్బను అందుకోవాలంటే, అతడు చేతిని బాగా పైకి చాచవలసి వచ్చింది. డోల్ఫుస్ ఈ 'పాశ్చరు'లో ఉండగా ప్లానెట్టా అతడిని చూచాడు. చూచీచూడ్డంతోటే ఆ నాజీ హంతకుడు ముందుకు లంఘించి, ఇరవై అంగుళాల దూరంలో నుంచి చంకలోకి కాల్చాడు. ఈ దెబ్బకు డోల్ఫుస్ ఒరిగిపోతూ ఉండగా అతడు ఇంకోసారి మరీ దగ్గరిలోంచి ఎనిమిది అంగుళాలలో నుంచి - కాల్చాడు. ఈ రెండో దెబ్బకు డోల్ఫుస్ నేలకూలిపోయాడు.

“రక్షించండి! రక్షించండి!!” అని డోల్ఫుస్ తడబడుతూ అన్నాడు (హెల్ప్! హెల్ప్!!
“లే! నిలబడు!!” అని ప్లానెట్టా గద్దించాడు.
“లేవలేను” అని గొడుగుడుపడుతున్న గొంతుతో డోల్ఫుస్ జవాబిచ్చాడు.

అంతట కుట్రదారులు అతడిని లేవనెత్తి, ఆ గదిలోనే ఒక సోఫా వుంటే, దాని మీద పడుకోబెట్టారు. గాయాల నుంచి రక్తం కాల్వలు కట్టి, ముందు సోఫాను తడిపి, తర్వాత కిందికి ప్రవహించసాగింది. “షూష్నిగ్ ఎక్కడ?” ప్రవహిస్తున్న ఈ రక్తాన్ని పట్టడానికి ఆ నాజీ హంతకులు సోఫాకింద ఒక “బేసిన్” పెట్టారు. సమీపంలోనే బందీలో ఉన్న మేజరు ఫేకు తుపాకి కాల్పుల మోత వినబడింది. అయితే, వాటి అర్థమేమిటో అతడికి తెలియలేదు. ఇక తక్కిన బందీల సంగతి చెప్పనబర్నే

లేదు. కుట్రదారులు ప్రభుత్వ సైనికుల యూనిఫారంలో రావడాన్ని చూచి, ప్రభుత్వంవారే సోదాను జరిపిస్తున్నారేమోనని వారిలో కొందరు భ్రమపడ్డారు. మరికొందరు మిలిటరీ డ్రిల్లు జరుగుతున్నదేమోనని అనుకున్నారు. ఇక, వారికి తుపాకి కాల్పుల అర్థమేమిటో ఎలా తెలుస్తుంది?

తాను విన్న తుపాకి కాల్పుల అర్థం ఏమిటా అని మేజరు ఫే ఆందోళనపడుతూ ఉండగా, రెండున్నర ప్రాంతాల కొందరు నాజీలు వచ్చి, అతడిని డోల్ఫస్ మరణావస్థలో ఉన్న గదిలోకి తీసుకువెళ్ళారు. అప్పటికే కొంత స్పృహ తప్పుతున్నప్పటికీ, డోల్ఫస్ అతడిని గుర్తుపట్ట గలిగాడు. గుర్తుపట్టి, హీన స్వరంతో ఇలా అన్నాడు:

"నేను చచ్చిపోతే, నా కుటుంబరక్షణ భారం నీవు వహించాలి".
కుట్రదారులు మేజర్ ఫే గుండెలకు రివాల్వర్ ను గురిచేసి ఉంచారు. "నీవు మాటాడితే, ప్రమాదంసుమా!" అని వాళ్ళు అతడిని బెదిరించారు.

''షూష్నిగ్ ఎక్కడ?''
"తెలియదు" అన్నట్టే ఫే తల వూపాడు. లేని వోపికను తెచ్చుకుని "రక్తపాతం జరగనివ్వకుండా దీన్ని పరిష్కరించుకోడానికి ప్రయత్నించండి. రిటెలెనను రాజీకి రమ్మనండి" అని డోల్ఫస్ తన అంత్యసందేశాన్ని తెలిపాడు.

కుట్రదారులు మేజర్ ఫేను గదిలోనుంచి బయటికి ఈడ్చుకు వెళ్ళారు. డాక్టర్ని పిలిపించండని మేజరు ఫే ముందు బ్రతిమలాడాడు. అందుకు అంగీకరించకపోతే, కనీసం "ప్రీస్టు" నైనా పిలిపించి, అవసానకాలంలో కాథోలిక్ క్రైస్తవుడికి జరగవలసిన తంతును జరిపించండని అతడు ప్రాధేయపడ్డాడు. దీనికి కూడా కుట్రదారులు ఒప్పుదలకాలేదు!

తక్కిన వారిలా డోల్ఫస్ కూడా తన సైనికులే తన మీద తిరగబడ్డారని భ్రమపడ్డాడు ఇంతేకాదు, తిరుగుబాటు జయప్రదమైందని కూడా అతడు అనుకున్నాడు. మరి కాసేపటికి స్పృష పూర్తిగా తప్పిపోతుందనగా అతడు తిరుగుబాటు చేసిన సైనికులు వెళ్ళిపోయారనీ, తన చుట్టూ ఉన్నవారు తన పన ఉన్న సైనికులనీ భావించినట్టు తోస్తుంది. ఏ చేతనంటే గుంటలు పడిపోయిన కళ్ళతో కళావిహీనంగా చూస్తూ అతడు ఇలా గొణిగాడు : "కిందరు! (బిడ్డలారా!) మీరు నేనంటే ఇంత దయగా ఉన్నారు. తక్కినవారు మీలా ఉండకపోవడానికి కారణమేమిటి? నేను శాంతినే కోరాను. భగవంతుడు తక్కిన వారిని క్షమించాలని నా కోర్కె"

స్రవించి స్రవించి రక్త స్రవంతి ఆగిపోయింది. దానితో పాటు హృదయస్పందన కూడా నిలిచి పోయింది. మూడు-నలభై అయిదు గంటలకు డాక్టరు డోల్ఫస్ పరలోక గతుడైనాడు.

17

"డోల్ఫస్ రాజీనామా ఇచ్చాడు; రిటైలెన్ ప్రభుత్వాధికారాన్ని స్వీకరించాడు."
కోలోవాట్ రింగ్ దగ్గర బయలు దేరింది మొదలు ఈ అసత్య ప్రకటనలను చేయించడం వరకు మొదటి జట్టులోని నాజీ కుట్రదారులకు సర్వమూ అనుకూలంగానే జరిగిందిగాని, ఇటు పైన తలవని తలంపుగా పరిస్థితులు ప్రతికూలమైనాయి. "టెలిఫోన్ గరల్" ఒకతె క్షణమాత్రం తరుణం లభించేసరికి, జరిగిన విషయాన్ని పోలీసు హెడ్ క్వార్టర్సుకు అతిధైర్యంగా తెలియపరచింది. ఇంతటి ధైర్యంతోనూ ఇంకొక ఉద్యోగి బిసాంబర్గ్ కు - ఇది "సెండింగ్ స్టేషను - వెళ్ళే తీగల్ని తెగనరికి

వేశాడు. ఈ కారణాన తిరిగి ప్రకటన చెయ్యాలంటే నాజీలకు అవకాశం లేకుండా పోయింది. ప్రతి పది నిమిషాలకొకసారి "డోల్ఫుస్ రాజీనామా ఇచ్చాడు; రిన్టెలెన్ ఛాన్సెలరు అయ్యాడు" అని ప్రకటించాలనీ, ఈ ప్రకటనలకు మధ్య వ్యవధిలో తిరుగుబాటును గురించి సలహాల్ని ఇవ్వడం, అబద్ధాల్ని చెప్పడం మొదలైన తతంగాన్ని నడపాలని వారు అనుకున్నారు. ఈ ఎత్తు సాగలేదు గాని, లేకపోతే గవర్నమెంటుకు ఎంతైనా అపకారం జరిగేది.

నాజీలు రావడం, ఇద్దరిని చంపడం, స్టూడియోలో దూరడం, "ఎనౌన్సరు" మీద దౌర్జన్యాన్ని చెయ్యడం - దీన్ని అంతటనీ చూచి, తన బ్రాడ్ కాస్టు ఉపన్యాసాన్ని రిహార్సల్ చేసుకుంటున్న వాడొకడు బెదరిపోయి, వెర్రిగా కేకలు వెయ్యసాగాడు. అతడిని నాజీలు కాల్చివేశారు. ఇంతలో హెడ్ క్వార్టర్సు నుంచి పోలీసులు వచ్చిపడ్డారు. వారి మీద తిరుగుబాటుదారులు తుపాకుల్ని కాల్చారు. ఇందుమూలంగా ఒక పోలీసువాడు చనిపోయాడు. తర్వాత తిరుగుబాటుదారులకూ, పోలీసువారికీ దాదాపు మూడు గంటల సేపు పోరాటం జరిగింది. ఈ పోరాటంలో పోలీసువారు మెషినగన్నునూ, హ్యాండ్ గ్రెనెడ్సునూ ఉపయోగించారుకూడా. చివరికి తమ నాయకుడు చచ్చిపోయిన తర్వాతనూ, తమలో కొందరు గాయపడిన తర్వాతనూ, సాయంత్రం మూడున్నర ప్రాంతాలగాని కుట్రదారుల లొంగిరాలేదు.

రవాగ్ మీద నాజీలు జరిపిన యాదాడి మూలంగా మొత్తం అయిదుగురు మరణించారు. వారిలో ముగ్గురు సకాలంలో వైద్యసహాయం లేకపోవడంవల్ల నెత్తురు కాల్వలు కట్టి చచ్చిపోయినవారే!

ఇక, ఈలోపున ఛాన్సలరీదగ్గర జరిగిన సంఘటనలు ఇవి :
డోల్ఫుస్ మంత్రివర్గం రాజీనామా ఇచ్చిందనీ, రిటైల్న్ కొత్త మంత్రివర్గం యేర్పాటు చేశాడనీ రేడియో ద్వారా విన్న కొందరు జర్నలిస్టులు ఛాన్సలరీ దగ్గరికి పరుగెత్తుకు వెళ్ళారు. వారు అక్కడికి వెళ్ళేసరికి, కొద్దిమంది జనం మాత్రం బైట ఉన్నారు; ఛాన్సలరీ తలుపులు వేసి ఉన్నాయి; లోపల ఏం జరిగిందీ, జరుగుతున్నదీ బయటివారికి కించి తైనా తెలియదు. అయితే ఆ చిన్ని గుంపులో ఉన్న ఒక జర్మన్ ఫోటోగ్రాఫర్ కు అతడు పొడగరి. యౌవనంలో ఉన్నాడు. ఆ క్రితంనాడే బర్లిన్ నుంచి వియన్నా వచ్చాడు. అతడికి - సర్వం తెలుసునని చెప్పాలి. ఎంచేతనంటే, - తాను డోల్ఫుస్ హత్యాదృశ్యాలను ఫోటో తియ్యడానికే ప్రత్యేకంగా వచ్చినట్టు, అతడు తన "ట్రైపాడ్" అనుకూలమైన స్థలంలో అమర్చుకోసాగాడు. తరువాత - ఒంటిగంట ఇరవై అయిదు నిమిషాలకు - మస్తీలో ఉన్న కొందరు గూఢచారులు, యూనిఫారాల్ని వేసుకొని, "స్టీల్ హెల్మెట్సు"ను (ఉక్కుతో చేసిన శిరోవేష్టాలను) పెట్టుకున్న అయిదుగురు పోలీసులు వచ్చారు.

వారు రావడాన్ని చూచి, లోపల ఉన్న కుట్రదారులు అడుగు అంతస్థు కిటికీ గుండా "వెళ్ళిపొండి; లేకపోతే కాల్చుతాము సుమా!" అని కేక పెట్టారు.

అటుపైన అయిదు నిమిషాలకు - ఒంటిగంట యాభై అయిదు నిమిషాలకు - హైమ్ వీరు లెఫ్టినెంటు వొకడు వొంటరిగానూ, నిరాయుధుడుగానూ వచ్చి, ఛాన్సలరీ తలుపును గట్టిగా తట్టి, "అయిదు నిమిషాలలో తలుపు తెరిచి తీరాలి. అలా తెరవకపోతే, దాన్ని బద్దలగొట్టి, లోపల ప్రవేశిస్తాను" అని బెదిరించాడు. ఇంతవింతగా వచ్చి, ఇంతవింతగా బెదిరించి, చివరికి ఇంత వింతగానే అతడు సెలవు పుచ్చుకున్నాడు. అంతే! తిరిగి అతడి జాడైనా కనబడలేదు!!

ఆ తర్వాత మరికొందరు ఉద్యోగులు రావడం, పోవడం జరిగింది; ఇప్పటికి కూడా లోపల జరిగిన అరెస్టుల సంగతి గాని, హత్యసంగతి గాని బయటివారికి తెలియదు. ఇలా ఉండగా రెండు గంటల అయిదు నిమిషాలకు 'రైష్ పోష్టు" - ఇది డోల్ఫుస్ గవర్నమెంటు పత్రిక ఎడిటరు డాక్టరు ఫందరు అక్కడకి వచ్చి "ఈ గొడవేమిటి!!" అని విచారించాడు. ఆయనకు

ఇతరులెవ్వరూ జవాబివ్వలేకపోయారు గాని, బర్లిన్ నుంచి వచ్చిన ఫోటోగ్రాఫగు మాత్రం “రిమెలెన్ ఛాన్సలర్ అయ్యాడు. ఆస్ట్రియన్ లీజియన్ దండెత్తి వస్తున్నది. బర్లిన్ నుంచి హబీస్ట్ కూడా ప్రయాణమై వస్తున్నాడు" అని చెప్పాడు. ఈ మాటల్ని వినేసరికి పరిస్థితులు విషమించినవని డాక్టరు ఫండరు గ్రహించాడు. కేవలం ఇలా గ్రహించడమే కాదు తన సత్వర కర్తవ్యమేమిటో కూడా ఆయన నిర్ణయించుకున్నాడు.

రిన్టెలెన్ ఏ హోటలులో బసచేశాడో డాక్టరు ఫండరుకు తెలుసు. తిన్నగా ఆయన అక్కడికి వెళ్ళి, బెదిరించీ నదిరించీ, రిన్టెలెన్ ను యుద్ధమంత్రి కార్యాలయానికి వెంటపెట్టుకు వెళ్ళాడు. అక్కడ ప్రభుత్వోద్యోగులు అతడిని బందీని చేశారు.

ఈ లోపుగా ప్రెసిడెంట్ మిక్లాస్ కు, ఛాన్సలరీని నాజీలు ఆక్రమించుకోవడమూ, ఛాన్సలర్, వైస్ ఛాన్సలర్, మొదలైన వారు బందీలు కావడమూ, డోల్ఫస్ గాయపడి మరణావస్థలో ఉన్న సంగతి - అప్పటికి ఇంకా ఎవ్వరికీ తెలియలేదు - తెలిసింది. ఛాన్సలర్, వైస్ ఛాన్సలర్ బందీ లైపోయినప్పుడు, ఇక ప్రభుత్వ భారాన్ని వహించ వలసింది తానేనని, గ్రహించి బందీలు కాకుండా ఉన్న మంత్రుల్ని టెలిఫోన్ ద్వారా యుద్ధ కార్యాలయానికి వెంటనే పిలిపించి, వారితో ఆయన సమాలోచనలు ప్రారంభించాడు. ఈ సమాలోచనలలో “బందీలో ఉన్న మంత్రులు జరిపే నిర్ణయాన్ని స్వీకరించడానికి వీలులేదు; కుట్రదారులు కోరిన షరతుల్ని మన్నించరాదు” అని ప్రెసిడెంట్ మిక్లాస్ స్పష్టంగా చెప్పాడు. ఆ తర్వాత ఆయన డాక్టరు షూష్నిగను “ఇంటెరిం” (తాత్కాలికపు) ఛాన్సలరుగా నియమించి విద్రోహాన్ని చల్లార్చడానికి. శాంతిని నెలకొల్పడానికీ, తిరుగుబాటుదారుల్ని శిక్షించడానికి, బందీలైన మంత్రుల్ని వదిలించడానికీ, కావలసిన అధికారాల్ని అన్నింటినీ ఇచ్చాడు.

ఇక్కడ యుద్ధశాఖ కార్యాలయంలో “ఇంటెరిం" మంత్రివర్గం సమావేశమై ఉంటే, అక్కడ ఛాన్సలరీ దగ్గర అంత్య సందేశాల మీద అంత్య సందేశాల్ని పంపించడం ప్రారంభమైంది. రెండున్నరగంటలు అయ్యేసరికి అనేక మంది హైమ్ వీర్ సైనికులు పోలీసులు వచ్చారు. రెండూ ముప్పయి అయిదు నిమిషాలకు ఛాన్సలరీ తలుపును తట్టి “మీరు లోబడ్డానికి ఇరవైనిమిషాల గడువు ఇస్తున్నాం. ఆ తర్వాత అసలు భవనాన్నే నేలమట్టం చేస్తాం” అన్నారు. ఇందుకు 'వెళ్ళిపోతారా, లేక కాల్చమంటారా?' అని తలుపుగుండా కర్కశమైన గొంతుతో జవాబు వచ్చింది. అందరుమంత్రులు బందీలైనారనే భయం ఈ సమయానికి ఛాన్సలరీ బయట చేరినవారిలో వ్యాపించింది.

మూడుగంటలకు మేజరుబార్ - ఇతడు హైమ్ వీర్ ఆఫీసర్. లోయర్ ఆస్ట్రియా గవర్నర్ - వచ్చాడు. పోలీసు ఉద్యోగివొకడు మేజరుబారు దగ్గరికి వెళ్ళి 'ఏమి చెయ్యాలో నాకు పాలుపోవడం లేదు. మా తోడ్పాటుకోసం మరికొన్ని దళాలు, పై అధికారుల ఉత్తరవులు వస్తాయేమోనని యెదురు చూస్తున్నాను' అని అన్నాడు. ఈ సరికి చాలామంది హైమ్ వీర్ సైనికులు బర్గ్థియేటరు వైపుకు వెళ్ళు రోడ్డు వెంట బారులుతీరి నిలబడ్డారు. వారు ఛాన్సలరీ పైకి ఉరకాలని యత్నించారుకాని, పోలీసులు వారిని వెనక్కు తోసివేశారు. ఇంతలో ఎవరో మేజరు బారును సమీపించి "లోపల ఎవరున్నారు?” అని అడిగారు.

“డోల్ఫస్, ఫే, కార్విన్ స్కీ : వీరు ముగ్గురు కుట్రదారులకు బందీలైపోయి, లోపల చిక్కుపడ్డారు. అప్పుడు వేరొక కొత్తమంత్రివర్గం ఏర్పడింది. అది యుద్ధ కార్యాలయంలో సమావేశమై కర్తవ్యాన్ని ఆలోచిస్తున్నది.” అని అతడు జవాబిచ్చాడు. ఈ జవాబుతో అందరు మంత్రులు బందీలయ్యారనే భయం తొలగిపోయింది.

మూడూయాభై యేడు నిమిషాలకు మేజర్ బార్ బాల్కనీలోకి వచ్చాడు. గండ్రగొడ్డలిలా ఉండే అతని ముఖంలో కత్తివాటువేసినా నెత్తురుచుక్క లేనట్టుంది. అతడి వెంట కుట్రదారుల నాయకుడు హోల్ట్ వెబ్బర్ - ఉన్నాడు. హోల్ట్

వెబ్బరు, పిట్ట అంతటి మనిషి అతడు కళ్ళజోడు పెట్టుకున్నాడు. తళతళ మెరిసే మెడల్సుతో ఉన్న కెప్టెన్ యూనిఫారాన్ని వేసుకున్నాడు. ఇలాంటి యూనిఫారంలో ఉన్నప్పటికీ అతడు తాలూకా ఆఫీసులో గుమాస్తాలానే కనపడ్డాడు. మేజరు ఫేను చూచేసరికి, జనం ఒక్కసారిగా గొల్లున కేకలు పెట్టసాగారు. దాన్ని చూచి అతడు 'సైలెన్స్' అని లోగొంతుతో అన్నాడు.

ఈ మాటను వినేసరికి "సైన్యంతో కలిసి, మేజరు ఫే యీ తిరుగుబాటును చేశాడు" అని అందరికీ ఒక్కసారి తోచింది. 'కమాన్ డెంట్ ఎక్కడ?" అని ఫే అడిగాడు. అతడికోసం వెదికితే, అతడు కనబడలేదు. అప్పుడు ఒక పోలీసు ఉద్యోగి నాలుగడుగులు ముందుకు వెళ్ళి, వినయ పూర్వకంగా "సెల్యూట్" చేశాడు. "నీవు ఎవరివి?" అని ఫే అడిగాడు. "నా పేరు కెప్టెన్ వెబ్బరు. ఉత్తరువుల కోసం ఎదురు చూస్తున్నాను" అని ఆ పోలీసు ఉద్యోగి బదులు చెప్పాడు. అప్పుడు హోల్ట్ వెబ్బరు, మేజరు ఫే దగ్గరికి జరిగి చెవిలో యేమో చెప్పాడు. తర్వాత మేజరు ఫే "ఆయుధాలు ఏవీ వెంటలేకుండా దొడ్డిగుమ్మం దగ్గరికిరా!" అని అన్నాడు. "సరే" అన్నట్టు వెబ్బరు తలవూపి, బయల్దేరాడు. "ఆయుధాలు లేకుండా వొంటరిగా రా! లేకపోతే, తర్వాత విచారపడతావు సుమా!" అని అతడిని హోల్ట్ వెబ్బరు హెచ్చరించాడు.

స్క్వేరులో ఉన్న హైమ్ వీరు సైనికులు మేజరు ఫేను గుర్తించి "ఫే! మా మేజరు ఫే!" అని అరవడం సాగించారు. నాలుగూ ఎనిమిది నిమిషాలకు వెబ్బరు దొడ్డి వాకిటిలో నుంచి తిరిగి వచ్చాడు. కాలి కొద్దీ పరిగెత్తుకురావడంలో అతడి హెల్మెట్ పడిపోయింది. జుట్టు చిందరవందర పడింది. ముచ్చెమటలు పోసినవి. వచ్చీ రావడంతోటే అతడు పోలీసు హెడ్ క్వార్టర్సుకు ఇలా ఫోన్ చేశాడు.

'నేను లోపలికి వెళ్ళి మేజరు ఫేతో మాట్లాడివచ్చాను. డోల్ఫస్ తీవ్రంగా గాయపడ్డట్టు తోస్తుంది. ఆయన రాజీనామా పెట్టాడు. కొత్త మంత్రివర్గం ఏర్పడింది. ఈ కొత్త మంత్రివర్గంలో కూడా మేజరు ఫే వైస్ ఛాన్సలరు అయ్యాడు." హెడ్ క్వార్టర్సువారు ఏమో అడిగితే వెబ్బరు తిరిగి ఇలా చెప్పాడు:
"వాళ్ళు మిలటరీ వాళ్ళుగా కనపడుతున్నారు. ఛాన్సలరీ ఉద్యోగులు - నూటయాభయిమంది - స్త్రీలు, పురుషులు కూడా - పెరటిలో బందీలై యున్నారు.''

ఈసరికి కమేండెంట్ - హోస్ రాట్ హంపెల్ - చేరుకున్నాడు. అతడు వెబ్బరును పిలిచి, "ఛాన్సలరు గాయపడి ఉంటే, ఆయన కోసం డాక్టరు అవసరం గదా! దొడ్డివాకిలి దగ్గరికి పరుగెత్తుకు వెళ్ళి, డాక్టర్ని పంపిస్తామని చెప్పిరా!" అని అన్నాడు. వెబ్బరు వెళ్ళి వచ్చి, "నేను తలుపుతట్టి అడిగితే, మరి డాక్టరుతో అవసరం లేదని సెంట్రీ జవాబు చెప్పాడు" అని తెలియజేశాడు. దానితో డోల్ఫస్ మరణించాడన్న సంగతి బయట ఉన్న వారికి తెలిసింది.

నాలుగు ఇరవై నిమిషాలకు మేజరు ఫే తిరిగి బాల్కనీలోకి వచ్చాడు. అతడి వెనక ఈసారి కూడా హోల్ట్ వెబ్బరు తయారయాడు. హోల్ట్ వెబ్బరు తిరిగి వెంటరావడమూ, తిరిగి ఏవో ఉత్తరువులను ఇస్తున్నట్టు కనబడ్డమూ చూచి, మేజరు ఫే తిరుగుబాటులో లేడన్న సంగతిని జనం తెలుసుకున్నారు. బాల్కనీలో నుంచి మేజరు ఫే దొడ్డిగుమ్మం వైపుకు రావలసిందని హంపెల్ దొడ్డి వాకిలి నుంచి తిరిగివచ్చి రిమెలెన్ కోసం వాళ్ళు ఎదురుచూస్తున్నారు. ఆయన అయిదారు నిమిషాలలో వస్తారు" అని ప్రకటించాడు.

అలాగే అయిదారు నిమిషాల తర్వాత ఒక వ్యక్తివచ్చాడు. అయితే, అతడు రిన్టెలెన్ కాదు, డోల్ఫస్ మంత్రివర్గంలో వాడైన న్యూస్టాక్టర్ సర్కరు. యుద్ధమంత్రి కార్యాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో నుంచి సరాసరి అతడు ఛాన్సలరీకి వచ్చాడు.

తర్వాత కొన్ని నిమిషాలకు మేజర్ ఫే మూడోసారి బాల్కనీలోకి వచ్చి "రిమెలెన్ ఎక్కడ?" అని అడిగాడు. వీధిలో నిలబడి ఉన్న న్యూస్తాటర్ - సర్మర్ "రిమెలెన్ రావడంలేదు" అని బదులు చెప్పాడు.

ఈ జవాబుకు విస్తుపోతూ, మేజరు ఫే, హోల్ట్ వెబ్బరు వైపుకు తిరిగి ఏమో అడగబోయాడు. ఇంతలో హైమ్ వీరు దళానికి చెందినవాడొకడు "భవనాన్ని ముట్టడించమా?" అని కేకవేశాడు. "వద్దు! నా ఉత్తరువు లేనిదే, ఏమీ చెయ్యవద్దు!" అని ఫే గద్దించాడు.

ఇందుకు న్యూస్తాడ్ టర్ - స్తర్మరు "కొత్త ప్రభుత్వం ఏర్పాటయింది. దానికి నేను ప్రతినిథిని. ప్రభుత్వం తరఫున తిరుగుబాటుదారుల్ని సురక్షితంగా దేశం వెలుపల విడిచి పెడతామని నేను మాట ఇస్తున్నాను. వాళ్ళను జర్మనీ సరిహద్దులలో విడిచి పెట్టే పూచీ మాది. ఇంకొక ఇరవై నిమిషాలలో లోబడక పోతే, మేము భవనాన్ని ముట్టడిస్తాము" అని బదులు చెప్పాడు.

ఈ జవాబును విని మేజరు ఫే "మీరు భవనాన్ని ముట్టడించడానికి వీలులేదు. నేను ప్రజాశాంతి రక్షణ మంత్రిని. నా అనుజ్ఞ లేనిదే మీరు ఏమీ చర్య జరపరాదు" అని అరిచాడు.

అప్పుడు, న్యూస్తాడ్టర్ - సర్మర్ తలపై కెత్తి, తీక్షంగా చూస్తూ, "మీరు పొరపడుతున్నారు. బందీలో ఉన్న మంత్రుల నిర్ణయాల్ని పాలించవద్దని కొత్త ప్రభుత్వం తీర్మానించింది. ఇప్పుడు అయిదు ఇరవై ఎనిమిది నిమిషాలైంది. అయిదు నలభై ఎనిమిది నిమిషాలకు భవనాన్ని ముట్టడిస్తాము" అని నిష్కర్షగా చెప్పాడు.

సరిగా అయిదు నలభై ఎనిమిది అయ్యేసరికి ఇక ముట్టడి ప్రారంభమౌతుందేమోనని అనుకుంటే, ఏమీ జరగలేదు. మేజర్ ఫే బాల్కనీలో నుంచి లోపలికి వెళ్ళిపోయాడు.

న్యూస్తాడ్ టర్ స్తర్మర్ బోనులోని సింహంలా ఇటూ అటూ తిరుగుతూ ఉన్నాడు. "ఆస్ట్రియావారి అంత్య సందేశమే ఇది!" అని కొందరు విదేశీయులు పరిహసించారు. అయితే ఏ క్షణాన పరిస్థితులు ఎలా పరిణమిస్తాయో అనే ఆందోళన మాత్రం అందరి ముఖాలలోనూ వ్యక్తమైంది. ఆరు గంటల నాలుగు నిమిషాలకు ఫే తిరిగి బయటికి వచ్చి, తిరుగుబాటుదార్లు లోబడ్డానికి అంగీకరించారనీ, కాని సురక్షితంగా తమను దేశం వెలుపలికి పంపించే విషయంలో ఏమి గ్యారంటీ ఇస్తారని అడుగుతున్నారనీ, చెప్పాడు. వాళ్ళు మిలటరీ బందోబస్తు కోరారు. "దాన్ని ఏర్పాటు చెయ్యగలం" అని న్యూస్తా టర్ - సర్మరు బదులు చెప్పాడు. "అయితే, మరి పదిహేను నిమిషాల వ్యవధి నిస్తారా?" అని హడిల్ తో - ఇతడు కుట్రదారులలోని వాడు - సంప్రదించి మేజరు ఫే అడిగాడు.

ఆరున్నరకు ఫే ఇంకొకసారి బాల్కనీలోకి వచ్చాడు. ఈ మధ్యలో అక్కడికి చేరుకుని నాయకత్వాన్ని వహించిన, జనరల్ జెహ్నాతో - ఈయన యుద్ధశాఖకు సహాయమంత్రి అతడు యేమో మాటాడబోయాడు. అయితే, అక్కడ గలభాలో వొకరికీ వినబడలేదు. అంచేత జెహ్నాం, న్యూస్తాటర్ - సర్మర్ : వీరిద్దరు దొడ్డి గుమ్మం వైపుకు వెళ్ళారు. వారు ఇలా వెళ్ళిన కాసేపటికి వియన్నాలోని జర్మన్ రాయబారి డాక్టర్ రీత్ అక్కడికి వచ్చాడు. ఇతడు వచ్చింది కుట్రదారుల్ని సురక్షితంగా సరిహద్దు వరకూ పంపుతామన్న వాగ్దానానికి సాక్షిగా ఉండడానికి, తర్వాత షుమారు ఆరు యాభై నిమిషాలకు జనరల్ జెహ్నాం తిరిగివచ్చి "స్టాఫ్ ఆఫీసర్" నాయకత్వం కింద మిలటరీ బందోబస్తు జరిపి, వాళ్ళను సురక్షితంగా పంపించడానికి అంగీకరించాము అని ప్రకటించాడు.

ఏడున్నర గంటల ప్రాంతాల మేజర్ ఫే దొడ్డి గుమ్మం గుండా బయటికి వచ్చివేశాడు. అతడు న్యూస్టాటర్ - స్తర్మరు దగ్గరికి వెళ్ళి "ఒక సిగరెట్ ఇవ్వండి" అని అడిగాడు. సిగరెట్ ఇస్తూ " డోల్ఫస్ చనిపోయినమాట నిజమేనా? " అని న్యూటర్ - స్తర్మర్ అడిగాడు.

"ఔను! చనిపోవడానికి ముందు, ఆయనతో నేను మాట్లాడినాను. నేను వెళ్ళినప్పుడు రక్తం కాల్వలు గడుతున్న గాయాలతో ఆయన సోఫా మీద పడి ఉన్నాడు" అని మేజర్ ఫే జవాబు చెపుతూ విచారోద్వేగంతో చేతిలోని సిగరెట్ ను నలిపి వేశాడు. తర్వాత "ఏదీ ఇంకొక సిగరెట్ ఇవ్వండి" అని అడిగాడు.

ఏడు యాభై నిమిషాలకు డాక్టర్ రీత్, కార్విన్ స్కే బయటికి వచ్చారు. ఈ సరికి కొత్త ఛాన్సలర్ డాక్టరు షూష్నిగ్ కూడా అక్కడికి చేరుకున్నాడు.

తరువాత షూష్నిగ్, జెఫ్నర్, న్యూటర్ - స్తర్మర్ ఈ నలుగురు మంత్రులు పక్కనున్న తోటలోకి వెళ్ళి అక్కడ పచ్చికతిన్నె మీద నిలబడి "కాబినెట్ మీటింగు" (మంత్రివర్గ సమావేశం) జరిపారు.
ఈ లోపుగా ఇరవై మిలటరీ లారీలు వచ్చి బైట నిలబడ్డాయి; తిరుగుబాటుదారుల్ని అరెస్టు చేసి లారీలలో యెక్కించడానికి పోలీసులు ఛాన్సలరీలో ప్రవేశించారు.
''సురక్షితంగా మేము జర్మనీ పోతున్నాము; మాకేమి?' అన్నట్టు ఆ నాజీకుట్రదారులు - ఆ హంతకులు పొగరబోతుతనంగా బయటికి వచ్చారు.

18

ఛాన్సలరీ దగ్గర నాజీలను ఎక్కించుకుని బయల్దేరిన మిలిటరీ లారీలు జర్మనీ సరిహద్దును చేరలేదు, - ఛాన్సలరీకి మైలు దూరంలోపుగా ఉన్న మరో కన్నర్ పోలీసు బేరక్స్ దగ్గరికి వెళ్ళి ఆగాయి. "సురక్షితంగా మిమ్మల్ని జర్మనీ సరిహద్దు దగ్గర వదిలిపెడతామని మాటయిచ్చి' ఇలా చెయ్యడం తప్పుకాదా?" అని అడగడానికి వీలున్నది. "ఇది తప్పుకా"దని ఆస్ట్రియా ప్రభుత్వం వారు కూడా అనలేదు. అయితే, వారు తమ నడవడిని సమర్థించుకోడానికి రెండు కారణాలను చెప్పారు. బందీలో ఉన్న మంత్రుల నిర్ణయాలను అంగీకరించమని ఇంటెరిం మంత్రివర్గం తీర్మానించింది. ఈ తీర్మానం ప్రకారం తిరుగుబాటుదారులకు అభయ మివ్వడానికి మేజర్ ఫేకు అధికారం లేదు. ఇది మొదటి కారణం. ఎవ్వరికీ ప్రాణాపాయం కలిగివుండని పక్షంలోనే తిరుగుబాటుదారులకు అభయ మివ్వవచ్చునని సాయంత్రం ఐదు గంటలకు ఇంటెరిం మంత్రివర్గం నిర్ణయించింది. ఈ నిర్ణయం సంగతి తెలియక న్యూటర్ - స్తర్మర్ అభయ మిచ్చాడు గనుక, దాన్ని పాటించవలసిన పనిలేదు. ఇది రెండో కారణం. నిజానికి ఈ రెండు కారణాలు లోకం కోసం తర్వాత ఆలోచించినట్టివి. ఇక, అసలు కారణమేమంటే, డోల్ఫస్ హత్యను గురించిన ఘాతుకమైన వివరాల్ని వినగానే డాక్టరు షూష్నిగ్ "ఈ హంతకుల్ని వదిలి పెట్టడానికి వీలులేదు" అని నిర్ణయించాడు. ఇదే భావాన్ని హోల్ట్ వెబ్బర్ విచారణ సందర్భంలో న్యూస్టారు - సర్మరు కింది విధంగా వెల్లడించాడు; "ఔను, సైనికుడిలా నేను వాగ్దానాన్ని చేసినమాట నిజం. ఐతే సైనికుడు చేసే వాగ్దానాలు ఇతర సైనికులకు వర్తిస్తవి గాని, ప్రాణాపథవకరంగా గాయపడి ఉన్న వ్యక్తికి వైద్యసహాయాన్ని, అంత్యకర్మల్ని నిరాకరించే అధమాధములకు కాదు."

డోల్ఫస్ హత్యలో పాల్గొన్న నాజీలు నిజంగా అధమాధములే! వారు ఛాన్సలరీలోని డ్రాయర్లను తెరిచి, బంగారపు గడియారాల్ని కాజేశారు. ప్రెసిడెంట్ మిక్లాస్ బీరువాను పగలగొట్టి పదహారు స్కిల్లింగ్సును - ఇవి ఆస్ట్రియన్ నాణ్యాలు -

దొంగిలించారు. చచ్చిపడివున్న డాక్టర్ డోల్ఫస్ జేబులో నుంచి మనీపర్సును కొట్టివేశారు. వారికి నిజంగా రాజకీయాదర్శాలు ఉంటే, ఆ ఆదర్శాల కోసమే వారు విద్రోహాన్ని జరిపి ఉంటే, ఇంత హీనంగా - ఇంత నీచంగా - ఇంత అసహ్యకరంగా ప్రవర్తించి ఉంటారా? వారు విద్రోహులు కారు, చోరులు, హంతకులు, మానవాధములు!

తిరుగుబాటుదారులలో పదమూడుమందిని ఉరితీశారు. హోల్ట్ వెబ్బరు, ప్లానెట్టి, ముగ్గురు పోలీసువాళ్లు : ఉరిపడ్డవారిలో వీరుకూడా ఉన్నారు.

తర్వాత ఏడు మాసాలకు రిన్టెలెన్ కేసు విచారణకు వచ్చింది. దేశద్రోహ నేరానికిగాను అతడికి ఆజన్మ కారాగార వాస శిక్షపడింది. అయితే, అతడు ఎంతో కాలంపాటు కారాగారంలో ఉండలేదు. కొన్ని నెలలోనే అతడి ఆరోగ్యం శిథిలమైంది. అప్పుడతడిని పోలీసు కాపుదలతో అదేదో శానిటోరియంకు పంపించారు.
ఛాన్సలరు పదవిని ఆశించడం! చివరికి శానిటోరియం గతికావడం! సాధారణంగా దేశద్రోహుల బ్రతుకు చివరికి ఇలాగే అవుతుంది!!

19

ఛాన్సలరును హత్యచేశారు; వైస్ ఛాన్సలరును ఖైదుచేశారు; చాన్సలరీని ఆక్రమించుకున్నారు. అయినప్పటికీ నాజీల కుట్ర కొనసాగలేదు; వారి విద్రోహం విజయవంతం కాలేదు. ఇది ఆశ్చర్యకరమైన విషయమే! ఐతే ఇందుకు తగిన కారణాలు లేకపోలేదు.

మొదటి కారణం : ఛాన్సలరీ ఆక్రమణకు నాయకత్వం వహించడానికి నియమితుడైన వ్యక్తి - ఇతడి పేరు కుంజ్. ఇతడు లాయరు - తీరా ఆక్రమణ చెయ్యడానికి బయల్దేరిన తర్వాత గుండె చెదిరి, కాలికి బుద్ధి చెప్పడం. జీబెన్ స్టెర్నె గాస్ భవనం నుంచి ఛాన్సలరీకి బయల్దేరిన మూడు ట్రక్కులలో మొదటి దానికి లీడరు - హోల్ట్ వెబ్బరు. రెండో దానికి లీడరు - హడిల్. ఇక మూడోదానికి కుంజ్ లీడరుగా వచ్చి, ఛాన్సలరీ ఆక్రమణకూ, ఆపై కార్యకలాపాలకూ బాధ్యత వహించ వలసింది. మార్గమధ్యంలో తప్పుకువెళ్ళాడో, లేక మొదటిలోనే ఉండాయించాడో తెలియదుగాని, ఇతడు చాన్సలరీకి చేరనేలేదు. తమ నాయకుడు కుంజ్ రాలేదు గదా అని తక్కిన కుట్రదారులు వెనుదీయక, ఛాన్సలరీని ఆక్రమించుకున్నారు. 'ముందు ఆక్రమణ మనం సాగిస్తే, ఆ తర్వాత వ్యవహారాన్ని నడపడానికి రిమెలెన్ వస్తాడుగదా!" అని వారు అనుకున్నారు. కాని, వారు అనుకున్నట్టు రిన్ కూడా రాలేదు. అప్పుడు ఏమి చెయ్యడానికీ తోచక వారు కుంజ్ బసచేసిన హోటెల్ కు ఫోన్ చేశారు. ఐతే ఆ వీరశిఖామణి అప్పటి కప్పటికే జర్మనీకి పలాయనాన్ని చిత్తగిస్తున్నాడు!

రెండో కారణం : ఛాన్సలరీ ఆక్రమణ జరిగిన వెంటనే - డోల్ఫస్ హత్య అయిపోయాడని విన్న వెంటనే - ప్రభుత్వాధికారాన్ని పరిగ్రహించవలసిన రిన్టెలెన్ వట్టి "ఫూల్"లా ప్రవర్తించడం. ఒకటి యాభై ఐదు నిమిషాలకు రవాగ్ నుంచి "మీరు ఛాన్సలరు అయ్యారనడం సర్వాబద్ధమని ప్రకటించండి" అంటూ "ఫోన్ మెసేజ్ వచ్చింది. "అలా ప్రకటించడానికి నాకు అధికారం లేదు" అని జవాబు చెబుతూ, అతడు "రిసీవరు" పెట్టివేశాడు. ఇలా చేసినవాడు పోనీ ఆ తర్వాతనైనా రంగంలోకి దిగి, ప్రభుత్వాధికారాన్ని చేజిక్కించుకోడానికి యత్నించాడా అంటే, అదీ లేదు. కేవలం చేతుల్ని వొడిలో పెట్టుకు కూర్చుని డాక్టరు ఫండరు రాగానే ఆయన వెంటపడి వెళ్ళి, బందీ అయ్యాడు. పగలు చేసిన ఈ అవకతవకలు చాల వన్నట్టు, ఆ రాత్రికి రివాల్వరుతో కాల్చుకున్నాడు. చివరికి ఈ పనిలో కూడా అతడు తెలివితక్కువనే

బయట పెట్టుకున్నాడు. ఆత్మహత్య చేసుకోడానికి ప్రయత్నించడం, ఆ ప్రయత్నంలో కూడా నెగ్గకపోవడం - ఇది తెలివి తక్కువ కాదూ?

రిన్‌టెలెన్ ఈ వింతనడవడికి కొందరు ఒక కారణాన్ని చెబుతారు. అది ఇది : డోల్ఫస్ మీద తిరుగుబాటు చెయ్యాలని రిన్టెలెన్ వియన్నాకు వచ్చినమాట నిజం. ఆ తిరుగుబాటు జూలై 25వ తేదీ నాడు జరగడానికి అతడు ఏర్పాట్లు జరిపిన మాట కూడా నిజం. అయితే ఆనాడు జరిగిన తిరుగుబాటు రిన్టెలెన్ ఏర్పాటు చేసిందీ కాదు; దానిలో పాల్గొన్నవారు రిన్టెలెన్ మనుష్యులూ కారు. హబీజ్ కు - పూర్వం చెప్పినట్టు, ఇతడు జర్మనీకి పలాయనమైన ఆస్ట్రియన్ నాజీ నాయకుడు - రిమెలెన్ అంటే చాలా అసూయ; ఎంతో అవిశ్వాసం. రాజ్యాధికారం ముందు రిన్టెలెన్ హస్తగతమైపోతే, ఆ తర్వాత అది నాజీలకు సంక్రమిస్తుందో, లేదో అని అతడికి భయం కూడా! అంచేత రిటైల్న్ తిరుగుబాటు జరిపింపదలచిన జూలై 25వ తేదీ నాడే హబీజ్ కూడా విడిగా ఇంకొక తిరుగుబాటును చేయించాడు. ఇందువల్ల జరుగుతున్న తిరుగుబాటు తమదో, కాదో తేల్చుకోలేక రిమెలెన్ తికమక పడ్డాడు.

ఇక, **మూడో కారణం** : దేశం మొత్తం మీద తిరుగుబాటు జరగకపోవడం, వియన్నా నుంచి "సిగ్నల్" ఇవ్వగానే దేశం అంతటిలోనూ విద్రోహజ్వాలలు ప్రజ్వలిస్తాయని నాజీలు ఆశపడ్డారు. జరగలేదు స్టెరియా, కారి థియా: కాని ఇలా ఈ రెండు రాష్ట్రాలలో మాత్రమే తిరుగుబాటు జరిగింది. రెండు రోజులపాటులో ప్రభుత్వం దీన్ని అణిచివేసి, శాంతిని నెలకొల్పింది.

నాల్గవ కారణం : జర్మనీ నుంచి సైనిక సహాయం రాకపోవడం. తాము విద్రోహాన్ని ప్రారంభించడమే తడవుగా జర్మనీ నుంచి "ఆస్ట్రియన్ లీజియన్" తమ సహాయానికి వస్తుందని ఆస్ట్రియన్ నాజీలు కొండంత ఆశ పెట్టుకున్నారు. ఈ ఆశ కేవలం ఆడియాస అయిపోయింది. సంవత్సరన్నర పాటు "మీరు తిరుగుబాటు చెయ్యండి; మీ వెనక నేనున్నాను" అని దుర్బోధ చేసిన హిట్లర్, తీరా తాను తోడ్పడవలసిన అవసరం వచ్చేసరికి - కొంచెం ముతకగా చెప్పాలంటే - తోక మడత పెట్టాడు. ఆస్ట్రియన్ సైన్యం విద్రోహంలో చేరుతుందని అనుకుంటే, అది జరగలేదు, పోనీ, ప్రజలైనా విద్రోహం పట్ల ఉత్సాహాన్ని కనపరుస్తారేమో అని ఆశిస్తే అదీ సంభవించలేదు. ఇందుకు తోడు "ఆస్ట్రియాలో నాజీ తిరుగుబాటును ఏమైనాసరే నెగ్గనివ్వను" అనే పట్టుదలతో ముసోలినీ తన సైన్యాలను ఒన్నరు కనుమ దగ్గర ఆయత్తపరిచాడు. ఆస్ట్రియా జర్మనీ వశం కావడంవల్ల ఇటలీకి కలిగే అనర్ధకాల మాట అలా ఉండగా, డోల్ఫస్ ముసోలినీ మిత్రుడు.

మిత్రుడు హత్యను ఇటాలియన్ డిక్టేటర్ సహించగలడా? ఇందుకు తోడు సరిగా డోల్ఫస్ ను నాజీలు హత్యచేసిన వేళకు డోల్ఫస్ ఆలుబిడ్డలు ముసోలినీ అతిథులుగా అతడి ఇంటిలో ఉన్నారు. అంచేత ముసోలినీ కోపానికి మరీ మితి లేకుండా పోయింది. "జర్మన్ సైన్యాలు ఆస్ట్రియాలోకి అడుగు పెడితే, నేను నా సైన్యాలను కూడా ఆస్ట్రియాలోకి నడుపుతాను" అని అతడు అన్నాడు. దాన్ని చూచి చల్లగా తప్పుకోవడమే ఉత్తమమని అనుకున్నాడు హిట్లర్. తర్వాత అతడు తన చాలలేని తనానికి తానే సిగ్గుపడి, ఈ సిగ్గు కోపం కాగా, "ఆస్ట్రియన్ లీజియన్"ను రద్దు చేశాడు; హబీఫ్ట్ ను బర్తరఫ్ చేశాడు; ఇక అతడు ఫ్రాన్ ఫెల్డ్ ను ఏమి చేశాడో తెలియదుగాని, - ఆ ఆస్ట్రియన్ నాజీ నాయకుడు అదృశ్యుడయ్యాడు.

పోతే, **చివర కారణం** ఇది : ఆస్ట్రియా ప్రెసిడెంటు విల్ హెర్మ్ మిక్లాస్ అదునుకు అవసరమైన ధైర్యసాహసాలను ప్రదర్శించడం. ప్రెసిడెంట్ మిక్లాస్ అంత పొడగరి కాడు; బొత్తిగా పొట్టివాడు కూడా కాదు. కాయం మాత్రం స్థూలమైనదే. మెల్లకళ్ళు. ఆకారాన్ని బట్టి చూస్తే, ఆయన రాజకీయ ప్రముఖుడని గాని, శక్తి సంపన్నుడని గాని, అనుకోవడానికి వీలే లేదు. ఆయన బడిపంతుళ్ళ కుటుంబంలో పుట్టాడు; తను కూడా కొంతకాలం పాటు బడిపంతులుగా పని చేశాడు. రోమన్ కాథోలిక్ మతం అంటే, ఆయనకు విపరీతమైన అభిమానం. యువకుడుగా ఉండగానే క్రిస్టియన్ సోషల్ పార్టీ

అభ్యర్థిగా, ఆయన ఆస్ట్రియన్ పార్లమెంటుకు సభ్యుడుగా ఎన్నికయ్యాడు. తర్వాత అనతికాలంలోనే తన నిష్పక్షపాత బుద్ధివల్లనేమి, తన ఋజువర్తనం వల్లనేమి, ఆయన అందరి గౌరవానికి పాత్రుడై, ఆస్ట్రియన్ కామన్సు సభకు స్పీకర్ అయ్యాడు. ఈ పదవి నుంచి ఛాన్సలర్ సైపెల్ సహాయంతో 1928 డిశంబరులో ఆస్ట్రియన్ రిపబ్లిక్ ప్రెసిడెంట్ పదవికి వచ్చాడు.

1934 ఫిబ్రవరి నాటి అంతర్యుద్ధ సందర్భంలో జోక్యం కలగ జేసుకోకుండా ఉండి, నిర్బలత్వాన్ని ప్రదర్శించి దేశానికి అపకారం జరగనిచ్చాడు. ఇందుకు పశ్చాత్తాప పడి కాబోలు, నాజీలు విద్రోహాన్ని జరిపినప్పుడు ఆయన ప్రశంసనీయమైన ధైర్య సాహసాలతో ప్రవర్తించాడు.

అసలు ప్రెసిడెంట్ మిక్లాస్ కూడా నాజీ హంతకులకు బలి కావలసిందేగాని, కొద్దిలో గండం తప్పిపోయింది. డోల్ఫస్ హత్య అయిన నాటికి ఒక రోజు ముందు క్లాగెన్ ఫర్ట్ పోలీసు వారు వెల్డెన్ లో వేసంగి సెలవుల్ని గడుపుతున్న మిక్లాస్ ను హత్య చేయడానికి కొందరు నాజీలు వెడుతున్నారని నమ్మకస్థుల ద్వారా తెలుసుకొని, వారి మోటారు కారును దారిలో ఆపివేశారు. ఈ మోటారుకారులోని వారిలో ఒకడు అంతకు మూడు రోజుల క్రితం నాడు మాత్రమే బర్లిన్ నుంచి వచ్చిన కారణాలు ఏమైతేనేమి గాని, 1934 జులై 25వ తేదీ నాటి నాజీ విద్రోహం నెగ్గలేదు; అప్పటిలో ఆస్ట్రియాకు హిట్లర్ దాస్య బాధ తప్పింది.

20

డాక్టరు కర్ట్ వాన్ షూష్నిగ్ జననం 1897లో. అతడి జన్మస్థానం ఇటలీలోనే గార్డ్ సరస్సు ప్రాంతం. షూష్నిగ్ జనన కాలం నాటికి ఈ ప్రాంతం ఆస్ట్రియా సరిహద్దులలోనే ఉండేది.

1915లో అతడు ఆస్ట్రియా సైన్యంలో వాలంటీరుగా చేరి, ఐరోపా మహాసంగ్రామంలో పాల్గొన్నాడు. అప్పటి కతడి వయస్సు పద్దెనిమిది సంవత్సరాలు. రెండు సంవత్సరాల పాటు యుద్ధం చేసిన తర్వాత 1919లో అతడిని ఇటాలియనులు ఖైదీగా పట్టుకున్నారు. అప్పటి నుంచి యుద్ధం పూర్తి అయ్యేవరకు అతడు ఇటాలియనుల "ప్రిజన్ క్యాంపు"లో ఉండవలసి వచ్చింది.

షూషింగ్ తండ్రి జనరల్ గా పనిచేస్తూ ఉండేవాడు. షూష్నిగ్ మొత్తం మీద స్థితిపరుల జాబితాలోనే వస్తాడు. కాథోలిక్ మతం అంటే అతడికి గాఢాభిమానం, పరమభక్తి. హాప్స్బర్ రాజవంశం అంటే కూడా అతడికి ఇంత అభిమానమూ, ఇంత భక్తి ఉన్నది.

ఇన్స్ బ్రిక్ విశ్వవిద్యాలయంలో అతడు 'లా'చదువుకుని, డాక్టరేట్ పట్టాన్ని పొందాడు. క్రిస్టియన్ సోషల్ ఛాన్సలర్ సైపెల్ ప్రోత్సాహం వల్ల - అతడి సహాయంతో - షూష్నిగ్ రాజకీయాలలో ప్రవేశించాడు. ప్రారంభంలో ఆతడు విద్యా మంత్రి. తర్వాత న్యాయశాఖా మంత్రి. తర్వాత - అంటే, డోల్ఫస్ మరణానంతరం - ఛాన్సలర్ అయ్యాడు.

డోల్ఫులోని చురుకుదనం గాని, వశీకరణ శక్తిగాని అతడిలో లేదు. కాని, అతడు చాలా నమ్మకస్థుడు, ఆలోచనాపరుడు, పాపభీతి ఉన్నవాడు. తొందరపాటు అతడిలో మచ్చుకైనా లేదు. మంచి, చెడ్డల్ని ఆలోచించుకోనిదే కర్తవ్యాన్ని నిర్ణయించుకోడు ఒకసారి కర్తవ్యాన్ని నిర్ణయించుకున్న తర్వాత, దానిని ఆచరణలో పెట్టడంలో సంకోచించడు.

షూష్నిగ్ కు రాజకీయాలంటే అసలు అభిరుచి లేదు. ఇతిహాసం, న్యాయశాస్త్రం : ఈ రెండింటిలో ప్రొఫెసర్ కావాలని అతడు ఆశిస్తూ ఉండేవాడు. అయితే, స్వదేశ పరిస్థితులు అతడిని రాజకీయ రంగంలోకి ఈడ్చాయి.

షూష్నిగ్ భార్య 1935 వేసవిలో - అంటే, షూష్నిగ్ ఛాన్సలర్ పదవికి వచ్చిన తర్వాత - మోటారుకారు ప్రమాదం వల్ల చనిపోయింది. అదే మోటారులో షూష్నిగ్ కూడా ఉన్నాడు గాని, కొద్దిలో అతడికి గండం తప్పింది. ఈ ప్రమాదానికి నాజీలే కారకులని అంటారుగాని, దీన్ని నిరూపించడానికి తగినంత సాక్ష్యం లేదు. భార్య వియోగం వల్ల షూష్నిగ్ కు కలిగిన పరితాపానికి అంతులేదు. ఒక్క రాత్రిలో అతడి తల నరిసిపోయింది; పాతిక సంవత్సరాలు ఒక్కసారిగా పైబడ్డట్టు అయింది. అయితే ఇందుమూలంగా అతడి దేశ సేవా తత్పరత తగ్గలేదు సరిగదా, మరింత వృద్ధి అయింది. "నిన్ను మట్టుపెడతాము సుమా!" అని అతడికి నాజీల దగ్గరి నుంచి బెదిరింపు ఉత్తరాలు వస్తూ ఉండేవి. వాటిని చూచి, భయపడిపోయి, రాజీనామా పెట్టమని అతడి భార్య వేడుకుంటూ ఉండేది. ఆమెను కాదనలేక అతడు రాజీనామాను పెట్టివేద్దామా అని అనుకుంటూ ఉండగానే మోటారుకారు ప్రమాదం సంఘటించింది. దీన్ని చూడగా "నేను ఏకాగ్రతతో దేశసేవ చెయ్యాలనే తలంపుతో భగవంతుడే ఇలా చేశాడేమో" అనే నమ్మకం అతడికి కలిగింది.

భార్య పోయిన రెండు సంవత్సరాలకు 1937లో - అతడికి కౌంటెస్ వెరా ఫర్డర్ మీద ప్రేమ కుదిరింది. ఈమె మీద ప్రేమ కుదురుకున్న తర్వాత, అతడికి అంతకు పూర్వ మున్నట్టి ధైర్య సాహసాలు, దేశసేవా తత్పరత కొంతవరకు వెనక బట్టినవని అంటారు.

ఇది ఎంతవరకు నిజమో మనకు తెలియదుగాని, డాక్టరు షూష్నిగ్ మాతృదేశ స్వాతంత్ర్యాన్ని కాపాడాలని శక్తి వంచన లేకుండా కృషి చేశాడు. అయితే - పాపం! - అతడి కృషి ఫలించలేదు. నాజీజం వెల్లువను అరికట్టాలని అతడు యత్నించాడు. కాని, ఆ వెల్లువలో తానే కొట్టుకు పోయాడు.

ఏ ప్రభుత్వానికైనా సరే బలం, - ప్రజలు! ప్రాణం, - ప్రజలు! ప్రజామోదం మీద ఆధారపడిన ప్రభుత్వం - ప్రజాప్రేమకు ఆలవాలమైన ప్రభుత్వం - అజేయంగా ఉంటుంది. ఇక ఇందుకు భిన్నమైనట్టి దానికి పతనం తప్పదు. సైనికశక్తి వల్లనో, రాజనీతిజ్ఞత వల్లనో, దౌర్జన్య ప్రయోగం వల్లనో, పరరాజ్యాల సహాయం వల్లనో అది ప్రాణాల్ని నిలబెట్టుకోవచ్చును. కాని ఇది తాత్కాలికంగా మాత్రమే!

షూష్నిగ్ ఈ సత్యాన్ని గుర్తించలేదు. డోల్ఫస్ మాదిరిగా అతడు కూడా దండనీతిని అవలంబించాడు; దౌర్జన్య విధానాన్ని అమలు జరిపాడు. ఇటలీ తోడ్పాటు నాకున్నది గదా, ప్రజలతో గాని, వారి ఆమోదంతో గాని నాకు పని ఏమని అనుకున్నాడు. ఇదే అతడి పతనానికి - అతడి పతనానికి మాత్రమే గాక - అతడు దేన్ని రక్షించ జూచాడో ఆ ఆస్ట్రియాదేశ పతనానికి కూడా కారణమైంది!

21

కసాయివాడు గొర్రెను పెంచుతున్నాడంటే, వాడికి దానిమీద ప్రేమ ఉన్నదనిగాని, తనకు లాభిస్తుందని తోచినప్పుడు దాన్ని వాడు కొయ్యకుండా ఉంటాడనిగాని, అనుకోవడం కంటే బుద్ధిమాంద్యం ఉంటుందా? పై వాక్యంలో కసాయివాడికి బదులుగా ముసోలినీ అనీ, గొర్రెకు బదులు ఆస్ట్రియా అనీ చదువుకుంటే, ఆస్ట్రియాకు నేటి దౌర్భాగ్యస్థితి ఎందుకు పట్టిందో విశదమౌతుంది.

ముసోలినీకి ఆస్ట్రియా అంటే ప్రేమలేదు. దాని స్వాతంత్ర్య సంరక్షణ అంటే పట్టుదలలేదు. అసలు అతడికి తన ఒక్కడి దేశాన్ని మినహాయిస్తే, మరి ఏదేశం మీదనూ ప్రేమలేదు; తన ఒక్కడి స్వాతంత్ర్యాన్ని మినహాయిస్తే, మరి ఎవడి స్వాతంత్ర్యాన్ని గురించి పట్టుదల లేదు. అతడికి కావలసింది ఇటాలియన్ సామ్రాజ్యం వీలైనంతవరకు విస్తరించడం; ఆ సామ్రాజ్యానికి తాను చండశాసనుడు కావడం. ఇదే అతడికోర్కె! అతడి ఆశ!! అతడి కల!!!

"అయితే, మరి ముసోలినీ ఆస్ట్రియా స్వాతంత్ర్య రక్షణకు ఎందుకు సహాయం చేశాడు?" ఈ ప్రశ్నకు ప్రత్యుత్తరం చెప్పడం కష్టమైన పనికాదు. ఆస్ట్రియాను కబళించాలని హిట్లర్ పొంచి కూర్చున్నాడు. తను ఉపేక్ష చేస్తే, అది అతడి నోట పడుతుంది. ఇక, తాను దాన్ని తన కాపుదలలో పెట్టుకుంటే, హిట్లరు తనతో బేరానికి దిగవలసి వస్తుంది. ఈ బేరం రాయితీగా ఉంటే, సరే! కాకపోతుందా, ఆస్ట్రియా వల్ల పొందగల ప్రయోజనాన్ని తానే పొందవచ్చును.

ముసోలినీకి ఆస్ట్రియా పట్ల మొదటి నుంచీ ఉన్న ఉద్దేశం - దురుద్దేశం అని అంటే ఎక్కువ సమంజసంగా ఉంటుందేమో - ఇదేనని చెప్పడానికి ఒక్క నిదర్శనం చాలు. 1932 ఆగష్టు - సెప్టెంబరు ప్రాంతాలలోనే ఆస్ట్రియా విషయమై ఆతడు హిట్లరుతో రహస్య రాయబారాల్ని నడిపాడు. అప్పటికి హిట్లరు జర్మనీలో అధికారానికైనా రాలేదు. పైగా, అప్పటికి ఆస్ట్రియా పైన ఇటలీకి "గార్డియన్‌షిప్" ఏర్పడలేదు. అయినప్పటికీ ముసోలినీ - తనకు నమ్మినబంటు అయినట్టి సీనార్ యూజెనియా మొర్రెల్ ద్వారా - మ్యూనిచ్ లో ఉన్న హిట్లరుకు ఇలా వర్తమానం చేశాడు : "ఆస్ట్రియాను స్వతంత్రంగానే ఉంచుతూ, ఆ దేశంలో నీకూ, నాకూ కూడా అనుకూలంగా ఉండే ప్రభుత్వాన్ని స్థాపించుదాము. ఇలా మనం స్థాపించే ప్రభుత్వానికి ప్రస్తుతం ఆస్ట్రియాలో ఉన్న హైమ్ వీరను అండగా ఉంచుదాము". ఆనాటికే హైమ్ వీర్ పోషణ నిమిత్తం ముసోలినీ రహస్యంగా ధనసహాయాన్ని చెయ్యసాగాడు. అంచేత ఈ ప్రయివేట్ సైన్యాన్ని తాను ఉద్దేశిస్తున్న నాజీ - ఫసిస్టు ప్రభుత్వానికి అండగా నిలిపితే, ఆ ప్రభుత్వం తన గుప్పిటిలోనే ఉంటుందన్నమాట! ఇంత పెద్ద పన్నాగం ముసోలిని పంపిన వర్తమానంలో ఇమిడివుంది. దీన్ని హిట్లరు వెంటనే గ్రహించాడు. గ్రహించి, "హైమ్ వీరును అండగా నిలపడం దేనికి? నాజీ సైనిక దళాలు లేవా?" అని అన్నాడు దీనితో అప్పటి రాజీ ప్రయత్నాలు భగ్నమైపోయాయి.

తర్వాత ఆస్ట్రియాలో నాజీలు విజృంభించడమూ, డోల్ఫస్ ఛాన్సలర్ కావడమూ, నాజీల పీడను వదిలించుకోడానికి డోల్ఫస్ ముసోలినీ చంకకిందికి చేరడమూ, ఆస్ట్రియా మూలంగా జర్మనీ, ఇటలీ దేశాల మధ్య వైరం పెరగడమూ జరిగింది.

కొత్తగా అధికారానికి వచ్చిన తనకు ఇటలీతో వైరం పెంచుకోవడం క్షేమదాయకం కాదేమోనని హిట్లరుకు క్రమక్రమంగా తోచసాగింది. అతడి అనుచరులు కూడా ఇదే అభిప్రాయాన్ని వెల్లడించారు. అప్పు డతడు ఆస్ట్రియా విషయంలో ఏదైనా రాజీకి రావాలనే తలంపుతో 1934 ప్రారంభంలో వెనిస్ నగరానికి వెళ్ళి, ముసోలినీని కలుసుకున్నాడు. కాని, ఈ సమావేశం నిష్ఫలమైంది. విభిన్న దేశాలలో పుట్టినవి గనక వేర్వేరు పేర్లు వచ్చాయి గాని, అంతరంగంలో ఫేసిజంకూ,

నాజీజంకూ భేద మేమీ లేదు. ఇక, వాటి నాయకులు దురాశలోనూ, దుర్మార్గంలోనూ, దురహంకారంలోనూ, ఒకరిని మించినవా రొకరు. అంచేత వారిద్దరికీ మైత్రి కుదరవలసింది. కాని, ఎంచేతనో ఈ ప్రథమ సమావేశంలో వారు పరస్పరం అసహ్యించుకోవడం జరిగింది.

ముసోలినీ హిట్లరును చులకనగా చూచాడు; హిట్లరు ముసోలినీని అనుమానంగా చూచాడు. ఇక, వారి మధ్య రాజీ పొసగలేదంటే, ఆశ్చర్యం లేదుగదా!

వెనిస్ నుంచి తిరిగివచ్చిన తర్వాత - సగం ముసోలినీ మీద కోపం చేత కాబోలు డోల్ఫుసను హత్య చేయించాడు. ఈ హత్య జరిగిన వెంటనే జర్మన్ సైన్యాలు ఆస్ట్రియాలో ప్రవేశించ వలసిందే! అయితే ముసోలినీ "కోడ్' ద్వారా పంపించిన సందేశం నాజీ గూఢచారుల చేతిలో పడింది. దీన్ని "డీ సైఫర్" చేసి చూచుకుంటే, ఇలా ఉంది : "నాజీల చర్యలు ఆస్ట్రియా స్వాతంత్ర్యానికి భంగకరంగా రూపొందితే, ఇటాలియన్ సైన్యం ఆస్ట్రియాలో ప్రవేశించి, మ్యూనిక్ నగరం వైపుకు దండెత్తి వెళ్ళాలి". దీన్ని చూచి, హిట్లర్ బెదిరిపోయాడు. " ఆస్ట్రియాకు తాత్కాలికంగా ఒక గండు తప్పింది.

అయితే, ఇటలీ అబిసీనియా మీద దండయాత్రను ప్రారంభించడంతో పరిస్థితులు తారుమారు అయిపోయాయి. ఆస్ట్రియా స్వాతంత్ర్య రక్షణకు తాను బాధ్యత వహిస్తే అందుకు ప్రతిఫలంగా బ్రిటన్ - ఫ్రాన్సులు తాను అబిసీనియాను ఆక్రమించుకోడానికి అనుకూలిస్తాయని ముసోలినీ అనుకున్నాడు. అతడు ఇలా అనుకోడానికి తగినంత ఆధారం లేకపోలేదు కూడా. 1935 మార్చి 16వ తేదీనాడు జర్మనీ - వర్సయిల్స్ సంధి షరతుల్ని ధిక్కరించి, ఆయుధ సేకరణ కార్యక్రమాన్ని ప్రకటించింది. దీన్ని చూడగానే బ్రిటన్, ఫ్రాన్సు, ఇటలీ రాజ్యాలకు జర్మనీని అదుపాజ్ఞలలో పెట్టవలసిన అవసరం వచ్చినట్లు తోచింది. అంతట ఆ మూడు రాజ్యాలు 1935 ఏప్రిల్ 11వ తేదీనాడు స్ట్రెస్సాలో సమావేశమై, తమ కర్తవ్యం ఏమని సమాలోచనలు జరిపినవి. ఈ సమాలోచనలలో ఆస్ట్రియా స్వాతంత్ర్య రక్షణకు ఉపాయాలు ఏ వేవి అనే సమస్య కూడా చర్చకు వచ్చింది. అప్పుడు ముసోలినీ "ఆస్ట్రియా పూచీ నాది" అని చెప్పాడు. "అయితే, ఇటలీకి సామ్రాజ్యం విషయంలో ఉన్న కోర్కెల్ని కొన్నింటిని ముందుగా తీర్చవలసి ఉంటుంది సుమా!" అని కూడా అతడు హెచ్చరించాడు. ఇందుకు బ్రిటన్ - ఫ్రాన్సులు "సరే" అని అనలేదుగాని, "కా" దని కూడా ఖండితంగా చెప్పలేదు. దీన్ని చూచి "మౌనం అర్ధాంగీకారం" గదా అని ముసోలినీ అనుకున్నాడు. ఇందుకు తగినట్టు స్ట్రెస్సా సమావేశానికి మూడు మాసాల ముందు 1935 జనవరి మొదటి వారంలో - ఫ్రెంచి ప్రధాన మంత్రి లావల్ రోం నగరానికి వెళ్ళి, ఆస్ట్రియా స్వాతంత్ర్య సంరక్షణ విషయమై ముసోలినీతో సంభాషణలు నడపడమూ, ఈ సంభాషణలలో అతడు అబిసీనియాను ఇటలీ ఆక్రమించుకుంటే తమకు అభ్యంతరం లేదని చూచాయగా చెప్పడమూ జరిగింది కూడా!

దీన్ని బట్టి ఆస్ట్రియా స్వాతంత్ర్య సంరక్షణకు తాను పూచీ పడ్డంతవరకు, బ్రిటన్ ఫ్రాన్సులు తన అబిసీనియా జైత్రయాత్రకు అభ్యంతరం చెప్పవుగదా అనే ధైర్యంతో ముసోలినీ ఆ అభాగ్య రాజ్యం మీదికి తన సైన్యాలను పంపించాడు. కాని, అతడు తీరా ఈ పనిచేసిన తర్వాత బ్రిటన్ ఫ్రాన్సులు తలవని తలంపుగా ఎదురు రావడమూ, నానాజాతి సమితి ద్వారా శాన్షన్సు ప్రకటించడమూ జరిగింది. దీనితో ముసోలినీ అనేక చిక్కులలో పడిపోయాడు. హిట్లరుకు మంచి అదును దొరికింది.

ఇప్పుడు జర్మనీ రెండు మార్గాల్ని అవలంబించవచ్చు : శాన్షన్సు ప్రకటించిన రాజ్యాలతో చేరి, అది ఇటలీని ఉక్కిరి బిక్కిరి చెయ్యవచ్చును; సెంట్రల్ యూరప్లో ఇటలీకి గల ప్రతిష్ఠను భగ్నం చేసి, తనదే పై చెయ్యి అనిపించుకోవచ్చును. లేదా, అది ఇటలీ పట్ల తాటసాన్ని వహించి, దాని సదభిప్రాయాన్ని సంపాయించు కోవచ్చును. ఈ రెండింటిలో రెండో మార్గమే ఉత్తమమైనదిగా హిట్లర్ నిర్ణయించాడు.

ఈ నిర్ణయానికి రావడానికి ముందు అతడు చేసిన ఆలోచనలు ఇవి : "ఇటలీ సద్భావాన్ని సంపాయించుకుంటే, రైలాండ్ లోను, సెంట్రల్ యూరప్ లోను తమ చిత్తం వచ్చిన ఆట ఆడవచ్చును. అబిసీనియా విషయంలో బ్రిటన్ - ఫ్రాన్సులు ఇటలీని కలిసి ప్రతిఘటిస్తున్నా, వీటి ఆశయాలలో కొంత విభేద మున్నది. బ్రిటన్ తాపత్రయం తన మెడిటరేనియన్ రహదారికి ముప్పు రాగూడదని మాత్రమే! ఇక ఫ్రాన్సు నేను రైన్ లాండ్ ను నా సైన్యంతో ఎక్కడ ఆక్రమించుకుంటానో అని మాత్రమే భయపడుతున్నది. అంచేత ఈ రెండు రాజ్యాలు ఇటలీతో పేచీపడుతూ ఉండగా, రైన్ లాండ్ కు నేను నా సైన్యాన్ని పంపుతాను. అప్పుడు "రై లాండు జర్మనీ సైన్యం ఆక్రమించడాన్ని ప్రతిఘటించవా?" అని ఫ్రాన్సు బ్రిటన్ ను అడుగుతుంది. మెడిటరేనియన్ లో ఇటలీ వల్ల నాకు అపాయం సంభవిస్తే నీవు నాకు తోడ్పడతావా?" అని బ్రిటన్ ఫ్రాన్సును అడుగుతుంది. ఈ బేరాలు చివరికి ముడిపడవు. పడుతుంది.

"ఇంతేగాక, ఈనాడు ఇటలీ అబిసీనియా మీద అక్రమానికి దిగిందని నానాజాతి సమితిలోని రాజ్యాలు దానిమీద శాక్షన్సును ప్రకటించినవి. రేపు ఈ రాజ్యాలే నా మీద కూడా ఇదే చర్యను జరపగూడదా? అంచేత శాన్షన్సు విధానాన్ని నేను జయప్రదం కానివ్వకూడదు; దాన్ని భగ్నం చెయ్యాలి".

హిట్లర్ చేసిన ఈ ఆలోచనలు సరియైనవే అని త్వరలోనే నిరూపితమైంది. 1936 మార్చి 7వ తేదీనాడు అతడు తన సైన్యాన్ని పంపించి, రైన్ లాండను ఆక్రమించుకున్నాడు. ఇది వర్సయిల్స్ సంధి షరతులకూ, లోకార్నో ఒడంబడికకూ భిన్నమైన కార్యమే అయినప్పటికీ, బ్రిటన్ - ఫ్రాన్సులు - హిట్లర్ చేసిన యోచనల ప్రకారమే - ఏ విధమైన చర్యను జరపలేక పోయాయి!

"హిట్లరు తనకు లాభిస్తున్నది గదా అని ఇటలీ పట్ల తాటస్థ్యాన్ని అవలంబించవచ్చును. అయితే, జర్మనీకీ, ఇటలీకీ రాజీ కుదరడానికి ఆస్ట్రియా తప్పకుండా ప్రతిబంధక మౌతుంది" అని బ్రిటన్ - ఫ్రాన్సులు ఈ సమయంలో ఆశపడ్డాయి. కాని, ఈ ఆశ కూడా అడియాస అయింది. అబిసీనియా యుద్ధం కొనసాగిన కొద్దీ, శాన్షన్స్ అమలులో ఉన్న కొద్దీ, ఇటలీ బలం తగ్గసాగింది; జర్మనీ బలం హెచ్చ సాగింది. అంచేత ఏదో ఒక విధంగా తాను ఆస్ట్రియా విషయంలో జర్మనీతో రాజీకి రావడమే శుభప్రదమని ముసోలినీకి తోచసాగింది. అంచేత, 1935 ఆగష్టు నెల నాటికే అతడు రాజీ విషయమై రోం నగరంలోని జర్మన్ రాయబారి హెవాన్ హాసెల్ లో సంభాషణలు ప్రారంభించాడు.

ఒక వైపున ముసోలినీకీ, జర్మన్ రాయబారికీ మధ్య ఇలా సంభాషణలు జరుగుతూ ఉండగా, ఇంకోవైపున బ్రిటీష్ ప్రభుత్వం తరపున సర్ ఆస్టిన్ ఛేంబర్లియన్ వియన్నా వెళ్ళి, ఆస్ట్రియా ఇక ఇటలీ మీద ఆశ పెట్టుకోవడం కూడదనీ, జర్మనీతో అనుకూలమైన రాజీని కుదుర్చుకోవడం మంచిదనీ సలహా ఇచ్చాడు. ఈ సలహా స్వీకరించడమా, కూడదూ అని కొంత కాలంపాటు సంకోచించిన తర్వాత ఛాన్సలర్ షూష్నిగ్ రోం నగరానికి వెళ్ళి, ముసోలినీని "నీవు ఏమి చెబుతావు?" అని అడిగాడు. ఇందుకు "నా ఉద్దేశంలో కూడా రాజీకి రావడమే మంచిది" అని ముసోలినీ అన్నాడు.
ఇక్కడ "రాజీ" అనే మాటకు ముసోలినీ చెప్పుకున్న అర్థం 'ఆస్ట్రియా స్వాతంత్ర్యానికి నామ మాత్రంగా భంగం రాకుండా, ఆ రాజ్యం హిట్లర్ అధీనమై పోవాలి' అనే! అతడు ఇలా అర్థం చెప్పుకున్నాడని చెప్పడానికి ఈ ఒక్క నిదర్శనం చాలును : అప్పటిలో తన విదేశాంగ శాఖకు అధికారిగా ఉన్న డాక్టర్ సువిచ్ జర్మనీకి ప్రతికూలుడని ప్రతీతి ఉంది. అంచేత జర్మనీ విశ్వాసాన్ని సంపాయించాలంటే, అతడిని బర్తరఫ్ చెయ్యక తప్పదుగదా! ముసోలినీ సరిగా ఇదే పనిని చేశాడు. అతడు డాక్టర్ సువిచ్ ను తొలగించి, అతడి స్థానంలో జర్మనీ అంటే అభిమానం ఉన్న తన అల్లుడు కౌంట్ సియానోను నియమించాడు.
కసాయివాడికి ఇక గొర్రెను కొయ్యడం లాభమని తోచాలేగాని, సంకోచిస్తాడా!

22

అశ్రద్ధ, అజాగ్రత్త ఇవి రెండూ హెర్ వాన్ ఫ్రాంజ్ పాపన్లో ప్రధానమైన లక్షణాలు. గత ఐరోపా మహాసంగ్రామం రోజులలో అతడు అమెరికాలో జర్మన్ రాయబారిగా ఉంటూ ఉండేవాడు. అప్పు డొకనాడు న్యూయార్కు నగరంలో అతడు ఒక టాక్సీలో తన "ఎటాచీ కేస్"ను అశ్రద్ధగా వదిలివేశాడు. ఈ "ఎటాచీ కేస్"లో బ్రిటన్, ఫ్రాన్సు, ఇటలీ మొదలైన రాజ్యాలవారి ఓడల్ని బాంబులు వేసి ముంచి వేయడానికి తగిన ప్లాను లున్నాయి. ఈ కుట్ర వెల్లడి కావడం వల్ల జర్మనీ ప్రతిష్ఠకు భంగం రావడమే కాకుండా, ఈ విషయంతో జోక్యమున్న ఆస్ట్రియన్ ఎంబసీ (రాయబారి కార్యాలయం) కూడా చిక్కుల పాలైంది. పోనీ, ఇంతటితో అతడు జాగ్రత్తగా ఉండడం నేర్చుకున్నాడా? అబ్బే! లేదు అమెరికా ప్రభుత్వం "నీవు మా దేశం నుంచి వెళ్ళిపో!" అని ఆజ్ఞాపించగా, అతడు స్వదేశానికి బయల్దేరాడు. దారిలో ఒక బ్రిటీష్ యుద్ధనౌక అతడి ఓడను సోదా చేసింది. ఈ సోదాలో కొంపల్ని తీసే డాక్యుమెంట్సు మరికొన్ని దొరకడమే కాకుండా, అమెరికాలోని జర్మన్ గూఢచారుల కిచ్చిన మొత్తాన్ని తెలిపే చెబుక్ కూడా దొరికింది. దాని ద్వారా అమెరికాలో ఉన్న జర్మన్ గూఢచారుల్ని అందరినీ కూడా అరెస్టు చెయ్యడానికి వీలు చిక్కింది. తర్వాత 1931లో కూడా అతడు ఇలాంటి అవకతవక పనినే చేశాడు : ఆ సంవత్సరంలో హెర్ వాన్ పాపన్ - అప్పు డతడు జర్మనీకి ఛాన్సలర్ - ఎన్నికలను జరిపాడు. ఈ ఎన్నికలలో తలవని తలంపుగా నాజీలు చాలా "సీట్సు"ను గెలుచుకున్నారు. అప్పుడిక పాపన్ కర్తవ్యం తన ఛాన్సలర్ పదవికి రాజీనామా ఇవ్వడమే! అయితే, జర్మనీ ప్రెసిడెంట్ హెర్ వాన్ హిండెంబర్గు రాజీనామా ఇవ్వవద్దనీ, కొత్తగా ఏర్పడ్డ రైష్ స్టార్ ను - ఇది జర్మనీ పార్లమెంటు - రద్దు చెయ్యమని చెప్పాడు. 'సరే'నని పాపన్ "రైష్ స్టాగ్" సమావేశానికి వస్తూ ప్రెసిడెంట్ సంతకం పెట్టి ఇచ్చిన "డికి"ని ఎక్కడనో పెట్టి, మరిచిపోయాడు. అయితే, అదృష్టం కొద్దీ అది తుదిక్షణంలో కనబడింది.

అశ్రద్ధకు, అజాగ్రత్తకు ఇంత పేరు పడ్డప్పటికీ 1936లో ఆస్ట్రియాతో రాయబారాన్ని నడిపే సందర్భంలో పాపన్ చాలా చురుకుతనాన్ని, తెలివితేటల్ని, చూపించాడనే చెప్పాలి. 1934 జూన్ 30వ తేదీనాడు హిట్లర్ జర్మనీలో జరిపిన జరిపించిన భీషణహత్యా కాండలో హెర్వాన్ పాపన కూడ హతుడై ఉండవలసిందే! కాని, 1933లో తను ఛాన్సలర్ పదవిని సంపాయించుకోడానికి చేసిన యత్నాలకు పాపన్ చేసిన తోడ్పాటుకు కృతజ్ఞతగా కాబోలు, హిట్లర్ అతడి ప్రాణాన్ని కాపాడి, వియన్నాకు రాయబారిగా పంపించాడు! ఇలా పంపుతూ "ఆస్ట్రియా నాగుప్పిటిలోకి రావడానికి నీవు శక్తివంచన లేకుండా కృషిచేసి, నా పట్టుదలను నెగ్గించాలి సుమా!" అని హెచ్చరించాడు. ఈ హెచ్చరికను జ్ఞాపకం ఉంచుకుని - జ్ఞాపకం ఉంచుకోక పోతే తనకు పట్టే గతిని కూడా తలచుకొని పాపన్ చాలా మెలకువతో సంచరించాడు. ఆస్ట్రియాను లొంగదీసుకోడానికి అతడు అవలంబించిన విధానం ఇది : ఆస్ట్రియన్ రాజకీయ వేత్తలలో ప్రముఖులైన వారిని ఒక పక్కకు పిలవడమూ, వారి చెవిలో "నాకు కూడా నాజీ ప్రభుత్వం అంటే అభిమానం ఏమీ లేదు. అయితే, మనమందరము జర్మన్ జాతి క్షేమం కోసం పాటుపడాలి" అని ఊదడమూ. ఈ విధానం వల్ల సత్వర ఫలితాలు కనబడని మాట నిజం! అయితే చివరికి ఇదే వాంఛాసిద్ధిని కూర్చింది. ఈ విధానాన్ని అవలంబించడంలో - జాన్ గంథర్ చక్కగా చెప్పినట్టు - పాపన్ చేసిన ఆలోచన ఇది : "వచ్చే వారంలో పెండ్లాడబోతున్న కన్యను వెంటనే అనుభవించితీరాలని పట్టుపట్టడంలో అర్థం లేదుగదా!"

రోజులు బాగుండబట్టి, అతడికి అంతర్జాతీయ రాజకీయ పరిస్థితులు కూడా - ఇంతకు ముందు వివరించినట్టు - కలిసి వచ్చాయి. ఈ అన్ని అవకాశాల్ని ఉపయోగించుకొని, 1936 జులైలో పాపన్ ఆస్ట్రియాలో ఒడంబడికను కుదర్చగలిగాడు. ఈ ఒడంబడిక షరతులు ఇవి :

(1) జర్మనీ ఆస్ట్రియా స్వాతంత్ర్యాన్ని ఆమోదించడం;

(2) ఆస్ట్రియా తను జర్మన్ జాతికి చెందిన రాజ్యాన్ని అని అంగీకరించి, అందుకు అనుగుణ్యంగా నడుచుకోవడం.
(3) ఉభయరాజ్యాలు ఒకదాని ఆంతరంగిక వ్యవహారాలలో ఇంకొకటి జోక్యం కలగజేసుకోకుండా ఉండడం.
(4) ఆస్ట్రియా నాజీ ఖైదీల నందరిని విడుదలచేసి, నాజీలు పార్టీగా కాకుండా - వ్యక్తులుగా 'ఫాదర్ లాండ్ ఫ్రంట్'లో చేరడానికి అనుమతించటం.

ఈ ఒడంబడికమీద సంతకాలు జరగగానే హిట్లర్ - షూష్నిగ్ - ముసోలినీల మధ్య అభివందన తంతివార్తలు నడిచాయి. దీన్ని చూచి " అబ్బ! ఇప్పటికి ఆస్ట్రియా సమస్య పరిష్కారమైంది!" అని అమాయకులు కొందరు సంతోషపడ్డారు. అయితే, ఈ భ్రమ తొలగడానికి ఎంతో కాలం పట్టలేదు!

జర్మనీతో ఒడంబడికకు రావడంవల్ల ఆస్ట్రియా చిక్కులు తీరలేదు గదా, హెచ్చిపోయాయి. "హిట్లరుతో ఇప్పుడు మనకు వైరం లేదు. అంచేత మనకు నాజీల బాధ తప్పుతుంది" అని షూష్నిగ్ ఆశించాడు, కాని ఆ బాధ తప్పలేదు. "ఆస్ట్రియా తను జర్మన్ జాతికి చెందిన రాజ్యాన్ని అని అంగీకరించింది గనక, జర్మన్ జాతికి చెందిన రాజ్యంలో నుంచి జర్మనీ రాజ్యంగా పరివర్తన చెందడానికి అట్టే కాలం పట్టదు" అని హిట్లర్ అనుకున్నాడు, కాని అతడి ఆశ ఈడేరే సూచనలు కనబడలేదు. ఇందువల్ల ఒడంబడిక జరిగిన కొన్ని నెలలకే జర్మనీ, ఆస్ట్రియా డిక్టేటర్లకు ఇద్దరికీ కూడా ఆశాభంగం కలిగింది.

షూష్నిగ్ ఒడంబడికకు అంగీకరించడానికి అనేక కారణాలున్నవి - నిజమే! అయితే, అతడి దృష్టిలో ప్రధాన కారణం జర్మనీ అవలంబిస్తున్న బహిష్కరణ విధానం. ఆస్ట్రియాకు విహారార్థం వెళ్ళే వారి మీద హిట్లర్ అమలుపరచిన నిషేధాల వల్ల ఆస్ట్రియాకు "టూరిస్టుల" ద్వారా వచ్చే పెద్ద ఆదాయం పడిపోయింది. ఇందుకు తోడు ఆస్ట్రియా - జర్మనీ దేశాల మధ్య ఉన్న వర్తక వ్యాపారాలకు కూడా హిట్లర్ అనేక ప్రతిబంధకాల్ని కల్పించాడు. ఇందువల్ల కూడా ఆస్ట్రియాకు నష్టం వాటిల్లింది. ఈ విధంగా హిట్లర్ తమకు అనేక విధాల నష్టాన్ని కలిగించడాన్ని చూచి, జర్మనీతో ఒడంబడికకు రాక తప్పదని షూష్నిగ్ నిర్ణయించుకున్నాడు. ఐతే, ఒడంబడిక జరిగిన తర్వాత కూడా ఆస్ట్రియా నష్టం పూడనూ లేదు; దాని ఆర్థికపు చిక్కులు తీరనూ లేదు. నిజానికి ఇందులో ఆశ్చర్య మేమీ లేదు గూడా! హిట్లరుకు కావలసింది ఆస్ట్రియా ఆక్రమణ.

అది జరగనంతవరకు అతడు ఆ దేశాన్ని సుఖంగానూ, శాంతిగానూ ఉండనిస్తాడా? ఈ పరిస్థితిలో జర్మనీ బహిష్కరణం నుంచి తప్పించుకోడానికి షూష్నిగ్ కు ఒక ఉపాయం తోచింది. అది ఏమంటే, - హంగరీ, జెకొస్లోవాకియా, రుమేనియా, యూగోస్లావియా రాజ్యాలతో ఒడంబడికకు రావడం. ఈ అన్ని చిన్న రాజ్యాలలోనూ పలుకుబడిని సంపాయించుకోవాలని ముందు ముసోలినీ ప్రయత్నించాడు. ఆ తర్వాత - ముసోలినీ అబిసీనియా యుద్ధంలో నిమగ్నుడై ఉండగా హిట్లర్ ఇదే పనికి పూనుకున్నాడు. ఇలా వీరు పలుకుబడి సంపాయించుకోవడం కోసం ప్రయత్నించడం కేవలం తమ స్వార్థసిద్ధికోసమే గాని, ఈ రాజ్యాలను ఏమో తవ్వి నెత్తి కెత్తుదామని కాదు. అవసరమని తోచినప్పుడు వీరిద్దరు ఈ రాజ్యాలను తమతో పాటు యుద్ధాలలోకి ఈడుస్తారు కూడా! అంచేత ఈ చిన్న రాజ్యాలు ఏదో ఒక పెద్ద రాజ్యాన్ని అంటి పెట్టుకుని, దాని స్వార్థసిద్ధికి సాధనాలు కావడంకంటె, తమలో తాము సైనిక రక్షణ కోసమూ, వర్తక వ్యాపారాల అభివృద్ధికోసమూ ఏర్పాటు చేసుకోవడం క్షేమదాయకం.

ఇలా ఆలోచించి, డాక్టర్ షూష్నిగ్ హంగరీ, జెకొస్లోవాకియా, రుమేనియా, యూగోస్లావియా ప్రభుత్వాలలో ఒడంబడిక కోసం రాయబారాల్ని నడిపాడు. కాని, ఆస్ట్రియా దురదృష్టం కొద్దీ ఈ రాయబారాలు ఫలించలేదు.

ఒక వైపున పైన చెప్పిన రాజ్యాలతో రాయబారాలను సాగిస్తూ, ఇంకోవైపున ఆస్ట్రియా స్వాతంత్ర్య సంరక్షణ కోసం అతడు ఇంకొక యోచనకూడా చేశాడు. ఈ యోచన ఏమంటే, - హాపీ బర్గు వంశీయుడైన ఆటో రాకుమారుడికి పట్టంకట్టడం. ఐతే ఇది కొత్త యోచన కాదు. డాక్టర్ డోల్ఫుస్ పరిపాలనా కాలం నుంచీ కూడా ఇది ఆస్ట్రియన్ రాజకీయ వేత్తల మనస్సులలో పనిచేస్తూనే ఉంది.

ఆటో రాకుమారుడికి పట్టం కట్టడంలో ఆస్ట్రియా తిరిగి "మాన్మారిష్" రాజ్యం అవుతుంది. అప్పుడు డిక్టేర్ షిప్ రాజ్యంగా ఉన్న జర్మనీకి ఆస్ట్రియా ఆక్రమణానికి దండయాత్ర తప్ప ఇతర సాధనం ఉండదు. జర్మనీ ఇలా బహిరంగంగా దండయాత్ర జరిపితే, ఇటలీ, ఫ్రాన్సు, బ్రిటన్ మొదలైన రాజ్యాలు అడ్డుపడవచ్చును. అంచేత తప్పనిసరి అయినప్పుడు - గత్యంతరం లేకపోయినప్పుడు - చల్లగా ఆటో రాకుమారుడిని సింహాసన మెక్కించ వలసిందే! ఇలా అనుకుని డాక్టరు డోల్ఫుస్ 1934లోనే హాపీ బర్గు రాజవంశ పరిపాలనను పునరుద్ధరించడానికి కొంత సందు ఏర్పరిచాడు. 1919 నాటి ఆస్ట్రియా రాజ్యాంగ విధానం హాప్స్ బరు రాజవంశీయుల్ని దేశభ్రష్టుల్ని చేసింది; వారి ఆస్తిపాస్తుల్ని ప్రభుత్వం వశపరచుకోవాలన్నది. 1934లో కొత్తదైన “కార్పొరేటివ్” రాజ్యాంగ విధానాన్ని అమలుపరుస్తూ, దానిలో నుంచి హాపీ బర్గు రాజవంశానికి సంబంధించిన భాగాల్ని డాక్టరు డోల్ఫుస్ యెత్తివేశాడు. అంటే, అతడు చేసిన పని హాపు బగ్గు రాజవంశానికి విరుద్ధమైన శాసనాల్ని రాజ్యాంగం నుంచి తొలగించడమే గాని, వాటిని పూర్తిగా రద్దు చెయ్యడం కాదు.

డాక్టర్ డోల్ఫుస్ కంటే ఒక అడుగు ముందుకు వెళ్ళి 1935 జూలై నెలలో డాక్టర్ షూష్నిగ్ అసలు ఆ శాసనాలనే రద్దు చేశాడు. తర్వాత 1937 ప్రారంభంలో అతడు ఆటో రాకుమారుడికి పట్టం కట్టాలనే కుతూహలాన్ని కూడా కనబరిచాడు. ఈ సంగతి తెలిసేసరికి హిట్లరుకు చెడ్డ కోపం వచ్చింది. జర్మనీ డిక్టేటరుకు కోపం వచ్చినట్టు వినగానే, అతడి సద్భావాన్ని - అతడి సహాయాన్ని - అతడి సహకారాన్ని - అపేక్షిస్తున్న ముసోలినీ తన పత్రికలకు కనుసైగ చేశాడు. వెంటనే ఇటాలియన్ పత్రికలు అన్నీ కూడా ఆటో రాకుమారుడికి పట్టం కట్టడం అనుచితం అంటూ డాక్టరు షూష్నిగ్ ను తీవ్రంగా విమర్శించాయి. ఇంతే కాదు. ముసోలినీకి “మౌత్ పీస్” అని పేరందిన సీనారుగేడా “ఆస్ట్రియా సంరక్షణ భారాన్ని ఇక మేము వహించము సుమా!” అని ధ్వనించాడు. దీన్ని చూచి షూష్నిగ్ బెదిరిపోయాడు.

ఇటలీ హాప్స్ బర్గు రాజవంశ పరిపాలన పునరుద్ధరణకు వ్యతిరేకంగా ఉన్నట్టు తెలిస్తే, డాక్టర్ షూష్నిగ్ అసలు ఆ విషయమై కుతూహలాన్ని కనబరచేవాడు కాడేమో! ఆటో రాకుమారుడికి పట్టం కట్టడమా, మానడమా అనే విషయం ఆస్ట్రియా ఆంతరంగిక సమస్య అని షూష్నిగ్ తో ముసోలినీ ఏకీభవించాడు. పైగా, 1937 ఫిబ్రవరిలో ఆటో రాకుమారుడి మేనమామతో ప్రసంగిస్తూ, “మీ మేనల్లుడికి పట్టాభిషేకం చెయ్యడం నాకూ సమ్మతమే!” అని సూచించాడు. తెలివితక్కువ వాడు కావడంవల్ల ఈ మాటలు అన్నీ నిజమేనని నమ్మి, డాక్టరు షూష్నిగ్ మోసపోయాడు.

ఈ కపట నాటకం వల్ల ముసోలినీ మంచి లాభాన్నే పొందాడు. “ఆటో రాకుమారుడికి మీరు పట్టం కట్టుకోవచ్చు" అని అతడు ఆస్ట్రియా ప్రభుత్వం వారిని ఉత్సాహపరిచాడు. తద్వారా హిట్లరుకు ఆగ్రహం తెప్పించాడు. తర్వాత హిట్లరుకు పెద్ద మెహర్బానీ చేసినట్టు “పట్టాభిషేకం, గిట్టాభిషేకం పనికిరాదుసుమా!” అని మందలించాడు. దీని ఫలితం, హిట్లరు తనకు కృతజ్ఞుడు కావడం!
మోసగాళ్ళు ఎందరో ఉండవచ్చును. అయితే, అందరు మోసగాళ్ళు ముసోలినీ అంతటి తెలివిగలవాళ్ళు కాలేరు!

24

"ఆస్ట్రియా తాను జర్మన్ జాతికి చెందిన రాజ్యాన్ని అనే విషయాన్ని అంగీకరిస్తున్నది" - 1936 జూలై నెలలో జరిగిన ఆస్ట్రో-జర్మన్ ఒడంబడికలో ఇది మొదటి షరతు. ఈ షరతు ఆధారంతో సైనికబల ప్రదర్శనంగాని, దౌర్జన్య ప్రయోగంగాని లేకుండానే క్రమంగా ఆస్ట్రియాను తన గుప్పిటిలోకి తెచ్చుకోవచ్చునని హిట్లరు ఆశించాడు. కాని, అతడు అనుకున్నట్టు జరగలేదు. త్వరలో అలా జరగగలదనే ఆశ కూడా క్రమేణా చచ్చిపోసాగింది. అంచేత అన్యమార్గాల ద్వారా తన కోర్కెలు సిద్ధింపజేసుకోవాలని అతడు నిశ్చయించుకున్నాడు,

తీవ్రంగా ఆలోచించిన మీదట అతడికి ఒక ఉపాయం తోచింది. ఆ ఉపాయం ఇది : ఆస్ట్రియనులకు ఎవరికైనా కొందరికి లంచం పెట్టి, వారిచేత వియన్నాలోని జర్మన్ రాయబారి కార్యాలయం మీద దౌర్జాన్యాన్ని చేయించడం. దౌర్జన్యం జరిగినందుకు ఆస్ట్రియన్ ప్రభుత్వం క్షమాపణ చెప్పాలనీ, నష్టపరిహారాన్ని ఇచ్చుకోవాలని కోరడం. ఇందుకు ఒకవేళ ఆస్ట్రియన్ ప్రభుత్వం అంగీకారాన్ని చూపించినా, కలహాన్ని చంపుకోక, మరికొన్ని షరతుల్ని పెట్టి, వాటి మిషమీద ఆస్ట్రియా మీదికి దండెత్తి వెళ్ళడం.

హిట్లర్ చేసిన ఈ ఆలోచన బాగానే ఉన్నదిగాని, కార్యాచరణలోకి వచ్చేసరికి - పాపం! - బెడిసి కొట్టింది! వియన్నాలోని జర్మన్ రాయబారి కార్యాలయం మీద దౌర్జన్యాన్ని చేయించడానికి ఇంకా ఏర్పాట్లు చేయిస్తూ ఉండగానే వియన్నా పోలీసువారు ఈ రహస్యాన్ని కనిపెట్టివేశారు.

దానితో హిట్లరుకు ఎంత ఆశాభంగం కలిగిందో, అంత క్రోధావేశం కూడా పెరిగింది. "ఆస్ట్రియాను కబళించనిదే నేను నిద్రపోను" అని అతడు ప్రతినపట్టాడు.

ఈ లోపుగా అంతర్జాతీయ రాజకీయ పరిస్థితులు అతడికి అనుకూలంగా పరిణామం చెందాయి. ఇటలీ అబిసీనియాను జయించుకున్నప్పటికీ, అక్కడ శాంతి ఏర్పడలేదు. దాస్యాన్ని భరించలేక కొన్ని చోట్ల, ఇటాలియన్ నిరంకుశత్వాన్ని సహించలేక కొన్ని చోట్ల, మొత్తం మీద అనేక రాష్ట్రాలలో అబిసీనియనులు తిరుగుబాటు ప్రారంభించారు. అంచేత అక్కడికి ముసోలినీ చాలా సైన్యాన్ని పంపవలసివచ్చింది. ఇందుకు తోడు బ్రిటనులో శాంక్షన్సు ప్రకటించిన కారణంగా ఏర్పడ్డ వైరం చచ్చిపోనే లేదు. అంచేత లిబియాలో - ఈజిప్టు సరిహద్దుల మీద - పెద్ద సైన్యాన్ని బెదరింపు కోసం ఉంచవలసి వచ్చింది. ఇక స్పెయిన్ విద్రోహం కూడా పెద్ద చిక్కు అయిపోయింది. ఏ రెండు మూడు నెలలలోనో జనరల్ ఫ్రాంకో జయిస్తాడని, స్పెయిన్ సామంతరాజ్యం అయిపోతుందని అనుకుంటే, స్పెయిన్ ప్రజలు ఈ ఆశను అడియాస చేశారు. ఇంతవరకూ వచ్చిన తర్వాత ఇపుడు స్పెయిన్ నుంచి చల్లగా తప్పుకోవడానికి వీలులేదు. పోనీ దీని అంతు చూద్దామా అంటే, అబిసీనియాలోనూ, లిబియాలోనూ పెద్ద పెద్ద సైన్యాలను పోషిస్తూ, ఇంకా స్పెయిన్ కు కూడా కొత్తగా సహాయాన్ని పంపడం సాధ్యమా? పులి మీద పుట్ర అన్నట్టు ఇంకొక కొత్త ఇబ్బంది కూడా కలిగింది. సక్రమ సైనిక శిక్షణగాని, ఆధునిక యుద్ధసాధన సంపత్తిగాని ఏ మాత్రమూ లేని స్పెయిన్ రిపబ్లికన్ సైనికులచేతిలో ఇటాలియన్ సైనిక దళాలు గైడల్ జారా యుద్ధరంగంలో ఓడిపోయినవి. కేవలం ఓడిపోవడమే కాకుండా అవి అతినీచంగా పలాయనాన్ని చిత్తగించినవికూడా! ఇందువల్ల ఇటలీ ప్రతిష్ఠ కూడా తగ్గింది. ఈ స్థితిలో జర్మనీ నుంచి కొత్త సహాయాన్ని అర్థించక తప్పదనీ, హిట్లరును ఇంకా సుముఖుడిని చేసుకోవడం ఆవశ్యకమనీ ముసోలినీకి తోచింది. ఈ కార్యాన్ని సాధించడం కోసం అతడు 1937 అక్టోబరులో అల్లుడు కౌంట్ సియానోను వెంట పెట్టుకుని స్వయంగా జర్మనీ వెళ్ళాడు.

అపుడు హిట్లర్ - ముసోలినీల మధ్య ఏమి ఒడంబడిక జరిగిందో ఖాయంగా తెలియదుగాని, : స్పెయిన్ విద్రోహం విషయంలో తాను ముసోలినీకి ఒక్క విషయం మాత్రం స్పష్టం తోడ్పడాలంటే, ఆస్ట్రియా విషయంలో ముసోలినీ పరిపూర్ణమైన తటస్థ భావాన్ని వహించాలని హిట్లర్ కోరివుంటాడు. ఇందుకు ముసోలినీ అంగీకరించి ఉంటాడు.

ముసోలినీ పరిపూర్ణమైన తాటస్థ్యాన్ని అవలంబించడానికి అంగీకరిస్తే, ఇక ఆస్ట్రియా ఆక్రమణకు అభ్యంతరం ఏ ముంటుంది? అన్నట్టు, బ్రిటన్ ఫ్రాన్సులు ఇందుకు అడ్డు పడవచ్చును.
కాని, ఇవి అడ్డుపడవనే విషయం హిట్లర్ ముందుగానే తేల్చుకున్నాడు. 1914-18 నాటి యుద్ధం తర్వాత అన్యాక్రాంతమైపోయిన జర్మన్ వలస రాజ్యాలు తిరిగి జర్మనీ వశం కావాలని అతడు ఆందోళన ప్రారంభించాడు. ముసోలినీ ఈ ఆందోళనను సమర్థించాడు. దీన్ని చూడగా బ్రిటనకు భయంతోచింది. ముసోలినీ ఒక్కడితోనే ప్రాణాంతకంగా ఉండగా అతడికి హిట్లర్ కూడా జతకూడితే ఇక చెప్పాలా? కాని, వారిద్దరూ ఏకమయేలానే కనబడుతున్నారు. స్పెయిన్ విద్రోహం విషయంలో ఇద్దరూ సహకారాన్ని నెరపుతున్నారు. ఇపుడు తిరిగి జర్మనీ వలస రాజ్యాల విషయంలో ముసోలినీ హిట్లరును సమర్థిస్తున్నాడు. అంచేత ఎలాగైనా సరే వీరిని చీలదియ్యాలి. ఇలా యోచనచేసి, 1937 మధ్యస్థంలో - అంటే, ఇంకా ముసోలినీ హిట్లర్ వద్దకు ప్రయాణం కట్టకముందే - బ్రిటిష్ ప్రభుత్వం తరఫున హాలిఫాక్సు ప్రభువు (పూర్వం ఈయన పేరు ఇర్విన్ ప్రభువు. ఇండియాకు వైస్రాయిగా వచ్చాడు.) జర్మనీ వెళ్ళి "మాతో సఖ్యతగా ఉండడానికి మీ షరతు లేమిటి?" అని బేరం సాగించాడు. చివరికి ఈ బేరం తెగలేదు గాని, వలస రాజ్యాల ఆందోళన వదులు కుంటే, మధ్య యూరప్ లో హిట్లర్ ఏ ఆటలు ఆడినా బ్రిటన్ పట్టించుకోదని హాలి ఫాక్సు ప్రభువు సూచించి వచ్చాడు.

దీనితో బ్రిటన్ ఆస్ట్రియా ఆక్రమణకు అడ్డుపడదనే విషయం స్పష్టపడింది. బ్రిటన్ అడ్డుపడదని స్పష్టపడినప్పుడు ఇక ఫ్రాన్సును ఖాతిరీచెయ్యనవసరం లేదు. స్పెయిన్ లో ఫాసిస్టు ప్రభుత్వం ఏర్పాటు కావడం ఫ్రెంచి ప్రజాస్వామికానికి అపాయకరం. అంచేత ఆ ప్రయత్నానికి ఫ్రెంచి ప్రభుత్వం తప్పక అడ్డుపడవలసింది. కాని, అది ఆ పని చేసిందా? లేదు. బ్రిటన్ తటస్థ విధాన కపటనాటకాన్ని ఆడితే, అది కూడా దానిలో ఒక పాత్రను స్వీకరించింది. ఈ రీతిగా కేవలం బ్రిటనకు పక్క తాళంవేస్తూ, తన మంచి చెడ్డల్ని తను నిర్ణయించుకో లేకుండా ఉన్న ఫ్రాన్సు, తనంతట తానుగా ఆస్ట్రియా ఆక్రమణకు అడ్డుపడుతుందా? అది అసంభవం.

ఈ అంతర్జాతీయ పరిస్థితుల్ని అన్నింటినీ హిట్లర్ గమనించాడు. తగిన తరుణం లభించినదని నిశ్చయించాడు. ఆస్ట్రియాను దౌర్జన్యం చేతనైనా సరే ఆక్రమిస్తానన్నాడు. అయితే, రైష్ వీర్ సేనానులు దీనికి సమ్మతించలేదు. "మన సైన్యంగాని, మన దేశంగాని, ఇప్పుడు యుద్ధానికి సన్నద్ధంగా లేవు. అంచేత తొందరపాటు కూడదు" అని వారన్నారు. ఇలా అన్న వారిని పదభ్రష్టుల్ని చేసి, హిట్లరు తాను స్వయంగానే జర్మన్ సైన్యాలకు సర్వాధికారి అయ్యాడు. వరసగా అతడు ఇలా ప్రతిబంధకాల్ని అన్నింటినీ తొలగించుకు వచ్చాడు. ఇక, ఆస్ట్రియా పైకి దూకడమే తడవు!

25

"సామదాన భేదాలచేత ఆస్ట్రియాను మన సామంత రాజ్యంగా చెయ్యవలసిన భారం నీది." అని చెప్పి హెరావాన్ పాపనను వియన్నాకు రాయబారిగా పంపించాడు, హిట్లరు. ఈ పనిలో పాపన్ నెగ్గలేకపోయాడు. శాయశక్తులా ప్రయత్నించి అతడు ఆస్ట్రియాతో ఒక ఒడంబడిక కుదిర్చినమాట నిజం. అయితే, ఈ ఒడంబడిక కారణంగా ఆస్ట్రియా స్వాతంత్ర్యం విలుప్తమై పోనూ లేదు. అది జర్మనీ సామంత రాజ్యం కానూ లేదు. దీన్ని చూడగా హిట్లరుకు పాపన్ మీద విపరీతమైన

కోపం కలిగింది. "నీవు పనికిమాలిన వాడివి; వెనక్కు తిరిగిరా!" అని కబురు పంపించాడు. కలవరపడుతూ పాపన్ బెట్టెస్ గాడెను . ఇది హిట్లరు నివాసం. బవేరియాలో ఒక కొండమీద ఉంది - వెళ్ళి, హిట్లరును సందర్శించాడు. ఈ సమావేశంలో ఏమి జరిగిందో తెలియదు గాని; రాయబారి ఉద్యోగం నుంచి విరమించుకోవలసిన పాపన్ తిరిగి వియన్నాకు వెళ్ళి, "మా • హిట్లరు మీతో ఏవో ముఖ్య విషయాల్ని ప్రసంగించాలట! మిమ్మల్ని ఒకసారి బెట్టెస్ గాడెన్ కు రమ్మన మన్నాడు" అని డాక్టర్ షూష్నిగ్ కు సందేశాన్ని అందజేశాడు.

ఈ సందేశాన్ని అనుసరించి తాను వెళ్ళడమా, వెళ్ళక పోవడమా అని షూష్నిగ్ పెద్ద ఆలోచనలో పడ్డాడు. "తనను రమ్మని కబురు పంపడంలో హిట్లర్ ఉద్దేశమేమిటి? వెడితే ఏమి మూడుతుందో? వెళ్ళకపోతే ఏమి చిక్కు వస్తుందో? ముసోలినీని సలహా అడిగితే బాగుండును కాని, 1937 ఏప్రిల్ లో వెన్నిలో కలుసుకున్నప్పటి నుంచీ అతడు చికాకుగా ఉంటున్నాడు. మొన్న మొన్ననే బర్లిన్ వెడుతూ ఉండగా, దారిలో వియన్నాలో కూడా ఒక రోజు ఆగమని అతడిని అడిగితే "వీలు లేదు" అని మొరటుగా జవాబు చెప్పారు. అంచేత అతడిని సలహా అడిగి లాభం లేదు. ఒక ఫ్రాన్సు, బ్రిటన్ ప్రభుత్వాల వారినైనా సలహా చేస్తే బాగుండును. కాని, "మా ఆహ్వానం సంగతి రహస్యంగా ఉంచాలి సుమా!" అని పాపన్ హెచ్చరించాడు. ఇందుకు భిన్నంగా సంచరిస్తే, పరిస్థితులు ఎలా విషమిస్తాయో తెలియదు. "ఆస్ట్రో-జర్మన్ సహకారమే మా ఆశయం. అందుకోసమే ఈ ఆహ్వానం" అని పాపన్ చెప్పాడు. ఇప్పుడు ఈ ఆహ్వానాన్ని తృణీకరిస్తే, ఆస్ట్రో-జర్మన్ సహకారానికి ఒక గొప్ప అవకావం లభిస్తే, దాన్ని తోసిపుచ్చిన అపఖ్యాతి వస్తుందేమో?"

ఈ విధంగా రకరకాలుగా ఆలోచించి, తాను స్వయంగా ఏమి నిర్ణయించుకోలేక, డాక్టర్ షూష్నిగ్ తన బాల్య స్నేహితుడైన డాక్టర్ స్కిమిట్ సలహాను అర్థించాడు. అతడు "వెళ్ళిరావడమే, ఎందుకైనా మంచిది" అని చెప్పాడు. ఈ సలహా ప్రకారం 1938 ఫిబ్రవరి 10వ తేదీ నాడు షూష్నిగ్ హిట్లర్ ఆహ్వానాన్ని అంగీకరించాడు.

తాను చేసిన వాగ్దానం ప్రకారం ఆహ్వానం సంగతిని డాక్టర్ షూష్నిగ్ రహస్యంగానే ఉంచాడు. అయితే, ఎవడో ఆస్ట్రియన్ ప్రభుత్వోద్యోగి ఈ విషయాన్ని ముసోలినీకి తెలియబరచాడు. తనకు తెలియకుండా హిట్లర్ ఇంతపని చేసినందుకు అతడికే నిజంగా ఆగ్రహం కలిగింది. "జర్మనీకీ, ఇటలీకీ మధ్య ప్రస్తుతమున్న సంబంధ బాంధవ్యాన్ని బట్టి ఈ విషయాన్ని ముందుగా మీరు నాకు చెప్పకపోవడం తప్పు కాదా? అని అతడు అడిగాడు. అప్పుడు పాపన్ తమ చర్యను సమర్థించుకున్న విధం ఇది : "1937 అక్టోబరులో మీరు మా నాయకుడైన హిట్లరును కలుసుకున్నప్పుడు ఆస్ట్రో-జర్మనీ సహకారాన్ని గురించి చర్చించడానికి షూష్నిగ్ తో సమాలోచన జరపడం మంచిదేమో అని సూచించారు. ఆ సూచన ప్రకారమే మేము ఇప్పుడు ఆహ్వానాన్ని పంపించాము. అంచేత ప్రత్యేకంగా మీకు తెలపవలసినర అవసరం లేదని భావించాము".

చాలా తెలివి తేటలతో కూడింది ఈ సమర్ధన. అయితే ముసోలినీకి ఇందువల్ల సంతృప్తి కలగలేదు. హిట్లరు తనను మోసగించినట్టుగా అతడు భావించాడు. పైగా, ఆస్ట్రియా జర్మనీ వశమైపోతే, ముమ్ముందు ఇటలీకి ఏమి ముప్పు కలుగుతుందో అనే భయం కూడా తిరిగి బలమైంది. ఈ స్థితిలో బ్రిటతో వెంటనే సఖ్యపడి, ఆస్ట్రియా ఆక్రమణకు అడ్డుపడటమే కర్తవ్యంగా తోచింది. ఇలా తోచడమే తడవు, - లండన్లోని తమ రాయబారి సీనారు గ్రాండే పేర ఒక తంతిని పంపించాడు. ఈ తంతిలోని సారాంశం ఇది : హిట్లరు ఆస్ట్రియాను కబళించ నున్నాడు. దీన్ని అడ్డుకోవాలంటే నాతో వెంటనే రాజీకి వచ్చే ప్రయత్నం చెయ్యండి". ఈ తంతిని చూడాగానే బ్రిటీష్ ప్రధాని నెవెల్లీ ఛేంబర్లియన్ ఇటలీతో రాజీకి రావడం ఆవశ్యకమని భావించాడు. విదేశాంగ మంత్రి ఆంథోనీ ఈడెన్ "స్పెయిన్ సమస్య తేలనిదే, ఇటలీతో రాజీ ఏమిటి?" అన్నాడు. ఈ భేదాభిప్రాయాల కారణంగా ఈడెన్ తన పదవికి రాజీనామా పెట్టవలసి వచ్చింది.

ఈడెన్ రాజీనామా గొడవలో ఆంగ్లో - ఇటాలియన్ రాజీ సంభాషణలు ప్రారంభం కాలేదు. ఈ వ్యవధిలో ముసోలినీ మనస్సు మార్చుకున్నాడు. హిట్లర్ ఆశయసిద్ధికి ఒక పెద్ద ప్రతిబంధకం తీరిపోయింది.

26

మరి ఎక్కడికో వెడుతున్నట్టు ప్రకటించి, ఫిబ్రవరి 12వ తేదీనాడు డాక్టర్ షూష్నిగ్ బట్టి డెస్ చేరుకున్నాడు. అతడిని ఆహ్వానించడానికి హిట్లరు మంచి ఏర్పాటుల్నే చేశాడు. ఆ ఏర్పాట్లు ఏవంటే, - ఆస్ట్రియా సరిహద్దులలో జర్మన్ సైనిక దళాల్ని కేంద్రీకరించడం; జర్మన్ సేనా నాయకుల్నీ, ఆస్ట్రియన్ నాజీ నాయకుల్నీ బెట్టెస్ గాడెన్ కు పిలిపించడం. తన సహకారాన్ని కోరి పిలిపించాడు గనుక మర్యాదగా ప్రవర్తిస్తాడేమోనని షూష్నిగ్ ఆశించాడు. కాని, హిట్లరు అసహ్యంగా మాట్లాడాడు; అసభ్యంగా ప్రవర్తించాడు; అవేశపూరితుడై చిందులు తొక్కాడు. "నేను చెప్పిన మాట వింటావా, లేదా? లేదంటే జాగ్రత్త సుమీ! నేను కనుసైగ చేస్తే చాలు; నా సైన్యాలు ఆస్ట్రియాను ధ్వంసం చేస్తాయి. రక్తపాతాన్ని కోరతావో, శాంతి భద్రతలను కోరతావో నిశ్చయించుకో!" ఈ ధోరణిలో గంటలకొద్దీ అతడు అరిచాడు. దీన్ని చూడగా "చూస్తో చూస్తో గోతిలో పడిపోయానే!" అనే బెంగ షూష్నిగ్ ను పట్టుకుంది. కాని తప్పించుకునే దారి యేది?

"ఫాదరులాండ్ ఫ్రంట్"లో ఆస్ట్రియన్ నాజీలకు ఇతరులతో పాటు సమాన ప్రతిపత్తిని ఇవ్వాలి, - ఇది హిట్లరు పెట్టిన మొదటి షరతు. ఇక రెండవ షరతు ఇది : నాజీనాయకుడైన డాక్టరు సేయుస్ ఇన్క్వార్టుకు మంత్రివర్గంలో హోం మినిస్టరు పదవిని ఇచ్చి తీరాలి.

దాదాపు పదకొండు గంటల సేపు హిట్లరు షరతుల్ని విన్నమీదట "సరే! ఈ విషయంలో నాకు ఏమీ అభ్యంతరం లేదు. అయితే సేయుస్ ఇన్ క్వార్టును మంత్రిగా నియమించవలసిన వాడు ఆస్ట్రియా అధ్యక్షుడైన డాక్టర్ మిక్లాస్. ఆయన సలహా తీసుకోవాలి. నాకు రెండు మూడు. రోజులు గడువు ఇవ్వండి" అని అడిగి, డాక్టరు షూష్నిగ్ తిరిగి చల్లగా వియన్నా చేరుకున్నాడు. చేరుకోగానే అతడు ఆస్ట్రియన్ రిపబ్లిక్ అధ్యక్షుడైన డాక్టర్ మిక్లాస్ దగ్గరికి వెళ్ళి, జరిగిన విషయాల్ని చెప్పి, "నేనే ఛాన్సలర్ గా ఉండాలంటే హిట్లర్ షరతులకు అంగీకరించండి" అని కోరాడు.

హిట్లర్ షరతులకు అంగీకరిస్తే, ఆస్ట్రియా స్వాతంత్ర్యాన్ని నష్టపరిచినట్టే! మొదటి షరతు ప్రకారం "ఫాదరులాండు ఫ్రంట్"లో నాజీలకు తక్కినవారితో పాటు సమాన ప్రతిపత్తి లభిస్తుంది. అంటే, ఏ నాజీల బారి నుంచి ఆస్ట్రియా స్వాతంత్ర్యాన్ని కాపాడాలని డాక్టరు డోల్ఫస్ "ఫాదర్లాండ్ ఫ్రంటు" ఉద్యమాన్ని ప్రారంభించాడో, ఆ ఉద్యమంలోనే నాజీలకు ప్రవేశం కలుగుతుంది! ఇక రెండవ షరతు ప్రకారం నాజీ నాయకు డొకడు నాజీ ప్రచారం నుంచీ, నాజీ విద్రోహం నుంచీ, నాజీ దౌర్జన్యం నుంచి దేశాన్ని కాపాడవలసిన పోలీసు శాఖకు అధిపతి అవుతాడు!! దొంగకు ఇనపపెట్టి తాళం చెవి అప్పగించడం. ఇంతకంటే తెలివితక్కువ పని కాదు. ఈ అపాయాన్ని ఆలోచించి నేను ఈ షరతుల్ని అంగీకరించనని డాక్టర్ మిక్లాస్ తెలియబరిచాడు.

"మీరు అంగీకరించకపోతే, మరి నా రాజీనామాను తీసుకోండి!!" అని డాక్టరు షూష్నిగ్ అన్నాడు. ఆ రాజీనామాను అందుకుని, ప్రెసిడెంట్ మిక్లాస్ వియన్నా పురపాలక సంఘాధ్యక్షుడైన రిచర్డు స్మిమిడ్డేను పిలిపించి, "మీరు ఛాన్సలర్ పదవిని స్వీకరిస్తారా?" అని అడిగాడు. స్మిమిడ్డే "ఈ భారాన్ని నేను భరించలేను" అన్నాడు. అంతట తిరిగి డాక్టరు షూష్నిగ్ నే ఛాన్సలరుగా ఉండమని కోరవలసి వచ్చింది. ఇంతేకాదు. డాక్టరు సేయుస్ ఇన్ క్వార్టును హోం మినిస్టరుగా నియమించ వలసివచ్చింది కూడా!

ఫిబ్రవరి 15వ తేదీనాడు ఇన్ క్వార్టు మంత్రిపదవిని స్వీకరించాడు; ఫిబ్రవరి 16వ తేదీనాడు ఆజ్ఞల్ని స్వీకరించాడని కాబోలు, తన యజమాని అయినట్టి హిట్లరు దగ్గరికి ప్రయాణం కట్టినాడు!

27

తన కార్యం సానుకూల పడిందని హిట్లరు చాలా సంతోషించాడు. ఫాదర్ లాండు ఫ్రంటులో నాజీలకు ప్రవేశం కలిగింది. ఆంతరంగిక రాజకీయాలను దాదాపుగా "కంట్రోల్" చెయ్యగల హోం మినిస్టర్ పదవి నాజీ నాయకుడికి లభించింది. ఇక తాను అనతికాలంలో ఆస్ట్రియాకు నాథుడు కావడానికి ప్రతిబంధకం ఏ ముంటుంది?

ఇంతకు పూర్వం కంటే విరివిగా - ఇప్పుడు బాహాటంగా కూడా - తన ప్రచారాన్ని సాగించ వచ్చును. తన పరిపాలనలోకి వస్తే శాంతి సుభిక్షాలు సంప్రాప్తమౌతాయనే భ్రమను కలిగించ వచ్చును. ప్రచారం ద్వారా ప్రజాభిప్రాయాన్ని సుముఖంగా చేసుకున్న తర్వాత "జర్మనీతో చేరిపోవడం మీకు ఇష్టమేనా?" అని ఓటు తీసుకోవచ్చును. ముప్పాతిక మూడు వీసాలు. "ఇష్టమే" అని మెజారిటీ వస్తుంది. అలారాదని సందేహంతోస్తే, పోలీసు శాఖ చేతిలోనే ఉన్నది. గనక అవసరమైన కట్టుదిట్టాల్ని చెయ్యవచ్చును. ఇలా ఆలోచించి ఆస్ట్రియా తన గుప్పిటిలోకి వచ్చినట్టే హిట్లరు పొంగిపోయాడు. ఫిబ్రవరి 20వ తేదీనాడు ఉపన్యసిస్తూ, తన ఆ ఆనందాన్ని అతడు బహిరంగంగా ప్రకటించాడు కూడా!

ఇక, డాక్టర్ షూష్నిగ్ జరిగిన పనికి విచారించ సాగాడు. తీరా డాక్టర్ సేయుస్ ఇన్క్వార్టును హోం మినిస్టరుగా నియమించిన తర్వాత, ఆ నియామకాన్ని కోరడంలో హిట్లరు చేసిన గూఢాలోచన అతడు తెలుసుకున్నాడు. ఇలా తెలుసుకొని, ఆస్ట్రియా స్వాతంత్ర్యం విలుప్తమైపోయే సందర్భం ఏర్పడిందనీ, త్వరలో తోడ్పడకపోతే ముప్పుతప్పదనీ అతడు బ్రిటన్, ఫ్రెంచి, ఇటాలియన్ ప్రభుత్వాలకు తెలియబరిచాడు. ఆ ప్రభుత్వాల వారు ఎట్టి సలహానిచ్చారో, ఏమి సహాయాన్ని చేస్తామన్నారో తెలియదు గాని, ఫిబ్రవరి 24వ తేదీనాడు ఆస్ట్రియా స్వాతంత్ర్యాన్ని కాపాడ్డానికి తాను కృతనిశ్చయుడై యున్నట్టు బహిరంగోపన్యాసం ద్వారా ఛాన్సలర్ షూష్నిగ్ ప్రకటించాడు. ఈ ప్రకటన ఆస్ట్రియా స్వాతంత్ర్యాన్ని అభిలషించే వారిలో ఎంతటి ఉత్సాహాన్ని కలిగించిందో ఆస్ట్రియన్ నాజీలలో అంతటి ఉద్రేకాన్ని రేకెత్తించింది. వారు ఫిబ్రవరి 27వ తేదీనాడు గ్రాజ్ లో పెద్ద నిరసన సభ చేశారు. ప్రతికూల ప్రదర్శనలను జరిపారు; ప్రజాశాంతికి భంగకరంగా ప్రవర్తించారు. అపుడు ఆ నగరంలో శాంతిని కాపాడ్డానికి డాక్టరు షూష్నిగ్ సైన్యాలను పంపించవలసి వచ్చింది.

గ్రాజ్ సంఘటనల తర్వాత షూష్నిగ్ కు ఈ క్రింది ఆలోచన తోచింది: కొంతకాలం గడిచిన తర్వాత "జర్మనీతో చేరిపోవడం మీకు సమ్మతమౌనా, కాదా?" అని ప్రజల ఓటింగ్ తీసుకోవాలని - దీన్ని "ప్లెబిసైట్" అని అంటారు - హిట్లరు ఎత్తు వేస్తున్నాడు. అప్పటికి పరిస్థితులు ఎలా మారతవో తెలియదుగాని, ఇప్పుడు మాత్రం నూటికి దాదాపు అరవై మంది "జర్మనీతో చేరవద్దు" అనే ధోరణిలో ఉన్నారు. అంచేత ముందు ఎప్పుడో ప్లెబిసైట్ జరిపించడానికి హిట్లరుకు అవకాశం ఇవ్వకుండా, ఆ పని ఇపుడు నేను చేసివేస్తే, చిక్కు తీరిపోతుంది. ఇందుమూలంగా, హిట్లర్ ముందెపుడో నా మీద ప్రయోగింప జూస్తున్న అస్త్రాన్ని ముందుగా నేనే అతడి మీద ప్రయోగించినట్టు అవుతుంది.

ఈ ఆలోచన ప్రకారం ఫిబ్రవరి 9వ తేదీనాడు డాక్టరు షూష్నిగ్ ఇన్ బ్రక్ అనే ప్రదేశం నుంచి, వచ్చే ఆదివారం నాడు (మార్చి 13వ తేదీనాడు) "ఆస్ట్రియా స్వతంత్రంగా ఉండాలా, లేదా?" అనే ప్రశ్నపై ప్లెబిసైట్ జరుపుతానని ప్రకటించాడు. ఈ ప్లెబిసైట్లో ఇరవై నాలుగు సంవత్సరాలకు పైగా వయస్సు ఉన్న వారందరూ పాల్గొనవచ్చునని అతడు అన్నాడు. ఇలా

ఒక వయస్సు పరిమితిని పెట్టడంలో అతడికి గల ఉద్దేశం ఇది : నాజీ పార్టీకి చెందిన వారిలో అధిక సంఖ్యాకులు యువకులు. అంచేత ఇరవై నాలుగు సంవత్సరాలైనా వయస్సులేని వారు ఓటు చెయ్యకూడదని నియమిస్తే చాలామంది నాజీలకు అసలు ఓటు చెయ్యడానికి వీలుండదు. ప్లెబిసైట్ ప్రకటిస్తూ డాక్టర్ షూష్నిగ్ రేడియో ఉపన్యాసాన్ని చేశాడు. ఆస్ట్రియా స్వాతంత్ర్యాన్ని కాపాడ్డానికి నాకు గల తుది అవకాశం ఇదే అనే భావం అతడిని ప్రోత్సహించింది కాబోలు, అతడు ఆ ఉపన్యాసంలో అపూర్వమైన ధైర్యాన్ని ప్రకటించాడు. ఇంతకుమించిన విశేషం ఏమంటే, అతడు వక్తకాడు; అయినప్పటికీ ఆ ఉపన్యాసం ఎంతటి వక్త అయినా సరే గర్వపడదగిన రీతిగా ఉంది. హేళనగాని, ఎత్తిపొడుపుగాని, షూష్నిగ్ కు చేతనైన విద్య అని అంతకుపూర్వం ఎవ్వరికీ తెలియదు. కాని, ఆ ఉపన్యాసములో అతడు హిట్లరును చాలా చక్కగా హేళన చేశాడు. ఎంతో బాగా ఎత్తిపొడిచాడు. అతడి ఉపన్యాసంలోని కొన్ని భాగాలు ఇవి :

"పెద్ద పెద్ద ఉపన్యాసాలు ఇవ్వడం గాని, గొంతు చించుకొని అరవడం గాని నాకు చేతకాదు" (హిట్లర్ ఈ పనులు చేస్తాడు).
"మాతృ దేశభక్తిని వ్యక్తిపరంగాని, వ్యక్తిపరమైన ప్రభుత్వం ద్వారాగాని పెంపొందించడం నా ఉద్దేశం కాదు" (ఇది కూడా హిట్లర్ మీద దెబ్బే!)
"ప్లెబిసైట్ జరపండి అని చాలా సంవత్సరాల నుంచి మనల్ని ఛాలెంజి చేస్తున్నారు. స్వతంత్ర రక్షణకు మనం సంసిద్ధంగా ఉన్నామని నిరూపించవలసిన సమయం వచ్చింది. ఆదివారం నాడు ఆస్ట్రియన్ ప్రజల విజయం మీదనే నేను పరిపాలన సాగించడమా, లేక రాజీనామా ఇవ్వడమా అనే విషయం ఆధారపడి ఉంటుంది".
ఈ ఉపన్యాసానికి హిట్లరు తెల్లబోయాడు! ఆశ్చర్యం, ఆగ్రహం, ఆవేశం అతడిని కంపించి వేశాయి.

28

తొమ్మిదవ తేదీ నాడు డాక్టర్ షూష్నిగ్ ప్లెబి సైట్ ప్రకటన చేశాడు. పదకొండవ తేదీ వరకూ ఆస్ట్రియన్ నాజీలకు హిట్లర్ వద్ద నుంచి ఆజ్ఞలు రాలేదు. తలవని తలంపుగా డాక్టర్ షూష్నిగ్ ప్లెబిసైట్ ప్రకటించాడేమో, హిట్లరుకు కర్తవ్యం పాలుపోలేదు. దీన్ని సాకుగా పెట్టుకొని ఆస్ట్రియా పైని దూకడమా, దూకక పోవడమా? దూకితే, బ్రిటన్ ఫ్రాన్సుల వైఖరి ఎలా ఉంటుంది? అవి జోక్యం కలుగజేసుకుంటాయా? లేక "మీ చర్యను మేము తీవ్రంగా నిరసిస్తున్నాము" అనే కబురుతో సరిపెట్టుకుపోతవా? హిట్లరు ఈ ఆలోచనలతో కలవరపడుతూండగా, ఆస్ట్రియన్ నాజీలు ఏమి చెయ్యడానికీ తోచక, తమకు సులభమైన పని గనక డాక్టరు షూష్నిగ్ ప్రకటనను ఖండిస్తూ వియన్నాలో కొంత అల్లరి చేశారు. వీరిలో మరీ అల్లరి చేసిన వారిని కొందరిని తొమ్మిది, పది తేదీలలో షూష్నిగ్ అరెస్టు చేయించాడు.

తదేకంగా దాదాపు నలభై ఎనిమిది గంటల సేపు యోచన చేసిన మీదట "ఇది మంచి తరుణం; ఆస్ట్రియాను ఇపుడు వశపరచుకు తీరవలసిందే!" అని హిట్లర్ నిర్ణయించుకున్నాడు.

ఇంతకు పూర్వం అడ్డుపడ్డట్టు ఇపుడు ఇటలీ అడ్డురావడం కల్ల.

ఇక, ఫ్రాన్సులో ఛాతంమ్సు మంత్రివర్గం రాజీనామా ఇచ్చింది. దాని స్థానంలో కొత్త మంత్రివర్గం ఇంకా ఏర్పడలేదు. అది సులభంగా ఏర్పడగల సూచనలు కూడా లేవు. అంచేత ఈ స్థితిలో ఫ్రాన్సు జోక్యం కలగజేసుకోవడం గాని, జోక్యం కలగజేసుకున్నా నెగ్గడం గాని దుస్సాధ్యం. పోతే, బ్రిటన్ సంగతి : ఫసిస్టు, నాజీ ప్రభుత్వాలకు ప్రతికూలత చూపుతున్న ఈడెన్ విదేశాంగ మంత్రి పదవి నుంచి తప్పుకున్నాడు. అతడి స్థానంలో జర్మనీ అంటే ఇంతో అంతో అభిమానాన్ని

చూపించే హాలిఫాక్సు ప్రభువు విదేశాంగ మంత్రి అయ్యాడు. పోయిన సంవత్సరం బెర్లిన్ నగరానికి వచ్చి, ఇతడు "జర్మనీ వలస రాజ్యాల ఆందోళనను కట్టి పెడితే, మధ్యయూరప్ లో అది ఏ ఆటలు ఆడినా టన్ పట్టించుకోదు" అని సూచించాడు. అంచేత బ్రిటన్ పక్షం నుంచి ప్రాతికూల్యాన్ని ఎదుర్కొనవలసి ఉండదు. ఇంతకూ బ్రిటన్ కోరుతున్నది స్వసామ్రాజ్య రక్షణ. అందుకు భిన్నం రానంత వరకూ ఆస్ట్రియా మొదలైన చిన్న చిన్న రాజ్యాలు ఏ గడ్డి కరిచినా అది యుద్ధానికి దిగదు. ఒకవేళ యుద్ధానికి దిగాలని అనుకున్నప్పటికీ, దాని ఆయుధ సమీకరణ కార్యక్రమం పూర్తికాలేదు. అంచేత దానికి అంతగా భయపడవలసిన అవసరం లేదు.

పరిస్థితులు ఇంత అనుకూలంగా ఉంటే, మరి సంకోచం దేనికి? నరుక్కు వెడదామని నిశ్చయించుకున్నాడు, హిట్లరు!

29

అంతకు పూర్వం చాలా రోజుల నుంచి జర్మన్ సైన్యాలు ఆస్ట్రియన్ సరిహద్దులలో సిద్ధంగా ఉన్నాయి. ఈ సైన్యాలకు తోడుగా మార్చి 10వ తేదీ రాత్రి హిట్లర్ మరికొన్ని సైన్యాలను పంపించాడు. ఇలా సన్నద్ధపడి తేదీ ఉదయం అతడు ఆస్ట్రియాకు రెండు అంత్య సందేశాల్ని (అల్టిమేటమ్స్) పంపించాడు. వీటిలో మొదటిది - డాక్టర్ షూష్నిగ్ ప్రకటించిన ప్లెబిసైట్ ను ఉపసంహరించాలని. ఇక రెండవది - డాక్టర్ షూష్నిగ్ ఛాన్సలర్ పదవికి రాజీనామా పెట్టాలని. ఈ రెండు అంత్య సందేశాలు చేరగానే, షూష్నిగ్ బ్రిటన్, ఫ్రెంచి, ఇటాలియన్ ప్రభుత్వాలకు "ఈ విపత్తులో ఆస్ట్రియాకు తోడ్పడండి" అని విజ్ఞాపన పంపుకున్నాడు.

బ్రిటీష్ ప్రభుత్వానికి షూష్నిగ్ విజ్ఞాపన అందినవేళకు హెర్ వాన్ రిబ్బన్ ట్రాప్ లండన్ లో ఉండటం తటస్థించింది. ఇతడు అంతకు పూర్వం జర్మన్ ప్రభుత్వం తరపున లండన్లో రాయబారిగా ఉంటూ ఉండేవాడు. ఈ హోదాలో ఇతడు హిట్లర్ అభిమానాన్ని సంపాదించు కున్నాడు. దీని ఫలితం ఏమంటే, - బారన్ వాన్ న్యూరత్ స్థానంలో ఇతడు జర్మనీ విదేశాంగ మంత్రిగా నియుక్తుడు కావడం. కొత్త పదవిని స్వీకరించిన తర్వాత, లండన్లో తన సహోద్యోగులుగా పని చేసిన వారి వద్ద సెలవు పుచ్చుకోవడం కోసం ఇతడు అక్కడికి వచ్చాడు. ఇక ఇప్పుడు అసలు విషయం ఇది : డాక్టర్ షూష్నిగ్ విజ్ఞాపన అందగానే బ్రిటీష్ విదేశాంగ మంత్రి రిబ్బన్ ట్రాప్ కు కబురు చేశాడు. అప్పటి కప్పుడే స్వదేశానికి తిరిగి వెళ్ళడానికి రిబ్బన్ ట్రాప్ ప్రయాణమై ఉన్నాడు. అతడి విమానం క్రాయిడన్ విమానాశ్రయంలో సిద్ధంగా ఉన్నది : "నాకు వ్యవధి లేదు; వెళ్ళిపోవాలి" అని రిబ్బన్ ట్రాప్ అన్నాడు గాని, బలవంతం మీద హాలిఫాక్సు ప్రభువు అతనిని ఆపుచేశాడు. ఇలా ఆపుచేసి, ఆస్ట్రియా ఆక్రమణను బ్రిటన్ ఆమోదించదని ఖండితంగా చెప్పాడు. ఈ సంగతిని రిబ్బన్ ట్రాప్ హిట్లరుకు టెలిగ్రాఫ్ చేశాడు : "ఇది మా వ్యవహారం. బ్రిటన్ కు దీనితో సంబంధం లేదు. దాన్ని నోరుమూసుకోమను!" అన్న ధోరణిలో హిట్లర్ జవాబును పంపించాడు. ఈ జవాబును అక్షరాల హాలిఫాక్సు ప్రభువుకు అందజేసి, రిబ్బన్ ట్రాప్ ప్రయాణమై వెళ్ళిపోయాడు.

ఈ లోపుగా ప్యారిస్ లో పుట్టిన కలవరం ఇంతంత కాదు. అయ్యో! ఆస్ట్రియా అంతరించిపోతున్నదే అనే ఆందోళన ఒక వైపు! మనం అడ్డుపడలేము గదా అనీ, కనీసం ఈ విపత్సమయంలో మనకు ఇక ప్రభుత్వమైనా లేకపోయెను గదా అనే ఆ వేదన ఒక వైపు. ఈ స్థితిలో ఏమీ తోచక "బ్రిటన్ తప్పక జోక్యం కలిగించుకోవాలి. హిట్లర్ ను ప్రతిఘటించాలి" అని ప్యారిస్ నుంచి బ్రిటీష్ ప్రభుత్వానికి వర్తమానాలు వెళ్ళాయి.

అదివరకే హిట్లర్ పంపిన జవాబుకు చాలా కించపడివున్న బ్రిటీష్ ప్రభుత్వ వర్గానికి ఈ వర్తమానాలు కోపకారణమైనవి. "ఆస్ట్రియా సంగతి తర్వాత ఆలోచించవచ్చు! ముందు ఫ్రాన్సుకు ఒక మంత్రివర్గాన్ని సంపాయించుకోండి!" అని వారు ఎత్తిపొడిచారు. మామూలు పరిస్థితిలో త్వరగా మంత్రివర్గ నిర్మాణం జరిగేది కాదేమో గాని, ఆస్ట్రియా తటస్థించిన విపత్తు వల్లను, బ్రిటన్ ఎత్తిపొడుపు వల్లను వెంటనే ఈ పని జరిగింది. లియాన్ బ్లం 13వ తేదీ నాటికి తిరిగి పాపులర్ ఫ్రంట్ మంత్రివర్గాన్ని ఏర్పాటుచేశాడు. అయితే, ఈ లోపుగానే హిట్లర్ లోహపు పాదాల కింద ఆస్ట్రియా నలిగిపోయింది.

ఇక, ఇటలీని గురించి రెండు ముక్కల్ని చెప్పాలి. అదే రెండు, మూడు నెలల క్రితమైతే ముసోలినీ ఆస్ట్రియా ఆక్రమణను తప్పక ప్రతిఘటించేవాడు! హిట్లర్ ఏదో ఒక సాకు కల్పించుకొని ఆస్ట్రియా మీదికి దూకడానికి సన్నద్ధ పడుతున్నాడని ఖాయంగా తెలియగానే - ఇంతకు పూర్వం వివరించినట్లు - ముసోలినీ బ్రిటీష్ ప్రభుత్వంతో తన తగవును పరిష్కరించుకోడానికి ప్రయత్నించాడు. అదే సమయంలో అతడు ఫ్రెంచి ప్రధాని లియాం బ్లంకు కూడా "హిట్లర్ సెంట్రల్ యూరప్ అంతటినీ తన ఆధిపత్యం కిందకి తెచ్చుకోవాలని చూస్తున్నాడు. ఆలస్యం జరిగితే ముప్పు తప్పదు. బ్రిటన్ ఫ్రాన్సు, ఇటలీ రాజ్యాలు ఏకమై అతడిని ఇప్పుడు ప్రతిఘటించాలి. నా అబిసీనియా విజయాన్ని మీరు ఆమోదిస్తే చాలు, - తక్కిన ఏ షరతులకైనా లోబడి నేను మీతో రాజీకి వస్తాను" అని కబురు పంపించాడు. అయితే అప్పుడు బ్లం ఈ కబురును పెడచెవిని పెట్టాడు. దీనితో ముసోలినీ తన ధోరణిని పూర్తిగా మార్చుకున్నాడు.

ఇందుకు తోడు ఆస్ట్రియాకు అంత్యసందేశం అందజేస్తూనే, హిట్లర్ ముసోలినీకి ఒక ఉత్తరాన్ని పంపించాడు. ఈ ఉత్తరంలో ఇటలీ విపత్తులో ఉండగా జర్మనీ అవలంబించిన వైఖరిని - అంటే, శాంక్షన్సును ప్రకటించని సంగతిని - మరవవద్దనీ, జర్మనీ సరిహద్దు శాశ్వతంగా బ్రెన్నర్ పాస్ ను మించదనీ, తాను దేవుడి ముఖం చూచి వాగ్దానం చేస్తున్నానని అతడు వ్రాశాడు. దీన్ని చూచుకున్న మీదట "మరి నేను తాటస్థ్యాన్ని వహిస్తాను" అని ముసోలినీ నిశ్చయించు కున్నాడు.

ఇటాలియన్ డిక్టేటర్ అవలంబించిన ఈ వైఖరి పట్ల తన కృతజ్ఞతను తెలుపుతూ మార్చి 13వ తేదీనాడు హిట్లర్ ఈ సందేశాన్ని పంపించాడు. "నేను ఈ మేలును ఎన్నటికీ మరవను".

30

మార్చి 11వ తేదీ శుక్రవారం ఉదయం జర్మనీ నుంచి ప్రెసిడెంటు మిక్లాస్ దగ్గరికి ఈ సందేశం వచ్చింది. మూడు గంటలలోపుగా ప్లెబిసైట్ ను రద్దుపరచాలి; డాక్టర్ షూష్నిగ్ రాజీనామా పెట్టాలి. లేకపోతే, మేము తగిన చర్యను జరపవలసి వస్తుంది. ఈ సందేశం అందగానే ప్రెసిడెంట్ మిక్లాస్ షూష్నిగ్ తో సంప్రదించి ప్లెబి సైట్ ను రద్దు చేయించాడు. కాని, హిట్లర్‌కు అంతటితో సంతృప్తి కలగలేదు. వెంటనే అతడు ఇంకొక సందేశాన్ని పంపించాడు. దీనిలోని షరతులు ఇవి : గంటన్నర లోపుగా ఛాన్సలర్ షూష్నిగ్ రాజీనామా ఇవ్వాలి; ఆ పదవి డాక్టర్ సీయుస్ ఇన్ క్వార్టుకు చెందాలి; నాజీ పక్షానికి మూడింట రెండు వంతులు మెజారిటీతో కొత్త మంత్రివర్గాన్ని ఏర్పాటు చెయ్యాలి; ఆస్ట్రియన్ వారిని స్వదేశానికి తిరిగి రానిచ్చి, రాజధాని నగరం (వియన్నా)లో శాంతి కాపాడవలసిన పనిని వారికి అప్పజెప్పాలి; నాజీ పార్టీ మీద సమస్త నిషేధాలు తొలగిపోవాలి. ఈ రెండవ సందేశం అందేసరికి బ్రిటన్, ఫ్రాన్సు, ఇటలీలలో దేని నుంచి కూడా సహాయం రాదనే విషయం స్పష్ట పడిపోయింది. ఇక రాజీనామాయే గతి అని తోచింది. ఛాన్సలర్ షూష్నిగ్ ఆ పనిని చేశాడు. షూష్నిగ్ రాజీనామాను అంగీకరిస్తూ ప్రెసిడెంట్ మిక్లాస్ "మేము దౌర్జన్యానికి

లొంగిపోవలసి వచ్చింది" అని ప్రకటించుకున్నాడు. ఆ ప్రకారం డాక్టర్ షూష్నిగ్ రేడియో ద్వారా కింది ప్రకటన చేశాడు. "ఈనాడు మేము ఒక క్లిష్టమైన, విషమమైన సమస్యను ఎదుర్కొనవలసి వచ్చింది.

ఈనాడు జరిగిన విషయాల్ని ఆస్ట్రియన్ ప్రజలకు తెలియబరచడానికి నేను అనుజ్ఞను పొందాను.

"కాలపరిమితిని పెట్టి జర్మన్ ప్రభుత్వం ఆస్ట్రియన్ అధ్యక్షునికి ఒక అంత్య సందేశమును పంపించింది. ఈ అంత్య సందేశం ప్రకారం ఆయన జర్మనీ ఆజ్ఞల్ని అనుసరించి కొత్త మంత్రివర్గాన్ని ఏర్పాటు చెయ్యాలి. ఇలా చెయ్యని పక్షంలో పెట్టిన గడువు దాటేసరికి జర్మన్ సైన్యాలు ఆస్ట్రియాపై దాడి జరుపుతవి.

‘‘కార్మిక వివాదాలు ప్రబలినవనీ, రక్తస్రవంతులు ప్రవహిస్తున్నవనీ, ప్రభుత్వం శాంతిభద్రతలను కాపాడకుండా ఉన్నదనీ, పరిస్థితులు తల మించి పోయినవనీ, ఆస్ట్రియాలో ప్రచారమౌతున్న వదంతులు మొదటి నుంచి చివరి వరకూ కల్పితమైనవని ప్రపంచం ముందు ఉదోషిస్తున్నాను.

"మేము దౌర్జన్యానికి లొంగిపోయా మని ఆస్ట్రియా ప్రెసిడెంటు నన్ను ప్రకటించమన్నాడు. ఏర్పరిచాడు. ఈ మంత్రివర్గాన్ని గురించిన వివరాలు ఇవి :

"ఈ విపత్సమయంలో కూడా జర్మన్ రక్తాన్ని స్రవింపజెయ్యడం మాకు ఇష్టం లేదు గనకనే, మేము జర్మన్ సైన్యాలు నిజంగా దండెత్తి వచ్చినప్పటికీ వాటిని ప్రతిఘటించవద్దనీ, భావి నిర్ణయాలకు వేచి ఉండవలసిందనీ, సైనిక దళాలకు ఉత్తరువులను పంపించాం.

"మరి, నాకు సెలవా? ఈ సమయంలో ఆస్ట్రియన్ ప్రజల వద్ద నుంచి సెలవు పుచ్చుకు వెడుతున్నాను. నా మనోవాంఛ ఇది : పరమేశ్వరుడు ఆస్ట్రియాను రక్షించుగాక!"
ఛాన్సలర్ షూష్నిగ్ పదవీ పరిత్యాగం చెయ్యగానే, డాక్టర్ సేయిస్ ఇన్ క్వార్టు కొత్త మంత్రివర్గాన్ని డాక్టర్ సేయిస్ ఇన్ క్వార్ట్ : ఛాన్సలర్, రక్షణ మంత్రి; హెర్ గ్రెయిజీ - హెను : వైస్ ఛాన్సలర్; హెర్ విల్ హెల్ వైస్ట్ : విదేశాంగ మంత్రి; హెర్ ఫ్రాంజ్ హూబర్ : న్యాయశాఖా మంత్రి; హెర్మెస్లిన్ : విద్యాశాఖామంత్రి; హెడ్రూలీ : సాంఘిక శాఖామంత్రి; హెర్ రైన్ థాలర్ : వ్యవసాయ శాఖామంత్రి; హెర్ ఫిష్ బోక్ : వాణిజ్య శాఖామంత్రి; డాక్టర్ స్కుబల్ : సెక్రటరీ ఆఫ్ స్టేట్.

తన ఈ కొత్త మంత్రివర్గం ఏర్పాటు చేశాక డాక్టర్ ఇన్ క్వార్టు జర్మనీకి ఒక తంతివార్తను పంపించాడు. దాని సారాంశం ఇది : "ఆస్ట్రియాలో శాంతి భద్రతలను ఏర్పరచడానికి మేము కృషి చేస్తున్నాము. ఈ కృషిలో తోడ్పడ్డానికి మాకు జర్మన్ సైన్యాల సహాయాన్ని పంపించమని మనవి". ఈ మనవి కేవలం లోకాన్ని మోసపుచ్చడానికే అని చెప్పాలి. ఎంచేతనంటే ఇన్ క్వార్టు మనవి చదువుకొనకమునుపే జర్మన్ సైన్యాలు ఆనాటి ఉదయం పదిగంటల ప్రాంతాన ఆస్ట్రియన్ సరిహద్దులలో అనేక చోట్ల ప్రవేశించాయి! ఇక ఆ సాయంత్రానికి రెండున్నర లక్షల జర్మన్ సైనికులు ఆస్ట్రియాను వశపరచుకున్నారు. ఆరువందల జర్మన్ యుద్ధ విమానాలు విజయ ఝుంకారాలను చేస్తూ ఆస్ట్రియాలో వాలినవి.

జర్మనీ నుంచి సైన్యాలు వచ్చిపడగానే ఆస్ట్రియన్ నాజీలు మరింత చెలరేగిపోయారు. ప్రెసిడెంట్ మిక్లాస్ ను రాజీనామా పెట్టవలసిందని వాళ్ళు బలవంతం చేశారు; డాక్టర్ షూష్నిగ్ ను అరెస్టు చేశారు; పూర్వపు మంత్రివర్గానికి చెందిన తరులను, సోషల్ డెమోక్రాటిక్ పక్షానికి చెందిన వాళ్ళను, దొరికినంతవరకూ బందీలను చేశారు.

ఇంతవరకు ఆస్ట్రియా స్వతంత్ర రాజ్యమే నన్నట్టు, ఆ స్వతంత్ర రాజ్యపు ఛాన్సలర్ విన్నపాన్ని ఆదరించి జర్మన్ సైన్యం శాంతి సంస్థాపనకు తోడవుతున్నట్టు నటన జరిగింది. శుక్రవారం నాడు జరిపిన ఈ నటన శనివారం నాటికి అనవసరమని తోచింది. అంచేత ఆస్ట్రియా జర్మనీలో కలిసిపోయినట్టు శాసనాన్ని చేసి ప్రకటించవలసిందని హిట్లర్ ఆజ్ఞాపించాడు. ఆజ్ఞలను శిరసావహించి ఇన్క్వార్టు మంత్రివర్గం ఆస్ట్రియన్ ఫెడరల్ రాజ్యాంగ విధానం కింద తనకు గల ప్రత్యేక అధికారాన్ని వినియోగించుకొని ఒక శాసనాన్ని చేసింది. ఈ శాసనంలోని మొదటి షరతు ప్రకారం ఆస్ట్రియా జర్మనీ రాజ్యంలో ఒక రాష్ట్రమైపోయింది; రెండవ షరతు ప్రకారం ఏప్రిల్ 10వ తేదీనాడు జర్మనీతో ఐక్యతను గురించి ప్లెబి సైట్ జరగాలనీ, దీనిలో ఇరవై సంవత్సరాలకు పైగా వయస్సుగల స్త్రీ పురుషులందరూ ఓటు చెయ్యడానికి వీలున్నదనీ నిర్ణయమైంది.

జర్మన్ సైన్యాలు ఆస్ట్రియాలో ప్రవేశించకముందు ఈ ప్లెబి సైట్ను జరిపినట్టయితే నూటికి కనీసం అరవైమంది అయినా "జర్మనీతో మనకు ఐక్యత వద్దు" అని ఓటు చేసేవారేమో! ఇక ఇప్పుడు నూటికి ఒక్కడైనా అలా చేయడానికి వీలులేదు. ఒకవేళ సాహసించి ఎవడైనా ఆ పని చేశాడా, ప్రహరణాలు తప్పవు. కేవలం ప్రహరణాలతోనే సరిపోదు, కూడా అనుభవించవలసి వస్తుంది!! కఠోర నరకాన్ని

31

శనివారం నాటి ఉదయం హిట్లర్ స్వయంగా ఆస్ట్రియాలో ప్రవేశించాడు. ప్రవేశించి, సరాసరిగా అతడు తన జన్మస్థానమైన లియాడింగ్ అనే ప్రదేశానికి వెళ్ళాడు. అక్కడ తన తల్లిదండ్రుల సమాధి దగ్గర పూజ జరిపిన మీదట అతడు ఇలా ఉపన్యసించాడు :

"ఈ పట్టణాన్నుంచి మొట్టమొదటి సారిగా బయలుదేరి వెళ్ళినప్పుడు నా జన్మభూమిని జర్మనీ మహారాజ్యంలో ఐక్యపరచడం, భగవదాయత్తమైన నా ధర్మ మని నాకు తోచింది. ఆ ధర్మాన్ని ఈనాడు నిర్వర్తించు కున్నాను".

తర్వాత బుధవారం నాడు అతడు వియన్నా చేరుకున్నాడు. అక్కడ కూడా ఇదే ధోరణిలో ఉపన్యసిస్తూ "ఇది నా జీవిత చరిత్రలో అతిమహత్తరమైన దినం" అని అతడన్నాడు. నిజమే! ఆతని జీవిత చరిత్రలో ఇది మహత్తర దినమే! కాని, ఆస్ట్రియా చరిత్రలో? ప్రపంచ చరిత్రలో? ఈ ప్రశ్నలకు ప్రత్యుత్తరం కోసం ఎంతోకాలం వేచివుండ వలసిన అవసరం లేదు. హిట్లరు అడుగుపెట్టిన వెంటనే ఆస్ట్రియాలో బయల్దేరిన హాహాకారాలు "ఇది మహాదుర్దినం" అనే ప్రత్యుత్తరాన్ని ఘోషించినవి.

32

హిట్లరు ఆస్ట్రియాలో ప్రవేశించినట్టు వినగానే మేజరు ఫే ఆత్మహత్య చేసుకున్నాడు. కేవలం తాను చావడమే కాదు; తను చావడానికి ముందు ఇతడు తన ఇల్లాలిని, పద్నాలుగేళ్ళ కొడుకును, చివరకు తమ పెంపుడు కుక్కను కాల్చివేశాడు.

గాట్ ఫ్రెండ్ కు వాల్ట్ - ఈయన న్యాయశాస్త్రంలోనూ, ఆర్థికశాస్త్రంలోనూ గొప్ప పండితుడు; ఛాన్సలర్ సైపలకు ఆర్థిక వ్యవహారాలలో సలహాదారుడుగా కూడా పనిచేశాడు. పక్షవాతం వల్ల కాళ్ళు పడిపోయి మంచం పట్టినవాడు కూడా, విషం పుచ్చుకుని ప్రాణం తీసుకున్నాడు.

హెర్ రైట్ లింగర్ అనే పారిశ్రామికవేత్త కూతుర్ని పిలిచి “రివాల్వరుతో నన్ను కాల్చి వెయ్యి" అని కోరాడు. కాదనలేక ఆవిడి ఆ పనిచేసి, తర్వాత తనను తాను కాల్చేసుకుంది.


ప్రముఖులలో ఆత్మహత్య చేసుకున్నది వీరైతే, నిస్పృహతో ఈ కృత్యానికి దిగిన సామాన్యజనుల సంఖ్యకు అంతం లేదు. మార్చి 12 మొదలు 22 లోగా - ఒక్క పది రోజులలో - మొత్తం 1700 మంది ఆత్మహత్య చేసుకున్నారు!

హిట్లరు పరిపాలన కింద బ్రతుకు భారం అవుతుందనే నమ్మకంతోనే ఇంతమంది ప్రజలు ఈ విధంగా తమ చేతులతోనే తమ ప్రాణాలను తీసుకున్నారు. వారి నమ్మకం నిజమైనదని వెంటనే ఋజువైనది కూడా! హిట్లరు అడుగు పెట్టడమేమో, అరెస్టులు, ఆస్తిజప్తులు, లారీచార్జీలు, ఉరిశిక్షలు ప్రారంభం కావడమేమో! మానవహింసకు - ప్రత్యేకంగా యూదుల హింసకు - హిట్లరు పేరుపొందినవాడు. అయినా ఆస్ట్రియాలో అతడు చేసిన ఘోరకృత్యాలను చూస్తే, అతడి పూర్వపు దౌర్జన్యాలే సౌమ్యంగా కనబడతాయి.
ఇంతగా ప్రజల్ని బాధించిన తర్వాత, అతడు ప్లెబిసైట్ జరిపి, దానిలో జర్మనితో ఐక్యతకు ఆస్ట్రియా వారి వద్ద నుంచి నూటికి నూరు ఓట్లను సంపాదించాడు.

ప్లెబిసైట్ ఫలితం తెలియగానే, “ఇంతకుపూర్వం మనది జర్మన్ రాజ్యం; ఇప్పుడు జర్మన్ మహారాజ్యం” అనే ధోరణిలో అత డొక ప్రకటన చేశాడు.

ఆస్ట్రియా ఆక్రమణతో జర్మనీ మహారాజ్యమైనది. పోనీ దానితో హిట్లరు రాజ్యతృష్ణ పరితృప్తి పొందిందా? లేదు. అతడిప్పుడు జెకొస్లోవాకియా కూడా కావాలంటున్నాడు.
ఆస్ట్రియా విషాదగాథ ముగిసింది. ఇక జెకొస్లోవాకియా గతి.....?

జెక్ రాజ్య విచ్ఛేదం



శ్రీ నార్ల (1937)

జెక్ రాజ్య విచ్ఛేదం

1

ఆస్ట్రియా ఆక్రమణ పూర్తికావడమే తడవు, - హిట్లర్ లోపలదృష్టి జెకోస్లోవేకియా పై పడింది. ఇది కేవలం సహజం. రాజ్యతృష్ణకు పరితృప్తి అనేది లేదు. ఎంతగా దాన్ని ఉపశమింప జెయ్యాలని యత్నిస్తే, అంతగా అది అతిశయిస్తుంది.

“జర్మన్ జాతికి చెందిన ప్రజలు ఎంత మేరవరకు ఉన్నారో అంతవరకు జర్మనీ సరిహద్దులు విస్తరించడం : ఇదే మన విదేశాంగ నీతికి ప్రధానాశయం కావాలి” ఇది హిట్లర్ ఆత్మకథలోని వాక్యం. తాను ఇంకా రాజ్యాధికారాన్ని వశపరచుకొనకముందే అతడు ఈ వాక్యాన్ని వ్రాశాడు. ఎంత వ్రాశాడో, అంతా చేసి తీరుతున్నాడు కూడా. ముందు ఆస్ట్రియాను కబళించాడు. తర్వాత జెకోస్లోవేకియాను ఛిన్నాభిన్నం చేశాడు. ఇక పైన తగిన తరుణాన్ని చూచి ఇటలీ, స్విట్జర్లాండ్, హాలెండ్, పోలెండ్, లిథూనియా మొదలైన ఇరుగు పొరుగు దేశాలలోని జర్మన్ జాతి ప్రజలు కూడా తన పరిపాలన కిందికి వచ్చి తీరాలని పట్టుపడతాడు. జర్మన్ జాతికి చెందిన ప్రతి వ్యక్తి "హెయిల్! హిట్లర్!” అటూ వినమ్రులై తనకు నమస్కరించాలి. అంతవరకు అతడికి సంతృప్తి ఉండదు; శాంతి లభించదు.

అన్నట్టు, ఇది పొరపాటు! జర్మన్ జాతిని తన పరిపాలన కిందికి తెచ్చుకోవడంతో నైనా అతడు సంతృప్తి చెందడు. ఆ పైన ఇతర జాతుల వారి మీద కూడ అతడు జైత్రయాత్ర సాగిస్తాడు. “జర్మన్ రాజ్యం విస్తరించాలంటే, అందుకు తగిన మార్గం ఒక్కటే. అది ఇది : తూర్పు యూరప్ పై ఆక్రమణ చెయ్యాలి; ఆ దిశలోవున్న రాజ్యాలలో నుంచి (ముఖ్యంగా సరిహద్దు రాజ్యాలలో నుంచీ, సోవియట్ రష్యాలో నుంచీ) భూ ఖండాల్ని కలుపుకోవాలి”. ఇవి కూడా హిట్లర్ ఆత్మకథలోని వాక్యాలే! అందుచేత వీటిని శంకించడానికి వీలులేదు.

‘‘పూర్వం ఎన్నడో వ్రాసిన ఆత్మకథలో విషయాలు ప్రసక్తిదేనికి? జెకొస్లోవేకియా నుంచి సూడెటెన్ జర్మన్ ప్రాంతాన్ని విడగొట్టి పుచ్చుకోగానే, మరి తనకు యూరలో ఏ రాజ్య ఖండం పైనా ఆశ లేదని హిట్లర్ బాహాటంగా చాటినాడుగదా? ఇక, అతడు ఇతర జాతుల వారిమీద కూడ కత్తికడతాడనీ, యూరప్లో తూర్పు దిశకు జర్మన్ రాజ్యాన్ని విస్తరింపజేస్తాడనీ అనడం పొరపాటుకాదా?” అని కొందరు వాదించవచ్చును. ఇలా వాదించే వారికి హిట్లర్ స్వభావం తెలియదని చెప్పవలసి ఉంటుంది. ఈ క్షణం చేసిన వాగ్దానాన్ని మరుక్షణంలో నిస్సంకోచంగా భంగపరచగల ధూర్తశిఖామణి, హిట్లర్! ఇది గిట్టక అంటున్న మాటకాదు. అతడు ఇంతకు పూర్వం ఎన్నోసార్లు సరిగా ఇలా చేశాడు. ఆస్ట్రియాను మరి రెండు, మూడు నెలలకు ఆక్రమించుకొంటాడనగా, ఆ దేశ స్వాతంత్ర్యానికి భంగం రానివ్వనని అతడు బహిరంగ ప్రకటన చేశాడు. ఇందుకు భిన్నంగా వెళ్ళి, ఆస్ట్రియాను ఒకవైపు కబళిస్తూ, ఇంకోవైపున గోరింగ్ ద్వారా జెకోస్లోవేకియాపై తనకు ఆశలేదని ప్రాగ్ ప్రభుత్వం వారికి కబురు చేశాడు. ఇంతచేసిన వాడు తిరిగి రేపు “యూరప్ ఖండానికి సంబంధించినంత వరకు ఇక నాకు రాజ్య కాంక్ష లేదు” అనే తన వాగ్దానాన్ని విస్మరించడం ఒక లెఖా?

పోనీ, తూర్పు యూరప్ ను ఏకచ్ఛత్రాధిపత్యంగా పరిపాలించడంతోనైనా అతడు సంతోషపడతాడా? అబ్బే! లేదు!! అటుపైన సకల ప్రపంచం తన పాదాక్రాంతం అయిపోవాలి ఇది అత్యుక్తి కాదు. ఇందుకు నిదర్శనం తిరిగి అతడి ఆత్మకథే! దానిలో అతడు ఇలా వ్రాశాడు : “ప్రపంచంలో సుస్థిరమైన శాంతి ఏర్పడాలని హృదయపూర్వకంగా వాంఛించేవారు ప్రపంచం జర్మనుల వశమైపోవడానికి కృషి చెయ్యాలి”. అంటే, జర్మనీ దాస్యమో, సర్వవినాశన కరమైన యుద్ధమో తప్ప ప్రపంచానికి మార్గాంతరం లేదన్నమాట!

దీన్నిబట్టి స్పష్టపడుతున్న విషయం ఇది : హిట్లర్ ఈనాడు అవలంబిస్తున్న విధానం చివరికి ప్రపంచ దిగ్విజయంగా పరిణమించాలి. ఇలా పరిణమించనినాడు అతడు తన ఆశలు ఫలించనట్టే యెంచుకుంటాడు; తన కృషి విఫలమైనట్టే భావిస్తాడు. దీన్ని తెలుసుకోలేక, "ఆస్ట్రియాతో సంతృప్తి చెందడా? జెకోస్లోవేకియాతో శాంతించడా?" అని అనుకోవడం కేవలం వెర్రి భ్రమ!

2

ఈనాడు హిట్లరు పంతం సాగిందంటేనూ, జెకోస్లోవేకియా ఛిన్నాభిన్నమై పోయిందంటేనూ, ఇద్దరు మహామహులు ఏ ఆశయం కోసం తమ జీవితాన్ని ధారపోశారో ఆ ఆశయం ధూళిధూసరితమై పోయిన దన్నమాట! ఆ మహామహులలో మొదటివాడు మాజరిక్, రెండవవాడు బెనిస్. ఈ ఇద్దరి జీవిత చరిత్రల్ని తెలుసుకుంటే, జెకోస్లోవేకియా రాజ్య చరిత్రను చాలవరకు తెలుసుకున్నట్టే! ఇది అతిశయోక్తి కాదు - ముమ్మాటికీ!

ఆస్ట్రో - హంగరియన్ సామ్రాజ్యంలో బానిసలుగా ఉన్న జెక్, స్లోవక్ జాతులవారు చేరి, జర్మనీ యుద్ధానంతరం జెకొస్లోవేకియా అంటూ అసలొక స్వతంత్ర రాజ్యంగా ఏర్పడ్డానికీ, ఈ స్వతంత్ర రాజ్యం అచిరకాలంలోనే ప్రపంచ ప్రజాస్వామ్యాలలో ఆదర్శప్రాయమైనదిగా విలసిల్లడానికి వీరుభయులే కారకులు. మాజినీ, గారిబాల్డీలు ఇటలీకి చేసిన సేవను వీరిద్దరూ జెకొస్లోవేకియాకు చేశారని నిరాఘాటంగా చెప్పవచ్చును.

జెకొస్లోవేకియా నిర్మాతలైన ఈ మహా పురుషు లిద్దరిలోను మాజరిక్ పెద్దవాడు; అధిక పూజ్యుడు. ఆయన అన్ని విధాల చాలా అదృష్టవంతుడు కూడా! ఎంచేతనంటే, - ఏ రాజ్యస్థాపన కోసం తాను కఠోర తపస్సు చేశాడో, ఆ రాజ్యప్రతిష్ఠ దేదీప్యమానంగా ఉండగానే ఆయన తనువు చాలించాడు. ఇక ఆయన శిష్యుడు, అనుచరుడు అయిన బెనిస్ తాము నిర్మించిన మహాసౌధము కూలిపోవడాన్ని నిస్సహాయంగా చూడవలసి వచ్చింది.

3

మాజరిక్ జననం 1850లో మాజరిక్ తండ్రి "కోచ్ మన్'(జట్కా బండి నడిపేవాడు); తల్లి వంటకత్తె. ఇంతటి నిరుపేదలైన తల్లిదండ్రుల కడుపున పుట్టటం వల్ల, మాజరిక్ బాల్యం కష్టభూయిష్టంగా గడిచింది. అప్పటి తమ దుర్భర దారిద్ర్యాన్నీ, తమ దైన్యస్థితినీ, తమ భావాలనూ వర్ణిస్తూ, మాజరిక్ ఒక సందర్భములో కొన్ని కథలను చెప్పాడు. ఆ కథలలో ఒకటి ఇది :

రోజులలో ప్రభువులూ, శ్రీమంతులూ తమ గ్రామానికి వేటకు వస్తూ ఉండేవారట. వేట జరిగినంత సేపూ వారి ఉన్ని కోట్లు తమ ఇంట్లోనే ఉండేవట. తాము కూటికి లేక అల్లాడి పోవడమూ, వారు భోగలాలసతతో విర్రవీగడమూ చూస్తే, తన కడుపు తరుక్కుపోయి, ఆ కోట్లను కాల్చివేద్దామా అని బుద్ధి పుడుతూ ఉండేదట! వేట పూర్తి అయిన తర్వాత, వారు వైభవోపేతముగా విందు కుడిచేవారట.

చివరకు పోతూ పోతూ తాము తినగా మిగిలిన ఎంగిలిని పారవేసి వెళ్ళేవారట. ఆ ఎంగిలి కోసమే తమ గ్రామస్థులు కొట్టుకు చచ్చేవారట. ఆ మాజరిక్ తండ్రి బానిసగా పుట్టాడు; బానిసగానే పెరిగాడు. కొడుకు నేర్చేవరకూ అతడికి చదువు సంధ్యలు లేవు. కొడుకు నేర్పిన చదువు ఫలితంగా అతడికి "కోచ్ మన్" పని తప్పి, అమీనా ఉద్యోగం దొరికింది కూడా.

మాజరిక్ తండ్రి చాలా హుషారైన వాడని చెబుతారు. సుఖంగా ఉన్నప్పుడు చెప్పనబ్బర్నే లేదు; కష్టాలలో వున్నపుడు కూడా అతని పెదవుల మీద చిరునవ్వు తాండవం ఆడుతూనే ఉండేదట! అతడు ఎక్కడవుంటే అక్కడ ఇట్టే పలుకుబడి సంపాదించేవాడట. తండ్రి ఈ గుణగణాలన్నీ మాజరిక్ లో కనబడేవి.

అయితే, మాజరిక్ ప్రవృత్తికి ఎక్కువగా రూపాన్ని దిద్దింది, ఆయన తండ్రి కాదు; తల్లి. మాజరికకు తన తండ్రి అంటే, ప్రేమ మాత్రమే ఉండేది; తల్లి అంటే ప్రేమతోపాటు భక్తి కూడా ఉండేది.

తమలానే తమ కొడుకు కూడా దారిద్ర్యంలోనూ, అజ్ఞానంలోనూ బ్రతకరాదని మాజరిక్ తల్లి పట్టుపట్టింది. ఆవిడ పట్టుదల కారణంగానే మాజరిక్ చదువుకోవడం ప్రారంభించాడు. స్వగ్రామంలో కొంతవరకు చదువుకున్న తర్వాత, హస్టో పెక్ లోని సెకండరీ స్కూల్ లో చేరాడు. ఈ స్కూలులో కొడుకును ప్రవేశపెట్టడానికి మాజరిక్ తండ్రి ఆస్ట్రియా చక్రవర్తి దగ్గర నుంచి ప్రత్యేకంగా అనుజ్ఞ పుచ్చుకోవలసి వచ్చింది. ఔను మరి! బానిస ప్రజలకు విద్య అబ్బడం నిరంకుశతకు ప్రాణాంతకం కాదూ?

హస్టోపెక్‌లోని స్కూల్లో చేరడానికి వెళ్ళేనాడు మాజరిక్ కు తగిన దుస్తులు లేకపోయాయి. అపుడు ఆయన తండ్రి తన పాత "కోచ్ మన్" లివరీని చించి, కొడుకు కోసం ఒక సూట్ కుట్టించాడు. ఈ సూట్ ను చూచి, తోటి విద్యార్థులు మాజరిక ను గేలిచేశారు. సహాధ్యాయులు తన దారిద్ర్యాన్ని పరిహాసం చేస్తూవుంటే పాపం! ఆ నవకిశోర కోమల హృదయం ఎంత వేదనా సంక్షుభితమైందో!! హస్టోపెక్‌లో చదువు పూర్తిచేసుకున్న తర్వాత మాజరిక్ మరి చదువుకోడానికి తాహతులేక ఒక కమ్మరి వద్ద పనికి కుదిరాడు. ఇక్కడ కొంతకాలం పనిచేసి, ఇక గత్యంతరం లేదనీ, కమ్మరిగానే బ్రతుకును వెళ్ళదీయక తప్పదనీ నిశ్చయించుకోబోతూ ఉండగా, అదృష్టవశాత్తు బ్రినోలోని "జిమ్నాజియం"లో చేరి చదువు సాగించడానికి ఆయనకు అవకాశం చిక్కింది. అష్టకష్టాలు పడుతూ బ్రినోలో విద్యాభ్యాసాన్ని ముగించుకొని, ఆయన ఆస్ట్రియా ముఖ్య పట్టణమైన వియన్నాకు వెళ్ళాడు.

వియన్నాలో 1872లో మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణుడై అక్కడనే యూనివర్సిటీలో చేరాడు. ఎన్నో చిక్కుల్నిపడి, ఎన్నో గండాల్ని గడిచి, చివరకు ఏలాగో ఆయన పట్టభద్రుడయ్యాడు. దానితో మాజరిక్ విద్యార్థి జీవితం ముగిసింది.

పట్టభద్రుడైన తర్వాత వియన్నాలోనే మాజరిక్ కు "రీడర్" ఉద్యోగం కుదిరింది. కొంతకాలం గడిచిన తర్వాత దీనిలో నుంచి "లెక్చరర్" ఉద్యోగములోనికి ప్రమోషన్ దొరికింది. ఉద్యోగాలను చేస్తూ, 1882 వరకూ ఆయన వియన్నా లోనే ఉన్నాడు.

1876-77లో కొన్ని మాసాలపాటు మాజరిక్ జర్మనీలోని లీప్ జిగ్ యూనివర్సిటీలో ప్రొఫెసరుగా ఉన్నాడు. ఇక్కడ ఉండగానే ఆయనకు అమెరికా దేశస్థురాలైన మిస్ గారి తో పరిచయం కలిగింది. ఈ పరిచయం క్రమంగా ప్రణయంలోకి మారగా మాజరిక్ ఆవిడను పరిణయ మాడాడు.

భార్య అంటే, మాజరిక్ కు ఎంతో ప్రేమ, గౌరవం ఉండేవి. ఆవిడ పైన తనకుగల ఈ ప్రేమ గౌరవాలకు నిదర్శనంగా మాజరిక్ తన పేరుతో ఆవిడ పేరును కూడా కలుపుకున్నాడు. ఆయనకు తల్లిదండ్రులు పెట్టిన పేరు థామస్ మాజరిక్, ఈ పేరును ఆయన థామస్ గారిగ్ మాజరిక్ గా మార్చుకున్నాడు.

తన జీవిత చరిత్రకారుడైన కారక్ కాపెతో ప్రసంగిస్తూ, ఆయన, తన ధర్మపత్నిని ఇలా అభివర్ణించాడు.

"ఆవిడ చూడ చక్కనిది; బహు తెలివైనది - నాకంటే కూడా!" మేము ఏ పని చేసినా కలిసి చేసే వాళ్ళము - చివరకు ప్లేటో వేదాంత శాస్త్ర గ్రంథాల్ని కూడా కలిసి చదివే వాళ్ళం; మా గార్హస్య జీవితం సంపూర్ణ సహకార సూత్రం మీద నడిచింది. మన దేశం భవిష్యత్తు విషయమై ఆవిడకు ప్రబల విశ్వాసం ఉండేది. నా రాజకీయ కార్యకలాపా లన్నింటిలోనూ ఆవిడ తోడునీడగా ఉండేది. జర్మనీ యుద్ధ సందర్భములో విదేశాలలో ప్రవాసం ఉన్నప్పుడు తప్పితే, మరెపుడూ ఆవిడ సహకారం లేకుండా నేను ఏ పనీ చెయ్యలేదు. మాకు ఎడబాటు కలిగిన ఆ సమయంలో కూడా ఆవిడ నా కార్యకలాపాలను గమనిస్తూ ఉన్నదనే భావం, వాటిని హర్షిస్తూ ఉన్నదనే ధైర్యం. ఇవి నాకు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చేవి.

"స్త్రీ కేవలం తన భర్త కోసం గాని, పురుషుడు కేవలం తన భార్య కోసం గాని జీవించ గూడదని ఆవిడ విశ్వాసం; ఉభయులూ భగవదిచ్చను తెలుసుకోడానికీ, దాన్ని నిర్వహించడానికి ప్రయత్నించాలని ఆవిడ అనేది".

1882లో మాజరిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ గా ప్రాగ్ నగరం చేరుకున్నాడు. ఈ ఉద్యోగానికి వేతనం 1800 ఫ్లోరిన్సు. (ఫ్లోరిన్ విలువ, మన రూపాయి విలువ దాదాపుగా సరిసమానంగానే ఉంటాయి). మామూలు పద్ధతిలో తాను కూడా మూడు సంవత్సరాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పదవి నుంచి, ప్రొఫెసర్ పదవికి ప్రమోషన్ పొందగలనని ఆయన అనుకున్నాడు. కాని, కొందరు సహోద్యోగులు కుట్ర పన్నడం వల్ల పదమూడు సంవత్సరాల తర్వాత గాని ఆయనకు న్యాయరీత్యా రావలసిన ప్రమోషన్ రాలేదు. ఈ సందర్భంలో తనకు వ్యక్తిగతంగా జరిగిన అపకారాన్ని గురించి కంటే, బానిసత్వ కారణంగా విద్యాధికులైన స్వదేశీయులలో కూడా ప్రబలుతూ ఉన్న నీచ ప్రవృత్తిని చూచి ఆయన ఎక్కువగా భేదపడ్డాడు!

ప్రాగ్ లో ఉద్యోగానికి ప్రవేశించేనాటికి మాజరిక్ కు స్వభాషలో అంత పాండిత్యం లేదు. స్వభాషా పాండిత్యం లేనప్పుడు తాను ప్రాగ్ లో రాణించగలనా అని ఉద్యోగ స్వీకరణానికి ముందు ఆయన కొంత సంకోచించాడు కూడా. అయితే, త్వరలోనే ఆయన తనకు గల ఈ భాషాలోపాన్ని తీర్చుకోగలిగాడు. అసలు ఏ భాషనైనా నేర్చుకోవడమూ, ఆయనకు బహు సులభమైన విషయం. తనకు అభిమాన శాస్త్రమైన వేదాంతాన్ని గురించి వియన్నాలో అఖండంగా చదువుతూనే ఆయన గ్రీక్, లాటిన్, ఫ్రెంచి, ఇంగ్లీషు, పోలిష్, రష్యన్ భాషల్ని నేర్చుకున్నాడు. పోతే, జెక్ మాతృభాష: జర్మన్ అక్షరాభ్యాసం నుంచీ నేర్చిన భాష. ఇన్ని భాష లివిగాక, ఆయనకు ఇటాలియన్ కూడా - నట్టుపడకుండా సంభాషించడానికి తగినంతగా తెలుసు. ఇక్కడికి ఈ భాషలన్నీ చాలనట్టు ప్రాచ్య భాషల్ని నేర్చుకోడానికి ఆయన కుతూహలపడ్డాడు కూడా. ప్రాచ్య భాషలలో ముందుగా అరబిక్ ను నేర్చుకోబోయాడు. కాని, కొన్ని అవాంతరాల వల్ల ఈ ప్రయత్నం సాగలేదు.

బహు భాషా పాండిత్యం విషయంలో ఆధునిక యుగ రాజకీయ వేత్తలలో మాజరిక్ తో సరిపోల్చదగినవారు, మరెవ్వరూ లేరు. హిట్లరుకు జర్మన్ తప్ప మరే భాష రాదు. స్టాలినక్కు రష్యన్ వినా, ఇంకొక భాష తెలియదు. ముసోలినీకి ఏవో కొన్ని భాషలలో ప్రవేశం ఉందిగాని, అతడికి వచ్చిన భాషలు మాజరిక్ కు వచ్చిన వాటిలో మూడో వంతైనా కావు. ఇలాగే ఎవ్వరిని చూచినా మాజరిక్ పోటీకి నిలువలేరు.

ప్రాగ్ లో ప్రొఫెసరుగా ప్రవేశించిన తర్వాత తన ప్రతిక్షణం వ్యవధినీ మాజరిక్, జెజాతి పునరుజ్జీవనానికి వినియోగించ సాగాడు. తమ జాతి నిజంగా బాగుపడాలంటే, స్వల్ప సంస్కరణాలు పనికిరావని ఆయన ఓం ప్రథమంలోనే గ్రహించాడు. జెక్, స్లోవక్ జాతులు రెండూ చేరి, సంపూర్ణ స్వాతంత్ర్యంతో ఒక సమష్టి రాజ్యాన్ని స్థాపించుకోవడం అవసరమని ఆయన నిర్ణయించుకున్నాడు. ఇలా ఒక నిర్ణయానికి వచ్చి, దాన్ని నెరవేర్చుకోడానికి తన సర్వశక్తుల్ని ధారబోశాడు.

రాజకీయాలలో దిగిన తొమ్మిది సంవత్సరాలకు అంటే 1891లో - మాజరిక్ “యంగ్ జెక్ పార్టీ" ప్రతినిధిగా పార్లమెంటులో ప్రవేశించాడు. ఈ పార్టీ తన ఆదర్శాలకు తగినంత విశాలంగా లేదని, ఆ తర్వాత కొంతకాలానికి “రియలిస్టు పార్టీ” అనే కొత్త దాన్ని ఆయన స్థాపించాడు.

“రియలిస్టు” పార్టీలో జెక్కుకు మాత్రమే కాకుండా స్లోవక్కుకు కూడా ప్రవేశం ఉంది.

కొత్త పార్టీని ఏర్పాటు చేసిన తర్వాత మాజరిక్ తమ జాతీయోద్యమ భవిష్యత్తుకు సంబంధించిన సమస్యల్ని పెక్కింటిని ప్రత్యేక శ్రద్ధతో చదివాడు. ఆస్ట్రో హంగరియన్ సామ్రాజ్యానికున్న ఆర్థిక బలాన్ని గురించీ, సైనిక శక్తిని గురించి విపుల పరిశోధనలు చేశాడు. ఏ క్షణాన ప్రళయ భయానకంగా పరిణమిస్తాయో అన్నట్టుగా ఉన్న ఆనాటి యూరపియన్ రాజకీయ పరిస్థితులను అర్థం చేసుకోడానికి విశేష కృషి చేశాడు. స్లోవక్ జాతి వారితో తమ సమష్టి సమస్యల్ని చర్చించి, వారి వైఖరిని తెలుసుకున్నాడు. ఆ రోజులలో జాగ్రదవస్థలో వున్నా, నిద్రావస్థలో ఉన్నా ఆయనకు ఒక్కటే తలపు - అది జెక్, స్లోవక్ జాతుల స్వాతంత్ర్యం!

జర్మనీ యుద్ధం ప్రారంభం కావడమే ఆలస్యం - తమజాతి సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని పొందడానికి తగిన తరుణం దొరికిందని మాజరిక్ గ్రహించాడు. ఈ యుద్ధం ప్రారంభమైనప్పుడు ఆయన డ్రెజ్ డెన్ (అమెరికా)లో ఉన్నాడు. అక్కడ నుంచి సాధ్యమైనంత త్వరలో ప్రాగ్ తిరిగివచ్చి, ప్రాగ్ నుంచి మళ్ళీ వెంటనే విదేశాలకు వెళ్ళిపోయాడు. దూరదృష్టితో ప్రాగ్ నుంచి త్వరగా వెళ్ళిపోబట్టి సరిపోయిందిగాని, లేకపోతే తప్పకుండా ఆయన్ని అరెస్టు చేసేవారే!

జర్మనీ యుద్ధం జరిగిన ఆ నాలుగు సంవత్సరాలలోనూ మాజరిక్ హాలెండ్, బెల్జియం, ఫ్రాన్సు, స్విట్జర్లాండ్, ఇటలీ, బ్రిటన్ మొదలైన దేశాలలో పర్యటనం చేశాడు. ఇలా పర్యటనం చేస్తూ, ఆయా దేశాల ప్రముఖ రాజకీయవేత్తలను సందర్శించి, తమ జెక్, స్లోవక్ జాతులకు సంపూర్ణ స్వాతంత్ర్యం ఉండడం ఎంత అవసరమో వారికి నచ్చజెప్పాడు.

కేవలం రాజకీయ వేత్తలను సందర్శించడమే కాకుండా, పత్రికలకు వ్యాసాలను వ్రాసీ, ఉపన్యాసాలను ఇచ్చి, పుస్తకాలను ప్రకటించి, మధ్య యూరప్ లో శాంతి భద్రతలు ఏర్పడాలంటేనూ, ఆ ప్రాంతం సుఖంగాను, ఆనందంగానూ ఉండాలంటేనూ ఆస్ట్రో హంగరియన్ సామ్రాజ్యాన్ని విచ్ఛిన్నం చెయ్యక తప్పదనే అభిప్రాయాన్ని ప్రజాబాహుళ్యంలో ప్రచారం చేశాడు.

మాజరిక్ చేసిన ఈ ప్రచారం ఆశాతీతంగా, ఫలప్రదమైంది. ఇది ఇంతగా ఫలప్రదం కావడానికి ముఖ్యమైన కారణాలు ఇవి : మొదటి కారణం ఆయన అవలంబించిన ఉత్తమ ప్రచార పద్ధతులు. రెండవ కారణం ఆయన పలికిన ప్రతి పలుకులోనూ, వ్రాసిన ప్రతి వాక్యంలోనూ ప్రస్ఫుటంగా కనబడిన స్వజాతీయాభిమానం, ఉన్నత ఆశయాల ప్రేమ, సత్యనిరతి, సేవాధురీణత, మూడవ కారణం - యుద్ధంలో జర్మనీ, ఆస్ట్రియాలు జయిస్తే, అదివరకే దుర్భరంగా ఉన్న దాస్య బాధ మరింత అధికం అవుతుందనే భయం. హాప్స్బర్గ్ రాజుల పరిపాలన కింద 1914వ సంవత్సరానికి పూర్వం ఉన్న పరిస్థితులలో - జెక్ ప్రజలకు ఒకనాటికి కాకపోతే మరొక నాటికైనా ఇంతో అంతో స్వపరిపాలనాధికారం లభించగలదనే ఆశాలేశం ఉండేది. ఆస్ట్రో - హంగరియన్ సామ్రాజ్యం జర్మనీతో చేరి, యుద్ధానికి దిగిన తర్వాత ఈ కొంచెం ఆశ కూడా అడుగంటిపోయింది. తూర్పు యూరప్ నంతటినీ, టర్కీ వరకు తన గుప్పిటిలో పెట్టుకోవడం కోసమే జర్మనీ యుద్ధానికి తలపడింది. ఇట్టి జర్మనీ నాయకత్వాన్ని అంగీకరించి, ఆస్ట్రో హంగరియన్ సామ్రాజ్యం ఆ యుద్ధంలో చేరింది. ఇక, ఆ సామ్రాజ్యంలోని మైనారిటీ సంఘాలకు, జెక్, స్లోవక్, సెర్బ్, క్రోట్, పోలిష్, రుథీనియన్, రుమేనియన్, ఇటాలియన్

మొదలైన జాతుల వారికి - జర్మన్ విజయం తమ సంకెళ్ళు మరింత బిగిసిపోవడానికే అని భయం కలగడంలో ఆశ్చర్యమేమున్నది?

కారణాలు ఏమైతేనేమి గాని, మాజరిక్ చేసిన ప్రచార ఫలితంగా ఆస్ట్రియా సైన్యంలో నుంచి పైన పేర్కొన్న మైనారిటీ సంఘాలకు చెందిన సైనికులు దాదాపు 30 లక్షల మంది శత్రు పక్షంలో చేరిపోయారు. వీరిలో సుమారు 20 లక్షల మంది కావాలని ఖైదీలుగా పట్టుబడ్డారు. మిగిలిన వారు బాహాటంగానే విద్రోహం చేసి, ప్రతికక్షులతో కలిసిపోయారు. దీని ఫలితం, ఆస్ట్రియా కనీసం 120 సైనిక దళాలను యుద్ధ రంగంలో నిలపగలదని జర్మనీ అంచనా వేసుకుంటే, చివరికి 80 దళాలు మాత్రమే తేలడం!

హాబ్బర్గ్ (ఆస్ట్రో - హంగరియన్) సామ్రాజ్యానికి చెందిన మైనారిటీ సంఘాల వారు లక్షోపలక్షలుగా శత్రుపక్షంలో చేరిపోవడమే జర్మనీ పరాజయానికి ఒక ప్రధాన కారణమని నిస్సంకోచంగా చెప్పవచ్చును. ఇలా జరిగిఉండని పక్షంలో రష్యన్ సైన్యాలు 1914లో ఆస్టియన్ సరిహద్దులలోకి అంతగా చొచ్చుకు పోగలిగేవికావు; సెర్బియా ఆ సంవత్సరంలోనే అంటే ఆ 1914లోనే ఓడిపోయి ఉండేది. బల్గేరియా 1915 వరకు ఆగకుండా, 1914లోనే జర్మనీ పక్షాన చేరి ఉండేది; రష్యా 1917లో కాకుండా, 1916 లోనే దెబ్బతిని ఉండేది. ఇక ఇటలీ, బల్గేరియా రాజ్యాలు బ్రిటన్ ఫ్రాన్సుల పక్షాన చేరకుండా తాటస్థ్యాన్నే వహించేవి; ఒక్కమాటలో జర్మనీ తప్పక విజయాన్ని పొందివుండేది! ఇందుకు భిన్నంగా జరగడానికి కారణం ఇంతకు పూర్వమే చెప్పినట్టు మాజరిక్ ప్రచారం.

మాజరిక్ విదేశాలలో బ్రహ్మాండంగా ప్రచారం సాగిస్తూవుంటే, ఆయన్ని అరికట్టాలని ఆస్ట్రియా, జర్మనీలు శతవిధాల ప్రయత్నించాయి. ఈ రెండు రాజ్యాలు ఆయన్ని పెట్టిన ఇబ్బందులు ఇన్నన్ని కావు. ఆయన వెనక గూఢచారుల్ని తిప్పి, వేధించారు; ఆయన కుమార్తెను అరెస్టు చేశారు.

ఇందుకుతోడు ఈ సమయంలోనే ఆయన కుమారుడొకడు వ్యాధిగ్రస్తుడై చనిపోయాడు; భార్య ఆరోగ్యం పూర్తిగా చెడిపోయింది. ఆయన కుమారులలో ఇంకొకడిని ఆస్ట్రియా ప్రభుత్వం వారు ఉరితీశారనే అసత్యవార్తను ప్రకటించి, అమెరికా పత్రికలు కొంత మనస్తాపాన్ని కలిగించాయి కూడా! ఇన్ని చిక్కులు వచ్చినా, ఇన్ని కష్టాలు చుట్టుకున్నా, వీటిని లెక్క చెయ్యకుండా, మాజరిక్ తన కార్యక్రమాన్ని తాను సాగించాడు!!

ఈ విపత్సమయంలో మాజరిక్ ప్రదర్శించిన ధీరోదాత్తకు ఆయన ఆత్మకథలోని క్రింది వాక్యాలే నిదర్శనం :
“జెనీవాలో” నేను కుదురుకున్నానో, లేదో, తలవని తలంపుగా నా కుమారుడు హెర్బర్ట్ జబ్బు పడిన వార్త ప్రాగ్ లోని నా కుంటుంబం నుంచి తెలిసింది. తర్వాత మార్చి 15వ తేదీనాడు (1915) వాడు మరణించినట్టు తంతి వార్త వచ్చింది. ఈ రీతిగా స్వదేశంలోని లక్షలాది ఇతర కుటుంబీకుల వలె మాకు కూడా పుత్రశోకం కలిగింది. మావాడు చాలా బుద్ధిమంతుడు; పెద్ద మనిషి; కవి; చిత్రకారుడు కూడా. నిరాడంబరమైన సౌందర్యమే వాడి ఉపాస్యదేవత. చాల ఆరోగ్యవంతుడు. వ్యాయామం వల్ల బలశాలికూడా అయ్యాడు. ఆస్ట్రియా తరఫున యుద్ధం చెయ్యవలసిన అవసరాన్ని తప్పించుకోడానికి వాడు శాయశక్తుల ప్రయత్నించాడు గాని, చివరికి యుద్ధ కారణంగానే మరణించాడు. గాలీషియా నుంచి పలాయనమై వచ్చిన వారికి సహాయపడుతూ ఉండగా, ఏదో అంటువ్యాధి సోకింది. దానికి బలి అయిపోయాడు. కర్మ సిద్ధాంతాన్ని విశ్వసించే వారికి తమ వాదాన్ని సమర్థించుకోవడానికి ఇది మంచి నిదర్శనం! మత విషయాలలో పూర్వం నాతో వాదోపవాదాలు జరిపినవారు “భగవదిచ్ఛ” అని హేళన చేస్తూ దుర్భాషలతో నిండిన ఆకాశ రామన్న ఉత్తరాల్ని నాకు కురిపించారు. ఈ పుత్ర వియోగం నాకు “నీ ప్రయత్నాల్ని విరమించవద్దు సుమా; నీవు నిరాశ చెందవద్దు సుమా! అనే భగవదాజ్ఞగా తోచింది”.

చివరికి 1917లో మాజరిక్ - అప్పటికి ఆయన అరవై యేడు సంవత్సరాల వృద్ధు - "థామస్ జార్జి మా సన్" అనే మారు పేరుతో డేనిష్ ప్యాస్పోర్టును పుచ్చుకొని, రష్యా వెళ్ళాడు. రష్యాలో యుద్ధ ఖైదీలు గానూ, ప్రవాసులు గానూ ఉన్న జెక్, స్లోవక్ జాతుల వారిలో నుంచి వాలంటీర్లను చేర్చుకుని, ఆ వాలంటీర్ల దళాన్ని ఆస్ట్రియా మీదికి యుద్ధానికి తీసుకు వెళ్ళాలనే ఉద్దేశంతో మాజరిక్ ఈ ప్రయాణాన్ని పెట్టుకున్నాడు. ఆయన రష్యాను చేరుకొనక ముందే అక్కడ విప్లవం జరగడమూ, కెరెన్ స్కీ నాయకత్వము క్రింద కొత్త ప్రభుత్వం ఏర్పడ్డమూ జరిగింది. ఈ పరిస్థితిలో ఆయన ఉద్దేశ సాఫల్యం జరగవలసింది కాదు. అయితే కెరెన్ స్కీ మంత్రివర్గంలోని కొందరు సభ్యులు మాజరిక్ స్నేహితులు. వారు ఆయనకు చాలా వరకు తోడ్పడ్డారు.

రష్యాలో మాజరిక్ సభల్ని జరిపాడు; ఉపన్యాసాల్ని ఇచ్చాడు; పత్రికాధిపతుల్ని సందర్శించాడు. వ్యాసాల్ని వ్రాశాడు; ప్రభుత్వాధికారుల్ని, రాజకీయవేత్తల్ని కలుసుకున్నాడు; జెకోస్లోవేకియా అనే కొత్త రాజ్యాన్ని సంస్థాపించవలసిన అవసరాన్ని అందరికి నచ్చజెప్పాడు. ఈ కృషితో పాటు, ఆయన ఇంకొక పనిని కూడా సాధించాడు. అది ఏమంటే, జెక్, స్లోవక్ యుద్ధఖైదీలను, ఆ జాతులకు చెందిన ఇతరులను కలిపి, ఒక సైనిక దళాన్ని కూర్చడం.

మాజరిక్ అష్టకష్టాలు పడి, చివరికి ఒక సైనిక దళాన్ని కూర్చడమేమో, రష్యాలో బోల్షివిక్ విప్లవం జరగడమేమో? దీనిలో ఆ సైనిక దళాన్ని ఆస్ట్రియా పైకి యుద్ధానికి తీసుకువెళ్ళడంలో పెద్ద చిక్కు ఏర్పడింది. ఈ చిక్కు వీడాలంటే, అందుకు ఒక్కటే మార్గం కనిపించింది.

అదేమంటే - జపాను, అమెరికాలను చుట్టి - ప్రపంచం చుట్టూ ఒక ప్రదక్షిణం చేసి - యుద్ధరంగాన్ని చేరుకోవడం. అందు విషయమై ఏర్పాట్లు చెయ్యడానికి మాజరిక్ స్వయంగా అమెరికా వెళ్ళాడు. అమెరికాకు వెళ్ళడం అది ఆయనకు మూడోసారి కాబోలు. అమెరికాలో దిగడమే తడవుగా మాజరిక్ - రష్యాలో చేసినట్టుగానే - జెకొస్లోవేకియా స్వతంత్ర రాజ్య సంస్థాపనను గురించి విపులమైన ప్రచారం సాగించాడు. తన కృషి విజయవంతం కావాలంటే, అప్పటి అమెరికా ప్రెసిడెంట్ విల్సన్' ఆమోదాన్ని సంపాదించుకోవడం అత్యవసరమని ఆయన గ్రహించాడు. ఇలా గ్రహించిన వాడు తొందరపడి విల్సన్ సందర్శనానికి వెళ్ళాడా? లేదు. సూక్ష్మబుద్ధి, కార్యకుశలత కలవాడు గనక మానవ స్వభావాన్ని పూర్తిగా గ్రహించినవాడు గనక ముందుగా కొన్ని వారాలపాటు విల్సన్ వ్రాసిన పుస్తకాల్ని అన్నింటినీ చదివి, వాటిలోనుంచి తన వాదనను బలపరచే భాగాల్ని సేకరించాడు. వీటిని తెలివిగా ఉపయోగిస్తూ, ఒక మెమొరాండం తయారుచేశాడు. దీన్ని చేతబట్టుకొని, ఆ మీదట విల్సన్ సందర్శనానికి వెళ్ళాడు. దీనితో అమెరికా అధ్యక్షుని సానుభూతిని సంపాదించడం అతి సులభమైపోయింది.

ఈ కృషి అంతటి ఫలితం ఏమంటే, - మాజరిక్ స్వతంత్రోద్యమాన్ని నడపడానికి సంస్థాపించిన " జాతీయ సంఘం" (నేషనల్ కౌన్సిల్) భావి జెకోస్లోవేకియా ప్రభుత్వం తరపున వ్యవహరించ వచ్చుననే విషయాన్ని తాము అంగీకరిస్తున్నామని 1918 ఆగష్టు 9వ తేదీనాడు బ్రిటీష్ ప్రభుత్వం ఒక ప్రకటన చేసింది. తర్వాత ఇదే మాదిరి ప్రకటనలను ఫ్రెంచి, అమెరికన్, ఇటాలియన్ ప్రభుత్వాలు కూడా చేశాయి. ఆ తర్వాత 1918 అక్టోబరు 14వ తేదీనాడు "జాతీయ సంఘం" తానే జెకొస్లోవేకియాకు తాత్కాలిక ప్రభుత్వం అయినట్టు ప్రకటించుకుంది. పైన చెప్పిన ప్రభుత్వాలు ఈ మార్పును ఆమోదించాయి. అటు తర్వాత అక్టోబరు 28వ తేదీనాడు ప్రాగ్ లోని జెక్, స్లోవక్ రాజకీయవేత్తలు ఆస్ట్రియన్ ప్రభుత్వోద్యోగుల దగ్గర నుంచి రాజ్యాధికారాన్ని వప్పగించుకున్నారు. పిమ్మట నవంబరు 14వ తేదీనాడు ప్రాగ్ లోని "నేషనల్ అసెంబ్లీ" ఒకటి సమావేశమై, జెకొస్లోవేకియా ప్రజాస్వామ్య రాజ్యస్థాపనను ప్రకటించింది. ఎక్కడో దూరాన అమెరికాలో ఉన్న మాజరిక్ జెకొస్లోవేకియా రాజ్యసంస్థాపన శుభవార్తను విన్నప్పుడు ఎంత పొంగిపోయాడో గదా!

తన కల నిజమై - తన కోర్కెలు ఈడేరి - తన కష్టాలు ఫలించి - తన త్యాగం రాణకెక్కి - జెకొస్లోవేకియా రాజ్యం ఏర్పడగానే తానిక రాజకీయాల నుంచి విరమించి, తిరిగి ఏ యూనివర్సిటీలోనో ప్రొఫెసర్‌గా చేరాలనీ, వేదాంత గ్రంథ పఠన వ్యాసంగంతో శాంతంగా జీవితాన్ని గడుపుకోవాలనీ మాజరిక్ ఆశించాడు. కాని, ఆయన తమకు చేసిన అపార సేవను గుర్తించి, అందుకు తమ ప్రేమనూ, కృతజ్ఞతనూ తెలపడం కోసం జెకొస్లోవేకియా ప్రజలు ఆయన్ని తమ దేశాధ్యక్షునిగా ఎన్నుకున్నారు.

ప్రజల కోర్కెను తిరస్కరించలేక - వారికి ఆశాభంగాన్ని కలిగించలేక - మాజరిక్ ఈ అధ్యక్ష పదవిని అంగీకరించాడు. ఆయన అమెరికా నుంచి తిరిగి వచ్చిననాడు ఆబాల గోపాలమూ ఆయనకు బ్రహ్మరథం పట్టింది.

జెకొస్లోవేకియా రాజ్యాంగ విధానం ప్రకారం అధ్యక్ష పదవికి ఒక్కసారి ఎన్నుకోబడిన వాడు ఏడు సంవత్సరాల పాటు మాత్రం ఆ పదవిలో ఉంటాడు. అధ్యక్ష పదవిని గురించిన ఇంకో నిబంధన ఏమంటే - ఏ వ్యక్తి కూడా రెండుసార్ల కంటే ఆ పదవిని అలంకరించడానికి వీలులేదు.

ఈ రెండు నియమాలను కూడా జెకోస్లోవేకియా ప్రజలు తమ ప్రథమాధ్యక్షుని సందర్భంలో త్రోసిపుచ్చారు. మాజరిక్ ను ఒక్క ఏడు సంవత్సరాలకు మాత్రమే కాకుండా, జీవితాంతం వరకు వారు తమ అధ్యక్షునిగా ఎన్నుకున్నారు!

ఇరవై అయిదు సంవత్సరాలకు పైగా జెకొస్లోవేకియాను పాలించి, దాన్ని తన అపూర్వ శక్తి సామర్థ్యాల వల్ల సర్వతోముఖంగా అభివృద్ధికి తీసుకువచ్చి చివరకు 1935 డిసెంబరు 14వ తేదీనాడు మాజరిక్ తన అధ్యక్ష పదవికి రాజీనామా ఇచ్చాడు. ఆయన రాజీనామా ఇచ్చిననాడు ఒక్క జెకొస్లోవేకియా ప్రజలే కాకుండా, సమస్త ప్రపంచం కూడా ఆయన మహత్తర జీవితాన్నీ, ఆయన చేసిన అఖండ సేవనీ వేనోళ్ళ ప్రస్తుతించింది! జెకొస్లోవేకియా ప్రజలు తమ జాతీయ నేతకు తమ భాగ్య విధాతకు తమ భక్తిశ్రద్ధల్ని తెలపడానికి ఆనాడు వర్ణనాతీతమైన మహోత్సవాన్ని జరిపారు. మాజరిక్ నివసించడానికి ఒక మహారాజప్రాసాదాన్ని ప్రత్యేకించ వలసిందనీ, ఆయన జీవితాంతం వరకూ సంవత్సరానికి లక్ష క్రౌనుల (షుమారు పదివేల రూపాయల) పెన్షన్ ఇవ్వవలసిందనీ జెకొస్లోవేకియా పార్లమెంటువారు తీర్మానించారు.

షుమారు రెండు సంవత్సరాలపాటు రాజ్యకార్య భారవిముక్తుడై విశ్రాంతి పుచ్చుకున్న తర్వాత, 1931 సెప్టెంబరు 14వ తేదీనాడు జరాభారం వల్ల మాజరిక్ పరమపదించాడు. పరమపదించే నాటికి ఆయన వయస్సు 87 సంవత్సరాలు. అధ్యక్ష పదవి నుండి విరమించినప్పుడు ప్రపంచ వార్తాపత్రికలు ఆయన్ని ఉగ్గడిస్తూ ఈ విశేషణాలను ఉపయోగించాయి: స్వాతంత్ర్య పిపాసి - శాంతిప్రియుడు - రాజకీయవేత్త - ప్రజారంజక పరిపాలకుడు - వేదాంత శాస్త్ర పారంగతుడు - ఆధునిక యుగానికి ప్లేటో - త్యాగధనుడు - మానవోత్తముడు - ఇంకా ఇలాగా మరెన్నిటినో కూడా! ఈ విశేషణాలలో ఏ ఒక్కటీ కూడా మాజరిక్ విషయంలో అతిశయోక్తి కాదు. నిజంగా మాజరిక్ లాంటి మహామహులు శతాబ్దానికి ఏ పదిమంది కంటెనో ఎక్కువగా జన్మించరు!

4

మాజరిక్ వలె బెనిస్ కూడా పేదకుటుంబంలో జన్మించాడు. బెనిస్ తండ్రి చిన్న రైతు, బొహిమియాలో నికోజ్ బానీ ఆయన గ్రామం. ఆయనకు మొత్తం ఎనిమిది మంది కొడుకులు. వారిలో బెనిస్ కట్టకడపటివాడు.

బెనిస్ జననం 1884లో అన్నదమ్ములందరిలోను అతడే చురుకైనవాడు. తల్లిదండ్రులు విద్యాభ్యాసం కోసం ప్రాగ్ లోని "గ్రామర్ స్కూల్"లో అతడిని చేర్పించారు. ఇక్కడ అతడు చదువు సంధ్యలపై కంటె ఫుట్ బాల్ ఆట పై అధికశ్రద్ధను కనబరిచాడు. దానిలోనే అధికంగా రాణించాడు కూడా. అయితే ఒకనాడు తుంటి విరగడంవల్ల ఆటలపై మోజు పోయి, చదువు పైకి బుద్ధిమరలింది. అప్పటి నుంచి ప్రతి సబ్జెక్ట్ లోనూ ఫస్టు మార్కులూ, ఫస్టు ప్రయిజులూ అతడివే!

"గ్రామర్ స్కూల్"లో చదువు పూర్తి అయిన తర్వాత బెనిస్ యూనివర్సిటీలో చేరాడు. ఇక్కడ అతడు సోషలిస్టుగా పరివర్తనం చెందాడు. ఈ సమయంలోనే అతడొకనాడు ప్రొఫెసర్ మాజరిక్ సిద్ధాంతాలకు జీవంగా ఉండే మతవిశ్వాసాలపట్ల తన నిరసన భావాన్ని ప్రకటించడానికిగాను ఆయన క్లాసులో నుంచి లేచివెళ్లాడు.

తన ఇవరయ్యో ఏట బెనిస్ ప్యారిస్ నగరం వెళ్లి, అక్కడి సార్ బాన్ కళాశాలలో చేరాడు. సోషలిస్టు పత్రికలకు, జెక్ పత్రికలకు భౌతిక వాదాన్ని గురించి వ్యాసాల్ని వ్రాసి, అందుమూలంగా వచ్చిన పైకంలో అతడు కాలేజీ జీతాన్ని కట్టుకుంటూ ఉండేవాడు. ఇలా ప్యారిస్ లో కొలంగడుపుతున్న రోజులలో బెనిస్ అంటే అతడి సోషలిస్టు స్నేహితులకు అంత విశ్వాసం ఉండేదికాదు. "ప్రతి విషయాన్ని గురించీ స్తనశల్య పరీక్షచేస్తాడు; ఇతడిలో విప్లవాగ్నిలేదు" అని వారు బెనిసను గురించి అనుకొంటూ ఉండేవారు.

నాలుగు సంవత్సరాలు ఫ్రాన్సు, ఇంగ్లండు దేశాలలో గడిపి, తన ఇరవై నాలుగో ఏట బెనిస్ తిరిగి ప్రాగ్ చేరుకున్నాడు. చేరుకుని, తత్వశాస్త్రంలోను, న్యాయశాస్త్రంలోను, రాజనీతి శాస్త్రంలోను ప్రత్యేక కృషిచేశాడు. తర్వాత 1908లో పిహెచ్.డి. పట్టాన్ని (డాక్టరేట్ ను) పొందాడు. ఈ పట్టం కోసం ఆయన "ఆస్ట్రియా సమస్య : జెకొస్లోవేకియా ప్రశ్న" అనే శీర్షికకింద పరిశోధనతో కూడిన ఒక ప్రత్యేక వ్యాసాన్ని (thesis) వ్రాశాడు. ఇదే పట్టాన్ని పొందడానికి మాజరిక్ వ్రాసిన ప్రత్యేక వ్యాసం "ఆత్మహత్య"ను గురించి. దీన్ని బట్టే ఈ ఇద్దరి ప్రవృత్తులలో గల భేదం స్పష్టపడుతూంది. మాజరిక్ తత్వవేత్త, బెనిస్ రాజనీతి చతురుడు. మాజరిక్ లో భావోద్వేగము హెచ్చు; బెనిలో కార్యకుశలత హెచ్చు. మాజరిక్ చూపు చుక్కలవైపు; బెనిస్ దృష్టి ప్రాపంచిక విషయాలమీద. డాక్టరేట్ పట్టాన్ని పొందిన తర్వాత బెనిస్ ప్రాగ్ లోనే 'కమర్షి యల్ ఎకాడమీ'లో ప్రొఫెసర్గా చేరాడు. ఈ సరికి అతడు తన సోషలిస్టు భావాల్ని మార్చుకుని, మాజరిక్ నాయకత్వాన్ని అంగీకరించి, జెక్ జాతీయోద్యమంలో పూర్తిగా పాల్గొన సాగాడుకూడా.

1915లో - అంటే జర్మనీ యుద్ధం ప్రారంభమైన తర్వాత "నాకు నీ సహాయం కావాలి! తప్పక బయల్దేరి రావలసింది" అని జెనీవాలో ఉన్న మాజరిక్ దగ్గర నుంచి బెనిస్ కు పిలుపు వచ్చింది. నాయకుని దగ్గరి నుంచి పిలుపు రావడమే తడవు - వెనక ముందులు చూడకుండా బెనిస్ ప్రయాణం కట్టాడు. సరిహద్దు దాటడానికి అతనికి ప్యాస్పదులేదు. కాని, అతడు సంకోచించలేదు. మారు పేరుతో ఒక ప్యాస్పోర్ట్ ను సృష్టించి, రాత్రివేళ జర్మన్ సరిహద్దును దాటి, స్విట్జర్లాండుకు వెళ్లే రైలును అందుకున్నాడు! మారు పేర్లను పెట్టుకోవడంగాని, ప్యాస్పోర్ట్స్ సృష్టించడంగాని ఆ తర్వాత బెనిస్ కు నిత్యకృత్యమై పోయింది. జర్మనీ యుద్ధం సాగిన నాలుగు సంవత్సరాలలో అతడు పెట్టుకున్న పేర్లలో మచ్చుకు కొన్ని ఇవి : స్వోల్బీ, బెలిస్కీ బెర్గర్, నొవాట్ నీ, కోనిగ్, సిచా, లెబ్లాంక్. ఈ సమయంలో ఒకనాడు అతడిని ఫోర్జరీ ప్యాస్పోర్ట్ తో ప్రయాణం చేస్తున్నందుకు ఇంగ్లండులో అరెస్టు చేశారు. తర్వాత ఆరు నెలలైనా తిరగకముందే అతడు జెక్ విదేశాంగమంత్రి హోదాతో అందరికీ ప్యాస్పోర్ట్స్ ఇవ్వడం జరిగింది!

చివరికి మామూలు ఆస్ట్రో - హంగరియన్ సామ్రాజ్య విచ్ఛిన్నం, జెకొస్లోవేకియా స్వతంత్ర రాజ్య సంస్థాపన; ఈ రెండు విషయాల ఆవశ్యకతను ప్రచారం చెయ్యడంలో బెనిస్ తన నాయకుడైన మాజరికకు ఎంతైనా తోడ్పడ్డాడు. ప్రచారం కోసం మాజరిక్ వివిధ దేశాల పర్యటనం చేస్తూ ఉంటే, బెనిస్ ప్యారిస్లో "జెక్ జాతీయసంఘం" కార్యాలయంలో కూర్చుని,

పత్రికలకు వ్యాసాలు, సైనికులకు సందేశాలు, ప్రభుత్వాలకు విజ్ఞప్తులు తయారుచేస్తూ ఉండేవాడు. సంభాషణల్లో కూడా ఒక్క విషయంలో నుంచి ఇంకొక దానిలోకి గెంతకుండా, దేన్ని గురించి సంభాషణ ప్రారంభమైందో దాన్ని గురించే, "పాయింటు" వారీగా మాట్లాడడం అతడికి అలవాటు. ఇట్టివాడు కలాన్ని పుచ్చుకున్నప్పుడు ఎంత క్లిష్ట విషయాల్ని అయినాసరే తబ్బిబ్బులు లేకుండా సులభంగాను, సరళంగాను, సుబోధంగాను విశదపరచడం అబ్బురమా? అనతికాలంలోనే బెనిస్ తోడ్పాటులేనిదే తనకు క్షణమైనా గడవదని గ్రహించగలిగాడు, మాజరిక్. "జెక్ జాతీయసంఘా"నికి మాజరిక్ కార్యదర్శిగా పనిచేస్తూ ఉండేవాడు. ఈ సంస్థ 1918లో జెకొస్లోవేకియాకు తాత్కాలిక ప్రభుత్వంగా మారినప్పుడు అతడు ఆ ప్రభుత్వంలో విదేశాంగ మంత్రి అయ్యాడు. ఈ హోదాలోనే అతడు వర్సయిల్స్ సమావేశంలో పాల్గొన్నాడు; నానాజాతి సమితి సంస్థాపనలో తోడ్పడ్డాడు. ఇంతేకాదు, నాటి నుంచి 1935 డిశంబర్ వరకు , మాజరిక్ అధ్యక్ష పదవి నుంచి విరమించినంత వరకు - ఆ హోదాలోనే అవిచ్ఛిన్నంగా ఉండి, యూరప్ లోని విదేశాంగ మంత్రులందరిలోను సూక్ష్మ బుద్ధిగలవాడనీ, సమర్థుడనీ, సచ్చరిత్రుడనీ ప్రతిష్ఠకెక్కాడు.''

మాజరిక్ పదవీ పరిత్యాగాన్ని చేసినప్పుడు జెక్ ప్రజలు బెనిసను అధ్యక్షుడ్డిగా ఎన్నుకున్నారు. తర్వాత - అన్నట్టు తర్వాత కథ చెప్పడానికి ఇది సమయంకాదు.

5

మాజరిక్, బెనిస్ : ఈ మహామహులిద్దరి కృషి ఫలితంగా ఏర్పడ్డ జెకొస్లోవేకియా రాజ్య విస్తీర్ణం 54 వేల చదరపు మైళ్ళు. అంటే, ఇది దాదాపు ఇంగ్లండ్ అంతటి రాజ్యం. దీని నిడివి హెచ్చు, వెడల్పు తక్కువ. తూర్పు నుంచి పడమరకు ఇది 600 మైళ్లు ఉంటుంది. ఇక ఉత్తరం నుంచి దక్షిణానికి 175 మైళ్లను మించిలేదు. ఈ 170 మైళ్ళ వెడల్పు కూడా కొన్ని చోట్ల మాత్రమే. ఒక్కొక చోట దీనికి వెడల్పు కేవలం 30 మైళ్లు. పొడుగు వెడల్పులలో ఉన్న ఈ పెద్ద వ్యత్యాసం వల్ల జెకోస్లోవేకియా పొడుగుపాటి తోక ఉన్నట్టి గాలి పడగ మాదిరిగా కనబడుతుంది.

జెకొస్లోవేకియా జనాభా 1 కోటి 50 లక్షలు. ఈ జనాభాలో 50 లక్షలు - మూడవవంతు - జెక్, స్లోవక్ జాతులలో దేనికీ చెందింది కాదు. మొత్తం ప్రజలలో 96,88,943 మంది (నూటికి 66. 92 వంతులు) జెక్, స్లోవక్ జాతులవారు; 32,31,000 మంది (నూటికి 22.3 వంతులు) జర్మన్ జాతివారు; 6,92,000 మంది (నూటికి 4.78 వంతులు) మారియర్లు; 5,49,00 మంది (నూటికి 3.79 వంతులు) రుధేనియన్లు; 82,000 మంది (నూటికి 0.56 వంతులు) పోలిష్ వారు. పోగా 1,86,000 మంది (నూటికి 1.29 వంతులు) యూదు జాతివారు.

జెకోస్లోవేకియాలో వ్యవసాయం, పరిశ్రమలు ఒకదానితో ఒకటి తులతూగుతూ ఉన్నాయి. దాని జనాభాలో నూటికి 40 వంతులకు పొలాలు, అడవులు జీవనాధారం; నూటికి 34 వంతులకు పరిశ్రమలు, వర్తక వ్యాపారాలు భుక్తికి మార్గాలు. దేశానికి తూర్పు దిక్కున వ్యవసాయం హెచ్చు; పడమటి దిక్కున పరిశ్రమలు హెచ్చు.

గతించిన ఆస్ట్రో-హంగరియన్ సామ్రాజ్యపు పరిశ్రమలలో నూటికి 60 వంతులు జెకొస్లోవేకియాకు దక్కినవి. ఒక్కొక్క పరిశ్రమను గురించి విడివిడిగా చెప్పాలంటే - పంచదార పరిశ్రమ నూటికి 90 వంతులు, లోహ పరిశ్రమ నూటికి 60 వంతులు, పింగాణీ పరిశ్రమ నూటికి నూరు వంతులు, గాజు పరిశ్రమ నూటికి 92 వంతులు, వస్త్ర పరిశ్రమ నూటికి 75 వంతులు, చర్మ పరిశ్రమ నూటికి 70 వంతులు, కాగితపు పరిశ్రమ నూటికి 65 వంతులు, జెకొస్లోవేకియా పరమైనాయి.

జెకొస్లోవేకియాకు తగినంత ఖనిజసంపత్తి కూడా ఉంది. బొగ్గు కావలసిన దానికంటే అధికంగా ఉంది. ఇక ఇనుము చాలా భాగం లభిస్తుంది. కొదవ భాగం స్వీడన్, హంగరీ, స్పెయిన్ దేశాల నుంచి దిగుమతి అవుతూ ఉంటుంది. పరిశ్రమలకు కావలసిన ఇతర వస్తుసముదాయంలో కలప, గ్రాఫయిట్, మెగ్నీషియం విశేషంగా లభిస్తవి.

పోతే వాణిజ్యం సంగతి : జెకోస్లోవేకియా వాణిజ్యంలో అధిక భాగం విదేశాలతోనే దేశ పరిశ్రమల ద్వారా అయ్యే ఉత్పత్తి చాల వరకు కేవలం ఎగుమతి కోసం. తాను తయారుచేసిన వస్తువుల్ని.

విదేశాలకు ఎగుమతిచెయ్యడమే కాకుండా, పశ్చిమ యూరప్లోని పారిశ్రామిక దేశాల నుంచి వివిధవస్తు సముదాయాన్ని తెప్పించి, దాన్ని ఇంతో అంతో లాభానికి తూర్పు యూరప్ లోని చిన్న చిన్న దేశాలకు ఎగుమతి చేస్తూ ఉంటుంది కూడా. ఈ విధంగా జెకొస్లోవేకియా యూరప్ తూర్పు పడమరల మధ్య "కమీషన్ ఏజెంటు"గా పనిచేస్తూ ఉంటుంది.

జెకొస్లోవేకియా ఎగుమతులలో ముఖ్యమైనవి ఇవి : ఇనుము, ఉక్కు వీటితో తయారుచేసిన వస్తువులు, దూది, నూలు, బట్టలు, గాజు, గాజుసామాను, చర్మం, చర్మంతో చేసిన వస్తువులు, బొగ్గు, కలప, పట్టు, పట్టుబట్టలు, పప్పుదినుసులు; కూరలు, పళ్ళు, యంత్రాలు, కాగితం, కాగితపు వస్తువులు, జాడీలు, పంచదార.

ఇక, జెకోస్లోవేకియా దిగుమతులలో ముఖ్యమైనవి ఇవి : దూది; ఉన్ని; కూరలు, పళ్లు; ఇనుము, ఇతర లోహాలు, పట్టు, యంత్రాలు, వాటి భాగాలు; పశువులు; నార; కిరోసిన్, పెట్రోల్; రంగులు; మందులు.

వాటి ప్రాధాన్యతను బట్టి వరసగా చెప్పాలంటే, జెకోస్లోవేకియాకు ఎగుమతుల్ని చేస్తున్న దేశాలు ఇవి : జర్మనీ, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, ఫ్రాన్సు, గ్రేట్ బ్రిటన్, రుమేనియా, ఆస్ట్రియా, యుగోస్లోవియా, హాలెండ్, స్విట్జర్లాండ్, ఇండియా. వ్యావసాయికంగాను, పారిశ్రామికంగాను, వర్తక వ్యాపారాల విషయంలోను జెకొస్లోవేకియాకు లభించిన ఈ సౌకర్యాలవల్ల అది శాంతి, సౌఖ్యాలను అనుభవించి, అచిరకాలంలోనే సుస్థిరత్వాన్ని పొంద గలిగింది. అయితే దాని క్షేమానికి రెండు విషయాలు చీడపురుగులైనాయి. వీటిలో మొదటిది : దాని సరిహద్దులకు సంబంధించిన లోపాలు; రెండవది - దాని ప్రజలలో ఉన్న అన్య జాతీయులు.

6

ప్రకృతి సిద్ధమైన సరిహద్దులు ఉంటే, దేశరక్షణ సులభం. జెకొస్లోవేకియా ఈ భాగ్యానికి నోచుకోలేదు.

ఇరుగుపొరుగు రాజ్యాలు స్నేహ పాత్రమైనవైతే, సరిహద్దులకు సంబంధించిన ఈ లోపం ఏమంత శోచనీయమైన విషయం కాదు. కాని, జెకొస్లోవేకియా ఇరుగు పొరుగు రాజ్యాలు దాదాపుగా అన్నీ కూడా దాని మీద ఏదో ఒక కోపకారణం ఉన్నట్టివే!
ఆస్ట్రియా, హంగరీ, రుమేనియా, పోలెండ్, జర్మనీ ఈ ఐదు రాజ్యాలు జెకొస్లోవేకియా సరిహద్దులోనివి. ఈ అయిదింటిలోను ఒక్క రుమేనియాను మినహాయిస్తే, తక్కిన నాలుగింటికి జెక్ రాజ్యం మీద కన్నెర్ర అనే చెప్పవచ్చును.

పూర్వపు రోజులలో బొహీమియా, మొరావియా, సైలెసియా రాష్ట్రాలు ఆస్ట్రియా అధీనంలో ఉండేవి; స్లోవేకియా, రుథేనియా రాష్ట్రాలు హంగరీ పరిపాలనలో ఉండేవి. తమకు సామంతంగా. ఉన్నట్టి ఈ ఐదు రాష్ట్రాలు స్వాతంత్ర్యాన్ని

పొంది, జెకొస్లోవేకియా అంటూ సుభిక్షమైన ఒక దానికి చెందిన కొత్త రాజ్యంగా ఏర్పాటుకావడం ఆస్ట్రియా, హంగరీలకు సహజంగానే కోపకారణమైంది. ఆస్ట్రియా, హంగరీలలో హంగరీకి ఇంకొక కడుపు మంటకూడా ఉంది. ప్రజలు - మాగియార్లు - 6, 92,000 మంది జెకొస్లోవేకియా పరిపాలన కిందికి వెళ్లారు. ఈ సంగతి తలపుకు వస్తే చాలు, హంగరీకి తన పూర్వపు ఔన్నత్యం, ప్రస్తుతపు శిధిల స్థితి కళ్లకు కట్టినట్టు కనబడి, బాధపడేది. ఇదే బాధ పోలెండ్, జర్మనీ దేశాలకు కూడా ఉంది. పోలిష్ వారు 82,000 మంది, జర్మన్ జాతివారు 32,31,000 మంది జెకొస్లోవేకియా సరిహద్దులలో ఉన్నారు. అంచేత ఈ రెండు రాజ్యాలకు కూడా - హంగరీకి ఉన్నట్టుగానే - ఎపుడు అవకాశం దొరుకుతుందా, ఎప్పుడు జెకొస్లోవేకియాను విచ్ఛేదం చేద్దామా అని దురాలోచనలే!

ఈ దురాలోచనలకు బలికాకుండా తప్పించుకోడానికిగాను జెకొస్లోవేకియా - డాక్టర్ బెనిస్ నాయకత్వం క్రింద - ప్రతిభావంతమైన విదేశాంగనీతిని అవలంబించింది. దాదాపు ఇరవై సంవత్సరాలపాటు ఈ విదేశాంగనీతియే జెకొస్లోవేకియాను కాపాడింది. కాని ఫ్రాన్సు బ్రిటన్ రాజ్యాల ద్రోహం వల్ల చివరికి - ఈ విషయాన్ని గురించిన ప్రస్తావన ముమ్ముందు.

7

జెకోస్లోవేకియా యూరప్ నడిబొడ్డులో ఉన్నది. కేవలం దాని ఉనికి యూరప్ ఖండం నడిబొడ్డు దగ్గర కావడమే కాకుండా యూరపియన్ రాజకీయాలకు కూడా అది చాల వరకు నడిబొడ్డు వంటిది. జెకోస్లోవేకియాకు ఇంత ప్రాధాన్యం ఉండడానికి అనేక కారణాలున్నాయి. వాటిలో కొన్ని ఇవి. అది మూడు శక్తివంతమైన రాజ్యాలకు - జర్మనీ, ఇటలీ, రష్యా- సమీపంలో ఉన్నది. విభిన్నమైనట్టి యూరపియన్ సభ్యతాత్రయం - జర్మన్, స్లావ్, లాటిన్ - దాని పరిసరాలలో సంఘర్షిస్తున్నవి. వ్యాప్తిని కాంక్షిస్తున్న చతుర్థవిధ పరిపాలనా విధానాలు - జర్మన్, ఫ్రెంచి, ఇటాలియన్, రష్యన్ - దానివైపుకు కేంద్రీకృతమౌతున్నవి. ఇక యూరపియన్ రాజకీయరంగంలో జెకొస్లోవేకియాకు విశేషమైన పలుకుబడి ఉండడం అబ్బురమా?

జర్మనీ, యూరప్ తూర్పుదిశకు గాని, ఆగ్నేయానికి గాని విస్తరించాలంటే జెకొస్లోవేకియాపై ఆధిపత్యం అత్యవసరం. “బొహిమియాకు (ఇది జెకొస్లోవేకియాలో ఒక రాష్ట్రం) ఎవడు అధిపతి అవుతాడో వాడే యూరప్ అంతటికీ అధిపతి” అని జర్మన్ రాజ్య నిర్మాత అయినట్టి బిస్మార్క్ ఏనాడో చెప్పాడు. “యూరప్ అంతటి మీద ఆధిపత్యం” అని అనడంలో కొంత అతిశయోక్తి ఉన్నదేమోగాని, బొహిమియాను వశపరచుకోగల రాజ్యం తూర్పు యూరప్ మీద అతి సులభంగా ఆక్రమణ జరుపగలదనే విషయం మాత్రం తథ్యం.

జెకొస్లోవేకియాను చేజిక్కించుకొన్ననాడు జర్మనీ ఎటుకావాలంటే అటు జైత్రయాత్ర సాగించగలదు, దక్షిణంగా అది ఇటలీ పైకి దండెత్త వచ్చును; ఉత్తరంగా పోలెండ్ పైకి పోవచ్చును; తూర్పుగా బాల్కన్ రాజ్యాల పైకీ, రష్యా దక్షిణ భాగం పైకి దూకవచ్చును. జెకొస్లోవేకియా తూర్పు వైపు సరిహద్దుకూ, సోవియట్ రష్యాకూ మధ్య దూరం నూరు మైళ్ళు అయినా లేదు. ఈ మధ్య భాగంలో పోలిష్, రుమేనియన్ రాజ్యాలున్నవి. రష్యాను చేరాలంటే, ఈ రెండు రాజ్యాలను అతిక్రమించి వెళ్ళవలసిందే. అయితే, జెకొస్లోవేకియా జర్మన్ సామంత రాజ్య మైననాడు పోలెండ్, రుమేనియాలు జర్మనీ కోర్కెల్ని ధిక్కరించడం కల్ల.

ఈ జైత్ర యాత్ర యోచనలో రుమేనియాకు చాలా ప్రాముఖ్యత ఉంది. జెకొస్లోవేకియా ఆగ్నేయ దిశ సరిహద్దుకు 150 మైళ్ళ దూరంలో రుమేనియన్ పెట్రోల్ నూతు లున్నవి. యూరప్ ఖండంలో ఇవే పెద్ద నూతులు. పూర్వకాలపు ఆశ్విక దళాలకు కసవు ఎంత ముఖ్యమో, ఈ కాలపు శతఘ్ని దళాలకు పెట్రోల్ అంత ముఖ్యం. పూర్వం ఏషియా నుంచి తుపాను కెరటాలలా పశ్చిమంగా దండెత్తి వచ్చిన సైన్యాలు ముందుగా హంగరీని జయించాలని ప్రయత్నించేవి. ఇందుకు కారణం, - అక్కడ పంట సమృద్ధిగా ఉండడమే. అదేవిధంగా ఇప్పుడు యూరప్ నుంచి తూర్పుగా దండెత్తి వెళ్ళదలుచు కున్నవారు ముందుగా రుమేనియన్ పెట్రోలు గనుల్ని స్వాధీనపరచుకోవాలి. జెకోస్లోవేకియాను చేజిక్కించుకున్ననాడు ఈ పని అంత కష్టమైనది కాదు.

ఏ విధంగా చూసినా జెకొస్లోవేకియాకు ఇంత ప్రాధాన్యం ఉండబట్టే, హిట్లర్ దృష్టి దీని పైన పడింది. 'నాకు కావలసింది జెకొస్లోవేకియాలోని జర్మన్ ప్రాంతాలు మాత్రమే! అవి కలిసిననాడు జెకొస్లోవేకియా ఏగంగ కలిసినా నాకు పట్టదు" అని అతడు ఈ మధ్య అన్నట్టి మాటలు కేవలం నిజోద్దేశాన్ని మరుగు పరచడం కోసం!

తన ప్రపంచ దిగ్విజయ కాంక్షను తీర్చుకోవాలంటే జెకోస్లోవేకియాను విచ్ఛేదనం చెయ్యడం జర్మనీకి ఎంత అవసరమో, తమ క్షేమం కోసం దాన్ని కాపాడ్డం ఫ్రాన్సు, రష్యాలకు అంత అవసరం.

జర్మనీ, ఫ్రాన్సు - జెకొస్లోవేకియాలకు మధ్య ఉన్నది. అంచేత జర్మనీ ఫ్రాన్సు మీద దండెత్తి వెళ్ళితే, వెనకవైపు నుంచి జెకొస్లోవేకియా దాన్ని చీకాకు పరచవచ్చును. కాక, అది జెకొస్లోవేకియా పైన దూకితే, వెన్నుపోటున ఫ్రాన్సు దెబ్బతియ్యవచ్చును. ఇది అటు జెకొస్లోవేకియాకు, ఇటు ఫ్రాన్సుకు : రెండింటికీ అనుకూలమైన పరిస్థితి. ఇక జెకొస్లోవేకియా శిథిలమైపోయిన పక్షంలో వెనక పోటు ఉంటుందనే భయం లేకుండా జర్మనీ నిశ్చింతగా ఫ్రాన్సు పైన యుద్ధాన్ని ప్రకటించ వచ్చును. ఇంతేకాదు జెకొస్లోవేకియా పతనమైతే, యూరప్ ఆగ్నేయ దిశలోని సంపత్తి జర్మనీకి అందుబాటులో ఉంటుంది. అపుడు జర్మనీ సైనిక శక్తిని ఫ్రాన్సు ప్రతిఘటించలేదు.

ఫ్రాన్సు జెకొస్లోవేకియా క్షేమాన్ని కోరడానికి మరొక కారణము కూడా ఉంది. యూరపియన్ వ్యవహారాలలో ఫ్రాన్సు మాట చెల్లుబడి కావాలంటే, మధ్య యూరప్లోను, తూర్పు యూరప్ లోను దానికి పలుకుబడి ఉండాలి. ఈ పలుకుబడి ఏ మాత్రం తగ్గినా, జర్మనీకి పట్టపగ్గా లుండవు. మరి ఈ పలుకుబడిని కాపాడుకోవాలంటే, ముఖ్యంగా జెకొస్లోవేకియాను కంటికి రెప్పమాదిరిగా రక్షిస్తూ ఉండాలి.

ఇక, రష్యా సంగతి; జర్మనీ విజృంభణను అరికట్టడానికి జెకొస్లోవేకియా చెలియలి కట్టవంటిది. ఈ కట్ట తెగిననాడు సోవియట్ యూకెయిన్ మీద విరుచుకు పడ్డానికి జర్మనీకి వీలు ఏర్పడ్డట్టే!

తన పట్ల వివిధ రాజ్యాలకు గల ఈ విభిన్న వైఖరులను గమనించిన మీదట తనకు అధిక క్షేమదాయకంగా తోచిన విదేశాంగ నీతిని జెకొస్లోవేకియా నిర్ణయించుకుంది.

8

ఒంటరిపాటుగా స్వశక్తి మీద జెకొస్లోవేకియా బ్రతకడం దుస్సాధ్యం. ఒంటిగా ఉన్ననాడు అది జర్మనీ గుప్పిటిలోకి పోయినట్టే! ఇక, తన క్షేమాన్ని అధికంగా కాంక్షించే రాజ్యం గదా అని, ఒక్క ఫ్రాన్సును అంటి పెట్టుకుని ఉంటే, దానిలోనూ కొంత చిక్కు ఉంది. అప్పుడు ఫ్రాన్సు, జర్మనీల సంబంధ బాంధవ్యాలను బట్టి జెకొస్లోవేకియా భాగ్యరేఖ మారుతూ ఉంటుంది. అంచేత, కేవలం ఏదో ఒక రాజ్యాన్ని అంటి పెట్టుకుని ఉండడం కంటే, వీలైనన్ని రాజ్యాలతో మిత్రత్వాన్ని సంపాయించుకోవడం మంచిది. ఈ ప్రయత్నంలో ఒక్క విషయాన్ని మరిచిపోరాదు. అది ఏమంటే ఏయే రాజ్యాలు 1914-18 నాటి యుద్ధం తర్వాత జరిగిన సంధులకు, ఏర్పడిన సరిహద్దులకు భిన్నం జరగగూడదనే పట్టుదలను జూపుతున్నవో, ఆయా రాజ్యాలను ముఖ్యంగా అనుకూలం చేసుకోవాలి. ఇంతేగాక, ప్రపంచ శాంతి రక్షణకు ప్రపంచంలో గల రాజ్యాలు అన్నీ కూడా సమాన బాధ్యతను వహించాలనే సిద్ధాంతాన్ని - "కలెక్టివ్ సెక్యూరిటీ" సిద్ధాంతాన్ని - ఎంత బలపరిస్తే, జెకొస్లోవేకియాకు అంత క్షేమం. ఎందువల్లనంటే, - అపుడు జెకొస్లోవేకియా రక్షణకు సకల ప్రపంచం బాధ్యత వహించవలసి ఉంటుంది. ఈ సాధక బాధకాలను అన్నింటినీ ఆలోచించుకుని, జెకొస్లోవేకియా ప్రారంభం నుంచీ కూడా నానాజాతి సమితిని బలపరచ సాగింది. సంధుల పవిత్రత, "కలెక్టివ్ సెక్యూరిటీ" ఇవి రెండూ నానాజాతి సమితికి ప్రధాన సూత్రాలు. ఈ రెండు సూత్రాలే జెకొస్లోవేకియాకు ప్రాణప్రదమైనవి కూడా, అంచేత నానాజాతి సమితి పట్ల జెకొస్లోవేకియా అత్యంత శ్రద్ధాభక్తుల్ని కనుబరిచింది.

జెకొస్లోవేకియా రక్షణకు నానాజాతి సమితి మొదటి కోట అయితే, "లిటిల్ దీన్ని "లిటిల్ ఎంటెక్స్ట్" అని కొందరు పలుకుతారు రెండవ కోట అని చెప్పవచ్చును. దాని సంస్థాపనకు జెకొస్లోవేకియా ప్రధానంగా కారణం. ఇది జెకొస్లోవేకియా, రుమేనియా, యూగోస్లావియా రాజ్యాలు పరస్పర రక్షణ కోసం ఏర్పాటు చేసుకొన్న సమితి. -
ఆస్ట్రో - హంగరియన్ సామ్రాజ్య విచ్ఛిత్తివల్ల జెకోస్లోవేకియా, రుమేనియా, యూగోవిస్లావియా రాజ్యాలు మూడూ కూడా లాభాన్ని పొందినవే! అంచేత ఈ మూడింటికీ కూడా ఆస్ట్రియా,

హంగరీలను చూస్తే - అవి అన్యాక్రాంతమైన తమ రాజ్యం తిరిగి తమ వశం కావాలని ఎక్కడ అల్లరి పెడతాయోనని భయమే! ఆస్ట్రియా మెదలకుండా ఊరుకున్నది గాని, హంగరీ ఇలాంటి అల్లరిని మొదటి నుంచీ చేసింది కూడా! హంగరీ అల్లరిని చూచే 1920లో యూగోస్లావియాతోనూ, 1921లో రుమేనియాతోను జెకొస్లోవేకియా పరస్పర రక్షణ కోసం ఒడంబడికలను చేసుకుంది. ఈ ఒడంబడికలు కేవలం ఒడంబడికలుగానే మిగిలిపోకుండా, ఈ మూడు రాజ్యాల మధ్య సన్నిహిత బాంధవ్యాన్ని పెంపొందించాయి. లిటిల్ అన్ తాకి ఒక కార్యసంఘం - స్ట్రాంగ్ కౌన్సిల్ - ఉన్నది; ఈ కార్య సంఘానికి ఒక ప్రత్యేక కార్యాలయం - పర్మనెంట్ - సెక్రటేరియట్ - ఉన్నది. ఇంతేగాక, లిటిల్ అతా. రాజ్యాలకు సంబంధించిన ఆర్థిక వ్యవహారాలను చక్కబెట్టడానికి ఒక ఆర్థిక సంఘం - ఎకనమిక్ కౌన్సిల్ - ఏర్పాటయింది. పై అన్నింటి కంటే ముఖ్యమైన విషయం ఏమంటే - విపత్సమయంలో ఈ మూడు రాజ్యాల సైనిక శాఖలవారు సమష్టి రక్షణ కోసం సమాలోచనలు జరపడానికీ, సన్నాహాలను చెయ్యడానికీ ఏర్పాట్లు అయినవి.

లిటిల్ అ తాన్ తేని భగ్నపరచాలని అనేక ప్రయత్నాలు జరిగాయి. జర్మనీ, ఇటలీ రాజ్యాలు - పోలెండు తోడ్పాటుతో ఈ ప్రయత్నాలను చేశాయి. కాని, వీటి ప్రయత్నాలు అంతగా సఫలం కాలేదు. జర్మనీ - జెకొస్లోవేకియాల మధ్య వైమనస్యం హెచ్చుగా ఉన్న సమయంలో, యూగోస్లావియా జర్మనీతో ఆర్థికంగా ఒక ఒడంబడికను చేసుకొన్నమాట నిజం. ఇదే విధంగా ఇటలీ - జెకోస్లోవేకియాల మధ్య కక్ష పెరిగివున్నప్పుడు - 1937 ప్రారంభంలో - అది ఇటలీతో వాణిజ్య సంబంధమైన సంధిని చేసుకున్న మాట కూడా వాస్తవం. ఇక, రుమేనియా కూడా కొంతకాలం పాటు జర్మనీతో నేస్తాన్ని

నెరపినదన్న విషయాన్ని కాదనలేము. అయినప్పటికీ, లిటిల్ అతాన్ కి భంగం రాలేదు. ఇందుకు కారణం జెకొస్లోవేకియా, రుమేనియా, యూగోస్లావియా రాజ్యాలకు అనేక విషయాలలో సహజమైన ఐక్యత ఉండడమే!

ఇక, జెకొస్లోవేకియా ఆత్మరక్షణ కోసం కట్టుకున్న మూడవ కోట ఫ్రాన్సుతో ఒడంబడిక. జెకొస్లోవేకియా విచ్ఛేదం ఫ్రాన్సుకు దెబ్బ: ఫ్రాన్సు పరాజయం జెకొస్లోవేకియాకు దెబ్బ. అంచేత, అసలు ఒడంబడికతో నిమిత్తం లేకుండానే ఈ రెండు రాజ్యాల మధ్య మైత్రి ఉండడం సహజం. 1924 జనవరిలో ఈ రెండు రాజ్యాలు పరస్పర మైత్రిని ఉద్ఘాటిస్తూ ఒక సంధిని చేసుకున్నాయి. ఆ తర్వాత 1925 అక్టోబరులో లొకార్నో ఒడంబడికలకు అనుబంధముగా పరస్పర సైనిక సమాయాన్ని వాగ్దానం చేసుకుంటూ ఇంకొక ఒడంబడికను జరుపుకున్నాయి. ఈ రెండవ ఒడంబడికలో జర్మనీ తమలో దేనిమీద దండయాత్ర చేసినా, రెండవది వచ్చి ఆదుకోవాలని స్పష్టంగా ఉంది.
పోతే, జెకొస్లోవేకియా ఏర్పరుచుకున్న నాల్గవకోట : రష్యాతో ఒడంబడిక. హిట్లర్ హయాంలో జర్మనీ ఆయుధ సేకరణ కార్యక్రమాన్నీ, నిర్బంధ సైనిక శిక్షణ పద్ధతిని ప్రకటించగానే, ఆత్మరక్షణ. కోసం ఫ్రాన్సు రష్యాతో ఒక ఒడంబడికను పరస్పర సైనిక సహాయం ఒడంబడికను చేసుకొంది. ఈ ఒడంబడికపై సంతకాలు జరిగింది 1935 మే 2వ తేదీనాడు. తర్వాత పక్షం రోజులకు జెకొస్లోవేకియా కూడా ఇదే పద్ధతిని రష్యాతో ఒడంబడికకు వచ్చింది. అయితే ఈ ఒడంబడికలో ఎన్నదగిన విషయం ఏమంటే, - ఇది ఫ్రాంకో, సోవియట్, జెకోస్లోవక్ ఫ్రెంచి ఒడంబడికలకు లోబడి ఉంటుంది. దీని అర్థం - పై రెండు ఒడంబడికలూ అమలులోకి వచ్చిన తర్వాతగాని, ఇది వర్తించదన్నమాట! ఫ్రాన్సు రష్యాతో సంధి చేసుకున్నది గదా అని, మొదటి నుంచీ ఆత్మరక్షణ కోసం ఫ్రాన్సు మీద చాలవరకు ఆధారపడివున్న జెకొస్లోవేకియా తను కూడా రష్యాతో ఒడంబడికకు వచ్చినప్పటికీ, “ఇది జర్మనీపై రష్యాతో జెకొస్లోవేకియా చేస్తున్న కమ్యూనిస్టు కుట్ర” అని హిట్లర్ చిందులు తొక్కాడు! ఇంతేకాదు. రష్యను సైన్యాధిపతులు జెక్ సైన్యాలకు నాయకత్వం వహిస్తున్నారనీ, జర్మనీపై దండెత్తడానికి సన్నాహాలు జరుగుతున్నవనీ అసత్య ప్రచారం చేశాడు కూడా! ఈ ఆవేశానికి, ఈ అసత్య ప్రచారానికి కారణం ఒక్కటే! అది ఏమంటే - ఫ్రాన్సుతో పాటు రష్యా కూడా జెకొస్లోవేకియా రక్షణకు పూచీపడితే, తాను సంకల్పించిన తూర్పు యూరప్ జైత్రయాత్రకు ఎక్కడ తీవ్రబంధకం ఏర్పడుతుందో అన్నది భయం!

ఆత్మ రక్షణ కోసం జెకొస్లోవేకియా తన విదేశాంగ నీతి ద్వారా నిర్మించుకున్న ఈ నాలుగు దుర్గాలు దాన్ని దాదాపు ఇరవై సంవత్సరాలు కాపాడినాయి. చివరికి ఇవి నిష్ఫలం కావడానికి ముఖ్య కారణం ఆ దుర్గాల మధ్యనే ద్రోహులు బయల్దేరడం. ఆ ద్రోహులు ఎవరంటే, జెకొస్లోవేకియాలోని జర్మన్ జాతివారు! వారి నాయకుడు - హెర్లిన్!!

9

ఇంతకుపూర్వమే చెప్పినట్టు జెకోస్లోవేకియాలో 32,31,000 మంది జర్మన్ జాతి వారున్నారు. వీరిలో అధిక భాగం జర్మనీ, ఆస్ట్రియా సరిహద్దులలో ఎనిమిది జిల్లాలలో ఉన్నారు. వీరున్న ప్రాంతం బొహిమియా రాష్ట్రంలో ఒక భాగం. అంచేత వీరిని “బొహిమియన్ జర్మను” లని అంటారు. ఈ ప్రాంతంలో ఉన్న పర్వత పంక్తులలో ఒకదాని పేరు "సూడెటెన్ పర్వత పంక్తి” దీనినుంచి వీరిని "సూడెటెన్ జర్మను” లని కూడా అంటారు. ఈ రెండింటిలో రెండవ పేరే ఎక్కువ వాడుకలో ఉంది. సూడెటెన్ జర్మనులు జర్మన్ జాతివారేగాని, జర్మన్ దేశీయులు కారు. పూర్వమెపుడో - కొన్ని శతాబ్దాల క్రింద - వీరు నేటి జర్మనీ సరిహద్దును దాటి బొహిమియాలోకి వలస వెళ్ళారు. క్రీస్తు శకం 1520 వరకు బొహిమియా స్వతంత్ర రాజ్యంగా ఉంది. అప్పటి వరకు సూడెటెన్ జర్మనులు బొహిమియా వారైన జెక్కుల పరిపాలనలో ఉన్నారు. ఆ తర్వాత బొహిమియా హాప్ బర్గ్ రాజుల పరిపాలన కిందికి - అంటే ఆస్ట్రో - హంగరియన్ సామ్రాజ్యంలోకి - వెళ్ళింది. అప్పుడు తాము కూడా హాప్స్ బర్గు పరిపాలకుల జాతికి (జర్మన్ జాతికి) చెందినవారు కావడంచేత, సూడెటెన్

జర్మనులకు జెక్ ప్రజల మీద అధికారాన్ని చెలాయించడానికి వీలు చిక్కింది. 1520 మొదలు 1918 వరకు జెకొస్లోవేకియాలో అంతర్భాగంగా బొహిమియా పునః స్వతంత్రాన్ని పొందగలిగిన నాటి వరకు - సూడెటెన్ జర్మనులు పాలిత ప్రజలు కారు; పరిపాలకవర్గం వారు బొహిమియా ప్రజలందరు ఏకమైతే, ఆ రాష్ట్రాన్ని దాస్యంలో ఉంచడం దుస్సాధ్యమని హామ్ బర్గ్ రాజుల సూడెటెన్ జర్మనుల పట్ల విపరీతమైన పక్షపాతాన్ని చూపి, వారిని సుముఖుల్ని జేసుకుంటూ ఉండేవారు. ఇక, సూడెటెన్ జర్మనులు కూడా ఆస్ట్రియా పరిపాలన తొలగిపోగానే తమ ప్రాధాన్యత నశించిపోతుందనే భయంతో జెక్ ప్రజల స్వాతంత్ర్య సముపార్జన యత్నాలను భగ్నపరుస్తూ ఉండేవారు. దూరదృష్టి గల కొందరు ఆస్ట్రియన్ రాజకీయవేత్తలు బొహిమియాకు రాష్ట్రీయ స్వపరిపాలనాధికారాన్ని ప్రసాదించడం ఆస్ట్రో - హంగరియన్ సామ్రాజ్యానికి క్షేమదాయకమని అనేకసార్లు హాపీ బర్గ్ రాజులకు హితబోధ చేశారు కూడా! ఈ హితబోధ వృధాకావడానికి ప్రధాన కారణం సూడెటెన్ జర్మనుల ప్రాతికూల్యమనే చెప్పవచ్చును.

జెక్ స్వతంత్రాన్ని సూడెటెన్ జర్మనులు ప్రతిఘటించడానికి కారణం, తమ ప్రాధాన్యత ఎక్కడ నశిస్తుందో అనే భయం మాత్రమే కాదు; ఇందుకు ఇంకొక కారణం కూడా ఉంది. జర్మనీ, ఆస్ట్రియా రాజ్యాల జర్మనుల కంటే కూడా హెచ్చుగా జాత్యహంకారం గలవారు సూడెటెన్ జర్మనులు. వారి దృష్టిలో జెక్ జాతివారు అనాగరికులు; అధమాధములు. ఇంతటి జాత్యహంకారం గలవారు గనుకనే వారిలో కొందరు - హిట్లరు తల ఎత్తకముందే - జర్మనీ, ఆస్ట్రియా, బొహిమియా, మొరావియా, సైలెషియాలు కలిసి, మధ్య యూరప్ లో జర్మన్ మహా రాజ్యంగా ఏర్పడాలనే కలలను కన్నారు. ఇది చాలామందికి ఆశ్చర్యంగా కనబడవచ్చును గాని, జర్మన్ నాజీ పార్టీ ఏర్పడక ముందే, సూడెటెన్ జర్మనీలో నాజీ పార్టీ ఉండేది! ఈ పార్టీ నాయకుల దగ్గర నుంచి హిట్లర్ ఎన్నో విషయాల్ని నేర్చుకున్నాడు!!

కొంత స్వార్థచింత, కొంత జాత్యహంకారం : ఇవి కారణాలు కాగా మొదటి నుంచీ కూడా సూడెటెన్ జర్మనులు జెక్ జాతిపట్ల శత్రుత్వాన్ని ప్రదర్శించారు; జెక్ స్వరాజ్య సంస్థాపనకు ప్రతిబంధకాల్ని కల్పించారు. చివరికి 1918లో కూడా వారు తమ వైఖరిని మార్చుకోలేదు. ఇంకొక వారం రోజులకు జెక్ స్వాతంత్ర్య ప్రకటన జరుగుతుందనగా ముగ్గురు సూడెటెన్ జర్మన్ నాయకులు బర్లిన్, డ్రెస్ డెన్ నగరాలకు వెళ్ళి అక్కడి జర్మన్ అధికారులతో కుట్రాలోచనలను చేశారు. ఈ ఆలోచనల సారాంశం ఇది: జర్మనీ యుద్ధం నుంచి ఆస్ట్రియా తప్పుకొని సంధికి అంగీకరించినా, లేక జెక్ స్వతంత్ర రాజ్య ప్రకటన జరిగినా జర్మన్ సైన్యాలు సూడెటెన్ జర్మన్ ప్రాంతాలను ఆక్రమించుకోవాలి.

1918 అక్టోబరు 28వ తేదీనాడు జెకొస్లోవేకియా స్వతంత్ర రాజ్య ప్రకటన జరిగింది. మరునాడు అక్టోబరు 29వ తేదీనాడు సూడెటెన్ జర్మనీ తను ఆస్ట్రియాకు చెందిన స్వతంత్ర రాష్ట్రాన్ని అని ప్రకటించింది. ఈ ప్రకటనను సమర్థిస్తూ, అక్టోబరు 30వ తేదీనాడు ఆస్ట్రియన్ ప్రభుత్వం, ప్రెసిడెంట్ విల్సనకు ఒక విజ్ఞప్తిని పంపించింది. మీరు “స్వయం నిర్ణయ సూత్రాన్ని ప్రతిపాదిస్తున్నారు. మీరు ప్రతిపాదిస్తున్న ఈ సూత్రం ప్రకారమే సూడెటెన్ జర్మనులు ఆస్ట్రియాకు లోబడి రాష్ట్రీయ స్వపరిపాలనాధికారాన్ని కోరుతున్నారు. దానికి అంగీకరించడం మీ ధర్మం” అని ఈ విజ్ఞప్తిలో ఉంది.

స్వయం నిర్ణయ సూత్రం ఉత్తమమైనదే గాని, జెకొస్లోవేకియా రాజ్యానికి ఇది వర్తించదు. ఇందుకుగల కారణాలలో కొన్ని ఇవి : బొహిమియా ఈనాటిది కాదు; అది చరిత్ర ప్రసిద్ధమైన పురాతన రాజ్యం. దాన్ని సూడెటెన్ జర్మన్ ప్రాంతం అనీ, జెక్ ప్రాంతం అనీ రెండుగా విడగొట్టి, రెండింటినీ రెండు విభిన్న పరిపాలనల కింద ఉంచడానికి వీలులేదు. కాదుకూడదని అలా చేస్తే జెక్ జాతీయ చరిత్రను, విజ్ఞానాన్ని, సభ్యతను రెండుగా ఖండించినట్టు అవుతుంది. ఇంతేకాదు, ఒకవైపున జెక్ రాజ్యాన్ని స్థాపిస్తూ ఇంకొకవైపున దాని విచ్ఛిత్తికి బీజాలను నాటినట్టు అవుతుంది. ఎంచేతనంటే - జెకొస్లోవేకియా రక్షణకు బొహిమియన్ పర్వత శ్రేణులు అవసరం. పైగా ముఖ్యమైన అనేక పరిశ్రమలు సూడెటెన్ ప్రాంతాలలో ఉన్నవి.

వీటి తోడ్పాటు లేకుండా కొత్తగా ఏర్పడ్డ జెకొస్లోవేకియా రాజ్యం మనుగడ దుస్సాధ్యం. ఈ వివిధ కారణాల వల్ల సూడెటెన్ ప్రాంతాలను విడగొట్టడానికి వీలులేదని జెక్ ప్రతినిధులు వాదించారు. ఈ వాదనను ప్రెసిడెంట్ విల్సన్ ఆమోదించాడు.

అయితే విల్సన్ ఆమోదించాడు గదా అని సూడెటెన్ జర్మనులు తమ అల్లరిని మానలేదు; ఆందోళనను కట్టి పెట్టలేదు. సూడెటెన్ ప్రాంతాలను ఆక్రమించడానికి వచ్చిన జెక్ సేనలను వారు ప్రతిఘటించారు. ఇందుమూలంగా అక్కడక్కడ తీవ్ర సంఘర్షణలు జరిగాయి. ఈ సందర్భంలో జర్మనీ నుంచి సైన్యాలు వచ్చి తమకు సహాయపడతాయని సూడెటెన్ జర్మనులు కాని వారు ఆశించిన సహాయం రాలేదు. అక్టోబరులో సూడెటెన్ జర్మన్ ప్రతినిధులకు చేసిన వాగ్దానాన్ని జర్మన్ అధికారులు నిలుపుకోలేదు. ఇందుకు కారణం, అక్టోబరు, నవంబరు నెలల మధ్య జర్మనీ పరిపూర్ణ పరాజయాన్ని పొందడమే. సూడెటన్ జర్మనీ తాత్కాలిక రాష్ట్రీయ శాసనసభ' అంటూ వియన్నాలో ఒక సభ జరిపి, తమ జిల్లాలను జర్మనీలో చేర్చవలసిందిగా వారు ఒక తీర్మానాన్ని చేశారు. ఈ తీర్మానాన్ని జర్మన్ ప్రభుత్వం వారు ఆమోదించలేదు సరిగదా, "మీ వైఖరి వల్ల మాకు అపకారం జరుగుతున్నది; మాతో చేరడం అనే గొడవ చెయ్యక, జెకోస్లోవేకియా ఆధిపత్యాన్ని ఆమోదించండి. ఆ రాజ్యంలో రాష్ట్రీయ స్వపరిపాలన కోరండి" అని మే 11వ తేదీనాడు స్పష్టంగా తెలియబరిచారు. దీనితో సూడెటెన్ జర్మనుల కాళ్ళు చల్లబడినవి.

10

తమ సకలయత్నాలు విఫలమై జెకోస్లోవేకియా స్వతంత్ర రాజ్యస్థాపన జరిగిన తర్వాతనైనా సూడెటెన్ జర్మనుల వైఖరి మార్పు చెందలేదు. అసలు మొదటిలోకంటె, ఆ తర్వాతనే వారి. ప్రాతికూల్యం అధికమైనదేమో కూడా! దాపరికం ఏమీ లేకుండా కేవలం బహిరంగంగానే వారు జెక్ రాజ్యక్షేమానికి భంగం కలిగించడానికి, దాని పరిపాలనను భగ్నపరచడానికి కుయత్నాలను సాగించారు. వారి ప్రతినిధి డాక్టర్ లాడ్జ్ మన్ జెక్ పార్లమెంటులో నిలబడి "దేశద్రోహం అనే పాపం మాకు అంటదు. జర్మన్ సభ్యులమైన మాకు ఈ రాజ్యంపట్ల ద్రోహం చెయ్యడమే పరమోత్తమమైన ధర్మం" అని చాటినాడు. దీన్ని బట్టే జెక్ రాజ్యసంస్థాపనానంతరం కూడా వీరు ఎంతటి విషాన్ని కక్కిందీ తెలుస్తున్నది.

సూడెటెన్ జర్మనుల ఈ ప్రతికూల వైఖరిని చూచి, ప్రెసిడెంట్ మాజరిక్ ఒక ప్రకటన చేశాడు. ఆ ప్రకటనలో ఒక భాగం ఇది.

"సూడెటెన్ జర్మనులు నివసిస్తున్న భూభాగం మాది; మాదిగానే అది ఉండి తీరుతుంది. ఈ రాజ్యాన్ని మేమే సృష్టించుకున్నాము; దీన్ని మేమే కాపాడుకుంటున్నాము. నేడు మేము మా రాజ్యాన్ని పునర్నిర్మాణం చెయ్యబూనుకున్నాము. ఈ కార్యంలో సూడెటెన్ జర్మనులు కూడా మాతో సహకారం చెయ్యాలని నేను ఆశిస్తున్నాను. ప్రస్తుతం వారు చేస్తున్న వృథా ప్రయత్నాలకంటె ఇదే ఉత్తమమైన నీతి"

సముచితమైన ఈ ప్రకటన సూడెటెన్ జర్మనులపట్ల వృథా అయింది. ఇంతటితోనైనా "పోనీలే!" అని జెక్ రాజకీయ వేత్తలు ఊరుకోలేదు. సూడెటెన్ జర్మనులతో ఏవిధంగానైనా రాజీపడాలనే వారి ఆశయం. ఈ ఆశయాన్ని డాక్టర్ బెనిస్ 1918 అక్టోబరులోనే ఈ విధంగా ప్రకటించాడు.

"మన రాజ్యం సూడెటెన్ జర్మనుల ఆమోదాన్ని పొందాలి. ఇందుకోసం వారితో మనము రాయబారాల్ని నడపాలి. మన రాజ్యం కేవలం జాతీయతకు కేంద్రం కాకుండా అధునాతనానికీ, అభివృద్ధికి ఆటపట్టయినట్టి ప్రజాస్వామికంగా విలసిల్లాలి."

ఈ ఆశయాన్ని దృష్టిలో ఉంచుకునే 1919లో ఒకసారి 1920లో ఇంకొకసారి జెక్ ప్రభుత్వం సూడెటెన్ జర్మనులతో రాయబారాల్ని నడిపింది. అయితే ఇవి ఫలించలేదు. ఇందుకు సూడెటెన్ జర్మనుల విపరీతమైన కోర్కెలే! కారణం

జెక్ ప్రభుత్వం వివిధ జాతుల సహకారాన్ని అపేక్షించింది. ఇందులో ఒక జాతి జర్మన్ తన సహకారాన్ని నిరాకరించింది. అంత మాత్రం చేత నిస్పృహ చెంది, అసలు జాతీయ పునర్నిర్మాణ యత్నాన్నే విరమించడమా? అది సుతరామూకూడదు. అంచేత జెక్ ప్రభుత్వం తన ఆశయాల ప్రకారం - తన ఆలోచనల్ని అనుసరించి - కార్యసాధనకు పూనుకుంది; వ్యవసాయాభివృద్ధికి, పరిశ్రమల పునరుద్ధరణకు, వాణిజ్య విస్తరణకు, విద్యావ్యాప్తికి, విజ్ఞాన ప్రచారానికి, పరిపాలనా సౌలభ్యానికి తగిన అవసరమైన శాసనాల్ని చేసింది; ఏర్పాట్లను జరిపింది.

ఈ సందర్భంలో సూడెటెన్ జర్మనులకు కొంత అపకారము జరిగిన మాట కాదనలేము. ఇలా అపకారం జరగడంలో తప్పు ఏమీ లేదుకూడా! "నిన్ను తెగనరుకుతాను!" అని అంటున్నవాని చేతికి కత్తి అందించడం తెలివైన పనికాదుగదా? జాతి అయితే, పై విషయాన్ని బట్టి, సూడెటెన్ జర్మనులకు కేవలం పచ్చి అన్యాయం జరిగిందని అనుకోవడం పొరపాటు. జరిగిన విషయం ఏమంటే - అంతకు పూర్వం వారికున్న ప్రత్యేక హక్కులు - ప్రత్యేక సౌకర్యాలు - తొలగిపోయాయి, తక్కిన పౌరులతో పాటు వీరికి కూడా సమానమైన ప్రతిపత్తి ఏర్పడింది. అంతకు పూర్వం జర్మన్ భాష రాజభాషగా ఉండేది, అంచేత దానికి అధిక ప్రాధాన్యం ఉండేది. జెకొస్లోవేకియా స్వతంత్ర రాజ్యం స్థాపితమైన తర్వాత కూడా, ఇలాగే జరగడం తగునా? అంచేత అనేక జర్మన్ విద్యాలయాల్ని కట్టివేసి, వాటి స్థానంలో జెక్ విద్యాలయాల్ని తెరిచారు. ఇది తప్పుకాదుగదా? ఇది తప్పు ఎప్పుడౌతుందంటే - అసలు జర్మన్ భాషనే పూర్తిగా బహిష్కరించాలని యత్నించినప్పుడు. ఇలాంటి దుష్ప్రయత్నం జెక్ ప్రభుత్వంవారు ఏనాడూ చెయ్యలేదు. ఇందుకు క్రింది అంకెలే సాక్ష్యం. ఈ అంకెలు 1935 అక్టోబర్ నెలకు సంబంధించినవి.

ఎలిమెంటరీ స్కూల్సులో చదువుకుంటున్న జర్మన్ బాలబాలికలలో నూటికి 97 మంది జర్మన్ భాష ద్వారానే బోధ జరుగుతున్న పాఠశాలలో ఉన్నారు. ఇక అప్పర్ ఎలిమెంటరీ స్కూల్సులో చదువుకుంటున్న వారిలో నూటికి 93 మంది జర్మనీ ఉపాధ్యాయులున్న జర్మన్ పాఠశాలల్లో ఉన్నారు. పోతే, పెద్ద చదువుల విషయంలో జెక్ జాతివారికంటె, జర్మన్ జాతివారికే అధిక సౌకర్యాలున్నవని చెప్పవచ్చును. జెకొస్లోవేకియా దేశం మొత్తంలో 290 సెకండరీ స్కూల్సు ఉన్నాయి. వీటిలో 80 కేవలం సూడెటెన్ జర్మనులవే! దేశం మొత్తం జనాభాలో సూడెటెన్ జర్మనుల సంఖ్య నూటికి 22.5 వంతులు మాత్రమే అయినప్పటికీ, వారికున్న సెకండరీ స్కూల్సు మొత్తం సంఖ్యలో నూటికి 27.6 వంతులు! ఈ 80 సెకండరీ స్కూల్సు కాక, 10 ట్రెయినింగ్ కాలేజీలు, 52 వ్యావసాయిక విద్యాలయాలు, 48 వాణిజ్య కళాశాలలు, 98 పారిశ్రామిక పాఠశాలలు ఉన్నాయి, ఇవి అన్నీ కూడా కాక, వారికి ప్రత్యేకంగా ఒక కళాపరిషత్తు, రెండు పారిశ్రామిక పరిషత్తులు, ఒక సంగీత పరిషత్తు, ఒక చిత్రకళాపరిషత్తు ఉన్నాయి!

ఇదే సూత్రం ఇతర విషయాలకు కూడా వర్తిస్తుంది. పూర్వం హాప్స్బర్గ్ పరిపాలకుల ప్రాపకంతో సూడెటెన్ జర్మనులలో కొందరు పెద్ద పెద్ద జమీందారీలను సంపాయించుకున్నారు. చెమటోడ్చి పనిచేసుకునే వారికి సెంటు భూమి అయినా లేకుండా ఉంటే, పెద్ద పెద్ద జమీందారీలు చెక్కు చెదరగూడదని అనడం ధర్మమా? అంచేత, జెక్ ప్రభుత్వంవారు వాటిని చిన్న చిన్న ఖండాలుగా చేసి, కొండ్రలేని రైతులకు పంచి పెట్టారు. ఇలా పంచి పెట్టడంలో జర్మన్ జాతివారి పట్ల కొంత

పక్షపాతం జరిగితే జరిగి ఉండవచ్చు. కాని, తప్పేమి? ఇంతకు పూర్వం జర్మనులు అనుభవించారేమో, ఇపుడు జెక్కులు అనుభవిస్తారు! ఇక శాసన సభల విషయంలో కూడా ఇంతే! హాప్సుబర్గ్ పరిపాలన కింద ఆస్ట్రియన్ పార్లమెంటులో జెక్ ప్రజలకు 75 మంది ప్రతినిధులుంటే, సూడెటెన్ జర్మనులకు 55 మంది ఉండేవారు. అంటే, జెక్ ప్రతినిధులలో సూడెటెన్ జర్మన్ ప్రతినిధులు మూడింట రెండువంతుల కంటె కూడా హెచ్చు. కాని, జనాభాను అది - బట్టి చూస్తే, వారు జెక్ ప్రజలలో సగంకంటె తక్కువ! జెక్ ప్రభుత్వంవారు తొలగించి, జనాభాను బట్టి ప్రాతినిధ్యాన్ని ఏర్పరిచారు. ఇది అక్రమమని ఎవరనగలరు? తనకు తానుగాగాని, ఇతరుల ప్రాపకంవల్ల గాని ఎగబాకిన వాడిని దిగదియ్యడం సబబే అయినప్పటికి - అశాంతికి కారణమౌతుంది; ఆందోళనకు దారితీస్తుంది. సూడెటెన్ జర్మనీలో సరిగా ఇదే జరిగింది. అసలే జాత్యహంకారముతో బాధపడుతున్న వారేమో, ప్రత్యేక హక్కులు తొలగిపోవడం, తక్కిన వారితో సమానం కావడం, వారికి బాధాకరం అనిపించింది. ఇందుకు మైనారిటీ సంఘాన్ని అనుసరించి వుండే చిక్కులు తోడైనాయి. దీనితో సూడెటెన్ జర్మనులు కేవలం ఉన్మాదులవలె ప్రవర్తించసాగారు.

కలహించినపుడు కలహించారు; కలిసినప్పుడు కలిసారు; కాని మొత్తం మీద శతాబ్దాల తరబడి జెక్, జర్మన్ ప్రజలు ఒక రాజ్యంలో ఇరుగు పొరుగున కాలక్షేపం చేశారు. కొత్తగా ఏర్పడ్డ జెకోస్లోవేకియా రాజ్యానికి ఇంకొక పాతిక సంవత్సరాల వ్యవధి లభించి ఉన్నట్టయితే, నేటి పరిస్థితులు ఉప్పతిలేవి కావేమో! కాని, ఈలోపుగానే జర్మనీలో ఒక దురహంకారి - హిట్లర్ - విజృంభించాడు; అతడకి జెక్ రాజ్యంలో ఒక భృత్యుడు - హెర్లిన్ - లభించాడు.

11

ఆకారాన్ని బట్టి చూచినా, బుద్ధి విశేషాన్నిబట్టి చూచినా ఏ ఇతర విధాలబట్టి చూచినా అతి సామాన్యమైన వ్యక్తి, - కాన్డ్ హెర్లిన్. అయినప్పటికీ అతడు పెద్దవాడు కాగలిగాడు. ఇందుకు కారణం కేవలం అతడి అదృష్టమనే అనుకోవాలి. ఇంతకు పూర్వమే చెప్పినట్టు హెర్లిన్ ఆకారంలో విశేషం ఏమీ కనబడదు. అతి సామాన్యంగా ఉంటుంది, అతడి ముఖం: వెడల్పు నుదురు - బయటికి పొడుచుకువచ్చే చెవులు - సూటిగా ఉండే బందముక్కు - పైకి ఎగదువ్విన నల్లటి జుట్టు - కళ్ళ జోడు. కొందరి ముఖాన్ని చూడగానే "వీడు వట్టి అమాయకుడురా!" అని తోస్తుంది. హెర్లిన్ ముఖం కొంత వరకు ఈ జాతిలోనే చేరుతుంది. ఇప్పుడు అతడి వయస్సు నలభై సంవత్సరాలు. మామూలు ఎత్తు, మామూలు లావు ఉంటాడు. ఇల్లు అంటేనూ, పెళ్లాం బిడ్డలంటేనూ చాలా ప్రేమ కనబరుస్తాడు. అంతఖరీదైనవీ, బొత్తిగా చౌకపారువీ కాకుండా, సామాన్యమైన దుస్తుల్ని ధరిస్తాడు.

చీకటితో నిద్రలేస్తాడు; పెందరాళే నిద్రపోతాడు. ఉదయం పూట కొంత సేపు కసరత్తు చేస్తూ ఉంటాడు. సిగరెట్లను కాల్చుతాడు. కాని, చాలామితంగా డ్రింక్సు పుచ్చుకుంటాడు. కాని, మోతాదు పెద్దది కానివ్వడు.

అతడు బుద్ధి సూక్ష్మత గలవాడుకాడు. కాని, మంచి జ్ఞాపకశక్తి మాత్రం ఉంది. అతడికి ఇంగ్లీషు ఏమీరాదు. అయినప్పటికి అతడు రెండుసార్లు ఇంగ్లీషులో ఉపన్యసించాడు. ఉపన్యాసాన్ని ఇంగ్లీషులో వ్రాయించుకోవడం; దాన్ని కంఠస్థం చెయ్యడం; స్నేహితులయెదుట రిహార్సల్ చెయ్యడం; తర్వాత సభలో పాల్గొనడం; ఇదే అతడు చేసినపని. దీన్నిబట్టి అతడికి ఎంత జ్ఞాపకశక్తి ఉందో, మనం తెలుసుకోవచ్చును. అతడి జ్ఞాపకశక్తి ఎంత హెచ్చో, అతడి పట్టుదల కూడ అంత హెచ్చు. ఈ రెండింటిని మినహాయిస్తే, హెర్లిన్ అన్నివిధాల అతిసామాన్యమైనవాడు.

హెర్లిన్ జననం 1898లో. అతడి జన్మస్థానం బొహిమియాలోని రీచెన్ బర్గ్ అనే పట్టణం. అతడి తల్లిదండ్రులు సామాన్య స్థితిపరులు. ఏదో ఒక చిన్న వ్యాపారం సాగిస్తూ, కుటుంబ పోషణ చేసుకుంటూ ఉండేవాడు. హెర్లిన్ వంశము కలిలేని జర్మన్ వంశం అని అనడానికి వీలులేదు. అతడి మాతామహులలో జెక్ జాతికి జెందినవాడొకడు కనబడుతాడు.

చదువుకొనే రోజులలో హెర్లిన్ జీవితంలో ఎన్నదగిన సంఘటనలు ఏవీ జరగలేదు. అతడికి "పుస్తకం పురుగు" అని పేరు ఉండేది. క్లాసులో సాధారణంగా 'పష్టు'గా వస్తూ ఉండేవాడు. దీని ఫలితం వట్టి 'బక్కపీరు' కావడం.
1916లో - అంటే మైనారిటీ వెళ్లిపోగానే - హెర్లిన్ ఆసో హంగరియన్ సైన్యంలో చేరాడు. సైనికుడుగా మంచి పేరునే అతడు సంపాయించుకున్నాడు. అయితే మంచిపదవిని పొంది, రాణింపుకు రాకముందే ఇటాలియనులు అతడిని ఖైదుచేసి, అసినారా ద్వీపాలకు పంపించారు. ఇక్కడ అతడు ఎనిమిది మాసాలపాటు ఉన్నాడు.

యుద్ధం ముగిసి, సంధి జరిగి, అతడు ఇంటికి తిరిగి వచ్చేసరికి ఆస్ట్రో-హంగరియన్ సామ్రాజ్యం శిధిలం కావడమూ, జెకొస్లోవేకియా అనే కొత్త రాజ్యం తలయెత్తడమూ జరిగింది. ఈ మార్పు అతడికి అతి వింతగానూ, అవిశ్వసనీయంగానూ కనబడింది. కాని దీన్ని గురించి అంతగా ఆలోచించక భుక్తి జరగడానికి అతడు ఉద్యోగప్రయత్నాన్ని చెయ్యసాగాడు.

అదృష్టవంతుడేమో అంత శ్రమలేకుండా స్వస్థలమైన రీచెన్ బర్గ్ లోనే ఒక బ్యాంకిలో హెర్లిన్ కు గుమాస్తాపని దొరికింది. ఒక పూట యాదాలాపంగా పత్రికను తిరగవేస్తూ ఉంటే, అతడికి ఒక ప్రకటన కనబడింది. స్థానికపు బ్యాంకిలో గుమాస్తాపని ఖాళీగా ఉన్నదనీ, దానికి అర్హులైనవారు - ముఖ్యంగా యుద్ధంలో పాల్గొన్నవారు - దరఖాస్తుల్ని పంపుకోవలసిందనీ ఆ ప్రకటనలో, ఉంది. దీన్ని చూడగానే హెర్లిన్ తన దరఖాస్తు పంపించాడు. అప్పటిలో నిరుద్యోగంగా ఉన్న వారికి గాని, యుద్ధంలో పాల్గొన్నవారికి గాని కొదవలేదు. అంచేత ఆ గుమాస్తా పనికోసం హెగ్స్ తో పాటు వేలకొలది ఇతర యువకులు కూడా దరఖాస్తుల్ని పంపించారు. ఈ దరఖాస్తుదారులలో ఎవడు తగినవాడో తెలుసుకోవడానికి, అందరినీ ఒకనాడు ఆఫీసుకు రమ్మని కబురువచ్చింది. ఆ ప్రకారం హెర్లిన్ ఆఫీసు వద్ద హాజరయ్యాడు. అతడు అక్కడికి చేరుకునే సరికే పెద్దగుంపు పోగయింది. "ఇంతమందిలో ఈ ఉద్యోగం నా వరకు రావచ్చిందా?" అని హెర్లిన్ హతాశుడయ్యాడు. కాని, బ్యాంకి డైరెక్టర్ వరసగా అందరినీ చూచుకొంటూ వచ్చి, అతని యెదట హఠాత్తుగా ఆగి, "నీ పేరేమిటి?" అని ప్రశ్నించాడు.

"కానరాడ్ హెర్లిన్"
"సరే, నీవు ఉద్యోగంలో ప్రవేశించు!" అని ఆజ్ఞ.

అందరిలో బ్యాంకి డైరెక్టర్ దృష్టి హెర్లిన్ మీదనే ఎందుకు పడిందో తెలియదు. అది అతడి అదృష్టం - అంతే! హెర్లిన్ ప్రఖ్యాతిలోకి వచ్చిన తర్వాత - ఇటీవలనే - లండన్ "డెయిలీ హెరాల్డ్" పత్రిక విలేఖరి ఆ బ్యాంకి డైరెక్టర్ ను కలుసుకుని "ఆనాడు నీవు అంతమందిలో హెర్లిన్ నే నియమించడానికి కారణమేమిటి?" అని అడిగితే, ముఖం చూచి చూడ్డంతోటే ఇతడు అబద్ధం ఆడ్డానికి అశక్తుడని తోచింది" అని బదులు చెప్పాడు. దీన్ని బట్టి చూస్తే అమాయకంగా కనబడ్డం కూడా ఒకొక్కప్పుడు లాభదాయకమని తోస్తున్నది.

గుమాస్తాగిరి కొత్త బులపాటం తీరగానే ఆఫీసులో కుర్చీని అంటి పెట్టుకు కూర్చోడం హెర్లిన్ కు కష్టమనిపించ సాగింది. పైగా, దేహదార్ఢ్యాన్ని సంపాయించుకోవడానికి వ్యాయామం అవసరమని కూడా తోచింది. అంచేత అతడు "టర్న్ వెరీన్" అనే సంస్థలో చేరాడు. "టర్న్ వెరీన్" అంటే, వ్యాయామ మండలి. అయితే, దీని ఆశయం కేవలం దాని సభ్యులలో దేహదార్ఢ్యాన్ని పెంపొందించడం మాత్రమే కాదు. వారిలో జాతీయతను రేకెత్తించడం కూడా దాని ప్రధాన లక్ష్యాలలో

వొకటి. జెక్కు జాతి వారిలో జాతీయాశయాల్ని ప్రబోధించడానికి ఇలాంటి సంస్థలు చాలా ఉపకరించాయి. దీన్ని చూచి సూడెటెన్ జర్మన్లు కూడా వీటిని ప్రారంభించారు.

ఏలాంటి ప్రతిభ లేకపోయినా, జాత్యహంకారం కలవాడేమో హెర్లిన్ తమ "టర్న్ వెరీన్" సంస్థ అంటే అత్యధికోత్సాహాన్ని చూపించసాగాడు.

అతడి కృషి వల్ల స్థానిక "టర్న్ వెరీన్"లో చాలామంది సభ్యులుగా చేరారు. ఇందుకు ప్రతిఫలం - హెర్లిన్ కు ఆ సంస్థ కార్యదర్శిపదవి సిద్ధించడం. ఎప్పుడైతే, "టర్న్ వెరీన్" కార్యకలాపాలలో అతడి దృష్టి లగ్నమైందో, అపుడతడు పెద్ద పెద్ద ఆశలకు పోసాగాడు. సూడెటెన్ జర్మను లందరిని ఏకం చెయ్యగలిగితే, వారికి ప్రత్యేక హక్కుల్ని సంపాయించగలిగితే - ఇలాగే ఎన్నో ఆశలు.

రీచెన్ బర్గ్ లోని "టర్న్ వెరీన్" కార్యదర్శిపదవి నుంచి 1926లో అతడు ఆష్ లోని "టర్న్ వెరీన్'కు కార్యదర్శి అయ్యాడు. ఆ తర్వాత 1929లో సూడెటన్ జర్మనీలో ఉన్న "టర్న్ వెరీన్" సంస్థలన్నిటికీ ప్రధాన కార్యదర్శి అయ్యాడు. ఈ సంస్థల మొత్తం సభ్యుల సంఖ్య ఒక లక్ష. ఇంత మంది యువకుల్ని సభ్యులుగా గల సంస్థలకు ఎంత పలుకుబడి ఉంటుందో వేరే చెప్పాలా? ఈ సంస్థలన్నిటికి ప్రధాన కార్యదర్శి అయ్యేసరికి హెర్లిన్ పేరు సూడెటన్ జర్మనీ అంతటిలోనూ వ్యాపించింది. "టర్న్ వెరీన్" ఉద్యమంతో పాటు సూడెటెన్ జర్మనీలో ఇంకొక ఉద్యమం కూడా తలయెత్తింది. దీని పేరు – "వాండర్ వోగెల్" ఈ మాటకు అర్థం - కాలినడకను దేశ పర్యటన చెయ్యడం. నిరుద్యోగానికి గురి అయిన సూడెటెన్ జర్మన్ యువకులు జట్లుగా ఏర్పడి, గ్రామం నుంచి గ్రామానికి పోతూ, గ్రామ వాసులు ఇచ్చే ఆతిథ్యాన్ని పొందుతూ, కాలం గడపడం మామూలు అయిపోయింది. ఇదే, క్రమంగా "వాండర్ వోగెల్" ఉద్యమం కింద పరిణమించింది.

పని చెయ్యడానికి తగిన వోపిక, పని చెయ్యాలనే కోర్కె, ఇవి ఉన్నప్పటికి, పని దొరకక అల్లాడుతూ, కడుపు చేత పుచ్చుకుని తిరిగే ఈ జర్మన్ యువకులు సాయంత్రం పూట ఏ చెట్టు కిందనో చేరి, చలిమంట వేసుకుని, దాని చుట్టూ కూర్చుని చలికాగుతూ జర్మన్ పల్లెపదాలను పాడుకుంటూ ఉండేవారు; జర్మన్ సారస్వతాన్ని గురించి చర్చిస్తూ ఉండేవారు. జర్మన్ జాతి సర్వోత్తమమైనదనీ, జర్మన్ జాతీయ విజ్ఞానం నిరుపమానమైనదనీ వారి నమ్మకం. స్వజాతి మీదనేమి, స్వజాతీయ విజ్ఞానం మీద నేమి వారికి ఎంత అభిమానమో, ఇతర విజ్ఞానాల మీద వారికి అంత ఏహ్యభావం. ముఖ్యంగా జెక్, స్లోవక్ ప్రజలంటే వారికి అతి అసహ్యం. అంచేత జెకొస్లోవేకియా ప్రభుత్వంతో తమకు ఏ విధమైన సంబంధం లేనట్టు, జర్మన్ పల్లెపదాలను పాడుకొంటూ, వారు బొహిమియన్ అడవుల వెంట తిరుగుతూండేవారు. ఇలా తిరిగే ఈ యువకులకు "టర్న్ వెరీన్" సంస్థలు (హెర్లిన్ వ్యాయామ సంఘాలు) వీలైన ప్రతిచోట కూడా భోజన వసతి చేస్తూ ఉండేవి. అంచేత వారి మీద "టర్న్ వెరీన్" సంస్థలకూ వాటి నాయకుడైన హెర్లిన్ కూ, కొంత పలుకుబడి ఏర్పడింది. ఒక వైపున "టర్న్ వెరీన్" సంస్థలకు కార్యదర్శి కావడం, ఇంకొక వైపున "వాండర్ వోగల్" ఉద్యమానికి సంబంధించిన వారిలో మంచి పలుకుబడి ఉండడం, ఈ రెండు కారణాలవల్ల హెర్లిన్ తనకు తెలియకుండానే గొప్పవాడయ్యాడు! దీని ఫలితం ఏమంటే - సూడెటెన్ జర్మన్ రాజకీయ పక్షాలు అతడి సహాయాన్నీ, సహకారాన్ని అర్థించడం!! -

సూడెటెన్ జర్మన్ రాజకీయ పక్షాలలో ఎన్నదగినవి రెండే. మొదటిది, - నాజీ పార్టీ. రెండవది - కామ్రేడ్స్ యూనియన్. ఈ రెండింటిలో "కామ్రేడ్స్ యూనియన్'కే ఎక్కువ బలం ఉండేది. ఇందుకు కారణాలు ఇవి :

(1) బర్లిన్, మ్యూనిక్ నగరాలకంటె సూడెటెన్ జర్మనీకి వియన్నాయే దగ్గరగా ఉండడం,అంచేత జర్మనీతో కంటె ఆస్ట్రియా తోనే ఎక్కువ సన్నిహిత సంబంధం ఉండడం.

(2) ఆస్ట్రియాలో వలెనే సూడెటెన్ జర్మనీలో కూడా రోమన్ కేథలిక్ మతస్థులే అధిక సంఖ్యాకులు కావడం, ఇందువల్ల

మతవిషయంగా కూడా ఆస్ట్రియా అంటే ఎక్కువ అభిమానం ఉండడం.

సూడెటెన్ నాజీ పార్టీ నాయకుల పేర్లు - క్రైబ్స్, జంగ్. వీరి యాజమాని హిట్లర్. ఇక సూడెటెన్ జర్మనీలోని "కామ్రేడ్స్ యూనియన్" నాయకులు - రూధా, హైన్ రిచ్. వీరి గురువు వియన్నా కళాపరిషత్తు హిజ్రీ ప్రొఫెసర్ అయినట్టి లోద్ మార్ స్పాన్. ఇతడి సిద్ధాంతాల ప్రకారం డిమొసీ, మార్క్సిజం, లిబరిలిజం మొదలైన ఉద్యమాలు మానవ జాతికి మహామారి వంటివి. వీటి బారి నుంచి తప్పించుకోవాలంటే, మానవ సంఘం ఒక కొత్త పద్ధతి మీద పునర్నిర్మాణం కావాలి. ఈ పద్ధతి ఏమంటే, విభిన్న పక్షాలు రూపుమాసిపోవాలి; వర్గ విభేదాలకు తావుండరాదు. కేవలం వివిధ వృత్తుల ప్రాతిపదిక మీద రాజ్యవ్యవస్థ ఆధారపడి ఉండాలి. ఇలాంటి పద్ధతి మీద ఏర్పడ్డ రాజ్యంలో అన్నిటికంటె గొప్ప వృత్తి "నాయకత్వాన్ని వహించడం" ఈ వృత్తికి చెందినవారు (ఉపనాయకులు) తమలో పెద్దవాడికి (మహానాయకుడికి) లోబడి, పరిపాలన సాగిస్తూ ఉంటారు. జర్మన్ జాతి ఈ పద్ధతిని అనుసరించినప్పుడు తూర్పు యూరపు అంతా కూడా దాని పాదాక్రాంతం అయిపోతుందట!

స్పాన్ ప్రతిపాదించిన ఈ సిద్ధాంతాలను "కామ్రేడ్స్ యూనియన్" ద్వారా సూడెటెన్ జర్మన్ యువకులలో ప్రచారం చెయ్యాలని కొంతకాలం యత్నించి, ఆ తర్వాత తనంతట తానుగా ఈ పనిని సాధించలేమని రూధా తెలుసుకున్నాడు. అప్పుడతడు హెర్లిన్ సహాయాన్నీ, సహకారాన్ని అర్థించాడు. ఈ విధంగా హెర్లిన్ రాజకీయ రంగంలో ప్రవేశించడం సంభవించింది.

1931లో హెర్లిన్ "మనకు నాయకత్వం వహించగల వ్యక్తి ఎక్కడ?" అనే ధోరణిలో ఉన్నాడు. అప్పటికి అతడు "టర్న్ వెరీన్" సంస్థలకు కేవలం కార్యదర్శి మాత్రమే! పైగా, ఆనాటికి అతడికి ఉపన్యాసాలు దంచగల ప్రజ్ఞ ఇంకా అలవడలేదు. కాని 1938 నాటికి అతడు "టర్న్ వెరీన్" సంస్థలకు ప్రధాన నాయకుడు కాగలిగాడు. ఇంతేకాదు. అప్పటికతడు ఉపన్యాసాలను చెయ్యడంలో గల కిటుకులు అన్నీ కూడా నేర్చుకున్నాడు. అంచేత ఆ సంవత్సరంలో అతడు "సూడెటెన్ జర్మనీకి నాయకత్వం వహించగలవాడిని నేనే!" అనే ధోరణిని పూనగలిగాడు! ఆ సంవత్సరం లోనే - అంటే, 1933 లోనే - హిట్లర్ జర్మనీకి ఛాన్సలర్ అయ్యాడు. దీన్ని చూచి జెకొస్లోవేకియా ప్రభుత్వం ఆత్మరక్షణను కోరి - సూడెటెన్ జర్మనీలోని నాజీ పార్టీని నిషేధించింది. అప్పటి వరకు నాజీ పార్టీతో తనకు అంతగా సంబంధం లేకపోయినా, హెర్లిన్ నాజీ పార్టీ బహిష్కరణను సాకుగా పెట్టుకుని సూడెటెన్ జర్మనులకు ఈ సందేశాన్ని ప్రకటించాడు. "పక్షాలు, వర్గాలు అనే భేదాలను విడిచి పెట్టి, సూడెటెన్ జర్మనీ వారందరు ఏకంకావాలి. సూడెటెన్ జర్మనీ మహోద్యమానికి నాయకుడను నేనే!"

వర్తక మాంద్యం వల్ల సూడెటెన్ జర్మనీలో చాలా అసంతృప్తి అది వరకే వ్యాపించి ఉంది. ఇందుకు నాజీ పార్టీ బహిష్కరణ తోడైంది. అంచేత నాజీలు మాత్రమే కాక, ఇతరులు కూడా (వేలకొలదిగా, లక్షల కొలదిగా) హెర్లిన్ నాయకత్వాన్ని అంగీకరించారు. ప్రథమంలోనే తనకు కలిగిన ఈ విజయానికి అమితంగా సంతోషించి, 1933 అక్టోబరు నెలలో హెర్లిన్ ప్రాగ్ నగరంలోని ప్రతికా ప్రతినిధుల నందరినీ సమావేశ పరచి, వారితో తన ఉద్యమాన్ని గురించీ, తన ఆశయాలను గురించి ప్రసంగించాలని అనుకున్నాడు. అయితే, సంతోషభరంలో అతడు సమావేశాన్ని జరపడానికి ముందు "లా" కోరే ప్రకారం పోలీసు వారి అనుజ్ఞను పుచ్చుకోవడం మరచిపోయాడు. అంచేత ఆ సమావేశాన్ని పోలీసువారు చెదరగొడుతూ ఉంటే, అతడు గుడ్లు అప్పగించి చూడవలసి వచ్చింది. "అడుగులోనే హంసపాదు" అన్నట్టు తను ప్రారంభంలో కలిగిన ఈ పరాభవానికి హెర్లిన్ చాలా సంతాపపడ్డాడు. అయితే, స్నేహితుల ఓదార్పు వల్ల, అతడు ఈ విచారాన్ని త్వరలోనే మరచిపోయి, తిరిగి తన కార్యక్రమాన్ని సాగించాడు. సూడెటెన్ జర్మను లందరు హెర్లిన్ నాయకత్వాన్ని అంగీకరించడాన్ని చూచి, అతడికి కావలసిన సహాయాన్ని చేస్తానని హిట్లర్ అనేక సార్లు కబురుచేశాడు. అయితే హెర్లిన్ ఈ సహాయాన్ని

నిరాకరించాడు. పార్లమెంటరీ పద్ధతి జర్మన్ స్వభావానికి విరుద్ధమైనదని 1926లో హెర్లిన్ వ్యాసాలను ప్రకటించిన మాట నిజం. కాని ప్రజాస్వామికం అంటే అతడి హృదయంలో ప్రేమ లేకపోలేదు. హిట్లర్ చేస్తానన్న సహాయాన్ని అతడు నిరాకరించడానికి మొదటి కారణం ఇదే! పోతే, రెండవ కారణాన్ని అతడే ఈ కింది విధంగా తెలిపాడు;

“జెకొస్లోవేకియాతో పూర్తిగా ఏకీభావం ఎంతనష్టమో, జర్మనీతో పూర్తిగా ఏకీభావం కూడా అంతనష్టమే! సరిహద్దుల్ని మార్చడం వల్ల సూడెటెన్ జర్మనీ సమస్యలు పరిష్కారం కావు" 1933లో హెర్లిన్ అవలంబించిన ఈ వైఖరి తర్వాత తలకిందులు కావడానికి యూరపియన్ రాజకీయ పరిస్థితులలోని మార్పే కారణం. రాజ్యాధికారానికి వచ్చిన తర్వాత హిట్లర్ సార్ ప్రాంతాన్ని వశపరచుకున్నాడు; రై లాండుకు సేనల్ని పంపించాడు; ఆస్ట్రియాను కబళించాడు; తనకు తిరుగు లేదనే భావాన్ని కలిగించాడు. ఇందువల్ల హెర్లిన్ తప్పని సరిగా హిట్లర్ నాయకత్వాన్ని అంగీకరించవలసి వచ్చింది.

ఒకప్పుడు "నేను ఇంతవరకు హిట్లర్ ను చూడనైన లేదు" అని హెర్లిన్ గర్వంగా చెప్పుకునేవాడు. అట్టివాడే ఆ తర్వాత హిట్లర్ ఆజ్ఞల్ని శిరసా వహించసాగాడు.

12

ఏ చెట్టుచాటునో పొంచి కూర్చుని, శరీరాన్ని అంతటినీ కుదించుకుని, రెప్ప వెయ్యకుండా చూస్తూ, తగిన అదును వచ్చిందనుకోగానే చెంగున గెంతి పంజాతో ఒక చరుపు చరిచి, దెబ్బకు గిలగిల తన్నుకుంటూ పడిపోయినలేడిని పళ్లతో కరచి పట్టి, ఇటూ అటూ విదిలించి, ఆ తర్వాత దాన్ని పీక్కుతినే పెద్ద పులివంటివాడు హిట్లర్.

ఇరుగు పొరుగు రాజ్యాలలో ఎక్కడ అసంతృప్తి ఉందో అతడు కనిబెడతాడు. ఆ అసంతృప్తికి దోహదమిస్తాడు. తనకు అనుకూలమైన ఒక పక్షాన్ని చేరదీస్తాడు. దాని ద్వారా కుట్రపన్నుతాడు. తగినంత బలం చేకూరనంతవరకు ఈ కుట్ర రహస్యంగా సాగుతుంది. ఆ తర్వాత అది బాహాటమై పోతుంది. అప్పుడిక “అది కావాలి, ఇది కావాలి” అని అల్లరి. అడిగిన దాన్ని ఇచ్చి వేస్తారేమో అని తోచినప్పుడు “అబ్బే, ఇంతే కాదు; మరికొంత కావాలి” అని కొత్త పేచీలు! ఇంత తంతును జరిపించి, ఎదటి పక్షాన్ని పూర్తిగా చీకాకుపరిచి, ఇక తనకు తిరుగులేదని తోచగానే, పిడుగులా విరచుకు పడతాడు. ఆస్ట్రియా సందర్భములో హిట్లర్ అవలంబించిన పద్ధతి ఇదే! తిరిగి అతడు దాన్ని జెకొస్లోవేకియా పట్ల కూడా అనుసరించాడు.

హెర్లిన్ ఏ క్షణాన హిట్లర్ నాయకత్వాన్ని అంగీకరించాడో, ఆ క్షణం నుంచీ సూడెటెన్ జర్మన్ నాజీ ఉద్యమం నడిచింది జర్మనీ నుంచి వెళ్ళిన ధనంతో. ఇంతేకాదు. ఆ ఉద్యమాన్ని ప్రచారం చేసినవారు కూడా జర్మనీ నుంచి వెళ్ళిన ఏజెంట్లు. అయినప్పటికి సూడెటెన్ నాజీలతో తనకు ఏమీ సంబంధం లేనట్టు హిట్లర్ నటించాడు.

ఈ నటన ఆస్ట్రియా ఆక్రమణ పూర్తి అయ్యే వరకు నడిచింది. ఆ తర్వాత నటనతో నిమిత్తం లేదని తోచింది. వెంటనే జర్మన్ పత్రికలు జెకోస్లోవేకియా మీద నిప్పులు చెరగ నారంభించాయి. హిట్లర్ (జర్మన్ ప్రచారక శాఖమంత్రి) గోయిబుల్స్ చెవిలో ఊదాడు; గోయిబుల్స్ పత్రికలకు కను సైగ చేశాడు. తక్షణం దూషణపరంపర ప్రారంభమైంది. వైరంగాని, యుద్ధంగాని లేని సందర్భములో ఇంతకు ముందు ఏ రాజ్యమూ ఇంకొక రాజ్యాన్ని ఇంత ఘోరంగా దూషించినట్టు కనబడదు! జర్మన్ పత్రికలు బహిరంగంగా జెకొస్లోవేకియా దూషణ ప్రారంభించగానే, హెర్లిన్ కూడా రంగు బయలు పెట్టాడు. ఇంతకు ముందు అతడు తన పార్టీ నాజీ పార్టీ కాదని అంటూ ఉండేవాడు. ఇప్పటి నుంచీ అతడు తాను నాజీననీ,

తనది నాజీ పార్టీ అనీ నిస్సంకోచంగా చెప్పసాగాడు. ఇంతేకాదు. హిట్లర్ రేపోమాపో తన సైన్యాలను పంపించి సూడెటెన్ జర్మనీని జెక్ దాస్యం నుంచి తప్పించనున్నాడనే వదంతిని కూడా అతడు వ్యాపింపజేశాడు. దానితో ప్రజలలో కలిగిన సంచలనం ఇంతింతకాదు.

'ఇంకేమున్నది - హిట్లర్ వచ్చి పడుతున్నాడు గదా!' అని నాజీలు తమ పక్షానికి చెందని వారిపై దౌర్జన్యాలు చెయ్యసాగారు. నాజీ కాని వాడు ఇల్లు విడిచి బయటకు వెడితే ముప్పు నోరువిప్పి మాటాడితే ముప్పు; కన్నెత్తి చూస్తే ముప్పు; జర్మన్ జాతికి చెందినవాడు విధిగా నాజీ పార్టీకి చెంది ఉండాలి; హెర్లిన్ నాయకత్వాన్ని ఆమోదించి తీరాలి. లేకపోతే, అతడు జాతి ద్రోహి; దేశద్రోహి. అతడికి ఎక్కడా ఉద్యోగం దొరకదు; వైద్య సహాయం లభించదు; అప్పుపుట్టదు; చివరికి పలకరించే వాడైనా ఉండడు. సంఘం నుంచి అతడి మీద పూర్తిగా వెలి. ఇక జర్మన్ జాతికి చెందనివారు కేవలం శత్రువులు! వారిని చీల్చి చెండాడ వలసిందే! దీనితో సూడెటెన్ జర్మనీలో బ్రతుకు దుర్భరమైంది. నాజీ పార్టీ వారిలో వెర్రి ఆవేశం; ఆ పార్టీకి చెందనివారిలో అంతులేని నిస్పృహ.

“మేము నాజీలు పెడుతున్న బాధల్ని పడలేకుండా ఉన్నాం! మాకు తగిన రక్షణ ఇవ్వవలసింది” అని అనేకులు సూడెటెన్ ప్రాంతం నుంచి ప్రాగ్ ప్రభుత్వానికి విన్నపాలను పంపుకున్నారు. ఈ విన్నపాలను మన్నించడమా? మన్నించి, హెర్లిన్ పార్టీపై నిషేధాన్ని ప్రకటిస్తే, దీన్ని సాకుగా పెట్టుకుని హిట్లర్ దాడి జరుపుతాడేమో! మన్నించకపోతే, నాజీలు మరింత చెలరేగరా? ఇది పెద్ద చిక్కు అయింది. ప్రభుత్వ వర్గంలోనే కొందరు “నాజీ పార్టీపై చర్య జరిపి తీరవలసిందే!

హిట్లర్ దాడి జరపాలంటే ఈ సాకు కాకపోతే ఇంకొకటి దొరకుతుంది. సాకుల కేమి కొదవా? అంచేత, హిట్లరకు ఎక్కడ సాకు దొరుకుతుందోనని మన బాధ్యతను మనం నిర్వర్తించక పోవడం తప్పు. ఇది చివరికి మన కొంప తీస్తుంది. నాజీ దౌర్జన్యాలను మొదటిలోనే తుంచివెయ్యాలి” అని వాదించారు. మరికొందరు “తొందరపాటు కూడదు. ప్రస్తుతంలో నాజీల పై ఏమి చర్య జరిపినా పరిస్థితులు శ్రుతి మించుతాయి. ఫ్రాన్సు, బ్రిటన్ రాజ్యాలు కూడా తొందరపడి, నాజీలను రెచ్చగొట్ట వద్దని సలహా చెబుతున్నవి. అంచేత మనం చూచీ చూడనట్టు వూరుకోవడమే మంచిది,” అని అన్నారు. చివరికి ఈ రెండవ పక్షం వారి వాదమే నెగ్గింది. పోలీసులు గుడ్లు అప్పగించి చూస్తూ ఉంటే, నాజీలు మరింత విజృంభించ సాగారు.

నానాటికి పరిస్థితులు విషమించడాన్ని కనిపెట్టి, సూడెటెన్ జర్మనులను సంతృప్తి పరచి, శాంతిని నెలకొల్పాలనే ఉద్దేశంతో 1938 మార్చి 28వ తేదీ నాడు జెక్ ప్రధాని డాక్టర్ హోడ్జా....

13

హోర్డా స్లోవక్ జాతివాడు. అతడు పుట్టిందీ, పెరిగిందీ హంగరీలో.

హోద్దా పూర్తి పేరు, - మిలాన్ హోడ్జా. అతడి తండ్రి “ప్రొటెస్టంట్ క్లెర్జిమన్" ముందు హంగరియన్ “గ్రామర్ స్కూల్" లోనూ, తర్వాత జర్మన్ “గ్రామర్ స్కూల్"లోను చదువుకుని, ఆ పిమ్మట అతడు బుడాపెస్ట్ కళాపరిషత్తులో చేరాడు. దానిలో విద్యాభ్యాసం చేస్తూ అతడు - తన పందొమ్మిదవ యేట - హంగరీ దాస్యం క్రింద కుంగిపోతూ ఉన్న స్లోవక్, సెర్బ్, రుమేనియన్ జాతులకు చెందిన విద్యార్థుల్ని చేర్చి ఒక సంఘాన్ని స్థాపించాడు. ఈ నేరానికి అతడిని కళాపరిషత్తు నుంచి బర్తరఫ్ చేశారు. అందు మీదట అతడు బుడాపెస్ట్ నుంచి, వియన్నా వెళ్ళి, అక్కడ తత్వశాస్త్రంలో డాక్టరేట్

సంపాయించుకున్నాడు. వియన్నాలో చదువుకుంటున్న రోజులలో అతడు ఒక స్లోవక్ పత్రికను స్థాపించి, దాని ద్వారా తన రాజకీయ ప్రతిభను చాటినాడు.

మాజరిక్ వలెనే హోర్డాకూడా బహుభాషా కోవిదుడు. ఇంగ్లీషు, ఫ్రెంచి, జర్మన్, సెర్బియన్, హంగరియన్ భాషలలో అతడు ధారాళంగా ఉపన్యసించగలడు. బెనిస వలె అతడు రాజ నీతిచతురుడు కూడా. అయితే, బెనిలా చర్చలు చెయ్యడం అంటే అతడికి తలనొప్పి. చకపిక పనిజరగడం - ఇదే అతడు కోరేది. కార్యసాధనపట్ల అవసరమైతే రాజీకి దిగడానికి అతడు సంకోచించడు. ఏదైనా ఒక నిర్ణయానికి రావడానికి ముందు "దాన్ని న్యాయశాస్త్రం అంగీకరిస్తుందా? ధర్మశాస్త్రం ఆమోదిస్తుందా? పూర్వం జరిగిన ఒడంబడికలకు ఇది భిన్నం కాదుగదా?" అని బెనిస్ స్తనశల్య పరీక్ష చేస్తాడు. ఇదే పరిస్థితిలో హోర్డా చేసే పరీక్ష వొక్కటే - "ఈ నిర్ణయం దేశానికి క్షేమదాయకమా, కాదా? అని.

ఈ ప్రవృత్తిని సరిగా అర్థం చేసుకోలేక హోద్దా అంటే అనేకులు అపోహపడుతూ ఉంటారు. అతడు ఆశాపరుడనీ, అవినీతిపరుడనీ కూడా కొందరు సూచిస్తారు. గత ఐరోపా సంగ్రామానికి పూర్వం హంగరియన్ పార్లమెంటులో స్లోవక్ జాతివారికి డాక్టర్ హోద్ధ ఏకైక ప్రతినిధిగా ఉండేవాడు. ఈ సమయంలో అతనికి ఆర్చ్ డ్యూక్ ఫెర్దినాండ్ లో మంచి స్నేహం కుదిరింది. 1914లో సెరిజివో వద్ద ఈ ఫెర్దినాండ్ ను హత్యచేయడం వల్లనే గత మహాసంగ్రామం ప్రారంభమైంది. ఆస్ట్రో - హంగరియన్ సామ్రాజ్యం విచ్ఛిన్నం కాకుండా ఉండాలంటే, దానిలోని విభిన్న జాతులకు రాష్ట్రీయ స్వపరిపాలనాధికారాన్ని ప్రసాదించడం అవసరమని ఫెర్దినాండ్ గుర్తించాడట. తాను రాజ్యాధికారానికి రాగానే ఆ పని చెయ్యాలని కూడా అతడు సంకల్పించాడట. ఆ రాకుమారుడితో హోర్డాకు మైత్రి కుదరడానికి ఇదే కారణమని కూడా అంటారు.

ఐరోపా మహాసంగ్రామం ప్రారంభం కావడానికి చాలా పూర్వమే డాక్టర్ హోద్గా మాజరిక్ తోను, జెక్ జాతీయోద్యమంతోను సంబంధం కుదుర్చుకున్నాడు. జెక్, స్లోవక్ జాతులు రెండూ చేరి, ఒక రాజ్యంగా ఏర్పడాలనే సూచనను ప్రప్రథమంగా చేసిన వారిలో అతడొకడు.

ఈ 1914 నాటి యుద్ధప్రకటన జరిగిననాడే, హోడ్డాను అరెస్టుచేసి, వియన్నాలో నిర్బంధించారు. (ఇన్టర్న్ చేశారు.) అయితే, నిర్బంధంలో ఉండికూడా, అతడు జెక్ నాయకులతో సహకారాన్ని చేస్తూనే ఉన్నాడు.
1918 అక్టోబర్ లో అతడు బుడాపెస్ట్ నగరానికి వెళ్లి, హంగరియన్ ప్రజాస్వామిక రాజ్యప్రకటనను తిలకించాడు. ఆనాడే అతడక్కడ స్లోవక్ జాతుల సమావేశాన్ని జరిపి, స్లోవక్ జాతికి ఇక హంగరీతో సంబంధం లేదనే తీర్మానాన్ని చేయించాడు. తీర్మానంతో వెయ్యి సంవత్సరాల హంగరియన్ దాస్యం అంతరించి పోయిన దన్నమాట! అబ్బ! ఈ వెయ్యి సంవత్సరాలలో స్లోవక్ జాతివారు ఎన్ని కష్టాల్ని, ఎంతటి నరకాన్ని అనుభవించవలసి వచ్చింది!! అసలు ఆ జాతిని నిర్మూలం చెయ్యాలనే ప్రయత్నం కూడా జరిగింది. ఈ ప్రయత్నం కొంత వరకు సఫలమైంది కూడా! 1914లో జాతీయ భావప్రేరితమైన స్లోవక్ కుటుంబాలు వెయ్యికంటే అధికంగా లేవు. అయితే మాత్రమేమి? స్టిఫానిక్, హోద్గా మొదలైన స్వతంత్రారాధకులున్నారు గదా? ఏ జాతి అయినాసరే, విముక్తి పొందడానికి ఇలాంటివారు ఒక్కరైనా చాలు! హంగరీతో ఇక తమకు సంబంధం లేదనే తీర్మానాన్ని తీసుకుని అతడు ప్రాగ్ నగరానికి ప్రయాణమయ్యాడు. అతడక్కడకు చేరుకొనకముందే, జెకోస్లోవేకియా స్వతంత్ర రాజ్యప్రకటన జరిగింది.

ఈ స్వతంత్ర రాజ్య రాయబారిగా డాక్టర్ హోద్దాను బుడాపెస్టు (వెనక్కు పంపించారు. ఈ పదవిలో అతడు అసమాన ప్రతిభను ప్రదర్శించాడు.

తర్వాత 1919లో హోద్గా మంత్రిపదవిని పొందాడు. ఆ తర్వాత అతడు ఎన్నో పదవుల్ని అలంకరించాడు. ఏ పదవిని స్వీకరించినా, దాన్ని సమర్థతతో నిర్వహించాడుగాని, ముఖ్యంగా వ్యావసాయిక మంత్రిపదవిలో అతడు రాణకెక్కాడు. వరసగా అనేక మంత్రివర్గాలలో ఈ పదవినే నిర్వహించాడు. క్రమంగా అతడు కర్షక (కన్సర్వేటివ్) పక్షానికి నాయకుడయ్యాడు. జెకొస్లోవేకియా పార్లమెంటులో పెద్ద పార్టీ ఈ కర్షక పక్షమే! ఈ పక్షానికి నాయకుడైనందువల్లనే 1935లో డాక్టర్ బెనిస్ అధ్యక్షుడైనప్పుడు, అతడి స్థానంలో హోద్గా ప్రధానమంత్రి అయ్యాడు.

14

నానాటికి పరిస్థితులు విషమించడాన్ని కనిపెట్టి, సూడెటెన్ జర్మనులను సంతృప్తిపరచి, శాంతి నెలకొల్పాలనే ఉద్దేశంతో 1938 మార్చి 28వ తేదీనాడు డాక్టర్ హోద్గా మైనారిటీ సంఘాల హక్కుల విషయమై తాము ఒక కొత్త చట్టాన్ని చెయ్యమన్నామని ప్రకటించాడు. ఈ కొత్త చట్ట నిర్మాణం విషయంలో తక్కిన అన్ని మైనారిటీ సంఘాలతో పాటు సూడెటెన్ జర్మన్ మైనారిటీ సంఘాన్ని కూడా సహకారం చెయ్యవలసిందిగా అతడు కోరాడు. హెర్లిన్ ఈ కోర్కెను పూర్తిగా తిరస్కరించాడు. ఇంతటితో ఆగక, "మా కనీసపు కోర్కెలు ఇవి!" అంటూ అతడు ఏప్రిల్ 24వ తేదీ వాడు కార బాలో ఒక ఉపన్యాసాన్ని ఇచ్చాడు. అతడు ఈ ఉపన్యాసంలో తెలిపిన కోర్కెలు ఇవి:

1. జెక్ జాతివారికీ, జర్మన్ జాతివారికి అన్నిటిలోను సమానమైన ప్రతిపత్తి ఉండాలి
2. సూడెటెన్ జర్మనులను ఒక ప్రత్యేకజాతిగా అంగీకరించాలి
3. సూడెటెన్ జర్మన్ రాజ్యభాగం సరిహద్దుల్ని నిర్ణయించాలి.
4. జర్మన్ రాజ్యభాగంలో జర్మనులకు - వారి మంచి చెడ్డలకు సంబంధించినంత వరకు పూర్తి స్వపరిపాలనాధికారాన్ని ఇవ్వాలి.
5. తన జాతికి చెందినట్టి రాజ్యభాగంలో నివసిస్తున్న జర్మన్ పౌరులకు తగిన రక్షణ ఉండాలి.
6. 1918 లగాయతు సూడెటన్ జర్మనులకు జరిగిన అన్యాయాలను తొలగించాలి; ఉచితమైన నష్టపరిహారాల్ని చెల్లించాలి.
7. జర్మన్ రాజ్యభాగంలో జర్మనులే ప్రభుత్వోద్యోగులుగా ఉండాలనే సూత్రాన్ని అంగీకరించాలి.
8. జర్మన్ జాతీయతను,జర్మన్ రాజకీయతత్వాన్ని(నేషనల్ సోషలిజం)అనుసరించడానికి సంపూర్ణ స్వాతంత్ర్యం ఉండాలి.

ఈ కోర్కెలను అంగీకరించడమే కాకుండా, మూడు విషయాలలో వెంటనే మార్పు జరగాలని గూడా హెర్లిన్ అన్నాడు. ఆ మార్పులు ఏమంటే - జెక్ జాతి వొకటి ఉన్నదనీ, దానికి ఒక గతచరిత్ర ఒక భావిపరిణామం ఉన్నదని అనుకోడం పొరపాటు అని గుర్తించాలి.

జర్మన్ జాతి విజృంభణాన్ని జెకొస్లోవేకియా అరికట్టాలనే ఆశయం మార్చుకోవాలి.
ప్రస్తుతం జెక్ రాజ్యం అవలంబిస్తున్న విదేశాంగనీతిని విసర్జించాలి.
హెర్లిన్ కోరిన ఈ కోర్కెలకు ఇంత కంటె, "హెర్లిన్ పెట్టిన ఈ షరతులకు" అనడం ఎక్కువ సమంజసమేమో! - అంగీకరించడం జెకోస్లోవేకియా విచ్ఛిన్నానికి బీజాల్ని నాటడమే! ఇంతేగాక, అసలు వీటిలో కొన్ని షరతుల్ని పరిపాలించడం దుస్సాధ్యం.

హెన్లీన్ పెట్టిన నాల్గవ, ఐదవ షరతుల్ని పాటించాలంటే, దేశాన్ని జెక్ భాగమనీ, జర్మన్ భాగమనీ రెండు ఖండాలు చెయ్యాలన్నమాట. కావాలన్నా, ఇల్లా చెయ్యడం సాధ్యం కాని పని. సూడెటెన్ జర్మనులందరు ఏదో ఒక ప్రాంతంలో మాత్రమే లేరు. పైగా, సూడెటెన్ జర్మనీలో వారందరూ కేవలం జర్మనులే కారు. అంచేత సూడెటెన్ జర్మనీని ఒక ప్రత్యేక రాజ్యభాగంగా విడగొట్టడం వల్ల 3,80,000 మంది జెక్కులు జర్మన్ ప్రాంతంలో చిక్కుపడి పోవడమూ, 7,30,000 మంది జర్మనులు జెక్ ప్రాంతంలో మిగిలిపోవడమూ జరుగుతుంది. దీని ఫలితం మైనారిటీల సమస్య పరిష్కారం కావడం కాదు. అది మరింత క్లిష్టం కావడం మాత్రమే!

ఇక, రెండవ, ఎనిమిదవ షరతుల ప్రకారం సూడెటెన్ జర్మనులలో నాజీలు కాని వారిని నాజీదాస్యానికి లోబడ జెయ్యడం సంభవిస్తుంది. పోతే, ఆరవ షరతు ప్రకారం 1918 నుంచి సూడెటెన్ జర్మనులతో జరిగిన (న్యాయరీత్యా జరిగిన) లావాదేవీలు అన్నీ కూడా అక్రమకృత్యాలని అంగీకరించవలసి వస్తుంది.

ఇదే విధంగా తక్కిన షరతులలో కూడా అంగీకరించడానికిగాని, ఆచరణలోకి తేవడానికి గాని వీలు లేనట్టివి. పోతే, ఇక హెన్లీన్ కోరిన మూడు మార్పుల్ని గురించి చర్చించ నవసరమే లేదు. వాటి ద్వారా అతడు జెకోస్లోవేకియాను జర్మనీకి సామంత రాజ్యాన్ని చెయ్యజూచాడు! అసలు జెక్ జాతినీ, జాతీయతనూ కొట్టివెయ్యాలట! జర్మనీ విజృంభణను ప్రతిఘటించరాదట? విదేశాంగనీతిని మార్చుకుని జర్మనీకి “జోహార్” అనాలట!

హెన్లీనకు కావలసింది పరిష్కారం కాదు; ప్రతిష్టంభన. సామరస్యం కాదు; సంఘర్షణ. శాంతి కాదు; సమరం. అంచేతనే అతడు విపరీతమైన ఈ కోర్కెల్ని కోరాడు! ఈ షరతుల్ని పెట్టాడు! ఒకవేళ జెక్ ప్రభుత్వం వీటిని అంగీకరించినా, అతడు సంతృప్తిపడేవాడా? ఇంత కంటె విపరీతమైన క్రొత్తకోర్కెల్ని, కొత్త షరతుల్ని పేర్కొనేవాడు. ఇది అతిశయోక్తిగా అంటున్న మాటకాదు. సూడెటెన్ నాజీ పార్టీ నాయకుడొకడు (చోటా హెన్లీన్) ఈ మాటను తెగవేసి చెప్పాడు కూడా. అతడి వాక్యాలు ఇవి :

“రాజీకి ఏ మాత్రం అవకాశం లేదు. ఎంచేతనంటే, ఇవి మొదటి షరతులుగాని, తుది షరతులుగావు. సూడెటెన్ జర్మనులు పెట్టవలసిన షరతులు మరి ఎన్నో ఉన్నవి. సూడెటెన్ జర్మనులు ఈనాడు ఒంటరిగా పోరాడడం లేదు. వారికి ఏడుకోట్ల ,అరవై లక్షల మంది జర్మనుల మద్దతు ఉంది.”

ఈ వాక్యాలను చూచిన తర్వాత హెన్లీన్ కార బాడ్ ఉపన్యాసం ఉద్దేశాన్ని గురించి సందేహానికి ఆస్కారం లేదు. ఆ ఉపన్యాసాన్ని ఇచ్చినందుకు న్యాయానికి అతడిని అరెస్టు చెయ్యవలసింది. జెక్ ప్రభుత్వం 1933లో సూడెటెన్ నాజీ పార్టీని బహిష్కరించింది. ఆ తర్వాతనే హెన్లీన్ తన పార్టీని లేవదీశాడు. తన పార్టీకీ, బహిష్కృతమైన నాజీ పార్టీకి సంబంధం లేదని అతడు ఇంతకాలమూ చెబుతున్నాడు. కాని, కారల్స్ బాడ్ ఉపన్యాసం వల్ల అతడి పార్టీ కలీలేని నాజీ పార్టీ అని తేలిపోయింది. అంచేత అతడిని వెంటనే అరెస్టు చేసి ఉండవలసింది. ఐతే, అతడి అరెస్టు హిట్లర్ దాడికి సాకు కావచ్చుననే భయంతో ఆ పనికి సాహసించలేకపోయారు. ఈ జంకుచూచి, హెన్లీన్ మరింత రెచ్చిపోయాడు.

15

హిట్లర్ అంతర్జాతీయ పరిస్థితుల్ని పరిశీలించాడు; జెకొస్లోవేకియా విచ్ఛేదానికి తగిన సమయం వచ్చిందని నిశ్చయం చేసుకున్నాడు. హెర్లిన్ విజృంభణానికి హిట్లర్ చేసుకున్న ఈ నిశ్చయమే కారణం.

కారల్స్ బాడ్ లో హెర్లిన్ ఉపన్యాసం చేసిననాటికి యూరప్ రాజకీయ పరిస్థితులు ఇవి.
ఆస్ట్రియా ఆక్రమణ నిర్విఘ్నంగా జరిగింది. ఒక్క తుపాకికైనా కాల్చవలసిన అవసరం లేకపోయింది. ఒక్క సైనికుడికైనా కోల్పోవలసిన అగత్యం కలగలేదు. తలుపులు తెరిచి ఉన్న ఇంటిలోకి చొరబడ్డం కంటె కూడా సులభంగా కార్య సాఫల్యం జరిగింది. మూడు మహారాజ్యాలు - బ్రిటన్, ఫ్రాన్సు, ఇటలీ రాజ్యాలు - ఆస్ట్రియా స్వాతంత్ర్య రక్షణకు బాధ్యత వహించాయి. అయినప్పటికీ వీటిలో వొక్కటి కూడా అదునుకు అడ్డుపడలేకపోయింది. "హిట్లర్ నా సామ్రాజ్యం మీద కన్ను వెయ్యకపోతే, అక్కడి కది పదివేలు! ఆస్ట్రియా ఏ గంగలో కలిస్తే నాకేమి? అనే ధోరణి కనబరిచింది బ్రిటన్. "అయ్యో! ఆస్ట్రియా జర్మనీ వశమైపోతున్నదే! జర్మనీ శక్తి ఇనుమడిస్తున్నదే!" అని గగ్గోలుపడుతూ, సరిగా వేళకు ఒక మంత్రివర్గమైనా లేక, నిస్సహాయతను ప్రదర్శించింది ఫ్రాన్సు. 'స్పెయిన్ విద్రోహం జయప్రదం కావాలంటేనూ, నా పరువు దక్కాలంటేనూ జర్మనీ సహాయం అవసరం. ఇందు కోసం ఆస్ట్రియాను తప్పనిసరిగా బలి పెట్ట వలసి వచ్చింది. మరి నే నేమి చెయ్యగలను?" అని సంతృప్తిపడింది ఇటలీ. కారణాలు ఏమైతే నేమిగాని, ఈ మూడు రాజ్యాలుకూడా మూకీ భావాన్ని వహించగా హిట్లర్ ఆస్ట్రియాను కబళించివేశాడు.

దీనితో ఆస్ట్రియాను పోలిన చిన్నచిన్న రాజ్యాలకు గుండెలలో రాయిపడ్డది. జపాను మంచూరియాను వశపరచుకున్నప్పుడు, ఇటలీ అబిసీనియాపై జైత్రయాత్ర చేసినప్పుడు, జర్మనీ లొకార్నో సంధికి విరుద్ధంగా రైన్ లాండ్ లోకి సైన్యాలను తరలించినప్పుడు, ఫసిస్టుడిక్టేటర్లు స్పెయిన్ ప్రజాప్రభుత్వం మీద విద్రోహాన్ని చేయించినప్పుడు, బ్రిటన్ ఫ్రాన్సులు అవలంబించిన రాజనీతిలోని స్వార్థాన్నీ, కపటాన్నీ చాలలేనితనాన్నీ చూచినప్పుడే "ఇక ఈ రాజ్యాల్ని నమ్మకోరాదు!" అని తోచింది.

ఆస్ట్రియా ఆక్రమణ తర్వాత ఈ భావం మరింత బలపడింది. దీనితో చిన్న చిన్న రాజ్యాలు - ముఖ్యంగా జెకోస్లోవేకియా సరిహద్దులోని రాజ్యాలు - జర్మనీ ప్రాపకం కోసం దేవుళ్లాడ నారంభించాయి.

పోలెండ్ 1934 నుంచీ కూడా ఈ ప్రయత్నంలో ఉన్నదనే చెప్పాలి. బ్రిటన్, ఫ్రాన్సుల వైఖరినిబట్టి అవి చిన్న చిన్న రాజ్యాలను జర్మనీకి బలి పెట్టడానికి సన్నద్ధపడుతున్నవని పోలెండ్ గ్రహించింది. గ్రహించి, జర్మనీ దృష్టిని(జర్మనీ రాజ్యం గుండా బాల్టిక్ సముద్రతీరానికి పోలెండ్ కు ఇచ్చిన దారి.) "పోలిష్ కారిడర్" వైపు నుంచి దక్షిణ దిశకు - ఆస్ట్రియా, జెకొస్లోవేకియాల వైపునకు - మరల్చాలనే ఉద్దేశంతో అది జర్మన్ నాజీ ప్రభుత్వానికి అనుకూలమైన విదేశాంగనీతిని అవలంబించ సాగింది. ఆస్ట్రియా ఆక్రమణ జరగగానే తమ యెత్తు పారిందని పోలెండ్ విదేశాంగమంత్రి కల్నల్ బెక్ సంతుష్టిచెందాడు. "మరి సంకోచం దేనికి? పూర్వపు నీతినే అవలంబిస్తూ, జెకోస్లోవేకియానుకూడా బలిపెట్టవలసిందే!" అని అతడు నిశ్చయించుకున్నాడు. "జర్మనీ సూడెటెన్ ప్రాంతాన్ని ఆక్రమించుకుంటే, అదే సమయంలో మేము టెస్ మైన్ పరగణాను వశపరచు కోవచ్చు"నని కూడా అతడు ఆలోచన చేశాడు. ఈ పరగణా విషయమై 1918 మొదలు 1920 వరకు, జెక్, పోలిష్ రాజ్యాల మధ్య తీవ్ర యుద్ధం జరిగింది. తర్వాత ఉభయులు రాజీకి వచ్చి చెరిసగం పంచుకున్నారు. అయితే, పరగడా అంతా కూడా దక్కలేదే అనే విచారం నాటికీ నేటికీ పోలెండ్ ను పీడిస్తూనే ఉంది. అంచేత "జర్మనీ ఎప్పుడు సూడెటెన్ ప్రాంతాన్ని ఆక్రమిస్తుందా ఎప్పుడు మేము టెన్ చైన్ పరగణాను వశపరచుకోగలమా?" అని కలనల్

బెక్ తొందరపడసాగాడు. ఇంతేకాదు. జెకొస్లోవేకియాను నష్టపరిచి పోలెండ్ సరిహద్దునూ, హంగరీ సరిహద్దునూ కలపాలని కూడా ఆశించసాగాడు. ఈ ఆశయాన్ని జర్మనీ ప్రోత్సహించడమే కాకుండా, స్లోవేకియాలో కొంత భాగాన్ని కూడా కలుపుకోవలసిందిగా సలహా చెప్పింది. "కలిస్తే స్లోవేకియా నాకు కలవాలి గాని, పోలెండుకు కలవడం కూడదు" అని హంగరీ ఆందోళన చేసే మాట నిజం. కాని, దాని నోరు కట్టివెయ్యడానికి రుమేనియాలో కొంతభాగం ఆక్రమించుకోమన వచ్చును. 1938 ప్రారంభంలో జర్మన్ వైమానిక మంత్రి జనరల్ గోరింగ్ పోలెండ్ వెళ్లి, కలనల్ బెక్ చేసి వచ్చిన కుట్ర ఆలోచన లివి! రుమేనియాకూ, పోలెండ్ కు మధ్య వైరం లేదు. పైగా యుద్ధవిపత్తులో పరస్పర సైనిక సహాయం చేసుకోవాలనే ఒడంబడిక ఉన్నది కూడా. అయినప్పటికీ హంగరీతో కలిసి, రుమేనియాకు విరుద్ధంగా కుట్ర చెయ్యవలసిందని జెనరల్ గోరింగ్ ప్రోత్సహించాడు. ఇలా చెయ్యడంలో అతడి ఆలోచన ఇది : జెకొస్లోవేకియా విచ్ఛేదంతో జర్మనీ జైత్రయాత్ర పూర్తికాదు. ఆ పైన రుమేనియాను వశపరచుకోవాలి; సోవియట్ యూక్రెయిన్ రాష్ట్రాన్ని ఆక్రమించుకోవాలి. అంచేత జెకొస్లోవేకియా విచ్ఛేదానికి జరుగుతున్న కుట్రలోనే రుమేనియాకు చిచ్చు పెట్టడానికి కూడా ఏర్పాట్లు జరగడం మంచిది గదా!

పోలెండ్ జర్మనీతో కలిసి ఒకవైపు ఇలా కుట్రచేస్తూ ఉండగా ఇంకోవైపున హంగరీ వేస్తున్న ఎత్తులు ఇవి!

గత ఐరోపా మహాసంగ్రామానంతరం జరిగిన ట్రయనాన్ సంధి ఫలితంగా పూర్వపు హంగరియన్ రాజ్యంలో దాదాపు మూడింట రెండువంతులు జెకొస్లోవేకియా, రుమేనియా, యూగోస్లావియాలకు సంక్రమించినాయి. అన్యాక్రాంతమైన ఈ రాజ్యం యావత్తూ తిరిగి తన అధీనం చేసుకోవాలని హంగరీకి ఆశ ఉన్నది. తక్కిన రాజ్యం మాట ఎలా ఉన్నా, ముఖ్యంగా స్లోవేకియా రాష్ట్రం పునః స్వాధీనం కావాలని దాని పట్టుదల. ఈ పట్టుదల కారణంగా రుమేనియా, యూగోస్లావియా రాజ్యాలపై కంటె జెకొస్లోవేకియా పై దానికి ఎక్కువ కోపం.
ఎక్కువ కడుపుమంట. ఇట్టి స్థితిలో జెకోస్లోవేకియా విచ్ఛేదానికి అవకాశం కనబడాలేగాని హంగరీ దాన్ని చెయ్యి జారిపోనిస్తుందా?

ఆస్ట్రియా ఆక్రమణను చూడగానే ఈసారి జెకోస్లోవేకియా వంతు రాక తప్పదని హంగరీ గ్రహించింది. అప్పుడది "ఆస్ట్రియా ఆక్రమణకు చాలా సంతోషిస్తున్నాను" అని ధ్వనించే ఒక ప్రకటన చేసింది. ఈ ప్రకటనకు "జెకొస్లోవేకియా ఆక్రమణ జరిగితే, ఇంతకంటె కూడా యెక్కువగా సంతోషిస్తాను." అని జర్మనీ అర్థం చెప్పుకుంది హంగరీ తన ప్రకటన ద్వారా తెలుపదలచుకున్న భావంకూడా సరిగా ఇదే. ఇక యూగోస్లావియా సంగతి : బ్రిటన్ ఫ్రాన్సులు అవలంబిస్తున్న విదేశాంగ నీతి పర్యవసానం మధ్యయూరప్లో జర్మనీ విజృంభణ మని అది ఏనాడో ధృవపరచుకుంది. ఈ విషయమై ఈషణ్మాత్రం సందేహం ఏమైనా ఉంటే, ఆస్ట్రియా ఆక్రమణ దాన్ని పూర్తిగా తొలగించింది. అంచేత యూగోస్లావియా ప్రభుత్వం ముందుగానే మేల్కొని జర్మనీకి అనుకూలమైన విదేశాంగ నీతిని అవలంబించ సాగింది. యుగోస్లావ్ సైన్యానికి కావలసిన యుద్ధ సాధనాలు పూర్వం బ్రిటన్ నుంచి దిగుమతి అయ్యేవి. విదేశాంగనీతి మార్పు చెందడమే తడవుగా అవి జర్మనీ నుంచి దిగుమతి కానారంభించినవి. హిట్లర్ ఈ మార్పును గమనించాడు. తన విషయమై ఆ దేశానికి ఇంకా ఏమైనా భయం ఉంటే దాన్ని తీర్చి సంపూర్ణంగా సుముఖం చేసుకోవాలనే ఉద్దేశంతో యూగోస్లావియా రాజ్యం పైన తనకు ఆశలేదని నమ్మబలికాడు. సరిగా హిట్లర్ అన్నమాటలు ఇవి : "ఏ విధమైన రక్షణ లేకుండా జర్మనీ వదిలి వెయ్యగల సరిహద్దులు మూడు మాత్రం ఉన్నాయి; ఇటలీ సరిహద్దు; హంగరీ సరిహద్దు; యూగోస్లావియా సరిహద్దు." ఆస్ట్రియా ఆక్రమణకు పూర్వం జెకొస్లోవేకియా విషయమైకూడా హిట్లర్ ఇదే విధంగా అన్నాడు. అంచేత యూగోస్లావియాకు చేసిన వాగ్దానాన్ని అతడు మన్నిస్తాడనడం కల్ల. ఐతే నేమి? పోతే ఒక మాట పోతుంది. కాని దాని వల్ల ప్రస్తుతానికి పని జరుగుతుంది. తన వాగ్దానాలకు జర్మనీ డిక్టేటర్ కట్టే విలువ ఇంతే!చిన్న రాజ్యాలలోని పరిస్థితులు ఇవి. ఇక పెద్ద రాజ్యాల సంగతిని వివరించాలి.

16

"పెద్ద రాజ్యం ఏదైనా దండెత్తి వస్తుందని భయంతోస్తే, రక్షించడానికి నానాజాతిసమితి ఉన్నది గదా అని ధైర్యంతో ఉండగల రాజ్యం ఈనాడు యూరప్ లో ఒక్కటైనా ఉన్నదా? లేదు" అని 1938 మార్చి 7వ తేదీనాడు బ్రిటిష్ ప్రధాని నెవెల్లీ ఛేంబర్లేన్ బహిరంగంగా ప్రకటించాడు. ఈ ప్రకటన అర్థం ఇది : అన్యాయంగా ఏదైనా ఒక రాజ్యం ఇంకొక రాజ్యం మీద యుద్ధానికి దిగితే, తక్కిన అన్ని రాజ్యాలు అన్యాయానికి గురైన దాని సహాయానికి వెళ్ళాలనే నానాజాతి సమితి మూలసూత్రం మట్టి గలిసి పోయిందన్నమాట! ఇక ముందు బలవంతుడిదే రాజ్యమన్నమాట! ఎవడి శక్తినిబట్టి వాడు నిస్సంకోచంగా, నిర్భయంగా, నిర్విఘ్నంగా జైత్రయాత్రను సాగించ వచ్చునన్నమాట!!! ఇది ఆస్ట్రియాను ఆక్రమించుకోడానికి తనకు బ్రిటిష్ ప్రధాని పంపించిన ఆహ్వానమని హిట్లర్ అనుకున్నాడు. తర్వాత వారమైనా గడవక ముందే ఆస్ట్రియా పై విరుచుకుపడ్డాడు.

1938 మార్చిలో బ్రిటిష్ విదేశాంగనీతి ఈ విధంగా ఉన్నది. ఇక, ఏప్రిల్ లో - ఆస్ట్రియా ఆక్రమణ తర్వాత - దానిలో మార్పు కలిగిందా? అలా అనుకోవడానికి అవకాశం కనబడదు. " జరిగింది ఏమో, జరిగింది. ఇక జెకొస్లోవేకియాపైన దౌర్జన్యం చేస్తే మేము సహించము సుమా!" అని ప్రకటించమంటే, బ్రిటిష్ ప్రభుత్వం అందుకు అంగీకరించలేదు. "మధ్య యూరప్ వ్యవహారాల జోక్యం మాకు వద్దు" అనే దాని ధోరణిలో మార్పులేదు.
పైగా, ఇటలీతో రాజీకి రావాలని ఛేంబర్లేన్ తొందరపడుతున్నాడు. "ముస్సోలినీతో ఈ ఒడంబడికను అమలు జరిపించ లేకపోతే, నాగడ్డి నేను కరుస్తాను" ("I shall eat my hay") అని అతడన్నాడు.

"యూరప్ ఖండాన్ని ప్రజాస్వామ్యాలు, నియంతృత్వ రాజ్యాలు అని రెండు విభిన్న కేంద్రాలుగా విభజన చెయ్యరాదు" అని కూడా అతడు వాదిస్తున్నాడు. అంటే, - బ్రిటన్, ఫ్రాన్సు, రష్యా, జెకోస్లోవేకియా రాజ్యాలు ఒక్కటై, ఇటలీ జర్మనీలను ప్రతిఘటించడం అతనికి ఇష్టం లేదన్నమాట! అంచేత ఇటలీతో ఒడంబడిక కుదురగనే, జర్మనీతో గూడ అతడు ఒడంబడికకు రావడానికి యత్నిస్తాడు. ఏ రాజ్య సౌఖ్యం కోసం రేపు దేవులాడ బోతున్నాడో, ఆ రాజ్యాన్ని ఈనాడు ఏ , వ్యక్తి అయినా ప్రతిఘటిస్తాడా? ఇది అసంభవం.

పైగా, ఇటలీ - జర్మనీల ఆశయాలపట్ల విరోధభావమున్న ఆంథోనీ ఈడెన్ పదవీభ్రష్టుడైనాడు. అతడి స్థానంలో హాలి ఫాక్సు ప్రభువు విదేశాంగమంత్రి అయ్యాడు. లేడీ యాస్టర్ చెప్పినమాట హాలిఫాక్సు ప్రభువు కాదనడు. (జర్మనీ విదేశాంగ మంత్రి ఈ పదవిని స్వీకరించడానికి ముందు లండన్లో జర్మన్ రాయబారి.) రిబ్బన్ ట్రాప్ లేడీ యాస్టర్ అభిమానం సంపాయించుకున్నవాడు. అంచేత బ్రిటిష్ విదేశాంగమంత్రి జర్మనీపట్ల ప్రాతికూల్యం వహించడంకల్ల. ఇలా అనుకోడానికి - అన్నట్టు ఇంకొక కారణం కూడా ఉంది.

లండన్ ''టైమ్స్'' పత్రిక ఎడిటరు అయిన జెఫ్రెడాసన్ హాలి ఫాక్సు ప్రభువు ఆబాల్యమిత్రులు. డాసన్ జర్మనీకి పూర్తిగా అనుకూలుడు. అంచేత హాలిఫాక్సు ప్రభువు కూడా అనుకూలుడు కావడం సహజం. ఇవి కేవలం ఊహలు మాత్రమే కావు. విదేశాంగ మంత్రి పదవిని స్వీకరించకముందే, అతడు జర్మనీకి ఒకసారి రావడమూ "వలస రాజ్యాల విషయమై తగవు పెట్టనంతవరకు జర్మనీ మధ్యయూరప్ లో ఏ ఆట ఆడినా మాకు సమ్మతమే!" అని సూచించి వెళ్ళడమూ జరిగింది.

బ్రిటిష్ ప్రధానీ, బ్రిటిష్ విదేశాంగ మంత్రీ అనుకూలంగా ఉన్నపుడు, బ్రిటిష్ ప్రభుత్వమే అనుకూలంగా ఉన్నట్టు గదా! అంచేత జెక్ రాజ్య విచ్ఛేదం జరిపే సందర్భంలో బ్రిటన్ ప్రాతికూల్యం ఉండదని హిట్లర్ తీర్మానించు కున్నాడు. పోతే,

ఫ్రాన్సు సంగతి : ఆస్ట్రియా ఆక్రమణకు నివ్వెరపోయి - గగ్గోలుపడి - విచారించి - కోపాన్ని తెచ్చుకుని - "అయినదేమో అయింది. కాని, జెకొస్లోవేకియాపై దండెత్తితే మాత్రం, ఇతర రాజ్యాలతోడ్పాటు కోసం ఆగకుండా ప్రాగ్ ప్రభుత్వ సహాయానికి వెడతాను" అని ఫ్రాన్సు ప్రకటించిన మాట నిజం. కాని, ఈ పట్టుదల చివరి వరకు ఉంటుందా? ఒక వేళ ఉన్నా నెగ్గుతుందా? ఈ ప్రశ్నలకు "జై" నని జవాబు చెప్పడం కష్టం. ఫ్రాన్సులో "పాపులర్ ఫ్రంట్" (నాజీ ఫాసిస్టు తత్వాలను ప్రతిఘటించటానికి జరిగిన విభిన్న ప్రజాపక్ష సమ్మేళనం) మంత్రివర్గం కూలి పోయింది. దలదియర్ ప్రభుత్వం ఏర్పడింది. ఈ ప్రభుత్వానికి ప్రజలతోడ్పాటు తక్కువ. ఇది అవలంబిస్తున్న విధానాన్ని నిరసించడానికి దేశంలో అనేక చోట్ల సమ్మెలు సాగుతున్నవి. పూర్తిగా కేపిటలిస్టు దృక్పథంగలది ఈ ప్రభుత్వం. దీన్ని సమర్థిస్తున్న వారిలో అనేకులకు ఫేసిజం అంటేనూ, నాజీజం అంటేనూ అభిమానం ఉన్నట్టి వారు. ఇటలీతోనూ, జర్మనీతోనూ రాజీపడాలని వీరు కోరుతున్నారు. రష్యాతో జరిగిన సంధిని రద్దుపరచాలని కూడా వీరి పట్టుదల. అంచేత వీరు జెకోస్లోవేకియా రక్షణ కోసం జర్మనీతో యుద్ధానికి దిగడానికే వొప్పుకోరు. పోనీ, వీరు వొప్పుకుంటారనే అనుకుందాం.

అప్పుడైనా బ్రిటన్ సహకారం లేనిదే, జర్మనీని ఢీ కొనడానికి ఫ్రాన్సు సాహసిస్తుందా? జెకోస్లోవేకియా కంటె కూడా స్పెయిన్ దేశం ఫ్రాన్సు రక్షణకు ఎక్కువ ముఖ్యం.

స్పెయిన్లో ప్రతికూల ప్రభుత్వం ఏర్పడిందంటే, ఫ్రెంచి వలస రాజ్యాలలోని సైనికులు ఆపత్సమయంలో ఫ్రాన్సు సహాయానికి రావడం కష్టం. అయినప్పటికీ స్పెయిన్ రక్షణకు ఫ్రాన్సు పూనుకోలేక పోయింది. తనకు ప్రతికూలమైన జర్మనీ ఇటలీ రాజ్యాలు అక్కడ (స్పెయిన్లో) కాలూనుతూ ఉంటే, బ్రిటన్ కొంగుల్ని పట్టుకుని, అది (ఫ్రాన్సు) తటస్థ విధాన కపట నాటకాన్ని సాగిస్తున్నది.

ఆస్ట్రియా విషయంలో కూడా అది ఇలాంటి నిస్సహాయతనే చూపింది. అంచేత బ్రిటన్ సహకారం లేనిదే దాని నాయకత్వం లేనిదే - ఫ్రాన్సు తనంతట తానుగా జెకోస్లోవేకియా కోసం యుద్ధానికి దిగడం కల్ల.

ఒక వేళ అది నిజంగానే యుద్ధానికి దిగుతుందనే అనుకుందాం. అప్పుడైనా జెకొస్లోవేకియా విచ్ఛేదం కొంత కష్ట సాధ్యం అవుతుందిగాని అసాధ్యం మాత్రం కాదు. ఒక పక్షం రోజుల పాటు ఫ్రెంచి సైన్యాలను పడమటి సరిహద్దులో అరికడితే, ఈ లోపుగా జెక్ రాజ్యాన్ని చీల్చి చెండాడ వచ్చును. అప్పుడిక స్వరూప వినాశనమై పోయిన ఒక రాజ్యం కోసం ఫ్రెంచి ప్రజలు యుద్ధాన్ని సాగిస్తారా? తమకుగాని, తమదేశానికిగాని, ప్రత్యక్షంగా ముప్పురాని పరిస్థితులలో ఫ్రెంచి ప్రజలు యుద్ధం అంటే విముఖత చూపుతారు. అంచేత వారు యుద్ధాన్ని సాగించడం అసంభవం. ఈ యోచనలన్నింటినీ చేసి, ఫ్రాన్సు ప్రాతికూల్యాన్ని కూడా హిట్లర్ కొట్టివేశాడు. ఇక రష్యాసంగతి :

యుద్ధం సంఘటిస్తే, రష్యా జెకొస్లోవేకియాకు సైనిక సహాయాన్ని చెయ్యాలని ఒక సంధి ఉన్న మాట వాస్తవం. అయితే ఫ్రాన్సు దేశం జెక్ రాజ్య సహాయానికి వెళ్ళిన తర్వాతగాని, ఈ సంధి అమలులోకి రాదు. అసలు ఫ్రాన్సు సహాయానికి వెళ్లడమే అనుమానంగా ఉన్నప్పుడు, రష్యాను గురించి భయం దేనికి? ఇలాకాక, ఫ్రాన్సు నిజంగా సహాయానికి వెళ్ళినప్పటికీ, రష్యన్ సైన్యాలు జెకోస్లోవేకియా రక్షణకు రావడం కష్టం. జెక్ రాజ్యాన్ని చేరుకోవాలంటే, అవి పోలెండ్ గుండానైనా రావాలి; రుమేనియా ద్వారానైనా రావాలి. పోలెండ్ గుండా రావడానికి పోలిష్ ప్రభుత్వం ససేమిరా ఒప్పుకోదు. రుమేనియా అయినా వొప్పుకోవడం కష్టమే! ఒకవేళ అది వొప్పుకున్నా, సైన్యాలను దించడానికి సరైన రైలు మార్గం లేదుసరికదా, కనీసం రోడ్లు అయినా లేవు. ఈ చిక్కును తప్పించుకుని రష్యన్ సైన్యం రాగలిగినా, పోలెండ్ - హంగరీలు వాటిని అడ్డి వెయ్యగలవు. పోతే, ఒక్క రష్యన్ యుద్ధవిమానాలదే భయం. కాని ఈ ఒక్క భయం కొద్దీ వెనకాడడం తగదు.

ఈ రీతిగా హిట్లర్ రష్యాను కూడా కొట్టివేశాడు. ఇక ఇటలీ సంగతి :
జర్మనీకి ఇటలీ స్నేహం ఎంత అవసరమో, ఇటలీకి జర్మనీ స్నేహం అంత అవసరం. అంత కంటె ఎక్కువగా అవసరమేమో కూడా! స్పెయిన్ వ్యవహారం ఇంకా తెగలేదు. అబిసీనియాలో శాంతి ఏర్పడలేదు. మెడిటరేనియన్ విషయమై బ్రిటతో రాజీ కుదరనే లేదు. పైగా రెండు యుద్ధాల వల్ల దేశం దివాళా స్థితిలో ఉన్నది. కొంత సైన్యం అబిసీనియాలోనూ, కొంత స్పెయిన్లోనూ, కొంత లిబియాలోనూ చిక్కుపడి ఉన్నాయి. ఆస్ట్రియా ఆక్రమణ జరగ నిచ్చిన తర్వాత మధ్య యూరప్లో పలుకుబడి కూడా చచ్చింది.

అయ్యో! "జెకోస్లోవేకియా కూడా జర్మనీ వశమైపోతే, అది మహాశక్తివంతమైన రాజ్యమైపోదూ!" అని లోలోపల ఆవేదనపడితే పడవచ్చును. కాని, బహిరంగంగా ప్రతిఘటించడానికి అది సాహసించదు. ఇంతే కాదు. అవసరమైతే, అది జర్మనీకి సహాయపడుతుంది.

ఈ పరిస్థితులన్నిటినీ హిట్లర్ తరిచి చూచుకున్నాడు; తనకు తిరుగులేదనుకున్నాడు. అతడు ఈ నిశ్చయానికి వచ్చిన మీదటనే కార బాలో హెర్లిన్ ధైర్యంగా ఉపన్యసించడం జరిగింది.

17

జెకొస్లోవేకియాపై దూకడానికి ఒకవైపున హిట్లర్ ఆయత్తపడుతున్నాడు. ఇంకోవైపున బ్రిటన్ మధ్యయూరప్ భవిష్యత్తును గురించి తన వైఖరిని స్పష్టపరచడం లేదు. జర్మనీ జెక్ రాజ్యం మీద దాడిజరిపితే, ఫ్రాన్సు జెక్ రాజ్యసహాయానికి వెడితే, బ్రిటన్ ఫ్రాన్సు అండను నిలుస్తుందా? లేదా? ఈ ప్రశ్నకు సమాధానాన్ని తెలుసుకోవడం అత్యవసరం. రాయబారి ద్వారా ప్రయత్నిస్తే ఇందుకు తగిన సమాధానం రాలేదు. అంచేత స్వయంగానే వెళ్ళి తెలుసుకుందామని ఫ్రెంచి మంత్రులు - ప్రధానమంత్రి దలదియర్; విదేశాంగ మంత్రి బానే ఏప్రిల్ చివరివారంలో లండన్ నగరానికి వెళ్లారు.

అప్పుడు జెక్ సమస్యా పరిష్కారానికి బ్రిటన్ చేసిన సూచన ఇది : జెకొస్లోవేకియా తనకు ఫ్రాన్సు, రష్యాలతో ఉన్న ఒడంబడికల్ని రద్దుచేసుకోవడం; జర్మనీతో ముఖాముఖి రాయబారాల్ని నడిపి, తగవు తెంచుకోవడం. ఈ సూచనకు అది "న్యూట్రలైజేషన్" అని పేరు పెట్టింది. ఈ "న్యూట్రలైజేషన్" ఫలితం : జెకొస్లోవేకియా జర్మనీకి సామంత రాజ్యం కావడం; యూరప్ సర్వస్వమూ హిట్లరు పాదాక్రాంతం కావడం. ఇలాంటి ఫలితం కలుగు తుందనే సంగతి బ్రిటనకు కూడా తెలుసు. తెలియబట్టే అసలు అది ఈ సూచన చేసింది కూడా! "జెకొస్లోవేకియా హిట్లర్ ఆధిపత్యాన్ని అంగీకరించవలసిందే" అని చెప్పడం ధర్మంగా కనబడదు. అంచేత అది "న్యూట్రలైజేషన్" అనే మృదువైన పదాన్ని ఉపయోగించింది- అంతే! బ్రిటన్ చేసిన సూచన ఆలోచించడానికైనా వీలులేదని ఫ్రెంచి మంత్రులు ఖండితంగా చెప్పారు. జెక్ రాజ్యంపైన హిట్లర్ యుద్ధానికి దిగితే, తాము ఆ రాజ్య రక్షణకు వెళ్ళక తప్పదని కూడా వారు స్పష్టపరిచారు. జెకొస్లోవేకియాలో కొంత మాత్రమే హిట్లర్ వశమైనా లేక, అంతా కూడా అతడి చేజిక్కినా బ్రిటనకు ప్రమాదంలేదు.

పైపెచ్చు అందువల్ల కొంతలాభం ఉన్నది కూడా. జర్మనీ వ్యాప్తిని కోరుతున్నది. దాని కోర్కెను ప్రతిఘటించడం దుస్సాధ్యం. పోతే తాను చెయ్యగల పని ఏమంటే, జర్మనీ వ్యాప్తి వల్ల తనకుగాని, తన సామ్రాజ్యానికిగాని నష్టం రాకుండా జాగ్రత్త పడ్డం. కెయిజర్ చక్రవర్తి నౌకాబలాన్ని వృద్ధి చేశాడు; సముద్రాల మీదనూ, సముద్రాల అవతల ఉన్న రాజ్యాల మీదనూ, తనకు గల ఆధిపత్యాన్ని నష్టపరచడానికి పూనుకున్నాడు. అంచేత తాను 1914లో అతడిని ప్రతిఘటించ వలసివచ్చింది. ఇక ఇప్పుడు హిట్లర్ సముద్రాల మీద ఆధిపత్యాన్ని కోరడంలేదు. బ్రిటిష్ నౌకా బలంలో జర్మనీ నౌకాబలం

మూడవవంతు ఉంటే చాలునని అతడు తనతో ఒడంబడిక చేసుకున్నాడుకూడా! పైగా, జర్మనీ యూరప్ ఖండంలోనే తూర్పు దిక్కుగా వ్యాప్తి చెందాలిగాని, ఖండాంతరాల సామ్రాజ్యాల కోసం ఆశపడగూడదని అతడు ప్రకటించాడు. అంటే, అతడికన్ను సోవియట్ రష్యా మీద ఉన్నదిగాని, బ్రిటిష్ సామ్రాజ్యం మీద లేదు. ప్రపంచంలో నుంచి అసలు సామ్రాజ్యతత్వమే రూపుమాసి పోవాలనే సోవియట్ రష్యా పై హిట్లర్ జైత్రయాత్ర చెయ్యడం తనకు సంతోషకారణమేగాని, అన్యంకాదు.

ఈ అన్ని పరిస్థితులనుబట్టి జెకోస్లోవేకియా హిట్లర్‌కు లోబడి పోవడమే మంచిది. కాని, ఫ్రాన్సు జెకొస్లోవేకియా సహాయానికి తప్పక వెడతానని అంటున్నది. ఇది గట్టి చిక్కే! జర్మనీ చేతిలో ఫ్రాన్సు దెబ్బతింటే ఆ దెబ్బ కేవలం ఫ్రాన్సుకు మాత్రమే కాదు; తనకు కూడా! ప్రపంచాధిపత్యం కోసం ఫ్రాన్సు చాలా కాలం తనతో సంఘర్షించిన మాట నిజం. కాని, చివరికి తమ వివాదం పరిష్కారమైంది. భూమండలంలో అధిక భాగాన్ని తనకిచ్చి తన నాయకత్వాన్ని అంగీకరించి, ఫ్రాన్సు ఇప్పుడు చేదోడు వాదోడుగా ఉంటున్నది. అంచేత ఫ్రాన్సు క్షేమంగా ఉన్నంత వరకే తన క్షేమం; ఫ్రాన్సు బలంగా ఉన్నంతవరకే తన బలం. పైగా, ఇంగ్లీష్ ఛానల్ అవతలివొడ్డున తనకంటె బలమైన రాజ్యంగాని, తనపట్ల శతృత్వం ఉన్న రాజ్యంగాని ఉండరాదనే సూత్రాన్ని తాను మొదటినుంచీ అవలంబిస్తున్నది. ఈ సూత్రం తన క్షేమానికి అత్యవసరం. ఈ సూత్రాన్ని అనుసరించే తాను 1914లో బెల్జియం, ఫ్రాన్సుల సహాయానికి వెళ్ళింది. తిరిగి ఇప్పుడు కూడా జెకొస్లోవేకియా విషయమై ఫ్రాన్సు జర్మనీపైన యుద్ధాన్ని ప్రకటిస్తే, తాను ఫ్రాన్సు పక్షాన్ని చేరక తప్పదు. అంచేత ముందుగానే మేల్కొని, తన సైన్యాధికారుల్ని ఫ్రెంచి సైన్యాధికారుల్ని సమావేశ పరిచి, ఉభయరాజ్యాల రక్షణ విషయమై సమాలోచనలు జరిపించడం మంచిది.

ఈ విధంగా ఆలోచించి బ్రిటన్ - అంటే, బ్రిటిష్ ప్రభుత్వం - “ఫ్రెంచి బ్రిటిష్ యుద్ధ కార్యాలయాల మధ్య వెంటనే సమాలోచనలు జరగా”లని అన్నది. ఇలా అంటూనే, జెక్ సమస్య యుద్ధానికి కారణం కాగూడదనే ఆందోళనతో “సూడెటెన్ జర్మనులతో ఎలాగైనా సరే త్వరగా రాజీపడ్డం మంచిదని నేను జెక్ ప్రభుత్వాన్ని గట్టిగా హెచ్చరిస్తాను. మీరు కూడా ఆ పని చెయ్యవలసింది.” అని ఫ్రెంచి మంత్రులకు చెప్పింది. వారు ఇందుకు సమ్మతించారు. లండన్లో ఫ్రెంచి, బ్రిటిష్ మంత్రుల మధ్య జరిగిన ఏర్పాటును అనుసరించి వారి ప్రభుత్వాల తరఫున ప్రాగ్ లో ఉంటున్న రాయబారులిద్దరు మే 7వ తేదీ నాడు జెక్ విదేశాంగ మంత్రిని సందర్శించి "ఎంత మేర వరకు సాధ్యమో అంత మేరవరకూ వెళ్ళి, సూడెటెన్ జర్మన్ సమస్యను పరిష్కరించుకోవలసింది” అని హెచ్చరించారు. “ఎంత మేరవరకు సాధ్యమో, అంత మేర వరకు” అంటే అర్ధమేమిటి? హెర్లిన్ పెట్టిన షరతుల్ని అంగీకరించమనా? ఇదే ప్రశ్నను మే 16వ తేదీని బ్రిటిష్ కామన్సు సభలో వెయ్యగా విదేశాంగశాఖ అండర్ సెక్రటరీ “జై”ననిగాని, “కా”దనిగాని చెప్పలేదు. జెక్ రాజ్యరక్షణకు భంగం కలిగించే షరతులకు గాని, దాని విదేశాంగనీతిలో మార్పు తెచ్చే షరతులకుగాని అంగీకరించవలసిందిగా బ్రిటిష్ ప్రభుత్వం వొత్తిడి పెట్టదని వాగ్దానం ఇవ్వమంటే, ఇందుకు అతడు నిరాకరించాడు.

దీన్ని చూచి, బ్రిటన్ తిరిగి తనపక్షాన ఉన్నట్టు హిట్లర్ దృఢపరుచుకున్నాడు. అంతే - వెంటనే అతడు దండయాత్ర సన్నాహాలను ప్రారంభించాడు. సాకులేకుండా దండయాత్ర సాగించడం ఎలా? అని సంకోచించవలసిన అవసరం కూడా లేదు. మే 23వ తేదీ నాడు సూడెటెన్ జర్మనీలో అనేక ప్రాంతాలలో మునిసిపల్ ఎన్నికలు జరుగనున్నవి. ఈ సందర్భంలో ఎన్నికల ప్రచారం అనే మిషతో ప్రజలలో రోషాలు పెంచవచ్చును; సంఘర్షణలు జరిపించవచ్చును. ఈ సంఘర్షణల వంకతో సైన్యాల్ని తరలించవచ్చును.

18

మునిసిపల్ ఎన్నికల ప్రారంభం మే 23వ తేదీ సోమవారంనాడు. 21వ తేదీ శనివారం నాటి రాత్రి జర్మన్ సైన్యాలు జెక్ సరిహద్దును దాటాలనీ, ఆ మర్నాడు (22 వ తేదీ ఆదివారం నాడు) హిట్లర్ సూడెటెన్ జర్మనీలో ప్రవేశించాలనీ ఏర్పాటు జరిగింది.

"ఇంకేముంది? హిట్లర్ వస్తున్నాడు! వచ్చివేస్తున్నాడు!! వచ్చిపడుతున్నాడు!!!" అని సూడెటెన్ నాజీలు విపరీతంగా చెలరేగారు. "ఎంత ప్రచారం సాగినా, ఏమి దౌర్జన్యాలు జరిగినా చూచీ చూడనట్టు వూరుకోండిగాని, ప్రచారాన్ని అరికట్టడానికీ, దౌర్జన్యాన్ని ప్రతిఘటించడానికీ ప్రయత్నించవద్దు. లేకపోతే, దీన్ని సాకుగా పెట్టుకుని, హిట్లర్ యుద్ధానికి దిగుతాడు!" అని ఫ్రెంచి, బ్రిటిష్ ప్రభుత్వాలు గట్టిగా చెప్పినవి. చాలా తెలివి తక్కువగా ప్రాగ్ ప్రభుత్వం ఈ సలహాను అంగీకరించింది. దీనితో సూడెటెన్ జర్మనీలో పూర్తిగా అరాచకం ఏర్పడింది. జర్మన్ సైన్యాలు రావడం, జెక్ ప్రభుత్వం అంతరించడం, అంతా ఖాయపడిపోయినట్టే సూడెటెన్ జర్మనులు భావించసాగారు. నాజీ వందనాన్ని బహిరంగంగా చెయ్యడం చట్టవిరుద్ధం. కాని నాజీ వందనాన్ని చేస్తూ, వీధుల వెంట ఊరేగింపులు బయల్దేరాయి. నాజీ పక్షంతో సంబంధాన్ని తెలిపే తెల్లమేజోళ్లను వేసుకు తిరగడం చట్టవిరుద్ధం. కాని, ఎవడి కాళ్ళను చూచినా తెల్లమేజోళ్ళే! "పోస్టుబిళ్లల్ని ఎక్కువగా కొనుక్కోవద్దు. ఆదివారం తర్వాత ఇవి మరి పనికిరావు" అని కొందరు సూడెటెన్ నాజీలు జర్మన్ సరిహద్దులో ఉన్న జెక్ ప్రభుత్వోద్యోగుల్ని హెచ్చరించారట. ఈ ధిక్కారం కేవలం సూడెటెన్ జర్మనీలోనే కాదు; చివరికి ప్రాగ్ నగరానికి కూడా పాకింది. అక్కడ ఏదో ఒక హోటల్ లో పనిచేస్తున్న కుర్రవాడొకడు చిల్లరగా జర్మన్ మార్కుల్ని తెచ్చి ఇచ్చాడట. "ఇవి చెల్లవు; మాకు వద్దు" అని అంటే, "త్వరలో మీరే పుచ్చుకుంటారుగా!" అంటూ వాటిని జేబులో వేసుకున్నాడట!

ఇక జర్మనీలో దండయాత్ర సన్నాహాలు పూర్తి అయినట్టే!
వేలకొలది సైనికుల్ని సార్టనీలో సమావేశపరిచారు. అయిదు వందల యుద్ధవిమానాలను బొహిమియన్ అడవులలో దాచి ఉంచారు. నాలుగు మోటారుదళాల్ని జనరల్ వాన్ రైష్ నూ ఆధిపత్యంకింద జెకొస్లోవేకియా సరిహద్దులో సిద్ధంగా ఉంచారు. "మార్చ్" అని ఆర్డర్ వెయ్యడమే తడవుగా దండయాత్ర ప్రయత్నాలు పూర్తి అయిపోయాయి.

ఈ ప్రయత్నాల్ని తాము రహస్యంగా జరిపినామని జర్మన్ అధికారులు అనుకున్నారు. కాని వీటి సంగతి వేగుల వారి ద్వారా ఎప్పటికప్పుడు ఇతర రాజ్యాలకు తెలుస్తూనే ఉంది. "రేపు రాత్రికి జర్మన్ సైన్యాలు మన రాజ్యం మీద దండయాత్ర ప్రారంభిస్తవి" అని మే 20వ తేదీ శుక్రవారం సాయంత్రము మూడుగంటలకు జెక్ సైన్యాధ్యక్షులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. "వెంటనే మనం రక్షణసన్నాహాలను సాగించాలి. ఇందుకు జనరల్ మోబిలైజేషన్ అవసరం" అని వారన్నారు. జనరల్ మోబిలైజేషన్ అంటే, రిజర్వులో ఉన్న పటాలాలను కూడా పిలిపించడం; సైనిక శిక్షణ పొందిన ప్రతి వ్యక్తినీ యుద్ధానికి సన్నద్ధపరచడం. జెక్ మంత్రులు జనరల్ మొబిలైజేషన్ అనవసరమని అభిప్రాయ పడ్డారు. "మునిసిపల్ ఎన్నికలలో సూడెటెన్ నాజీలకు పెద్ద మెజారిటీని సంపాయించి పెట్టడానికి హిట్లర్ ఈ సైనిక బలప్రదర్శనం చేస్తున్నాడుగాని, ఇది దండయాత్ర ప్రయత్నం కాదు" అని వారన్నారు. ఈ విషయం మీద రాత్రి ఎనిమిది గంటల వరకు తీవ్ర చర్చ జరిగింది. చివరికి సూడెటెన్ జర్మనీలోని పరిస్థితుల్ని బట్టి అప్రమత్తతగా ఉండడానికి వీలులేదుగనుక జనరల్ మోబిలైజేషన్ చేయించకపోయినా, కనీసం కొన్ని రిజర్వు పటాలాలను పిలిపించడం అవసరమని నిర్ణయించారు.

రాత్రి ఎనిమిది గంటలకు మంత్రివర్గ సమావేశం పూర్తి అయితే, తొమ్మిది గంటల ప్రాంతాల మోబిలైజేషన్ ఆర్డర్లు వెళ్ళినవి. సైనికుల్ని గాని, సైనికోద్యోగుల్ని గాని, వైమానికుల్ని గాని మొత్తం 1,74,000 మందిని "డ్యూటీ"లో వచ్చి చేరమని ఉత్తరువు చేశారు. మామూలు రిజర్వు సైనికులు పన్నెండు గంటల్లోనూ, స్పెషల్ రిజర్వు సైనికులు ఇరవై నాలుగు గంటలలోనూ హాజరు కావాలన్నారు. రాత్రి 10 గంటల తర్వాత గాని ఈ ఉత్తరువులు గ్రామాలకు చేరలేదు. అప్పటికి గ్రామస్థులందరు మంచి నిద్రలో ఉన్నారు. అయినప్పటికి ప్రభుత్వం పంపిన ఉత్తరువులను పరిపాలించడంలో విలంబనం జరగలేదు. "జర్మన్ సైన్యాలు వచ్చిపడ్డాయి; యుద్ధం ప్రారంభమైంది. మాతృదేశ రక్షణకు ఆయుధాల్ని పట్టాలి. ఆలస్యానికి సమయం కాదు" అని ప్రజలనుకున్నారు. తెల్లవారుఝామున మూడు గంటలకే పిలవనంపిన సైనికులలో నూటికి 70 మంది హాజరయ్యారు. ఇక సూర్యోదయం వేళకు మామూలు రిజర్వు సైనికులే గాక, స్పెషల్ రిజర్వు వారు కూడా డ్యూటీలో చేరిపోయారు. మొత్తం 1,74,000 లోను ఒక్క పదహారుమంది మాత్రం హాజరు కాలేదు. ఆస్ట్రియా ఆక్రమణ కోసం జర్మనీ జరిపిన మోబిలైజేషన్లో నూటికి 20 మంది హాజరు కాలేదు!

ఇక, బ్రిటిష్ ప్రభుత్వం సంగతి : బర్లిన్ నుంచి తమ రాయబారి పంపించిన వార్తను విని, బ్రిటిష్ మంత్రులు కలవర పడ్డారు. జర్మనీ జెకొస్లోవేకియాపై దండెత్తితే, ఫ్రాన్సు దాని సహాయానికి వెడుతుంది. తర్వాత తాను ఫ్రాన్సును అనుసరించవలసి ఉంటుంది. ఈ పని చెయ్యడం తనకు ఇష్టం లేదు. కాని, చెయ్యక తప్పదుకూడా! బెదిరించి, నదిరించి, యుద్ధంతో నిమిత్తం లేకుండా కార్యసాధన చేసుకొనక హిట్లర్ తొందరపడుతున్నాడు. ఇప్పుడు ఊరుకుంటే లాభంలేదు. "ఫ్రాన్సు యుద్ధానికి దిగితే మేము దాన్ని సమర్థింపక తప్పదు" అని హెచ్చరిస్తే అతడు దండయాత్ర ప్రయత్నం విరమిస్తాడేమో! ఇలా ఆలోచించి "జెకోస్లోవేకియా సమస్యపై యుద్ధం వస్తే, బ్రిటన్ తాటసాన్ని వహించదుసుమా!" అని బర్లి లోని తమ రాయబారిని జర్మన్ ప్రభుత్వానికి తెలియజేయమన్నారు. సర్ నెవిల్లీ హెండర్ సన్ ఈ సందేశాన్ని అందజెయ్యడానికి విదేశాంగ కార్యాలయానికి వెళ్లాడు. కాని, విదేశాంగమంత్రి రిబ్బన్ ట్రాప్ కార్యాలయంలో లేడు. అప్పుడతడు తన ప్రభుత్వపు సందేశాన్ని బారన్ వాన్ వైజాకరకు అందజేశాడు. "మేము దాడి ప్రయత్నాన్ని జరపడంలేదే! సాధారణంగా జరిగే సైనిక సంచలనమే ఇది!" అని జర్మన్ ప్రభుత్వం తరపున వైజాకర్ ప్రత్యుత్తరాన్ని ఇచ్చాడు. మర్నాటి ఉదయం తిరిగి జర్మన్ విదేశాంగ ఈ ప్రత్యుత్తరంతో సంతృప్తి పడక సర్ నెవెల్లీ ఆ కార్యాలయానికి వెళ్లి, ఈసారి హెర్ వాక్ రిబ్బన్ ట్రాప్ నే కలుసుకున్నాడు.

బ్రిటిష్ ప్రభుత్వపు సందేశాన్ని విని తప్పు ఎవరిదైనా అయితే అది మోబిలైజేషన్ చేసిన జెక్ ప్రభుత్వాని దని రిబ్బన్ ట్రాప్ తీవ్రంగా విమర్శించాడు.

జర్మనీ ధోరణి బ్రిటిష్ ప్రభుత్వానికి ఆందోళన కలిగించింది. జెక్ సైన్యం మొబిలైజ్ అయింది. ఫ్రెంచి సైన్యం మొబిలైజ్ కావడానికి సిద్ధపడుతున్నది. అగ్నిపర్వతం పొగలు కక్కుతున్నది. అది బ్రద్దలు కావడం ఈ క్షణమో! మరు క్షణమో! తిరిగి 1914 నాటి పరిస్థితులు ఏర్పడతవి. తిరిగి యూరప్ ఖండం యుద్ధజ్వాలలకు ఆహుతి అవుతుంది. దీన్ని తలుచుకుని, కలవరపడుతూ, "ఇంకొకసారి రిబ్బన్ ట్రాప్ ను కలుసుకొనవలసింది" అని బ్రిటిష్ ప్రభుత్వం వారు సర్ నెవిల్లీకి కబురు చేశారు. ఈ ఆదేశానుసారం అతడు మూడోసారి వెళ్ళేసరికి జర్మన్ విదేశాంగ మంత్రి కోపావేశంతో ఉన్మత్తుడివలె ఉన్నాడు. సర్ నెవెల్లీ మూడవసారి వచ్చేలోగా రిబ్బట్రాప్ హిట్లరును కలుసుకున్నాడట. అప్పుడు హిట్లరు కేవలం ప్రళయకాల రుద్రుడిలా ఉన్నాడట. తన నాయకుడిచేత మాటలు పడివచ్చాడేమో, రిబ్బన్ ట్రాప్ ఆ విసురు రాయబారులమీద చూపించాడు. అతడు బ్రిటిష్, ఫ్రెంచి, జెక్ రాయబారుల్ని తూలనాడాడు.

అయినప్పటికీ బ్రిటిష్ రాయబారి మే 21వ తేది శనివారం నాడు మొత్తం ఏడుసార్లు జర్మన్ విదేశాంగ కార్యాలయం చుట్టూ తిరిగాడు. ఇక లండన్లో హాలిఫాక్సు ప్రభువు జర్మన్ రాయబారి హెర్ డిక్సనను తన కార్యాలయానికి పిలిపించి, జెక్ - జర్మన్ యుద్ధం కాలక్రమాన ఆంగ్లో - - జర్మన్ యుద్ధం కాకతప్పదని స్పష్టపరిచాడు.
బ్రిటిష్ ప్రభుత్వంవారు చేసిన ఈ బెదిరింపును చూచి హిట్లర్ వెనకముందులు ఆలోచించసాగాడు. అనుకున్న పనిని అనుకున్నట్టు జరపడమేగాని, ఇంతవరకు వెనకంజ వెయ్యలేదు. ఇప్పుడు బ్రిటన్ బెదిరిస్తున్నదిగదా అని జెక్ దండయాత్రను విరమించ వలసినదేనా? ఇది లక్షాకరమైన విషయం కాదా? అయితే, జెక్ రాజ్యం అజాగ్రత్తగా ఉండగా హఠాత్తుగా పైబడి, దాని కుత్తుక నులిమి వెయ్యవచ్చుననీ, అప్పుడు గతించిపోయిన ఒక రాజ్యం కోసం ఫ్రాన్సు యుద్ధానికి దిగదనీ, అన్ని పరిస్థితులలోనూ బ్రిటన్ తాటస్థ్యాన్ని వహిస్తుందని అంచనా వేసుకుంటే, మొదటినుంచి చివరి వరకూ ప్రతిదీ ఎదురు తిరిగింది. ఆత్మ రక్షణకు జెకొస్లోవేకియా సన్నద్ధపడింది. ఫ్రాన్సు దాని సహాయానికి వెళ్ళడానికి ఆయత్తపడుతున్నది; బ్రిటన్ "నేను కూడా మీ జైత్ర యాత్రను ప్రతిఘటిస్తాను" అని తెగవేసి చెబుతున్నది. ఈ పరిస్థితులలో దండయాత్రను విరమించుకోవడం మంచిది కాదా? ఆస్ట్రియాలోకి జొరబడ్డట్టు ఇప్పుడు కూడా వూరికే జొరబడిపోవడమే అని అంత యెక్కువగా యుద్ధసన్నాహాలను చెయ్యలేదు. బవేరియాలోనూ, సాక్షనీలోనూ సైన్యాల్ని కేంద్రీకరించడమే గాని జెకోస్లోవేకియా సరిహద్దులన్నింటిలోను దండయాత్రకు ఏర్పాట్లు జరగలేదు. మరి ఇప్పుడు తెగబడ్డం తగునా? ఇలా నాలుగైదు రోజులపాటు యెడతెగకుండా ఆలోచించి, స్వయంగా ఒక నిర్ణయానికి రాలేక చివరికి మే 25 వ తేదీ బుధవారంనాడు హిట్లర్ తన మంత్రివర్గాన్ని రహస్యంగా సమావేశపరిచాడు. దీనిలో సైన్యాధ్యక్షులే కాకుండా పారిశ్రామికవేత్తలు కూడా పాల్గొన్నారు. "ఏమైనా సరే, దండయాత్ర జరిపితీరాలి!" అని నాజీ పార్టీ నాయకులు వాదించారు. "ఇప్పటి పరిస్థితులలో దండెత్తి వెడితే దీర్ఘయుద్ధం తప్పదు. దీర్ఘ యుద్ధానికి మన రాజ్యం సంసిద్ధంగా లేదు" అని సైన్యాధ్యక్షులు, పారిశ్రామిక వేత్తలు సలహా చెప్పారు. చర్చ నంతటినీ విన్న మీదట "ముప్పయి లక్షల సూడెటెన్ జర్మనుల కోసం జర్మన్ మహారాజ్యానికి ప్రమాదం రానివ్వరాదు. ఇంతకంటె అధికమైన ఫలితానికైతే మాత్రం సంకోచించేవాడిని కాను" అని హిట్లర్ అన్నాడు.

వారం రోజులపాటు తల్లడిల్లిపోయిన యూరప్ ఖండం దండయాత్ర విరమించబడ్డట్టు వినగానే ఒక పెద్ద గండం గడిచినట్టు సంతోషించింది.

19

జెకొస్లోవేకియా సైన్యాన్ని మొబిలైజ్ చెయ్యడం తోనే, ఆత్మరక్షణ కోసం అవసరమైతే అది ఏకాకిగానైనా సరే యుద్ధం చెయ్యడానికి సిద్ధంగా ఉన్నదని వివిధ రాజ్యాలు అనుకున్నవి. వెంటనే వాటి వైఖరిలో ఆశ్చర్యమైన మార్పు కలిగింది. ఆపత్సమయంలో రక్షణకు వస్తుందా, లేదా అని కొంత సందేహానికి యెడమిస్తున్న ఫ్రాన్సు "జెకొస్లోవేకియా పై దండెత్తడం నా మీద దండెత్తడమే" అని స్పష్టపరిచింది. ఫ్రాన్సుకు జెక్ రాజ్యరక్షణకు వెళ్ళవద్దని బోధచేస్తున్న బ్రిటన్ "జెక్ - జర్మన్ యుద్ధం కాల క్రమాన ఆంగ్లో - జర్మన్ యుద్ధం కాక తప్పదు సుమా!" అని హెచ్చరించింది. వొద్దున ఉండి, మన ప్రాణాల్ని మనం దక్కించుకుందామనే ధోరణిని ప్రదర్శించిన యూగోస్లావియా, రుమేనియా రాజ్యాలు "హంగరీ దాడి జరిపితే, మేము వెంటనే దాన్ని యెదిరిస్తాము" అని వర్తమానం చేసినవి. ఇక, పోలెండు తనకు ఏ పాపపుణ్యం తెలియనట్టు నటించి "మా సరిహద్దులో సైనిక సన్నాహం దేనికి!" అని ఆశ్చర్యాన్ని ప్రకటించింది! " ఇక, ఇటలీ-వైఖరి ఏమిటో స్పష్టంగా తెలయదుగాని, ఇటాలియన్ విదేశాంగ మంత్రి కౌంట్.

సియానో రోంనగరములోని జర్మన్ రాయబారిని పిలిపించి, చాలా ఆగ్రహంగా మాట్లాడాడు. "మాకు తెలియనివ్వకుండా ఆస్ట్రియా ఆక్రమణ సన్నాహాలను చేశారు; తిరిగి ఇప్పుడు అదే విధంగా జెక్ రాజ్యం పైన దండయాత్ర ప్రయత్నాలను చేస్తున్నారు. మిత్రులమైన మా పట్ల ఇంత కపటంగా ప్రవర్తించడం తగునా?" అని బహుశా అతడు కోపగించుకుని ఉంటాడు. ఈ సమయంలో ఇటలీ వైఖరికూడా కొంత మార్పు చెందిందనడానికి ఒక ప్రబల నిదర్శనం ఏమంటే, - అంతకు ముందు వరకు జెకోస్లోవేకియా మీద విషాన్ని కక్కుతున్న ఇటాలియన్ పత్రికలు హఠాత్తుగా మౌనముద్రను వహించాయి.

ఇక, జెక్ రాజ్య సరిహద్దులలోపల మోబిలైజేషన్ వల్ల కలిగిన సత్ఫలితం ఇంద్రజాల మహేంద్ర జాలాన్ని సయితం మరుపుకు తెచ్చిందనే చెప్పాలి. జర్మన్ సైన్యాలు వచ్చిపడతవని సూడెటెన్ నాజీలు అనుకుంటూ ఉంటే, అవి రాలేదు సరిగదా, జెక్ సైన్యం వచ్చి ప్రతి సరిహద్దునూ, ప్రతి రోడ్డునూ, ప్రతి బ్రిడ్జినీ కాపలా కాచింది. *(జెక్ సైనికదళాలు చీకటిలో సరిహద్దు వైపునకు వెడుతూ ఉండగా, సూడెటెన్ నాజీ పార్టీ వాడొకడు అవి జర్మన్ దళాలు అని భ్రమపడి , ముందున్న గ్రామానికి ఫోను చేశాడట. అంతట ఆ గ్రామస్థులు స్వస్తిక్ పతాకాలతో (నాజీ జెండలతో) స్వాగతమివ్వటానికి ఎదురు వచ్చారట. కోమోటే అనే చోట కూడా ఇలాంటి సంఘటనే జరిగిందట. ''సైనికదళాన్ని కలుసుకోవలసింది'' అని అక్కడి వాటర్ వర్క్స్ ఉద్యోగికి అర్ధరాత్రివేళ చెబితే , అతడు బ్రౌన్ షర్ట్ (నాజీల చొక్కా) వేసుకు తయారయ్యాడట.)* దీన్ని చూడగా వారికి కలిగిన ఆశాభంగం ఇంతింత కాదు. ఇంతకు పూర్వపు వీరావేశం, అధికారధిక్కారం, జర్మన్ జాత్యహంకారం ఏమైనవో తెలియదుగాని, ఒక్కసారిగా వారు చల్లబడిపోయారు. వీధులలో నుంచి నాజీ జెండాలు మటుమాయమై పోయినవి. తెల్లమేజోళ్ళు వెతికిపట్టుకుందామన్నా కనబడకుండా పోయినవి. అరాచక పరిస్థితులంతరించి, తిరిగి శాంతి భద్రతలు ఏర్పడ్డాయి.
అయితే ఈ సత్ఫలితం ఎంతో కాలం నిలువలేదు. ఇందుకు కారణం, జెక్ ప్రభుత్వం చేసిన ఒక పెద్ద పొరపాటు!

20

మే 20వ తేదీ శుక్రవారం రాత్రి వేళ చాలా పొద్దుపోయింది. ఒక మోటారు బైసికిల్ మీద ఇద్దరు సూడెటెన్ నాజీల జర్మన్ సరిహద్దువైపునకు పోతున్నారు. "ఎవరది" అని జెక్ సెంట్రీ గద్దించాడు. జవాబు లేదు. బైసికిల్ మరింత వేగంగా పోసాగింది. "ఆగండీ!" అని సెంట్రీ కేకవేశాడు. కాని, ఆగలేదు. చీకటిలో బైసికిల్ మరుగుపడ బోతున్నది. ఇక, జాగుచెయ్యరాదని సెంట్రీ తుపాకీ గురి పెట్టాడు; టైర్ వంక కాల్చాడు. కొండమీది నుంచి బైసికిల్ కిందికి దిగుతున్నదేమో, గురితప్పింది; ఆ ఒక్క దెబ్బకే ఇద్దరు నాజీలూ చచ్చి కిందబడ్డారు. ఇది శోచనీయమైన సంఘటన. సంతాపకరమైన విషయం. దీన్ని ఎవ్వరూ కాదనలేదు. కాని, కాల్చినాడు జెక్ సెంట్రీ, కాల్పుకు గురి అయినవారు జెక్ పౌరులు. దీన్ని గురించిన బాధ్యత పూర్తిగా జెక్ ప్రభుత్వం వారిదే! ఇతర రాజ్యాలకు దీనితో ఏమీ సంబంధం లేదు. అయినప్పటికీ కేవలం తెలితక్కువ వల్ల జెక్ విదేశాంగమంత్రి ప్రాగ్ నగరంలోని జర్మన్ రాయబారిని పిలిపించి "ఈ తప్పు జరిగింది; ఇందుకు మేము విచారిస్తున్నాము; తప్పు చేసిన వారిని శిక్షిస్తాము" అని చెప్పాడు.

ఐనా అసలు ఈ విషయాన్ని గురించి తనకు తెలియజెయ్య వలసిన అవసరమే లేదు. తెలియబరచారు. కేవలం తెలియబరచడమే కాదు; పశ్చాత్తాపాన్ని కూడా వెలిబుచ్చారు. ఇది భీరుత్వానికి నిదర్శనమని హిట్లర్ వెంటనే తీర్మానించుకున్నాడు. తనకుతోచిన షరతుల్ని పెట్టి, జెక్ ప్రభుత్వం వారిని అవమానపరచాలని నిశ్చయించుకున్నాడు. "యుద్ధరంగంలో చనిపోయినవారికి జరగవలసిన మర్యాదలు ఈ సూడెటెన్ జర్మనులిద్దరికి జరగాలి" అని మొదటి షరతు పెట్టాడు. "వీర స్వర్గాన్ని అలంకరించిన ఆ ఇద్దరు జర్మన్ జాతివారిపట్ల నాభక్తిని తెలపడానికి ఒక పూలమాలను

పంపుతాను. దాన్ని ప్రాగ్ లోని మా రాయబారి కార్యాలయపు సైనిక కార్యదర్శి నాతరపున సమాధి మీద వేస్తాడు. ఇందుకు జెక్ ప్రభుత్వం వారు అంగీకరించాలి" అని రెండవ షరతు పెట్టాడు.

ఇరవై నాలుగు గంటలసేపు తటపటాయించిన తర్వాత జెక్ ప్రభుత్వం వారు ఈ షరతులకు అంగీకరిస్తూ, సైనిక మర్యాదలు జరగడానికి వీలులేదుగాని, ఊరేగింపుతో శవాలను సమాధి స్థలానికి తీసుకువెళ్ళవచ్చు నన్నారు. అయితే నిజానికి జరిగింది శవాల ఊరేగింపు కాదు; ప్రచండమైన నాజీ ప్రచారం. జెక్ ప్రభుత్వాధికారాన్ని ధిక్కరించి జెక్ సెంట్రీ చేతులలో ప్రాణాల్ని పోగొట్టుకున్నవారికి జెక్ సరిహద్దులలోనే హిట్లర్ ఆదేశానుసారం వీరపూజలు ఎప్పుడైతే జరిగినవో, అప్పుడే తిరిగి తాము ఏ ఆట ఆడినా చెల్లగలదని సూడెటెన్ జర్మనులు స్థిరపరచు కున్నారు. ఇంతేకాదు. సైన్యాన్ని మోబిలైజు చేసి ధిక్కారాన్ని చూపినందుకు జెక్ ప్రభుత్వానికి హిట్లర్ ఈ విధంగా తగిన బుద్ధి చెప్పాదని కూడా వారు తీర్మానించుకున్నారు. దీని ఫలితం ఏమంటే తిరిగి సూడెటెన్ నాజీలు విజృంభించడం; తిరిగి సూడెటెన్ జిల్లాలలో అరాచక పరిస్థితులు ఏర్పడ్డం.

జెక్ ప్రభుత్వం వారి తెలివితక్కువ వల్ల ఏర్పడ్డ ఈ అనుకూల పరిస్థితిని హెర్లిన్ చాలా చక్కగా ఉపయోగించుకున్నాడు. జర్మన్ సైన్యాలు దండెత్తివస్తున్నాయి గదా అనే ధీమాతో కాబోలు "దేశంలో శాంతి ఏర్పడనంతవరకు ప్రభుత్వం వారితో రాయబారాలు నడిపి ప్రయోజనం లే" దని ప్రకటించి, అతడు 20వ తేదీ శుక్రవారం నాడు జర్మనీకి వెళ్ళిపోయాడు. వెళ్ళి, 23వ తేదీ సోమవారం వరకు అక్కడనే ఉండి, పరిస్థితులు తనకు పూర్తిగా ప్రతికూలం కావడాన్ని చూచి, మరి బింకంపోవడం వల్ల లాభం లేదని అనుకుని, తిరిగి ప్రాగ్ నగరం చేరుకున్నాడు. చేరుకుని, సరాసరి డాక్టర్ హోడ్జా దగ్గరికి వెళ్ళి రాయబారాన్ని పునఃప్రారంభించాడు. శుక్రవారం నుంచి సోమవారంలోగా ఈ రీతిగా దిగజారి, ఒక దారికి వచ్చినవాడు నాజీ శవాల ఊరేగింపు జరిగిన మర్నాడు తిరిగి చుక్కల్ని అందుకున్నాడు. ఈసారి అతడు కారల్స్ బాడ్ లో కంటే కూడా సాహసించి, సూడెటెన్ జర్మన్ సమస్యా పరిష్కారానికి మూడే మార్గాలున్నవనీ, వీటిలో ఏదో ఒకదాన్ని అనుసరించక తప్పదనీ ఒక ప్రకటన చేశాడు. ఈ మూడు మార్గాలు ఇవి : మొదటిది - సూడెటెన్ జర్మనుల కోర్కెలన్నింటికి సమ్మతించడం. రెండవది - జర్మనీతో కలిసిపోవడమా, లేక, జెక్ రాజ్యంలోనే ఉండిపోవడమా అనే విషయాన్ని ఓటింగ్ ద్వారా వారిలో వారినే నిర్ణయించుకోనివ్వడం. పోతే పై రెండిటికంటే సులభమైన మార్గం - యుద్ధం! పై ఈ ప్రకటన చేసినందుకు జెక్ ప్రభుత్వం వారు న్యాయానికి హెర్లిన్ ను అరెస్టు చేయవలసింది; అతడితో రాయబార ప్రయత్నాలను వెంటనే విరమించవలసింది. కాని, హిట్లరకు ఆగ్రహం వస్తుందనే భయం వల్లనేమి, బ్రిటన్ - ఫ్రాన్సులు హర్షించవనే సంకోచం వల్ల నేమి, వారు ఈ పని చెయ్యలేక పోయారు.

21

మే 20-21 తేదీల నాటి సంఘటనలలో హిట్లర్ కు అతి ఆశ్చర్యాన్ని, అమిత ఆగ్రహాన్ని కలిగించినట్టివి. బ్రిటన్ చర్యలు. జెకొస్లొవేకియా, సైన్యాన్ని మొబిలైజ్ చెయ్యడంలో వింత లేదు. ఫ్రాన్సు, మోబిలైజేషన్ కు సంసిద్ధపడ్డం కూడా వింత కాదు. కాని, బ్రిటన్ తానుకూడా యుద్ధానికి దిగక తప్పదని అనడమే వింతగా యున్నది. వలస రాజ్యాల విషయమై జర్మనీ పట్టుపట్టనంత వరకు, మధ్యయూరపులో దాని విజృంభణను తాము ప్రతిఘటించమని హాలిఫాక్సు ప్రభువు చెప్పి వెళ్లలేదా? ఒక రాజ్యం ఇంకొక రాజ్యం మీద యుద్ధానికి దిగితే, తక్కిన అన్ని రాజ్యాలు అన్యాయానికి గురైన దాని రక్షణకు వెళ్ళాలనే సూత్రం (కలెక్టివ్ సెక్యూరిటీ) అమలు జరపడానికి వీలులేనట్టిదని ఛేంబర్లేన్ ప్రకటించలేదా? జెకొస్లొవేకియాతో ఉన్న ఒడంబడికను రద్దు చేసుకోవలసిందిగా ఫ్రాన్సును ఒత్తిడి పెట్టి వీరుభయులు జర్మనీ వాంఛలపట్ల సుముఖంగా ఉన్నట్టు కనబడలేదా? కాని, చివరికి వీరే "జెక్ - జర్మన్ యుద్ధం అనతికాలంలో ఆంగ్లో - జర్మనీ యుద్ధం కాకతప్ప"దని

బెదిరించారు. ఇంతకంటే ఆశ్చర్యకరమైన విషయం ఉంటుందా? దీన్నిమించిన విశ్వాస ద్రోహం ఉంటుందా? బ్రిటీష్ సామ్రాజ్యం మీద తనకు ఏమీ ఆశలేదని తాను చెప్పలేదా? బ్రిటన్ జర్మనీలకు సమాన శత్రువైన సోవియట్ రష్యా పై దిగ్విజయ యాత్ర జరపడమే తన ఆశయమని చాటలేదా? కేవలం మాటలతోనే కాకుండా, క్రియారూపకంగా కూడా ఈ సంగతిని విశదపరచడానికి బ్రిటీష్ నౌకాబలంలో జర్మన్ నౌకాబలం మూడవ వంతు ఉంటే చాలునని తాను సంధిచేసుకోలేదా? బ్రిటన్ సద్భావాన్నీ, సహకారాన్నీ, సంపాయించాలని తాను ఇంతగా కృషిచేస్తే, దీని ఫలితం "నేనూ యుద్ధానికి సిద్ధం" అనే బెదిరింపు! ఇలా ఆలోచించుకున్న కొద్దీ హిట్లర్‌కు ఆగ్రహం హెచ్చింది? ఆవేశం పెరిగింది. అతడి ఈ చిత్తవృత్తికి నిదర్శనం - జర్మన్ పత్రికలలో ఈ సమయాన బ్రిటన్ మీద ప్రకటితమైన తీవ్ర విమర్శలే!

కొన్ని రోజులు గడిచి, కొంతకోపం చల్లారిన తర్వాత హిట్లర్ భావికర్తవ్యాన్ని గురించి యోచించసాగాడు. జెక్ రాజ్య విచ్ఛేదన యత్నాన్ని విరమించడం కలలోని వార్త. పోతే, ఈ కార్యాన్ని సాధించడానికి మార్గమేది? ఫ్రాన్సు రష్యాలతో పాటు బ్రిటన్ ను కూడా ధిక్కరించి, దీన్ని సాధించడం దుస్తరం. అంచేత బ్రిటన్ తాటస్థ్యం వహించేలా చూడాలి. ఇంతకుముందు అది తప్పక ఈ వైఖరినే అవలంబిస్తుందని అనుకుంటే, అందుకు భిన్నం జరిగింది. అంచేత బ్రిటన్ విషయమై ఏమి నమ్మాలో, ఏమి నమ్మగూడదో కూడా తెలియడం లేదు. స్పష్టంగా దాని మనోగత భావాల్ని తెలుసుకుంటే బాగుంటుంది.

అయితే, ఈ కార్యానికి ఎవ్వరిని నియోగించడం? రిబ్బన్ ట్రాప్ చాలా కాలం లండన్లో ఉన్నమాట నిజం. అతడికి బ్రిటీష్ పరిపాలక వర్గంలో అనేకమందితో పరిచయం, స్నేహం ఉన్న మాట కూడా నిజం కాని, అతనిని నియోగించి ప్రయోజనం లేదు. జెకొస్లోవేకియా కోసం ఏ పరిస్థితిలోనూ బ్రిటన్ జర్మనీతో యుద్ధానికి దిగదని అతడు ఇదివరకు ఖండితంగా చెప్పాడు. ఇందుకు భిన్నంగా బ్రిటన్ "ముందు ఫ్రాన్సు! వెనుక నేను" అని బెదిరించడం జరిగింది. అంచేత అతడిని ఇంకొకసారి లండన్ పంపించడం దండగ. ఇక గోరింగ్ ను పంపడం కూడా తగదు. "ఆస్ట్రియా ఆక్రమణను బ్రిటన్ ప్రతిఘటిస్తుం"దని ఇతడన్నాడు. ఈ జోస్యం తప్పింది. "జెక్ రాజ్య విచ్ఛేదనానికి బ్రిటన్ ప్రాతికూల్యం ఉండ"దని తిరిగి ఇతడన్నాడు. మొదటి జోస్యం ఎంత నిజమో, ఇది కూడా అంతే అయింది. సరిగా రాజకీయ వాతావరణాన్ని గుర్తించలేని ఇతడివల్ల కూడా పని జరగదు. పైగా, బ్రిటతో ఇప్పుడు రహస్యంగా వ్యవహరించాలి. రిబ్బన్ ట్రాప్ ను పంపినా, గోరింగ్ ను పంపినా, వారి ప్రయాణం సంగతిని రహస్యంగా ఉంచడం అసాధ్యం. ఈ సాధక బాధకాలన్నిటినీ విచారించిన తర్వాత తన అంగరక్షకుడైన కెప్టెన్ ఫ్రిట్ వైడెమనను పంపించాలని హిట్లర్ నిర్ణయించుకున్నాడు.

కెప్టెన్ వైడెమన్ అతి విచిత్రమైన వ్యక్తి. హోదానుబట్టి అతడు హిట్లర్ అంగరక్షకుడు మాత్రమే! కాని ప్రపంచంలో అతడిని మించి హిట్లర్‌కు మిత్రుడుగాని, ఆప్తుడుగాని లేడు. అతడిమాట హిట్లర్‌కు వేదవాక్యం. అతడి ప్రజ్ఞపై హిట్లర్ కు అంతులేని విశ్వాసం. అతడంటే హిట్లరు అపారమైన గౌరవం. తనకు బదులుగా ప్రపంచాన్ని చూచి రావడానికి, ప్రముఖుల్ని కలుసుకోడానికి, పరిస్థితుల్ని పరిశీలించడానికి హిట్లర్ అతడినే నియోగిస్తూ ఉంటాడు. లండన్ లో పట్టాభిషేక మహోత్సవం జరిగినప్పుడు, ప్యారిస్ లో అంతర్జాతీయ ప్రదర్శనాలయం ప్రారంభమైనప్పుడు, వాషింగ్టన్ లో ఆంగ్లో - అమెరికన్ వాణిజ్యసంధి రాయబారాలు నడిచినప్పుడు, ఆంథోని ఈడెన్ రాజీనామా వల్ల బ్రిటీష్ మంత్రివర్గంలో కొంత కలతపుట్టినపుడు, హిట్లర్ అతడినే నిజపరిస్థితుల్ని తెలుసుకు రావడానికి పంపించాడు.

కెప్టెన్ వైడెమన్ అంటే, హిట్లర్ కు ఇంత గురి ఉండటానికి కారణం ఇది : గత ఐరోపా మహాసంగ్రామంలో హిట్లర్ వైడెమన్ దగ్గర కొంతకాలం ఆర్డర్లీగా పనిచేశాడు.ఆ రోజులలో తన ఆఫీసరు అంటే హిట్లర్‌కు చాలా భక్తి గౌరవాలు ఏర్పడ్డాయి. యుద్ధానంతరం వైడెమన్ బవేరియాలోని స్వగ్రామానికి వెళ్ళి, వ్యవసాయం చేసుకోసాగాడు. ఇక, హిట్లర్ ముందు గవర్నమెంటు సి.ఐ.డి.లో చేరి, తర్వాత రాజకీయాలలోకి దిగి, చివరికి జర్మనీ ఛాన్సలర్ అయ్యాడు. ఈ ఉన్నత

పదవికి వచ్చిన వెంటనే అతడు వైడెమనకు కబురు చేసి, “నాకు రాజ్య కార్యనిర్వహణంలో తోడ్పడవలసింది" అని కోరాడు. ఈ కోర్కెకు వైడెమన్ అంగీకరించలేదు. ఇంతటితో హిట్లర్ ఊరుకోలేదు. మరి మూడు, నాలుగుసార్లు అతడు కబుర్లు చేశాడు. కాని లాభం లేకపోయింది. చివరికి 1934లో తన అనుచరులైన రోహిం మొదలైనవారిని కుట్ర చేశారనే నేరం కింద తన చేతులతోనే చంపివేసిన తర్వాత హిట్లర్ కు “ఈ ప్రపంచంలో నాకు ఒక్కడైనా మిత్రుడుగాని ఆప్తుడుగాని లేడు!” అనే నిస్పృహ తోచింది. అప్పుడతడు స్వయంగా వైడెమన్ దగ్గరికి వెళ్ళి “ఈసారైనా నా కోర్కెను మన్నించవలసింది” అని వేడుకున్నాడు. ఇక కాదనలేక వైడెమన్ హిట్లర్ కొలువులో అంగరక్షకుడుగా చేరాడు. చేరి, తన నడతవల్ల పూర్వం కంటే కూడా అధికంగా హిట్లర్ భక్తి గౌరవాలకు పాత్రుడయ్యాడు.

ఆకర్షణీయమైన విగ్రహం గలవాడు, కెప్టెన్ వైడెమన్. ఆరడుగుల ఎత్తు, ఎత్తుకు తగ్గలావు, వొంకెలు తిరిగే నల్లటి జుట్టు మధ్యపాపటి, చిన్నవైనా తీక్షణంగా ఉండే కళ్ళు, ఇందుకు తోడు ఎవరితోనైనా ఇట్టే స్నేహం చేసుకోగల ప్రజ్ఞ. ఇందువల్లనే హిట్లర్ ఆజ్ఞానుసారం చేసిన విదేశ పర్యటనలలో అతడు జయించుకు రాగలిగాడు.

22

జూలై 19వ తేదీనాడు కెప్టెన్ వైడెమన్ లండన్ నగరం చేరుకున్నాడు. చేరుకుని, అతడు ముందుగా హాలిఫాక్సు ప్రభువును కలుసుకున్నాడు. మరెవరైనా అయినట్టయితే, హాలిఫాక్సు ప్రభువును కలుసుకోడానికి “ఫారెన్ ఆఫీసు"కు (విదేశాంగ కార్యాలయానికి) వెళ్ళేవారేమో! వైడెమన్ ఈ పొరపాటు చెయ్యలేదు. తానువచ్చింది అఫీషియల్ గా కాదు; ప్రయివేటుగా. అంచేత ఆఫీసుకు వెళ్ళి కలుసుకోవడం కూడదు.పైగా, ఆఫీసులో కలుసు కుంటే, ఆఫీసుకు సంబంధించిన లాంఛనాలను పాటించాలి. అప్పుడు మనసిచ్చి మాటాడుకోడానికి వీలుండదు. ఈ చిక్కులన్నిటిని గమనించి, వైడెమన్ ఫారెన్ ఆఫీసు ఛాయలకైనా పోకుండా, బెల్ గ్రావియాలోని హాలిఫాక్సు భవనానికి వెళ్ళాడు.

వైడెమనకు వ్యవసాయం అంటే ఇష్టం. హాలిఫాక్సు ప్రభువుకు కూడా వ్యవసాయం అంటే చాలా అభిమానం. దీన్ని కనిపెట్టి, వైడెమన్ తాను వచ్చిన పనిని గురించి కాకుండా, వ్యవసాయాన్ని గురించీ దానిలోవున్న కష్ట సుఖాల్ని గురించీ ముందుగా ప్రసంగించి ఉండాలి. ఎంచేతనంటే అతి సులభంగా బ్రిటీష్ విదేశాంగ మంత్రికి స్నేహపాత్రుడయ్యాడు.

తర్వాత హాలిఫాక్సు ప్రభువు ద్వారా వైడెమన్ బ్రిటీష్ ప్రధానిని కలుసుకున్నాడు. ఈ ముగ్గురికీ దీర్ఘమైన సంభాషణలు జరిగాయి.

హిట్లర్ దగ్గరి నుంచి బ్రిటీష్ ప్రభుత్వానికి వైడెమన్ తెచ్చిన సందేశం ఇది: నాకు జెకొస్లోవేకియాను కబళించాలనే ఆశలేదు. కాని, జెక్ రాజ్యంలో మైనారిటీ సంఘంగా ఉంటూ, అష్టకష్టాలు పడుతున్న మా జర్మన్ జాతివారిని “మీ ఖర్మం” అని వదలి వెయ్యలేను. సూడెటెన్ జర్మనునకు న్యాయం జరగాలని మాత్రమే నా పట్టుదల. ఇంతకుమించి, నాకు దిగ్విజయ యాత్రాభిలాష లేదని నిరూపించడానికి సిద్ధంగా ఉన్నాను. యుద్ధ విమానాల నిర్మాణం విషయంలో వివిధ రాజ్యాలు దంబడికకు రావాలని మీరు ఇంతకుముందు సూచించారు. ఇందుకు నా అభ్యంతరం లేదు. బ్రిటన్, ఫ్రాన్సు, జర్మనీ, ఇటలీ రాజ్యాలు నాల్గింటికే ఒడంబడిక జరగాలని మీరు ఇంకొక సూచన చేశారు. ఇందుకు కూడా నేను సిద్ధం. ఎప్పుడు కావాలంటే అప్పుడు ఈ రెండు ఒడంబడికల్ని గురించి చర్చించడానికి సమావేశాన్ని జరపండి. నేను మనస్ఫూర్తిగా దానిలో పాల్గొంటాను. అయితే, ముందుగా ఈ జెక్ సమస్యను సంతృప్తికరంగా సాధించనివ్వండి. ఇందకు

మీ తోడ్పాటు ఎంతైనా అవసరం. ఈ అవసరాన్ని గుర్తించి మీరు తోడ్పడితే, సంతోషమే! లేకపోతే, కనీసం తటస్థంగా నైనా ఉండండి".

ఈ సందేశాన్ని అందుకుని హాలిఫాక్సు ప్రభువు సంతోషించాడు; ఛేంబర్లేన్ ఉప్పొంగిపోయాడు. ఇటీవల - అంటే, గత మహాసంగ్రామం తర్వాత - యుద్ధశాస్త్రం పూర్తిగా మార్పు చెందింది. ఈ మార్పుకు ప్రధాన కారణం యుద్ధ విమానం. గత యుద్ధం నాటికే విమానాలు ఉపయోగానికి వచ్చిన మాట నిజం. అయితే అప్పటికి అవి ఇప్పుడు పొందినంతటి అభివృద్ధి పొందలేదు. అప్పటి విమానాల కంటే ఇప్పటివి మూడురెట్లు ఎక్కువ వేగంగా పోగలవు. అప్పటివాటి కంటే ఇప్పటివి చాలా ఎత్తుకు ఎగరగలవు కూడా. ఇందుకు తోడు అప్పటి విమానాల బాంబుల కంటే, ఇప్పటివి రెట్టింపు హానిని చెయ్యగలవు. అన్ని కారణాల వల్ల నేటి మారణ యంత్రాలలో విమానం అతి ముఖ్యమైనట్టిది అయింది. ఈ సంగతిని బ్రిటన్ సరిగా గుర్తించలేదు. అంచేత అది వైమానిక దళ నిర్మాణంలో తగినంత శ్రద్ధ చూపలేదు. ఇక, ఇటలీ - జర్మనీ రాజ్యాలు ఈ విషయాన్ని చాలా బాగా గుర్తించాయి. గుర్తించి, యుద్ధ విమానాలను వేలకొలదిగా నిర్మించుకున్నాయి. దాదాపు పది సంవత్సరాలు అశ్రద్ధ చేసిన తర్వాత, బ్రిటన్ తన తప్పు తెలుసుకున్నది. తెలుసుకుని, శీఘ్రగతిని విమానాలను నిర్మించసాగింది. కాని, చాలా ఆలస్యం చేసిన తర్వాత తొందరపడి మాత్రం లాభమేముంది! బ్రిటన్ ఒక్క విమానాన్ని నిర్మించేలోగా, ఇటలీ, జర్మనీలు రెండింటిని నిర్మించసాగినవి. దీన్నిచూచి, వైమానిక బలం విషయంలో తాను తక్కిన రాజ్యాలతో సరితూగాలంటే, ఏదైనా ఒక ఒడంబడికను చేసుకుతీరాలని బ్రిటన్ అనుకుంది. ఒక్కొక్క రాజ్యానికి ఇన్నింటికంటే ఎక్కువ యుద్ధవిమానాలు ఉండగూడదని అంటే, ఇతర రాజ్యాలు వాటి నిర్మాణాన్ని ఆపవలసి వస్తుంది. ఇక, తానో? ఒడంబడిక నిర్ణయించిన హద్దు వరకు తన విమానాల సంఖ్యను హెచ్చించుకోవచ్చును. ఒకసారి ఈ విధంగా ఇతర రాజ్యాలకూ, తనకూ వైమానిక బలం.

విషయంలో సమత్వం ఏర్పడితే, ఆ తర్వాత ఒడంబడిక భగ్నమై పోటీ ఏర్పడినా భయం లేదు. అపుడు తక్కిన రాజ్యాలతోపాటు తానుకూడా తన వైమానిక బలాన్ని వృద్ధి చేసుకోగలదు. ఇలా యోచించి బ్రిటన్ "వైమానిక దళాల విషయమై వివిధ రాజ్యాల మధ్య ఒక ఒడంబడిక అవసరం" అని ఆందోళన చెయ్యసాగింది. ఈ ఆందోళన ఆంతర్యాన్ని తెలుసుకొని, ఇతర రాజ్యాలు ముఖ్యంగా ఇటలీ, జర్మనీలు ఇందుకు అంగీకరించలేదు. మరి ఆందోళనవల్ల లాభం లేదేమో అని నిస్పృహ చెందుతూ ఉండగా, హిట్లర్ "నేను ఒడంబడికకు సిద్ధం" అని కబురు చేశాడు. ఇది ఎంతైనా సంతోష కారణం గదా?

ఇక, బ్రిటన్ - ఫ్రాన్సు జర్మనీ - ఇటలీ రాజ్యాలకు నాలిగింటికీ ఒడంబడిక జరగాలని బ్రిటీష్ ప్రభుత్వం పడుతున్న తాపత్రయానికి గల కారణాలు ఇవి : గత యుద్ధం వల్ల నేమి, ఆ యుద్ధానంతరం జరిగిన పరిణామం వల్ల నేమి, వినూత్నమైన రెండు విభిన్న శక్తులు ఉద్భవించాయి. వీటిలో మొదటిది, - కమ్యూనిజం. రెండవది, - ఫేసిజం. ఈ రెండింటిలో ఫేసిజం అంటే బ్రిటన్ కు అభిమానం. ఎంచేతనంటే, బ్రిటన్ అవలంబిస్తున్న ఇంపీరియలిజంకూ, ఫేసిజంకూ బాహ్యరూపంలోనే గాని, అంతరంగంలో బేధం లేదు. అంచేతనే రష్యన్ కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని భగ్నం చెయ్యాలని మొదటి నుంచీ కుట్ర చేసిన బ్రిటన్ మొదటి నుంచీ ఇటలీలో ఫేసిజం బలపడ్డానికి, జర్మనీలో నాజీజం విజృంభించడానికి పూర్తిగా తోడ్పడింది. • "ప్రపంచ రాజకీయ రంగంలో ఈనాడు బ్రిటన్ - ఇటలీలకూ, బ్రిటన్ - జర్మనీలకూ కొన్ని కొన్ని సందర్భాలలో తీవ్రమైన సంఘర్షణలు వస్తున్నవిగదా! మరి, బ్రిటన్ ఫేసిజంనూ, నాజీజంనూ సమర్థించడం పొరపాటుకాదా?" అనే సందేహం అవసరం లేదు. ఇలాంటి సంఘర్షణలు తప్పవు. వీటిని వీలైనంత వరకు తప్పించుకోడానికి యత్నించాలేగాని, సంఘర్షణలు వస్తున్నవి గదా అని ఫేసిస్టు, నాజీ తత్వాలనుగాని, ప్రభుత్వాలనుగాని భగ్నం చెయ్యరాదు. ఇటలీలో ఫసిస్టు ప్రభుత్వం అంతరిస్తే, కమ్యూనిజం తప్పక తలయెత్తుతుంది ఇలాగే జర్మనీలో నాజీ ప్రభుత్వం కూలిపోతే, కమ్యూనిస్టులు అధికారానికి వస్తారు. రష్యాతోపాటు, ఈ రెండు రాజ్యాలు కూడా కమ్యూనిజం

కేంద్రాలైననాడు, బ్రిటీష్ ఇంపీరియలిజం అంతరించి పోవలసిందే! అంచేత, ముసోలినీ అధికారానికిగాని, హిట్లర్ ప్రభుత్వానికిగాని ముప్పు తేరాదు. వారితో రాజీ పడాలి. ఈ రాజీలో ఫ్రాన్సును కూడా భాగస్వామిని చెయ్యాలి. వర్సయిల్స్ సంధి ప్రపంచం దోపిడిలో బ్రిటన్, ఫ్రాన్సులకే గాని, ఇటలీ, జర్మనీలకు భాగం పెట్టలేదు. ఇప్పుడు ఆ రెండింటికి కూడా భాగం పెట్టాలి. అంటే బ్రిటీష్, ఫ్రెంచి సామ్రాజ్యాలను వాటికి పంచి పెట్టాలని కాదు. ఈ సామ్రాజ్యాలకు వెలుపల స్వతంత్రంగా ఉన్న చిన్న చిన్న రాజ్యాలను వాటికి బలి పెట్టాలి. ఇంతేకాదు, జర్మనీని రష్యాపై ప్రయోగించాలి. సోవియట్ రాజ్యాన్ని చిన్నాభిన్నం చెయ్యగలిగితే, జర్మనీకి లాభం కలగడమే కాకుండా, బ్రిటీష్ సామ్రాజ్య తత్వానికి కూడా రక్షణ ఏర్పడుతుంది. ఈ అన్ని కారణాలను బట్టి బ్రిటన్, ఫ్రాన్సు, ఇటలీ, జర్మనీ రాజ్యాల మధ్య సంధి జరగడం అత్యవసరం. హిట్లర్ ఈ సంధికి అనుకూలంగా ఉన్నట్టు వైడెమన్ ద్వారా సందేశాన్ని పంపించాడు. ఇక, ఛేంబర్లేన్ పొంగిపోవడంలో ఆశ్చర్యమేముంది?

జెక్ రాజ్య విచ్ఛేదం జరిగినాసరే, వైమానిక దళాల విషయమై ఒడంబడిక జరగవలసిందే! బ్రిటన్, ఫ్రాన్సు, ఇటలీ, జర్మనీ నాలుగు రాజ్యాలకు సంధి జరగవలసిందే! అయితే, హిట్లర్ తొందరపడకూడదు. తొందరపాటు వల్ల యుద్ధం రావచ్చు. జెకొస్లోవేకియాలో ప్రారంభమైన యుద్ధం దాని సరిహద్దులలోనే ఆగిపోదు; ఇతర రాజ్యాలకు కూడా వ్యాపిస్తుంది; ప్రపంచ యుద్ధంగా మారుతుంది. ఈసారి ప్రపంచ యుద్ధం వస్తే, అది కేవలం వివిధ రాజ్యాల మధ్య యుద్ధంగా ఉండకుండా, ప్రతి రాజ్యంలో కేపిటలిస్టు, సోషలిస్టు వర్గాల మధ్య అంతర్యుద్ధాలుగా మారుతుంది. ఇది అన్ని రాజ్యాలలోను ప్రస్తుత పరిపాలక వర్గాలకు ప్రాణాంతకం. అంచేత యుద్ధంతో నిమిత్తం లేకుండా, లౌకికంగా జర్మనీ కార్యసాఫల్యం చేసుకోవాలి. వైడెమన్ తన లండన్ ప్రయాణం సఫలమైనదని సంతోషిస్తూ స్వదేశానికి తిరిగివెళ్ళాడు.

23

వైడెమన్ వచ్చి వెళ్ళిన వెంటనే - జులై చివరి వారంలో తమ రాజును అనుసరించి బ్రిటీష్ విదేశాంగ మంత్రి హాలిఫాక్సు ప్రభువు ప్యారిస్ వెళ్ళడం తటస్థించింది. ఈ సందర్భంలో ఆయన ఫ్రెంచి మంత్రులతో జెక్ సమస్యను గురించి చర్చించాడు.

"మనం జోక్యం కలిగించుకొని, ఏదో ఒక విధంగా పరిష్కారం చెయ్యకపోతే, జెక్ సమస్య యుద్ధానికి కారణమౌతుంది. అంచేత మనం తప్పక కలగజేసుకోవాలి" అని ఈ చర్చలో హాలిఫాక్సు ప్రభువు సూచించాడు. స్పెయిన్ పైన జర్మన్, ఇటాలియన్ సైన్యాలు దాడి జరుపుతూ ఉంటే, "మనకు దానితో జోక్యం వద్దు" అని తటస్థ విధాన కపట నాటకాన్ని ప్రారంభించిన బ్రిటన్ ఇప్పుడు జెక్ సమస్యలో జోక్యం కలిగించుకోవాలని అనడం ఫ్రెంచి ప్రభుత్వానికి వింతగా తోచింది. ఇది వింతగా తోస్తే, ఇక హాలీఫాక్సు ప్రభువు సమస్యా పరిష్కారానికి చేసిన సూచన కేవలం విపరీతంగా కనబడింది. బ్రిటన్ తరపున ఒకరిని, ఫ్రాన్సు తరపున ఒకరిని పంచాయతీదార్లుగా (Arbitrators) పంపించడం : ఇదే బ్రిటీష్ విదేశాంగ మంత్రి చేసిన సూచన. ప్రస్తుత సమస్య కేవలం జెక్ ప్రభుత్వానికీ, దాని పరిపాలనలో వున్న మైనారిటీ సంఘానికి చెందినట్టిది. అంచేత దాన్ని జెక్ ప్రభుత్వం వారు తమకు తోచిన రీతిని స్వయంగా పరిష్కరించుకోవాలి. సూడెటెన్ మైనారిటీకి ఘోరమైన అన్యాయం ఏమైనా జరుగుతూ ఉంటే, ఆ అన్యాయాన్ని చూడలేక ఇతర రాజ్యాలు జోక్యం కలిగించుకోవచ్చు. ఇక్కడ అలాంటిది ఏమీ లేదు. అనేక ఇతర దేశాలలో - ముఖ్యంగా జర్మనీలో - మైనారిటీ సంఘాల స్థితి కంటే జెక్ రాజ్యంలో సూడెటెన్ స్థితి కొన్ని వందల రెట్లు చక్కగా ఉన్నది. ప్రస్తుతపు కల్లోలానికి పూర్తిగా జర్మనీయే కారణమని లోకానికి తెలుసు. జర్మనీ ప్రోత్సాహం లేకపోతే, అసలు ఈ సమస్యే లేదు కూడా. ఈ స్థితిలో తగుదుమమ్మా అని పిలవని పేరంటంగా బ్రిటన్ ఫ్రాన్సులు తగువు తీర్చడానికి బయల్దేరడమా? అందుకోసం పంచాయితీదార్ల ఏర్పాటు

కూడానా? పంచాయితీదార్లు అని అనగానే వారి తీర్పును ఉభయ పక్షాలు శిరసావహించాలి. తనకు తీర్పు అనుకూలంగా లేకపోతే, జర్మనీ ఏలాగూ దాన్ని ఆమోదించదు. దౌర్జన్యం మీదనే ఆధారపడి ఈ తగవుకు దిగింది గనక, నిరాకరణ వల్ల ఏమి ముప్పువస్తుందో అని అది సంకోచించదు. పోతే, జెక్ ప్రభుత్వం తమకు అనుకూలంగా ఉన్నా, లేకపోయినా, న్యాయమైనా, కాకపోయినా తీర్పును అంగీకరించాలి; లేకపోతే తప్పు దానిదౌతుంది. అప్పుడు తమ తీర్పునే నిరాకరించినదన్న కారణాన ఇతర రాజ్యాలు జెక్ ప్రభుత్వం సహాయానికి పోలేవు. ఈ రీతిగా ఎటుచూచినా పంచాయితీదార్ల నియామకమే కూడదు.

కెప్టెన్ వైడెమన్ లండనకు వచ్చి వెళ్ళడం, ఇది జరిగిన వెంటనే బ్రిటన్ పంచాయితీదార్ల నియామకం సూచన చెయ్యడం : ఈ సందర్భం ఫ్రెంచి మంత్రులకు చాలా ఆందోళన కలిగించింది. సగం ఈ ఆందోళన వల్లనే వారు - ముఖ్యంగా ప్రధాన మంత్రి దలిదియర్ - పంచాయితీదార్ల నియామకానికి అంగీకరించలేదు. అప్పుడు "పోనీ, మేము మా రన్సిమన్ ప్రభువును మధ్యవర్తి (Mediator)గా పంపుతాము. ఇందుకైనా అంగీకరించవలసింది" అని హాలిఫాక్సు ప్రభువు కోరాడు. ఇలా కోరడం కేవలం లాంఛనంగానే అని అనుకోవాలి. ఎంచేతనంటే, ఆ క్రిందటి రోజు సాయంత్రమే ప్రా లోని బ్రిటీష్ రాయబారి జెక్ అధ్యక్షుని సందర్శించి, బ్రిటీష్ ప్రభుత్వం వారు రన్సిమన్ ప్రభువును "పంచాయితీదారు *"(ఫ్రెంచ్ ప్రభుత్వము వారు పంచాయితీ దార్ల నియామకాన్ని తీవ్రంగా నిరసించిన మీదట రన్సిమన్ ప్రభువు హోదా 'మధ్యవర్తి'గా మారింది.)* గా పంపించాలని ఆలోచిస్తున్నారు (నిశ్చయించారు?) అని చెప్పాడు. స్వదేశానికి తిరిగిపోతూ, ఎలానైనా సరే ఈ సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకో వలసిందని ప్రాగ్ ప్రభుత్వాన్ని ఒత్తిడి పెట్టవలసిందిగా హాలిఫాక్సు ప్రభువు బలవంత పెట్టాడు. అతడిని కాదనలేక ఫ్రెంచి ప్రభుత్వం ఈ పనిని చేసింది.

24

రన్సిమన్ ప్రభువు మధ్యవర్తిగా రావడం జెక్ ప్రభుత్వానికి బొత్తిగా ఇష్టం లేదు. అయితే "రావద్దు" అని అంటే, బ్రిటీష్ ప్రభుత్వానికి ఎక్కడ కోపం వస్తుందోనని భయం. అంచేత "మీ రాకకు సంతోషం" అని లాంఛనం ప్రకారం అన్నారు.
రన్సిమన్ ఇక వస్తాడనగా, జెక్ ప్రభుత్వం వారు కొన్ని షరతుల్ని పెట్టి, "సూడెటెన్ జర్మన్ సమస్యా పరిష్కారానికి ఇవి మా తుది షరతులు" అని చెప్పివేశారు. అంతకు పూర్వం ప్రభుత్వ పక్షాలలో (జెక్ ప్రభుత్వం ఏదో ఒక పక్షం ఏర్పరచింది కాదు; అది వివిధ పక్షాల కొయిలిషన్) కొంత మత భేదం ఉండేది. కాని, ఈ షరతుల విషయంలో ప్రభుత్వ పక్షాలు ఆరింటికీ ఏకాభిప్రాయం కుదిరింది. ఈ స్థితిలో తాము ప్రభుత్వం షరతుల్ని తోసివేస్తే, ఎటుపోయి ఎటు వస్తుందోనని సూడెటెన్ జర్మనులు తటపటాయించారు. తాము ఈ తుది షరతుల్ని నిరాకరిస్తే, తమ పార్టీ చట్ట విరుద్ధమైనదని జెక్ ప్రభుత్వం ప్రకటించవచ్చును. తమపై రాజద్రోహానికి కేసు పెట్టి, జైలుశిక్షను వెయ్యవచ్చును. ఇలా చేసినందుకు హిట్లర్ ఆగ్రహించి, దండయాత్ర జరుపుతాడు గదా అనే ధీమాకైనా ప్రస్తుతం అవకాశం లేదు. జరిగితే, దండయాత్ర మే 21వ తేదీనాడే జరగవలసింది. అప్పుడు "అవసరమైతే ఫ్రాన్సును కూడా ఎదిరించగల స్థితిలో మనం లేము; అంచేత ప్రస్తుతం మనం దండయాత్ర ప్రయత్నాన్ని విరమించక తప్పదు" అని జర్మన్ సైన్యాధికారులు నిర్ణయించారు. అప్పటి కంటే ఇప్పుడు యుద్ధ సన్నాహాల దృష్టిలో జర్మనీ ఎక్కువ బలంగా లేదు. మరి ఒకటి, రెండు నెలలు జరిగితే, ఈ లోపం తీరుతుంది. అప్పుడిక నిస్సంకోచంగా జెక్ ప్రభుత్వపు షరతుల్ని తోసివెయ్యవచ్చును. కాని, ఈ ఒకటి, రెండు నెలలు జరపడానికి మార్గమేది? ఇలా అనుకుంటూ ఉండగానే, రన్సిమన్ ప్రభువు మధ్యవర్తిగా తయారయ్యాడు. దానితో "మార్గ మేది" అనే చిక్కు తీరిపోయింది.

"ఈ షరతులు అంగీకరించము" అని రన్సిమన్ ప్రభువు రావడమే తడవుగా, హెర్లిన్ ప్రకటించాడు. అప్పుడు "మీరు అంగీకరించండి; అంగీకరించకపోండి; మేము క్రొత్త షరతుల్ని ప్రతిపాదించక పోవడం లేదు" అని జెక్ ప్రభుత్వం వారు స్పష్టపరచదలుచుకున్నారు. కాని, "తొందరపడవద్దు" అని రన్సిమన్ హెచ్చరించాడు. "వేరే షరతుల్ని ఆలోచించండి" అని బ్రిటన్, ఫ్రాన్సులు ఒత్తిడి చేసినవి. ఈ పరిస్థితిలో గత్యంతరం లేదనుకొని ప్రాగ్ ప్రభుత్వం వారు ఒక మెట్టు కిందికి దిగిపోయారు. దిగిపోయి వారు ప్రతిపాదించిన కొత్త షరతులు ఇవి:

1 జాతితో నిమిత్తం లేకుండా అందరి పౌరులు సమానమైన హక్కుల్ని అనుభవించడం.
2 ప్రతి జాతిలో నుంచీ మొత్తం జనాభాలో దాని వంతునుబట్టి ప్రభుత్వోద్యోగుల్ని నియమించడం.
3 పై సూత్రాన్ని అనుసరించే ప్రభుత్వం వారి కంట్రాక్టుల్ని వివిధ జాతుల వారికి ఇవ్వడం.
4 దేశాన్ని నాలుగు రాష్ట్రాలుగా విభజించడం. జెక్-జర్మన్ జాతుల వారు బొహిమియా రాష్ట్రాన్నీ, జెక్-జర్మన్-పోలిష్ జాతుల వారు మొరేవియా - సైలీసియా రాష్ట్రాన్నీ, స్లోవక్ - హంగరియన్ జాతులవారు స్లోవేకియా రాష్ట్రాన్నీ, రుథేనియన్-రష్యన్ జాతులవారు రుథోనియా రాష్ట్రాన్ని పరిపాలించడం.

ఆగష్టు 17వ తేదీనాడు హెర్లిన్ ఈ కొత్త షరతుల్ని కూడా నిరాకరించి కారల్స్ బాడ్ ఉపన్యాసంలో తాను పేర్కొన్న వాటికి ఒక్క మినహాయింపు కూడ జరగరా దన్నాడు. పోనీ, అప్పుడైనా రన్సిమన్ "ఇది సబబుకాదు సుమా!" అని హెర్లిన్ వైఖరిని ఖండించాడా? లేదు. పైపెచ్చు ఇంకొక మెట్టు దిగి సూడెటెన్ జర్మనులను సంతృప్తిపరచడానికి యత్నించవలసిందని జెక్ ప్రభుత్వం వారిని మోమోటపెట్టాడు.

అంతట జెక్ ప్రధాని హోటా సూడెటెన్ జిల్లాలలో నాల్గింటికి జర్మన్ జాతి వారినే గవర్నర్లుగా నియమిస్తామని ప్రకటించాడు. "ఈ గవర్నరు పదవుల వల్ల లాభం లేదు; సూడెటెన్ జర్మనీకి పరిపూర్ణమైన రాష్ట్రీయ స్వపరిపాలనాధికారాన్ని ఇచ్చి తీరవలసిందే!" అని ఆగష్టు 23వ తేదీనాడు హెర్లిన్ రన్సిమన్ ప్రభువుకు తెలియ జేశాడు. అంతట తిరిగి రన్సిమన్ ఒత్తిడి పెట్టడం, తిరిగి జెక్ ప్రభుత్వం కొత్త షరతుల్ని ప్రతిపాదించడం జరిగింది.

ఆగష్టు 30వ తేదీనాడు జెక్ మంత్రివర్గం సమావేశమైంది. ఈ సమావేశంలో దేశాన్ని స్విట్జర్లాండు పద్ధతి మీద "కాంటన్స్" కింద విభాగించాలనీ, ప్రతి విభాగానికి చాలా వరకు స్థానిక స్వపరిపాలనాధికారాన్ని ఇవ్వాలని నిర్ణయించారు. ఈ నిర్ణయాన్ని ఆగష్టు 31వ తేదీనాడు డాక్టర్ బెనిస్ ప్రకటించాడు.

హెర్లిన్ తనంతట తానుగానే "ఉహు" అని ఈసారి కూడా అనేవాడే! కాని, "ఒకసారి హిట్లర్ తో సంప్రదించి, ఆ మీదట నిర్ణయానికి రావలసింది" అని రన్సిమన్ సలహా చెప్పాడు. ఇంకొకసారి కూడా రాజీని నిరాకరించిన బాధ్యత హెర్లిన్ మీదగాని, హెర్లిన్ ను సమర్థించిన తనమీద గాని ఉండరాదనే తలంపుతో రన్సిమన్ ఈ సలహా చెప్పాడేమో తెలియదు! అదేమైనా, సెప్టెంబరు 1వ తేదీనాడు హెర్లిన్ తన యజమాని అయినట్టి హిట్లర్ దర్శనానికి బయల్దేరాడు.

25

రన్సిమన్ ప్రభువు ప్రాగ్ నగరంలో మధ్యవర్తిత్వం తతంగాన్ని నడుపుతూ ఉంటే, బర్లిలో హిట్లర్ చేతులు ఒడిలో పెట్టుకొని కూర్చోలేదు. రాయబారాల కపట నాటకం ద్వారా చిక్కిన వ్యవధిని బ్రహ్మాండమైన యుద్ధ సన్నాహాల్ని సాగించడానికి అతడు ఉపయోగించుకున్నాడు. బ్రిటన్, ఫ్రాన్సులు తాటస్థ్యాన్ని వహిస్తాయనే ఆశకొద్దీ ఇదివరకు ఒక్క జెక్ సరిహద్దులోనే

గాని, ఇతర సరిహద్దులలో జాగ్రత్త పడలేదు. ఈ పొరపాటు కారణాన మే 21వ తేదీనాడు జరపదలచుకున్న దండయాత్రను విరమించవలసి వచ్చింది. ఒకే పొరపాటును రెండుసార్లు చెయ్యడానికి అతడేమి మూర్ఖుడా? అంచేత ఈసారి జెక్ సరిహద్దులతోపాటు ఫ్రెంచి సరిహద్దులలో కూడా విపుల యుద్ధ సన్నాహాలను సాగించాడు.

హిట్లర్ చేసిన సన్నాహాలలో కొన్ని ఇవి:

1910-1911-1912 సంవత్సరాలలో నిర్బంధ సైనిక శిక్షణ పూర్తి చేసుకున్నవారు - వీరిని "కాన్ స్క్రిప్ట్" అని అంటారు - డ్యూటీలో వచ్చి చేరాలని శాసించాడు. నిర్బంధ సైనిక సేవ నుంచి సెప్టెంబరు 26వ తేదీనాడు ఎవరెవరు విముక్తులౌతున్నారో, వారందరు తిరిగి ఆర్డరు పడేవరకు డ్యూటీలో ఉండిపోవలసిందేనని నిర్బంధించాడు. 65 సంవత్సరాలకు లోబడిన వారెవ్వరు జర్మనీని వీడరా దన్నాడు. వైమానిక శాఖలో ఏ హోదాలో నైనా సరే పనిచేసిన వారు పిలిచినప్పుడు వచ్చి డ్యూటీలో చేరడానికి సిద్ధంగా ఉండాలన్నాడు. జర్మనీకి ప్రస్తుతం 47 డివిజన్లు (దళాలు) ఉన్నాయి. ఒక్కొక్క డివిజన్లో 15,000 మంది ఉండవచ్చును. దీన్నిబట్టి హిట్లర్ సన్నద్ధపరచిన సైనికులు - రిజర్వు సైనికుల్ని కూడా కలుపుకుంటే మొత్తం పది లక్షలకు తక్కువ ఉండరు.

కాన్ స్క్రిప్టును డ్యూటీలోకి పిలిపించుతూనే, మందు గుండు ఫ్యాక్టరీలలో పని చురుకు చేయించాడు. ఒక్కొక్క ముఠా పదిగంటల చొప్పున, రెండు ముఠాలు రోజుకు 20 గంటల సేపు ఈ ఫ్యాక్టరీలలో పనిచెయ్యవలసిందే!

అన్ని సరిహద్దులలో ముఖ్యంగా జెక్-ఫ్రెంచి సరిహద్దులలో కొన్ని భాగాలను "నిషిద్ధ ప్రదేశాలు" అని ప్రకటించాడు. ఈ ప్రదేశాలలో విదేశీయ సైనికులుగాని, సైనికోద్యోగులు గాని అడుగు పెట్టడానికి వీలులేదన్నాడు. ఈ ఉత్తరువుకు భిన్నంగా ఎవరైనా అడుగు పెడితే కాల్చి చంపుతామని నోటీసులు కట్టించాడు. దాదాపు పది లక్షల మంది కూలీలను వారి వారి పనులలో నుంచి బలవంతంగా తప్పించి ఈ "నిషిద్ధ ప్రదేశాలలో" కందకాలను తవ్వడానికి, ఫిరంగుల దిమ్మెలను కట్టడానికీ, ముళ్ళ తీగల కంచెల్ని వెయ్యడానికీ, ఇతర యుద్ధ సన్నాహాలను చెయ్యడానికి పంపించాడు.

సెలవుమీద వెళ్ళే డాక్టర్లు తమ చిరునామాలను, టెలిఫోన్ నంబర్లను పోలీసువారికి తెలియ చెయ్యాలన్నాడు. పదిహేను సంవత్సరాలకు పైబడిన యువకులందరు తమ పేర్లను, చిరునామాలను, తమ శక్తి సామర్థ్యాలను (Qualifications) పోలీసు స్టేషన్లలో వివరంగా నమోదు చెయ్యాలన్నాడు. అందరు రైల్వే ఉద్యోగుల సెలవు రద్దు చేశాడు చాలా బస్సు సర్వీసుల్ని ఆపు చేయించాడు. మిలిటరీ వారు తమకు కావలసిన బళ్ళను గాని, గుర్రాల్ని గాని, మోటారుల్ని గాని, బస్సుల్ని గాని, మరి ఏ ఇతర ఆస్తిపాస్తుల్ని గాని అసవరమైతే జప్తు చేసుకొని, ఉపయోగించుకోవచ్చు నన్నాడు.

సాధ్యమైనంత రహస్యంగా జరిపిన బ్రహ్మాండమైన ఈ యుద్ధ సన్నాహాలు ప్రపంచ దృష్టిని ఆకర్షించాయి. బ్రిటీష్, ఫ్రెంచి ప్రభుత్వాలవారు "ఈ సన్నాహాలకు కారణమేమిటి?" అని పదే పదే ప్రశ్నించారు. ముందు "ఏమీ సన్నాహాలు లేవే" అని హిట్లర్ అన్నాడు. తర్వాత ఇది కాదనుకుని "ఔను! సన్నాహాలు జరుగుతున్నవి. ఇది ఏ దేశం పైనను యుద్ధానికి కావు. నిజంగా యుద్ధం వస్తే, దేశం ఏ విధంగా సన్నద్ధపడాలో అనే విషయాన్ని చూచుకోడానికి ఇది రిహార్సల్!" అని అన్నాడు. ఎంత పెద్ద అబద్ధం ఆడితే, అంత తేలికగా బుకాయించ వచ్చునని ఒకప్పుడు హిట్లర్ ఒక సూత్రాన్ని ప్రతిపాదించాడు. తన యుద్ధ సన్నాహాల సందర్భంలో అత డిచ్చిన ప్రత్యుత్తరం ఈ సూత్రాన్ని అనుసరించే!

జులై ఆఖరులో హిట్లర్ ప్రారంభించిన ఈ సన్నాహాలు ఆగష్టు ఆఖరున దాదాపుగా పూర్తి అయినవి. అంచేత సెప్టెంబరు 1వ తేదీనాడు హెర్లిన్ తనను చూడవచ్చినప్పుడు మరి సంకోచించ నవసరం లేదనీ సూడెటెన్ ప్రాంతాల్ని జర్మనీలో చేర్చి వెయ్యాలనే ఆందోళనను బహిరంగంగా సాగించవలసిందనీ ఆదేశించాడు.

హిట్లర్ ఆదేశానుసారం సెప్టెంబరు 5వ తేదీనాడు సూడెటెన్ నాజీలు చెలరేగి "జర్మనీ మా దేశం; హిట్లర్ మా నాయకుడు" అని కేకలు వేస్తూ, ఊరేగింపుల్ని జరిపారు. జర్మనీలో చేరిపోవడమా, లేక జెక్ రాజ్యంలోనే ఉండిపోవడమా అనే విషయాన్ని తాము స్వయంగా నిర్ణయించుకో లన్నారు. ఇందుకోసం ఓటింగ్ (ప్లైబి సైట్) జరిపి తీరాలన్నారు.

ఒకవైపున హిట్లర్ యుద్ధ సన్నాహాల్ని, ఇంకొక వైపు సూడెటెన్ నాజీల విజృంభణాన్ని చూచి, త్వరలో జెక్ రాజ్యం మీద దండయాత్ర తప్పదని ఫ్రెంచి ప్రభుత్వం వారు నిర్ణయించుకున్నారు. తాను తూర్పుగా జెకొస్లోవేకియాపై దండెత్తి, దాని గొంతును పిసికి వేస్తూ ఉంటే, మనం వెళ్ళి అడ్డుపడకుండా ఉండటానికి గాను పశ్చిమంగా మన సరిహద్దు వైపున కూడా హిట్లర్ జాగ్రత్త పడ్డాడని తెలుసుకున్నారు. బ్రిటన్ మాటల్ని నమ్మి ఇంకా ఔదాసీన్యం వహించడం ప్రమాదమని ధృవపరచుకున్నారు. జర్మనీ సరిహద్దులలో తాము నిర్మించుకున్న భూగర్భ దుర్గాలను (మాజినాట్ లైన్) సైన్యాలతో నింపవలసిందేనని తీర్మానించుకున్నారు. ఈ తీర్మానాన్ని ఆనాడే (సెప్టెంబరు 5) వెంటనే అమలు జరిపారు.

ఈ పరిస్థితులు బ్రిటన్‌కు ఆందోళన కలిగించాయి. అయితే దాని ఆందోళన హిట్లర్ అక్రమానికి దిగుతున్నాడే అని కాదు; జెక్ రాజ్యానికి అన్యాయం జరుగుతున్నదే అని కాదు; యుద్ధం తప్పనిసరి అయ్యేలా ఉన్నదే అని మాత్రమే! ఇపుడు యుద్ధం తప్పాలంటే, అందుకు ఒకటే మార్గం ఉన్నది. అది, - సూడెటెన్ జర్మనీ హిట్లర్ వశమైపోవడం. ఇది న్యాయమా? కాకపోవచ్చును. ఇది ద్రోహం కాదా? కావచ్చును. కాని, హిట్లర్ సంతృప్తి కోసం బ్రిటన్ ? రక్షణ కోసం, ప్రపంచ శాంతి కోసం, జెక్ రాజ్యాన్ని బలి పెట్టక తప్పదు. బ్రిటిష్ పరిపాలక వర్గం ఇలా ఆలోచించింది. ఈ ఆలోచనే సెప్టెంబర్ 6వ తేదీనాటి "లండన్ టైమ్స్" పత్రికలో సంపాదకీయ రూపంగా వెలువడింది.

తాను చెప్పదలచుకున్న విషయాన్ని రెండు ముక్కలలో సూటిగా చెప్పి వెయ్యకుండా, మూడు, నాలుగు కాలాల వ్యాసాన్ని వ్రాసి, చివరి పేరాలో అసలు రంగును బయటపెట్టడం "టైమ్సు" పత్రిక ఆచారం. ఈ సంగతి తెలిసినవారు "టైమ్సు" పత్రిక ఏమి చెబుతున్నదో తెలుసుకోడానికి వ్యాసం మొదలును గాని, మధ్య భాగాన్ని గాని చదువుతూ కాలహరణం చెయ్యరు; చివరి ఒక్క బర్ 6వ తేదీ నాటి "టైమ్సు" సంపాదకీయంలో చివరి పేరా సారాంశం ఇది :

సూడెటెన్ జర్మనులు ప్రస్తుతం కోరుతున్నది కేవలం తమ అసౌకర్యాన్ని తొలగించడం మాత్రమే కాదు. అసలు జెకొస్లోవేకియాలో ఉండడమే వారికి ఇష్టంగా ఉన్నట్టులేదు. ఇదే నిజమైనట్టయితే, వారిని (సూడెటెన్ జర్మనులను) సరిహద్దులో ఉన్న స్వజాతీయులతో (జర్మనులలో) కలిసి పోనిచ్చి, జెక్ రాజ్యానికి ఇప్పటికంటె అధికమైన జాత్యైక్యతను సమకూర్చడం మంచిది. శాశ్వతమైన పరిష్కారం ఏదైనా జరగాలంటే, సూడెటన్ జర్మనుల కోర్కెల్ని మన్నించక తప్పదు. పైగా, సరిహద్దులో ఉన్న సూడెటెన్ ప్రాంతాలను పోగొట్టు కోవడం వలన కలిగే నష్టం కంటె, జాత్యైక్యత గల రాజ్యం కావడం వల్ల జెకోస్లోవేకియాకు ఎక్కువ లాభం కలగడానికి అవకాశం కనబడుతున్నది. "టైమ్స్" సంపాదకీయపు ఈ ధోరణిని చూచి, జెక్, ఫ్రెంచి రాజ్యాలు కలవరపడినవి. "టైమ్సు" పత్రిక బ్రిటిష్ ప్రభుత్వం వారి వైఖరిని వెల్లడిస్తూ ఉంటుందని ప్రతీతి. అంచేత బ్రిటిష్ ప్రభుత్వం వారి ప్రస్తుత వైఖరి ఇదే కాబోలు!" అని ప్రాగ్ లోను, ప్యారిస్ లోను కల్లోలం పుట్టింది. బ్రిటిష్ విదేశాంగ కార్యాలయానికి వెళ్ళి, నిజమేమిటో తెలుసుకోవలసిందని ఫ్రెంచి మంత్రులు లండన్ లోని తమ రాయబారిని ఆదేశించారు. ఇదే ఆదేశం జెక్ మంత్రుల దగ్గర నుంచి వారి రాయబారికి కూడా అందింది.

జెక్, ఫ్రెంచి రాయబారులు వచ్చి ప్రశ్నించగా బ్రిటిష్ విదేశాంగ కార్యాలయంవారు "టైము" పత్రిక సంపాదకీయం బ్రిటిష్ వైఖరిని ప్రకటించడం లేదన్నారు. అయితే నెల రోజులైనా గడవక ముందే "టైమ్సు" నిజం వ్రాసిందని ఋజువైంది.

27

"టైమ్సు" పత్రిక ఎప్పుడైతే సూడెటెన్ జర్మన్ ప్రాంతాలను జర్మనీలో కలిపి వెయ్యడమే జెక్ సమస్యా పరిష్కారానికి ఉత్తమమార్గమని వ్రాసిందో, అప్పుడే మరి రాయబారాల కపటనాటకాన్ని సాగించవలసిన అవసరం లేదని నాజీలు అనుకున్నారు. ఆ ప్రకారం వారు సెప్టెంబర్ 6వ తేదీనాడే సూడెటెన్ నాజీల నిద్దరిని - వీరు ప్రాగ్ పార్లమెంటులో సభ్యులు - జెక్ పోలీసులు అరెస్టు చేశారనే సాకుతో రాయబారాల నుంచి విరమించుకున్నారు.

రాయబారాలు నిలిచిపోయినందుకు బ్రిటన్ ఆందోళన పడలేదుగాని, హిట్లర్ దండయాత్రకు తిరిగి సన్నద్ధపడు తున్నాడనే వార్తకు మాత్రం ఎంతైనా అలజడిచెందింది. అతడికి ఈ తొందర దేనికో! రన్సిమన్ జెక్ ప్రభుత్వం మెడల్ని విరిచి దాన్ని ఒక్కొక్క మెట్టు దింపుతూ, జర్మనీ ఎంతకోరితే అంతా కట్టి బెట్టడానికి ప్రయత్నిస్తున్నాడు. ఇప్పటికే ఈ ప్రయత్నంలో అతడు చాల వరకు సాఫల్యాన్ని పొందాడు. మరి రెండు, మూడు నెలల పాటు ఆగితే పని జరిగిపోతుంది. యుద్ధం తప్పదని తోస్తే, జెకోస్లోవేకియాలోని అతివాద, మితవాదపక్షాలు ఏకమౌతాయి. ఇక, ఏదో ఒక రాజీ జరుగుతుందనితోస్తే వాటిలో వాటికి కలహాలు తప్పవు. జర్మన్ కేపిటలిస్టులతో చేరి అందు మూలంగా లాభాన్ని పొందాలని జెక్ కేపిటలిస్టులు చూస్తున్నారు. కమ్యూనిస్టుల్ని, సోషలిస్టుల్ని చూస్తే, జర్మన్ నాజీలకు ఎంత కోపమో, జెక్ కేపిటలిస్టులకు కూడా అంత కడుపుమంట. జెక్ కమ్యూనిష్టు పార్టీతో గాని సోషలిస్టు పార్టీతోగాని చేతులు కలిపి, జర్మనీని ప్రతిఘటించడం కంటె, దానితో రాజీని చేసుకోవడమే వారు అధికంగా వాంఛిస్తారు. అసలు జెక్ ధనిక వర్గంతోడ్పాటు వల్లనే రన్సిమన్ ఇంత వరకు నెగ్గుకు రాగలిగాడు. అంచేత ఇప్పుడు దండయాత్ర జరిపి, జెకోస్లోవేకియాలోని అతివాద, మితవాద పక్షాలకు ఐక్యత కూర్చి, లేనిపోని చిక్కుల్ని తెచ్చుకోవడం కంటె, మరికొంత కాలం వోపిక పట్టడం మంచిది కాదా? మంచిదే! అయితే బ్రిటన్ కోర్కెకు విరుద్ధంగా హిట్లర్ తొందరపడ్డానికి కారణం లేకపోలేదు. ఆయుధ సేకరణ కార్యక్రమాన్ని బ్రహ్మాండంగా కొనసాగిండం వల్ల జర్మనీ ఆర్థికంగా దెబ్బతిన్నది. చేతిలో ఉన్న రొక్కం అయిపోయింది. కొత్తగా అప్పు పుట్టడం కష్టంగా ఉన్నది. అలా అని ఆయుధ సేకరణ కార్యక్రమాన్ని ఆపడానికి వీలు లేదు. అది పూర్వం కంటె హెచ్చుగా సాగాలి. ఇక దివాళా తప్పదేమో అనే స్థితిలో ఆస్ట్రియా ఆక్రమణ జరిగింది. ఇందువల్ల ఆస్ట్రియన్ బ్యాంకులలో ఉన్న బంగారం చేజిక్కింది. అయితే, ఇది మూడు నెలలైనా గడవకముందే కరిగిపోయింది. ఇప్పుడు వెంటనే మరేదైనా దేశాన్ని దోచుకోవాలి. లేకపోతే వినాశనం తప్పదు. సూడెటెన్ జర్మనీ భాగ్యవంతమైన ప్రదేశం. అక్కడ అపారమైన ఖనిజసంపత్తి ఉన్నది; అనేక పరిశ్రమలున్నవి. జర్మనీకి దివాళా తప్పాలంటే ఈ ప్రాంతాన్ని వెంటనే స్వాధీన పరచుకోవాలి.

తన అవసరం కొద్దీ హిట్లర్ దండయాత్ర జరుపుతానంటున్నాడు. ఆస్ట్రియా పై దండెత్తి వెళ్ళినప్పుడు చూస్తూ ఊరుకోలేదా? అలాగే ఇప్పుడు కూడా ఊరుకుందామని అనుకోడానికి వీలులేదు. ఆస్ట్రియావలె జెకోస్లోవేకియా శక్తి విహీనమైన రాజ్యం కాదు. జర్మన్ సైన్యాధికారుల అంచనా ప్రకారమే (రిజర్వును కూడా కలుపుకుని) దానికి 40 సైనికదళాలున్నవి. ఈ దళాలకు కావలసిన ఆయుధాలను సప్లయి చెయ్యడానికి ప్రపంచం మొత్తంలోనే ఉత్తమమైనవిగా ఎన్నదగినట్టి స్కోడా ఫ్యాక్టరీలు ఉన్నవి. ఇక వైమానిక దళానికి కూడా లోపం లేదు. ఆధునికములైనట్టి యుద్ధ విమానాలు దాదాపు వెయ్యి వరకు ఉన్నవి. అంచేత ఆస్ట్రియా మాదిరిగా జెకోస్లోవేకియా జర్మన్ దండయాత్ర పట్ల నిస్సహాయతను ప్రదర్శించడం కల్ల. ఇందుకు. తోడు ఫ్రాన్సు ఈ దండయాత్రను ప్రతిఘటిస్తానని గట్టిగా అంటున్నది. జర్మన్ సైన్యాలు జెర్ సరిహద్దును దాటిననాడు ఫ్రెంచి సైన్యాలు జర్మన్ సరిహద్దులో అడుగు పెట్టడానికి సిద్ధంగా ఉన్నవి. ఇక, రష్యన్ సైన్యాలు ఫ్రెంచి సైన్యాలను అనుసరిస్తవి. అంచేత మహా సంగ్రామం తప్పనట్టున్నది. ఇలా అనుకుని మే 21వ తేదీ నాడు పడ్డట్టే బ్రిటన్ విపరీతంగా కలవరపడింది, కలవరపడి తిరిగి పూర్వపు పద్ధతినే అనుసరించి విషమస్థితిని తప్పించాలని అది అనుకుంది. కాని, ఈసారి పని జరగకపోగా, కొంత పరాభవం కూడా కలిగింది.

ఛేంబర్లేన్, హాలిఫాక్సు, సైమన్ : ఈ ముగ్గురు మంత్రులు దీర్ఘ సమాలోచనలు జరిపిన మీదట జర్మనీ దండయాత్ర ప్రయత్నాల్ని తీవ్రంగా నిరసిస్తూ, ఒక సందేశాన్ని - దీన్ని "నోట్" అని అంటారు - తయారుచేసారు. రిబ్బన్ ట్రాప్ బ్రిటన్ వైఖరిని హిట్లర్ కు తెలియనీయకుండా దాస్తున్నాడని బ్రిటిష్ మంత్రులకు అనుమానం కలిగింది. అంచేత వారు తమ "నోట్" సరాసరి హిట్లర్ కే అందజెయ్యవలసిందిగా తమ జర్మన్ రాయబారికి వర్తమానం చేసారు.

తన ప్రభుత్వం పంపిన "నోట్" చేరినప్పుడు (సెప్టెంబర్ 9వ తేదీ) సర్ నెవిల్లీ హెండర్సన్ న్యూరెంబర్గ్ లో జరుగుచున్న నాజీ పార్టీ కాంగ్రెసులో ఉన్నాడు. అక్కడ నుంచి అతడు "మన వైఖరి హిట్లర్‌కు పూర్తిగా తెలుసు. ఈ విషయమై సందేహం అవసరంలేదు," అని తెలియచేశాడు. అయినప్పటికీ హిట్లర్ నే స్వయంగా కలుసుకోవలసిందని బ్రిటిష్ ప్రభుత్వంవారు ఆదేశించారు. ఈ ఆదేశానుసారం సర్ నెవెల్లీ హిట్లరును చూడాలని అనుకున్నాడు గాని, జర్మన్ విదేశాంగ మంత్రి ఇందుకు సమ్మతించలేదు. "మా నాయకుడు మీకు దర్శనమివ్వడు. ఆయన మీతో మాట్లాడవలసింది ఏమీ లేదు." అని రిబ్బన్ ట్రాప్ నిర్మొహమాటంగా చెప్పాడు. ఒక ప్రభుత్వం తరపున విదేశంలో ఉన్న రాయబారికి ఆ దేశపు పరిపాలకుని ఎప్పుడు కావాలంటే అప్పుడు దర్శించి మాటాడ్డానికి హక్కు ఉన్నది. ఈ హక్కును జర్మన్ విదేశాంగ మంత్రి నిరాకరించడం బ్రిటనకు నిజంగా పరాభవమనే చెప్పాలి.

ఇటు తర్వాతనైనా సర్ నెవెల్లీ హిట్లర్ ను చూడాలనే ప్రయత్నాన్ని విరమించలేదు. నాజీ పార్టీ కాంగ్రెసులో ఏదైనా సందర్భంలో హిట్లర్ తో అయిదు నిమిషాలపాటైనా ఒంటరిగా ప్రసంగించడానికి వీలు దొరుకుతుందేమోనని అతడు వేయి కళ్ళతో ఎదురుచూచాడు. కాని, రిబ్బన్ ట్రాప్ ఈ వీలు చిక్కనివ్వలేదు. అంతట గోరింగ్, గోయిబెల్స్, న్యూరత్ మొదలైన ఇతర నాజీ పార్టీ నాయకులకు - వీరి ద్వారానైనా హిట్లర్ కు వర్తమానం చేరుతుందేమో అనే ఆశతో - సర్ నెవెల్లీ బ్రిటన్ వైఖరి తెలియబరిచాడు.

నాజీ పార్టీ కాంగ్రెసులో హిట్లర్ విదేశ వ్యవహారాల్ని గురించి ఉపన్యసించడం ఆచారం. ఈ ఆచారం ప్రకారం అతడు రేపో, మాపో ఉపన్యాసాన్ని చెయ్యవచ్చును. బ్రిటన్ వైఖరి తెలియకుండానే తీరా అతడు దుడుకుగా మాటాడివేస్తే, తర్వాత వెనక్కు తగ్గడానికి వీలుండదు. డిక్టేటర్ల బలానికి వారి ప్రతిష్ఠ సగం కారణం. చేసిన ప్రతిజ్ఞను నిలుపుకొనకపోతే, వారి ప్రతిష్ఠ నశిస్తుంది; బలం తగ్గుతుంది. అంచేత హిట్లర్ ఒకసారి బహిరంగంగా జెక్ రాజ్యం మీద యుద్ధప్రకటనచేస్తే, ఆ తర్వాత మరి రాయబారాలకు వీలుండదు. ఈ భయంతో నాజీ పార్టీ కాంగ్రెసులో హిట్లర్ జెక్ సమస్య పైన ఉపన్యసించక ముందే, అతడికి బ్రిటన్ వైఖరి తెలియజెయ్యాలని తొందరపడి, అందుకు బ్రిటిష్ ప్రధాని ఒక ఉపాయాన్ని ఆలోచించాడు. అది ఏమంటే, - వివిధ పత్రికా ప్రతినిధుల్ని పిలిపించి, జెక్ సమస్యను గురించి వారికి తమ భావాల్ని తెలపడం. ప్రపంచంలో అన్ని పత్రికలు ఈ భావాల్ని ప్రకటించినప్పుడు, హిట్లర్ తప్పనిసరిగా వీటిని చదవడం, తెలుసుకోవడం జరుగుతుంది.

ఈ ఆలోచన ప్రకారం సెప్టెంబర్ 11వ తేదీనాడు ఛేంబర్లేన్ బ్రిటిష్ సామ్రాజ్యానికి చెందిన పత్రికా విలేఖరుల్ని ఎనభై మందిని "ప్రయివేట్"గా మాటాడ్డానికి రమ్మని పిలిపించాడు. ఇక, హాలిఫాక్సు ప్రభువు బ్రిటిష్ సామ్రాజ్యానికి చెందని దేశాల పత్రికా ప్రతినిధుల్ని ఇదే విధంగా సమావేశపరిచాడు. వీరుభయులు 1914 నాటి కంటె ఇప్పుడు యుద్ధం ఎంత అధిక భయానకమైపోయిందో వివరించారు. అప్పటి వలె ఇప్పుడు తిరిగి యూరపియన్ యుద్ధం వస్తే, అసలు యూరపియన్ జాతి, యూరపియన్ సభ్యతపూర్తిగా వినాశనం కావచ్చునన్నారు. ఈ ఘోరపర్యవసానం సంగతి పూర్తిగా తెలిసి ఉన్నప్పటికీ జెక్ సమస్యను యుద్ధం ద్వారా పరిష్కరించాలని జర్మనీ ప్రయత్నిస్తే, ఆ ప్రయత్నాన్ని బ్రిటన్ ప్రతిఘటించక తప్పదన్నారు. ఇక, రాయబారాల ద్వారా సమస్యను పరిష్కరించుకోడానికి జర్మనీ అంగీకరిస్తే, బ్రిటను పూర్తిగా సహాయపడుతుందన్నారు.

బ్రిటిష్ మంత్రులు చేసిన ఈ ప్రకటన వల్ల వారు ఆశించిన ఫలితం కలగలేదు సరిగదా, హిట్లర్ మరింత ఉద్రిక్తుడయ్యాడు.

28

సెప్టెంబరు 12వ తేదీనాడు హిట్లర్ న్యూరెంబర్గ్ నాజీ పార్టీ కాంగ్రెస్ లో జెక్ సమస్యను గురించి ఉపన్యసించాడు. ఈ ఉపన్యాసాన్ని చెయ్యడానికి ముందు అతడి ఆలోచనలు ఈ ధోరణిలో నడిచాయి:

మే 21వ తేదీనాటి కంటె ఇప్పుడు జెక్ దండయాత్రకు విపులమైన సన్నాహాలు జరిగాయి. పోలెండ్, హంగరీ రాజ్యాలు ఈ దండయాత్రలో తప్పక జర్మనీకి తోడ్పడతవి. ఫ్రాన్సు, రష్యాలు కలిసి జెకొస్లోవేకియా సహాయానికి రావడం సందేహాస్పదం. సెప్టెంబరు 2వ తేదీనాడు రష్యన్ విదేశాంగ మంత్రి లిట్వినావ్ మాస్కో నగరంలోని ఫ్రెంచి రాయబారిని పిలిపించి, ఫ్రాన్సుతో కలిసి జెకొస్లోవేకియాకు సహాయం చెయ్యడానికి రష్యా సిద్ధంగా ఉన్నదన్నాడు. జర్మనీ దండయాత్రకు సన్నద్ధపడుతున్నది గనక, జెక్ - ఫ్రెంచి - రష్యన్ యుద్ధ కార్యాలయ ప్రతినిధులు వెంటనే సమావేశమై, జర్మన్ దండయాత్రను ప్రతిఘటించడానికి తగిన పద్ధతుల్ని గురించి సమాలోచించడం అవసరమ న్నాడు. నానాజాతి సమితిలో జెక్ సమస్యను చర్చకు తెచ్చి, జర్మనీ చర్యను తీవ్రంగా నిరసిస్తూ ఒక తీర్మానాన్ని చెయ్యడం మంచిదని కూడా అన్నాడు. ఈ ప్రకారం జరపడానికి ఫ్రాన్సు ఇంత వరకు ప్రయత్నించనైనా లేదు. దీన్నిబట్టి ఈ సమస్య విషయంలో రష్యాలో సహకారం చెయ్యడానికి అది సంకోచిస్తున్నదన్న విషయం స్పష్టపడుతున్నది. ఇదివరకే కొంత సైన్యాన్ని ఫ్రాన్సు మొబిలైజ్ చేసిన మాట నిజం. అయితే, బ్రిటన్ తోడ్పాటు ఉంటుందనే నమ్మకం లేకపోతే, అది జర్మనీని ప్రతిఘటించదు. ఒకవేళ ఇందుకు భిన్నంగా ప్రతిఘటించినా, బ్రిటన్ తోడ్పాటులేని ఫ్రాన్సును జయించడం పెద్ద కష్టం కాదు. అంచేత, ఎటుచూచినా భవిష్యత్తు బ్రిటన్ వైఖరిమీద ఆధారపడివుంది. యుద్ధం పేరు చెబితేచాలు, - బ్రిటన్ కలవరపడుతున్నది. ఇందుకు అది యుద్ధానికి సిద్ధంగా లేకపోవడమే కారణమై ఉండాలి. దాని ఆయుధ సేకరణ కార్యక్రమం సరిగా కొనసాగడంలేదు. వైమానిక దళనిర్మాణం చాలా అసంపూర్ణంగాను, అసంతృప్తికరంగాను ఉన్నది. ఇక, విమానాల దాడి నుంచి ప్రభుత్వ కేంద్రమైన లండన్ నగరాన్ని గాని, పారిశ్రామిక కేంద్రాలైన మాంచెస్టర్, బర్మింగ్ హామ్ మొదలైన నగరాల్ని గాని కాపాడ్డానికి తగిన యేర్పాటులు జరగలేదు. ఈ పరిస్థితిలో బ్రిటన్ ఫ్రాన్సు పక్షాన్ని యుద్ధంలో చేరినా, ఈ రెండింటిని కలిపి వోడించడం అసాధ్యం కాకపోవచ్చును. కాని, అసలు యుద్ధం వరకు పరిస్థితులురావు. 'యుద్ధాన్ని ప్రకటిస్తాము. జాగ్రత్త!' అనే బెదరింపుతోనే (Black Mail) ఇంతవరకు ఇటలీ, జర్మనీ రాజ్యాలు జయించుకువచ్చాయి. ఈ బెదరింపు ఈసారి కూడా తప్పక పనిచేస్తుంది. మే 21వ తేదీనాడు దండయాత్ర సన్నాహాలను తగినంతగా చెయ్యకపోవడం వల్ల బ్రిటన్, ఫ్రాన్సుల బెదిరింపులకు లొంగిపోవలసి వచ్చింది. దీన్ని చూచి “జర్మనీ బెదిరింపు పాఠాన్ని జర్మనీకే బాగా అప్పజెప్పాము!” అని ఇవి అనుకుంటూ ఉన్నట్టున్నవి. ఈసారి ఈ ఆటలు సాగవు.

ఈ ధోరణిలో ఆలోచించి హిట్లర్ చాలా ధైర్యంగానూ, ధాటీగానూ ఉపన్యసించాడు. ముందు అతడు బ్రిటన్, ఫ్రాన్సుల్ని వ్యంగ్యంగా విమర్శించాడు. తర్వాత జెక్ ప్రభుత్వాన్ని ఘోరంగా దూషించాడు. ఆపైన అసలు సమస్యను గురించి కింది విధంగా పలికాడు:

“సూడెటెన్ జర్మనులను జెక్ ప్రభుత్వం క్రూరంగా హింసిస్తున్నది. దీన్ని జర్మనీ సహించదని నేను ఫిబ్రవరి 22వ తేదీ నాడే స్పష్టపరిచాను... సూడెటెన్ జర్మనులు తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకోవాలంటున్నారు. వీరి ఈ స్వయం నిర్ణయ హక్కును జర్మనీ సమర్థిస్తుంది. సూడెటెన్ జర్మనులు నిస్సహాయంగా లేరు. 7 కోట్ల జర్మన్ ప్రజలు వారి పక్షాన ఉన్నారు.”

సూడెటెన్ జర్మనులకు హిట్లర్ స్వయం నిర్ణయాధికారాన్ని బహిరంగంగా కోరడంగాని, వారిని జర్మనీ సమర్థిస్తుందని బహిరంగంగా ప్రకటించడంగాని ఇదే ప్రథమం.

ఈ ఉపన్యాస ఫలితం మర్నాటికే సూడెటెన్ జర్మనీలో కనబడింది.

29

హిట్లర్ న్యూరెంబర్గ్ ఉపన్యాసం తర్వాత మరి ఏవిధమైన భయానికిగాని, సంకోచానికిగాని అవసరం లేదనుకుని, సూడెటెన్ నాజీలు ఒక్కసారిగా చెలరేగి, దారుణమైన దౌర్జన్యాలను చేశారు. పోలీసు స్టేషన్లను ముట్టడించడం; పోలీసుల్ని చావమోదడం; స్టేషన్లకు నిప్పు పెట్టడం; అందినంత వరకు తుపాకుల్ని కాజెయ్యడం; ప్రభుత్వ కార్యాలయాల మీద ఇదే విధంగా దాడి జరపడం; జెక్ - జర్మన్ సరిహద్దులో ఉన్న అడ్డాలను (frontier posts) లాగివెయ్యడం; సరిహద్దు కాపలాదారుల్ని (frontier guards) తరిమి వెయ్యడం; ఈ రీతిగా వారు జెక్ ప్రభుత్వం మీద తిరుగుబాటు చేశారు. ఇక జెక్ ప్రజలను వారు పెట్టిన హింసకు అంతులేదు. తిట్టడం, కొట్టడం, దోచుకోవడం, ఇళ్ళకు నిప్పు పెట్టడం మాత్రమే కాకుండా, ఇంతకంటె రాక్షసమైన కృత్యాలకు కూడా వారు పాల్పడ్డారు. ఇందుకు ఒక ఉదాహరణ ఇది : జెక్ జాతివారి శరీరాల మీద ఎర్రగా కాల్చిన స్వస్తిక చిహ్నంతో ముద్రవెయ్యడం! ఒక జెక్ యువతి స్థనం మీద, ఒక జెక్ శిశువు నుదుటి మీద తాను ఇలాంటి ముద్రల్ని చూచానని బ్రిటిష్ పార్లమెంటు సభ్యుడొకడు వ్రాశాడు.

ఈ అమానుష కృత్యాల కారణంగా అనేక చోట్ల సంఘర్షణలు జరిగాయి. వీటిలో 21 మంది చనిపోయారు; 75 మంది గాయపడ్డారు.

సూడెటెన్ జర్మనుల ఈ తిరుగుబాటును చూచి జెక్ ప్రభుత్వం వెంటనే (సెప్టెంబర్ 13) సైనిక శాసనాన్ని ప్రకటించింది. ఇందుమూలంగా మర్నాటికే చాల వరకు శాంత పరిస్థితులు ఏర్పడ్డవి. అప్పటి అరాచక పరిస్థితులలో సైనిక శాసనాన్ని ప్రకటించడం తప్పని సరి అయినప్పటికీ, హెర్లిన్ మొదలైన సూడెటెన్ నాజీ నాయకులు ఎగర్ లో సమావేశమై, వెంటనే "సైనిక శాసనాన్ని రద్దుపరచకపోతే, దీని పర్యవసానానికి మేము బాధ్యులము కాము!" అని తంతివార్తను పంపించారు. ఈ బెదిరింపును జెక్ ప్రభుత్వం ఖాతిరీ చెయ్యకపోవడాన్ని చూచి, ఆ మర్నాడు (సెప్టెంబర్ 14) "కార బాడ్ షరతులు మరి చెల్లవు. సూడెటెన్ ప్రాంతాలను జర్మనీలో కలిపి వెయ్యవలసిందే! ఇది నా అంత్యసందేశం" అని హెర్లిన్ ప్రకటించాడు.
జెక్ ప్రభుత్వానికి ఈ విధంగా హెర్లిన్ తన అంత్య సందేశాన్ని అందజేసి అతిధైర్యంగా జర్మనీకి పలాయన మయ్యాడు.

30

పరిస్థితులు విషమించాయి. జర్మనీ రేపో మాపో దండయాత్ర జరుపుతుంది. జెక్ -జర్మన్ సైన్యాలు సంఘర్షించడమే తడవుగా ఫ్రెంచి సైన్యాలు యుద్ధరంగంలో నిలుస్తాయి. ఫ్రాన్సు యుద్ధానికి దిగగానే, రష్యా దాన్ని అనుసరిస్తుంది. బహుశా హంగరీ ఈ తరుణంలో తటస్థంగా ఉండదు. పాత పగను పురస్కరించుకుని అది జెకొస్లోవేకియాను ఎదుర్కొంటుంది. అప్పుడు లిటిల్ అతాన్ కు చెందిన రుమేనియా, యుగొస్లోవియా రాజ్యాలు హంగరీ పైన యుద్ధాన్ని ప్రకటించక తప్పదు. పోతే, పోలెండ్ కూడా జర్మనీ పక్షాన యుద్ధంలో చేరవచ్చును. ఇన్ని రాజ్యాలు రణరంగంలో నిలిచినపుడు బ్రిటన్ గాని, ఇటలీగాని వెలుపల ఉండలేవు. బ్రిటన్ తప్పక ఫ్రాన్సుతో చేరాలి; ఇటలీ జర్మనీకి సహాయపడాలి. ఈ స్థితిలో జపాను పూరుకోదు. ఇటలీ జర్మనీలతో అది రహస్య సంధిని చేసుకుంది. ఈ సంధి ననుసరించి అది రష్యాపై యుద్ధానికి దిగుతుంది. ఇంతేకాదు. ఇదే సందుగా అది చీనాలో నుంచీ, ఇండియాలో నుంచీ తెల్లవారిని తరిమి వెయ్యడానికి పూనుకోవచ్చును కూడా. సందేహం లేదు; జర్మనీ దండయాత్ర ప్రపంచ యుద్ధానికి "సిగ్నల్" అవుతుంది. ఇప్పుడు ఆలసిస్తే, ఘోరవిపత్తు తప్పదు. హిట్లర్ "మార్చ్" అని తన సైన్యాలకు ఆర్డర్ వెయ్యకుండా వెంటనే అడ్డుపడాలి. కాని, దానికి మార్గమేమిటి? సెప్టెంబరు 14వ తేదీనాడు బ్రిటిష్ ప్రధాని ఛేంబర్లేన్ పడిన ఆందోళన ఇది.

హిట్లరుతో వ్యవహరించడం చాలా కష్టం. రాయబారులకు అతడు దర్శనమైనా ఇవ్వడం లేదు. పత్రికల ద్వారా ఏదైనా ప్రకటన చేస్తే, దాన్ని చూచి మరింత మండిపడుతున్నాడు. ఈ స్థితిలో ఒక్కటే సాధనం కనబడుతున్నది. అది ఏమంటే - తానే స్వయంగా జర్మనీకి వెళ్ళి హిట్లర్‌ను కలుసుకోవడం. ఇలా అనుకుని ఛేంబర్లేన్ "మీతో జెక్ సమస్యను గురించి చర్చించడానికి రావాలని అనుకుంటున్నాను. రానా?" అని వర్తమానం చేశాడు. ఇందుకు "సంతోషం. తప్పక రండి!" అని హిట్లరు జవాబు పంపించాడు. వారుభయుల సమావేశం బెట్టెస్ గాడెన్' లో జరగాలని నిర్ణయమైంది.

తన కార్యదర్శి సర్ హొరేస్ విల్సనను వెంటబెట్టుకొని ఛేంబర్లేన్ సెప్టెంబర్ 15వ తేదీనాడు హిట్లర్ దర్శనానికి బయల్దేరాడు. క్రాయిడలో విమానమెక్కి మ్యూనిక్ లో దిగడం, అక్కడ నుంచి మోటారులో బెట్టెస్ గాడెన్ చేరుకోవడం : బ్రిటీష్ ప్రధాని ప్రయాణానికి జరిగిన ఏర్పాటులివి. డెబ్బయ్యోపడి. ఆరోగ్యం అంతంత మాత్రంగా ఉంది. ఇంతకు పూర్వం విమానమెక్కిన వాడు కాదు. అయినప్పటికీ ప్రపంచ క్షేమాన్ని అర్థించి ఈ ప్రయాణాన్ని చేస్తున్నాడు. భళిరా! ఎంతటి ధీరుడు!! ఎంతటి శాంతిప్రియుడు!!! ఈ విధంగా లోకం అనుకుంది. ఈ ధీరుడి సంకల్పం జెక్ రాజ్యాన్ని హిట్లర్ కు బలిపెట్టడమనీ, ఈ శాంతిప్రియుడి ఆందోళన యూరపియన్ కేపిటలిజంనూ, ఇంపీరియలిజంనూ యుద్ధ విపత్తు నుంచి తప్పించడమనీ వెర్రిలోకం తెలుసుకోలేకపోయింది.

బెట్టెస్ గాడెలోని ఒక హోటల్ లో బ్రిటీష్ ప్రధానికి బస ఏర్పాటు చేశారు. బసలో ఎక్కువ సేపు ఆగకుండానే, అతడు హిట్లర్‌ను కలుసుకోడానికి బయల్దేరాడు. వారుభయులు ప్రథమ బెట్టెస్ గాడెన్ బవేరియాలో ఉంది. ఇక్కడ ఒక కొండమీద ఉన్న కోటలో హిట్లర్ నివసిస్తూ ఉంటాడు. రాజధాని నగరమైన బర్లలో కంటె ఇక్కడనే అతడు ఎక్కువగా ఉంటూ ఉంటాడు.

సమావేశం దాదాపు మూడు గంటల సేపు జరిగింది. ఛేంబర్లేన్ కు జర్మన్ భాష గాని, హిట్లరు ఇంగ్లీషు భాష గాని తెలియదు గనుక, ఒక ద్విభాషి తప్పితే, మరెవ్వరు ఈ సమావేశంలో పాల్గొనలేదు. ఏకాంతంగా వారుభయులు ఏమేమి చర్చించారో లోకానికి తెలియదు. కాని, ఛేంబర్లేన్ కామన్సు సభలో చేసిన ప్రకటన ప్రకారం వారి సంభాషణ సారాంశం ఇది:

సూడెటెన్ జర్మనులకు స్వయం నిర్ణయాధికారం ఉండి తీరాలనీ, కోరితే వారు జర్మనీలో కలసి పోవడానికి ప్రతిబంధకం ఉండరాదనీ హిట్లర్ స్పష్టపరిచాడట. ఈ స్వయం నిర్ణయాధికారం సౌమ్యంగా లభించకపోతే, దాన్ని సంపాయించుకోవడంలో సూడెటెన్ జర్మనులకు తాను తోడ్పడతా నన్నాడట. ఇందుమూలంగా ప్రపంచ యుద్ధం వచ్చినాసరే తాను వెనుదీయనన్నాడట. ఈ సమస్య తీవ్రరూపాన్ని ధరించింది గనుక తాను త్వరలోనే జోక్యం కలిగించుకొనక తప్పదన్నాడట. దండయాత్ర జరిపి తీరాలని ఇదివరకే నిశ్చయించుకుని ఉంటే, మరి నన్ను ఇంత దూరం రప్పించి, అమూల్యమైన నా కాలాన్ని వృధా పరచడం దేనికని ఛేంబర్లేన్ ప్రశ్నించగా, స్వయం నిర్ణయ సూత్రాన్ని బ్రిటీష్ ప్రభుత్వం అంగీకరిస్తున్నదని ఉన్నవాడు ఉన్నట్టుగా బ్రిటీష్ ప్రధాని మాటనిస్తే, ఆ సూత్రాన్ని ఏ విధంగా ఆచరణలోకి తీసుకు రావాలనే విషయాన్ని గురించి చర్చించడానికి సమ్మతిస్తాననీ, లేని పక్షంలో తమ సంభాషణను మరి సాగించడం వృధాయేననీ అన్నాడట. తక్కిన మంత్రులతో చర్చించి, వారి అభిమతాన్ని తెలుసుకొనకుండా నేను మాటనివ్వలేననీ, ఇందుకోసం కొంత వ్యవధి కావాలనీ, అంతవరకు తొందరపడి జెక్ దండయాత్రను జరపగూడదనీ కోరగా, ఇందుకు హిట్లర్ అంగీకరించాడట.
ఈ సంభాషణలు ముగిసిన వెంటనే సూడెటెన్ జర్మనీని త్వరగా హిట్లర్‌కు కట్టి పెట్టకపోతే, ఎక్కడ కొంప మునుగుతుందో అనే భయంతో ఛేంబర్లేన్ తిరుగు ముఖమయ్యాడు.

31

సెప్టెంబరు 16వ తేదీనాడు ఛేంబర్లేన్ లండన్ కు తిరిగి వచ్చాడు. వచ్చిన వెంటనే మంత్రివర్గంలో తనకు ఆప్తులైన వారిని సమావేశపరచి హిట్లరూ తనకూ జరిగిన సంభాషణను వారికి విశద పరచాడు. హాలిఫాక్సు ప్రభువు, సర్ శామ్యూల్ హోర్, సర్ జాన్ సైమన్ : ఈ ముగ్గురే ప్రధానికి ఆప్తులైన మంత్రులు. ముఖ్యమైన విషయాల్ని గురించి కూడా తక్కిన మంత్రులకు తెలపకుండానే కేవలం ఈ ముగ్గురినే సంప్రతించి నిర్ణయాలను చెయ్యడం ఛేంబర్లేనుకు పరిపాటి. అంచేత ప్రధానిని కలుపుకొని ఈ నలుగురినీ "ఇన్నర్ కేబినెట్" (దీన్ని "రహస్య మంత్రివర్గం" అని తెలుగు చెయ్యవచ్చునేమో) అని అంటారు.

జర్మనీ నుంచే "మీతో అవసరంగా మాట్లాడాలి. వెంటనే బయల్దేరి లండనకు రావలసింది" అని ప్రాగ్ లో ఉన్న రన్సిమన్ ప్రభువుకు చేంబర్లేన్ వర్తమానం చేశాడు. ఈ వర్తమానం ప్రకారం రన్సిమన్ - ఛేంబర్లే తో పాటే - లండన్ చేరుకొని "ఇన్నర్ కేబినెట్" సమావేశానికి హాజరయ్యాడు.

దాదాపుగా గంటన్నర సేపు కూడబలుక్కున్న తర్వాత వీరందరు చేరి హిట్లరు సంతృప్తికరంగా జెక్ సమస్యను పరిష్కరించడానికి కింది షరతుల్ని ఏర్పాటు చేశారు.

- 1. ఎక్కడెక్కడ మొత్తం జనాభాలో నూటికి 60 మంది కంటే అధికంగా జర్మన్ జాతి వారున్నారో, ఆ ప్రాంతాలను వెంటనే జర్మనీలో కలిపి వెయ్యడం. ఈ కార్యభారాన్ని వహించడానికి ఒక అంతర్జాతీయ సంఘాన్ని నియమించడం, పోతే, మొత్తం జనాభాలో నూటికి 50 మంది కంటే తక్కువగా జర్మన్ జాతి వారున్న ప్రాంతాలకు రాష్ట్రీయ స్వపరిపాలనాధికారాన్ని ప్రసాదించడం.
- 2. కొంత ప్రాంతాన్ని జర్మనీకి కలపగా ఏర్పడే కొత్త జెక్ సరిహద్దుల రక్షణను బ్రిటన్-ఫ్రాన్సు - జర్మనీ-ఇటలీ రాజ్యాలు గ్యారంటీ చెయ్యడం.
- 3. జెకొస్లోవేకియా తాను ఫ్రాన్సుతోను, రష్యాతోను చేసుకున్న పరస్పర రక్షణ సంధుల్ని రద్దుపరచు కోవడం,

హిట్లర్ కోరింది; - సూడెటెన్ జర్మనులకు స్వయంనిర్ణయాధికారం ఉండాలని. అంటే, జర్మనీలో చేరిపోవడమా లేక, జెక్ రాజ్యంలోనే ఉండిపోవడమా అనే విషయాన్ని సూడెటెన్ జర్మనులు తమంతట తామే నిర్ణయించుకోవడానికి వీలుండాలని. దీని ప్రకారం సూడెటెన్ జిల్లాలలో "ప్లైబ్ సైట్"• జరపవలసి వచ్చేది. బ్రిటీష్ షరతుల ప్రకారం ఈ "ప్లెబి సైట్" *(ప్రజాభిప్రాయాన్ని తెలుసుకోడానికి వోట్లను తీసుకోవడం.)* తతంగంతో కూడా నిమిత్తం లేకుండా పోయింది. ఇలా చెయ్యడానికి చేంబర్లేన్ చెప్పిన కారణం ఇది : "జెక్ రాజ్యంలోని సూడెటెన్ మైనారిటీ సంఘానికి స్వయం నిర్ణయాధికారాన్ని ప్రసాదిస్తే, తక్కిన మైనారిటీ సంఘాల వారు కూడా ఈ హక్కును కోరతారు. అపుడు పోలెండుకూ, హంగరీకీ కూడా కొంత రాజ్యాన్ని కట్టి బెట్టవలసి వస్తుంది. హిట్లర్ సూడెటెన్ ప్రాంతం తనకు చెందాలని కోరుతున్నప్పుడు, టెస్ ఛెన్ జిల్లా తనకు రావాలని పోలెండ్, రుథీనియాలో కొంత భాగం తనకు రావాలని హంగరీ కోరడంలో తప్పులేదు. హిట్లర్ కోర్కె న్యాయమైనదైతే, పోలెండ్ - హంగరీల కోర్కె కూడా న్యాయమైనదే! హిట్లర్ ను సంతృప్తి పరచాలని ఎంతో తహతహలాడుతున్న ఛేంబర్లేన్, పోలెండ్-హంగరీలకు మొండి చెయ్యి చూపించాలని ఎత్తు వెయ్యడం వాటికి జర్మనీకున్నంతటి పశుబలం లేదనా? అయితే, ఛేంబర్లేన్ కు న్యాయంపట్ల పక్షపాతం కంటే, పశుబలం అంటే భయం హెచ్చుగా ఉన్నదన్నమాట.

హిట్లర్ సూడెటెన్ జిల్లాలను అపహరించడం విషయమై పట్టుదల చూపించాడే గాని, తన పట్టు నెగ్గిన తర్వాత మిగిలే జెక్ రాజ్యపు విదేశాంగ నీతిని గురించి తలవనైనా లేదు. అయినా, బ్రిటీష్ షరతులలో ఫ్రాన్సుతోనూ, రష్యాతోనూ తనకు గల

సంధుల్ని జెకొస్లోవేకియా రద్దుపరచు కోవాలని ఉన్నది. ఇందుకు బదులుగా కొత్త జెక్ రాజ్యపు సరిహద్దుల రక్షణకు బ్రిటన్, ఫ్రాన్సు, జర్మనీ, ఇటలీ రాజ్యాలు బాధ్యత వహించాలని ఒక నియమం ఉన్నమాట నిజం. అయితే, ఇలాంటి నియమం నానాజాతి సమితి "కవనెంట్"లోనే ఉన్నది. ఇప్పుడు ఆ "కవనెంట్"కు భిన్నంగా జెక్ రాజ్యాన్ని హిట్లరు బలి పెడుతున్న బ్రిటన్ ఫ్రాన్సులు, ఇకముందు జెక్ సరిహద్దుల రక్షణ విషయంలో తమ వాగ్దానాన్ని కాపాడుకుంటాయని నమ్మకమేమిటి? జెక్ విదేశాంగ నీతిని మార్పించడంలో ఛేంబర్లేన్ కు గల ఆలోచన ఒకటే. అది ఏమంటే యూరపియన్ రాజకీయ రంగంలో బ్రిటన్, ఫ్రాన్సు, జర్మనీ, ఇటలీ రాజ్యాలను ఏకం చెయ్యడమూ, సోవియట్ రష్యాను దూరంగా తోసివెయ్యడమూ!

సెప్టెంబరు 16వ తేదీనాడు “ఇన్నర్ కేబినెట్” సమకూడితే, 17వ తేదీనాడు పూర్తిగా "కేబినెట్" సమావేశమైంది. ఉదయం 11 గంటలు మొదలు సాయంత్రం 5 1/2 గంటల వరకు (మధ్య గంటన్నర విరామంతో) చర్చ జరిపిన మీదట ఈ సమావేశం ముగిసింది. దీనిలో ప్రధాన మంత్రి, విదేశాంగ మంత్రి మొదలైనవారు సూచించిన షరతుల్ని ఆమోదించడమూ, వాటి విషయమై ఫ్రెంచి మంత్రుల్ని ఆలోచించాలనే నిర్ణయమూ జరిగింది.

బ్రిటీష్ ప్రభుత్వం వారి ఆహ్వానం మీద ఫ్రెంచి ప్రధాని దలదియర్, విదేశాంగ మంత్రి బానే, ఆ మర్నాడు - సెప్టెంబర్ 18వ తేదీనాడు - లండన్ నగరం చేరుకున్నారు. ఛేంబర్లేన్ వారికి తన బెర్టి గాడెన్ ప్రయాణాన్ని గురించి, ఆ తర్వాత తాను నిర్ణయించిన షరతుల్ని గురించీ చెప్పి, జెక్ రాజ్యం పట్ల తాను అవలంబించదలచుకున్న విధానానికి ఫ్రాన్సు అంగీకారాన్ని సంపాయించాడు.

32

ఈలోపుగా జెకొస్లోవేకియాలో జరిగిన సంఘటనలు ఇవి : సూడెటెన్ నాజీల దౌష్ట్యాలు దుస్సహంకాగా సెప్టెంబరు 16వ తేదీనాడు జెక్ ప్రభుత్వం వారు సూడెటెన్ నాజీ పార్టీ చట్టవిరుద్ధ మైనదని ప్రకటించారు. ఇదే సమయంలో హెర్లిన్ అరెస్టుకు వారంటు కూడా జారీచేశారు. కాని, ఇంతకుముందే హెర్లిన్ జర్మనీ చేరుకున్నాడు. తన పార్టీ మీద నిషేధాజ్ఞను ప్రకటించారని తెలియగానే, అతడు తాను సూడెటెన్ నాజీ సైనిక దళాన్ని నిర్మిస్తున్నాననీ, స్వతంత్రాన్ని కోరే సూడెటెన్ జర్మనులందరు దానిలో చేరాలనీ ఒక విజ్ఞప్తిని చేశాడు. ఆస్ట్రియన్ నాజీలను చేర్చి “ఆస్ట్రియన్ లీజియన్” అనే ఒక దళాన్ని ఇంతకు పూర్వం ఇదే విధంగా హిట్లర్ ఏర్పాటు చేయించాడు. ఈ దళాలను ఏర్పాటు చేయించడంలో అతడి ఉద్దేశం ముందు వాటిని దండయాత్రకు పంపించి, ఆ తర్వాత వాటికి సహాయాన్ని చేస్తున్న సాకుతో జర్మన్ సైన్యాలను తరలించడం.

తాను సైనికదళాన్ని ఏర్పరుస్తున్నానని హెర్లిన్ ప్రకటించగానే, అనేకమంది సూడెటెన్ నాజీలు జెక్ సరిహద్దును దాటి జర్మనీలోకి పోసాగారు. ఇందుకుతోడు జర్మనీ నుంచి పిస్తోళ్ళు, తుపాకులు మొదలైన ఆయుధాలు జెక్ సరిహద్దులలోకి రహస్యంగా సరఫరా కాసాగినవి. ఆయుధాలను సరఫరా చెయ్యడంలో నాజీలు చిత్రవిచిత్రమైన పద్ధతుల్ని అవలంబించారు. ఈ సమయంలో జర్మనీ నుంచి వచ్చిన పళ్ళ డబ్బాలను అనుమానం కొద్దీ జెక్ పోలీసులు పగల గొట్టి చూడగా, వాటిలో పిస్తోళ్ళు కనబడినవి!

కొత్తగా ఏర్పడ్డ ఈ విపత్తుల్ని చూచి, జెక్ ప్రభుత్వం వారు సెప్టెంబరు 17వ తేదీనాడు సూడెటెన్ జిల్లాలో సైనిక శాసనాన్ని ప్రకటించారు. జర్మనీకి వెళ్ళదలచుకున్న వారిని నిరోధించాలనీ, సూడెటెన్ నాజీల దగ్గరి ఆయుధాలను

జప్తుచేసుకోవాలని కూడా వారు ఉత్తరువుచేశారు. జెక్ ప్రభుత్వం వారు అవలంబించిన ఈ పద్ధతులవల్ల చేయిజారిపోతున్నవా అన్నట్టు కనబడిన పరిస్థితులు పూర్తిగా అధీనంలోకి వచ్చాయి.

జెక్ సరిహద్దులలో తిరిగి శాంతి ఏర్పడుతూ ఉంటే, హెర్లిన్ గాని, హిట్లర్ గాని చూస్తూ ఊరుకోలేదు.

“మనల్ని దాస్య విముక్తుల్ని చెయ్యగల శుభసమయం సమీపిస్తున్నది. ప్రతిఘటనపై ప్రతిఘటన సాగించండి" అని సెప్టెంబర్ 18వ తేదీనాడు హెన్లెన్ ప్రకటించాడు. ఆనాడే హిట్లర్ ఆదేశానుసారం అనేక చోట్ల జర్మన్ సైనికులు జెక్ సరిహద్దులలో ప్రవేశించి, జెక్ సరిహద్దు ఉద్యోగులపై దౌర్జన్యాలను చేశారు. ఆష్ అనేచోట ఈ దౌర్జన్యాలు చాలా తీవ్రరూపాల్ని ధరించినవి. అక్కడ దాదాపు 200 మంది జర్మన్ సైనికులు రైఫుల్సుతోనూ, హేండ్ గ్రెనేడ్స్ తోనూ, మెషిన్ గన్సుతోనూ జెక్ సరిహద్దు కాపలాదారులపై పడి వారిలో కొందరిని గాయపరిచారు.

తనకు చేసిన వాగ్దానానికి భిన్నంగా హిట్లర్ ఈ దుండగాల్ని జరిపిస్తున్నాడుగదా అని ఛేంబర్లేన్ సంకోచించలేదు సరిగదా, వీటిని చూచి జెక్ రాజ్యాల్ని బలి పెట్టడానికి అతడు మరింత తొందరపడ్డాడు. సెప్టెంబర్ 19వ తేదీనాటి ఉదయం ప్రాగ్ నగరంలోని బ్రిటిష్, ఫ్రెంచి రాయబారులు డాక్టర్ బెనిస్ కార్యాలయానికి వెళ్లి ఆయనకు తమ ప్రభుత్వాలు నిర్ణయించిన షరతుల్ని అందజేశారు. వీటిని చూచి జెక్ ప్రజలేమి, ప్రభుత్వంవారేమి, క్రోధ, విస్మయ, విషాద భరితులయ్యారు. “ఇంతకంటె అన్యాయంగాని అవమానంగాని ఉండదు. ఏమైనా సరే ఈ షరతులకు అంగీకరించవద్దు” అని ప్రజలు ఆందోళన చేశారు. “మా అభిమతానికి భిన్నంగా మీరు షరతుల్ని అంగీకరించడం మాకు ద్రోహాన్ని చెయ్యడం సుమా!” అని కూడా హెచ్చరించారు.

ప్రజలు ఇంతటి స్వాతంత్ర్యదీక్షను, ఇంతటి దృఢసంకల్పాన్ని ప్రకటించినందుకు జెక్ ప్రభుత్వంవారు సంతోషించారు. కాని, షరతుల్ని నిరాకరించే పక్షంలో బ్రిటన్, ఫ్రాన్సుల వైఖరి ఎలా ఉంటుందో తెలుసుకోవడం అవసరమని వారు అనుకున్నారు. ఈ రెండు రాజ్యాలు ముఖ్యంగా ఫ్రాన్సు - సహాయపడని పక్షంలో జర్మనీని ఒక్క జెకొస్లోవేకియా ప్రతిఘటించడం అసాధ్యం. 19వ తేదీ పగలు, ఆ రాత్రి విరామం లేకుండా సమాలోచనలు జరిపి, 20వ తేదీనాడు జెక్ ప్రభుత్వంవారు “మేము ఈ షరతుల్ని నిరాకరించి, హిట్లర్ దండయాత్రను ప్రతిఘటించే పక్షంలో మీరు మా సహాయానికి వస్తారా?” అని బ్రిటన్, ఫ్రాన్సుల్ని అడిగారు. ఇందుకు “లేదు, మేము తాటస్థ్యాన్ని వహించవలసి ఉంటుంది” అని అవి ప్రత్యుత్తరాన్ని పంపించినవి. అంతట తిరిగి దీర్ఘ సమాలోచనలను జరిపి “మీ షరతులు అన్యాయంగా ఉన్నవి. ఈ సమస్యను జెక్-జర్మన్ రాజ్యాలకు 1926లో జరిగిన పంచాయితీ ఒడంబడిక ప్రకారం పరిష్కరించుకోవడం తగునని మా అభిప్రాయం” అని జెక్ మంత్రులు అన్నారు. దీనికి కూడా అంగీకరించక “యుద్ధం లేకుండా ఈ సమస్య పరిష్కారం కావాలంటే, మా షరతుల్ని వీసమైనా తగ్గించడానికి వీలులేదు. పైగా, మీరు త్వరగా వాటికి అంగీకరించడం మంచిది. ఎంచేతనంటే, - ఆలస్యం జరిగితే, హిట్లర్ సహించనంటున్నాడు!” అనే ధోరణిలో ఛేంబర్లేన్ వొత్తిడి పెట్టాడు.

అంతట తమకు గత్యంతరం లేదనుకుని "సరే మీ షరతులకు అంగీకరిస్తున్నాము!" అని సెప్టెంబర్ 21వ తేదీనాడు జెక్ ప్రభుత్వం వారు బ్రిటన్, ఫ్రాన్సులకు తెలియబరిచారు. వెంటనే “ప్రపంచ శాంతికి మీరుచేసిన ఈ మహత్తర త్యాగాన్ని మేము ఎంతైనా హర్షిస్తున్నాము” అని ఛేంబర్లేన్ ఒక శుష్కసందేశాన్ని అందజేశాడు.

33

తాము నిర్ణయించిన షరతుల్ని ఫ్రాన్సు ఆమోదిస్తుందో, లేదో అని ఛేంబర్లేన్ ఆందోళన పడ్డాడు. నయానో భయానో ఫ్రాన్సు ఆమోదాన్ని సంపాయించినా, జెకొస్లోవేకియా యెదురు తిరుగుతుందేమోనని భయపడ్డాడు. కాని, ఫ్రాన్సు ఏమీ చిక్కుపెట్టలేదు; తప్పనిసరిగదా అని జెకొస్లోవేకియా తలవొగ్గింది. ఇక, తన ప్రయత్నం సఫలమైనట్టే! ఇంకొక్క సారి జర్మనీ వెళ్ళడం; "నీవు కోరినదాన్ని యుద్ధంతో నిమిత్తం లేకుండానే సంపాయించి పెట్టాను - నా ప్రజ్ఞ చూచావా?" అని హిట్లర్ కు చెప్పడం; అతడి కృతజ్ఞతను అందుకోవడం;

బ్రిటన్ - ఫ్రాన్సు - ఇటలీ - జర్మనీ రాజ్యాల ఒడంబడికకు ప్రాతిపదికను వెయ్యడం; ప్రపంచ శాంతిని కాపాడిన మహామహుడు అనే ధన్యవాదాలను పొందడం: ఛేంబర్లేన్ కన్నటి కమ్మని కలలివి. కలలతో అతడు సెప్టెంబర్ 22వ తేదీనాడు జర్మనీకి రెండవసారి ప్రయాణం కట్టాడు.

హిట్లర్ - ఛేంబర్లేన్ మొదటి సమావేశం జరిగింది బెట్టెస్ గాడెలో ఇది చాలా దూరాన - ఆస్ట్రియా సరిహద్దు దరిదాపులలో - ఉన్నది. ఇంతదూరం ప్రయాణం చెయ్యడం ఛేంబర్లేన్ కు శ్రమ అనే కారణంతో "ఈసారి మనం గోడెస్ బర్గ్ లో కలుసుకుందాము" అని హిట్లర్ అన్నాడట. ఇది రైన్ నది వొడ్డున - ఫ్రాన్సు సరిహద్దు సమీపంలో - ఉన్నది. ఇక్కడనే సెప్టెంబర్ 22వ తేదీ మధ్యాహ్నం ఛేంబర్లేన్ హిట్లర్‌ను సందర్శించాడు.

"నా ప్రయత్నం సఫలమైనట్టే!" అని పెద్ద ఆశతో వచ్చిన బ్రిటిష్ ప్రధానికి అంతకంతకు ఆశాభంగం కలుగడానికి ఎంతో సేపు పట్టలేదు. ఫ్రాంకో-బ్రిటిష్ షరతుల్ని గురించి చర్చించినైనా చర్చించకుండా "అబ్బే! వీటిని నేను అంగీకరించలేను" అని హిట్లర్ తెగవేసి చెప్పాడు. "వీటిలో లోపమేమిటి?" అని అడిగితే, "వీటివల్ల మా కోర్కెలు సిద్ధించడంలో వృధాకాలయాపన జరుగుతుంది," అన్నాడు. కాలయాపన జరుగకుండా మేము పూచీ పడతాముగదా" అని అంటే, "మీరు మాటనివ్వవచ్చునుగాని, జెక్ ప్రభుత్వాన్ని నమ్మడానికి వీలులేదు" అన్నాడు. "బెట్టి డెన్లో మీరు ఏమి కోరినారో అది ఈ షరతుల ద్వారా లభ్యమౌతున్నపుడు, ఇలా లేనిపోని పేచీలు పెట్టడం సబబుగా"దని గట్టిగా మాటాడేసరికి, "ఇంతకూ మీరు బెట్టి డెన్ షరతులకు జెక్ ప్రభుత్వాన్ని ఒప్పించుకు రాగలరని నేననుకోలేను" అని అసలు రంగు బయటపెట్టాడు.

దీన్ని చూచి ఛేంబర్లేన్ కేవలం తెల్లబోయాడు! హిట్లర్ ప్లెబిసైట్ కోరితే, తాను ఆ ప్లెబిసైట్ తో కూడా నిమిత్తం లేకుండా సూడెటెన్ ప్రాంతాన్ని కట్టబెట్టవస్తే, తనకు జరగవలసిన మర్యాద ఇదేనా? అని అతడు విచారించాడు. కాని, ఛెంబర్లేన్ తెచ్చిన షరతుల్ని నిరాకరించడానికి హిట్లర్ కు బలమైన కారణాలు లేకపోలేదు. సూడెటెన్ జర్మనులు ఏ గంగ కలిసినా అతడికి ఒక్కొటే! అతడికి కావలసింది ఏమంటే, - జెక్ రాజ్యంలోని ధనవంతమైన ప్రాంతాలు (గనులు, పరిశ్రమలు, పంటలు విశేషంగా ఉన్నట్టి ప్రదేశాలు) వెంటనే జర్మనీ వశం కావడం. ఇక్కడ "వెంటనే" అనే షరతు చాలా ముఖ్యం. జర్మనీ దివాళాస్థితిలో ఉన్నది. వెంటనే ఇంత దోపిడి సొత్తు వచ్చిపడకపోతే, ముప్పుతప్పదు. ఇంతేకాదు. ఏకొంచెమైనా సరే అవకాశాన్ని ఇస్తే, సూడెటెన్ జిల్లాలలోని జెక్ జాతివారు తమ ఆస్తిని జెక్ ప్రాంతాలలోకి జేరవేస్తారు. అన్నట్టు వ్యవధిని ఇవ్వడం వల్ల ఇంకొక నష్టం కూడా ఏర్పడుతుంది. జర్మనీ దండయాత్రను ప్రతిఘటించడానికి సూడెటెన్ ప్రాంతాలలో జెక్ ప్రభుత్వంవారు కోట్లకొలది ధనాన్ని వెచ్చించి పర్వతాలలో నేమి, భూగర్భంలోనేమి, లోహదుర్గాలను నిర్మించారు. కొంచెం వీలు దొరికితే వారు వీటిని నిరుపయోగం చేసివేస్తారు. అంచేత సూడెటన్ ప్రాంతపు ఆక్రమణ వల్ల లాభం ఉండాలంటే, అది వెంటనే జరిగితీరాలి. కాని, ఛేంబర్లేన్ షరతుల ప్రకారం వెంటనే కార్యసాఫల్యం జరగడానికి వీలులేదు. పైగా, నూటికి యాభై మందికంటె అధికంగా జర్మన్ జాతివారున్న ప్రాంతాలు మాత్రమే జర్మనీతో కలవాలని

అనడంవల్ల, అనేక పారిశ్రామిక కేంద్రాలు, సారవంతమైన భూములు, ముఖ్యమైన గనులు జెక్ రాజ్యంలో మిగిలిపోతున్నవి. ఇక, బెట్టెస్ గాడెలో ఏదో నోరుజారినాముగదా అని అప్పటి మాటలనే పట్టుకుని వేలాడ్డం తగునా? చాలు, ఛేంబర్లేన్ షరతులలో ఇంకొక చిక్కు కూడా ఉన్నది. జెక్ రాజ్యం నుంచి జర్మనీకి విడగొట్టి ఇవ్వవలసిన ప్రాంతాలను ముందు ఫ్రెంచి, బ్రిటిష్ సైన్యాలు ఆక్రమించుకుని, కొన్ని రోజులుగడిచి, కొంతవరకు శాంతపరిస్థితులు ఏర్పడిన తర్వాత, వాటిని జర్మన్ ప్రభుత్వానికి అప్పజెపుతాయని ఈ షరతులలో ఉంది. ఇందు మూలంగా జెక్ రాజ్యం మీద జైత్రయాత్ర జరిపిన ఖ్యాతి దక్కకుండా పోతుంది; సూడెటెన్ జర్మనులకు జర్మన్ సైన్యాల ఆగమనంతో దాస్యబాధ తొలగినదనే ప్రతిష్ఠను పొందడానికి వీలుండదు. నిజంగా యుద్ధాన్ని చెయ్యకపోయినా, రైన్ లాండ్ ఆక్రమణలో నేమి, ఆస్ట్రియా ఆక్రమణలోనేమి జర్మన్ సైనిక శక్తి అప్రతిహతమైనదనే భావాన్ని కలిగించడంవల్లనే నాజీ ప్రభుత్వం అంటే స్వదేశీయులలోను, విదేశీయులలోను భయభక్తులు ఏర్పడ్డాయి. అంచేత ఈసారి కూడా సైనికబల ప్రదర్శనం జరిగి తీరవలసిందే! ఈ అన్ని కారణాలవల్లను ఎదురుతిరిగిన హిట్లరును ఏవిధంగానైనా సరే తన షరతులకు ఒప్పించుదామని 23వ తేదీ నాడు ఛేబర్లేన్ చాలా గట్టిగా ప్రయత్నించాడు. కాని, అతడి ప్రయత్నం సాగలేదు. చివరికి పూర్తిగా విసిగి "అయితే, మీ షరతులు ఏమిటో ఖచ్చితంగా (లిఖితపూర్వకంగా) చెప్ప వలసింది," అని అడగగా, హిట్లర్ ఒక మ్యాపూ, ఒక మెమొరాండంనూ చేతికిచ్చాడు.

హిట్లర్ ఇచ్చింది జెక్ రాజ్యం మ్యాపు. దానిలో కొన్ని భాగాల మీద ఎర్రరంగు, మరికొన్నింటి మీద పచ్చరంగు అద్ది ఉంది. మ్యాప్ తో జతపరచిన మెమొరాండములో ఎర్రరంగు అద్ది ఉన్న భాగాల్ని అక్టోబర్ 1వ తేదీనాడు ఉన్న వాటిని ఉన్నట్టుగా తనకు ఒప్పగించాలన్నాడు. "ఉన్నవాటిని ఉన్నట్టుగా" అని అంటే - అక్కడ ఉన్న ఆస్తిపాస్తుల్లో పూచిక పుల్లను కూడా కదపగూడదన్నమాట! భూగర్భంలోను, పర్వత శ్రేణుల పైనను ఉన్నట్టి దుర్గాలను చెక్కు చెదరకుండా వశపరచమని కోరడమే కాకుండా, గనులను యంత్రాగారాలను నష్టపరిహారం లేకుండా కట్టబెట్టాలని పట్టుపట్టడమే కాకుండా, చివరికి సూడెటెన్ ప్రాంతాలలో నుంచి జెక్ జాతివారు ఒక్క ఆవునైనా సరే తోలుకుపోరాదనీ, ఒక్క మేకనైనా సరే వెంటబెట్టుకు వెళ్ళరాదనీ హిట్లర్ శాసించాడు. యుద్ధంలో ఓడిపోయిన దేశం పైన కూడా ఇంతటి కఠినమైన నిబంధనల్ని పెట్టడం అరుదు!!

పోతే, మ్యాప్ లో పచ్చసిరాతో అద్దిన భాగాలలో ప్లెబిసైట్ జరగాలని హిట్లర్ అన్నాడు. ఈ ప్లెబిసైట్ ఎప్పుడు జరగవలసిందీ, ఏ విధంగా జరగవలసిందీ మొదలైన వివరాలను నిర్ణయించడానికి ఒక జెక్ - జర్మను సంఘాన్ని గాని, అంతర్జాతీయ సంఘాన్నిగాని నియమించవచ్చునన్నాడు. ప్లెబిసైటకు ముందు ప్లెబిసైట్ జరుగుతున్న ప్రాంతాలలో నుంచి జర్మన్ సైన్యాలను తొలగిస్తానన్నాడు. జెక్ సైన్యాలు కూడా ఇదే విధంగా తొలగిపోవాలన్నాడు. అసలు ఫ్రాంకో - బ్రిటిష్ షరతుల సంగతి పైకి పొక్కినప్పుడే "ఇంతకంటె సిగ్గుచేటు పని ఉండదు" అనీ, "ఇది పశుబలానికి తలవొగ్గడం" అనీ, "తమను నమ్ముకున్న జెక్ రాజ్యానికి బ్రిటన్, ఫ్రాన్సులు ద్రోహాన్ని చేసినవి" అనీ ప్రపంచం మొత్తం మీద ప్రజలేమి, పత్రికలేమి తీవ్రంగా విమర్శించినవి. ఇక, ఇప్పుడు ఈ గోడ్స్బర్గ్ షరతులకు అంగీకరిస్తే, లోకం ముఖం ఈ చూడ్డం కష్టం. ఈ భయంకొద్దీ "నేను ఈ షరతులకు అంగీకరించలేను. లండన్ వెళ్ళి మీరు నా చేతికిచ్చిన మ్యాపునూ, మెమోరాండంనూ జెక్ ప్రభుత్వానికి పంపిస్తాను. తర్వాత మీ ఇష్టం; వారి ఇష్టం" అని ఛేంబర్లేన్ చెప్పివేశాడు.

సెప్టెంబర్ 23వ తేదీ రాత్రి 10-30 మొదలు దాదాపు తెల్లవారు ఝాము వరకూ హిటర్ మనస్సు తిప్పాలని ప్రయత్నించి మరి లాభం లేదని ధృవపరచుకున్న తర్వాత ఛేంబర్లేన్ లండన్ తిరిగి వెళ్ళాడు.

34

ప్రాగ్ ప్రభుత్వం ఎప్పుడైతే ఫ్రాంకో - బ్రిటిష్ షరతుల్ని అంగీకరించిందో, అప్పుడే ఇక జర్మన్ ప్రభుత్వం ఏర్పడినట్టు ఎంచుకుని, సూడెటెన్ నాజీలు తమ జిల్లాలలోని పోలీసు స్టేషన్లను, ప్రభుత్వ కార్యాలయాన్ని ఆక్రమించుకున్నారు. ఈ దురాక్రమణను జెక్ పోలీసులు గాని, సైనికులు గాని ఎందువల్లనో ప్రతిఘటించలేదు. ఫ్రాంకో - బ్రిటిష్ షరతుల్ని హిట్లర్ అంగీకరిస్తాడో, లేదో ఇంకా తెలియకముందే జెక్ ప్రభుత్వం సూడెటెన్ జిల్లాలను నాజీల చేతిలోకి పోనివ్వడం చాలా తెలివి తక్కువ పని. సెప్టెంబర్ 22వ తేదీనాడు హోడ్జా మంత్రివర్గం రాజీనామా పెట్టడానికి ఈ తెలివితక్కువ ఒక ప్రధాన కారణం కావచ్చును.

హోడ్జా మంత్రివర్గం రాజీనామా పెట్టగానే, జనరల్ సిరోవీ కొత్త మంత్రివర్గాన్ని ఏర్పాటు చేశాడు. ఈ కొత్త మంత్రివర్గంలో సిరోవీ ప్రధాని మాత్రమే కాకుండా, యుద్ధమంత్రి కూడా. జనరల్ సిరోవీ జీవితం, అతడి స్వభావం ఒక దాని కంటె ఒకటి మహిమాన్వితమైనవి. అతడి విచిత్ర చరిత్రలోని కొన్ని అంశాలు *('ప్రజామిత్ర' ప్రకటించిన వ్యాసం లోనివి ఈ వాక్యాలు.)* ఇవి:

సరోవీ గొప్ప సంయమశక్తి కలవాడు. గర్వం లేదు. సామాన్య సైనికులతో కలిసి మెలిసి ఉంటాడే కాని పెడతొలగి ఉండడు. సిరోవీ యుద్ధ శౌర్యానికిగాను తాను పొందిన మెడల్సు అన్నీ ధరిస్తే అవి తొమ్మిది పంక్తులు అవుతాయి. కాని, వాటిని ధరించడానికి అతడు ఎప్పుడూ శ్రద్ధపెట్టడు; ఉత్సాహం చూపడు. కాబట్టే అతడిని యదాలాపంగా చూచినవాళ్ళు అతడు ఒక లోకైక వీరుడని అనుకోనే అనుకోరు. అతడు ఎంత మితభాషియో అంతటి వినయసంపన్నుడు.

"అతడు వివాహితుడు. పిల్లలు మాత్రం లేరు. ప్రాగ్ పట్టణానికి సమీపంలో ఉన్న తనతోటలో అతడు నిరాడంబరంగా నివసిస్తూ ఉంటాడు. వేటాడ్డం, ఫోటోగ్రాఫులు తీయడం అతని విలాన వృత్తులు. అతడు మితంగా పొగనూ, మద్యాన్ని త్రాగుతాడు. కాయాన్ని వ్యాయామసుస్నిగ్ధం చేసుకునే విషయంలో అతడు మిక్కిలి శ్రమపడ్డాడు. శరీరారోగ్య విషయంలో అతడికి ఇంత శ్రద్ధ ఉండడంచేతనే అతడు దేనిని కాని అమితంగా సేవించడు. యౌవనంలో అతడు సాముగరిడీలు లెస్సగా నేర్చిన జెట్టి. ఇప్పుడు అతడికి ఏభైమూడేళ్ళు పైబడ్డా అతని శరీరం మీద వృద్ధాప్యపు చిహ్నాలు ఏమిన్నీలేవు. అతడు అనుకోకుండాను, ఇష్టపడకుండాను అతడి శరీరం ఇటీవల స్థూలీకృతం అయి హెచ్చుతూకాన్ని పొందింది.

ఉజర్మన్ నియంత హిట్లర్ వలె సిరోవీ కూడా తన జీవిత కాలంలో ఒకప్పుడు శిల్పకారకవృత్తి అవలంబించడానికి ప్రయత్నించాడు.
ఆ ప్రయత్నంలో హిట్లర్ కృతకృత్యుడు కాలేకపోయాడు. కాని, సిరోవి జయమందినాడు.

"ఐరోపా మహాసంగ్రామానికి పూర్వం ఆస్ట్రియన్ సేనలో కాన్ స్క్రిప్టుగా (సేనలో చేర్చుకొనుటకు బలవంతంగా తేబడిన వాడు) కొంత కాలం ఉండి, తరువాత సిరోవీ వార్సానగరం (ఇప్పటి పోలెండు రాజధాని) వెళ్ళినాడు. అక్కడ శిల్పకారక (ఆర్కిటెక్టు) వృత్తి అవలంబించాడు.

"ఐరోపా మహాసంగ్రామం ప్రారంభమైంది. ఆస్ట్రియన్ దాస్యాన్నుంచి తప్పించుకోడానికి జెక్కులకు ఆశాలేశం కనుపించింది. అంచేత సిరోవీ ఆస్ట్రియనులకు వ్యతిరేకంగా రష్యన్ సేనలో చేరడానికి తలపడ్డారు. 1917లో అసిస్టెంటు సైన్యాధికారిగా అతడు జెబారఫ్ యుద్ధంలో జర్మనులను వెనక్కి తరిమి, మంచి ఖ్యాతి పొందాడు. ఆ యుద్ధంలో అతనికి కుడికన్ను పోయింది. కంటి దెబ్బ విషయంలో అతడు డాక్టరు వద్ద మూడు రోజుల కంటె ఎక్కువ కాలం ఉండడానికి ఒప్పుకోలేదు. మూడు రోజుల తరవాత అతడు తిరిగి వచ్చి తన సైనికులకు నాయకత్వం వహించాడు.

“రష్యాలో విప్లవం వచ్చిన తరువాత రష్యన్ చక్రవర్తి సైన్యం అంతా చెల్లాచెదరు అయిపోయింది. జెక్కులకు మాత్రం జర్మనీ మీద ఇంకా యుద్ధం సాగిద్దామని ఉంది. కాబట్టి లెఫ్టినెంటు సిరోవీని జెక్కుల 70,000 సైన్యానికి జనరల్ గా నియమించారు. నియమించారన్న మాటేగాని, ఆ సైనికులకు సహాయమన్నది లేనేలేదు. తమకు తామే సహాయం చేసుకుంటూ సిరోవీ సైనికులు జర్మనులతో యుద్ధం సాగించాలి. కాని దీనికి మాత్రం వీలుఏది? వారు అప్పటికి రష్యాలో యురాల్ కొండల చెంతా, సైబిరియాలో ఓమ్ స్క దగ్గిర ఉన్నారు. రష్యాలో జారు ప్రభుత్వం పోయి లెనిన్ నాయకత్వాన్ని బోల్షివిజమ్ విజృంభించింది. బోల్షివిక్కులకు ఈ సిరోవీ సేనలంటే ఇష్టం లేకపోయింది. కాగా, వారు ఈ సేనలను ఎదిరించారు. సిరోవీ చిక్కులో పడిపోయాడు. అయిన, అధైర్యపడక అతడు శత్రువులను ఎదుర్కుంటూనే శత్రుదేశంగుండా తూర్పుగా పసిఫిక్ మహాసముద్రం వైపు ప్రయాణం కట్టాడు.

“ప్రయాణ ప్రదేశం శత్రువులది - నిరంతరం శత్రువుల ఎదుర్కోలు - జరిగే యుద్ధానికి ఒక రంగమని కాని, ఒక కేంద్రమని కాని లేదు ఆహార పదార్థాల సరఫరా తలుచుకోడానికే వీలులేని విషయం - సహాయం చేసేవారు ఎవ్వరూ లేరు. అసావాదిత్యో బ్రహ్మ అని ప్రపంచాన్ని చుట్టి బయటపడితేనే కాని స్వదేశం కనిపించదు. ఈ పరిస్థితుల్లో అతడు, అతడి సైనికులు 5వేల మైళ్ళ శుత్రుదేశాన్ని రెండు సంవత్సరాల్లో అతిక్రమించి రష్యాకు అవతల కొస అయిన వ్లాడివొస్టక్ రేవు చేరారు. పసిఫిక్ తీరాన్ని ఉన్న ఆ రేవు చేరే సరికి బ్రిటిష్ ప్రధాని లాయడ్ జార్జి పంపిన “మిమ్మల్ని, మీ శౌర్యాన్ని మేము ఎప్పటికీ మరిచి పోయేదిలేదు” అనే టెలిగ్రాము స్వాగతమిచ్చింది. బ్లాడివొస్టక్ నుండి సినవీ నాయకత్వం క్రింద ఆ సైనికులు వాన్ కోవరు, శాన్ ఫ్రాన్సిస్కోల మీదుగా ప్రాగ్ నగరం చేరారు. ప్రాగ్ లో వారి విజయయాత్ర విశేషమైన మన్ననకు పాత్రమైంది.

“ఆపదల్లో తాను అంచిత ధైర్యాన్ని వహించడమే కాకుండా సిరోవీ తన సైనికుల్లో కూడా అట్టి భావాల్ని పెంపొందించి, మూడేళ్లు అష్టకష్టాలు ఓర్చేటట్లు చేసి, వారిని మాతృదేశానికి తీసుకువచ్చి, మాతృదేశపు దాస్యవిమోచనం వారు చూచేటట్లు చేశాడు."

“అట్టివాడు ఒక జాతీయ వీరుడుగా చూడబడడం ఒక ఆశ్చర్యంలోది కాదు. అతడి శౌర్యం వల్ల రూపొందిన జెకోస్లోవేకియాలో అతడు 1926లో నేషనల్ డిఫెన్సు మంత్రిగా నియమింప బడ్డాడు. 1927లో 'చీ ఆఫ్ జనరల్ స్టాఫ్' అయ్యాడు. 1929లో జెకోస్లోవేకియా సైన్యానికి 'ఇన్ స్పెక్టరు జనరల్ అయ్యాడు."

జనరల్ సిరోవీ మంత్రివర్గంవారు తాము పదవిని స్వీకరించగానే, సూడెటెన్ ప్రాంతాలను నాజీల దగ్గర నుంచి వశపరచుకోవడమే కాకుండా, దేశరక్షణ కోసం జనరల్ మోబిలైజేషన్ చేశారు. “బ్రిటన్ ఫ్రాన్సులు ఒత్తిడి పెట్టడం వల్ల అవి ప్రతిపాదించిన షరతులకు - గత్యంతరం లేక - అంగీకరించాము. ఇక్కడికి ఇదే పెద్ద తలవంపు. ఇక, ఇంకొక్క అంగుళమైనా దిగజారగూడదు” అని జెకోస్లోవేకియాలోని వివిధ రాజకీయ పక్షాలవారు నిర్ణయించారు. ఈ నిర్ణయాన్ని పాలించడానికి సిరోవీ మంత్రివర్గం వారు దృఢంగా నిశ్చయించుకున్నారు.

ఈ సమయంలో గోడెస్ బర్గ్ షరతులు (మ్యాప్, మెమొరాండం) అందినవి. “వీటిని అంగీకరించము.” అని సెప్టెంబర్ 24వ తేదీనాడు నిష్కర్షగా చెప్పారు.

35

లండన్ చేరుకోగానే "మీరు ఇంకొకసారి అవసరంగా రావాలి" అని ఛేంబర్లేను ఫ్రెంచి మంత్రులకు కబురుచేశాడు. ఈ వార్త అందుకుని దలదియర్, బానే, సెప్టెంబర్ 25వ తేదీనాటి సాయంత్రానికి లండనులో హాజరయ్యారు. ఆ పూట, ఆ మర్నాటి ఉదయం బ్రిటిష్, ఫ్రెంచి మంత్రుల మధ్య సమాలోచనలు జరిగినవి. "జెక్ ప్రభుత్వంవారు గోడెస్ బర్గ షరతుల్ని తిరస్కరించడం న్యాయంగానే ఉన్నది. దీనిని మీరు కూడా కాదనలేరు. తనపట్టు నెగ్గించుకోడానికి హిట్లర్ దాడిజరిపితే, ఇక మేము జెక్ రాజ్య సహాయానికి వెళ్ళితీరతాము. మేము యుద్ధానికి దిగగానే, మమ్మల్ని అనుసరిస్తామని సోవియట్ ప్రభుత్వంవారు స్పష్టపరచినారు. పోతే, మీ వైఖరి ఏమిటో తెలియపరచవలసింది". ఈ ధోరణిలో ఫ్రెంచి మంత్రులు ప్రసంగించారు. అపుడు "నిజమే! గోడెస్ బర్గ్ షరతుల్ని ఒప్పుకోమని జెక్ ప్రభుత్వాన్ని ఒత్తిడి పెట్టడం తగనిపని! మీ తర్వాత మేము కూడా హిట్లర్‌ను ప్రతిఘటించడానికి యుద్ధానికి దిగుతాము. తప్పని సరిగదా!" అని ఛేంబర్లేన్ అన్నాడు. కాని "యుద్ధం తప్పదు" అనే తలంపే బ్రిటిష్ ప్రధానికి భయంకరంగా తోచింది. "ఎక్కడో దూరాన మధ్యయూర లో - ఉన్న ఒక అన్యజాతి కోసం, ఒక అన్యరాజ్యం కోసం బ్రిటన్ యుద్ధానికి దిగడమా? పైగా బోల్షివిక్ రష్యాతో చేరి, రణరంగములో నిలవడమా? ఈ సమరంలో ఓడిపోవడం ఎంత ప్రమాదమో, గెలుపొందడం కూడా అంత ప్రమాదం. అంతేకాదు. అసలు ఓడిపోవడం కంటె గెలుపొందడమే అధిక ప్రమాదం. ఇపుడు గెలవడం అంటే, జర్మనీలో నాజీ ప్రభుత్వమూ, ఇటలీలో ఫసిస్టు ప్రభుత్వమూ వినాశనం కావడం అన్నమాట! అప్పుడక్కడ ప్రజా స్వామిక ప్రభుత్వాలు (అంటే, కేపిటలిస్టు ప్రభుత్వాలు) ఏర్పడ్డం కల్ల. సోషలిస్టులుగాని, కమ్యూనిస్టులుగాని, వీరిని పోలె ఇతర అతివాదులుగాని ఆ రెండు రాజ్యాలలో అధికారానికి వస్తారు. అప్పుడిక యూరప్ ఖండాన్ని బోల్షివిక్ వెల్లువనుంచి తప్పించడం బ్రహ్మకైనా తరమా? సందేహం లేదు. ఇప్పుడు యుద్ధానికి దిగి ఓడిపోవడంకంటె గెలుపొందడమే అధిక నష్టదాయకం." ఈ ఫక్కీలో నడిచాయి ఛేంబర్లేన్ ఆలోచనలు.

సూడెటెన్ ప్రాంతం యూరప్లో తాను ఆక్రమించ గోరుతున్న చిట్టచివరి రాజ్యభాగమని హిట్లర్ గోడెస్ బర్గ్ లో ఖండితంగా చెప్పాడు. "అన్నట్టు ఇంకొక చిక్కు ప్రశ్న - వలస రాజ్యాల సమస్య - ఉన్న మాట నిజం.
అయితే, వలస రాజ్యాల కోసం యుద్ధ సన్నాహాలను జరపను" అని కూడా అతడు అన్నాడు. దీన్ని బట్టి స్పష్టపడుతున్నదేమిటి? సూడెటెన్ వ్యవహారం సంఘర్షణ లేకుండా తెగిపోతే, మరి యుద్ధ భయం లేదన్నమాట! ఈ కారణం వల్ల కూడా ఏదో ఒక విధంగా ఇప్పటికైనా యుద్ధాన్ని తప్పించవలసిందే!

ఇలా అనుకుని సెప్టెంబర్ 26వ తేదీనాడు ఛేంబర్లేన్ తన కార్యదర్శి సర్ హోరేస్ విల్సన్ ద్వారా బర్లిన్ నగరంలో ఉన్న హిట్లర్‌కు ఒక ఉత్తరాన్ని పంపించాడు. ఈ ఉత్తరం సారాంశం ఇది : యుద్ధంతో నిమిత్తం లేకుండా తగవు తీర్చుకోడానికి జెక్, జర్మన్ ప్రతినిధులు బ్రిటీష్ ప్రతినిధుల సమక్షంలో వెంటనే సమాలోచనలు ప్రారంభించరాదా? ఇందుమూలంగా మీరు భయపడుతున్నట్లు సమస్యా పరిష్కారంలో అనవసరమైన విలంబనం జరగదు గదా.

సెప్టెంబరు 26వ తేదీనాటి రాత్రి హిట్లర్ బర్లిలో ఉపన్యసించడానికి అంతకుముందే ఏర్పాటు అయింది. అతడు ఈ ఉపన్యాసంలో బహిరంగ యుద్ధ ప్రకటన చేస్తే పరిస్థితులు పూర్తిగా విషమిస్తవి. అంచేత "ఉపన్యాసానికి ముందే ఈ ఉత్తరాన్ని హిట్లర్‌కు అందజెయ్య వలసింది!" అని ఛేంబర్లేన్ ఆదేశించాడు. అదే ప్రకారం సర్ విల్సన్ చేశాడు గాని, హిట్లర్ "గోడెస్ బర్గ్ షరతుల్ని మార్చడానికి వీలులేదు" అని తెగ వేసి చెప్పాడు.

ఆ రాత్రి (సెప్టెంబరు 26) హిట్లర్ ఎంత దుడుకుగా మాటాడినాడో చెప్పడానికి వీలులేదు. ఇంగ్లండును అతడు ఎత్తిపొడిచాడు. ఫ్రాన్సు పై గట్టి విసురులు విసిరాడు. జెక్ రాజ్యాన్ని పూర్తిగా దుయ్యబట్టాడు. ఇక జెక్ అధ్యక్షుడు డాక్టర్

బెనిసను - పేరు చెప్పి - తిట్టిన తిట్లకు అంతులేదు. "సూడెటెన్ జిల్లాలలో జర్మనులు అత్యధికంగా వున్న భాగాలను అక్టోబరు 1వ తేదీనాటికి మాకు అప్పజెప్పాలి ఇది నా అంత్యసందేశం" అని అతడు ఈ ఉపన్యాసంలో పునః స్పష్టపరిచాడు.

36

అక్టోబరు 1... మరి ఎంతో గడువు లేదు. 27-28-29-30 - నాలుగు రోజులలో హిట్లర్ మీద దండయాత్ర సాగిస్తాడు. అతడితో పాటు పోలెండు, హంగరీలు కూడా జెక్ రాజ్యం విరుచుకుపడతవి. జెక్-పోలిష్ సరిహద్దులోనూ, జెక్-హంగరియన్ సరిహద్దులోనూ, అప్పుడే అనేక సంఘర్షణలు జరుగుతున్నవి. జెకొస్లోవేకియా సహాయానికి వెళ్ళడానికి ఫ్రాన్సు చాల వరకు సన్నద్ధపడింది. జెక్ సమస్య కారణంగా యూరపియన్ యుద్ధం వస్తే, తాను జర్మనీ పక్షాన చేరతానని ముసోలినీ నాలుగైదు రోజుల ఈ మధ్య అప్పుడే రెండు పర్యాయాలు బహిరంగంగా ప్రకటించాడు. హిట్లర్ దండయాత్రను ప్రతిఘటించడంలో రష్యా ఫ్రాన్సును అనుసరిస్తుందని సోవియట్ విదేశాంగమంత్రి లిట్వినోవ్ మొన్ననే నానాజాతి సమితిలో ఉపన్యసిస్తూ స్పష్టపరిచాడు. ఇక, మహాసంగ్రామం తప్పనట్టేనా? బ్రిటన్ కూడా ఈ యజ్ఞగుండంలో దూకవలసిందేనా? ఈ ఆందోళనతో తల్లడిల్లిపోతూ, సెప్టెంబర్ 27వ తేదీనాడు బ్రిటిష్ ప్రధాని ఛేంబర్లేన్ తొందరపడవద్దని హిట్లర్‌ను కోరుతూ ఒక బ్రాడ్ కాస్ట్ ఉపన్యాసాన్ని చేశాడు. ఈనాడే అమెరికా అధ్యక్షుడు రూజువెలుకూడా శాంతపద్ధతుల ద్వారా వ్యవహారాన్ని పరిష్కరించు కోవలసిందిగా హిట్లర్‌కు ఒక సందేశాన్ని పంపించాడు. కాని, హిట్లర్ తన ధోరణి మార్చుకోలేదు.

"జెక్ రాజ్యానికి అన్యాయాన్ని చేసి అయినాసరే, హిట్లర్ ను సంతుష్టిపరుద్దామని శతవిధాల ప్రయత్నించాను. కాని, అతడి ఆశలకు మితం లేకుండా ఉన్నది.

ఈ దౌష్ట్యాన్ని ఇక సహించరాదు!" అని ఛేంబర్లేన్ అనుకుని ఉంటే, రానున్న యుద్ధం కోసం అతడు విపుల సన్నాహాలను ప్రారంభించవలసింది. గోడెస్ బర్గ్ లో "ఇక సహించ వీలులేదు!" అని అతడికి తోచిన మాట నిజం. అయితే ఇందుకు కారణం ఒడంబడికమీద సంతకం పెట్టించుకు రావడమే ఇక మిగిలిన పని అనే ధీమాతో వెళ్ళిన తనకు హిట్లర్ క్రొత్త షరతుల వల్ల కలిగిన ఆశాభంగమే! ఈ ఆశాభంగం తీవ్రత తగ్గగానే తిరిగి "ఈ షరతులకైనా సరే అంగీకరించి యుద్ధం తప్పించడం శ్రేయస్కరం కాదా?" అనే ఆలోచన కలిగింది.

అయితే ప్రజలు దీన్ని సహిస్తారా? పార్లమెంట్ దీన్ని ఆమోదిస్తుందా? "ఘోరం - అన్యాయం - దుర్మార్గం - దుస్సహం" ఈ విధంగా హిట్లర్ షరతుల్ని సభ్యతా ప్రపంచం ఖండిస్తున్నది. మరి ఇప్పుడు కర్తవ్యమేమిటి? ఆం! ఒక ఉపాయం తోస్తున్నది. బ్రిటిష్ ప్రజలలో యుద్ధం అంటే చాలా విముఖత ఉన్నది. దీన్ని పురస్కరించుకొని యుద్ధం కోసం నిజంగా సన్నద్ధపడుతున్నట్లు నటించి, తర్వాత గోడ్సెర్గ్ షరతుల్ని చల్లగా ఆమోదిస్తే, హిట్లర్ కు భయపడికాక, కేవలం యుద్ధ విపత్తును తప్పించడానికే ఈ పనిచేసినట్టు కనబడుతుంది. ఛేంబర్లేన్ చేసిన ఈ ఆలోచన చాలా చక్కగా పనిచేసింది.

బ్రిటన్ యదార్థంగా యుద్ధసన్నాహాలను జరపదలుచుకుంటే, ముందుగా నౌకాబలాన్ని మొబిలైజ్ చెయ్యాలి. చేంబర్లేన్ ఈ పని చెయ్యకుండా, ముందుగా విమానాల దాడి నుంచి ప్రజల్ని రక్షించడానికి ఏర్పాట్లను సాగించాడు. ఇది చాలా అవసరమైన పని. దీన్ని కాదనలేము. అయితే, ఈ పనిని మాత్రమే చేసి, తక్కిన సైనిక బలాలను మొబిలైజ్ చెయ్యడం విషయంలో అంతగా శ్రద్ధ వహించకపోవడంలోనే ఉన్నది కిటుకు అంతా!

విమానాలు వేసే బాంబులు నుంచి తప్పించుకోడానికి పార్కులలోను, ఇతర ఖాళీ స్థలాలలోను కందకాలను త్రవ్వించడం; విషవాయువులు సోకకుండా రక్షణ నివ్వడానికి "గ్యాస్ మాస్కులు" పంచి పెట్టించడం; లండన్ నుంచి బాలబాలికల్ని అపాయం తక్కువగా ఉండే గ్రామసీమలకు పంపించి వెయ్యడానికి ప్రయత్నాలు చెయ్యడం : ఈ ఆర్భాటం చేసే సరికి ఇక యుద్ధం తప్పదు అనే భావం బ్రిటిష్ ప్రజలలో పూర్తిగా నాటుకు పోయింది. "యుద్ధం అతిభయంకరమైన వ్యాపారం. అయినా, ధర్మ రక్షణ కోసం మన ప్రభుత్వం ఇందుకు సన్నద్ధపడుతున్నది." అని ప్రతి పౌరుడు, ప్రతి పార్లమెంట్ సభ్యుడు అనుకోసాగాడు. తమ ధర్మపక్షపాతాన్ని గురించి ఈ సదభిప్రాయాన్ని కలిగించిన తర్వాత, హిట్లర్ షరతులకు అంగీకరించినా, యుద్ధం తప్పించి నందుకు ప్రశంసలేగాని, జెక్ రాజ్యానికి ద్రోహం చేసినందుకు దూషణరాదు.

పరిస్థితులు అనుకూలంగా ఉన్నట్టు ధృవపరుచుకుని, సెప్టెంబర్ 29వ తేదీ నాటి ఉదయం ఛేంబర్లేన్ హిట్లర్ కు ఒక సందేశాన్ని పంపించాడు. దాని సారాంశం ఏమంటే, త్వరలో జెక్ సమస్యను జర్మనీకి సంతృప్తికరంగా పరిష్కరించ డానికి బ్రిటన్, ఫ్రాన్సు, జర్మనీ, ఇటలీ రాజ్యాలు కలిసి ఒక సభ చెయ్యడం. హిట్లర్ కు ఈ సందేశాన్ని పంపిస్తూనే దీనికి అతడు ఏ విధంగానైనా అంగీకరించేలా చూడవలసిందని ముసోలినీకి ఒక విజ్ఞాపనాన్ని కూడా చేశాడు. ఛేంబర్లెన్ కోర్కె ప్రకారం "తప్పక సమావేశానికి అంగీకరించవలసింది," అని ముసోలినీ హిట్లరుకు వర్తమానం చేశాడు. అతడు ఇలా చెయ్యడానికి ఒక పెద్ద కారణమున్నది. ఫ్రాన్సు యుద్ధ సన్నాహాలను చెయ్యడం చూచి, "మీరు కూడా మీ సైన్యాలను మొబిలైజ్ చెయ్యండి"అని హిట్లర్ ఒక వారంలో మూడు సార్లు ముసోలినీని కోరినాడట. ఇందుకు అతడు సుముఖత చూపినాడటగాని "జర్మనీ కోసం అనవసరంగా మన దేశాన్ని ఈ యుద్ధంలోకి ఈడ్చే పద్ధతిలో నేను పదవీ పరిత్యాగాన్ని చేసి, నా కుమారునికి పట్టంకడతాను" అని ఇటలీ రాజు బెదిరించాడట. ఇటలీ యువరాజుకూ,ముసోలినీకీ సరిపడదట. అంచేత తండ్రి సింహాసనాన్ని వదులుకుని కుమారుని రాజుగా చేస్తే, దేశంలో అంతర్యుద్ధం తప్పదట. ఈ ప్రమాదానికి బెదిరిపోయే, ముసోలినీ ఇటాలియన్ సైన్యాలను మొబిలైజ్ చెయ్యలేదట. ఈ కథ నిజమైనా, కాకపోయినా, నాలుగు రాజ్యాల సభకు అంగీకరించ వలసిందిగా ముసోలినీ హిట్లర్ ను ఒత్తిడి పెట్టిన మాట మాత్రం నిజం. గోడెస్ బర్గ్ లో "ఇవి తగనిషరతులు!" అని చెప్పి వెళ్ళిన ఛేంబర్లేన్ తిరిగి సందేశాలపై సందేశాలు, విజ్ఞాపనలపై విజ్ఞాపనలు పంపించడాన్ని చూచి, "భయంలేదు.

వీరిని దేనికైనా సరే ఒప్పించవచ్చు" అని హిట్లర్ అనుకున్నాడు. కొంత ఈ నమ్మకం వల్లను, కొంత ముసోలినీ మొహమాట పెట్టడం వల్లను అతడు "సరే! మనం మ్యూనిక్ లో సమావేశం అవుదాము. సభకు రావలసిందిగా నేను ముసోలినీకి, దలదియరకూ కూడా ఆహ్వానాలు పంపుతున్నాను" అని ఛేంబర్లేనుకు ప్రత్యుత్తరాన్ని పంపించాడు.

ముందుగా పార్లమెంట్ ను సమావేశపరిస్తే, తాను అవలంబించదలచుకున్న విధానానికి ఏమి ప్రతిబంధకము కలుగుతుందోనని, ఛేంబర్లేన్ ఆ పని చెయ్యలేదు. "మాకు తెలియబరచ కుండా, మీ చిత్తం వచ్చినట్టు మీరు నడచుకుంటున్నారు. జెక్ సమస్యను చర్చించడానికి వెంటనే పార్లమెంటు సభను సమావేశపరచండి!" అని ప్రతికూల పక్షనాయకుడైన మేజర్ అట్లీ పదేపదే హెచ్చరించినప్పటికి, "ఇది సమయం కాదు" అని ఛేంబర్లేన్ వాయిదావేశాడు. చివరికి సెప్టెంబర్ 28వ తేదీనాడు - హిట్లర్ కు నాలుగు రాజ్యాలసభ విషయమై సందేశాన్ని పంపించిన తర్వాత - కామన్సుసభను సమావేశపరిచి, దానిలో మరి యుద్ధం తప్పదేమో అనే ధోరణిలో ప్రధాని ప్రసంగిస్తూ ఉండగా, హిట్లర్ ప్రత్యుత్తరం అందింది. దాన్ని చూపించి "యుద్ధం తప్పడానికి ఇది ఒక్కటే ఆశ!" అని ఛేంబర్లేన్ అన్నాడు. ఈ నాటకం బాగా రక్తికట్టింది. మ్యూనిక్ లో జరగనున్న ద్రోహాన్ని గురించి ఆలోచించక, "తప్పితే, యుద్ధం దీని వల్లనే తప్పాలి" అని పార్లమెంట్ సభ్యులు సంతోష సంభ్రమాలను ప్రకటించారు. వెర్రిలోకం కూడా ఈ భావాన్నే వెల్లడించింది.

37

లండన్ నుంచి ఛేంబర్లేన్, ప్యారిస్ నుంచి దలదియర్, రోం నుంచి ముసోలినీ సెప్టెంబర్ 29వ తేదీనాటి ఉదయం మ్యూనిక్ కు బయల్దేరి వెళ్లారు. వీరిలో మొదటి వారిద్దరు విమానంలో బయల్దేరితే, మూడవవాడైన ముసోలినీ రైలులో ప్రయాణం చేశాడు. హిట్లర్ ఇతడికి జర్మన్ సరిహద్దు వరకు ఎదురువెళ్ళి స్వాగతాన్ని చెప్పడమే కాకుండా, మ్యూనిక్ లోని రాణ్మందిరంలో దిస ఏర్పాటు చేయించాడు. ముసోలినీకి చేసిన ఈ సత్కారానికీ, ఛేంబర్లేన్ కు చేసిన దానికీ ఎంతో వ్యత్యాస మున్నది. బ్రిటిష్ ప్రధాని మొత్తం మూడు సార్లు జర్మనీ వెడితే, ఈ మూడుసార్లు కూడా అతడికి స్వాగతాన్ని చెప్పడానికి విమానాశ్రయం దగ్గరికి వెళ్ళినవాడు హిట్లర్ కాదు; అతడి విదేశాంగమంత్రి రిబ్బన్ ట్రాప్! ఇంతేకాదు. బెర్టెస్ గాడెలో హిట్లర్ నివాసానికి ఛేంబర్లేన్ వెళ్ళినప్పుడు కనీసం వాకిటిలోకైనా వచ్చి "స్వాగతం!" అని జర్మనీ నియంత అన్నాడు కాదు!! ఎవరిని ఏవిధంగా మర్యాద చెయ్యాలో హిట్లర్‌కు చక్కగా తెలుసు!!! మ్యూనిక్ సమావేశం సంగతి తెలియగానే "మా పరోక్షంలో మా రాజ్యాన్ని గురించి చేసే నిర్ణయాలను మేము అంగీకరించము" అని ప్రాగ్ ప్రభుత్వం వారు ప్రకటించారు. ఈ ప్రకటనను లక్ష్యపెట్టకుండా హిట్లర్, ముసోలినీ, ఛేంబర్లేన్, దలదియర్ వీరు ఎనిమిది తొమ్మిది గంటలపాటు తదేకంగా సమాలోచనలు, జరిపి జెక్ రాజ్యం భవిష్యత్తును నిర్ణయించివేశారు.

మ్యూనిక్ సమాలోచనల ఫలితంగా నిర్ణీతమైన షరతులు గోడ్బెర్గ్ వాటికి ఏ విధంగానూ తీసిపోవు. అయితే, అక్టోబర్ 1వ తేదీనాడే తానుకోరిన రాజ్యాన్ని అంతటినీ ఆక్రమించుకోడానికి బదులు నాలుగైదు దఫాలుగా ఆక్రమణ జరపడానికి హిట్లర్ అంగీకరించాడు. గోడ్బెర్గ్ షరతులలో జరిగిన మార్పు దీన్ని "మార్పు" అని అవడానికి వీలుంటే - ఇది ఒక్కటే! మ్యూనిక్ షరతుల సారాంశం ఇది :

సూడెటెన్ జిల్లాలలో జర్మన్ జాతివారు అధికంగా ఉన్న ప్రాంతాలను జెక్ రాజ్యం జర్మనీకి అప్పగించాలి. ఇలా అప్పగించవలసిన ప్రాంతాలు నాలుగు భాగాలుగా విభాగింపబడినవి. వీటిలో మొదటి భాగాన్ని అక్టోబర్ 1వ తేదీనాడు జర్మన్ సేనలు ఆక్రమిస్తవి. తక్కిన మూడు భాగాలను ఆ తర్వాత ఆక్రమిస్తవి. ఇంతవరకు ఆక్రమణ పూర్తి అయిన తర్వాత, మిగిలిన సూడెటెన్ జర్మనీలో ఇంకా జర్మనులు అధికంగా ఉన్న భాగాలు ఏవేవో (జర్మనీ-బ్రిటన్, ఫ్రాన్సు, ఇటలీ, జెకొస్లోవేకియా రాజ్యాల ప్రతినిధులతో కూడిన) అంతర్జాతీయ సంఘం వారు నిర్ణయిస్తారు. వారు నిర్ణయించిన ఈ అయిదవ భాగపు ఆక్రమణ అక్టోబరు 10వ తేదీనాడు జరుగుతుంది. జర్మనీ ఆక్రమించుకునే ఈ భాగాలలోని కట్టడాలకు, పరిశ్రమలకు, ఇతర ఆస్తిపాస్తులకు జెక్ ప్రభుత్వంవారు ఏ విధమైన నష్టాన్ని కలగ నివ్వరాదు. ఇందుకు భిన్నంగా నష్టాన్ని కలిగిస్తే, దానికి జెక్ ప్రభుత్వంవారు బాధ్యులై ఉంటారు. జర్మనులు మెజారిటీలో ఉన్న భాగాల ఆక్రమణ ఈ విధంగా పూర్తి అయిన తర్వాత, మిగిలిన సూడెటెన్ జిల్లాలలో ఏయే ప్రాంతాలలో ప్లెబిసైట్ జరగవలెనో అంతర్జాతీయ సంఘంవారు నిర్ణయిస్తారు. ఎప్పుడు ఏ విధంగా ప్లెబిసైట్ జరగవలెనో ఆ నిబంధనల్ని ఈ సంఘమువారే ఏర్పరుస్తారు. ప్లెబిసైట్ జరగవలసిన ప్రాంతాల్ని అది పూర్తి అయ్యే వరకూ అంతర్జాతీయ సైన్యం ఆక్రమించుకుంటుంది. బి సైట్ జరపవలసిన తేదీలు నవంబరు మాసాన్ని దాటగూడదు. ఈ కార్యకలాపాలు పూర్తి అయిన తర్వాత, జెక్ జర్మన్ సరిహద్దును గురించిన అంత్య నిర్ణయం చెయ్యవలసిన అధికారం అంతర్జాతీయ సంఘంవారిది. ఈ (మ్యూనిక్) ఒడంబడికపై సంతకాలు జరిగిన ఆరు నెలలలోగా జర్మనీవశమైన ప్రాంతాలలోని జెక్ జాతివారు, కావాలంటే, జెక్ రాజ్యంలోకి లేచివెళ్ళవచ్చును. ఇదే విధంగా జెక్ రాజ్యంలోని జర్మనులుకూడా జర్మనీలోకి లేచి రావచ్చును. ఈ జనాభా మార్పిడి విషయమై కావలసిన ఏర్పాట్లను చెయ్యడానికి ఒక జెక్ జర్మన్ కమీషన్ ను ఏర్పాటుచెయ్యాలి. ఈ ఒడంబడిక జరిగిన నాలుగు వారాలలోగా జెక్ ప్రభుత్వంవారు తమ కొలువులో ఉన్న సూడెటెన్ జర్మనులను వారు కోరినట్టయితే - ఉద్యోగ ధర్మం నుంచి విముక్తుల్ని చెయ్యాలి. ఈ వ్యవధిలోనే రాజకీయ సంబంధమైన నేరాలకు ఖైదుపడిన సూడెటెన్ జర్మనులను జెక్ ప్రభుత్వం విడుదల చెయ్యాలి. ఈ అన్ని మార్పుల తర్వాత ఏర్పడే కొత్త జెక్.

సరిహద్దులకు అకారణంగా ఏ రాజ్యమైనా భంగం కలిగించే పక్షంలో బ్రిటన్, ఫ్రాన్సులు అడ్డుపడుతవి. జెక్ రాజ్యంలోని పోలిష్, హంగరియన్ జాతులకు సంబంధించిన వివాదాలు ఆయా ప్రభుత్వాల మధ్య జరిగే ఒడంబడిక ద్వారా మూడు మాసాలలోగా పరిష్కారం కాకపోతే జర్మనీ, ఇటలీ, బ్రిటన్, ఫ్రాన్సు రాజ్యాల ప్రధానులు తిరిగి సమావేశమై రాజీచేస్తారు. పోలిష్, హంగరియన్ మైనారిటీల సమస్య కూడా సంతృప్తికరంగా పరిష్కారమైన తర్వాత జర్మనీ, ఇటలీ రాజ్యాలుకూడా కొత్త జెక్ సరిహద్దుల రక్షణ విషయమై పూచీపడతవి. ఈ షరతుల్ని ఛేంబర్లేను అంగీకరించడంలో ఆశ్చర్యం లేదు. కాని, దలదియర్ విషయంలోనే వింతగా కనబడుతుంది. "విమానాల దాడి నుంచి లండన్ నగరాన్ని రక్షించడానికి కావలసిన ఏర్పాట్లు జరగలేదు. ఈ స్థితిలో మేము యుద్ధానికి దిగలేము!" అని బహుశా ఛేంబర్లేన్ చెప్పి ఉండవచ్చును. "ఈసారి ఐరోపా మహాసంగ్రామం వస్తే, మన కేపిటలిస్టు సౌధాలు (సాంఘిక వ్యవస్థలు) కూలిపోతాయి సుమా" అని బెదరించి ఉండవచ్చును.

జర్మనీ వైమానిక బలాన్ని సోవియట్ వైమానిక బలం ప్రతిఘటించగలదని ఆశపడుతున్నారు. కాని "సోవియట్ వైమానిక దళం పైకి చెప్పినంతటి శక్తిమంతంగా లేదు" అని పిరికిమందు పోసి ఉండవచ్చును. ఈ చివరి ఆర్గ్యుమెంట్ ను ఛేంబర్లేను ఉపయోగించినట్టు చాలా నిదర్శనాలున్నవి. కల్నల్ లిండ్ బర్గ్ -- ఇతడు అమెరికావాడు. మొట్టమొదటిసారిగా అమెరికా నుంచి యూరప్ కు పసిఫిక్ సముద్రాన్ని విమానంమీద దాటి, ప్రఖ్యాతి గడించుకున్నట్టివాడు - సోవియట్ వైమానిక దళం చాలా ఘోరమైన స్థితిలో ఉన్నట్టు ఒక రహస్య నివేదికను వ్రాశాడట. ఈ నివేదికను ఛేంబర్లెన్ ఫ్రెంచి ప్రభుత్వం వారికి చూపించి, "రష్యాను నమ్ముకుని జర్మనీని ప్రతిఘటించడం ప్రమాదం సుమా!" అని హెచ్చరించాడట. ఈ పని నిజంగా జరిగినదనడానికి ఒక ప్రధాన కారణం ఏమంటే, మ్యూనిక్ ఒడంబడిక అనంతరం సోవియట్ పత్రికలు "మా ఆతిధ్యాన్ని అనుభవించి, మాకు అన్యాయం చేసిన నీచుడు!" అని లిండ్ బర్గ్ ను విమర్శించడమూ, "మా వైమానిక దళం శక్తిని కావాలంటే హిట్లరు పరీక్షించ వచ్చును." అని జర్మనీని ఛాలెంజ్ చెయ్యడమూ జరిగింది. ఛేంబర్లేన్ ఏమి ఆర్గ్యుమెంట్సును ఉపయోగించితే నేమిగాని, మ్యూనిక్ ఒడంబడిక పైన సెప్టెంబరు 30వ తేదీనాటి ఉదయం సంతకాలను పెట్టి, బ్రిటిష్, ఫ్రెంచి, ఇటాలియన్ ప్రధానులు స్వదేశాలు తిరిగి వెళ్లారు. జెక్ రాజ్యాన్ని హిట్లరు బలిపెట్టి, లండన్‌కు తిరిగి వెడుతూ, ఛెంబర్లేన్ "బ్రిటన్, జర్మనీలు తమకు గల వ్యవహారాలన్నిటిని యుద్ధంతో నిమిత్తం లేకుండా సమాలోచన వల్లను, సామరస్యం వల్లను పరిష్కరించుకుంటాయి" అని ఒక కాగితం మీద హిట్లర్ సంతకాన్ని పెట్టించుకున్నాడు. క్రాయిడలో విమానందిగగానే అతడు ఈ "చిత్తుకాగితాన్ని" అక్కడ గుమికూడిన వారికి సగర్వంగా చూపుతూ "ఇదుగో శాంతి!" అని ప్రకటించాడు! శాంతి! శాంతి!! ఈ మాటను విని హిట్లర్ లోలోపల నవ్వుకుని ఉండాలి!!!

38

సెప్టెంబర్ 30వ తేదీ ఉదయం 6 గంటలు. విషమ పరిస్థితుల కారణంగా పెచ్చు పెరిగిన కార్యభారం వల్ల నేమి, ఆందోళన కారణంగా నిద్ర దూరం కావడంవల్లనేమి, చాలా పొద్దుపోయే వరకు దాదాపు తొలిఝాము వరకు - మేలుకుని, అప్పుడే కళ్లుమూసిన జెక్ విదేశాంగ మంత్రికి అర్జంట్ పిలుపు వచ్చింది. లేచి వెళ్లి చూడగా, ప్రాగ్ లో ఉండే జర్మన్ రాయబారి. అతడు చాలా పొగరుబోతు తనంగా "ఇదిగో ఇవి మా షరతులు. ఇది మ్యాప్. గుడ్ మార్నింగ్!" అంటూ ఇన్ని కాగితాల్ని ముఖాన కొట్టి చక్కాపోయాడు. కోపంతోనూ తత్తరపాటుతోనూ జెక్ విదేశాంగ మంత్రి ఆ కాగితాల్ని విప్పి చూచుకుంటే, హిట్లర్-ముసోలినీ-ఛేంబర్లేన్-దలదియర్ సంతకాలతో మ్యూనిక్ షరతులు!

ఈ షరతుల్ని అంగీకరించడమా? తోసివెయ్యడమా అని సిరోవీ మంత్రివర్గంవారు తీవ్రంగా దీర్ఘంగా - ఆందోళిత హృదయాలతో - చర్చించారు. ఈ విషయమై మంత్రుల మధ్య అభిప్రాయ భేదాలు కలిగాయి. కొందరు "అంగీకరించక తప్పదుగదా?" అని అన్నారు. మరికొందరు "జర్మనీతో యుద్ధం వినాశకరమే కావచ్చును. కాని ఈ షరతుల్ని అంగీకరించడం కంటె, వినాశనమే మంచిది" అని అన్నారు. వేరొక కొందరు "మనం ఒక నిర్ణయానికి రావడానికి

ముందు ఈ షరతుల్ని మనం తోసివేసే పక్షంలో బ్రిటన్ ఫ్రాన్సులు ఎలాంటి వైఖరి అవలంబిస్తవో తెలుసుకోవడం అవసరం" అని అన్నారు. వారి మాట ప్రకారం బ్రిటన్, ఫ్రాన్సులకు పై ప్రశ్నను వేస్తే అవి "ఆ స్థితిలో మేము జర్మనీకి తోడ్పడవలసి ఉంటుంది," అనే ఘోరమైన జవాబును ఇచ్చినవి. హిట్లర్ కు యుద్ధానికి కావలసిన ధనాన్ని బ్రిటన్ అప్పుగా ఇస్తానన్నది. జర్మనీ, ఫ్రాన్సు సరిహద్దులో ఉంచిన సైన్యాల్ని జెక్ రాజ్యం మీదికి తరలించడానికి వీలుగా తాను నడుచుకుంటానని ఫ్రాన్సు బెదిరించింది.

బ్రిటన్, ఫ్రాన్సులు ఈ విధంగా ద్రోహం చేసిన తర్వాత "అయితే, మీ వైఖరి ఏమిటి?" అని సోవియట్ ప్రభుత్వం వారిని ప్రశ్నిస్తే, "హిట్లర్ ను మీరు ప్రతిఘటించదలుచుకుంటే, ఇప్పటికైనా మేము మీ సహాయానికి సిద్ధంగా ఉన్నాము" అని ప్రత్యుత్తరాన్ని పంపించారు. వారు ఈ వాగ్దానాన్ని పాలించుకుంటారనే విషయంలో సందేహం లేశమైనా లేదు. పోలెండ్ దండయాత్రకు సన్నద్ధపడుతూ ఉంటే సెప్టెంబరు 25వ తేదీ నాడే "పోలీష్ సైన్యాలు జెక్ రాజ్యంలో అడుగుపెడితే, మేము పోలెండ్ పైన విరుచుకుపడతాము, జాగ్రత్త సుమా!" అని మాస్కో ప్రభుత్వం వారు హెచ్చరించారు. కాని, ఒక్కసోవియట్ రష్యా సహాయాన్ని చూచుకుని, హిట్లర్‌ను ప్రతిఘటించడమా? "ప్రాగ్ ప్రభుత్వం బోల్షివిక్కుల కూటం" అని హిట్లరు ఇదివరకే దుష్ప్రచారం చేశాడు. ఇప్పుడు రష్యా సహాయాన్ని చూచుకొని మ్యూనిక్ షరతుల్ని తోసివేస్తే, తాను చేస్తున్న యుద్ధం బోల్షివిజం ప్రతిఘటన కోసమని హిట్లరు కపటనాటకాన్ని సాగించడా? ఈ కపటనాటకంలో బ్రిటన్, ఫ్రాన్సులు.

తప్పని సరిగా చేరతవిగదా? ఈ సందేహాలతో ఈ భయాలతో తటపటాయించి, తటపటాయించి, చివరికి ప్రతిఘటన సాగించవలసిందేనని సిరోవీ మంత్రి వర్గంవారు నిర్ణయించారు. వారు ఈ నిర్ణయానికి వచ్చింది, మ్యూనిక్ షరతులు తమకు చేరిన ఏడు గంటల తర్వాత.

అయితే, మంత్రివర్గంలోను, బయటనూ ఉన్న జెక్ కేపిటలిస్టులకు యుద్ధం అంటే బొత్తిగా ఇష్టం లేదు. అందులోనూ సోవియట్ రష్యా సహాయంతో యుద్ధానికి దిగడం అసలే గిట్టదు. . సూడెటెన్ జర్మనీని హిట్లరు ఆక్రమించడంవల్ల అక్కడ తమకు గల పరిశ్రమాగారాలు జర్మనీ వశమైపోయే మాట నిజం. అయినప్పటికీ తక్కిన దేశంలోగల సంపత్తిని తాము యధాప్రకారంగా అనుభవించవచ్చును. ఇక హిట్లరుతో యుద్ధానికి దిగితే, ఓడినా గెలిచినా తమకు సర్వవినాశనం తప్పదు. ఓడిపోయే పక్షంలో హిట్లర్ నిర్దాక్షిణ్యంగా తమ ఆస్తిపాస్తుల్ని జప్తు చేసుకుంటాడు. గెలిచే పక్షంలో తమ దేశములో కూడా సోవియట్ ప్రభుత్వం ఏర్పడ్డం ఖాయం. అప్పుడు తమకు మూడినట్టే! 'నాజీలకు లొంగవద్దు. ఒక్క అంగుళం రాజ్యమైనా వారికి అప్పజెప్పవద్దు. యుద్ధం చేద్దాము. అవసరమైతే మన హక్కుల రక్షణ కోసం ప్రాణాల్ని అర్పిద్దాము" అని జెక్ కమ్యూనిస్టు పార్టీ వారు మొదటి నుంచీ ఆందోళన చేస్తున్నారు. ఇప్పుడు మ్యూనిక్ షరతుల్ని తోసివెయ్యడం అంటే ఈ కమ్యూనిస్టుల సరసను యుద్ధభూమిలో నిలబడ్డమేకదా? ఇది కూడని పనిగదా? పైగా ఇప్పుడు కేవలం జర్మన్ కేపిటలిజంతో మాత్రమే కాకుండా, బ్రిటిష్ - ఫ్రెంచి కేపిటలిజములతో కూడా విరోధాన్ని పెట్టుకోవలసి వచ్చింది. చూస్తూ చూస్తూ ఇంత సాహసాన్ని చెయ్యడమే? "జెక్ కేపిటలిజం సుస్థిరంగా ఉండాలంటే, ముందు జెక్ కమ్యూనిస్టు సోషలిస్టు పక్షాల్ను అణగదొక్కాలి" అని రన్సిమన్ ప్రభువు ఇదివరకే సలహా చెప్పాడు. ఇది చాల చక్కని సలహా... ఈ విధంగా యోచనచేసి, జెక్ కేపిటలిస్టులు (మితవాదపక్షాలవారు) "ఇంతకూ మనకు పరిస్థితులు ఎదురైనవి. ఇప్పుడు మ్యూనిక్ షరతుల్ని అంగీకరించడమే శ్రేయస్కరం" అని ఒత్తిడి పెట్టారు.

చివరికి వారిపట్టుడలే నెగ్గింది. ప్రాగ్ ప్రభుత్వంవారు "విధి లేక మ్యూనిక్ షరతులకు తలవొగ్గుచున్నాము" అని ప్రకటించారు.

39

అక్టోబర్ 1వ తేదీనాడు - హిట్లర్ అంత్యసందేశం ప్రకారమే - జర్మన్ సైన్యాలు సూడెటెన్ జర్మనీలో ప్రవేశించాయి. ఏ క్షణంలో అవి జెక్ సరిహద్దును దాటినవో, ఆ క్షణంలోనే జెక్ స్వతంత్ర రాజ్యం జెక్ ప్రజాస్వామికం అంతరించిపోయిందని చెప్పవచ్చును. ఆక్రమణ ఎప్పుడు ఏవిధంగా, ఎంత వరకు జరగాలో నిర్ణయించడానికి మ్యూనిక్ షరతులు ఒక అంతర్జాతీయ సంఘాన్ని ఏర్పరిచాయి. అయితే వారమైనా తిరగకముందే ఇది నిరర్థకమైన సంస్థ అని తేలిపోయింది. ఈ సంస్థచేసిన నిర్ణయాలను హిట్లర్ పాటించలేదు. ఒకటి రెండుసార్లు ఇలా జరిగిన తర్వాత “మనం నిర్ణయాలను చెయ్యడం; హిట్లర్ వాటిని తృణీకరించడం; ఈ విషయం లోకానికి తెలిసి మనకు తలవంపులు కలగడం : ఈ గొడవకంటె అసలు హిట్లర్ ఏది చెపితే దానికి తల ఎగరవెయ్యడమే మంచిది. అప్పుడు మనం ఏదో నిర్ణయిస్తున్నామనే ప్రతిష్ఠనైనా పొందవచ్చును” అని ఈ అంతర్జాతీయ సంస్థవారు తీర్మానించుకున్నారు.
ఇందుకు కొన్ని ఉదాహరణలు ఇవి:

నూటికి 70 లేదా 75 వంతులు చొప్పున మొత్తం జనాభాలో జర్మన్ జాతివారున్న భాగాల్ని ప్లెబిసైట్ లేకుండా జర్మనీకి అప్పగించాలని అంతర్జాతీయ సంఘం వారు మొదట అన్నారు. “కాదు; నూటికి 51 వంతులు ఉంటే చాలు” అని హిట్లర్ అన్నాడు. ఇందుకు “సరే” అన్నారు సంఘం వారు. మొత్తం జనాభాలో జర్మన్ జాతివారు ఎన్ని వంతులు ఉన్నారో నిర్ణయించడానికి 1938 నాటి జనాభా లెబ్బల్ని ఉపయోగించాలన్నారు సంఘం వారు. “పనికిరాదు. 1910 నాటి జనాభా లెబ్బలు” అని హిట్లర్ ఆదేశించాడు. 1910 తర్వాత వేల కొలది, లక్షల కొలది జెక్ జాతివారు సూడెటెన్ జర్మనీలోకి వలసరావడం జరిగింది. అయినప్పటికీ “చిత్తం” అన్నారు, అంతర్జాతీయ సంఘ సభ్యులు.

కొన్ని రోజుల పాటు ఈ విధంగా తతంగం జరిగిన తర్వాత, అసలు అంతర్జాతీయ సంఘం లేనట్టే భావించి, హిట్లర్ తన చిత్తం వచ్చినట్టు చేసివేశాడు. దాని ఫలితం ఏమంటే, అయిదు దఫాలుగా ఆక్రమణ చేసిన తర్వాత జరుపవలసిన ప్లెబిసైటితో నిమిత్తం లేకుండా పోవడం; గోడెస్ బర్గ్ లో హిట్లర్ కోరినదాని కంటే కూడా ఎక్కువ రాజ్యం జర్మనీ వశమైపోవడం! ఏమైతేనేమి గాని చివరికి హిట్లర్ ఆక్రమించుకున్న రాజ్యభాగ విస్తీర్ణం 10,930 చదరపు మైళ్ళు. దీనిలోని జనాభా 36,52,200. ఈ జనాభాలో 7,19,127 మంది జెక్ జాతివారు. జెకోస్లోవేకియాలో జర్మన్ జాతి వారు మైనారిటీ సంఘంగా ఉన్నారనే నెపంతోనే గదా, హిట్లర్ చేసింది. మరి ఇప్పుడు జర్మనీలో చేర్చిన ఈ జెక్ మైనారిటీ సంఘం మాట ఏమిటో? జెక్ రాజ్యంలో జర్మన్ మైనారిటీ సంఘం స్థితి కంటే, జర్మనీలోని ఈ జెక్ సంఘం స్థితి ఉత్తమంగా ఉండగలదని అతడు హామీ నివ్వగలడా? నాజీ పరిపాలన కింద యూదు జాతివారు ఎంతటి రాక్షస కృత్యాలకు లోనౌతున్నారో, ఎంతటి నరకయాతన అనుభవిస్తున్నారో కళ్ళారా చూస్తున్నప్పుడు, అబద్ధాలకు వెరవని హిట్లర్ ఒకవేళ ఈ హామీ నిచ్చినా దానికి విలువ ఉంటుందా? ఇంత ఆర్భాటం సూడెటెన్ జర్మనీ ఆక్రమణ సందర్భంలో హిట్లర్ చూచింది ఒక్కటే, - ఎన్ని గనుల్ని, ఎన్ని పరిశ్రమాగారాల్ని, ఎంత ఇతరమైన ఆస్తిపాస్తుల్ని వశపరచుకోడానికి వీలుంటే, అంతటినీ చేజిక్కించుకోవడం! ఈ సూత్రానికి అవసరమని తోచిన చోట్ల అతడు జర్మన్ జాతివారి కంటే జెక్ జాతివారే అధికంగా ఉన్న ప్రదేశాలను కూడా కలుపుకున్నాడు. ఇందుకు నిదర్శనమీ అంకెలు:

ప్రదేశం	జెక్ జాతివారు	జర్మన్ జాతివారు
నోబ్మో	11,691	7,988
బ్రోజ్ లావ్	9,534	2,028
కోప్రిన్స్	3,698	622
పోలికా	4,934	591
స్ట్రామ్ బెర్క్	3,200	47
ప్రీబోర్	4,696	186
స్వినోల్	3,935	411

ఇవి విస్తీర్ణానికీ, జనాభాకూ చిన్న చిన్న ప్రదేశాలే కావచ్చును. అయినప్పటికీ పారిశ్రామికంగాను, ఇతర విధాలుగాను వీటికి ప్రాధాన్యత ఉన్నది. అంచేతనే హిట్లర్ వీటిని కబళించాడు. నోజ్మో ముఖ్యమైన రైల్వే జంక్షన్. పోలికాలో పెద్ద ఆయుధాల ఫ్యాక్టరీ ఉన్నది. ట్రిబోర్ ఇనుప పరిశ్రమకు ప్రసిద్ధిగన్నట్టి పట్టణం. ఇలాగే తక్కిన ప్రదేశాలకు కూడా ఏదో ఒక విశేషం ఉన్నది.
యుద్ధం చేసి, గెలిచినా, హిట్లరుకు ఇంత రాజ్యం లభించేదో, లేదో!

40

జర్మన్ సైన్యాలు జెక్ రాజ్యాన్ని ఆక్రమించుకుంటూ ఉంటే, ఇంకా మనవంతు రాలేదే అని పోలెండ్, హంగరీ రాజ్యాలు చాలా తొందరపడ్డవి. మ్యూనిక్ ఒడంబడికలోనే తమ వంతును గురించి కూడా ఏమైనా ఏర్పాటు జరగ వచ్చునని అవి ఆశించినవి. కాని, ఆ ఆశ ఫలించలేదు. జెక్ రాజ్యంతో తాము తమ వ్యవహారాల్ని స్వయంగా పరిష్కరించుకోవలసిందిగా మ్యూనిక్ ఒడంబడిక నిర్దేశించింది. జెక్ రాజ్యంతో వ్యవహార పరిష్కారం అంటే, అందుకు జర్మనీ చేసినట్టే పశుబల ప్రదర్శనాన్ని చెయ్యాలి; "దాడి జరుపుతాము సుమా!" అని బెదిరించాలి. ఈ ఉద్దేశంతో పోలెండ్, హంగరీ రాజ్యాలు రెండూ కూడా జెక్ సరిహద్దులలో చాలా దౌర్జన్యాలను జరపసాగినవి. వీటితో పరిస్థితులు నానాటికి దుస్సహమైనాయి.

తన కోర్కె సఫలం కావాలంటే యుద్ధం చెయ్యవలసి వస్తుందేమో అని తోచినప్పుడు హిట్లర్ పోలెండ్, హంగరీలను రెంటినీ కూడా జెక్ రాజ్యం మీద పురికొల్పాడు. "నేను పడమటి భాగాన్ని వశపరచుకుంటూంటే, మీరు తూర్పు భాగాన్ని కలుపుకోండి!" అని అతడు దురాశను రగుల్కొల్పాడు కూడా! అయితే, యుద్ధంతో అవసరం లేకుండానే, తన కోర్కె ఈడేరింది. ఇంతేకాదు. జెకొస్లోవేకియా తనకు కేవలం ఒక సామంత రాజ్యమైపోయింది. ఈ పరిస్థితుల్లో అనవసరంగా జెక్ రాజ్యాన్ని పోలెండ్, హంగరీలకు కట్టిబెట్టడం దేనికి? ఇంతవరకు వాటిని వెనక వేసుకు వచ్చినందువల్ల ఇప్పుడు వాటికి అసలు ఏమీ ఇవ్వనక్కర లేదని అనడం నగుబాటుగా కనబడుతుంది. అంచేత ఏదో కన్నీళ్ళు తుడవడానికి ఎంత తక్కువ ఇప్పించితే అంతమంచిది. ఇలా అనుకొని ఆతడు పోలెండ్, హంగరీల విపరీతపు కోర్కెల్ని ప్రతిఘటించడంలో ప్రాగ్ ప్రభుత్వానికి తోడ్పడ్డాడు.
ఇలా ముఖ్యంగా హంగరీ విషయంలో అతడి ఈ కొత్త ధోరణి బాగా బయటపడింది. జెక్ రాజ్యంలోని రుధేనియా రాష్ట్రాన్ని పూర్తిగా తనకు కలిపి వెయ్యాలని హంగరీ అల్లరి చేసింది. జరిగినట్లయితే, పోలెండ్ - హంగరీ రాజ్యాల సరిహద్దులు ఏకమైపోయేవి. ఒకప్పుడు - జెకొస్లోవేకియాతో యుద్ధం చెయ్యవలసి వస్తుందేమోనని అనుకున్నప్పుడు - "మీ రెండు రాజ్యాల సరిహద్దుల్ని కలపడం మంచిది" అని హిట్లర్ (గోరింగ్ ద్వారా) స్వయంగా పోలెండక్కు సూచించాడు. అట్టివాడు ఇప్పుడు తానే ఇది పనికిరాదన్నాడు. ఇలా అనడానికి గల కారణాలలో ముఖ్యమైనవి ఇవి : పోలెండ్ - హంగరీల రిహద్దులు ఏకమైతే, తాను రుమేనియా ద్వారా రష్యా పై దండయాత్ర చెయ్యడానికి ఒక క్రొత్త ప్రతిబంధకం ఏర్పడుతుంది. సోవియెట్ రష్యాలో యూక్రెయిన్ రాష్ట్రాన్ని గదా, తాను కోరుతున్నాడు? దీన్ని వశపరచుకోవాలంటే, జర్మన్ జాతిని ఏకం చెయ్యడం అంటూ ఆస్ట్రియా - జెకొస్లోవేకియాలపై దౌర్జన్యానికి దిగడానికి ఒక ఉద్యమాన్ని లేవదీసినట్లే; యూక్రేనియన్ జాతి ప్రజల్ని ఏకం చెయ్యడం అని ఇంకొక ఆందోళన ప్రారంభించాలి.

పోలెండ్ లో, రుమేనియాలో, సోవియట్ యూక్రెయిన్ రాష్ట్రంలో, రుధేనియాలో ఈ జాతి ప్రజలున్నారు. అంచేత ఈ కొత్త ఆందోళనకు రుధేనియా కేంద్రం కావాలన్నమాట! ఇట్టి స్థితిలో రుధేనియాను హంగరీకి అప్పచెప్పి వేస్తే, ఆట కట్టువడిపోదూ?

ఏ ఉద్దేశాలతో అయితే రుధేనియా పూర్తిగా హంగరీలో చేరి పోరాదని హిట్లర్ నిర్ణయించుకున్నాడో, అవే ఉద్దేశాలతో ఈ పని జరిగి తీరాలని ముసోలినీకి పట్టుదల కలిగింది. ఆస్ట్రియా, సూడెటెన్ జర్మనీల ఆక్రమణ వల్ల జర్మనీ మహాశక్తివంతమైన రాజ్యమైపోయింది. అది యూరప్ లో మరికొంత రాజ్యాన్ని వశపరచుకొంటే, ఇటలీ దాని ప్రతిభ

ముందు నిలవలేదు. అంచేత ఇకముందు దాని వ్యాప్తిని అరికట్టవలసిందే! ఇందుకు ఒక పద్ధతి. పోలెండ్, హంగరీల సరిహద్దును కలిపివేసి, రుమేనియా పైకి పోవడానికి జర్మనీకి మార్గం లేకుండా చెయ్యడం. విభిన్నమైన ఈ ఆలోచనల కారణంగా ముసోలినీ హంగరీని సమర్థించడమూ, హిట్లర్ జెకోస్లోవేకియాను సమర్థించడమూ జరిగింది. అంచేత తమ వ్యవహారాన్ని పరిష్కరించడానికి ప్రాగ్ ప్రభుత్వం జర్మన్ విదేశాంగ మంత్రి రిబ్బన్ ట్రాప్ నూ, బుడాపెస్ట్ ప్రభుత్వం ఇటలీ విదేశాంగ మంత్రి సియానోనూ మధ్యవర్తులుగా కోరుకున్నవి. వారుభయులు తమలో తాము ఏ కొంత తీవ్రంగా వాదోపవాదాలను జరుపుకున్న తర్వాత నవంబర్ 2వ తేదీనాడు వియన్నాలో తమ తీర్పును తెలియబరిచారు. దీని ప్రకారం హంగరీకి 4, 635 చదరపు మైళ్ళ రాజ్య ఖండమూ, 1,40,11,500 జనాభా దక్కింది.

ఈ లోపుగా పోలెండ్ వ్యవహారం కూడా పరిష్కారమైంది. ఈ పరిష్కారం ద్వారా దానికి 2,35,400 జనాభాగల 375 చదరపు మైళ్ళ రాజ్యం లభ్యమైంది.

మ్యూనిక్ లో బ్రిటన్, ఫ్రాన్సులో చేసిన ద్రోహం వల్ల జెకోస్లోవేకియాకు కలిగిన మొత్తం నష్టం ఇది : 15,940 చదరపు మైళ్ళ విస్తీర్ణం గల రాజ్యం అన్యాక్రాంతమై పోవడం; 49,29,100 మంది ప్రజలు అన్యపరిపాలన కిందికిపోవడం.

ఇంత రాజ్యం పోవడం వల్ల జెక్ బొగ్గు గనులలో నూటికి 70 వంతులు ఇతర రాజ్యాలలో పడిపోయినవి. ఇక, బట్టల పరిశ్రమ, గాజు పరిశ్రమ, పింగాణీ పరిశ్రమ నూటికి నూరు వంతులు చేయిజారిపోయినవి. మంచి కలప ఉన్నట్టి ఎన్నో అడవులు జర్మనీ సరిహద్దులలోకి వెళ్ళిపోయినవి. ప్రధానమైనట్టి అనేక రైలు మార్గాలు తెగిపోయినవి. ఎంతో ఖర్చుపడి కట్టించిన భూగర్భ దుర్గాలు మొదలైనవాటిని ఇతరుల చేతిలో పెట్టవలసి వచ్చింది. ఇవి అంతులేని నష్టాలే! కాని, వీటికిమించిన నష్టం ఏమంటే, జెక్ రాజ్య స్వాతంత్ర్యం భగ్నం కావడం; దాని ప్రజాస్వామిక ప్రభుత్వంలో వేరుపురుగు ప్రవేశించడం; దాని ఆత్మ మలినం కావడం.

41

తన కోర్కెలు పూర్తిగా సిద్ధించాలంటేనూ, జెకోస్లోవేకియా తనకు పూర్తిగా సామంత రాజ్యం అయిపోవాలంటేనా, డాక్టరు బెనిస్ అధ్యక్ష పదవి నుంచి తొలగిపోవడం అవసరమని హిట్లరు అనుకున్నాడు. ఇది నిశ్చయం కూడా! బెనిస్ జాతీయవాది; స్వాతంత్ర్య పిపాసి; ప్రజాస్వామ్యసిద్ధాంతాలలో స్థిరమైన నమ్మకం కలవాడు; ఇందుకు తోడు అతడు గొప్ప రాజకీయ చతురుడు కూడా! లిటిల్ ఎ తాతే అతడి నిర్మాణం. ఫ్రాన్సు, రష్యాలతో ఒడంబడికలు అతడు జరిపించినట్టివే! అంతర్జాతీయ రాజకీయ రంగంలో అతడికి మంచి పలుకుబడి ఉన్నది.

బ్రిటన్, ఫ్రాన్సులు తలవని తలంపుగా చేసిన ద్రోహం వల్ల జెక్ రాజ్య విచ్ఛేదానికి అతడు ప్రస్తుతం సమ్మతించినా, పోగా మిగిలిన దేశాన్నే స్వతంత్రంగా ఉంచడానికీ, శక్తిమంతంగా చెయ్యడానికి అతడు విశ్వప్రయత్నం చెయ్యకమానడు; స్వీయప్రతిభ వల్ల ఆ ప్రయత్నంలో జయం పొందకనూ మానడు; అంచేత అతడి పదవికి ఉద్వాసనాన్ని చెప్పించవలసినదే! వీలైతే అతడిని దేశభ్రష్టుణ్ణి కూడా చెయ్యవలసిందే!

ఈ పట్టుదల కొద్దీ "డాక్టర్ బెనిస్ పన్నెండు గంటలలోగా రాజీనామా నివ్వాలి. లేకపోతే జర్మన్, పోలిష్, హంగరియన్ సైన్యాలు ఒక్కుమ్మడిగా ప్రాగ్ మీద దండయాత్ర సాగిస్తవి" అని.

హిట్లరు అంత్య సందేశాన్ని పంపించాడు. దీని ప్రకారం అక్టోబరు 5వ తేదీనాడు డాక్టరు బెనిస్ తన పదవిని వదులుకున్నాడు. పదవీ పరిత్యాగాన్ని చేస్తూ ఆయన వ్రాసిన లేఖలోని కొన్ని వాక్యాలు ఇవి : "పరిస్థితులు పూర్తిగా మారిపోయినాయి గనుక, నేనింకా ఈ పదవిలో ఉండడం మన రాజ్య క్షేమానికి భంగకరమని నేను అనుకుంటున్నాను... రాజీనామా ద్వారా నేను నా బాధ్యతను తప్పించుకు పోవాలని చూడ్డం లేదు. తుఫానులో ఉన్న ఓడను వదలి పెట్టి


పోయినట్టుగా నేను వెళ్ళిపోవడం లేదు. నూతన పరిస్థితులకు అనుగుణ్యమైన స్వదేశ - విదేశ రాజకీయనీతి పరిణామం పొందడానికి మార్గాన్ని వదలాలనే నా సంకల్పం!"

మర్నాడు (అక్టోబరు 6) దేశానికి తన వీడ్కోలును అందజేస్తూ డాక్టర్ బెనిస్ ఇలా అన్నాడు : "పరిష్కారం కోసం మేము సాధ్యమైనంతవరకు ప్రయత్నించాం. కాని, మన జాతీయ సమస్య అంతర్జాతీయ సమస్యగా పరిణమించింది. నాలుగు పెద్ద రాజ్యాలు మనల్ని సంప్రతించ కుండానే నిర్ణయాలను చేసినవి. వీటిని గురించి నేను పల్లెత్తుమాట అనను. చరిత్రయే వీటి పై తీర్పు చెప్పగలదు. మన రాజ్యం పునఃనిర్మితం కావాలి. మన రాజనీతిలో మార్పు జరగాలి. ఇరుగు పొరుగు వారితో కలహాలు రావడానికి ఇక కారణం ఉండదు. మన రాజ్యానికి ఇకముందు అధిక జాతీయైక్యత ఏర్పడుతుంది. అందుమూలంగా మనకు మరింత నైతిక బలం సమకూడుతుంది. దేశ క్షేమానికి ప్రతిబంధకంగా నేను ఈ పదవిలో ఉండడం నా కిష్టం లేదు".

పదవీ పరిత్యాగాన్ని చేసిన తర్వాతనైనా, డాక్టర్ బెనిసను హిట్లర్ ప్రశాంతంగా జీవించ నివ్వలేదు. అతడిపై కుట్రల్ని పన్నాడు. డాక్టర్ షూష్నిగకు పట్టిన గతి తప్పాలంటే, వెంటనే జెకోస్లోవేకియాను వదలి పెట్టి పోవలసిందే అని అనిపించే పరిస్థితుల్ని కల్పించాడు. అంతట డాక్టర్ బెనిస్ రహస్యంగా ప్రయాణమై, , ఇంగ్లండు చేరుకుని, ప్రస్తుతం అక్కడనే ప్రవాస కేశాల్ని అనుభవిస్తున్నాడు.

స్వజాతి కోసం, స్వరాజ్యం కోసం జీవితాన్ని అంకితం చేసిన డాక్టర్ బెనిస్ కు చివరికి స్వదేశంలో నిలవ నీడ కూడా లేకుండా పోవడం చాలు, మ్యూనిక్ ఒడంబడికను ఖండించడానికి! అయినప్పటికీ ఇది చాలా ఘనకార్యమని నాటి నుంచి నేటి వరకు ఛెంబర్లేన్ చాటుతున్నాడు. ఇంతకంటే సిగ్గుచేటుపని ఈ ఒడంబడికను గురించి ఒక పత్రిక క్రింది విమర్శ చేసింది. "మ్యూనిక్ లో ఛేంబర్లేన్, దలదియర్లు కాలుచేతుల్ని అణచి పట్టుకోగా, ముసోలినీ తోడ్పాటుతో హిట్లర్ జెక్ రాజ్యకన్యను మానభంగం చేశాడు". ఈ విమర్శ తీవ్రంగా ఉంటే ఉండవచ్చును. కాని, ఇది సత్యవిదూరం మాత్రం కాదు.
- ముమ్మాటికీ.

పాలస్తీనా



శ్రీ నార్ల (1938)

సమర్పితము :

శ్రీ సూరపనేని వెంకటరత్నము
శ్రీ యార్లగడ్డ వెంకటకృష్ణారావు
ప్రియ మిత్రులకు

1

స్వాతంత్ర్య ప్రేమకూ, సామ్రాజ్య తత్వానికీ... జాతీయతకూ, జాత్యహంకారానికి .... ధర్మానికీ, అధర్మానికీ - ప్రస్తుతం మూడు దేశాలలో బహిరంగ సంఘర్షణ ... భయానక యుద్ధం ... జరుగుతున్నది. ఆ మూడు దేశాలు ఇవి : చీనా, స్పెయిన్, పాలస్తీనా.

చీనా మహారాజ్యాన్ని కబళించి, ఆసియా ఖండం మీద ఆధిపత్యాన్ని సంపాయించాలని చూస్తున్నది - జపాను. ఈ దుష్ప్రయత్నాన్ని ప్రతిఘటించడానికి అఖండమైన త్యాగాన్ని చేస్తున్నారు, - చీనావారు.

స్పెయిన్ దేశాన్ని సామంత రాజ్యంగా చేసుకుని, మెడిటరేనియన్ ప్రాంతంలో అప్రతిహతంగా విలసిల్లాలని ఆశిస్తున్నది, - ఇటాలియన్ ఫేసిస్టు ప్రభుత్వం. "విజయమో వీరస్వర్గమో" అనే మహాదీక్షతో స్వీయ స్వాతంత్ర్య రక్షణ కోసం పోరాడుతున్నారు, - స్పెయిన్ ప్రజలు. సరిగా ఇదేవిధంగా... ఇవే పరిస్థితులలో... పాలస్తీనా అరబ్బులు బ్రిటీష్ ఇంపీరియలిజంతో సంఘర్షిస్తున్నారు.

చీనాలో జపానువారు చూపుతున్న రాక్షసత్వానికిగాని, స్పెయిన్ లో ఫేసిస్టులు ప్రదర్శిస్తున్న అమానుషత్వానికిగాని, పాలస్తీనాలో బ్రిటిష్ ఇంపీరియలిస్టులు అవలంబిస్తున్న విధానం తీసిపోదు. అయితే, చీనా స్పెయిన్ దేశాలలో జరుగుతున్న ఘోరకృత్యాల్ని గురించి మనకు వార్తలు వస్తూ ఉంటాయి. పాలస్తీనాను గురించి మాత్రం యథార్థమైన సంగతులు తెలియవు. ఇందుకు ముఖ్య కారణం, మనకు విదేశ వార్తల్ని పంపించే రాయిటర్ న్యూస్ ఏజెన్సీ. ఈ సంస్థకు బ్రిటిష్ ప్రభుత్వం వారి ధన సహాయం ఉంది. పైగా, దీనికి యూదు జాతివారి పట్ల అభిమానం హెచ్చు. అసలు దీని సంస్థాపకుడే యూదు జాతివాడు. అందువల్ల బ్రిటిష్ ప్రభుత్వానికి కళంకాన్ని తెచ్చే సంఘటనల్నీ - పాలస్తీనా అరబ్బులకు అనుకూలమైన వార్తల్నీ - ఈ సంస్థ కప్పి పుచ్చుతున్నది.

"అరబ్బు దుండగీళ్ళు ఈనాడు ఫలానాచోట అల్లరి చేశారు."

"అరబ్బు బందిపోటు దొంగలు నిన్నను ఫలానా బ్యాంకును దోచుకున్నారు." "అరబ్బు హంతకులు నేటి ఉదయం ఫలానా బస్తీలో యూదుల్ని చిత్రవధ చేశారు".

రాయిటర్ పాలస్తీనానుగురించి పంపించే వార్తల ధోరణి ఇదే! ఈ వార్తల్ని చదువుతూ ఉంటే మానవాధములైనవారు ఎవరో కొందరు దౌర్జన్యాలను చేస్తూ, ప్రజల ప్రాణ మానవిత్తాల్ని హరిస్తూ ఉన్నట్టు తోస్తుంది; ధర్మయుతమైన ప్రభుత్వం మీద పితూరీ చేస్తున్నట్టు కనపడుతుంది. కాని, న్యాయానికి పాలస్తీనాలో జరుగుతున్నది పితూరీ కాదు; స్వాతంత్ర్య సమరం. దానిలో పాల్గొంటున్నవారు దుండగేళ్ళుగాని, బందిపోటు దొంగలుగాని, హంతకులుగాని కాదు; జాతీయాభిమాన పూరితులైన వీరశేఖరులు.

ఈ విషయాన్ని బ్రిటిష్ కలోనియల్ మంత్రి మాల్కాం మాక్డోనాల్డ్ కూడా ఇటీవల అంగీకరించక తప్పింది కాదు. కామన్సు సభలో 1938 నవంబర్ 24వ తేదీనాడు పాలస్తీనా సమస్యను గురించి ఉపన్యసిస్తూ ఇతడు "పాలస్తీనా అరబ్ ఉద్యమంలో పాల్గొంటున్న వారిలో చాలా మంది దేశాభిమాన ప్రేరితులైన వారని చెప్పక తప్పదు. వారి దేశాభిమానం వక్రమార్గాల్ని పట్టిన పట్టి ఉండవచ్చునుగాని, అసలు వారి దేశాభిమానాన్ని మాత్రం శంకించడానికి వీలులేదు. " అని అన్నాడు. ఇక పాలస్తీనా అరబ్బులు చేస్తున్నది స్వాతంత్ర్య సమరం కాదని ఎవరనగలరు? అన్నట్టు, కొందరు పాలస్తీనాలో అరబ్బులకూ యూదులకూ జరుగుతున్న సంఘర్షణను బట్టి పాలస్తీనా సమస్య కేవలం "అరబ్బు - యూదు" సమస్య అని

భావించడం కద్దు. భారత దేశ సమస్య కేవలం "హిందూ - మహమ్మదీయ" సమస్య అని భ్రమించడం ఎలా ఉంటుందో, ఇది కూడా సరిగా అంతే!

2

పాలస్తీనా చాల చిన్న దేశం. దాని వైశాల్యం సుమారు 900 చదరపు మైళ్ళు మాత్రమే! కాని దానికి ప్రాచీన చరిత్రలోనేమి, ప్రస్తుత కాలంలో నేమి విశేష ప్రాముఖ్యత ఉన్నది. ఇందుకు మొదటి కారణం, - దాని ఉనికి.

పాలస్తీనా మూడు ఖండాలకు ఆసియా, ఆఫ్రికా, యూరప్ ఖండాలకు మధ్యస్థంలో ఉన్నది. అంచేత ప్రపంచపు రహదార్లకు అది పెద్ద జంక్షన్ అయింది. పూర్వకాలంలో ప్రపంచం ఎగుమతి దిగుమతులు పాలస్తీనా పడమటి దిక్కులో ఉన్న రహదారి పైగానే నడుస్తూ ఉండేవి. వర్తక వ్యాపారాలకు మాత్రమే కాకుండా, ఆనాటి జైత్ర యాత్రలకు కూడా ఆ మార్గమే ఉపకరించేది. అస్సీరియన్, పర్షియన్, బాబిలోనియన్, యూరపియన్ సైన్యాలు ఈజిప్టుపై దండెత్తి వెళ్లిందీ, ఈజిప్టు వాటిని తరిమి కొట్టిందీ ఆ మార్గం వెంటనే.

పాలస్తీనా తూర్పు దిక్కులో కూడా ఇలాంటి రహదారే ఉండేది. ఇది దక్షిణాన గాజా దగ్గర బయల్దేరి, జోర్డాన్ ఎడారికి తూర్పుగా సిరియాలోకి వెళ్ళి, అక్కడి నుంచి మెసపొటోమియా అస్సీరియా, ఆర్మీనియా ఆసియామైనర్ మొదలైన ప్రాంతాలను చేరుకునేది. ఈజిప్టు నుంచి అరేబియాకు వెళ్లి రోడ్డు కూడా గాజా మీదుగానే పోయేది.

ప్రాచీనకాలంలో పాలస్తీనా ఇన్ని రోడ్లకు జంక్షన్ అయితే, ప్రస్తుతం ఇది అంతకు మించిన వైమానిక మార్గాలకు జంక్షన్. యూరప్, ఆఫ్రికా, ఆసియా ఖండాల మధ్య ప్రయాణం చేసే విమానాలు ఇక్కడనే మజిలీ చేస్తున్నాయి.

ఇక, పాలస్తీనా ప్రాధాన్యానికి రెండో కారణం, - దానిలో ఉన్న పుణ్యక్షేత్రాలు. యూదీయులకు, క్రైస్తవులకు, మహమ్మదీయులకు - వీరందరికి కూడా అది పవిత్ర భూమి.

యూదుజాతికీ, దాని మతానికీ, దాని విజ్ఞానానికి పాలస్తీనా జన్మస్థానం. హిందువులకు వారణాసివలెనే, యూదీయులకు జెరుసులం అతి పవిత్ర క్షేత్రం. వారి మతంలోనూ, వారి చరిత్రలోనూ ప్రసిద్ధికెక్కిన హెరాడ్ దేవాలయం ఈ నగరంలోనే ఉండేది. ఇప్పుడు ఆ దేవాలయం అంతటికీ మిగిలింది ఒక జీర్ణకుడ్యం". దీన్ని "వెయిలింగ్ వాల్" అంటారు. పర్వదినాలలో యూదీయులు ఇక్కడ చేరి ప్రార్థనలు చేస్తూ ఉంటారు. "శిథిలమైపోయిన మా రాణ్మందిరం కోసం మేము ఏకాంతంగా కూర్చుని విలపిస్తున్నాము; వినాశనం చేయబడ్డ మా దేవ మందిరం కోసం మేము ఏకాంతంగా కూర్చుని విలపిస్తున్నాము; విలప్తమైన మా ప్రతిభ కోసం, గతించిన మా మహా పురుషుల కోసం, భస్మీపటలమైన మా భాగ్యరాసులకోసం మేము ఏకాంతంగా కూర్చుని విలపిస్తున్నాము" - ఇదే వారి ప్రార్థనల సారాంశం. ఈ విధంగా వారు అక్కడ విలపిస్తూ ఉంటారు గనుకనే ఆ జీర్ణకుడ్యానికి "వెయిలింగ్ వాల్" (విలాపకుడ్యం) అనే పేరు వచ్చింది.





వెయిలింగ్ వాల్" మాత్రమే కాకుండా "జియాన్" పర్వతం కూడా జెరుసులం నగరంలోనే ఉన్నది. ఈ పర్వతం కూడా యూదీయుల దృష్టిలో చాలా పవిత్రమైంది.

ఇక, క్రైస్తవులకు పాలస్తీనాలో ప్రతి అంగుళం కూడా పూజనీయమైనట్టిదే. వారి మత సంస్థాపకుడైన ఏసుక్రీస్తు పుట్టిందీ, పెరిగిందీ, తన సందేశాన్ని చాటిందీ, చివరికి సిలువ మీద ఆత్మార్పణం చేసిందీ పాలస్తీనాలోనే. ఆయన జీవితంతో సంబంధం ఉన్న ప్రతి ప్రదేశమూ క్రైస్తవులకు ఒక మహాపుణ్యక్షేత్రం. వీటిలో జెరుసులం నగరానిది అగ్రస్థానం.

పోతే, మహమ్మదీయుల దృష్టిలో కూడా జెరుసులం పెద్ద పుణ్యక్షేత్రమే! మక్కా మదీనాల తర్వాత జెరుసులంకు వీరు ప్రాధాన్యతను ఇస్తారు.

ఉనికిని బట్టీ, వివిధ మతాలతో ఉన్న సంబంధాన్ని బట్టీ పాలస్తీనాకు ఏర్పడ్డ ఈ అధిక ప్రాముఖ్యత వల్లనే ప్రాచీనకాలం నుంచీ కూడా అది అనేక సంఘర్షణలకు ... అనేక యుద్ధాలకు .. కేంద్రమైంది.

ఈజిప్షియనులు, పర్షియనులు, యవనులు, అరబ్బులు, టర్కులు మొదలైనవారు అనేకులు వివిధ సమయాలలో పాలస్తీనా పైకి దండెత్తి వెళ్ళారు; దాన్ని జయించి పరిపాలించారు. ప్రస్తుత సమస్యను తెలుసుకోడానికి ఈ ప్రాచీన చరిత్ర అనవసరం. కాని, రెండు మూడు ముఖ్యమైన తేదీలను మాత్రం గుర్తుంచుకోవలసి ఉంటుంది. అవి ఇవి :

క్రీస్తు శకం 70వ సంవత్సరంలో జెరుసలమును ధ్వంసం చెయ్యడం, అక్కడ నుంచి యూదుజాతి వారిని వెళ్ళగొట్టడం జరిగింది.
1516లో టర్కీ పాలస్తీనాను జయించుకుంది.అప్పటి నుంచి 1917 వరకు పాలస్తీనా టర్కీ పరిపాలనలోనే ఉంది.

3

టర్కీ నిరంకుశ పరిపాలన క్రింద పాలస్తీనాతోపాటు తక్కిన అరేబియా అంతా కూడా అతి హైన్యస్థితిని అనుభవించవలసి వచ్చింది. దాన్ని భరించలేక అరబ్బు జాతి నాయకులు విప్లవ ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ ప్రయత్నాలు 1910 తర్వాతగాని ఒక రూపానికి రాలేదు.

1911 లోనో, 12 లోనో మెసపటోమియాకు స్వాతంత్ర్యాన్ని సంపాయించాలని బాగ్దాడ్ లోని ఇరాక్ సైనికోద్యోగులు ఒక రహస్య సంఘాన్ని స్థాపించారు.సిరియా స్వాతంత్ర్యం కోసం దమాస్కస్లో ఇంకొక రహస్య సంఘం ఏర్పడింది. మక్కా గ్రాండ్ షెరీఫ్ అయిన హుస్సేన్ - ఇతడు మహమ్మద్ ప్రవక్త వంశీయుడు - అరేబియానంతటినీ తన ఆధిపత్యం క్రింద స్వతంత్ర రాజ్యంగా చెయ్యాలని కలలు కనసాగాడు. నెక్ట్ ఎడారులలో ఇబిన్ సాద్ తలయెత్తి, వాహజీ స్వాతంత్ర్యోద్యమానికి నాయకుడయ్యాడు. మొత్తం మీద అరబ్బు జాతి అంతా కూడా టర్కీ దాస్యశృంఖలాల నుంచి తప్పించుకోవాలని తహతహలాడ సాగింది.

సరిగా ఈ సమయంలో ఐరోపా మహాసంగ్రామం (1914) ప్రారంభమైంది. ఈ మహా సంగ్రామంలో టర్కీ జర్మనీ పక్షాన్ని వహించింది. ఇది అరబ్బులకు చక్కని అవకాశంగా కనబడింది.

బ్రిటన్, ఫ్రాన్సు మొదలైన మిత్రమండలి రాజ్యాల పక్షాన చేరి, వాటి సహాయంతో విప్లవాన్ని ప్రకటించి, టర్కీదాస్యాన్ని వదుల్చుకుంటే, స్వరాజ్యాన్ని సంపాయించుకుంటే, ఈ ఆశ, ఈ కల అరబ్ జాతినంతటినీ ఆయుధ ధారణకు పురికొల్పింది.

అరబ్బుల దాస్య బాధను - వారి స్వరాజ్యకాంక్షను - స్వప్రయోజనానికి వినియోగించు కోవాలని మిత్రమండలి రాజ్యాల వారు మొదటి నుంచీ అనుకుంటూనే ఉన్నారు. అరబ్బులందరి చేత తిరుగుబాటు చేయిస్తే, అది టర్కీ సామ్రాజ్యం వెన్నున పొడిచినట్టవుతుంది. ఇంతటి సదవకాశాన్ని చేయిజారిపోనివ్వడమే!

టర్కీ సూయజ్ కాల్వకు సమీపంలో ఉన్న రాజ్యం. అది ఆ కాల్వ మీద దండెత్తితే, దాన్ని జయిస్తే, బ్రిటన్ - ఫ్రాన్సుల ఆటకట్టినట్టే! *(1914-1916 సంవత్సరాల మధ్య టర్కీ సేనలు రెండు సార్లు సూయజ్ కాల్వ మీద దండెత్తినాయి.)* అంచేత ఎంత త్వరగా టర్కీని దెబ్బకొడితే, అంత మేలు.

ఈ ఆలోచనతో బ్రిటిషువారు ఈజిప్టులో తమ హైకమిషనర్ గా ఉంటున్న సర్ హెన్రీ మాక్ - మాహౌన ను అరబ్బు జాతీయ నాయకులతో రహస్య రాయబారాల్ని సాగించవలసిందిగ ఆజ్ఞాపించారు. ఈ ఆజ్ఞ ప్రకారం అతడు మక్కాలోని షెరీఫ్ హుస్సేతో ఉత్తర ప్రత్యుత్తరాల్ని నడిపాడు.

“ఏడెన్ ను మినహాయించి మిగిలిన అరేబియా అంతా కూడా స్వతంత్ర రాజ్యంగా ఏర్పడ్డానికి మిత్ర మండలివారు అంగీకరిస్తే మేము మీ పక్షాన చేరి విప్లవం కొనసాగిస్తాము" అని సర్ హెన్రీ ఉత్తరానికి హుస్సేన్ ప్రత్యుత్తరాల్ని వ్రాశాడు. దానికి ఒప్పుదల కాకుండా సర్ హెన్రీ బేరానికి దిగాడు. కొన్ని రోజులపాటు ఈ బేరం సాగిన తర్వాత బసరా బాగ్దాద్ ప్రాంతం బ్రిటిష్ వారి అధికారం క్రిందనూ, అలెప్పొ బైరూత్ జిల్లాలు ఫ్రెంచివారి అధికారం క్రిందనూ తాత్కాలికంగా ఉండవచ్చునని హుస్సేన్ అంగీకరించాడు. ఆ తర్వాత 1915 అక్టోబర్ 24వ తేదీని బ్రిటిష్ ప్రభుత్వం వారి తరఫున సర్ హెన్రీ "మక్కా షెరీఫ్ సూచించిన సరిహద్దులలోని అరబ్ రాజ్యాల స్వాతంత్ర్యాన్ని అంగీకరించడానికీ, దాన్ని (ఆ స్వాతంత్ర్యాన్ని) స్థాపించడంలో తోడ్పడ్డానికి వాగ్దానం చేస్తున్నాము," అని తెలియబరిచాడు.
అరబ్బుల సహాయం అవసరం కావడం వల్ల, బ్రిటిష్ వారు అరేబియానూ దానిలో ఒక భాగమైన పాలస్తీనానూ - ఈ విధంగా అరబ్బు జాతివారికి వాగ్దానం చేశారు. కాని, అరబ్బుల సహాయం అవసరమైనట్టే, వారికి యూదీయుల తోడ్పాటు కూడా కావలసివచ్చింది. అంచేత వారు అరబ్బులకు ఇచ్చి వేస్తామన్న పాలస్తీనానే యూదీయులకు కూడా వాగ్దత్తం చేశారు.

4

స్వదేశ భ్రష్టులైన యూదీయులు పశ్చిమాభిముఖులై యూరప్ లోని వివిధ దేశాలకు వలస వెళ్ళి, అక్కడ నివాసమేర్పరచుకున్నారు. కాని ఒక చోటనైనా వారికి శాంతి, భద్రతలు చిక్కలేదు. అన్యజాతీయులు, అన్య దేశస్థులు, అన్య మతం వారు అనేక కారణాల చేత ప్రతి చోటనూ వారిని అనుమానంగా చూడ్డమే!

ఏసుక్రీస్తును సిలువ వేసినవారు" అని యూదీయులకు ఒకకళంకం ఉంది. దీన్ని సాకుచేసుకుని, ప్రతి దేశంలోనూ క్రైస్తవ మతగురువులు వారి మీద ప్రజా విద్వేషాన్ని రగుల్కొల్పేవారు. ఇంతే కాదు. యూదీయుల ప్రజ్ఞావిశేషాలే వారికి ఒక లోపంగా పరిణమించాయని కూడా చెప్పవచ్చు. తమ అపార మేధా శక్తి వల్ల వారు ఏ భాషనైనా సులభంగా అభ్యసించగలరు; ఏ వృత్తిలోనైనా తేలికగా చాకచక్యాన్ని సంపాయించగలరు. అంచేత ఎంతటి హైన్యస్థితిలో - ఎంతటి

పరదేశానికి వెళ్ళినా - వారు ఇట్టే పైకి రాగలరు. ఇది స్థానిక ప్రజల అసూయను రేకెత్తించడం సహజం. ఈ అన్ని కారణాల వల్ల ప్రతిదేశంలోనూ యూదీయుల్ని హింసించడం, ప్రతి చోట నుంచీ వారిని తరిమి కొట్టడం సంభవించింది; సంభవిస్తున్నది.

ఇంగ్లండు నుంచి వారిని 1290 లోనూ, ఫ్రాన్సు నుంచి 1394లోనూ, స్పెయిన్ నుంచి 1492లోనూ, పోర్చుగల్ నుంచి 1497లోనూ, నేపుల్సు నుంచి 1540లోనూ, వియన్నా నుంచి 1670లోనూ, బొహిమియా నుంచి 1745 లోనూ తరిమివేశారు. యూరప్ పశ్చిమ భాగంలోని ఒక్కొక్క దేశంలో నుంచి ఇలా తరిమి వెయ్యగా, యూదీయులు యూరప్ తూర్పు దిక్కుకు (రష్యా, పోలెండు మొదలైన తూర్పు దేశాలకు) చేరుకున్నారు. కాని, కొంత కాలమైన తర్వాత ఇక్కడి నుంచి గూడా వారికి ఉద్వాసం చెప్పారు.

తమకు ఒక దేశం - ఒక జాతీయ కేంద్రం లేక పోవడం వల్లనే అందరి తావుల్ని పడుతూ, ఎక్కడనూ నిలువ నీడలేక అల్లాడ వలసిన గతి పట్టిందిగదా అని యూదు జాతివారికి సంతాపం కలిగింది. అయితే, ఎంత సంతాపంలో ఉన్నప్పటికీ ఏదో అస్పష్టమైన ఆశా రేఖ వారికి కొంత కొత్త బలాన్నీ ఉత్సాహాన్నీ ఇస్తూ ఉండేది. ఆ అస్పష్టమైన ఆశారేఖ, - పాలస్తీనా! పాలస్తీనా తమ మాతృదేశం; తమ పుణ్యభూమి; తమ జాతీయ కేంద్రం; తమ విజ్ఞాన వాటిక, ఏనాటికో ఒకనాటికి ఏదో ఒక విధంగా అది తిరిగి తమది కాకపోతుందా! తిరిగి అక్కడ తాము సుఖంగా, స్వేచ్ఛగా శాంతంగా జీవించగల భాగ్యం పట్టకపోతుందా? క్రైస్తవుల ఘోరహింసకు బలి అయిన ప్రతియూదీయుని హృదయాంతరాళంలోనూ అస్పష్టంగా ఉన్న ఈ ఆశా రేఖకు ఒక స్వరూపాన్ని కల్పించి, దాన్ని ఒక మహోద్యమంగా చేసినవాడు డాక్టర్ థియోడోర్ హెర్జల్.

డాక్టర్ హెర్జల్ ఆస్ట్రియా దేశస్థుడు. అతడి నివాసం వియన్నా. వృత్తి జర్నలిజం; నాటకాలు వ్రాయడం. అతడు చాల అందమైనవాడు; అందాన్ని మించిన ప్రతిభ గలవాడు.
డ్రైఫస్ కేసు" ను తన పత్రికకు రిపోర్టు చెయ్యడానికి 1894లో డాక్టర్ హెర్జల్ ప్యారిస్ నగరానికి వెళ్ళాడు. ఈ కేసు చరిత్ర ప్రసిద్ధికెక్కినట్టిది. దీనిలో ముద్దాయి ఒక యూదు సైన్యాధ్యక్షుడు (జనరల్). పేరు, - డ్రఫస్. ఫ్రెంచి సైనిక రహస్యాన్ని ఏదో విదేశ ప్రభుత్వానికి అందజేశాడని అతడి మీద కేసు వచ్చింది.

డ్రఫస్ నిర్దోషి అని అందరికీ తెలుసు. అయితే మాత్రమేమి? అతడు యూదుజాతివాడు. ఆ జాతికి చెందడమే ఒక నేరం. ఇక ఆ జాతికి చెంది ఉండి కూడా ఉన్నత సైనికోద్యోగి కావడం క్షమింపరాని పెద్ద నేరం. అంచేత అతడిని శిక్షించ వలసిందే! అతడు అనేక యుద్ధాలలో పాల్గొన్నమాట నిజం. ఎన్నో సైనిక గౌరవాల్ని పొందిన మాట నిజం. కాని, యూదు జాతివాడైనందున అతడి విషయంలో ఈ సంకోచాలు అనవసరం. తప్పక అతడిని శిక్షించవలసిందే! కఠినంగా శిక్షించ వలసిందే! డ్రఫసకు కఠిన శిక్షే పడింది. ముందు దేశద్రోహాన్ని చేసినందుకు అన్ని సైన్యాల ముందు ఆ గౌరవం పొందడం. ఆ తర్వాత ఆజన్మ ద్వీపాంతర వాసం.

ఈ కేసులో స్వజాతీయుడైన డ్రఫసకు జరిగిన ఘోరాన్యాయాన్ని కళ్లార చూచినప్పుడు "అన్య దేశాలలో ఉండి, ఆ దేశాలకు యూదీయులు ఎంత ప్రేమ పూర్వకంగా సేవ చేసినప్పటికీ, వారు ఆ దేశస్థులలో ఐక్యమైపోలేరు. వారు ఐక్యమైపోవాలని అనుకున్నా ఆ దేశాలవారు అలా జరగనివ్వరు." అని హెర్జల్ నిశ్చయించుకున్నాడు. అయితే, మరి యూదీయుల గతి ఏమిటి? ఆ క్షణంలో అతడి మనోవీధిని ఒక మెరుపు మెరిసింది - పాలస్తీనా!

యూదులు తిరిగి పాలస్తీనా చేరుకోవలసిందే! పాలస్తీనా చాలా చిన్న దేశం. అక్కడ ప్రపంచంలోని అందరు యూదులు స్థిరపడ్డానికి తగినంత ప్రదేశం లేదు. అంచేత అందరూ అక్కడికి చేరుకోవడం అనేది అసంభవం. కాకపోతే సంభవం

కాగల కార్యం ఏదంటే, పాలస్తీనా యూదీయులకు తిరిగి జాతీయ కేంద్రం కావడం. " జాతీయ కేంద్రం" అనే ఈ ఆశయాన్ని సాధించడానికే హెర్జల్ 1897లో "జియోనిజం" అనే ఉద్యమాన్ని ప్రారంభించాడు. హెర్జల్ ప్రారంభించిన ఈ ఉద్యమం అతడి ప్రతిభా విశేషం వల్లనేమి, రాజకీయ చతురత వల్లనేమి *(హెర్జల్ 1904 లో మరణించాడు)* సత్వరాభి వృద్ధిని చెంది, ఐరోపా మహాసంగ్రామం నాటికి ప్రపంచ వ్యాప్తిని గాంచింది.

5

యుద్ధం వ్యయంతో కూడిన వ్యాపారం. ఈ వ్యయమైనా ఒక కోటీ, రెండు కోట్లు కాదు; శతకోట్లు, సహస్రకోట్లు. ఇంత పెద్ద మొత్తాన్ని కేవలం అదనపు శిస్తుల వల్ల సంపాయించడం పడదు. అంచేత, ఋణాన్ని చేసి తీరాలి. ప్రభుత్వాలకు పెద్ద పెద్ద ఋణాల్ని ఇవ్వగలవారు బ్యాంకర్లు. లండన్, ప్యారిస్, న్యూయార్క్ : ఈ నగరాలలోని పెద్ద బ్యాంకర్లు చాలా వరకు యూదుజాతివారు. అంచేత ఈ నగరాలలో తనకు తగిన పరపతి పుట్టాలంటే, తాను " జియోనిజం" పట్ల అభిమానాన్ని చూపించాలని బ్రిటన్ అనుకుంది. ఈ ఆలోచనతో యుద్ధం ముగిసిన తర్వాత పాలస్తీనాను యూదీయులకు జాతీయ కేంద్రంగా చేస్తానని అది వాగ్దానం చేసింది.

బ్రిటన్ యూదులకు ఈ విధంగా వాగ్దానం చెయ్యడానికి ఇంకో కారణం కూడా ఉంది. బాంబుల్ని చెయ్యడానికి "ఆల్కోహాల్" చాలా అవసరం. యుద్ధ సమయంలో మామూలుగా ఉండే చిక్కుల వల్లనేమి, జర్మన్ సబ్ మెరీనులు ఓడల్ని ముంచి వేస్తూ ఉండడం వల్లనేమి, బ్రిటనకు "ఆల్కోహాల్" తగినంతగా దొరకడం అసాధ్యమైపోయింది. ఈ కష్టసమయంలో డాక్టర్ చెయిమ్ వైజ్ మన్ కేవలం దేవుడిలా అడ్డుపడ్డాడు.

డాక్టర్ వైజ్ మన్ మాంచెస్టర్ యూనివర్సిటీలో కెమిస్ట్రీ (రసాయన శాస్త్రం) ప్రొఫెసర్. అతడి పుట్టుక రష్యన్ పోలెండ్ లో."(అంటే, అప్పటిలో రష్యా పరిపాలన కింద ఉన్న పోలెండ్ రాజ్యభాగంలో) చదువుకున్నది జర్మనీలో 1904 ప్రాంతాలలో ఇంగ్లండ్ వచ్చి, అక్కడనే నివాసం ఏర్పరచుకున్నాడు. బ్రిటన్ లోని " జియోనిస్టు" నాయకులలో అతడే అగ్రగణ్యుడు."ఆల్కాహాల్" తగినంతగా లభించక బ్రిటన్ విషమస్థితిలో పడ్డప్పుడు డాక్టర్ వైజ్ మన్ కొయ్యలో నుంచి దాన్ని (ఆల్కోహాల్) తియ్యడానికి ఒక చక్కటి పద్ధతి కనిపెట్టాడు. ఆపత్సమయంలో ఇంత మహోపకారాన్ని చేసినందుకు చాలా సంతోషించి, అప్పటిలో బ్రిటిష్ ప్రభుత్వంలో "మ్యూనిషన్సు" (మందుగుండు) మంత్రిగా ఉన్న లాయడ్ జార్జి "మిమ్మల్ని సముచితరీతిగా గౌరవించాలని అనుకుంటున్నాము. మీరు ఏమి పారితోషికాన్ని కోరుకుంటారో కోరుకోవలసింది" అని డాక్టర్ వైజ్ మన్ ను అడిగాడు. ఇందుకు అతడిచ్చిన జవాబు ఇది."నాకు కావలసిన పారితోషికం మా యూదుజాతి వారికి ఉపకారం చెయ్యడానికి అవకాశం మాత్రమే."

ఈ పరిస్థితిలో డాక్టర్ వైజ్ మనను సంతోషపెట్టడానికి కూడా పాలస్తీనాను యూదీయుల జాతీయ కేంద్రంగా చేస్తామని మాటనివ్వవలసి వచ్చింది.

6

ఇప్పటికి పాలస్తీనా విషయమై బ్రిటన్ రెండు వాగ్దానాల్ని చేసింది. ఒకటి : ఆదేశాన్ని అరబ్బుల స్వతంత్ర రాజ్యంగా చేస్తాననడం. రెండు : దాన్నే యూదీయుల జాతీయ కేంద్రంగా చేస్తాననడం.

ఈ రెండు వాగ్దానాలు పరస్పర విరుద్ధమైనట్టివి. పాలస్తీనా, అరబ్బుల స్వతంత్ర రాజ్యమైతే, యూదీయుల జాతీయ కేంద్రం కాలేదు. ఇక, అది యూదీయులకు జాతీయ కేంద్రమే అయితే, అరబ్బులకు అక్కడ స్వాతంత్ర్యం ఉండదు. ఒక దాన్ని నిలబెట్టుకోవాలంటే, రెండోదాన్ని తప్పక తోసివెయ్యవలసిన స్థితిలో ఈ రెండు వాగ్దానాల్ని చెయ్యడమే తగని పని. కాని, బ్రిటన్ ఇంతకంటె కూడా ఘోరమైన పనిని ఇంకొకదాన్ని చేసింది. అదేమంటే - అటు అరబ్బులకూ, ఇటు యూదులకూ కాకుండా పాలస్తీనాను తానే స్వాహా చెయ్యాలను కోవడం!

టర్కీ నుంచి తాము జయించుకోబోతున్న అరేబియా రాజ్యాల్ని, వీళ్ళకూ వాళ్ళకు కట్టబెట్టడం దేనికనుకుని కాబోలు, బ్రిటన్, ఫ్రాన్సులు తమలోతాము ఒక రహస్యపు ఒడంబడికను చేసుకున్నవి. దీన్ని "సైక్స్-పికాట్ ఒడంబడిక" అని అంటారు. ఇది జరిగింది 1916 మే నెలలో.

ఈ "సైక్ - పికాట్ ఒడంబడిక"లోని ముఖ్యమైన షరతులు ఇవి : మెసపటోమియా రాజ్యమూ, పాలస్తీనాలోని రెండు వోడ రేవులూ (హైఫా, ఎడి) బ్రిటన్ అధీనంకావాలి. సిరియాకోస్తా ఫ్రాన్సు పరిపాలన కింద ఉండాలి. డమాస్కస్, అలెప్పో, మోసుల్ ప్రాంతాలు ఫ్రాన్సు (పరిపాలన కింద కాదుగాని) పలుకుబడిలో ఉండాలి. ఇక, పాలస్తీనా (పెద్ద ఓడరేవులు రెండూపోగా మిగిలిన భాగం) బ్రిటన్, ఫ్రాన్సు, రష్యా రాజ్యాల నిర్ణయాన్ని అనుసరించి ఏర్పడే ప్రభుత్వానికి లోబడి ఉండాలి.

తెర వెనక జరిగిన ఈ కపట నాటకం (సైక్స్ - పికాట్ ఒడంబడిక) సంగతి యూదీయులకు తెలిసిందో, లేదోగాని, అరబ్బులకు మాత్రం తెలియనే లేదు. బ్రిటను తన వాగ్దానాన్ని చెల్లించుకుంటుందనీ, తమకు స్వాతంత్ర్యం లభిస్తుందనీ ఆశపడుతూ, వారు విప్లవాన్ని సాగించారు. టర్కీ వారు స్వమతస్థులు. మహమ్మదీయులకు స్వమతస్థులంటే ఎంత పక్షపాతమో అందరికీ తెలిసిన విషయమే! అయితే, ఇక్కడ స్వమతస్థుల పక్షం వహించడమంటే, తమ దాస్య శృంఖలాల్ని తామే మరింత బిగించుకోవడమన్న మాట! ఇక, అన్యమతస్థులైన బ్రిటీష్ వారితో చేరితే, స్వాతంత్ర్యం లభిస్తుంది. స్వమతస్థుల పట్ల పక్షపాతమా! లేక, స్వాతంత్ర్యం పట్ల పక్షపాతమా? ఆరబ్బుల స్వాతంత్ర్య కాంక్షే నెగ్గింది; వారు టర్కీ మీద తిరగబడ్డారు.

ఆరబ్బుల తిరుగుబాటును అణచివెయ్యడానికి టర్కీ మదీనాకు సేనల్ని పంపించింది. సేనలు మక్కాలోని పుణ్యస్థలాల మీద ఫిరంగుల్ని కాల్చాయి. టర్కీ చేసిన ఈ తెలివి తక్కువ పనివల్ల, ఆరబ్ జాతివారిలో పరిపూర్ణమైన సంఘీభావం ఏర్పడింది. హుస్సేన్ మూడో కుమారుడైన ఫైజల్ నాయకత్వం క్రింద - ఇంగ్లీషు యువకుడైన టి.ఇ లారెన్సు తోడ్పాటుతో - వారు హెడ్ జాజ్ గుండా దండెత్తి వెళ్ళి, సినాయ్ గల్ఫ్ వరకు ఆక్రమించు కున్నారు.

ఈ లోపుగా బ్రిటీష్ సేనాని ఆలంబీ ప్రభువు ఈజిప్టు నుంచి పాలస్తీనా పైకి దండయాత్ర ప్రారంభించాడు. ముందు పాలస్తీనాను ఆక్రమించుకొని, ఆ తర్వాత సిరియా గుండా టర్కీ పైకి దండెత్తాలని అతడి ఉద్దేశం. ఆలెంబీ పాలస్తీనాను జయించుకుపోతూ ఉంటే, మదీనాలో వున్న టర్కీ సైన్యాలు అతడిని ఎదుర్కొనకుండా ఆరబ్బులు (ఫైజల్ అనుచరులు) కాపాడారు. మదీనా నుంచి టర్కీ దళాలు రైలులో (పిలిగ్రిమ్స్ రైల్వే) వస్తూవుంటే, ఆరబ్బులు ఆ రైలు పట్టాల్ని

మందుగుండుతో పేల్చివేస్తూ ఉండేవారు. తన కుడివైపు నుంచి టర్కీవారు ఎదుర్కుంటారనే భయం ఈ విధంగా తొలిగిపోగా, ఆలెంబి అతి సులభంగా పాలస్తీనాలోని వివిధ ప్రాంతాల్ని జయించుకుంటూ, జెరుసులం సమీపించాడు.

ఈ సమయానికి "సైక్స్-పికాట్ ఒడంబడిక" జరిగినట్టు ఆరబ్బులకు చూచాయగా తెలిసింది. అయితే, వారు దాన్ని నమ్మలేదు. సర్ హెన్రీ మాక్-మోహన్ ద్వారా మనకు స్వాతంత్ర్యాన్ని వాగ్దానం చేసిన బ్రిటన్ ఇంత ద్రోహాన్ని చెయ్యడం అసంభవం" అని వారు అనుకున్నారు."ఆలెంబీ విజయానికి మనం చేసిన అపార సేవను చూచిన తర్వాత కూడా బ్రిటన్ కృతజ్ఞత చూపుతుందా?" అని వారు మనస్సును సమాధానపరుచుకున్నారు. బ్రిటన్ వాగ్దానం మీద, దాని ధర్మబుద్ధి మీద ఇంత విశ్వాసాన్ని పెట్టుకున్న ఆరబ్బుల మీద సోవియట్ ప్రభుత్వం చేసిన ప్రకటన పిడుగులా పడింది.

రష్యాలో 1917 నవంబర్ లో బోల్షివిక్ విప్లవం జరిగి సోవియట్ ప్రభుత్వం ఏర్పడగానే, ఆ ప్రభుత్వం వారు "రష్యా ఇక ఐరోపా మహాసంగ్రామంలో పాల్గొనదు," అని ప్రకటించారు. ఇంటితో ఆగక, మిత్రమండలి రాజ్యాల కపటాన్ని బయట పెట్టడానికి వారు యుద్ధ సమయంలోనూ, అంతకు పూర్వమూ పరస్పరంగా చేసుకున్న రహస్యపు ఒడంబడికల్ని కూడా లోకానికి వెల్లడి చేశారు. వీటిలో ఒకటి, - "సైక్స్ - వికాట్ ఒడంబడిక". -.

అప్పుడు ఆరబ్బులకు బ్రిటన్ వాగ్దానాల మీదనూ, ధర్మబుద్ధి మీదనూ పోయిన విశ్వాసం తిరిగి ఎన్నడూ ఏర్పడలేదు; ఇక ఏర్పడదు కూడా!

7

బ్రిటన్, చేసిన వాగ్దానాల్ని చెల్లించకపోవడం ఒక పాలస్తీనాలోనే కాదు, ఇండియాలో, ఈజిప్టులో, ఇంకా ఎన్నో ఇతరచోట్ల అది ఈలాగే చేసింది. పాలస్తీనాలో చేసినంత ఘోరంగా అది ఈ పనిని ఇతర చోట్ల చెయ్యలేదేమో!

పాలస్తీనాను ఆరబ్బు స్వతంత్ర రాజ్యంగా చేస్తానని ముందు మాట ఇచ్చి, ఆ తర్వాత దాన్ని తానే వశపరచుకోవడానికి బ్రిటన్ ఒక సాకు చెబుతుంది. అది ఏమంటే, - సర్ హెన్రీ మాక్ - మాహోన్ కు హుస్సేన్ సూచించిన ఆరబ్బు స్వతంత్ర రాజ్యం సరిహద్దులలో పాలస్తీనా లేదట. ఇది కేవలం అబద్ధమనే చెప్పాలి. అరేబియా అంతటిలో సారవంతమైన ప్రదేశాలలో ఒకటైన పాలస్తీనాను - తూర్పు మెడిటరేనియన్ కు ఆయువుపట్టులలో ఒకటని చెప్పదగిన హైఫా ఓడరేవు ఉన్న పాలస్తీనాను - మూడు ఖండాల రహదార్లకు జంక్షన్ గా ఉండి, అరేబియా అంతటికీ ప్రాముఖ్యతను తెచ్చే పాలస్తీనాను - హుస్సేన్ తాను సూచించిన సరిహద్దులలో చేర్చలేదనడం నమ్మదగిన విషయం కాదు.

ఒకవేళ ఈ వాదాన్ని కొట్టివేసినా, ఇంతకంటే బలీయమైన ప్రత్యక్ష సాక్ష్యం ఉంది. ఆరబ్బుల్ని విప్లవం చెయ్యవలసిందిగా ప్రబోధిస్తూ బ్రిటీష్ విమానాలు లక్షలాది కరపత్రాల్ని వెదజల్లాయి. ఈ కరపత్రాలలో అరేబియాను స్వతంత్ర రాజ్యానికి వారు స్వయంగా పేర్కొన్న సరిహద్దులలో పాలస్తీనా ఇమిడి ఉంది.

అంచేత, పాలస్తీనా విషయంలో బ్రిటన్ ఆరబ్బుల పట్ల నమ్మకద్రోహం చేసినదనడంలో ఏమీ సందేహం అవసరం లేదు. ఈ విషయాన్ని ఒక బ్రిటీష్ ప్రముఖుడే కింది విధంగా అంగీకరించాడు:

"ఈ ప్రాంతంలో మన మార్గం ఉల్లంఘించిన వాగ్దానంతో నిండివుంది... 1915లో మనం పాలస్తీనాను హెడజాజ్ రాజైన హుస్సేన్ కు ఇస్తామన్నాము; 1916లో సైక్స్ - పికాట్ ఒడంబడిక కింద దాన్నిమనమే అట్టిపెట్టుకోవా లనుకున్నాము;

1917లో బాల్ఫర్ ప్రకటన ద్వారా యూదులకు వాగ్దానం చేశాము; 1918లో తిరిగి హుస్సేన్ రాజుకు ఆశ పెట్టాము; యుద్ధ విరామం జరిగిన రోజులలో స్థానిక ప్రజలకు పట్టం కడతామన్నాము; సంధి సభ (ప్రెస్ కాన్ఫరెన్స్) జరిగిన తర్వాత యూదీయుల వైపు మొగ్గాము".

పాలస్తీనా విషయంలో బ్రిటన్ ఇంత దగాకోరుగా నడచుకోడానికి - ఇంతకు ముందు సందర్భానుసారంగా అక్కడక్కడ సూచించినట్టు - అనేక బలీయమైన కారణాలున్నాయి. అవి ఏమంటే, సూయజ్ కాల్వ రక్షణకు ఈజిప్టుపై పెత్తనం ఎంత అవసరమో, పాలస్తీనా పై ఆధిపత్యం కూడా అంత అవసరం.

తూర్పు మెడిటరేనియన్ లో బ్రిటీష్ నౌకాశక్తి అకుంఠితంగా ఉండాలంటే, హైఫాను గుప్పిటిలో పెట్టుకోవాలి. బ్రిటన్ కు కావలసిన పెట్రోల్ విశేషంగా ఇరాక్ లోని మోసుల్ నుంచి వస్తుంది. మోసుల్ గనులలో నుంచి తీసిన పెట్రోల్ ను ఎగుమతి కోసం మెడిటరేనియన్ సముద్ర తీరానికి చేర్చడానికి సిరియా ఎడారుల గుండా హైఫా వరకు గొట్టాల్ని (పైప్ లైన్) వేశారు. పాలస్తీనా మీద ఆధిపత్యం లేకపోతే ఇరాక్ పెట్రోల్ సప్లయి విషయంలో చిక్కులు ఏర్పడుతాయి. బ్రిటన్ నుంచి ఆసియాకూ, ఆఫ్రికాకు వెళ్ళే విమానాలకు కావలసిన వైమానికాశ్రయాల్ని కట్టుకోడానికి పాలస్తీనా చక్కగా ఉపకరిస్తుంది.

ఈ విధంగా బ్రిటీష్ సామ్రాజ్య రక్షణకు పాలస్తీనా ఎంతైనా అవసరం. ఈ విషయాన్ని స్పష్టంగా అంగీకరిస్తూ ఇటీవలనే (1936 జూన్) యామెరీ అనే ఆయన కామన్సు సభలో ఇలా ఉపన్యసించాడు :

అది (పాలస్తీనా) ఈ దేశానికీ, ఆఫ్రికాకూ, ఆసియాకూ మధ్య ఉన్న వైమానిక మార్గాలకు క్లా హామ్ జంక్షన్. మెడిటరేనియన్లో ఏర్పడ్డ కొత్త పరిస్థితుల్ని బట్టి (ఇది ఇటలీ విజృంభణను మనస్సులో పెట్టుకుని అన్నమాట) సూయజ్ కాల్వ రక్షణ విషయంలో దాని ప్రాముఖ్యత అపారం. మాండేజ్ షరతుల ప్రకారం పాలస్తీనాలో మనం యుద్ధ నౌకాశ్రయాల్ని నిర్మించుకోడానికి వీలులేని మాట నిజం. కాని, మెడిటరేనియన్ లోని పెద్ద ఓడరేవులలో ఒకదానిగా గాని, పారిశ్రామిక కేంద్రాలలో ఒకదానిగా గాని హైఫాను వృద్ధి పరిస్తే, యుద్ధ సమయాలలో ఇతరచోట్ల నుంచి మనం తెప్పించుకోలేని వస్తువుల్ని సప్లయ్ చెయ్యడానికి అది ఎంతైనా ఉపకరిస్తుంది".

8

పాలస్తీనాను యూదు జాతీయ కేంద్రంగా చేస్తానని బ్రిటన్ రహస్యంగా వాగ్దానం చేసిందేగాని, బహిరంగ ప్రకటన చెయ్యలేదు. రహస్యంగా చేసిన వాగ్దానాన్ని కాదంటే, మళ్ళీ నోరెత్తడానికైనా వీలుండదు. అంచేత, బాహిరంగ ప్రకటన చెయ్యవలసిందిగా బ్రిటీష్ ప్రభుత్వాన్ని డాక్టర్ వైజ్ మన్ మొదలైన యూదు నాయకులు ఒత్తిడి పెట్టారు. సరిగా ఈ సమయంలో అమెరికాలోని యూదీయుల సదభిప్రాయాన్ని సంపాయించుకోవడం బ్రిటన్ కు అవసరంగా కూడా కనబడింది. అంచేత 1917 నవంబర్ లో బ్రిటీష్ ప్రభుత్వం తరపున బాల్ఫర్ (విదేశాంగ మంత్రి) ఒక ప్రకటన చేశాడు. ఆ ప్రకటనలోని ముఖ్య భాగం ఇది.

పాలస్తీనాలో యూదీయులకు ఒక జాతీయ కేంద్రాన్ని ఏర్పరచడానికి బ్రిటీష్ ప్రభుత్వం వారు అనుకూలంగా ఉన్నారు. ఈ ఆశయసిద్ధికి వారు శక్తివంచన లేకుండా పాటుపడతారు. ఈ సందర్భంలో పాలస్తీనాలో ప్రస్తుతం వున్న యూదేతర సంఘాల హక్కులకు గాని ఇతర దేశాలలో వున్న యూదుల హక్కులకుగాని భంగం కలిగించే కార్యాన్ని దేన్నీ చెయ్యరు".

సైక్స్-పికాట్ ఒడంబడిక సంగతి తెలుసుకునే నిస్పృహ చెందివున్న ఆరబ్బులకు ఈ బాల్ఫర్ ప్రకటన మరెంత ఆశాభంగాన్నీ, అసహ్యభావాన్ని కలిగించిందో వేరుగా చెప్పనక్కరలేదు.

1917 అంతం నాటికి పూర్తిగా హతాశులై ఉన్న ఆరబ్బులకు 1918లో యుద్ధ విరామం జరిగిన నాటికి తిరిగి ఆశలు పెట్టుకోడానికి కొంత అవకాశం కలిగింది.యుద్ధంలో పాల్గొన్న వివిధ రాజ్యాల మధ్య జరగవలసిన సంధికి ప్రాతిపదికగా అమెరికా అధ్యక్షుడు విల్సన్ పధ్నాలుగు సూత్రాల్ని ప్రతిపాదించాడు. వీటిలో మూడో సూత్రం ఇది :

"ఈ యుద్ధంతో సంబంధం ఉన్న ప్రతి దేశం భవిష్యత్తును, అక్కడి ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని నిర్ణయించాలిగాని, విభిన్న రాజ్యాలు స్వలాభం కోసం చేసుకునే పెంపకంలో ఇది కేవల మొక భాగం అనే పద్ధతిని చెయ్యరాదు".

ఈ సూత్రం ప్రత్యేకంగా సైక్స్ - పికాట్ ఒడంబడికను రద్దుపరచడానికే ప్రతిపాదించినట్టు ఆరబ్బులకు తోచింది. ఇక, పన్నెండో సూత్రం వారికి మరింత ఆశను పోసింది. ఆ సూత్రం ఇది:

ఇప్పుడు టర్కీ పరిపాలన కిందవున్న వివిధ జాతుల వారికి పరిపూర్ణమైన రక్షణ నిస్తూ, ఇతరుల జోక్యమేమీ లేకుండా స్వపరిపాలనను సాగించుకోడానికి అవకాశమివ్వాలి".

బ్రిటన్ ద్రోహం చేసినా, విల్సన్ మన పక్షాన ఉన్నాడు; మన ఆశలు ఇక ఈడేరినట్టే! మనకు స్వాతంత్ర్యం లభించినట్టే!" అని ఆరబ్బులు మహదానందం చెందారుగాని, అచిరకాలంలోనే తిరిగి వారు హతాశులు కావలసి వచ్చింది.

9

ముందు జర్మన్; ఆస్ట్రియన్ సామ్రాజ్యాన్ని తమలో తాము పంచుకున్న తర్వాత బ్రిటీష్, ఫ్రెంచి ప్రభుత్వాల వారు టర్కీ సామ్రాజ్యం వైపుకు దృష్టిని మరల్చారు."టర్కీ పరిపాలన క్రింద వున్న అరేబియా స్వతంత్ర రాజ్యంగా ఏర్పడ్డానికి అంగీకరిస్తాను" అని 1915లో (సర్ హెన్రీ మాక్ - మాహోన్ ద్వారా) బ్రిటన్ వాగ్దానం చేసినమాట నిజం. ఈ వాగ్దానాన్ని బ్రిటన్, ఫ్రాన్సులు రెండూ చేరి 1918 నవంబర్ 30వ తేదీనాడు "రిపీట్" చేసిన మాట కూడా నిజం. అయితే మాత్రమేమి? ఆపత్కాలంలో లక్ష వాగ్దానాలు చేస్తాము. వాటికి కట్టుపడి ఉండడం సామాన్య వ్యక్తులకు తగుతుందేమోగాని, సామ్రాజ్య నిర్మాతలకు తగునా? పైగా, ఆర్థికంగా నేమి,.

సైనికదృష్టిలో నేమి, చాలా ప్రయోజనకరంగా ఉండే అరేబియాను గుప్పిటిలో నుంచి వదలి వెయ్యడమే? పాలస్తీనా, సిరియా, ఇరాక్; ఈ మూడూ కూడా ఆసియా ఖండం భాగ్యరాసుల్ని చేరడానికి మార్గాలుగా ఉపకరిస్తవి. మోసుల్ లోనూ, పర్షియన్ గల్ఫ్ లోనూ, పెట్రోలు . గనులున్నాయి. అబ్బే! అరేబియాను - దాదాపు ఇండియా అంతటి వైశాల్యం కలిగివున్న అరేబియాను - చేయిజారిపోనివ్వరాదు.
అయితే, దీన్ని పంచుకోవడం విషయంలో బ్రిటన్, ఫ్రాన్సులకు కొంత వివాదం వచ్చింది. కొంతకాలం కీచులాడుకున్న తర్వాత 1920 ప్రారంభం నాటికి అవి ఒక రాజీకి వచ్చాయి. ఈ రాజీ ప్రకారం ఇరాక్ బ్రిటన్‌కు దక్కింది. పోతే, సిరియాను - టారస్ పర్వతాలకూ, సినాయి ఎడారికీ మధ్యవున్న ప్రదేశాన్ని - బ్రిటన్, ఫ్రాన్సులు చెరికొంత తీసుకున్నాయి. దీనిలో దక్షిణ భాగాన్ని - అంటే పాలస్తీనాను - బ్రిటన్ తీసుకుంది; ఉత్తర భాగాన్ని - ఈ భాగానికి సిరియా అనే పేరు ఖాయం చేశారు - ఫ్రాన్సు తీసుకుంది. అంటే, లెబ్ నాన్ సముద్ర తీరమూ, డమాస్కస్ రాష్ట్రమూ

ఫ్రాన్సుకు దక్కింది. పాలస్తీనాకు తూర్పుగావున్న ఒక యెడారికొన కూడా - దీనికి ట్రాన్స్ జోర్డాన్ అని పేరు పెట్టారు - బ్రిటన్ వంతుకు వచ్చింది.

ఈ విధంగా అరేబియాలో మంచి మంచి భాగాల్ని తాము తీసుకున్న తర్వాత, మిగతా ఎడారిని బ్రిటన్, ఫ్రాన్సులు హుస్సేనుకు కట్టబెట్టాయి. హెజాజ్ కు - మక్కా మదీనా పుణ్యక్షేత్రాలు. దీనిలోనే ఉన్నాయి - అవి హుస్సేనను రాజుగా ప్రకటించాయి. ఇక, హుస్సేన్ కుమారుల్ని సంతృప్తి పెట్టడానికి అవి చక్కటి ఒక ఎత్తు వేశాయి. అది ఏమంటే, హుస్సేన్ జ్యేష్ఠపుత్రుడు (ఆలీ) తండ్రి తదనంతరం హెడ్ జాజ్ కు రాజు కావచ్చుననడం; అతడి రెండవ కుమారుని (అబ్దుల్లా) బ్రిటీష్ వారి అధీనంలో ఉండే ఇరాకకు రాజును చేస్తామనడం; అతడి మూడవ కుమారుని (ఫైజల్) ఫ్రెంచి వారి పరిపాలనలో ఉండే దమాస్కసు - సిరియా తూర్పు భాగానికి రాజుగా ఉంచుతామనడం. అసలైన రాజ్యాధికారం మన చేతిలో ఉన్నప్పుడు ఇంకొకడిని రాజు అని చెప్పి దిష్టిబొమ్మగా నిలబెట్టడంలో చాలా లాభం ఉంది. అప్పుడు జరిగిన మేలు అంతా మనదీ, కీడు అంతా ఆ దిష్టిబొమ్మదీ అని చాటుతూ ఉండవచ్చును. హుస్సేన్ కుమారుల్ని ఆ రాజులుగా (*చివరికి ఈ ఏర్పాటులలో ఏదీ నిలవలేదు. దమాస్కస్ కు రాజుగా ప్రకటించిన కొన్ని మాసాలకే ఫ్రై ఫైజల్ ను అక్కడ నుంచి తరిమివేశారు. అంతట అతడు తన అన్న అబ్దుల్లా బదులు ఇరాక్ కు రాజు అయ్యాడు. వాహబీల నాయకుడైన ఇబిన్ సాద్, హెడ్ జాజ్ మీద దండెత్తి వెళ్ళి, హుస్సేన్ నూ, అతడి జ్యేష్ఠ పుత్రుడు ఆలీని తొలిగించి ఆ రాజ్యాన్ని స్వాధీనపరుచుకున్నాడు.*) చేస్తామనడంలో బ్రిటన్, ఫ్రాన్సులు చేసిన ఆలోచన ఇదే!

ఈ విధంగా అరేబియాను - తమ వాగ్దానాలకు భిన్నంగా - బ్రిటన్, ఫ్రాన్సులు తమలో తాము పంచివేసుకున్నా, లోకానికి మాత్రం అధర్మం చేసినట్టు కనబడకుండా ఉండడానికి “మేండేటరీ విధానం” అని ఒక తంతు చేశాయి. కొందరు ప్రజలకు స్వరక్షణకుగాని, స్వపరిపాలనకు గాని తగిన శక్తి ఉండదట. అట్టి వారిని ఊరికే వదలివేస్తే వారు కష్టాల పాలౌతారట. అంచేత వారికంటే ఎక్కువ శక్తి, ఎక్కువ ప్రజ్ఞ, ఎక్కువ అనుభవం ఉన్నవారు, వారి పరిపాలనా భారాన్ని స్వీకరించి, వారికి క్రమక్రమంగా స్వరక్షణ శక్తినీ, స్వపరిపాలనాదక్షతనూ కలిగించాలట. ఇలా చెయ్యడం ఆ ప్రజలకే కాకుండా, మానవజాతికి, సభ్యతకూ, సేవ చెయ్యడమట. మేండేటరీ విధానం" అంటే ఇదే! ఈ విధానం పేరు చెప్పే బ్రిటన్, ఫ్రాన్సు రాజ్యాలు ఇరాక్, పాలస్తీనా, ట్రాన్స్ జోర్డాన్, సిరియాలను కబళించాయి.

10

“యూదులకు జాతీయ కేంద్రాన్ని స్థాపించడం, ఆరబ్బుల జాతీయ కేంద్రాన్ని కాపాడ్డం, మొత్తం జనాభా అంతటికీ స్వపరిపాలనా విధానంలో శిక్షణ ఇవ్వడం" - ఈ మూడు ఆశయాల్ని " సాధిస్తానంటూ బ్రిటన్ పాలస్తీనా పై మేండేటరీ అధికారాన్ని స్వీకరించింది. కాని, అది ప్రారంభం నుంచీ కూడా యూదుల పట్ల పక్షపాతాన్ని చూపసాగింది. “ప్రారంభం నుంచీ కూడా యూదుల పట్ల పక్షపాతం” అని అనడానికి తిరుగులేని నిదర్శనం ఇది : ఆలెంబీ ప్రభువు జెరుసులంను జయించిన తర్వాత, పాలస్తీనా పరిపాలనకు మిలిటరీ గవర్నమెంట్ ను ఏర్పరిచారు. ఈ మిలిటరీ గవర్నమెంట్ ను తప్పించి, సివిల్ గవర్నమెంట్ ను ఏర్పాటు చెయ్యడానికి 1920లో బ్రిటన్ పంపించిన మొట్టమొదటి హైకమీషనర్ యూదు జాతికి చెందిన సర్ హెర్బర్ట్ శామ్యూల్!

ఒక వైపున బ్రిటన్ అభిమానం ఉంది; ఇంకో వైపున అంతర్జాతీయ యూదీయ సంఘాల ధన సహాయం ఉంది. ఇంకేమీ కావాలి? యూదులు పాలస్తీనాకు విరివిగా వలస రాసాగారు. వచ్చి, వారు ఆరబ్బుల భూముల్ని కట్టుకున్నారు; ముఖ్యమైన ప్రభుత్వోద్యోగాల్ని సంపాయించుకున్నారు; ఎన్నదగిన పరిశ్రమల నన్నింటినీ వశపరచుకున్నారు; పాలస్తీనా పరిపాలన టర్కీ నుంచి తమకు సంక్రమించినట్టే చేసివేశారు.

దాదాపు పదిహేను సంవత్సరాల క్రితం లండన్ నగరానికి వెళ్ళిన ఆరబ్బు డెలిగేషన్ వారు తమ దుస్థితిని ఈ విధంగా వర్ణించారు:

హైకమీషనర్ యూదీయుడు; లీగల్ సెక్రటరీ, స్టోర్స్ కంట్రోలర్, ఇండస్ట్రీస్ డైరెక్టర్, చివరికి, వలస శాఖాధికారి అందరూ యూదీయులే! ప్రభుత్వపు ప్రతి శాఖనూ యూదీయులే వశపరచుకున్నారు.

ఆరబ్బుల స్వాతంత్ర్యాన్ని అరికట్టడానికి, వారి అభివృద్ధిని ఆటంకపరచడానికీ, శాసనాలను చేస్తున్నారు. పత్రికలకు స్వాతంత్ర్యం లేదు. దేశాభిమానులైన ఆరబ్బుల్ని వారు ప్రజా క్షేమానికి ముప్పు తెస్తున్నారనే నెపంతో అరెస్టు చేస్తున్నారు.

పాలస్తీనాలోని భూములన్నీ కూడా ప్రభుత్వం వారి ఆస్తులట. తరతరాల నుంచి ఆరబ్బుల హక్కుభుక్తాలలో ఉన్న భూముల్ని సయితం వశపరచుకుని, ఇవి మీకే తిరిగి కావాలంటే మాపేర కౌలు వ్రాయవలసిందని ప్రభుత్వం వారు అంటున్నారు. ఇలా చెయ్యడంలోగల ఉద్దేశం ఇది. ముందు ఈ భూముల భామందులు ప్రభుత్వం వారని ఋజువు చెయ్యడం, ఆ తర్వాత వాటిని నెమ్మదిగా యూదీయులకు అమ్మి వెయ్యడం.

జనాభాలో నూటికి ఒకరైనా హీబ్రూ (యూదీయుల భాష) మాట్లాడరు. అయినప్పటికీ దాన్ని ఒక రాజభాషగా అంగీకరించారు".

వెల్లువలా వలసవచ్చి పడుతున్న యూదీయుల వల్ల, జనభారం హెచ్చిపోతున్నది. వలసవచ్చిన యూదు కూలీల కారణంగా ఆరబ్బు కూలీలకూడు పడిపోతున్నది. ఆరబ్బు కూలీ చేసే పనిలో యూదు జాతి కూలీ సగం పనినైనా చెయ్యలేడు. కాని, అతడికే ఎక్కువ కూలి ముట్టచెబుతూ ఉన్నారు".
గవర్నమెంటు కంట్రాక్టుల్ని చాలావరకు యూదీయులకే (వారు ఆరబ్బుల కంటే ఎక్కువ మొత్తానికి టెండరు పెట్టినా) ఇస్తున్నారు".

దాదాపు పదిహేను సంవత్సరాలనాడు ఆరబ్బు డెలిగేషన్ వారు చిత్రించిన ఈ స్థితికీ, నేటి స్థితికీ, భేదం ఏమైనా ఉన్నదంటే, అది నాటి స్థితికంటే నేటిది మరింత ఘోరంగా ఉండడమే! ఇందుకు నిదర్శనంగా జాఫాలోని ఆరబ్ లేబర్ ఫెడరేషన్ కు కొంతకాలం కార్యదర్శిగా వున్న జార్జ్ మనసూర్ ఇటీవల ప్రకటించిన ఒక వ్యాసాన్ని చూపించవచ్చును; ఆ వ్యాసంలోని కొన్ని భాగాలు ఇవి:

"దేశం ఎంత జనాభాను భరించగలదు అనే విషయాన్ని గురించి విచారించవలసిందిగా ప్రభుత్వం వారు నియోగించిన సింప్సన్, ఫ్రెంచ్ మొదలైన వారేగాక, ఇదే పనికి జియోనిస్టు (యూదు) సంఘం వారు స్వయంగా నియమించిన కాంప్ బెల్ కూడా 1930 లోనే యూదీయులు చిత్తం వచ్చినట్టు వలస రావడం వల్ల దేశానికి నష్టం కలిగిందని ప్రకటించారు. అయినప్పటికీ వారి సిఫార్సుల్ని ప్రభుత్వంవారు తోసివేశారు. ఇలా చెయ్యడానికి గల కారణాలు ఏమిటో వారికే తెలియాలి. ఆరబ్బులు ఇంకా నిద్రావస్థలో ఉండగానే, వలసవల్ల తమ సంఘాన్ని మెజారిటీ సంఘంగా చేసుకుందామనే యెత్తుతో యూదీయులు పెట్టిన ఒత్తిడికి ప్రభుత్వం వారు తలవొగ్గారు కాబోలు!

(1920 - 1930 సంవత్సరాల మధ్య సగటున సాలుకు 10వేల మంది చొప్పున యూదీయులు పాలస్తీనాకు వలస వచ్చారు. ఇంతమంది వలస రావడమే తగదని చెప్పినప్పటికీ, 1933-1935 సంవత్సరాల మధ్య 136,000 మందికి పైగా యూదీయులు ప్రభుత్వం వారి అంగీకారంతో వలసకు వచ్చారు. వీరుగాక దాదాపు 4 లక్షల మంది రహస్యంగా

దేశంలో ప్రవేశించారు. 1919లో 50,000 మాత్రమే ఉన్న యూదు జనాభా 1935 నాటికి 4,20,000 వరకు ఎలా పెరిగిందో దీనివల్ల తెలుస్తుంది.

గ్రామవాసులు చాలవరకు అరబ్బులు. పట్టణ వాసులలో అధిక సంఖ్యాకులు యూదు 1 గ్రూగీయులకు లాభకరంగా, పల్లెల మీద ఎక్కువ పన్నులు వేస్తున్నారు. 1930లో పట్టణ వాసుల దగ్గర నుంచి వసూలు చేసిన పన్నులు 1,31,000 పౌనులైతే, పల్లెలలో నుంచి రాబట్టింది 3, 95,000 పౌనులు. ఈ సంవత్సరానికి ఆదాయానికి సంబంధించిన అంకెలు తెలియవుగాని, 1936లో బస్తీల వాళ్ళ ఆదాయం దాదాపు రెండు కోట్ల పౌనులు. ఇక, పల్లెటూరివారి ఆదాయం అరవై లక్షల పౌనులు మాత్రమే! ఆదాయం పన్ను వుంటే యూదీయులే దాన్ని అధికంగా చెల్లించవలసి ఉంటుంది గనుక, అది లేనేలేదు.

“పల్లెలలో పన్నులు ఎక్కువ వేస్తే ఆరబ్బు రైతులు దాన్ని చెల్లించుకోలేక, తమ భూముల్ని యూదీయులకు అమ్మివేస్తారు గదా అనే ఉద్దేశంతో పాలస్తీనాలోని బ్రిటీష్ ప్రభుత్వం మొదటి నుంచీ ఆ విధానాన్నే అనుసరిస్తున్నది. ఇందులకు నిదర్శనం బ్రిటీష్ వాడైన యన్. బార్బర్ 1936 జూలై నెలలో 'పాలస్టైన్ పోస్టు' పత్రికలో వ్రాసిన వ్యాసంలోని ఈ క్రింది వాక్యాలే : జెరుసలం సమీపంలో వున్న ఒక గ్రామంలోని భూమిశిస్తు ఎకరానికి మూడు షిల్లింగుల నాలుగు పెన్నీల దగ్గరి నుంచి (షుమారు రెండున్నర రూపాయలు), అయిదు పౌనుల నాలుగు షిల్లింగుల వరకు (షుమారు 78 రూపాయలు) పెరిగింది! కొన్ని కొన్ని భూములకు ఇది ఎకరానికి ఎనిమిది పౌనుల వరకు కూడ (షుమారు 120 రూపాయలు) పెరిగింది!! ఈ పెరుగుదలలోని విపరీతాన్ని ఇంకా బాగా అర్థం చేసుకోవాలంటే, మరి రెండు విషయాల్ని గమనించాలి. అవి ఏవంటే, - గ్రామంలో ఎకరానికి రెండు పౌనులకు (30 రూపాయలకు) మించి ఆదాయం రాదు. ఆరబ్బు రైతు కుటుంబానికి సగటున వచ్చే మొత్తం ఆదాయం సింప్సన్ రిపోర్టు ప్రకారం - 29 పౌనుల 9 షిల్లింగులు. -

ఈ పరిస్థితులలో ఆరబ్బులు తమ భూముల్ని యూదులకు అమ్మి వెయ్యడంలో ఆశ్చర్యం ఉన్నదా! ఆరబ్బు రైతుల దగ్గరి నుంచి యూదీయులు దాదాపు 8,00,000 దన్యూముల సేద్య యోగ్యమైన భూమిని కట్టుకున్నారు. ఈ భూమి ఖరీదు క్రింద 1918 - 1935 సంవత్సరాల మధ్య వారు చెల్లించిన 73,51,000 పౌనుల వల్ల ఆరబ్బు రైతులు పొందిన ప్రయోజనం దాదాపు శూన్యం ఎంచేతనంటే - ఈ మొత్తంలో అధిక భాగాన్ని మధ్య వాళ్ళు (బ్రోకర్లు, యూదుజాతి ఏజెంట్లు) కాజేశారు.

యూదీయుల పరిశ్రమల్ని ప్రోత్సహించడం, వాటి ద్వారా ఆరబ్బుల పరిశ్రమల్ని అణగ దొక్కడమూ బ్రిటీష్ నీతి. ఈ నీతి కారణంగా ఆరబ్బుల పరిశ్రమకు మొత్తం మీద దెబ్బ తగిలింది. ఇందుకు ఇక ఉదాహరణ (ఆరబ్బులకు చెందిన) సబ్బు పరిశ్రమ. 1925లో 2,54,087 పౌనుల విలువ గల సబ్బు ఎగుమతి అయింది.1935 నాటికి ఈ ఎగుమతులు 77,897 పౌనులకు దిగజారినాయి.

ఇంతటితోనైనా ఆగక ప్రభుత్వం వారు తాము చేయించే అన్ని పనులలోనూ యూదు కార్మికుల పట్ల అభిమానాన్ని చూపుతున్నారు. 1935లో వారు తమ కాంట్రాక్టులలో 2,97,099 పౌనుల విలువ గల కంట్రాక్టుల్ని యూదు జాతివారి కిచ్చారు. పోగా, మిగిలిన 2,55,367 పౌనులు విలువ గల వాటిని యూదేతరులకు అందరికీ కలిపి ఇచ్చారు. యూదేతరుల కిచ్చిన 2,55,367 పౌనుల కంట్రాక్టులలో అధికభాగం బ్రిటీష్ కంపెనీలకూ, ఇంకా ఇతర విదేశపు కంపెనీలకూ దక్కినాయి. (మిట్చెల్ అండ్ రోలిన్ అండ్ కంపెనీ లిమిటెడ్; మేజర్ కే అండ్ కంపెనీ; జె.యల్. మాడ్ అండ్ కంపెనీ మొదలైన వాటికి).

"ఇక, రైల్వేలలోనూ, హార్బర్లలోనూ, కస్టమ్సు ఆఫీసులలోనూ, పోస్ట్ అండ్ టెలిగ్రాఫ్ ఆఫీసులలోనూ ఆరబ్బుల పదవుల్ని యూదీయులు ఆక్రమించుకోడాన్ని గురించి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు". బ్రిటీష్ వారు పాలస్తీనాలో చేసిన ధర్మపరిపాలన ఇదే!

11

యూదు జాతి వారిపట్ల బ్రిటన్ ఇంత పక్షపాతాన్ని వహించడానికి కారణం, - నిరాశ్రయంగా వున్న ఆ జాతివారికి ఒక ఆశ్రయాన్ని కల్పించుదామనే సచ్చింతకాదు; కేవలం స్వార్థచింత. యూదీయుల పట్ల బ్రిటనకు నిజంగా సానుభూతి ఉంటే వారిని వలస పంపించడానికి కెనడా లేదా? ఆస్ట్రేలియా లేదా? దక్షిణాఫ్రికా లేదా? ఒక్క ఆస్ట్రేలియాలోనే ప్రపంచంలోని యూదు జాతి వారందరు వలస వెళ్ళడానికి తగిన సదుపాయంగా ఉండగా, ఇంతకు పూర్వమే జన సంకీర్ణంగా వున్న పాలస్తీనాలోనే వారికి తావు చూపించాలనే పట్టుదల దేనికి?

పాలస్తీనాలో సగటున చదురపు మైలుకు 143 మంది చొప్పున ఇప్పటికే ఉన్నారు. 1918-1919 సంవత్సరాల మధ్య దాని జనసంఖ్య 6,80, 000 నుంచి 14, 15,000 వరకు హెచ్చింది. ఆరబ్బుల సంఖ్య నూటికి 77 వంతులు పెరిగింది. ఒక, యూదీయుల సంఖ్య నూటికి 703 వంతులు పెరిగింది! ఇకముందు యూదీయుల వలసను పూర్తిగా ఆపివేసినా, మరి పాతిక సంవత్సరాలకు ఇప్పటి జనాభాయే సంతానోత్పత్తి వల్ల ఇరవై లక్షలకో పెరుగుతుంది. అప్పుడు సగటున చదరపు మైలుకు షుమారు 200 మంది ఉండవలసి వస్తుంది. ఇంత ఒత్తిడిని పాలస్తీనా భరించలేదు. అది అసలే చిన్నదేశం. దాని భూవైశాల్యంలో మూడో వంతు మాత్రమే సేద్య యోగ్యమైంది. ఇక, సహజ సంపత్తి కూడా విశేషంగా లేదు. అంచేత అక్కడికి యూదుల్ని వలసకు పంపించడం - పైగా, మితం లేకుండా పంపించడం - తగనిపని.

ఈ తగనిపనికి బ్రిటన్ పూనుకోడానికి అనేక కారణాలున్నాయి. వాటిలో ముఖ్యమైనట్టివి ఇవి.

ఆరబ్బులకూ, బ్రిటీష్ వారికీ మత విషయంలో నేమి, విజ్ఞాన విషయంలో నేమి, ఆచార వ్యవహారాల విషయంలో నేమి, రాజకీయల విషయంలో నేమీ - దేనిలోనూ లేశమైనా ఐక్యత లేదు. అంచేత, బ్రిటన్ ఈసారి ఏదైనా యుద్ధంలోకి దిగితే, పాలస్తీనా ఆరబ్బులు దాని పక్షాన ఉంటారనే ఆశకు అవకాశం తక్కువ. తమ సరిహద్దులలో ఉన్న స్వమతస్థులతో వీరు బ్రిటనకు ప్రతికూలంగా యుద్ధ రంగంలో నిలిచే పక్షాన - పాలస్తీనా ఆరబ్బులు ముప్పాతిక మూడు వీసాలు చేరవచ్చును. అంచేత బ్రిటీష్ సామ్రాజ్య రక్షణకు ప్రాణప్రదమైన పాలస్తీనాలోని ఆరబ్బుల్ని తొక్కిపట్టి ఉంచాలంటే, వారి పైన అవసరమైనప్పుడు ఉసిగొల్పడానికి ఏదైనా కొత్త సంఘాన్ని సృష్టించాలి. యూదు జాతివారు ఈ పనికి చాలా చక్కగా పనికివస్తారు

ఆరబ్బులకు అంగబలం ఉంటే, యూదులకు అర్థబలం ఉంది. అంచేత వారు తేలికగా అక్కడ కాలూనగలరు. ఇందుకు తోడు వారి భాష ఆరబిక్; వీరిది హీబ్రూ. వారి మతం ఇస్లాం; వీరిది జూడాయిజం. వారి ఆచార వ్యవహారాలు ప్రాచ్య ఖండానివి; వీరివి పాశ్చాత్య ఖండానివి, అంచేత వీరుభయులూ ఏకం కావడంగాని బ్రిటన్ మీద ఎదురు తిరగడం గాని కల్ల. మహమ్మదీయ ప్రపంచం మధ్య ఏకాకులమై ఉన్నామనే భయం కొద్దీ యూదీయులు శాశ్వతంగా బ్రిటన్ ప్రాపకం కోసం దేవులాడ వలసిందే!
విభిన్నమైన దృక్పథాలు, విరుద్ధమైన ఆశయాలు కలిగివున్న రెండు జాతుల వారు ఒకే దేశంలో ఉన్నప్పుడు వారిలో వారికి కలహాలు తప్పవు. ఈ అంతః కలహాల గొడవలో దేశానికి స్వాతంత్ర్యం కావాలనే ఆందోళన తప్పుతుంది. పైగా,

యూదులూ, ఆరబ్బులూ అనవరతం సంఘర్షిస్తూ ఉంటే వారుభయుల మధ్య తగవు తీర్చడానికి మూడవ పక్షం ఉండాలనే సాకుతో బ్రిటన్ శాశ్వతంగా దేశ పరిపాలనాధికారాన్ని తన చేతిలోనే పెట్టుకో వచ్చును.

వైమానికాశ్రయాల పరిసర ప్రాంతంలో ఎప్పుడూ స్నేహపాత్రంగా ఉండే ప్రజలుండడం అవసరం. ఆరబ్బులు - ఇంతకుముందు వివరించినట్లు - ఎల్లకాలం స్నేహంగా ఉంటారని ఆశించడానికి వీలులేదు. అంచేత పాలస్తీనాలో యూదు జాతి కేంద్రాలు ఏర్పడితే, వాటి మధ్య బ్రిటన్ నిస్సంకోచంగా తన వైమానికాశ్రయాల్ని నిర్మించుకోవచ్చును.

యూదుల పెట్టుబడి ద్వారా పాలస్తీనా వ్యావసాయికంగానూ, పారిశ్రామికంగానూ అభివృద్ధి చెందడానికి వీలున్నది. అప్పుడక్కడ బ్రిటీష్ వ్యాపారానికి ఎక్కువ సదుపాయం ఉంటుంది. ఇలాంటి అనేక కారణాల వల్లనే బ్రిటన్ యూదీయుల పట్ల పక్షపాతాన్ని చూపిందిగాని, వారిపై ప్రత్యేక ప్రేమతో కాదు. ఈ విషయాన్ని కెనడా గవర్నర్ జనరల్ టీ మూర్ స్పష్టంగా అంగీకరించాడు. అతడి పలుకు లివి :

ప్రాచ్య, పాశ్చాత్య ఖండాల మధ్యవున్న రాజమార్గ రక్షణకు పాలస్తీనా పెట్టనికోట వంటిది. అబిసీనియా యుద్ధం తర్వాత ఈ రాజమార్గ రక్షణ విషయమై మనం కొంత ఆందోళన చెందవలసి వచ్చింది... ఈ దృష్టితో చూస్తే, జియోనిజం వల్ల (పాలస్తీనాను యూదు జాతీయ కేంద్రంగా చెయ్యడం వల్ల) గ్రేట్ బ్రిటనకు ప్రస్తుత సమయంలో ఎంత ప్రయోజనం కలుగుతుందో తెలుసుకోవచ్చును".

నిరాశ్రయులై అల్లాడుతూ ఉన్న ఒక గొప్ప జాతి ప్రజలకు జాతీయ కేంద్రాన్ని ఏర్పరచాలనే మహదాశయంతో ప్రారంభమైన జియోనిజం చివరికి బ్రిటీష్ ఇంపీరియలిజం నీచ స్వార్ధ సముపార్జనకు సాధనమైంది. అంచేతనే దాన్ని చూచి అసహ్యించుకోవలసి వస్తున్నది.

12

బ్రిటన్ పక్షపాతాన్ని అవకాశంగా చూచుకుని యూదీయులు అరబ్బులకు చేసిన - చేస్తున్న - అన్యాయాలు ఇన్నన్ని కావు.

తాము వలస రావడం ప్రారంభించిన కొత్తలో భూములకు వారు పెద్ద పెద్ద ధరల్ని పెట్ట సాగారు. దీనికి ఆశపడి ఆరబ్బు భూస్వాములు తమ భూముల్ని చక చక అమ్మినెయ్య నారంభించారు. ఇందుమూలంగా అంతకుముందు ఆ భూముల్ని కట్టుబడి చేసుకు బ్రతుకుతున్న చిన్న చిన్న రైతు కుటుంబాలకు - దాదాపు ఆరువేల కుటుంబాలకు - జీవనాధారం పడిపోయింది.

కట్టుబడిదారులు మట్టి కొట్టుకుపోయినా, పెద్ద ఆసాములు మాత్రం యూదుల రాకవల్ల తమ భూములకు ధర పెరిగిందని చంక లెగరవేశారు. అయితే, త్వరలోనే వారికి కనువిప్పు అయింది. దేశంలో కొంత స్థావరం చిక్కగానే యూదీయులు ఒక్కమాట అనుకుని, భూముల ధరల్ని చప్పగా పడగొట్టించారు. దానితో పెద్ద ఆసాములకు కూడా దుస్థితి పట్టింది. రైతులకూడు పడగొట్టినట్టే యూదు జాతివారు కూలీల కడుపు కూడా కొట్టారు. చౌకగా దొరుకు తున్నారు గదా అని ముందు రోజులలో వారు ఆరబ్బు కూలీలనే పనికి పిలిచారు. కాని, తమ జాతివారు తగినంత మంది వలసకు రాగానే ఎక్కువ కూలీనైనా పెట్టి వారిచేతనే పనిచేయించుకోసాగారు.

అయితే, యూదులలో కొందరు చౌకగా వస్తున్నారు గదా అని ఆశపడి, ఆరబ్బు కూలీలను పిలవడం మానలేదు. అలాటి సందర్భాలలో జియోనిస్టు సంఘాల వారు పికెటింగ్ చేయించారు. ఈ పికెటింగ్ అనేక చోట్ల సంఘర్షణలకు కూడా కారణమైంది.

ఇక, ప్రభుత్వోద్యోగాలలో, వర్తక వ్యాపారాలలో, ప్రతి ముఖ్య స్థానాన్ని యూదీయులు ఆక్రమించి వేసుకోవడమే!

దీన్ని అంతటిన్ని చూడగా, పాలస్తీనాలో నుంచి ఆరబ్బుల్ని తరిమివేసి, దేశాన్ని పూర్తిగా తామే భుక్తం చేసుకుందామా అని యూదీయులు కుట్రపన్నుతున్నట్టు కనబడింది. ఇది ఉత్తి భయం కాదు. పాలస్తీనా జియొనిస్టు కమీషన్ అధ్యక్షుడైన డాక్టర్ ఎడర్ ఈ విషయాన్ని తెగవేసి చెప్పాడు. అతడి మాటలివి.

పాలస్తీనాలో ఒకే జాతీయ కేంద్రం ఉండాలి. అది యూదు జాతీయ కేంద్రం. యూదీయులు, ఆరబ్బులు సమాన భాగస్వాము లనడానికి వీలులేదు. యూదీయుల జనాభా తగినంత హెచ్చుగానే వారిదే పై చెయ్యిగా ఉండాలి".

చూచి పొమ్మంటే దెయ్యమై పట్టుకున్నట్టున్నది - చూచి పొమ్మనకుండానే వచ్చిన - యూదీయుల ప్రవర్తన !

13

ఒక వైపున బ్రిటీష్ వారు, ఇంకోవైపున బ్రిటీష్ వారి అండతో యూదీయులు తమకు చేస్తున్న ఘోరాన్యాయాల్ని ప్రతిఘటించడానికి స్వదేశాభిమాన పూరితులైన ఆరబ్బులు మొదటి నుంచీ కూడా ఆందోళన చేస్తూనే ఉన్నారు. వారి ఈ ఆందోళన కారణంగా అనేక పర్యాయాలు సంఘర్షణలు జరిగాయి. వీటిలో మొట్ట మొదటిది 1920 ఏప్రిల్ 4వ తేదీనీ, చిట్ట చివరిది 1936 ఏప్రిల్ 19వ తేదీన ప్రారంభమైనాయి. అన్నింటిలోనూ ఈ చిట్టచివరి సంఘర్షణే అతిభీకరమైంది. ఇది ఇంకా సాగుతూనే ఉంది.

ఆరబ్బుల స్వాతంత్ర్యోద్యమజ్వాలల్ని రుధిరధారలతో చల్లార్చాలని ప్రస్తుతం పాలస్తీనాలో బ్రిటిషువారు ఎంతటి రాక్షస కృత్యాలను చేస్తున్నారో చెప్పడానికి వీలులేదు. పంజాబ్ లో జనరల్ డయ్యర్ ప్రదర్శించిన అమానుషత్వం గాని, ఐర్లండ్ లో బ్లాక్ అండ్ ట్యాన్ సైనిక దళం ప్రదర్శించిన పశుత్వంగాని, ప్రస్తుతం పాలస్తీనాలో బ్రిటిష్ వారు అమలు జరుపుతున్న దమననీతి ముందు చాలా సౌమ్యంగా కనబడతాయనడం అతిశయోక్తికాదు - ముమ్మాటికి!

ఇటీవలనే జవహర్ లాల్ నెహ్రూ పండితుడు పాలస్తీనాను గురించి ఒక వ్యాసాన్ని వ్రాస్తూ, దానిలో బ్రిటిష్ వారు చేస్తున్న ఘోరకృత్యాల్ని తెలిపే ఒక లేఖను ఉదహరించాడు. ఈ లేఖను పాలస్తీనాలో ఉన్న ఒక ఇంగ్లీషులాయర్ ఇంగ్లండులో ఉన్న తన స్నేహితునికి వ్రాశాడట. ఉత్తరాన్ని వ్రాసిన వ్యక్తీ, దాన్ని అందుకున్న వ్యక్తి - ఇద్దరూ కూడా విద్యాధికులట; విశ్వాసనీయులట. ఆ లేఖలోని కొన్ని భాగాలు ఇవి ;

ఇక్కడి ప్రభుత్వాధికారులు దమననీతినే పూర్తిగా అవలంబించడానికి నిశ్చయించుకున్నట్టున్నారు. వారు చూపుతున్న పశుత్వాన్ని గురించి బ్రిటిష్ సివిలియన్ ఎవ్వడు కూడా అసహ్యాభావంతో కంపించకుండా మాటాడ్డంగాని, వ్రాయడంగాని కష్టం.

మోఫత్ హత్యానంతరం వారు (సైనికులు) జెనిన్ అనే చిన్న పట్టణాన్ని డైనమెట్ తో పేల్చివేశారు. ఈ సందర్భంలో 150 ఇళ్ళు కూలిపోయినవని ప్రభుత్వ ప్రకటనలో ఉంది. ఈ అంచనాను మించికూడా నష్టం జరిగి ఉండవచ్చు.
పారిపోవడానికి ప్రయత్నిస్తున్నారని చెప్పి కొందరిని కాల్చి చంపివేశారు. హత్యా నేరాన్ని గురించి కూపీ తియ్యడానికి అవలంబించిన పద్ధతులలో కొన్ని వర్ణించనలవి కానట్టివి.ఈ ఘోరాల్ని చేసింది నేరస్థుల్ని శిక్షించడానికి కాదు; ప్రజల్ని హడలెత్తించడానికి మాత్రమే!

కేవలం ఇళ్ళను నాశనం చెయ్యడమే కాకుండా ప్రజల ఆస్తిని కూడా అపహరించారు (రొక్కం, నగలు మొదలైనవి). చివరికి న్యూయార్క్ స్టాండర్డ్ ఆయిల్ కంపెనీ వారి ఇనప పెట్టిలోని ద్రవ్యాన్ని కూడా సంగ్రహించారు. ఈ చర్యను అమెరికన్ కాన్సల్ (రాయబారి) తీవ్రంగా గర్హించాడు.

ఇక్కడ జరుగుతున్న అన్ని విషయాల్నీ నీకు తెలియజెప్పడం దుస్సాధ్యం. విస్మయ విషాదాల్ని కలిగించే సంఘటనలు ఎన్నో నాకు తెలుసు. మచ్చుకు ఒకదాన్ని మాత్రం చెబుతాను : విప్లవకారులు టెలిఫోన్ తీగల్ని తెగగొట్టి వేస్తున్నారు. వాటిని గవర్నమెంట్ నౌకర్లు ఎప్పటికప్పుడు రిపెయిర్ చేస్తూ ఉండాలి. ఇలా చేసే వారిలో కొందరు ఆరబ్బులు. వారు తీగల్ని బాగు చేస్తూ ఉండగా విప్లవకారులు చూడ్డం తటస్థిస్తే - స్వజాతీయులే అని దయతలచ కుండా తప్పక కాల్చివేస్తారు. అయినా, ధైర్యం చెడక, వారు ఉద్యోగ ధర్మాన్ని నిర్వహిస్తున్నారు. ప్రాణాలకు కూడా తెగించి ఇలా ప్రభుత్వానికి సేవ చేసి, సాయంత్రానికి కొంపను చేరుకోబోతే, ఒక్కొక్కప్పుడు ఆ కొంపను కాస్తా సోల్జర్లు కూలదోసి వెళ్ళడం తటస్థిస్తుంది. పడిపోయిన గోడల మధ్య బిక్కు బిక్కురుమంటూ కూర్చున్న పెళ్లాంబిడ్డల్ని చూచుకోగానే, వాళ్ళ మనస్సు ఎలా ఉంటుందో వేరే చెప్పాలా? ఇలాంటి ఘోరాలకు బలి అవుతున్న వారే ప్రస్తుతం విప్లవ కారులలో చేరిపోతున్నారు. ఇంతకంటె ఆందోళనకరమైన విషయం ఏమంటే - క్రమక్రమాన విప్లవకారుల ధైర్య సాహసాలు పెరుగుతున్నవిగాని, తరగడం లేదు.

శనివారంనాడు, ఇక్కడ జాఫాలో, సోల్జర్లు కంటబడిన ప్రతివాడినీ, కాల్చాలనీ బుద్ధి పుడితేచాలు, కాల్చివేస్తున్నారు. ఒక గవర్నమెంట్ సర్వేయర్ - చదువుకున్నవాడు; ఇంగ్లీషు మాటాడ్డం నేర్చినవాడు తన పనులు చూచుకుని ఇంటికి వస్తూ ఉంటే, అతడిని నడివీధిలో కాల్చి చంపారు. ఇలాగే ఏడేళ్ళ పిల్లనుకూడా హత్య చేశారు.

నాకు పత్రికను తెచ్చియిచ్చే చిన్న కుర్రవాడు - బలే చలాకీ అయినవాడు - ఇవ్వాళ ఉదయం రాలేదు. ఏమైపోయాడు చెప్మా అని విచారిస్తే, కాల్చి చంపారని తెలిసింది.

కొన్ని రోజుల క్రితం నేను ఒక ఇంగ్లీషు జడ్జీని కలుసుకోగా, తాను మీన్ పై పేటలో చూచిన దృశ్యాల్ని గురించి చెబుతూ, ప్రభుత్వాన్ని పూర్తిగా దుయ్యబట్టాడు. హెబ్రాలోని ఒక డాక్టర్ తమ పట్టణంలో పోలీసులూ, సోల్జర్లూ చేసిన దారుణ హత్యల్ని గురించి వొళ్లు జలదరించే కథల్ని చెప్పాడు. అక్కడ ఉన్న ఆరబ్బు షాపుల్నీ, హోటళ్ళనూ ఒక్కదాన్ని కూడా విడవకుండా దోచుకున్నారట."
ఈ బ్రిటిష్ లాయర్ లేఖలోని విషయాల్ని చూచి "అబ్బ! ఇంతకంటె ఘోరకృత్యాలు ఉంటాయా?" అని కొందరు అనుకోవచ్చును. కాని అలాంటి సందేహం అవసరంలేదు. పాలస్తీనాలో బ్రిటిష్ అధికారులు ఇంతటికంటె రాక్షసమైన చర్యల్ని కూడా చేస్తున్నారు. ఇందుకు ఉదాహరణలు కావాలంటే, "దక్కన్ టైమ్స్" (మద్రాసు) ప్రకటించిన ఈ వృత్తాంతాల్ని చూడవచ్చును;
నసిరా సమీపంలో ఉన్న కాఫికామా గ్రామానికి 1937 డిసెంబర్ 3వ తేదీ శుక్రవారం ఉదయం కొందరు మిలిటరీ ఆఫీసర్లు వెళ్ళారు. ఆ ఆఫీసర్లు గ్రామంలోని ముఖ్యుల్ని అందర్నీ ఇళ్లలో నుంచి బైటికి రమ్మని, వారి పాగాల్ని తీయించి ఎర్రటి ఎండలో వరసగా నిలబెట్టించి, వీపుల మీద రక్తం కారేలా రాళ్ళతో బాదారు. తర్వాత వాళ్ళ ఇళ్ళనుకూడా సోదా

చూచారు. మరి కొంతమంది మిలటరీ ఆఫీసర్లు ఆ గ్రామంలోనే మగవాళ్ళనందరినీ పొలాలలోకి తోలారు; ఆడవాళ్ళనందరినీ మసీదులోకి చేర్చారు. ఆ మీదట సోదా అనే వంకతో ఇళ్ళ మీద పడి దోచుకున్నారు. మగవాళ్ళ బట్టల్ని ఊడదీయించి, వారి మీద కాలుతూ ఉన్న నూనెను, ఇసుకను పోశారు. ఇది మిలిటరీ ఆఫీసర్లకు చెడ్డ సరదాగా కనబడినట్టున్నది. తర్వాత ఆ దౌర్భాగ్యుల్ని చాలాదూరం నడిపించారు. నడవలేక పోయిన వారిని కొరడాలతో బాదారు. ఒక చెవిటి గొర్రెల కాపరిని 'ఏవడురా' అని పలకరిస్తే, వాడు బదులు చెప్పాడు కాదు. వెంటనే వాణ్ణి కాల్చిచంపారు. సంహనా అనే గ్రామంలో ముఖ్యమైన వారినందరినీ చెరువు గట్టు మీదికి చేర్చి, మంచులా జిమ్ముమంటూ ఉన్న నీళ్లలోకి తోశారు. మిలిటరీవారు వెళ్ళిపోయిన తర్వాతగాని వాళ్ళను వొడ్డుకు చేర్చడానికి వీలుపడలేదు. ఆడవాళ్ళను రాళ్ళగంపల్ని మొయ్యమన్నారు. సరిగా మొయ్యలేకపోయిన వారిని రాళ్ళతో కొట్టారు.

ఒకచోట ఆహారపదార్థాల్ని, వస్త్రాభరణాల్ని దోచుకోవడమే కాకుండా, అక్కడి స్త్రీ పురుషులనందరిని సిగ్గు మాలిన పనులకు లోనుజేశారు. తర్వాత ఇరవై మందిని తాడుతో ఒక కారుకు కట్టి, హైస్పీడ్ తో వారిని ఈడ్చుకు వెళ్లారు.

తాలిపాలో 150 మందిని గ్రామం చుట్టూ లెబ్బ లేకుండా ప్రదక్షిణాలు చేయించారు. అలుపు వచ్చి పడిపోయిన వారిని కొరడాలతో క్రూరంగా కొట్టారు. కొందరు పారిపోవాలని చూస్తే, వారి మీద తుపాకుల్ని కాల్చారు. ఒకడు గాయపడ్డాడు. ఇంకొకడు పరుగెత్త లేక పట్టుబడ్డాడు. అతడిని చావ చితక గొట్టారు."ఘూడాలో ఇళ్ళను సోదా చూశారు.35 మందిని (నలుగురు స్త్రీలతో సహా) గాయ పరిచారు.చాలా మంది ఉలేమాలను అరెస్టు చేశారు. అరెస్టు సమయంలో వారిని చాలా అవమానపరిచారు. కొందరిని రోజుకు మూడుసార్లు పోలీసు స్టేషనులో హాజరువేసిపొమ్మని ఆజ్ఞాపించారు.మూడు చోట్ల కొరానును చించి పారవేశారు.సర్వ కార్మికసమ్మె (జనరల్ స్ట్రయిక్) సమయంలో షేక్ అర్సలాన్ మసీదును డైనమైట్ లో పడగొట్టివేశారు."గుండెల్ని జలదరింపజేసే ఈ వృత్తాంతాల్ని ప్రకటిస్తూ, "డక్కన్ టైమ్స్" ఇలా వ్రాసింది.వీటినన్నింటిని మించిన ఘోరసంఘటనల్ని మేము ప్రకటించడంలేదు. కారణం సువిదితమే!"

14

బ్రిటిష్ అధికారులతోబాటు యూదీయులు కూడా ఆరబ్బులపట్ల రాక్షసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. ఒక ఆరబ్బీవాని ఇంటిని కూలదోస్తే, ఒక యూదీయునికి ఇల్లు కట్టుకోడానికి చోటు దొరుకుతుంది. పదిమంది ఆరబ్బుల కాలుచేతుల్ని విరిస్తే, పదిమంది యూదీయులకు కూలినాలి దొరుకుతుంది. వందమంది ఆరబ్బుల్ని చంపివేస్తే, వందమంది యూదీయులు వలస రావడానికి వీలుకలుగుతుంది. ఆరబ్బు జాతి ఎంత ఎక్కువగా నశిస్తే, దేశం అంత సులభంగా యూదుజాతి వశమౌతుంది. ఈ సూత్రం మీద వారు నడుచుకుంటున్నారు. వారు చేస్తున్న ఘోరకృత్యాల్ని గురించి ఒక జర్మన్ పత్రిక ఇలా వ్రాసింది :.

డ్జాబా అనే ఆరబ్ గ్రామంలో నలుగురు యూదీయులు చాలా మంది ఆరబ్ స్త్రీలను మానభంగం చెయ్యబోయారు. రాళ్ళనూ, రప్పల్నీ పుచ్చుకుని ఆ స్త్రీలందరు తమను రక్షించుకోబోగా, ఈ ఆ మానవాధములు వారిలో ఒక సాధ్విని తుపాకితో కాల్చివేశారు.

తమకు ఆయుధాలు లేకపోయినా, ఆరబ్ గ్రామస్థులు జరిగిన దారుణ హత్యను చూచి భయపడిపోకుండా ఆ రాక్షసుల్ని ఎదిరించారు. ఆ నలుగురిలోను ఇద్దరు యూదులు తప్పించుకుపోయారు. మిగిలిన ఇద్దరు పట్టుబడ్డారు. వారి చేతిలోని తుపాకుల్ని లాక్కుని, వారిని ఆరబ్బులు అక్కడక్కడే రాళ్ళతో కొట్టి చంపారు".

జర్మన్ నాజీ పత్రిక ఈ విషయాన్ని ప్రకటించింది గనక ఇది కల్పితమైనదేమో అనే సందేహం కలగవచ్చును. కాని, యూదులు చేస్తున్న దురంతాల్ని గురించి సందేహానికి ఎడమివ్వని కథలెన్నో ఉన్నాయి. వారు సరిగా శుక్రవారం నాడు మసీదుల ప్రాంతంలో బాంబుల్ని వేస్తున్నారు. శుక్రవారం నాడు మహమ్మదీయులందరు నమాజ్ కోసం మసీదులలో చేరతారు. అంచేత ఆనాడు ఆ ప్రాంతాలలో బాంబుల్ని విసిరితే, చాలా ఎక్కువమంది హతులౌతారని వారి ఉద్దేశం. నిజంగా చాలామంది ఇదే ప్రకారం హతులౌతున్నారు కూడా. జెరుసులం లోని ఒక పెద్ద మసీదులో 1938 జులై 15వ తేదీ శుక్రవారం నాడు ఆరబ్బులు ప్రార్థనలు చేసుకుని వస్తూవుండగా, వారి మీద బాంబు పడింది. అందుమూలంగా ముగ్గురు మగవాళ్ళు, ఆరుగురు ఆడవాళ్ళు, ఒక బిడ్డ చనిపోయారు; ఇరవై మంది మగవాళ్ళు, పదిమంది ఆడవాళ్ళు గాయపడ్డారు. వీరిలో కొందరికి ప్రాణాపాయకరమైన గాయాలు తగిలాయి. పగిలిన పుర్రెలతో, తెగిపడ్డ కాళ్ళ చేతులతో, కాల్వలు కట్టిన నెత్తురుతో ఆ ప్రదేశం ఎంత భీభత్సంగా కనబడిందో చెప్పతరంగాదు!

ఈ ఒక్క శుక్రవారం నాడు మాత్రమే కాదు; వరసగా అనేక శుక్రవారాల నాడు మసీదుల ఇదేవిధంగా బాంబులు పడ్డాయి; ఇంత ఎక్కువగానూ జననష్టం జరిగింది. ఇంతటి ఘోరాలు జరుగుతూ ఉంటే, వీటిని గురించి యూదు పత్రికలు చేసిన వ్యాఖ్య ఇది : "యూదులకు ఈ పాపాన్ని అంటగట్టి వారి మీద లోకానికి అసహ్యం కలిగించాలనే దురుద్దేశంతో ఆరబ్బులే ఈ విధంగా బాంబుల్ని విసరుతున్నారు". దీన్ని చూచినప్పుడు ఆరబ్బుల గుండె ఇంకెంతగా మండుతుందో ఎవరికివారు ఊహించుకోవలసిందే! వద్ద యూదులు ఎంత విశృంఖలంగా ప్రవర్తించినా, ఏమి దౌష్ట్యాలను చేసినా, బ్రిటీష్ అధికారులు చూచీచూడనట్టు ఊరుకుంటారు. తప్పనిసరి వచ్చి శిక్ష వెయ్యవలసి వచ్చిన పక్షంలో, చాలా తేలికగా వదిలివేస్తారు. ఒకే నేరానికి ఆరబ్బుకు మరణశిక్ష, యూదీయునికి కొద్దిపాటి జైలు శిక్ష పడిన ఉదాహరణలకు లెక్కలేదు.

షేక్ ఫరహాన్ సాదీ అనే ఆరబ్బు ముదుసలికి - వయస్సు 80 సంవత్సరాలు - అతడి ఇంటిని సోదా చూడగా, గోడలో ఒక రివాల్వర్ కనబడిందనే నేరం కింద మరణశిక్ష వేశారు. 1938 జనవరి 12వ తేదీని యూదీయుడైన ఒక పహరా జవాను దగ్గర ఒక రివాల్వర్, నాలుగు కణికల డైనమైట్ దొరికింది. ఇందుకు అతడికి వేసిన శిక్ష - అయిదేళ్ళ ఖైదు!

ఆల్ట్ మన్ అనే యూదు పోలీసువాడు 1938 ఫిబ్రవరి 4వ తేదీని ఆరబ్ లారీ మీద తుపాకిని కాల్చినందుకు మిలిటరీ కోర్టు అతడికి ఉరిశిక్ష వేసింది. ఫిబ్రవరి 7వ తేదీని ఈ ఉరిశిక్షను ఆజన్మ కారాగార వాసానికి తగ్గించారు. ఇదే సమయంలో పదిహేడు సంవత్సరాల ఆరబ్బు బాలుడికి అతడి దగ్గిర మిల్సు బాంబు పట్టుబడిందని పది సంవత్సరాల కఠిన ఖైదు వేశారు. పాలస్తీనాలో బ్రిటీష్ కోర్టులు దయచేస్తున్న న్యాయం ఇదే! ఇంతకు మించిన ఒక ఘోరం ఏమంటే, యూదు పోలీసులకు తుపాకుల్ని ఇస్తున్నారు; అరబ్బు పోలీసులకు లాఠీలను మాత్రమే సప్లయ్ చేస్తున్నారు.

15

బ్రిటిష్ అధికారులు, వారిని చాటుచేసుకుని యూదు జాతీయులు ఎంత దౌర్జన్యానికి దిగినా ఆరబ్బు జాతీయవాదులు చెదిరిపోవడం లేదు. తమ ప్రతికక్షులు ఎక్కువ దౌష్ట్యాలను చేసిన కొద్దీ, ఆరబ్బులు ఎక్కువ ధైర్యసాహసాలను ప్రదర్శిస్తున్నారు. ఈసారితో ఈ దేశం మనది కావడమో, కాకపోవడమో తేలిపోవాలి అనే పట్టుదల వారు చూపుతున్నారు.

“ఆధునిక యుద్ధానికి కావలసిన సాధనాలు బొత్తిగా లేని ఈ చిన్ని తిరుగుబాటును బ్రిటిష్ ప్రభుత్వంవారు అణిచి వెయ్యలేరని అనుకోవడం హాస్యాస్పదం” అని పీల్ కమిషన్ తన నివేదికలో వ్రాసింది. ఈ వాక్యాన్ని వ్రాసిన తర్వాత సంవత్సరం పైగా గడచినా ఇప్పటికీ ఆరబ్బుల స్వాతంత్ర్య సమరం సాగుతూనే ఉంది. ఆరబ్బులకు ఆధునికమైన ఆయుధాలు లేకపోవచ్చును. కాని, వారి చేతులలో జాతీయత అనే వజ్రాయుధమున్నది. వారు చేస్తున్నది చిన్న తిరుగుబాటే కావచ్చును. కాని, బ్రిటన్ చేసే ప్రతి దౌర్జన్యంతోనూ ఆ తిరుగుబాటుకు కొత్త బలం వస్తున్నది. ఆరబ్బు విప్లవకారులు చేసే సాహసకృత్యాలకు అంతులేదు; వారు ఎదుర్కొనే అపాయాలకు పారంలేదు.

తమకు కావలసిన డబ్బును వారు బ్రిటిష్ బ్యాంకుల నుంచి దోచుకుంటున్నారు; కావలసిన తుపాకుల్ని బ్రిటిష్ పోలీసు స్టేషన్ల నుంచి పట్టుకుపోతున్నారు. ఎక్కడి నుంచి ఎప్పుడు ఇచ్చి పడతారో తెలియదు. తిరిగి అంతలోనే ఎటు మాయమైపోతారో చెప్పలేము. కొన్ని చోట్ల పన్నుల్ని వసూలుచేసి, రసీదుల్ని ఇస్తున్నారు. మరికొన్ని చోట్ల కోర్టుల్ని పెట్టి, తీర్పుల్ని చెబుతున్నారు.

ఈ సందర్భాలలో వారు దౌర్జన్యాల్ని చేస్తున్నమాట నిజం. అయితే, వారి దౌర్జన్యాలు బ్రిటన్ దౌర్జన్యాలకు కేవలం బదులు. వారు న్యాయాన్ని కోరారు. న్యాయం లభించలేదు. అశాంతిని కనబరచారు. దమననీతి ప్రారంభమైంది. అందుచేత బహిరంగ విప్లవానికి తలపడ్డారు. విప్లవంలో దౌర్జన్యాలు తప్పవుగదా!

బ్రిటన్ పైన విప్లవాన్ని చెయ్యడంలో ఫేసిస్టు ప్రభుత్వాలు ఆరబ్బులకు కొంతవరకు తోడ్పడుతున్నవి. ఇలా తోడ్పడ్డంలో వాటి ఉద్దేశం ఆరబ్బుల స్వాతంత్ర్యానికి తోడ్పడ్డం కాదు; బ్రిటన్ చిక్కులలో పెట్టడమే. బ్రిటన్ స్థానంలో పాలస్తీనాను పరిపాలించడానికి వీలు చిక్కితే, ఇటలీగాని, జర్మనీగాని ఆ అవకాశాన్ని పోనియ్యవు. అవి బ్రిటన్ కంటే కూడా ఎక్కువ నిరంకుశంగా పరిపాలన సాగిస్తాయి కూడా. అయితే, ఇది బ్రిటన్ శాశ్వతంగా పాలస్తీనాను దాస్యంలో ఉంచడానికి “ఆర్గుమెంట్” కాదు; కాగూడదు. ఈ ఆర్గుమెంట్ బ్రిటిష్ ఇంపీరియలిజం ఎంత దుష్టమైనదో, ఫేసిజం కూడా అంత ఘోరమైనదని చెప్పడానికే!

ప్రస్తుతం జరుగుతున్న విప్లవ ప్రారంభంలో ముసోలినీ ఆరబ్బులకు పూర్తిగా సహాయం చేశాడు. ధనాన్ని ఇచ్చాడు. ఆయుధాల్ని పంపించాడు. విప్లవ ప్రచారాన్ని చేసి పెట్టాడు. బ్రిటనన్ను దుయ్యబట్టడానికీ, పాలస్తీనా ఆరబ్బులనే కాకుండా మహమ్మదీయ ప్రపంచాన్ని అంతటినీ కూడా తిరుగుబాటుకు పురికొల్పడానికి బారీ దీవులలో ప్రత్యేకంగా ఒక రేడియో స్టేషన్ కట్టించి, ప్రాచ్య భాషలలో బ్రాడ్ కాస్ట్ చేయించాడు. ఇస్లాం సంరక్షకుడు” అని తనకు తానే ఒక బిరుదును తగిలించుకున్నాడు.

ప్రారంభంలో ఇంతచేసిన ముసోలినీ ఆంగ్లో - ఇటాలియన్ ఒడంబడిక తర్వాత, సర్దుకున్నాడు. అప్పటి నుంచి హిట్లర్ అందుకున్నాడు. అతడు ఆరబ్బులకు ఎంతగా సహాయం చేస్తున్నదీ ఈ కింది కథ వల్ల తెలుస్తుంది :

ఆరబ్బు విప్లవకారులు రోడ్ల మధ్య తుపాకి మందు గనిని పెడుతున్నారు. రోడ్డు పైకి మామూలుగానే ఉన్నది గదా అని ఏ మిలటరీ లారీయో దాని మీదగా వెడితే, ఆ గని పేలుతుంది; లారీలోనివారు దెబ్బతింటారు. ఇలాంటి అపాయాలు ఎక్కువ

కావడాన్ని చూచి, బ్రిటిష్ అధికారులు ఒక ఎత్తువేశారు. అది ఏమంటే, ఒక లారీలో తమ బందీలో ఉన్న ఆరబ్బు విప్లవకారుల్ని కూర్చో పెట్టడం; దాన్ని రోడ్డు మీద ముందు పంపించి, తమ లారీలను వెనక ఉంచడం. ఇందువల్ల రోడ్డు మధ్య గని ఉండి పేలితే, అది విద్రోహులు ఉన్నట్టి మొట్టమొదటి లారీ కిందనే పేలాలి. అప్పుడు తమ వారిని తమ చేతులతోనే చంపుకున్నట్టు అవుతుంది గదా అని విప్లవకారులు గనుల్ని పెట్టడం మానివేస్తారు. కొన్ని రోజులపాటు ఈ యెత్తు బాగానే పారింది. ఆ తర్వాత మొదటి లారీ కిందనే కాకుండా ఏలారీ కింద కావాలంటే, దాని కిందనే పేలేగనుల్ని ఆరబ్బులు పెట్ట నారంభించారు. గనుల్ని పెట్టడంలో వారు చూపిన ఈ కొత్త ప్రజ్ఞకు జర్మన్ ఇంజనీయర్లు కారణం అని అంటున్నారు. ఇది నిజమే కావచ్చును.

ఇటలీ, జర్మనీలు తమకు సహాయాన్ని చేసినవిగదా అని ఆరబ్బులు ఫేసిజం వైపుకు మొగ్గితే మాత్రం వికాసం కోసం - విజృంభణ కోసం - పెనుగులాడుతున్న వారి జాతీయత పుట్టుకలోనే సంధి కొట్టిపోతుంది. ఉన్నతాశయాలతో బయల్దేరి, చివరికి బ్రిటిష్ ఇంపీరియలిస్టుల తాబేదారులై పోయిన జియోనిస్టుల వలె వారు కూడా గర్వనీయులౌతారు.

16

మొదట కొంతకాలం దమన నీతిని ప్రయోగించి, దాని వల్ల విప్లవం తగ్గనందున, ఇంకొక దారిని తొక్కుదామనే తలంపుతో బ్రిటన్ 1936 జూలైలో పాలస్తీనా సమస్యా పరిష్కారానికి తగిన సూచనలన్ని చెయ్యడానికి అంటూ, పీల్ ప్రభువు అధ్యక్షత క్రింద, ఒక రాయల్ కమీషన్ ను నియమించింది. పరిస్థితులు శ్రుతిమించినప్పుడు బ్రిటన్ ఇలాంటి తతంగాన్ని చెయ్యడం పరిపాటి. కమిషన్ అనిగాని, కమిటీ అనిగాని, కాన్ఫరెన్స్ అనిగాని ఒకదాన్ని సృష్టిస్తే, అది చివరికి చెయ్యగల పని శూన్యమైనప్పటికీ, ఈ లోపుగా ప్రజాందోళనను కొంత వరకు అరికట్టి ఉంచవచ్చును. అయితే, ఈ యెత్తు ఆరబ్బులకు తెలియనిది కాదు. ఇంతకు పూర్వం ఆరు సార్లు ఈ కమిషన్ల తతంగం జరిగింది. అంచేత వారు పీల్ కమిషనను పూర్తిగా బహిష్కరించారు.

అయినప్పటికీ పీల్ కమిషన్ వారు పాలస్తీనా వెళ్ళి, కొన్ని నెలలపాటు అక్కడ పర్యటనం చేసి, తిరిగి ఇంటికి చేరుకుని, 1937 జూలైలో తమ నివేదికను ప్రకటించారు. ఈ నివేదికలో వారు సమస్యా పరిష్కారానికి సూచించిన మార్గం, - పాలస్తీనాను మూడు ముక్కలుగా పంచి, ఒక ముక్కను ఆరబ్బులకూ, ఒక ముక్కను యూదులకూ ఇవ్వడం, మూడో దాన్ని బ్రిటన్ ఉంచుకోవడం.

అసలు పాలస్తీనాను మూడు భాగాల కింద విభజించాలనడం అన్యాయమైతే, ఇక ఆ మూడు భాగాల పరిమితి విషయమై పీల్ కమిషన్ వారు చేసిన సూచనలు కేవలం ఘోరమైనవని చెప్పాలి.

అన్ని పుణ్యక్షేత్రాలు, జాఫా మీద పూర్తి అధికారం, సైనిక దృష్టిలో ప్రధానమైన అన్ని ప్రదేశాలు, - ఇది బ్రిటన్ వాటా.

అన్నింటి కంటె సారవంతమైన పీఠభూమి, అన్ని రహదార్లు, అన్ని వాణిజ్య సౌకర్యాలు - ఇది యూదులవాట.
మిగతా ఎడారి అంతా దానధర్మ విక్రయాది సర్వ హక్కులతో, - ఆరబ్బులవాటా.

పాలస్తీనాలో ఉన్న పుణ్యక్షేత్రాలు ఒక్క పాలస్తీనా వాసులకే కాక ప్రపంచం అంతటికీ సంబంధించినవి. అంచేత అవి బ్రిటన్ పరిపాలనలో ఉండడం ధర్మం. బ్రిటిష్ సామ్రాజ్య రక్షణకు జాఫా అవసరం. అంచేత దాని మీద బ్రిటన్‌కు హక్కు ఉండవలసిందే!
మరి ఎక్కడా కూడా మాకు కాలూనడానికి వీలు లేకుండా పోతూ ఉండడం వల్ల, భూమి అంటే మాకు ప్రేమ ఏర్పడింది. ఇక ముందు వ్యవసాయమే వృత్తిగా మేము పెట్టుకోదలచుకున్నాము" అని యూదులు అంటున్నారు. అంచేత వారికి

ఎంత మేరకు వీలైతే అంతవరకు సారవంతమైన భూమిని కట్టబెట్టవలసిందే! • పండిన పంట ఎగుమతికి, బయట నుంచి రావలసిన సరకుల దిగుమతికి రోడ్లు, రహదార్లు అవసరంగదా?

ఇక, ఆరబ్బులు ఎడారిలోనే పుట్టి, ఎడారిలోనే పెరిగినవారు. అంచేత వారికి ఎడారి ఇవ్వడం న్యాయం. హాయిగా వారు ఎడారి ఇసుకను భోజనం చెయ్యవచ్చును; సినాయినది నీళ్ళను తాగవచ్చును. బ్రిటన్ వాటాల్ని వెయ్యడంలో అన్యాయం చేసిందని ఆరబ్బులు అంటారా? అంత అన్యాయం జరిగిందని అంటూ ఉంటే బ్రిటన్ 20 లక్షల పౌనుల్ని పారవేస్తుంది. పుచ్చుకోనివ్వండి!

పీల్ కమిషన్ వారి సిఫార్సులు ఇవే! ఆరబ్బులు తాము వీటిని ఏ పరిస్థితిలోనూ అంగీకరించ మన్నారు. వారు అంగీకరించకపోయినా, బ్రిటిష్ ప్రభుత్వం మాత్రం అంగీకరించి, విడగొట్ట వలసిన మూడు భాగాలకు సరిహద్దుల్ని నిర్ణయించి రమ్మని 1938 జనవరిలో ఉడ్ హెడ్ కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్ సభ్యులు అక్టోబర్ నెల వరకు ఆలోచించి, వారిలో వారికి ఏకాభిప్రాయం కుదరక, మూడు రకాల విభాగాల్ని సూచించారు.

ఈ లోపుగా బ్రిటన్ కు "పాలస్తీనాను విభజించడం ఆచరణ సాధ్యంకాని కార్యం" అని పూర్తిగా అవగతమైంది.

17

ప్రస్తుతం పాలస్తీనాలో బ్రిటిష్ ఇంపీరియలిజంకూ, ఆరబ్బు జాతీయతకూ జరుగుతున్న సంఘర్షణ కారణంగా 1938 అంతానికి దాదాపు మూడు వేలమంది ఆరబ్బులు హతులైనారు; గాయపడిన వారి సంఖ్య కూడ ఇంతో, ఇంతకుమించో ఉంటుందిగాని, తక్కువ మాత్రం కాదు. ఇక అరెస్టులకు అంతులేదు. ఆరబ్ జాతీయ నాయకులలో ప్రముఖులందరు చెరసాలలలోనో, ప్రవాసంలోనో ఉన్నారు. ఎన్నో గ్రామాలు నేలమట్టమైపోయినాయి. స్థిరచరాస్తులకు కలిగిననష్టం ఇంతింతకాదు. సోదాలు, జప్తులు, దోపుడులు నిత్యకృత్యాలు.

బ్రిటన్ అవలంబించిన దమన నీతి వల్ల కలిగిన ఈ భయంకర ఫలితాన్ని చూచి, సభ్యతా ప్రపంచం అసహ్యించుతుంది. ఇక, మహమ్మదీయ సంఘంలో - ముఖ్యంగా వివిధ దేశాలలో ఉన్న ఆరబ్బులలో - కలిగిన కలవరం ఇంతింత కాదు. యూదీయుల పక్షాన్ని చేరి బ్రిటన్ తమ మతస్థుల్ని క్రూరంగా హింసిస్తున్నదని మహమ్మదీయులందరు ఆవేశాన్ని పొందారు.

ఆరబ్బు రాజ్యాల మధ్య వాటి గుండెలో పొడవడానికి బ్రిటిష్ ఇంపీరియలిస్టులు యూదురాజ్యాన్ని స్థాపించడానికి యత్నిస్తున్నారని ఆరబ్బులందరు సంక్షోభపడ్డారు. అరేబియా పీఠభూమిలోనే కాకుండా, ఈజిప్టులోను, ఉత్తర ఆఫ్రికాలోను, హిందూ మహాసముద్ర తీరాలలోను అరబిక్ భాషను మాటాడేవారు దాదాపు నాలుగు కోట్ల మంది ఉన్నారు. వారున్నట్టి దేశాలు ఇవి : ఈజిప్టు, సిరియా, లెబనాన్, ఇరాక్, యెమెన్, పాలస్తీనా, ట్రా జోర్డాన్, సౌదీ అరేబియా, ఓమన్, లిబియా, టునీషియా, అల్జీరియా, ఫ్రెంచి మొరాకో, స్పానిష్ మొరాకో, ఇంకా మరికొన్ని చిన్నచిన్న రాష్ట్రాలు. వీటిలో ఈజిప్టు, ఇరాక్, సౌదీ అరేబియా, యెమెన్ (హెడ్ జాజ్ కు దక్షిణంగా ఉంది) స్వతంత్ర రాజ్యాలు. సిరియా, లెబనాన్ రాజ్యాలు ఇంకా ఫ్రెంచివారి మేండేటరీ అధికారంలో నుంచి పూర్తిగా తప్పించుకొనకపోయినా - ప్రజా స్వామికాలు. పాలస్తీనా, ట్రాన్స్ జోర్డాన్ రాజ్యాలు బ్రిటన్ మేండేట్ కింద ఉన్నాయి. లిబియా, ఇటలీ పరిపాలన కింద ఉంది. టునీషియా, అల్జీరియా రాజ్యాలు ఫ్రాన్సుకు లోబడి ఉన్నాయి. ఇలా వివిధ రూపాల ప్రభుత్వం కింద వివిధ ప్రభుత్వాల పరిపాలన కింద - ఉన్న ఆరబ్ జాతీవారి నందరిని ఐక్యపరచి, ఒక ఆరబ్ మహారాజ్యాన్ని స్థాపించాలనే ఒక ఉద్యమం తలయెత్తింది. ఈ ఉద్యమానికి సిరియా జన్మస్థానం. అక్కడి నుంచి ఇది తక్కిన ఆరబ్ రాజ్యాలకు పాకింది.

ఈజిప్టు ప్రజలు ఆరబిక్ భాషనే మాటాడతారు. అయితే వారికీ, తక్కిన ఆరబ్బులకూ రక్త సంబంధం - జాతి సంబంధం - తక్కువ. అయినప్పటికీ సిరియా తర్వాత ఈజిప్టు. ఇటీవల ఆరబ్ జాతీయ సంఘటనోద్యమానికి ప్రధాన కేంద్రమైంది. వారం, పది రోజుల ఈ మధ్య - 1938 జనవరి మధ్య భాగంలో - జరిగిన విషయాల్ని బట్టి చూస్తే, ఈజిప్టు రాజు ఫరూక్ ఈ మహోద్యమానికి నాయకుడయ్యేలా ఉన్నాడు. -

ఆరబ్ జాతి ప్రజలనందరినీ ఐక్యపరిచి, ఒక ఆరబ్ మహారాజ్యాన్ని సృష్టించాలని ఈ విధంగా ఒక ఉద్యమం తలయెత్తుతూ ఉన్న సమయంలోనే బ్రిటీష్ వారు పాలస్తీనాలోని ప్రధాన భాగాన్ని విడదీసి, అక్కడ ఒక యూదు రాజ్యాన్ని నిర్మించాలనే ప్రయత్నం (పీల్ కమీషన్ ద్వారా) చేశారు. ఈ ప్రయత్నాన్ని ఒక్క పాలస్తీనా ఆరబ్బులే కాకుండా, ఆరబ్బు జాతి వారందరూ తీవ్రంగా ప్రతిఘటించారు. దీన్ని చూడగా ఇస్లాం ప్రపంచం అంతా కూడా తమకు ప్రతికూలం అయిపోతుందేమోనని బ్రిటీష్ వారికి భయం తోచింది. ఆరబ్బులకు ఇటలీ, జర్మనీ రాజ్యాల తోడ్పాటు కూడా ఉన్నదనే బెదురు పుట్టింది. అంచేత వారు పాలస్తీనా విభజన ప్రయత్నాన్ని విరమించారు.

విరమించి, పాలస్తీనా సమస్యా పరిష్కారానికి లండన్లో ఒక రౌండ్ టేబుల్ సభను జరప నిశ్చయించారు. దీనికి వివిధ రాజ్యాల ఆరబ్బు ప్రతినిధుల్ని ఆహ్వానించారు.

ఈ విధంగా వివిధ రాజ్యాల ఆరబ్బు ప్రతినిధుల సహకారాన్ని కోరడం ప్రశంసా పాత్రంగానే ఉందిగాని, పాలస్తీనా జాతీయోద్యమానికి ప్రధాన నాయకుడైన గ్రాండ్ మస్తీని(ఈయన ప్రస్తుతం సిరాయాలో ప్రవాసిగా ఉన్నాడు.) ఆహ్వానించక పోవడంలో పెద్ద పొరపాటు చేశారు. ఇంతేకాదు. రాజకీయ ఖైదీల నందరిని విడుదల చెయ్యకపోవడం లోనూ, దమననీతిని విరమించక పోవడంలోనూ, గ్రాండ్ మస్తీ నాయకత్వం కిందవున్న ఆరబ్ హైయర్ కమిటీకి విరుద్ధంగా పాలస్తీనా డిఫెన్స్ పార్టీని లేవదీయించడంలోనూ ఇంకా అనేక పొరపాట్లను చేశారు.

పాలస్తీనా సమస్యను నిజంగా పరిష్కరించాలంటే, బ్రిటీష్ వారు ఈ పొరపాట్లను చెయ్యవలసింది కాదు. పాలస్తీనా ఆరబ్బులు తమ కోర్కెల్ని ఇదివరకే స్పష్టపరిచారు. అవి ఇవి : పాలస్తీనాను యూదు జాతీయ కేంద్రంగా చెయ్యాలనే ప్రయత్నాన్ని విరమించుకొని, బాల్ఫర్ ప్రకటనను రద్దుపరచాలి.

ఇకముందు యూదులను పాలస్తీనాకు వలసకు రానివ్వరాదు.
బ్రిటీష్ వేండేట్ ను రద్దుపరచి, ఇరాక్ తో చేసుకున్నట్టుగా ఒక సంధి చేసుకొని, పాలస్తీనాను స్వతంత్రమైన ఆరబ్బు రాజ్యంగా చెయ్యాలి.

ఈ కోర్కెల్ని బ్రిటన్ ఆమోదించకపోతే, లండన్లో మరికొద్ది రోజులలోనే సమావేశం కానున్న పాలస్తీనా రౌండ్ టేబుల్ సభ విఫలం కాక తప్పదు. ఈజిప్టు, ఇరాక్ రాజ్యాల ప్రధాన మంత్రులు ఈ సభ జయప్రదం కాగలదనే విశ్వాసాన్ని ప్రకటిస్తున్నారు. ఈ లండన్ రౌండ్ టేబుల్ సభల అనుభవం పూర్తిగావున్న భారతీయులు ఈ ప్రకటనలోని ఆశలో భాగస్వాములు కాలేరు.

ఈ సందర్భంలో యూదు జాతివారు ఒక విషయాన్ని గమనించడం వారికే శ్రేయస్కరం. వారిని ఫేసిస్టు డిక్టేటర్లు పెడుతున్న ఘోరహింసలు ప్రపంచ హృదయాన్ని ద్రవీభూతం చేస్తున్నాయి. ఎక్కడనూ నిలవ నీడలేక అల్లాడుతూ ఉన్నవారి స్థితి నిజంగా దీనాతి దీనమైనదే! అయితే, ఆ కారణం చేత, వారు పాలస్తీనా ఆరబ్బులకు అన్యాయం చెయ్యడంగాని, పాలస్తీనాను యూదు రాజ్యంగా మార్చడం గాని సహించరాని పని. పూర్వ కాలంలో పాలస్తీనా యూదు జాతీయ కేంద్రం అయిన మాట నిజం. కాని, దాదాపు రెండువేల సంవత్సరాల నుంచి ఆరబ్బులు అక్కడ స్థిరనివాసం ఏర్పరచుకొని ఉన్నారు. తమకు యూరపియన్ జాతులవారు అన్యాయం చేస్తున్నారు గదా అని, యూదు జాతివారు

ఆరబ్బులను దేశభ్రష్టుల్ని చెయ్యడం న్యాయమా? హీబ్రూ యూనివర్సిటీ ప్రధానాధికారి అయిన జూడా మాగ్నెస్ "ఆరబ్బుల సమ్మతి లేకపోతే పాలస్తీనాలో ప్రస్తుతమున్న నాలుగు లక్షల యూదీయులకు - తాత్కాలికంగా బ్రిటీష్ సైన్యాల రక్షణవున్నా - ప్రాణాపాయం తప్పదు" అని హెచ్చరించాడు. ఈ సంగతిని తక్కిన యూదీయ ప్రముఖులు కూడా ఎంత త్వరగా గ్రహిస్తే, వారికి అంత లాభం.

18

దీని పై సెక్షన్‌కూ, దీనికీ మధ్య వ్యవధి షుమారు నెల రోజులు. ఈ నెల వ్యవధి కారణంగా ఇంతకు పూర్వం రాసిన దానిలో ఒక్క అక్షరమైనా మార్చవలసిన అగత్యం కనబడలేదు.

పాలస్తీనా అరబ్బుల జాతీయ విప్లవం యథా ప్రకారంగా సాగుతూనే ఉంది. బ్రిటీష్ వారి దమన నీతిలో లేశమైనా మార్పు కలగలేదు. లండన్ సమావేశం వల్ల పాలస్తీనా సమస్య పరిష్కారం కాగలదని ఆశించడానికి అవకాశం స్వల్పమని రాసిన మాట కూడా నిజమైంది.

ఇది మొదట ఈ సమావేశంలో ఆరబ్బులు యూదుజాతివారి సరసను కూర్చోమన్నారు. ఇందువల్ల చిత్రమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. అందరు ప్రతినిధుల్ని ఒకచోట చేర్చడం, రౌండ్ టేబుల్ సమావేశం జరపడం, దీనికి ఛెంబర్లేన్ (బ్రిటీష్ ప్రధాని) ప్రారంభోత్సవాన్ని చెయ్యడం నిర్ణీతమైన కార్యక్రమం. చివరికి అసలు రౌండ్ టేబుల్ సమావేశ ప్రయత్నమే మానుకుని, సమావేశపరిచి, రెండు చోట్లనూ బ్రిటీష్ ప్రధాని ప్రారంభోత్సవ తతంగాన్ని జరపవలసి వచ్చింది.

ఎంత ఒడుదుడుకుగా ఈ లండన్ సమావేశం ప్రారంభమైందో, అంత ఒడుదుడుకుగానే ఉంది దాని నడక కూడా. ఇటు ఆరబ్బులకూ, అటు యూదులకూ, వారుభయుల మధ్యవున్న బ్రిటీష్ వారికీ ఎక్కడా లంగరు అందడం లేదు.

పాలస్తీనా ఆరబ్బుల స్వాతంత్ర్యోద్యమాన్ని అరికట్టడం అసాధ్యమని గ్రహించడం వల్లనేమి, పాలస్తీనా ఆరబ్బులతో రాజీపడకపోతే, చుట్టుప్రక్కల వున్న ఆరబ్బు రాజ్యాలతోనే కాకుండా పూర్తి మహమ్మదీయ ప్రపంచంతోనే విరోధం తెచ్చి పెట్టుకొనక తప్పదనే భయం వల్లనేమి, ప్రస్తుతపు అంతర్జాతీయ విషమ పరిస్థితుల వల్లనేమి, బ్రిటీష్ వారు ఎలాగైనా సరే రాజీపడాలని చూస్తున్నారు. అయితే, పాలస్తీనాను చెయ్యి జారిపోనివ్వడం వారికి సుతరామూ ఇష్టం లేదు. అంచేత, పైకి స్వాతంత్ర్యాన్ని ఇచ్చినట్టు కనబడుతూ, నిజమైన రాజ్యాధికారాన్ని తమ గుప్పిటిలో పెట్టుకోవాలని వారు ఎత్తులు వేస్తున్నారు.

మన దేశం విషయంలో సైమన్ కమీషన్, లండన్ రౌండ్ టేబుల్ సమావేశాలు, జాయింటు పార్లమెంటరీ కమిటీ - ఈ తతంగాన్ని అంతా జరిపి చివరికి స్వల్పమైన విషయాలలో ఏదో కొంత స్వాతంత్ర్యాన్ని ఇస్తూ, ముఖ్యమైన విషయాలలో పూర్వం కంటే కూడా అధికంగా పర పరిపాలనను విధించే ఇండియా యాక్టును తయారు చేసినట్టే పాలస్తీనా విషయంలో కూడా నాటకాన్ని ఆడాలని బ్రిటీష్ వారు ప్రయత్నిస్తున్నారు.

భారతీయులకు స్వపరిపాలనాధికారాన్ని ఇవ్వడమే మా అంతిమ (Ultimate) ఆదర్శం", అని బ్రిటీష్ వారు ఇంతకుముందు ప్రకటించారు. అదేవిధంగా ఇప్పుడు వారు "పాలస్తీనాను చివరికి (Ultimately) స్వతంత్ర రాజ్యంగా చెయ్యాలని మా ఆశయం" అని అంటున్నారు."చివరికి" అంటే ఎప్పటికి? ఈ శతాబ్దం చివరికా? లేక, పై శతాబ్దం చివరికా?

ఉన్నతమైన ఈ ఆశయాన్ని, దృష్టిలో పెట్టుకుని, ప్రస్తుతానికి ఈ క్రింది ఏర్పాట్లను చేస్తారట. పాలస్తీనాను యూదు జాతీయ కేంద్రాన్ని చేయడమనే ప్రయత్నాన్ని విరమించడం. అందరు పౌరులకు సమాన హక్కుల్ని ఇవ్వడం. యూదు మైనారిటీ సంఘ సంక్షేమానికి తగిన రక్షణాల్ని ఏర్పాటు చెయ్యడం. దేశ రక్షణ విషయమై సంధిని చేసుకోవడం. ఆరబ్బు, యూదు, బ్రిటీష్ సభ్యులతో శాసన సభను ఏర్పాటు చెయ్యడం.

ఆరబ్బులనూ, యూదులనూ, వీలునుబట్టి ఆలోచించడానికి మళ్ళీ కొంతకాలానికి ఇంకొక సమావేశాన్ని లండన్లోనే జరుపుతామని బ్రిటీష్ వారు అన్నారు. ఇంకొక దేశ పరిపాలనలో భాగస్వాముల్ని చెయ్యడం.

ఈ ఏర్పాట్లకు ముందు ఒప్పుదలయైతే, వీటికి సంబంధించిన వివరాల్ని గురించి నిర్ణయాన్ని చెయ్యడానికి తిరిగి ఇంకొక సమావేశాన్ని జరుపుతామని అన్నారు.

19

ఇందుకు సమావేశాన్ని పైసారికి వాయిదా వెయ్యడం అనవసరమనీ, ఆ వివరాల సంగతి కూడా ఇప్పుడే బయలు పెట్టవలసిందనీ ఆరబ్బులు పట్టుపట్టగా, వాటిని కూడా తెలియచేశారు. అవి ఏవంటే...

దేశాన్ని రెండు మూడు ఖండాలుగా విభజించడం, ఒక్కొక్క ఖండానికి ఒక అసెంబ్లీని, ఒక కౌన్సిల్ నూ, (మన మద్రాసు రాజధానిలో రెండు శాసనసభలు ఉన్నట్టుగా) ఏర్పాటు చెయ్యడం,
రెండింటికీ కూడా ఆరబ్బు, యూదు, ప్రతినిధుల్ని మొత్తం జనాభాలో వారి వారి జాతుల దామాషా ప్రకారం ఎన్నుకోవడం.

మెజారిటీ ఓట్లను బట్టి అసెంబ్లీలో నిర్ణయాల్ని చెయ్యడం, ఇక, కౌన్సిల్ లో మెజారిటీ, మైనారిటీలతో నిమిత్తం లేకుండా ఆరబ్బులు, యూదులు విడివిడిగా ప్రతి తీర్మానం మీద విడివిడిగా ఓటు చెయ్యడం.

ఆర్థిక వ్యవహారాలు, వలస సమస్య, భూముల క్రయవిక్రయాలు మొదలైన ముఖ్య విషయాల్ని గురించి ముందుగా తీర్మానించగల అధికారం కౌన్సిల్ దే గాని, అసెంబ్లీది కాదు.

ఆరబ్బులకు, యూదులకు ఏకాభిప్రాయం కుదరక, ప్రతిష్టంభన ఏర్పడ్డప్పుడు వీటో చెయ్యగల అధికారం హైకమీషనరకు ఉండడం.

యూదులు, ఆరబ్బులు ప్రస్తుత వైషమ్యాలను చంపుకుని, ఒకరితో ఒకరు సహకారం చెయ్యడం ప్రారంభించగానే హైకమీషనర్ వీటో అధికారం రద్దు కావడం.

స్వపరిపాలనకూ, స్వాతంత్ర్యానికి అవకాశ మివ్వని ఈ ఏర్పాట్లకు ఆరబ్బు ప్రతినిధులు అంగీకరించడం లేదు. ఇందుక బదులుగా పాలస్తీనాకు యూదీయుల వలస పూర్తిగా ఆగిపోవాలనీ, ఇకముందు ఆరబ్బుల భూముల్ని యూదీయులు క్రయం చేయించుకోడానికి వీలుండరాదనీ వారు కోరుతున్నారు. ప్రజలందరు చేరి ఒక కాన్సిట్యుయెంట్ అసెంబ్లీని ఎన్నుకోవాలనీ, ఈ అసెంబ్లీ సభ్యులు తమలో కొందరిని మంత్రులుగా నియమించాలనీ, ఈ మంత్రులకు వెంటనే దేశ పరిపాలనాధికారాన్ని ఇచ్చి వెయ్యాలనీ, ఇప్పుడు వివిధ శాఖలకు అధికారులుగా ఉన్నవారు ఈ కొత్త మంత్రులకు వెంటనే దేశ పరిపాలనాధికారాన్ని ఇచ్చి వెయ్యాలనీ, ఇప్పుడు వివిధ శాఖలకు అధికారులుగా ఉన్నవారు ఈ కొత్త మంత్రులకు లోబడి ఉండాలనీ వారు (ఆరబ్బు ప్రతినిధులు) పట్టుపడుతున్నారు. ప్రజలు ఎన్నుకున్న కాన్సిట్యుయెంట్ అసెంబ్లీయే పాలస్తీనాకు భావి రాజ్యాంగ విధానాన్ని నిర్ణయించాలనీ, ఈ విధానాన్ని ఎట్టి మార్పులు లేకుండా బ్రిటీష్ పార్లమెంట్

ఆమోదించాలనీ కూడా వారి వాదం. ఈ షరతులకు అంగీకరించని పక్షంలో ఇంకొక సమావేశాన్ని జరపడం వృథా శ్రమ అని వారు ఖచ్చితంగా చెబుతున్నారు.

ఇక, యూదు ప్రతినిధులకు ఆరబ్బుల షరతులు ఎంత కంటకంగా ఉన్నవో బ్రిటన్ సూచనలు కూడా అంత అనంగీకారంగా ఉన్నాయి. వారు పై ఉభయులకూ భిన్నంగా వెళ్ళి, తమ షరతుల్ని తాము పెడుతున్నారు. బ్రిటన్ పాలస్తీనా పై తన మేండేటరీ అధికారాన్ని వదులుకోరాదనీ, ఆ దేశాన్ని రెండుగా చీలదీసి, ఒక రాజ్యాన్ని ఆరబ్బు రాజ్యంగానూ, ఇంకొక దాన్ని యూదు రాజ్యంగానూ చేసి, రెండింటినీ కూడా అక్కడి ప్రజల సహకారంతో పరిపాలిస్తూ, చివరికి ఒక నాటికి రెండు భాగాలలోనూ సమానమైన జనాభా ఉండేటట్టుగా చెయ్యవలసిందిగా వారు కోరుతున్నారు.
ఈ ధోరణిలో నడుస్తున్నది లండన్లో జరుగుతున్న పాలస్తీనా సమావేశం. రాజీ కుదరలేదనీ, మరి లాభం లేదనీ, సమావేశం చాలింపబడిందనీ, రేపోమాపో వార్త వస్తే మనం కించిత్తు అయినా ఆశ్చర్యపడ నవసరం లేదు.
పాలస్తీనా సమస్య ఎన్నటికైనా పరిష్కారమైతే, పాలస్తీనాలోనే కావాలి గాని లండన్ లో కాదు.